# ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1336 వరకు)

## ఎం.ఏ. చరిత్ర, మొదటి సంవత్సరం, రెండవ పేపరు


రచయితలు

**ఆచార్య వై. కుమారస్వామి (రిటైర్డ్)**
యం.ఏ. చరిత్ర పురావస్తుశాఖ
ఆర్థిక శాస్త్రం, ఫిలాసఫీ, సామాజిక శాస్త్రం, పిహెచ్.డి.,
డీన్ ఆఫ్ హ్యూమానిటీస్, చరిత్ర పురావస్తు శాఖ
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ ఓ. సాంబయ్య,** యం.ఏ., పిహెచ్.డి.
చరిత్ర శాఖ (రిటైర్డ్)
జె.కె.సి. కళాశాల, గుంటూరు

**డా॥ వి.కె. మోహన్**
యం.ఏ. యం.ఫిల్, పిహెచ్.డి.
ప్రిన్సిపాల్ మరియు చరిత్ర శాఖాధిపతి
యస్.వి.ఆర్.యమ్. కళాశాల
నగరం.

**డా॥ వి.వి. సుబ్బారెడ్డి,** యం.ఏ. పిహెచ్.డి.
రీడర్ చరిత్రశాఖ
యస్.జి. హెచ్.ఆర్ అండ్ యమ్. సి.యమ్. కళాశాల
గుంటూరు.

సంపాదకులు
**ఆచార్య వై. కుమారస్వామి (రిటైర్డ్)**
యం.ఏ. చరిత్ర పురావస్తుశాఖ ఆర్థిక శాస్త్రం,
ఫిలాసఫీ, సామాజిక శాస్త్రం, పిహెచ్.డి., డీన్ ఆఫ్ హ్యూమానిటీస్,
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయకర్త
**ఆచార్య డి. భాస్కరమూర్తి** ఎం.ఏ. పి.హెచ్.డి.
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్
**ఆచార్య వి. చంద్రశేఖర రావు** ఎం.కాం. పి.హెచ్.డి.



**దూర విద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510
Ph : 0863-2293299, 2293356, 08645 - 211023,
Cell : 9848285518, 08645 - 211024 (Study Material)
Website : www.anucde.com, e-mail : anucde@yahoo.com

**M.A. History of Andhras Upto 1336 A.D.**

First Edition : 2004

Second Edition : 2005

Third Edition : 2007

Fourth Edition : 2008

No. of Copies : 1000

**(C) Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of M.A., Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by :
**Prof. V. Chandrasekhara Rao,** *Director*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# M.A. (Previous) DEGREE EXAMINATION, DECEMBER 2005.

First Year, History

## Paper II - HISTORY OF ANDHRAS UPTO 1336 A.D.

Time : Three hours

Maximum : 100 marks

***Answer ALL questions.***

***All questions carry equal marks.***

1. (a) Evaluate the literary sources which help for the reconstruction of the history of Andhradesa upto A.D. 1336.

   క్రీ.శ. 1336 వరకు గల ఆంధ్రదేశ చరిత్ర పునర్నిర్మాణానికి ఉపకరించే సారస్వత ఆధారాలను అంచనావేయుము.

   Or

   (b) Examine the spread of Aryan culture into the Deccan.

   దక్కనులో ఆర్య సంస్కృతి వ్యాప్తిని పరిశీలించుము.

2. (a) Who were the Satavahanas? What was their original home?

   శాతవాహను లెవ్వరు? వారి స్వస్థలమేది?

   Or

   (b) Critically examine the relations of the Satavahanas with the Western Kshatrapas.

   పశ్చిమ క్షాత్రపులతో శాతవాహనులకు గల సంబంధాలను నిశితంగా పరిశీలింపుము.

3. (a) Explain the contribution of Ikshvakus to Buddhism.

   ఇక్ష్వాకుల బౌద్ధమతానికి చేసిన సేవను వివరించుము.

   Or

   (b) Trace out the history of the early Pallavas upto Simhavishnu.

   సింహవిష్ణువు వరకు గల తొలి పల్లవుల చరిత్రను పరిశీలించుము.

4. (a) Write an essay on the religion and society during the Vengi Chalukyan periond.

   వేంగి చాళుక్యుల కాలంలో మతం, సమాజములపై ఒక వ్యాసాన్ని వ్రాయుము.

   Or

   (b) Give an account of the political and cultural achevements of the Velanati chiefs.

   వెలనాటి ప్రభువులు సాధించిన రాజకీయ సాంస్కృతిక విజయాలను గురించి తెలుపుము.

5. (a) Estimate the greatness of Ganapathideva as a ruler.

   పాలకునిగా గణపతిదేవుని ఘనతను అంచనా వేయుము.

   Or

   (b) Describe the cultural contribition of the Kakatiyas.

   కాకతీయుల సాంస్కృతిక సేవను వివరించుము.

(DH 02)

# M.A. (Previous) DEGREE EXAMINATION, MAY 2006.

History

Paper II - **HISTORY OF ANDHRAS UPTO 1336 A.D. LINGUISTICS**

Time : Three hours

Maximum : 100 marks

Answer ALL questions

All questions carry equal marks.

1. (a) Disuss the literary sources for the study of Ancient and medieval Andhra history.
   ప్రాచీన, మధ్యయుగ ఆంధ్రుల చరిత్ర రచనకు గ్రంథ ఆధారాల గురించి చర్చించుము.

   Or

   (b) Write a note on the Aryanization of Deccan.
   దక్కన్ ప్రాంతీయుల్ని ఆర్యులుగా మార్చడం గురించి వ్రాయుము.

2. (a) Give an account of the social and religious conditions under the Satavahanas
   శాతవాహనుల కాలపు సాంఘిక, మత పరిస్థితుల గురించి వ్రాయుము.

   Or

   (b) Examine the contribution of the Satavahanas to art, architecture and literature.
   వాస్తు, శిల్పకళలకు, సాహిత్యానికి వాతవాహనులు చేసిన సేవల్ని పరిశీలించుము.

3. (a) Give and account of Gautamiputra Satakarni.
   గౌతమీపుత్ర శాతకర్ణి గురించి వ్రాయుము.

   Or

   (b) Write a note on the Early Pallavas.
   తొలి పల్లవుల గురించి వ్రాయుము.

4. (a) Discuss the relations between the Vengi Chalukyas and the Rashtrakutas.
   వేంగీ చాళుక్యులు, రాష్ట్ర కూటుల మధ్యగల సంబంధాల గురించి చర్చించుము.

   Or

   (b) Examine the cultural contribution of the Vengi Chalukyas.
   వేంగీ చాళుక్యుల సాంస్కృతిక సేవల గురించి పరిశీలించుము.

5. (a) Give an account of Rudramadevi.
   రుద్రమదేవి గురించి వ్రాయుము.

   Or

   (b) Discuss the cultural contribution of the Kakatiyas.
   కాకతీయుల సాంస్కృతిక సేవల గురించి చర్చించుము.

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మెదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య వి. బాలమోహన్‌దాస్**

కులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

M.A. History 1st Year

# Paper II - History of Andhras upto 1336 A.D.

## Syllabus

Unit 1 : Sources for the reconstruction of the Andhra History - Aryanization of Deccan.

Unit 2 : Andhra-Satavahana Identity - Original Home - Chronology - Relations with the Western Kshaatrapas - cultural conditions.

Unit 3 : Successors of the Satavahanas - Ikshvakus - Patronage to Buddhism - Salankayanas - The Vishnukundins and the Early Pallavas.

Unit 4 : Eastern Chalukyas of Vengi - Relations with the Rashtrakutas - Chola Alliance - Cultural Conditions - Rule of the Chalukya-Cholas -The Velanati Chiefs.

Unit 5 : Origin of the Kakatiyas - Early Rules - Rise of the Kakatiya Kingdom - Relations with the Sevunas and Pandyas - Cultural conditions.

**TEXT BOOKS**


1. Rama Rao. M. : Early History of Andhra Pradesh
2. Yazdani, G., : Early History of Deccan, Vols. I & II
3. Gopalachari, K. : Early History of Andhra Country.
4. D.C Sircar : Successors of the Satavahana in Lower Deccan.
5. Somasekhara Sarma M. : A forgotten Chapter of Andhra History
6. H.K.Sherwai : Medical History of the Deccan.
7. Hanumantha Rao, B.S.L. : Andhrula Charitra (Telugu)
8. -do- : Religion in Andhra
9. Bhandarkar, R.G., : Early History of Deccan.
10. P.V. Parabrahma Sastry : Kakatiyas of Warangal.
11. S. Sankaranarayana : The Vishnukundis and their Times.
12. P.S.R. Sarma : History of Andhradesa (Telugu)
13. A. Vaidehi : Social and Economic Conditions in Eastern Deccan

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఆంధ్రుల చరిత్రకు తోడ్పడే ఆధారాలు | 1.1 - 1.10 |
| 2. | దక్షిణాపదంలో ఆర్యీకరణ | 2.1 - 2.6 |
| 3. | శాతవాహన యుగం | 3.1 - 3.11 |
| 4. | శాతవాహనుల రాజకీయ చరిత్ర | 4.1 - 4.11 |
| 5. | శాతవాహనుల సాంస్కృతిక సేవ పాలనా విధానము | 5.1 - 5.10 |
| 6. | మలి శాతవాహన యుగం | 6.1 - 6.10 |
| 7. | శాలంకాయనులు | 7.1 - 7.6 |
| 8. | శాతవాహనానంతర యుగ ప్రాచీన తొలి పల్లవులు, విష్ణు కుండినులు | 8.1 - 8.22 |
| 9. | శాతవాహనానంతర యుగ సాంస్కృతిక విశేషాలు | 9.1 - 9.10 |
| 10. | రెండవ పులకేశి | 10.1 - 10.6 |
| 11. | వేంగీ చాళుక్యులు రాష్ట్రకూట రాజకీయ సంబంధాలు | 11.1 - 11.5 |
| 12. | వేంగీ చాళుక్యులు | 12.1 - 12.9 |
| 13. | వేంగీ చాళుక్యుల సాంఘిక సాంస్కృతిక విశేషాలు | 13.1 - 13.11 |
| 14. | చాళుక్య చోళయుగం వేంగీలో చాళుక్య - చోళ రాజ ప్రతినిధులు | 14.1 - 14.4 |
| | 14.1 వెలనాటి చోళరాజులు | 14.1..1 - 14.1.8 |
| 15. | చాళుక్య చోళ యుగ విశేషాలు | 15.1 - 15.6 |
| 16. | కాకతీయ యుగం (క్రీ.శ. 1000-1323) | 16.1 - 16.21 |
| 17. | కాకతీయ యుగ సాంస్కృతిక విశేషాలు | 17.1 - 17.18 |

పాఠం - 1

# ఆంధ్రుల చరిత్ర రచనకు తోడ్పడే ఆధారాలు

## SOURCES FOR THE RECONSTRUCTION OF THE ANDHRA HISTORY UP TO 1336 AD

**ముఖ్యాంశములు:-**

1.0 లక్ష్యం

1.1 ఉపోద్ఘాతము

1.2 పురావస్తు ఆధారాలు

1.2.A శాసనాలు

1.2.B నాణేలు

1.2.C పురావస్తు నిర్మాణ అవశేషాలు

1.3 సాహిత్య ఆధారాలు

1.3.A స్వదేశి ఆధారాలు

1.3.B కథలు గాథలు

1.3.C బ్రాహ్మణ మత ఆధారాలు

1.3.D బౌద్ధ ఆధారాలు

1.3.E జైన ఆధారాలు

1.3.F ఇతర రచనలు

1.4 విదేశీ ఆధారాలు

1.5 ప్రశ్నలు

1.6 చదువవలసిన గ్రంథాలు

## 1.0 లక్ష్యం:-

ఆంధ్రుల చరిత్ర క్రీ॥ శ॥ 1336 వరకు వ్రాయడానికి తోడ్పడే వివిధ మూలాధారాలను పేర్కొని విశదీకరించుటయే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## 1.1 ఉపోద్ఘాతము:-

చరిత్ర కల్పితమైన ఊహాగానం కాదు. అది వాస్తవాల పై ఆధారపడి వ్రాయబడేది. చారిత్రక వాస్తవాల్ని సంఘటనల్ని గుర్తించుటలో ఆధారాలు తోడ్పడతాయి. చరిత్ర రచనలో ఉపయోగపడే మూలాధారాల్ని వాటిలోని విషయ రూపాల్ని బట్టి ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

## 1.2 పురావస్తు ఆధారాలు: (ARCHAEOLOGICAL SOURCE)

ప్రాచీన కాలానికి చెందిన పురాతన వస్తువులు మానవునిచే నిర్మింపబడి ఉపయోగించబడి విడిచి పెట్టబడిన, వస్తు అవశేషములను పురావస్తు ఆధారములందురు. ప్రాక్ చరిత్ర (Pre - History) లో ఆది మానవులు తయారు చేసి వాడిన వస్తు సముదాయాలు నివసించిన స్థావరాలు ఇంకా ఇతర అవశేషాలన్ని ప్రాక్ చరిత్ర నిర్మాణానికి పనికొస్తాయి. ఆ కాలంలో మానవుడు వ్రాయడం చదవడం తెలియని వాడు. ఈ కాలపు సంస్కృతిని చరిత్రలో చేర్చుట సాధ్యం కాదు. చరిత్ర యుగంలో మానవుడు వ్రాయడం, చదవడం ఉపయోగించినప్పటి నుండి చరిత్ర ఆరంభమవుతుందని పండితులు భావించారు.

**1.2.A శాసనాలు:-** ఆంధ్ర దేశంలో లభ్యమైన శిలా, తామ్ర శాసనాలను కాలాన్ని బట్టి రాజ వంశాలను బట్టి వరుస క్రమంలో చెప్పవచ్చును. ఆంధ్ర దేశంలో లభ్యమైన శిలా శాసనాలు అశోకమౌర్యుని కాలానికి చెందినవే. ఆ మౌర్యుల కాలానికి చెందిన శాసనాలు అమరావతి లోనూ, భట్టిప్రోలు లోనూ ఉన్నాయి. ఇవి కాక కర్నూలు జిల్లా యందలి జొన్నగిరి, రాజుల మందగిరి, ఎఱ్ఱగుడి అనే చోట్ల కూడ ఉన్నాయి. ఈ శాసనాలు అశోకుని ప్రకటనలని చెప్పవచ్చు. ఇవి దమ్మలిపులు. ప్రజాహితమును కోరుతూ, పౌరులు అనుసరించవల్సిన వివిధ ధర్మాలను అశోకుడు ఈ శాసనాల ద్వారా తెలియజేసాడు. పొడవైన నిలువు గీతలు ఏ విధమైన అలంకారము తలకట్టు లేకుండా చెక్కబడ్డ ఈ లిపి తొలి బ్రాహ్మిలిపిగా పండితులు భావించారు. ఈ లిపిని పాలి, ప్రాకృత భాషలను వ్రాయడానికి అశోకుడు ఉపయోగించాడు. అమరావతిలో అశోకుని శాసనం లభ్యమైంది. భట్టిప్రోలులో లభ్యమైన ధాతు కరండ శాసనాలు బ్రాహ్మిలిపి లోనే వ్రాయబడ్డాయి. భట్టిప్రోలు స్థూపంలో లభ్యమైన బ్రాహ్మిలిపి కుడి నుండి ఎడమకు, ఎడమ నుండి కుడికి కూడ వ్రాయబడ్డ దాఖలాలున్నాయి. ఈ శాసనాల్లో ఉపయోగించిన పదాల వల్ల ప్రాచీనాంధ్ర బౌద్ధ ఆచార వ్యవహారాలు కట్టుబాట్లు పాలనా వ్యవస్థలు తెలుస్తాయి. భట్టిప్రోలు శాసనం వల్ల కుభేరకుడనే స్థానిక పాలకుడు ఉన్నట్లు అతడు మౌర్యుల ఆధీనంలో ఉండి పాలన సాగిస్తున్నట్లు తెలియుచున్నది. అశోకుని కళింగ శాసనం వల్ల ఆంధ్రులు, ముదిబలు, పత్నిక, పులింద మొదలైన స్థానికులు మౌర్యుల ఆధీనంలో 'ఇతరాజ విషయే' ఉన్నట్లు తెలియుచున్నది. అశోకుడు జీవ హింసను, సమాజాల నిర్వహణను నిలిపి వేసినట్లు తెలియుచున్నది. మౌర్యుల కాలంలోనే శృంగులు, కాణ్వుల వలే శాతవాహనులు ఉన్నట్లు వారు కూడా మౌర్యుల పాలనలో సామంతులుగా ఉన్నట్లు పశ్చిమ తీరంలో లభ్యమైన నాసిక్, నానఘాట్, పీదల్‌కురా, అన్విరి, సాంచీ శాసనాల వల్ల తెలుస్తుంది. అశోకుని బౌద్ధ మతము శాతవాహనులు అనుసరించిన వైదిక ధర్మము ఒకే కాలంలో వర్థిల్లుట వారి మత సహనమునకు తార్కాణం. శాతవాహనుల, పశ్చిమ క్షాత్రవుల (జునాగాడ్ శాసనం, రుద్రదామన్) మొదలైనవి ఆనాడు ఆంధ్రులు అనుసరించిన వివిధ ధార్మిక, కలాపాలను తెలియజేస్తాయి. శకులు, యవనులు (గ్రీకులు) పార్థియన్లు, పహలవులు మొ॥ విదేశీ జాతులతో ఆంధ్ర శాతవాహనులకు సంబంధ బాంధవ్యాలున్నట్లు వారి శాసనాల వల్ల తెలియును. పెక్కు శాతవాహనుల శాసనాల వల్ల ఆనాటి రాచరికము స్త్రీల జీవనము, సమాజంలో వారికున్న స్థానము, వారు నిర్వహించిన వివిధ ఉద్యోగములు, అనుసరించిన వ్రతములు, పూజలు, నోములు, ఆచార వ్యవహారములు, వస్త్రాలంకరణ, కుటుంబ జీవనము వ్యక్తమౌతాయి. శాతవాహనుల వల్ల తెలిసిన శాసనాలు పెక్కు విషయాలు ఆంధ్రుల చరిత్రను నిర్మించడములో ఆధారాలుగా తోడ్పడతాయి. శాతవాహనుల అనంతరం విజయపురిని రాజధానిగా చేసుకొని పాలించిన ఇక్ష్వాకులు నాగార్జుని కొండ, అల్లూరు, జగ్గయ్యపేట, చిన గంజాం, ఘంటసాల మొదలైన ప్రదేశాల్లో శిలా శాసనాలు వేశారు. వీరు ఉపయోగించిన బ్రాహ్మిలిపి కడు రమణీయమైనది. అందమైనది.

ఈనాటి బ్రాహ్మీలిపి ఇక్ష్వాకుల కళాభిరుచికి తార్కాణం. సుదీర్ఘమైన వత్తులు, గుండ్రని ఆకృతి కల్గిన లిపి ఎంతో ఆకర్షణీయంగా కన్పించును. ఈ కాలంలో బ్రాహ్మీలిపికి తలకట్టు కూడ ఏర్పడినది. తిరుగవేయబడిన త్రికోణాకృతిలో నున్న తలకట్టు ఈ లిపికి ఒక ప్రత్యేకత. ఆంధ్రుల కళాభిరుచికి ఈ లిపి ఒక నిదర్శనము. ఇక్ష్వాకుల తర్వాత ఆంధ్ర దేశాన్ని పాలించిన శాలంకాయనులు, బృహత్పాలయనులు, ఆనంద గోత్రులు, తొలి పల్లవులు పెక్కు శాసనాల్ని జారీ చేసారు. ఈ శాసనాలన్నీ బ్రాహ్మీలిపి లోనే చెక్కబడ్డాయి. చేజర్ల, మట్టెపాడు, గోరంట్లలో దొరికిన శాసనాల వల్ల ఆనంద గోత్రుల చరిత్ర తెలుస్తుంది. వీరి తరువాత వేంగిని రాజధానిగా చేసుకొన్న శాలంకాయనులు వేదవేగి, కంతేరు, ధారికాటూరు, కానుకొల్లు, పెనుగొండ, కొల్లేరు లలో లభ్యమైన తామ్ర శాసనాలు, గుండుపల్లిలో లభ్యమైన శిలా శాసనాలు, విజయ దేవర వర్మ వేయించిన తామ్ర శాసనాలు శాలంకాయనుల చరిత్రను తెలియజేస్తాయి.

బృహత్పాలాయన వంశానికి చెందిన జయవర్మ ఏకైన తామ్ర శాసనము కొండముదిలో దొరికింది. దీనిలో ఉపయోగించిన బ్రాహ్మీలిపి ప్రత్యేకముగా ఉన్నది. అయిననూ ఇది జయవర్మ చేసిన దానాల్ని తెలియచేస్తుంది. శాలంకాయనుల తర్వాత ఆంధ్ర దేశాన్ని పాలించిన విష్ణుకుండినులు జారీ చేసిన తుండి చిక్కుళ్ళ, రామతీర్థం, ఈవూరు, తుమ్మలగూడేం, పొలమూరు, ఖానాపూరు తామ్ర పట్టికలు, వేల్పూరులోని మాధవవర్మ శిలాశాసనము, హైదరాబాద్ లోని గోవిందరాజ ప్రాకృత శాసనము వీరి చరిత్రను తెలుసుకొనుటకు ఉపయోగపడతాయి. వీరి తర్వాత ఆంధ్రదేశాన్ని పాలించిన వారు తొలి పల్లవులు వీరు జారీ చేసిన శాసనాలు భాషను బట్టి మూడు రకాలుగా విభజించారు. వీరి తొలి శాసనాలు ప్రాకృతంలోను, తర్వాత శాసనాలు సంస్కృత భాషలోను జారీ చేయబడ్డాయి. సింహవర్మ - మంచి కోట్ల శిలా శాసనము, మైదవోలు తామ్ర శాసనం (శివస్కంద వర్మ) శివస్కంద వర్మ - హరిహడగళ్ళి తామ్ర శాసనం, రాణి చారుదేవి బ్రిటీష్ మ్యూజియం తామ్ర పట్టికలు, మొదటి ప్రాకృత శాసన విభాగంలోనికి వస్తాయి. విజయ స్కంధ వర్మ మొదటి ఒంగోడు శాసనము, విష్ణు గోప వర్మ వేయించిన ఉరవపల్లి, సింగరాయకొండ శాసనాలు, ఈ కాలానికి చెందిన దర్శి శాసనము. రెండవ సింహవర్మచే ఒంగోడు II, పీకిరా, విషవెట్టి, మాంగడూర్ శాసనాలు, విష్ణుగోప వర్మ చౌర శాసనం, కుమార విష్ణు చందలూరు శాసనము, మొదటి నంది వర్మ ఉదయేందిరం శాసనం సంస్కృత శాసన విభాగంలోనికి వస్తాయి. ఇవి గాక సంస్కృత, తమిళ భాషల్లో కూడ మూడవ రకం శాసనాలు ఇవ్వబడ్డాయి. విష్ణు కుండినుల తర్వాత ఆంధ్ర దేశాన్ని సుదీర్ఘంగా పాలించిన వారు వేంగీ చాళుక్యులు. వీరు క్రీ॥ శ॥ 624 నుండి 1210 వరకు వేంగి, కంతేరు, రాజమహేంద్ర వరమును రాజధానులుగా చేసుకొని పాలించారు. వీరు జారీ చేసిన శాసనాల ప్రకారం 30 రాజులు పాలన చేసినట్లు తెలుస్తుంది. ఆంధ్రలో వేంగి చాళుక్యుల పాలనకు కారకుడైన పశ్చిమ చాళుక్య చక్రవర్తి రెండవ పులకేశి. రెండవ పులకేశి విజయ పరంపరల వలన సువిశాలమైన భూభాగాన్ని ఆక్రమించాడు. దానిలో కొంత భాగాన్ని తన తమ్ముడైన కుబ్జ విష్ణు వర్ధనునికిచ్చి విజయ వేంగీ పురాన్ని (ఏలూరు) రాజధానిగా ఇచ్చి పాలించమని ఆజ్ఞ ఇచ్చాడు. బాదామి చాళుక్యులలో ప్రముఖుడైన రెండవ పులకేశి హర్ష వర్దనుని సమకాలీనుడు. రెండవ పులకేశి వ్యక్తిత్వము, గుణగణాలు, చేసిన యుద్ధాలు, ఆక్రమించిన రాజ్యాలు మొదలైనవి ఐహోల్ శాసనంలో సవివరంగా చెప్పబడ్డాయి. ఐహోల్ శాసనం రెండవ పులకేశి ఆస్థాన కవి అయిన రవికీర్తిచే ఉత్కృష్టమైన సంస్కృత భాషలో వ్రాయబడింది. ఐహోర్ శాసనము చరిత్రకు సంస్కృత భాషకు ఆనాటి రాజకీయ చరిత్రకు ఆంధ్ర దేశంలో వివిధ రాజ్యాల వివరాలను తెలుసుకునేందుకు ఎంతో తోడ్పడుతుంది. అంతే కాకుండా కాళిదాసు కాలాన్ని నిర్ణయించడంలో కూడ ఐహోల్ శాసనం తోడ్పడుతుంది. దీని రచయిత అయిన రవికీర్తి తన సామర్థ్యాన్ని పాండిత్యాన్ని తెలుపుకుంటూ కాళిదాసు అంతటివాడనని చెప్పుకొనుటచే కాళిదాసు రవికీర్తి ముందు కాలానికి చెందినవాడని పండితులు భావించారు. ఐహోల్ శాసనం ఆంధ్రుల చరిత్ర నిర్మాణంలో ఎంతో మూలాధారంగా ఉపయోగపడుతుంది. వేంగీ చాళుక్యుల సుదీర్ఘ పాలనలో పాలించిన సుమారు 30మంది రాజులు ఎన్నో తామ్ర రాతి శాసనాల్ని వేయించారు. గుణగ విజయాదిత్యుని కాలం నాటి అద్దంకి శిలా శాసనం ఆనాటి తెలుగు నుడి కారాన్ని తెలియజేస్తుంది. యుద్ధముల్లుని బెజవాడ శిలా శాసనము కూడ తెలుగు భాష తీరును తెలియజేస్తుంది.

రాజరాజ నరేంద్రుని నందమకొండి తామ్ర శాసనము, మహా భారతమును ఆంధ్రీకరించిన ఆదికవి నన్నయచే వ్రాయబడినది. మొదటి విష్ణు వర్ధనుడు కొప్పారం, తిమ్మాపురం, చీపురపల్లి చేజర్ల శాసనాలు రెండవ విష్ణువర్ధనుని పమిడి ముక్కల మంగి యువరాజు (చందలూరు), మట్టెవాడ, మద్రాసు మ్యూజియం శాసనాలు

**శాలంకాయనుల తర్వాత:-** శాలంకాయనుల సమకాలీనుడైన సముద్ర గుప్తుడు వేయించిన అలహాబాదు శిలా శాసనం ఆంధ్రుల చరిత్రకు ఒక మైలు రాయి అని చెప్పవచ్చును. ఈ శాసనంలో చెప్పబడిన 12 మంది దక్షిణాపద రాజులు ముఖ్యంగా వేంగిని పరిపాలించే శాలంకాయన హిస్తివర్మ, కంచిని పాలించే పల్లవ విష్ణుగోపుడు ఆంధ్ర చరిత్రలో ఉద్భవించే ఎన్నో సమస్యలకు సమాధానం లభిస్తుంది. అలహాబాద్ శిలాశాసనం ఉత్తర, మధ్య, దక్షిణ భారతదేశ పాలకుల పేర్లు వారి రాజధానులు తెలుస్తాయి. ఇది నాలుగవ శతాబ్దపు రాజకీయ పటమని చాలా మంది భావించారు. సముద్ర గుప్తుని అలహాబాద్ శాసనంలో చెప్పబడిన అనేక చారిత్రక వాస్తవాలు భారత చరిత్రను ఆంధ్రుల చరిత్రను వ్రాయడంలోనూ, కాల నిర్ణయం చేయడంలోనూ ఎంతో తోడ్పడుతుంది. అలహాబాద్ శాసనాల్ని లిపి, భాష, భూగోళము మొదలైన కోణాల నుంచి అధ్యయనం చేయవచ్చు. ఇది శాసనాల్లో లభ్యమైన గొప్ప పత్రము.

వేంగీ చాళుక్యుల తరువాత ఓరుగల్లును కాకతీయులు రాజధానిగా చేసుకొని 1336 వరకు పరిపాలించారు. కాకతీయుల రాజులు రాజోద్యోగులు పెక్కు శాసనాలను జారి చేసారు. కాకతి మైలమా బయ్యారం చెరువు కట్టు శాసనం కాకతీయుల వంశ వృక్షాన్ని తీర్చిదిద్దటంలోను వారు చతుర్ధ కులచువైనులని తోడ్పడింది. కాకతీయుల రాజుల వంశావళి ఎంతో నిర్దిష్టంగా చెప్పడానికి ఎంతో సహాయపడింది. గణపతి దేవుని సహోదరి అయిన మైలమ కోట గణపతి దేవునిని వివాహమాడుట వలన ఎన్నో ఇతర సామాజిక విషయాలు తెలిసాయి. హనుమకొండలోని రుద్రుని శాసనం, చేబ్రోలు లోని జాయప్పసానిని శాసనం, మల్కాపురంలో రుద్రమ దేవి శాసనం, మందడం మోటుపల్లి దగ్గర వేయించిన గణపతి దేవుని శాసనాలు నాటి రాజకీయ, ఆర్థిక విదేశీ వ్యా.పార పరిస్థితులను తెలియజేస్తాయి. త్రిపురాంతకంలో లభ్యమైన కాయస్త అంబ దేవుని శాసనాలు చందుపట్ల శిలా శాసనాలు కాకతీయుల చరిత్రలో ఒప్పందమైన సమస్యలకు సమాధానమిస్తాయి. ఇవి కాక పెక్కు శిల, తామ్ర శాసనాలు ఆంధ్రుల చరిత్ర, సంస్కృతిని వ్రాయడానికి తోడ్పడతాయి.

**1.2.B నాణేలు:-** శాసనాల తరువాత ముఖ్యంగా పేర్కొనదగిన ఆధారాలు నాణేలు. నాణేలు వ్యాపార వినిమయంలో సాధనంగా ఉపయోగపడినప్పటికి వాటి పై ఉండే పేర్లు, సంవత్సరాలు, చిత్రాలు, సంకేతాలు (ఆఖ్యలు) Legends బొమ్మా బొరుసుల పై ఉండే సంకేతాలు వ్యాపార ఆర్థిక కళాత్మక చరిత్రను తెలుసుకునేందుకు వంశ వృక్షాలు కాల నిర్ణయాలు చేసేందుకు తోడ్పడతాయి.

నాణేలు కొన్ని ప్రముఖ రాజ్యవంశాలైన బ్యాక్ట్రయన్లు ఇండో గ్రీకుల చరిత్రను నిర్మించడానికి పూర్తిగా తోడ్పడ్డాయి. ఆ నాణేలే లభ్యం కాకపోతే వారు చరిత్ర పుటల్లోకి ఎక్కేవారే కాదు. నాణేలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. బార్టర్ లేక వస్తుమార్పిడి విధానంలో ఉత్పన్నమైన సమస్యలు నాణేల ఆవిష్కరణ వల్ల తొలిగాయి. తొలి నాణేలు ఒక నియమిత ఆకారం లేక లోహపు బిళ్లల వలె ఉండేవి. వాటిని పౌరులు, వ్యాపారులు నాణేలుగా చెలామణి చేసేవారు. అయితే గ్రీకులు, ఉషాణులు భారతదేశానికి వచ్చిన తరువాత నాణేల రూపు రేఖలు మారాయి. అందం గాను, గుండ్రం గాను ఆఖ్యలతోను రాజుల, దేవతల చిత్రాలతోను నాణేలు ముద్రించబడేవి. ఆ విధంగా నాణేలు ఎక్కువ విషయాలను కలిగి ఉండేవి. రాగి, సీసం మిశ్రమము పోటిన్, వెండి బంగారంతో ముద్రించబడిన నాణేలు క్రమక్రమంగా జారీ చేయబడ్డాయి. శాతవాహనులు ఎక్కువగా పోటిన్ లోహముతో తమ నాణేలను ముద్రించారు. వీరి నాణేల పై లభ్యమైన వివిధ ముద్రలు వీరి కాలం నాటి విశేషాలను తెలుసుకోవడానికి తోడ్పడతాయి. గౌతమి పుత్ర శాతకర్ణి చే జారీ చేయబడిన ఓడ ముద్రికలున్న నాణేల వల్ల శాతవాహనులు సముద్ర వ్యాపారం, నౌకాబలం కలవారని చరిత్రకారులు చెప్పారు. నహపాణ చెస్తన వెండి

నాణేలను గౌతమి పుత్ర తన సముద్ర వేసి వాటిని తన రాజ్యంలో చెలామణి అయ్యేందుకు అనుమతించడం మరియొక విశేషము.

జోగుల తంబిలో లభ్యమైన నాణేలు శాతవాహన క్షాత్రవ రాజ వంశాల చరిత్ర నిర్మాణానికి ఎంతో తోడ్పడతాయి. ఉజ్జయిని సంకేతం స్వస్తిక కొండలు, స్థూపం, ముఖ ద్వార తోరణా అశ్విక (Horse) ముద్రికలున్న నాణేలు కనిపిస్తాయి. నౌకా బలానికి అశ్వమేధ యాగానికి సంకేతాలుగా చరిత్రకారులు చెబుతారు. శాతవాహనుల కాలంలో బంగారు నాణేలు ఉన్నట్లు దాఖలాలు లేవు. అయితే వీరి శాసనాల్లో కహాపణ (కార్షాపణ) శతమాన, సువర్ణ అనే నాణేల ప్రస్తావన ఉంది. ఇవన్నీ యుత్పత్తి అర్థాన్ని బట్టి సువర్ణంతో చేసినవని నిరూపణ జరుగుతుండగా బంగారు నాణేలు మాత్రం త్రవ్వకాల్లో గాని, ఆరుబయట ప్రదేశాల్లో గాని బంగారు నాణేలు దొరికినట్లు చెప్పకపోవడంలోని అర్థం గ్రహించవచ్చును. శాతవాహనుల అనంతరం ఇక్ష్వాకులు విజయపురి (నాగార్జున కొండ) నుండి పాలించారు. వీరి కాలానికి చెందిన ఇనుప నాణేలు లభ్యమైయ్యాయి. అయితే వీరి శాసనాల్లో, దానాల్లో అనేక హిర్మమ్న కోటి దానాలు కోట్ల బంగారు నాణేలు చేసినట్లు వీర పురుషదత్తుని క్రీ.2 ఆ యొక్క స్థంబ శాసనంలో వుంది. శాసనాల్లో ప్రస్తావించబడి పురావస్తు త్రవ్వకాలలో కనిపించని ఈ నాణేలను ఎంతైన వెదకవలసి ఉంది. ఇక్ష్వాకుల తరువాత పాలించిన చిన్న చిన్న రాజ వంశాలు కూడా నాణేలను జారీ చేసి వుంటారు. వర్తక, వాణిజ్యాలకు వస్తు మార్పిడికి, ప్రభుత్వ కార్యకలాపాల్లో ధనం నాణేల రూపాల్లోనే అవసరాలను తీరుస్తుంది. వీరి తరువాత విష్ణు కుండినులు వేంగీ చాళుక్యుల పాలనలోను వివిధ రకాలైన నాణేలను జారీ చేశారు. ఇంతవరకు లభ్యమైన వీరి నాణేలు వారి వారి ఆర్థిక, వర్తక, వాణిజ్య చరిత్రలను నిర్మించడంలో మూలాధారాలుగా తోడ్పడతాయి.

1.2.C **పురావస్తు నిర్మాణ అవశేషాలు:-** శాసనాలు, నాణేలు తరువాత పేర్కొనదగినవి పురావస్తు నిర్మాణ అవశేషాలు. చరిత్ర యుగంలో నిర్మింపబడ్డ కట్టడాలు, నివాసాలు (దేవాలయాలు), కోటలు, జైన, బౌద్ధ, వైదిక నిర్మాణాలు, పెక్కు లౌకిక కట్టడాలు ఈ కోవకు చెందుతాయి. మానవుడు నిర్మించి ఉపయోగించిన నిర్మాణాలన్నీ కాల క్రమేణ కాలం చెల్లి శిధిలాలుగా మారాయి. పురావస్తు శాస్త్రజ్ఞులు వీటిని యథాతథంగా అధ్యయనం చేయడం గాని భూగర్భంలో నిక్షిప్తం అయితే త్రవ్వకాల ద్వారా బయటికి తీసి అధ్యయనం చేయడం జరుగుతుంది. త్రవ్వకాల్లో నుండి బయటపడిన పురావుస్తు సంపదను పరిరక్షించి ఫొటో గ్రాపులు, డ్రాయింగ్‌లు వేయించి వాటిని భద్రపరచి చరిత్ర రచనకు తోడ్పడే మూలాధారాలుగా వాడతారు. వివిధ నిర్మాణాల నిర్మాణ నమూనాలను (Planee) వాస్తు లక్షణాలను నిర్మాణంలో వాడిన వస్తువులను అధ్యయనం చేస్తారు. ఏ నిర్మాణం ఏ వాస్తు శాస్త్ర ప్రకారం కనుక్కుంటారో దాన్ని బట్టి ధార్మిక, లౌకిక వాస్తు అంశాలను అధ్యయనం చేయడానికి పురావస్తు నిర్మాణ అవశేషాలు తోడ్పడతాయి. రహదారులు, రాజ మందిరాలు, సన్యాసుల నివాసాలు, దేవాలయ నిర్మాణాలు, శిల్పాలు, శిల్ప మూర్తులు, చిత్రాలు, పేయింటింగ్స్, కుడ్య చిత్రాలు (Muralus) మొదలైనవి చరిత్ర నిర్మాణంలో మూలాధారాలుగా ఉపయోగపడతాయి.

## 1.3 సాహిత్య ఆధారాలు (Literary Sources):-

పురావస్తు ఆధారాల తర్వాత పేర్కొనదగినవి లిఖిత లేక సాహిత్య ఆధారాలు. మానవుడు వ్రాయడం ప్రారంభించినప్పటి నుండి చరిత్ర ప్రారంభమైంది. చరిత్రకు ముందున్న కాలాన్ని Pre History లేక ప్రాక్ చరిత్ర అంటారు. లిపి చలామణి అయిన సింధు లోయ నాగరికత చరిత్రలోని ప్రాక్ చరిత్రలోకి రాదు. సింధు నాగరికత (Indus Valley Civilization) వారికి చదవడం, వ్రాయడం వచ్చు. అయితే వారి లిపిని ఇంకా చిక్కుముడి విడదీయనందున (DECIPHERMENT) ఆ కాలాన్ని Proto History గా పిలుస్తారు.

### 1.3.A స్వదేశీ సాహిత్య ఆధారాలు (Indigenous Literary Sources):

**పురాణాలు (Puranas):-** స్వదేశీ సాహిత్యాధారాల్లో పేర్కొనదగినవి పురాణాలు. ఇవి 18. వీటిలో మత్స్య, వాయు,

బ్రహ్మాండ పురాణాల్లో ఆంధ్రుల వంశ రాజ్య కాల వివరాలు చాలా వున్నాయి. పురాణాల్లో చరిత్ర, సాంస్కృతిక, సాంప్రదాయ విషయాలు వున్నాయని ఫర్జీటర్ పండితులు చెప్పేవరకు పండితులకు తెలియదు. పురాణాల్లో విస్తృతమైన 'ఆంధ్రుల, వంశ వృక్షం, పాలించిన కాలం, 30 మంది రాజుల పేర్లు వివరంగా పేర్కొనబడ్డాయి. ఆంధ్రుల జాతీయత, వారికి ఇతర రాజవంశాలతో వున్న సంబంధ బాంధవ్యాలు పురాణాలు పేర్కొన్నాయి, ఆ విధంగా పురాణాలలోని ఆంధ్రులు శాసనాల్లో చెప్పబడ్డ శాతవాహనుల పేర్లు రాజ్యకాలాలు ఒకటేనని చరిత్రకారులు భావించి పురాణంలోని ఆంధ్రుల్ని శాసనాలు, నాణేల మీద ముద్రించబడ్డ శాతవాహనులను కలిపి ఆంధ్ర శాతవాహనులని పిలిచారు. దీని వల్ల 'ఆంధ్ర జాతి' గా, శాతవాహన కులంగా భావించారు.

**హాలుని గాధాసప్తశతి HALA'S GADHASAPTASATI:-** ఆంధ్రశాతవాహనుల కాలం నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక ధార్మిక విషయాలను తెలుసుకునేందుకు హాలునిచే (Edit) సంకల్పింపబడిన 'గాధా సప్తశతి' అనే గ్రంథం ఎంతో ఉపయోగపడుతుంది. ఆంధ్ర శాతవాహన రాజులలో 17వ వాడైన హాలుడు (మత్స్య పురాణపు సంఖ్య) 3 స్వయంగా కవి, రసికుడు అనేక భాషల్లో మహా పండితుడు. (సంస్కృతంలో ఇతనికి ప్రవేశం లేదు.) ఇతడు ప్రాకృత భాషను ప్రోత్సహించి దానిలో వ్రాసిన గాధ (ద్విపద)లను సేకరించి వాటిలో మేలైన 700 గాధలను సంకల్పించెను. దీనినే 'గాధా సప్తశతి' అని అందురు. ఈ గ్రంథంలోని గాధలు శృంగార పరమైనవిగాను, శ్లేషాలంకారం (PUN) తో వుండటం గమనార్హం. ప్రతి గాధలోనూ శృంగారం యితి వృత్తం పైకి ఒక అర్థం అంతర్గతంగా మరో సందేశం వీటిలో కనిపిస్తాయి. సప్తశతి శృంగార పరమైన గ్రంధమైనప్పటికి, దానిలో ఆనాటి కుటుంబ జీవనం, వివిధ వర్గాలు, వృత్తులు, పంటలు, వేష భాషలు, ఆచార వ్యవహారాలు యింకా ఎన్నో విషయాలు యధాతధంగా చెప్పబడ్డాయి. హాలిని గాధా సప్తశతి ఆనాటి జీవనానికి సమతల దర్పణం అని చెప్పవచ్చు. అయితే ఈ గ్రంథ రచనా కాలం అందలి వివిధ రచయిత(తు)ల కాలం గురించి ఎన్నో చిక్కు సమస్యలు వున్నాయి. హాలుడు 'కవి వత్సలుడు' అని పిలువబడ్డాడు. 'గాధ' సంస్కృతంలో వున్న ఆర్యా (Matre) ప్రాకృత 'గాధ'కు సమానము. మహారాష్ట్రి ప్రాకృతంలో వ్రాయబడ్డ యీ గాధలు ఆనాటి శాసనాల్లో ఉపయోగించిన ప్రాకృతం కంటే భిన్నంగా వుంది. సప్తశతిలోని గాధల్లో 42 గాధలు హాలుని చేతనే వ్రాయబడ్డాయి. ఈ గ్రంథంలో ఎందరో రచయిత్రులు కూడా తమ గాధలను వ్రాశారు. దీన్ని బట్టి శాతవాహనుల కాలం నాటికే ఎందరో రచయిత్రులున్నట్లు తెలియుచున్నది. బాణునిచే వ్రాయబడి 'హర్ష చరిత్ర' పీఠికలో హాలునిచే సంకల్పింపబడిన 'కోశ గ్రంథం' గురించి వివరించబడింది. నిఘంటు రచయిత అయిన హేమ చంద్రుడు హాలుడు శాతవాహన వంశస్థుడుగా చెప్పగా, 'దేశీ నామమాలా, కూడా హాలుణ్ణు, శాతవాహన వంశస్థుడుగా చెప్పగా, సప్తశతి వ్రాతపతిలో హాలుడు కుంతల జనపదానికి రాజుగా పేర్కొనెను. ఆంధ్ర మహారాష్ట్ర ప్రాంతంలోని జన జీవనాన్ని యధాతధంగా తెలియజేసే గాధా సప్తశతి ఎంతో ముఖ్యమైన చారిత్రక మూలాధారము.

**గుణాఢ్యుని బృహత్ కధ (Brahatkadha of Gunadhya):-** ఆంధ్ర శాతవాహనుల కాలంలో వ్రాయబడిన గ్రంథాల్లో గుణాఢ్యునిచే వ్రాయబడ్డ 'బృహత్ కధ' చాలా ముఖ్యమైనది. గుణాఢ్య పండితుడు హాలుని ఆస్థానమున వున్న భాషా శాస్త్రవేత్త, హాలునికి గుణాఢ్యుడు సంస్కృతాన్ని నేర్చుకోవడానికి ఎక్కువ కాలం పడుతుందని చెప్పగా అందుకు భిన్నంగా ఆరు నెలల్లోనే నేర్చుకోవచ్చునన్న సర్వవర్మ సవాలును అవమానంగా భావించి హాలుని ఆస్థానమును విడిచి వింధ్య పర్వత ప్రాంతానికి పోయి రక్తంతో పైశాచిక భాషలో సంప్రదాయంలో అనేక కథలున్న బృహత్ కథను వ్రాసినట్లు వుదంతాలున్నాయి. అనేక భాషలు తెలిసిన హాలునికి సంస్కృతం తెలియకపోవడం గమనార్హం. కినుక వహించిన రాణి ప్రేమను పొందెందుకు సర్వవర్మ విరచితమైన 'కాతంత్ర్య వ్యాకరణాన్ని' చదవడం, సంస్కృత పండితుడైన గుణాఢ్యుడు దాన్ని వదిలి పైశాచి భాషలో రచన చేయడం చాలా వింతగా కనిపిస్తాయి. దీన్ని బట్టి 'కాతంత్ర్య వ్యాకరణం' కంటే యింకా వివరంగా వుండే పెద్ద వ్యాకరణ గ్రంథాలు అంతకు ముందే వున్నట్లు తెలియుచున్నది. పైశాచి భాషలో వ్యాకరణం వ్రాయబడిన బృహత్

కథ నేడు లభ్యం కాదు. ధాని వివిధ భాగాలు, సన్నివేశాలు, కథలు అనేక రచయితల గ్రంథాల్లో చెప్పబడ్డాయి. బాణుని రచనలైన 'హర్ష చరిత్ర', 'కాదంబరి గ్రంథాల్లో' బృహత్ కథ ప్రస్తావన వుంది.

**స్వదేశీ సాహిత్య ఆధారాలు (Bilhanaas Vikramankadeva Charita):-** బిల్హణుని విక్రమాంక దేవ చరిత అనే గ్రంథం ఆంధ్రుల చరిత్ర రచనలో మూలాధారంగా ఉపయోగపడుతుంది. Rannces Gadayudha రన్నడు (Rannai) వ్రాసిన గదాయుద్ధమనే కన్నడ కావ్యంలో అయోధ్యాధీశుడైన సత్యాశ్రయుడు అనే చాళుక్య వంశ కర్తగా చెప్పబడ్డాడు.

5వ విష్ణు వర్ధనుని కౌతమ్ శాసనంలో చెప్పబడింది. దీని ప్రకారం చాళుక్య వంశానికి చెందిన 55 మంది రాజులు 'అయోధ్య'ను పాలించిన తరువాత 'దక్షిణాపథా'నికి వలస వచ్చి రాజ్యాన్ని స్థాపించెను. అయితే అటు తరువాత 16 మంది రాజులు పాలించగా వారి అధికారం పోయి అజ్ఞాతంగా ఉండవలసి వచ్చెనట. కొన్ని తరాలు గతించిన తరువాత జయసింహ వల్లభుడనే రాజు కృష్ణుని కుమారుడైన రాష్ట్ర కూట ఇంద్రుణ్ణి జయించి తిరిగి రాజ్యాన్ని స్థాపించెనట.

1.3.B **కథలు గాథలు:-** ఆంధ్రుల చరిత్రను వ్రాయడానికి ఉపయోగపడే మూలాధారాల్లో చేర్చదగినవి స్థల పురాణాలు, కథలు, గాథలు.

చరిత్ర వాస్తవాల మీద ఆధారపడి వ్రాయబడేదని అనుకున్నప్పటికి కొన్ని సమీప వాస్తవాలను కూడా ఉపయోగించవలసిన అవసరం ఏర్పడుతుంది. అటువంటి కోవకి చెందినవి స్థల పురాణాలు, కథలు, గాథలు. ఆంధ్రుల చరిత్రలో చరిత్ర వలె కనిపిస్తూ వాస్తవాలకు దూరంగా ఉండే కొన్ని గాథలు, కథలు ఉన్నాయి.

**సారంగధరుడు:-** వేంగీ చాళుక్యుల కాలంలో ఒక గాథ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ గాథలోని నాయకుడు సారంగధరుడు. ఇతడ్ని రాజరాజ నరేంద్రుని కుమారుడని వాడుకలో ఉంది. అయితే వేంగీ చాళుక్యుల శాసనాల్లో గాని, గ్రంథాల్లో గాని సారంగధరుడు రాజ రాజ నరేంద్రుడి కొడుకని పేర్కొనలేదు. దీనికి సంబంధించిన ఏ విధమైన చారిత్రక ఆధారం లభ్యం కాలేదు. అయితే రాజ మహేంద్రవరంలోనే సారంగధర మెట్ట అనే గుట్ట ఉన్నది. ఇంకొక ప్రదేశంలో చిత్రాంగి మేడ అని చెప్పబడే పురాతన కట్టడం ఉంది. ప్రజల్లో ప్రాచుర్యంగా ఉన్న ఇతివృత్తం ఇలా ఉంది. ముసలి రాజు అయిన రాజ రాజు చిత్రాంగి అనబడే ఒక రాజ కుమారిని లేదా కుమారుడైన సారంగధరునికి వివాహము నిమిత్తం చూసినట్లు అయితే ఆమెను చూసిన తరువాత రాజ రాజు తనే వివాహమాడినట్లు అంతకు ముందే చిత్రాంగి సారంగధరుల మధ్య పావురాల ద్వారా, చెలికత్తెల ద్వారా ప్రేమ లేఖలు సందేశాలు పంపించుకుని గాఢంగా ప్రేమించుకున్నట్లు చెపుతారు. రాజ రాజు వివాహమాడి చిత్రాంగిని రాణి వాసంలో బంధించగా సారంగధరుని మరువలేని చిత్రాంగి పావుర సందేశం ద్వారా అతనికి వర్తమానం పంపగా అతను ఆమె దగ్గరకెళ్ళి మాట్లాడుచుండగా వేగుల వారు ఆ విషయాన్ని రాజ రాజుకు తెలియజేయగా అతడు సారంగధరుడికి రాజ ద్రోహం క్రింద నేరారోపణ చేసి కాళ్ళు చేతులు ఖండించమని శిక్ష విధించాడు. రాజ మహేంద్రవరం సమీపమున ఉన్న ఒక గుట్ట పై సారంగధరుని కాళ్ళు చేతులు ఖండించెను. అయితే దేవతలు సారంగధరుని చూసి నిర్దోషని తలంచి చిరంజీవిగా చేసి కాళ్ళు చేతులు అతికించెను. దేవతలు సారంగధరుని చిరంజీవిగా చేసే సంఘటనకు చారిత్రక సాక్ష్యం లేదు. అయితే ప్రజలు భక్తి ప్రపత్తులతో ఈ సంఘటనకు చారిత్రకత కలిపించుకుని నమ్ముచూ వచ్చారు. సారంగధరుడు నాథ సంప్రదాయము నందు నిష్ణాతుడు. నవనాథులు ప్రవచించిన సంప్రదాయాలను ఎరిగినవాడు. నాథ యోగులు సిద్దులు వారు ప్రాణాయామం హంజోలి, గజకర్ణ గోకర్ణ విద్యలయందు సిద్దులు. పరకాయ ప్రవేశం మొదలైన విద్యల యందు నిష్ణాతులు, సారంగధరుడు నవనాథులలో ఒకరైన వేరంగీ నాథ్ ప్రతిరూపమైతే నాథ సంప్రదాయాన్ని అనుసరించి నరికివేయబడ్డ కాళ్ళు చేతులను బాగు చేసుకునే వైద్య విద్యను ఎరిగి యుండవచ్చును. చరిత్రలోని మర్మాలను వాస్తవాలను తెలుసుకొనవలసిన అవసరం సామాన్యుడికి ఉండదు గనుక నమ్మకాల మీదే చరిత్రను నిర్మిస్తారు.

**కన్యకా పరమేశ్వరి ఉదంతం:-** సారంగధరుని వృత్తాంతం వంటిదే మరియొకటి వేంగీ చాళుక్యుల కాలంలోనే ప్రాచుర్యంలోకి వచ్చింది. అదే కన్యకా పరమేశ్వరి గాథ. ఒకానొక చాళుక్య విష్ణు వర్ధనుడు పెనుగొండ నగరంలో ఉండే వైశ్య శ్రేష్టుని కుమార్తె అంద చందాలను విని ఆమెను వివాహమాడుటకు నిశ్చయించుకుని వైశ్య శ్రేష్టునికి వర్తమానమంపెను. అయితే వైశ్య శ్రేష్టి రాజు కోరికను తిరస్కరిస్తూ రాజు తండ్రి వంటి వాడని ప్రజలను అటువంటి దృష్టితో చూడరాదని ఇది తగని పని అని అటువంటి ఆలోచన తగదని తిరిగి వర్తమానం రాజుకు పంపెను. అందుకు ఆగ్రహించిన చాళుక్య విష్ణు వర్ధనుడు యిది తనకు తీరని అవమానమని తలంచి బలవంతంగానైనను కన్యని వివాహమాడె తీరుతానని పెనుగొండ చేరెను. రాజు వల్ల జరిగే యుద్ధం వలన అనేక మంది ప్రాణాలు కోల్పోతారని తలంచిన కన్యక విష్ణు వర్ధనునితో వివాహమాడుటకు అంగీకరించినట్లు వర్తమానం పంపెను. వివాహమునకు సిద్ధపడి వచ్చిన విష్ణు వర్ధనుడు వివాహ వేదిక పై ఉన్న అగ్నిలో కన్యక ఆత్మాహుతి చేసుకొనడం వలన .యుద్ధం ప్రకటించి భీభత్సం సృష్టించెను. ఈ సంఘటనలో ధనవంతులైన వైశ్యులందరు ఏకమై చాళుక్య రాజును రాజ్యాధికారాన్ని ధిక్కరించారు. కన్యక ఆత్మాహుతితో వైశ్య శ్రేష్టులలో ఐక్యత పెరిగెను. చాళుక్య రాజ్యంలో కల్లోలం రేకెత్తెను. ఈ ఉదాంతానికి సంబంధించిన చారిత్రక ఆధారాలు ఇప్పటికి లభ్యం కాలేదు. అయితే కన్యకా పరమేశ్వరి పేరుపై ఆలయాలు నిర్మించబడుతూనే ఉన్నాయి. కన్యకకు ప్రజలు పూజలు, అర్పణలు చేస్తూనే ఉన్నారు. వైశ్యులకు ప్రధాన కూడలి అయిన నగరము పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో ఉన్నది. చరిత్రకు అందని సత్యాలను గాఢంగా విశ్వసించి నమ్మకాలుగా మార్చి చరిత్రనే సందేశించే గాథలు, కథలు, స్థల పురాణాలు ఎన్నో ఆంధ్ర దేశంలో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ స్థల పురాణాలు గాథలు అప్పటి రాజుల యొక్క పేర్లను, రాజధానులను, వంశాలను, శాసనాలలో చెప్పబడ్డ వాటితో పోల్చి చరిత్ర నిర్మాణం చేయుటకు ఉపకరిస్తాయి.

1.3.C **బ్రాహ్మణ మత గ్రంథాలు:-** ఋుగ్, యజు, సామ, అధర్వణ అనే నాలుగు వేదాలు ముఖ్యమైన ప్రాచీన బ్రాహ్మణ మత గ్రంథాలు. వీటిలో ఋుగ్వేదం అతి పురాతనమైంది. బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు అనే ప్రాచీన గ్రంథాలున్నాయి. 18 పురాణాలు రామాయణ, మహాభారతమనే ఇతిహాసాలు పేర్కొనదగినవి.

1.3.D **బౌద్ధమత గ్రంథాలు:-** బ్రాహ్మణ మత గ్రంథాల తర్వాత చెప్పదగినవి బౌద్ధమత గ్రంథాలు. బౌద్ధ గ్రంథాల్లో ముఖ్యమైనవి పిటక సాహిత్యము. గౌతముని నిర్యాణం తరువాత అతని సూక్తుల్ని, ఉపన్యాసాల్ని సుత్త (సూక్తి) వినయ, అభిధమ్మ పీటకములుగ క్రోడీకరించారు. వీటిని త్రి పీటకములంటారు. ఇవి పాలీ భాషలో వ్రాయబడ్డాయి. బుద్ధుని జీవిత విశేషాల్ని తెలియపరిచే ఈ గ్రంథాలు ఎన్నో కథలు, గాథలు ప్రాచుర్యంలో ఉండేవి. అయితే వాటిలో 549 ముఖ్యమైన వాటిని ఎంపిక చేసి 'జాతక కథలుగ' రూపొందించారు. వీటికి బౌద్ధ సంఘాల ఆమోదం లభించింది.

**తేర గాథలు తేరి గాథలు:-** జాతక కథల తరువాత తేరి గాథలు తీర గాథలు పేర్కొనదగినవి. క్రీ॥ పూ॥ 6, 5 శతాబ్దాల కాలం నాటి భారతదేశపు రాజకీయ, సాంఘిక, ధార్మిక, సాంస్కృతిక చరిత్రలను తెలుసుకుంటానికి త్రి పీటకాలు, జాతక కథలు తేర, తేరీ గాథలు ఎంతో ఉపయోగపడతాయి. Teregadhas తేరి గాథలు బౌద్ధ భిక్షుకులు (Nuns) అంతరాత్మ, ఆంతరంగిక భావాలను, బాధలను వ్యక్తం చేసేవి. Teragadhas తీర గాథలు బౌద్ధ భిక్షువుల (Monks) మనోభావాలను ఆంతరంగిక విషయాలను చెప్పేవి. ఈ గాథలు బౌద్ధ భిక్షుణి, భిక్షువుల మానసిక ప్రవృత్తిని తెలియజేస్తాయి.

మిలింద పన్హ అనే గ్రంథం బాక్ట్రియన్ రాజైన మినాండర్‌కు బౌద్ధాచార్యుడైన నాగసేనునికి మధ్య జరిగిన సంభాషణ. ఈ గ్రంథం అశోకుని తరువాతి కాలం నాటి భారతదేశపు రాజకీయ, ధార్మిక విషయాల్ని తెలియ చేస్తుంది.

1.3.E **జైన మత గ్రంథాలు** (JAIN LITERATURE) :- బౌద్ధ గ్రంథాల తరువాత పేర్కొనదగినవి జైన గ్రంథాలు. జైన మత గ్రంథాల్ని అంగాలు, ఉపాంగాలు (ANGAS, UPANGAS) అని పిలుస్తారు. ఇవి 12 వీటిని ద్వాదశ అంగాలు అంటారు. వర్ధమాన మహావీరుని జీవిత విశేషాలు, జైన మత సూత్రాలు ఆనాటి సామాజిక, ధార్మిక, రాజీకయ, సాంస్కృతిక పరిస్థితుల్ని తెలియజేస్తాయి.

1.3.F **ఆచార్య నాగార్జుని రచనలు (ఇతర రచనలు):-** బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతడు శూన్యవాద వేదాంత ఆచార్యుడుగా పేరు పొందాడు. ఇతడు అనేక శాస్త్రీయ గ్రంథాలు రచించాడు. వాటిలో 24 గ్రంథాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. నాగార్జునుని పేరిట ఆంధ్ర దేశంలో అనేక ప్రాంతాలు పిలువబడ్డాయి. వాటిలో ప్రముఖ బౌద్ధ క్షేత్రం నాగార్జున కొండ ఒకటి. 'శూన్య వాదం' 'రసవాదం' నాగార్జునిని ప్రతిభకు చిహ్నాలు. ఇతని పాండిత్యము ప్రపంచ నలుదిశలా చేరింది. విదేశాల నుండి ప్రముఖ విద్యావేత్తలు, తాత్వికులు ఆంధ్ర దేశంలో వున్న బౌద్ధ విద్యాలయాలకు వచ్చి విద్యను అభ్యసించేవారు. సింహళము, బాలి, సుమత్ర, చైనా మొదలైన విదేశాల నుండి ఎందరో విద్యార్థులు బౌద్ధ క్షేత్రాల్ని దర్శించి నాగార్జునిని సిద్ధాంతాల్ని అధ్యయనం చేయడానికి వచ్చారు. అట్టి వారికి స్వదేశీ పాలకుల ఆర్థిక సహాయ సహకారాలు లభించేవి. ఈ విధంగా నాగార్జునిచే రచింపబడిన గ్రంథాలు ఆంధ్రుల చరిత్ర రచనలో ఆధారాలుగా ఉపయోగపడతాయి.

## 1.4 విదేశీ సాహిత్యధారాలు (Foreign Literary Sources) :-

స్వదేశీ సాహిత్యాధారల తర్వాత పేర్కొనదగినవి విదేశీ సాహిత్యాధారాలు.

1. **పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ** (The Periplus of the Erythrean Sea) :- ఆంధ్ర శాతవాహన కాలం నాటి ఓడరేవులు విదేశీ వ్యాపారం, ఎగుమతులు, దిగుమతులు, రాజీకయ పరిస్థితులు, సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఎంతో తోడ్పడుతుంది. క్రీ॥శ॥ 80 - 89 మధ్య కాలంలో వ్రాయబడినట్లుగా భావించబడే ఈ గ్రంథం ఎర్ర సముద్రం పై దినచర్య అనే 'గ్రంథ' రచయితచే వ్రాయబడింది. అయితే ఈ రచయిత పేరు ఈ నాటికి తెలియదు. నావికుడైన ఈ రచయిత అజ్ఞాతంగానే ఉన్నాడు. ఈ గ్రంథంలో ప్రాచీన భారత దేశపు పశ్చిమ, దక్షిణ తీరాల్లో ఉన్న ఓడరేవులు ముఖ్య పట్టణాలు వ్యాపార కూడళ్ల రహదారుల ప్రస్తావన ఉంది. పైఠాన్ నుండి తగర చేరటానికి 90 రోజులు పడుతుంధని బ్రోచ్ నుండి పైఠాన్‌కు 20 రోజులు పడుతుందని ఈ రెండింటికి మధ్య 'తెర్' నగరం ఉందని ఈ గ్రంథంలో చెప్పబడింది. బారిగాజ, కళ్యాణ రేవుల్లో జరిగే ఎగుమతులు, దిగుమతుల వివరణ ఉంది. తూర్పు తీరంలోని 'కొడ్డూర' 'ఎల్లోసిజన్' మైసోలియా ప్రాంతపు ఓడరేవులుగా చెప్పబడ్డాయి. శాతవాహనుల 'క్షహరత' క్షాత్రపుల సంబంధాలు కూడ ఈ గ్రంథంలో చెప్పబడ్డాయి. దక్షిణాపథంలో గ్రీకుల ప్రవేశాన్ని వారి కార్యకలాపాలను ధృవపరిచేందుకు ఈ గ్రంథం తోడ్పడుతుంది. ఎపొల్లోడోటస్ మీనాండర్ల నాణాలు బారిగాజ ప్రాంతంలో తన కాలంలో చలామణిలో ఉన్నట్లు 'పెరిప్లస్' రచయిత పేర్కొన్నాడు.

2. **క్లాడియస్ టాలమి** (KLAUDIOUS PTOLEMAIOS):- ఈజిప్ట్ దేశీయుడైన టాలమి బహుముఖ ప్రతిభా సంపన్నుడు. గణితం, ఖగోళ శాస్త్రం, భౌగోళ శాస్త్రాలలో మహా పాండిత్యం కలిగిన టాలమి క్రీ॥శ॥ 2 వ శతాబ్దపు మధ్య కాలపు వాడు. ఇతని కంటే ముందు ఎందరో భౌగోళ శాస్త్రజ్ఞులు ఎరటోస్తనిస్, స్ట్రాబో, ప్లీని, వెర్నియర్ ఉన్నప్పటికీ టాలమినే తొలి శాస్త్రీయ భౌగోళ శాస్త్రజ్ఞునిగా గుర్తించారు. ఇతనిచే వ్రాయబడిన అల్మగెస్ట్ అనే ఖగోళ బృహత్ గ్రంథంలోని భాగమే భూగోళము. ఇది (An Outline of Geography) గా పిలువబడుతుంది. ఈ గ్రంథం 8 భాగాలుగా విభజింపబడింది. అక్షాంశాలు రేఖాంశాలను ప్రాతిపదికగా తీసుకొని 26 దేశ పటాలను తయారు చేసాడు. అందులో 10 ఐరోపా, 4 లిబియా, 12 ఆసియా దేశాలకు సంబంధించినవి. ముఖ్యమైన ప్రదేశాల సరిహద్దులు వాటిలో నివసించే జాతుల వర్ణన ఇవ్వబడ్డాయి. టాలమి వర్ణించిన విషయాలు ఈ నాడు నిజం కావని తెలిసినప్పటికి సాంస్కృతిక పరంగా ఎంతో ఉపయోగమనే చెప్పాలి. భారత దేశపు సరిహద్దులు పొరుగు రాజ్యాల వర్ణన చాల నిర్దిష్టంగా చెప్పబడ్డాయి. పర్వతాలకు, నదులకు, సముద్రాలకు, ద్వీపాలకు అతడు ఆర్యులుపయోగించిన పేర్లను పెట్టలేదు. అయితే కొన్ని ప్రదేశాలకు వాటి ప్రజలకు మాత్రమే ఆర్య నామాలనుపయోగించాడు. 'అరికె' (Ariake) ఇది ఆర్య భూమి. దీన్ని మహారాష్ట్రంతో గుర్తించారు. 'లిమరికె' లేక 'దమిరికె' దీన్ని తమిళ దేశంతో గుర్తించారు. తామ్రపర్ణి నది పై ఉన్న ప్రామ్‌కె (బ్రహ్మ నగరం) Brakmani Magoi, అనే వారు. మహారాష్ట్రలో ఉండే బ్రాహ్మణులు, దక్షిణాపథంలో ఆర్యులు ప్రవేశించక మునుపున్న పరిస్థితుల్ని, ప్రజల్ని ప్రాంతాల్ని వర్ణించాడు. దక్షిణా పథంలోని ముఖ్యమైన ప్రదేశాల వర్ణన టాలమి భౌగోళిక వర్ణన వల్ల తెలుస్తుంది.

3. **చైనా యాత్రికుల రచనలు** (Writtings Accounts of the Chinese Travellers) :- చైనా యాత్రికులు భారతదేశాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకులలో చాలా ప్రముఖులు. వీరు అమూల్యమైన విషయాల్ని వ్రాత పూర్వకంగా విడిచి వెళ్ళారు. ఇత్సింగ్ (Itsing) ఫాహియాన్ (Fahien), హుయాన్‌త్సాంగ్ (Hieman-tsang) క్రీ॥శ॥ 7 వ శతాబ్దంలో మొదలైన చైనా యాత్రికులు భారతదేశాన్ని దర్శించి బౌద్ధ విశ్వ విద్యాలయాల్లో కొంత కాలం విద్యను అభ్యసించి వారు చూసిన విషయాల పై చక్కని రచనలు చేసారు. వీరిలో హుయాన్‌త్సాంగ్ ఆంధ్ర దేశాన్ని స్వయంగా దర్శించి అప్పటి బౌద్ధ మత పరిస్థితుల్ని భిక్షు సంఘాల పని తీరుని సియుకి (Siyuki) అనే గ్రంథంలో వివరించాడు. **హుయాన్‌త్సాంగ్** రచనలు ఆనాటి ఆంధ్ర దేశ చరిత్ర రచనకు చాల తోడ్పడుతుంది.

## 1.5 ప్రశ్నలు :-

1. ఆంధ్రుల చరిత్ర రచనకు తోడ్పడే సాహిత్య ఆధారాలను పేర్కొనుము.
2. ఆంధ్రుల చరిత్రను రచించుటకు తోడ్పడే ముఖ్య శాసనాలను తెల్పుము.
3. ఆంధ్రుల చరిత్రను నిర్మించుటకు తోడ్పడే విదేశీ సాహిత్యాన్ని వివరించుము.
4. ఆంధ్రుల చరిత్ర రచనలో పురాణాలు ఎలా ఉపయోగపడతాయి?
5. ఆంధ్రుల చరిత్రను రచించుటలో నాణేలు ఎలా ఉపయోగపడతాయి?
6. ఆంధ్రుల చరిత్ర రచనలో తోడ్పడే కథలు, గాథలు వివరించుము.

## 1.6 ఉపయుక్త గ్రంథాలు:-


1. Early History of Andhradesa : Rama Rao. M
2. Oxford University Press London 1960.
   Early History of Deccan, Volms I and II : Yazdani. G
3. Successors of the Satavahanas in Lower Deccan : D.C. Sircar
4. Early History of Deccan : Bhandarkar. R.G
5. The Vishnukundins and their times : S. Senkaranarayanan


పాఠ్య రచయిత
ఆచార్య. ఏలూరి కుమార స్వామి.

పాఠం - 2

# దక్షిణా పథంలో ఆర్యీకరణ

## ARYANIZATION IN DECCAN

**ముఖ్యాంశాలు:-**

2.0 లక్ష్యం
2.1 ఉపోద్ఘాతము
2.2 ఆధారాలు
2.3 దక్షిణా పథంలోని జన జీవనం (ద్రావిడ సంస్కృతి)
2.4 ఆచార వ్యవహారాలు
2.5 ఉత్తరా పథంలోని జన జీవనం
2.6 ఆచార వ్యవహారాలు
2.7 ఆర్య ద్రావిడుల మధ్య సంఘర్షణ
2.8 ఆర్యీకరణలోని ముఖ్య విషయాలు
2.9 దక్షిణా పథంలో ఆర్యీకరణ విధానం
2.10 ముగింపు
2.11 ప్రశ్నలు
2.12 చదువవలసిన గ్రంథాలు

### 2.0 లక్ష్యం:-

భారతదేశం భౌగోళికంగా ఆర్యావర్తం (ఉత్తరా పథం), దక్షిణా పథం (DECCAN) అనే భాగాలుగా విభజింపబడి పిలువబడేది. ఈ రెండు ప్రదేశాల్లోని జన జీవనం, ఆచార వ్యవహారాలు వారి మధ్య జరిగిన సాంస్కృతిక ధార్మిక సంఘర్షణలు వాటి వలన దక్షిణా పథంలో ఆర్యీకరణ వ్యాప్తిని, ఫలితాల్ని తెలియజేయడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

### 2.1 ఉపోద్ఘాతము:-

ఆర్యులు విదేశీయులని కొందరు భావించగా, వారు స్వదేశీయులని మరికొందరు తలంచారు. ఆర్యులు మెరుగైన మేని ఛాయ కలిగి వుండేవారని, యజ్ఞ యాగాలు చేసే వారని, సంస్కృత భాషను మాట్లాడే వారని, వేదాలు పురాణాలు వారి జీవనాన్ని తెలియజేస్తాయని పరిశోధకులు భావించారు. వారు పశుపాలన చెయ్యటం వలన సంచార జాతులుగ వుండే వారని భావించవచ్చు.

## 2.2 ఆధారాలు:-

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలైన రామాయణ మహా భారతాల్లో ఉత్తరాపథ భౌగోళిక వివరాలున్నాయి. దక్షిణా పథంలోను, ఉత్తరాపథంలోను నివసించే వివిధ జాతులు, వారి సంస్కృతులు, ఆచార వ్యవహారాలు వీటి ద్వారా తెలుస్తాయి. బౌద్ధ, జైన సాహిత్యాల్లో కూడా భారతదేశ భౌగోళిక వివరాలున్నాయి. వాటిలో ఉత్తర దక్షిణా పథ వివరాలు అచ్చట నివసించే ప్రజల సంస్కృతులు ఉన్నాయి.

## 2.3 దక్షిణా పథంలోని జన జీవనం (ద్రావిడ సంస్కృతి):-

"దక్షిణా పథ" ప్రస్తావన అశోకుని శాసనాల్లోను, శాతవాహనుల శాసనాల్లోను, సముద్ర గుప్తుని అలహాబాద్ శాసనంలోను కలదు. ద్రావిడ సంస్కృతి, దక్షిణా పథం భౌగోళిక పరంగా ఉత్తరా పథం కంటే భిన్నమైంది. దీని విస్తీర్ణం, ఎల్లలు వివిధ కాలాల్లో మారుతూ వచ్చాయి. ఏది ఏమైనా, వింధ్యకు దక్షిణంగా కన్యాకుమారి వరకు వ్యాపించి ఉన్న భూభాగమని తలంచవచ్చు. పడమర అరేబియా సముద్రము, తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన హిందూ మహా సముద్రము దీని ఎల్లలు. దక్షిణా పథంలో వుండే వివిధ జాతులు, ఆటవికులు, రాజ్యాలు, రాజ వంశాలు, వారి రాజధానులు శాసనాల్లో చెప్పబడ్డాయి. ఆంధ్ర, ముతిభ, శభర పిత్నిక, బోయ, పుళింద జాతుల, చోళ చేర, పాండ్య పల్లవ రాజ్యాల ప్రస్తావన వుంది.

## 2.4 ఆచార వ్యవహారాలు:-

**ద్రావిడులు:** దక్షిణా పథంలో నివసించే వారిని ద్రావిడులని అంటారు. వీరు నల్లని మేని ఛాయ కలగి నీగ్రో జాతి లక్షణాలను కలిగిన శరీర సౌష్టవం కలిగి వుంటారు. వర్ణం, అంగ సౌష్టవ పరంగా వీరు ఆర్యావర్త ప్రజల కన్నా భిన్నంగా ఉంటారు. ఉత్తరాపథ వాసుల ఆహార విహారాలు, దక్షిణా పథ వాసుల కన్నా భిన్నం. గోధుమలు, బంగాళా దుంపలు మొదలైన వాటిని ముఖ్య ఆహారంగా ఉత్తరాపథ వాసులు ఉపయోగించగా ; వరి, రాగులు, జొన్నలు ముఖ్యమైన ఆహారంగా దక్షిణాపథ వాసులు వినియోగిస్తారు. ఉత్తరాపథంలో చలి ఎక్కువగా వుండటం వల్ల ఉన్ని దుస్తులు విధిగా ఉపయోగించంగా దక్షిణా పథంలో నూలు వస్త్రాల వాడకం ఎక్కువగా వుంటుంది.

ఆర్యావర్తవాసులు ఇంద్రుడు, సూర్య, చంద్ర, దిక్పాలకులు మొదలయిన వారిని కొలుస్తారు. దక్షిణా పథంలో శివుడు, వినాయకుడు, దుర్గ అంశమైన వివిధ స్త్రీ దేవతలను పూజిస్తారు. చెట్లు, పొలిమేరలతో సహా అనేక జంతువులు - పాము, కోతి, ఎలుక, ఆంబోతు, నెమలి, సూర్యుడు, చంద్రుడు ఆరాధనకు పూజకు ఎంచుకోబడ్డాయి.

దక్షిణాపథంలో శివుడు లింగంగాను, నటరాజు గాను, ముక్కంటి గాను ఆరాధించబడ్డాడు. శివుని కుటుంబ సభ్యులైన గణపతి, కుమార స్వామి, తల్లి పార్వతి, గంగా, శివుని ఆభరణమైన నాగు పాము దక్షిణా పథ వాసుల పూజలందుకున్నాయి. ఉత్తరాపథంలోని నగర శైలి దేవాలయాలు, దక్షిణా పథంలోని ద్రావిడ శైలి దేవాలయాలు, మధ్య దేశంలోని వేసర శైలి దేవాలయాలు భిన్నమైన పూజా విధానాల్ని, నమ్మకాల్ని తెలియజేస్తాయి. దక్షిణా పథ వాసులు అటవీ సంపద పై జీవనం సాగించే సంస్కృతి కలవారు. రాతి, కొమ్ము, ఎముకలు, కర్ర పనిముట్లను ఆయుధాలుగా వుపయోగించేవారు. ఆర్యావర్తనంలోని ప్రజల వలే ఇనుప బాణాలు, అగ్ని గుండాలు మొగలైన వాటిని వుపయోగించటం వీరికి తెలియదు. ఇనుప పనిముట్ల ఆయుధాలు వీరికి తెలియవు. రాతి గొడ్డళ్ళు, గోకుడు రాళ్ళు, వడిసెలతో విసిరే రాళ్ళు, సూదిగ పదును పెట్టిన రాతి మొనలు కలిగిన బాణాలు, బరిశలు, జిగురు కండెలు, ఉచ్చులు, వలలు మొదలయిన వాటిని దక్షిణా పథంలో జీవన, రక్షణ సాధనాలుగా వాడేవారు. ఉత్తరాపథంలో వుపయోగించే ఇనుప మొన కలిగిన బాణాలు, తోలుడాలు మొదలైన పనిముట్లు, ఆయుధాలు దక్షిణా పథ వాసుల్ని ఓడించటంలో ఎంతో తోడ్పడ్డాయి.

రాతి, చెక్కతో చేసిన బరువైన గధలను కూడా ఇరు ప్రాంత వాసులు పోరులో వాడేవారు. అడవుల్లో సంచరిస్తూ ఆటవిక వుత్పత్తులను వుపయోగించుకొంటూ ప్రకృతి శక్తులను పూజిస్తూ సుఖమయ జీవనం సాగించేవారు. పూరిళ్ళు, పాకలు, చుట్టూ గుడిసెలు, గుహలు, చెట్ల తొర్రలు వారి నివాసాలు.

## 2.5 ఉత్తరాపథంలోని జన జీవనం:-

ఉత్తరా పథంలోని జన జీవనం దక్షిణాపథం కంటే భిన్నంగా వుండేది. అచ్చటి ప్రజలు యజ్ఞాలు, యాగాలు, క్రతువులు చేస్తూ దేవతలను తృప్తి పరచేందుకు నెయ్యి, పశువుల్ని యజ్ఞ యాగాల ద్వారా అర్పించుకునే వారు. వారి పశువుల్ని మేపుకొనేందుకు ఎక్కువ పచ్చిక మైదానాలు అవసరమయ్యేవి. దాని కొరకు అడవులను నరికి, కాల్చి పొలాల్ని పచ్చిక మైదానాలుగాను చేసేవారు.

## 2.6 ఆచార వ్యవహారాలు:-

ఉత్తరాపథవాసులు వెలుపలి నుంచి వచ్చిన ఆర్య జాతులగుట వలన ప్రత్యేకమైన ఆచార వ్యవహారాల్ని కలిగి వుండేవారు. వేద, పురాణ, ఇతిహాసాల్లో చెప్పబడ్డ పూజలు, యజ్ఞాలు, యాగాలు, క్రతువులు, పుణ్య పర్వదినాలు వీరు పాటించేవారు. వైదిక జీవనాన్ని అనుసరించేవారు. సంస్కృత భాషను మాట్లాడుతూ దక్షిణ పథ వాసుల కంటే భిన్నముగా జీవించే వారు. కులము, తెగ, గోత్రము, సూత్రము వీరి సామాజిక జీవనానికి పునాది రాళ్ళు. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, ఇంద్రుడు వీరికి ఆరాధ్య దైవాలు. వేదాల్లోను, పురాణాల్లోను చెప్పబడ్డ అవతారాలు, దేవుళ్ళు, దేవతలు, సూర్య చంద్రుల గ్రహణాలు, నవగ్రహాల పరిభ్రమణం, మానవ జీవనాల పై వాటి ప్రభావం పై వీరికి విశ్వాసం మెండు. పునర్జన్మ, పూర్వ జన్మలో చేసిన మంచి, చెడులు వర్తమానాన్ని, భవిష్యత్తుని నిర్ణయిస్తాయని నమ్మేవారు. పాపం, పుణ్యం, స్వర్గం, నరకం మొదలైన వాటిపై వీరికి విశ్వాసం ఉండేది. తపస్సు, ఆధ్యాత్మిక చింతన, దాన ధర్మాలు మొదలైన వాటి వల్ల స్వర్గానికి పోయే మార్గాలను వెదికేవారు.

## 2.7 ఆర్య, ద్రావిడుల మధ్య సంఘర్షణ:-

ఆర్యులు అడవుల్ని నాశనం చెయ్యడం ద్రావిడులకు కంటకమయ్యింది. అడవుల పై ఆధారపడి జీవించే దక్షిణా పథ వాసులకు తీరని నష్టం వాటిల్లింది. అడవులను నరకటం, కాల్చటం వంటి చర్యలను అరికట్టడానికి ద్రావిడులు ఆర్యులను ప్రతిఘటించారు.

స్థానికులైన ద్రావిడులు రాత్రి సైతం అడవులలో సంచరించేవారు. ఆర్యులు నిర్వర్తించే కార్యక్రమాలకు అడ్డు తగిలేవారు. యజ్ఞాలు, యాగాలు జరుగకుండా అనేక అవాంతరాలు కల్పించేవారు. అయితే ఆర్యులు ఒక పధకం ప్రకారం వారి కార్య కలాపాలను నిర్విఘ్నంగా కొనసాగించేందుకు, అమలు జరిపేందుకు, దక్షిణా పథంలోని వివిధ ముఖ్య స్థలాల్లో వారి ఉద్యోగులను, ప్రతినిధులను ఆశ్రమ స్థాపన పేరిట ముందే నియమించారు. అయోధ్య నుండి రాముడు దండకారణ్యంలో ప్రవేశించే ముందే శబరి ఆశ్రమాన్ని నెలకొల్పి రాముడు, లక్ష్మణుడు, సీత మొదలైన వారికి పండ్లతో ఆతిధ్యం యివ్వటం రామాయణ కావ్యంలో చెప్పబడింది. వశిష్టుని ఆశ్రమం, శబరి కుటీరం యింకా ఎన్నో మునుల ఆశ్రమాలు దక్షిణా పథంలో వున్నట్లు రామాయణం వల్ల తెలుస్తుంది. లంక నుండి రావణుడు, శూర్పణఖ, యింకా వానర ప్రముఖులు, జాంబవంతుడు దక్షిణా పథంలో సంచరించిన వుదంతాలున్నాయి.

శీతల ప్రదేశం నుండి వచ్చిన ఆర్యులు, ఉష్ణ మండలంలో వుండే ద్రావిడులు మొదట ఉత్తరాపథంలోను , తరువాత గంగా సింధు మైదానాలలోను, దక్షిణా పథంలోను ఒకరి నొకరు విభేదించుకొన్నారు. జీవన సంస్కృతుల్లో భిన్నత్వం ఆచార వ్యవహారాల్లో అంతరాలున్న వీరి మధ్య సంఘర్షణ, పోరాటం అనివార్యమయ్యింది. ఒకరి పై మరియొకరు తరచుగా దాడులు చేసుకొనేవారు. పోరులో మేలైన పనిముట్లు ఆయుధాలు కలిగిన ఆర్యులు దక్షిణా పథ వాసులను సునాయాసంగా అణగదొక్కారు. దక్షిణాపథంలో

ఓడిపోయి లొంగిపోయిన వారిని బందీలుగా, బానిసలుగా, సేవకులుగా మార్చేవారు. చిరకాలం సాగిన ఆర్య ద్రావిడ పోరాటంలో గెలుపు ఓటములు శాశ్వతంగా వుండేవి కావు. వారి పోరాట, సంఘర్షణ కాలంలో ఒకరి బలాబలాలు ఒకరి ఆచార వ్యవహారాలు మరియొకరు తెలుసుకున్నారు. దాని వల్ల ఆచార వ్యవహార సాంస్కృతిక జన జీవనంలో ఉభయులు ప్రభావితులయ్యారు. ఆర్యుల ఆచార వ్యవహారాలు దక్షిణ పథంలో అనుసరించటం వల్ల దక్షిణ పథంలో ఆర్యీకరణ వ్యాప్తిలోకి వచ్చింది. దీని వల్ల స్థానికులైన ద్రావిడులు ఆర్యుల ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, వస్త్ర అలంకారాలు, పండుగలు, పబ్బాలు, పూజలు మొదలైనవి అనుసరించసాగారు. వాల్మీకిచే వ్రాయబడిన రామాయణంలో ఆర్యుల ద్రావిడుల మధ్య జరిగిన జీవన సాంస్కృతిక, ధార్మిక సంఘర్షణ సంస్కృతుల భిన్నత్వం తెలుస్తుంది.

## 2.8 ఆర్యీకరణలోని ముఖ్య విషయాలు:-

ఆర్యుల రాకతో వారి సంఘర్షణ సంపర్కాల వల్ల ద్రావిడ దక్షిణా పద జన జీవనంలో సాంస్కృతిక ధార్మిక విషయాల్లో అనేక మార్పులు వచ్చాయి. ఉత్తరా పథంలోని అనేక ఆచార వ్యవహారాలను దక్షిణా పథవాసులు అనుసరింపనారంభించారు. దేవతారాధన, దేవాలయ నిర్మాణం, పండుగలు, పబ్బాలు, వస్త్రాలంకరణ, ఆభరణాల అలంకరణలలో ఉభయులు ప్రభావితులయ్యారు. సతీ సహగమనాలు ఆర్యవర్తంలోని వైదిక ఖర్మకాండలు మనుస్మృతులలోను రామాయణ మహాభారతంలోను పేర్కొన్న ఉదంతాలను దక్షిణా పథవాసులు అనుసరింపనారంభించారు. దాని ఫలితంగా వర్ణాలు, కులాలు లేని దక్షిణా పథంలో వృత్తుల ప్రాతిపదికగా కులాలు, ఉపకులాలు ఏర్పడ్డాయి. అస్పృశ్యత ఎరుగని దక్షిణా పథ వాసులకు ఆర్య సంపర్కం వల్ల అంటరానితనం అనే ఒక విధానం అమలులోకి వచ్చింది. ఆర్యీకరణ వలన ఉభయ సంస్కృతుల వారు ప్రభావితులయ్యారు.

## 2.9 దక్షిణాపథంలో ఆర్యీకరణ విధానం:-

బ్రాహ్మణ సాహిత్య కాలం నుండి ఆర్యులు దక్షిణాపథంలో ప్రవేశించడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రామాయణ కాలం నాటికి దక్షిణా పథంలో ఆర్యుల రాక, ప్రభావం జరిగింది. అయితే అంతకు ముందు కాలానికి చెందిన అగస్త్యముని రంగ ప్రవేశం చేసి దక్షిణాపథంలో ఆర్య సంస్కృతిని విస్తరింపజేయటానికి ప్రయత్నించాడు. ఆర్యావర్తనానికి దక్షిణాపథానికి మధ్య అనుసంధానం చేసినవాడు అగస్త్యుడు. ఈ ప్రయత్నంలో అగస్త్యుడు ఆర్యేతరులైన స్థానికుల ప్రతిఘటనల్ని ఎదుర్కొనవల్సి వచ్చింది. వింధ్య ప్రాంతాన్ని అగస్త్యుడు జయించి స్వాధీన పరుచుకున్నట్లు 15 వ శతాబ్దికి చెందిన శ్రీనాథుని భీమేశ్వర పురాణం చెప్తుంది. అగస్త్యునితో ఈ ఆక్రమణ ఆగలేదు. అగస్త్యుని తర్వాత అయోధ్య పాలకుడైన రాముడు తన వనవాసం పేరుతో దక్షిణాపథంలో పర్యటించాడు. దీనివల్ల అరణ్యాల్లో అనేక మున్యాశ్రమాలు, కుటీరాలు, పర్ణశాలలు వెలిశాయి. వీటిలో పాఠశాలలు, వేద అధ్యయన, యోగ కేంద్రాలు విరివిగా నడుపబడ్డాయి. వీటివల్ల దక్షిణా పథంలో ఆర్యభావాలు, ఆర్య సాహిత్యం, ధర్మం, ఆర్య జీవనం వ్యాపించాయి. అయితే ఆర్య సాంస్కృతిక వ్యాప్తిని అనార్య నాయకులు అడ్డుకొన్నారు. మారిచ, సుబాహు, వాతాపి మొలైన అటవిక నాయకులు ఆర్యుల ప్రవేశాన్ని నిరోధించి ఆర్యుల యజ్ఞ యాగములకు విఘ్నము కలిగించారు. అయోధ్య పాలకులు ఇక్ష్వాకు వంశస్థులు. దాన్ని అనుసరించి అధికారం చెలాయించుటకు విజయపురిలో ఇక్ష్వాకు వంశనామాన్ని ధరించి ఇక్ష్వాకులు అనబడే రాజులు పాలించారు.

నాగార్జున కొండలో లభ్యమైన శిల్పాల అంగ సౌష్టవమును అధ్యయనం చేసిన డా॥ కె. కృష్ణమూర్తి గారు ఇక్ష్వాకులు స్థానిక ఆటవికులైన చెంచులేనని అభిప్రాయపడినారు. దీనిని బట్టి స్థానికులు, ఆర్యేతరులైన చెంచులు ఆర్య సంపర్కం వలన పాలకులు రాజ్యాధినేతలుగా మారిరని తెలియుచున్నది. ఇక్ష్వాకు వంశానికి చెందిన ఇద్దరు రాజకుమారులు అసక, ములక అనేక జన పదాలను పాలించినట్లు వాయు పురాణం చెప్తుంది. మరో ఇక్ష్వాకు యువరాజు దక్షిణా పథంలో ప్రతీపాల పుర రాజ్యాన్ని (భట్టిప్రోలు గుంటూరు జిల్లా) నిర్మించెనని జైన 'ధర్మ మహాపాత్ర' తెలియజేస్తుంది. అయితే ఆర్యీకరణ కొన్ని పద్ధతుల్లో అమలు జరుపబడినదని తెలుస్తుంది. దక్షిణా పథంలో ఆర్యీకరణ జరిగిన తీరు తెన్నులు ఈ క్రింది విధంగా జరిగి ఉండవచ్చు. ఆర్యులు తమ విధానాలను

దక్షిణా పథంలో వ్యాప్తి చేసే తరుణంలో దక్షిణా పథంలోని ఏ సంస్కృతిని పెకిలించ లేదు, నాశనం చెయ్యలేదు. ఆర్యీకరణ దక్షిణా పథవాసుల, ఆర్యుల మధ్య జరిగిన ఒక సాంస్కృతిక సమ్మేళనమే. దీనిలో బల ప్రయోగం కనిపించదు. దక్షిణా పథంలో ఆర్యీకరణ ఉత్తరా పథంలో చోటు చేసుకున్న ఆర్యీకరణను జ్ఞప్తికి తెస్తుంది. పరాశనుడు, సంతనుడు ఆర్యేతర స్త్రీల వలన సంతానాన్ని పొంది వారికి సంఘంలో గౌరవాన్ని కలిగించారు. దక్షిణా పథంలో ఆర్యీకరణను ఆరంభించిన అగస్త్యుడు శివ భక్తుడట. ఇతడు దక్షిణా పథంలో పలుచోట్ల శివ ప్రతిమలు స్థాపించెనట. ఈ ఆర్యీకరణ ప్రక్రియ పరాకాష్ట వాల్మీకి, వ్యాసులను ఆర్యుల పవిత్ర సాహిత్య స్రష్టలుగా గుర్తించడంతో ముగుస్తుంది.

వాస్తవానికి ప్రాచుర్యంలో ఉన్న ఉదంతం ప్రకారం మహాభారతాన్ని వేదాల్ని రచించిన వ్యాసుడు, మత్స్య కన్యకు బ్రాహ్మణుని వల్ల జన్మించిన వాడు. రామాయణం రచించిన వాల్మీకి సైతము బ్రాహ్మణ కులానికి చెందిన వాడు కాదు. ఇతడు బోయ అనే ఆటవికునికి పుట్టినవాడు. దక్షిణా పథంలో ఆర్య విధానాలకు ఆమోద ముద్ర వేయించుకొనుటకై అనార్య సంతతి వారైన వాల్మీకి, వ్యాసులకు గ్రంథకర్తలుగా చిత్రీకరించారని అనుటలో సందేహం లేదు.

దక్షిణా పథంలో సైతం అనార్యుల ఆచార వ్యవహారాలను కొద్దిగా సంస్కరించి ఆర్యులు అనుసరింపసాగారు. స్థానిక, ఆటవిక, అనాగరిక దేవుళ్ళను శివ గణంగా గుర్తించారు. శివుడు చుట్టూ ఉండే గణాలు యక్ష, కిన్నెర, కింపురుష, నాగ, పైశాచ, గంధర్వాదులు ఉంటారు. వీరందరు అనాగరిక ఆటవికులే. శివుని కుటుంబంలో వీరిని చేర్చడం ఆర్యీకరణలోని అంతర్భాగమే. అయితే ఈ ప్రక్రియలో ఆర్యులు స్థానికులు నమ్మకాలను నియమాలు ఆచార వ్యవహారాల జోలికి పోకుండా వాటిని మలి దశలో హిందూ మత అంతర్భాగంగా మార్చారు.

దక్షిణా పథ వాసులకు గోత్ర, సూత్ర, ప్రవరలు లేవు. వారు వైదిక కర్మ కాండలను చేయవల్సి వచ్చినప్పుడు వాటిని నిర్వర్తించేందుకు బ్రాహ్మణ పండితులను వినియోగించవలసి వచ్చెడిది. దక్షిణా పథంలో రాజ వంశాలకు ప్రజామోదం తెచ్చుకునేందుకు రాజసూయ, అశ్వమేధ మొదలైన యజ్ఞాల్ని క్రతువుల్ని బ్రాహ్మణ యాజమాన్యంలో జరిపించారు. దాని కొరకు గోత్ర, సూత్ర, ప్రవరలు దక్షిణా పథ వాసులకు అలంకరించారు. ప్రతీ వైదిక కార్యక్రమానికి గంగా జలం, దర్భలు, వేద మంత్రాలు అవసరమయ్యేవి.

ఆ విధంగా గంగ నుండి కన్యాకుమారి వరకు గంగా జలాన్ని బ్రహ్మణ పండితుల్ని రప్పించడం తప్పని సరి అయ్యింది. దక్షిణా పథంలో ముందెన్నడూ లేని ఆర్య ధర్మాలకు, ఆచార వ్యవహారాలకు ఆదరణ, ఆమోద ముద్ర లభించాయి. సంఘర్షణ, ప్రతిఘటన, తిరుగుబాట్లతో ఆరంభమైన ఆర్య, అనార్య పోరాటం కాల క్రమేణ భేదాలను విస్మరించి సహజ జీవనానికి అలవాటుపడింది.

## 2.10 ముగింపు:-

ఇంతవరకు శాంతియుతంగా సహజీవనం సాగించిన దక్షిణా పథ వాసులు ఆర్యుల ప్రవేశంతో అశాంతికి గురయ్యారు. అడవుల నరికివేత, జంతువుల వేట, యజ్ఞ యాగాల పేరిట అడవులను కాల్చుట వల్ల స్థానికులు భయ భ్రాంతులయ్యారు. ఆర్యులు వాడిన ప్రాణాంతకమైన ఇనుప బాణాలు స్థానికుల గధా బలం కంటే శక్తివంతనవి. మత గురువులు లేని దక్షిణా పథంలో కుల పెద్దలు క్రమేణ మత గురువులుగా గుర్తించబడ్డారు. వ్యవసాయం చేసే వారిని, వర్తకం చేసే వారిని వైశ్యులు గాను, సేవకావృత్తులననుసరించే వారిని శూద్రులు గాను, అంత కంటే నిమ్నమైన వృత్తులను బలవంతం పై చేసే వారిని అతి శూద్రులని అంటారు.

## 2.11 ప్రశ్నలు:-

1. ఆర్యీకరణ అనగానేమి?
2. దక్షిణా పథంలో ఆర్యీకరణను వివరించడానికి తోడ్పడే మూలాధారములు ఏవి?
3. ఆర్యీకరణ వలన దక్షిణ పథంలో వచ్చిన వివిద రకాల మార్పులను తెలియజేయండి.

4. దక్షిణ పథంలో ఆర్యీకరణను తెలిపే (ఉదంతాలు) రామాయణ, మహాభారతాల నుంచి ఉదహరించండి.
5. ఆర్యీకరణ వలన దక్షిణ పథం పై ప్రభావాన్ని తెల్పండి?
6. దక్షిణ భారతంలో ఆర్యీకరణను వివరించుము?

## 2.12 ఉపయుక్త గ్రంథాలు:-


1. Yazdani, G : The Early History of Deccan 2 Volumes (ed) Oxford University Press London 1960
2. Gopalachari, K : Early History of Andhra Country
3. Subramanian, K.R. : Buddhist Remains in Andhra and the history of Andhra Between 225 & 610 A.D. Madras 1989.
4. Kumara Swamy, Y. : History of Andhras and Culture
5. Gulam Gapadani : Early History of Deccan Vol I. (ed)


ఏలూరి కుమార స్వామి

పాఠం - 3

# ఆంధ్ర శాతవాహనులు

**ఉపోద్ఘాతం:-**

మౌర్య సామ్రాజ్య పతనానంతరం దక్షిణా పథంలో రాజ్య స్థాపన చేసిన వారు శాతవాహనులు. శాతవాహన అధికార స్థాపన దక్షిణ భారతదేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రాంభించింది. సుస్పష్టమైన దక్షిణా పథ చరిత్ర శాతవాహనుల విజృంభణతోనే ప్రారంభమైంది. వీరు దక్షిణా పథానికి రాజకీయ ఐక్యము సాధించడమే గాక శక దండ యాత్రల నుండి కాపాడి శాంతి భద్రతలు చేకూర్చారు. దక్షిణ భారతదేశానికి సంబంధించిన ఏ రాజ వంశం స్థాపించనంత సామ్రాజ్యాన్ని స్థాపించారు. వీరి పాలనా కాలంలో ఆర్థిక ప్రగతి, సాంస్కృతిక అభ్యుదయం సాధించబడింది. ఉత్తర దక్షిణ దేశాల మధ్య వీరు సాంస్కృతిక సమన్వయం సాధించారు. సారస్వత కళారంగాలలో వీరు ఉన్నత సాంప్రదాయాలను ప్రవేశ పెట్టారు. ఈ కాలపు కొన్ని నిర్మాణాలు భారతదేశ వాస్తు, శిల్ప కళలల్లోనే అత్యున్నత కళాఖండాలుగా పరిగణింపబడుతున్నాయి. వీరి కాలంలో విదేశీ వాణిజ్యం బాగా అభివృద్ధి చెందటం వలన బర్మా, సుమత్ర మొదలగు దేశాలలో భారతీయ వలసలేర్పడి, ఆ దేశాలకు భారతీయ సంస్కృతి, మతం, భాషలు వ్యాపించాయి. శాతవాహనులు బలహీనులవడంతో క్రీ॥శ॥ 3 వ శతాబ్దంలో వారి పశ్చిమోత్తర ప్రాంతాన్ని అభీరులు, తూర్పు ప్రాంతాన్ని ఇక్ష్వాకులు, నైరుతి ప్రాంతాన్ని చుటు వంశీయులు, ఆగ్నేయ ప్రాంతాన్ని పల్లవులు స్వాధీనం చేసుకొన్నారు. శాతవాహనుల పతనంతో వారు ప్రసాదించిన రాజీకయ ఐక్యత విచ్ఛిన్నమయినా, వారు మతంలో, భాషలో, శిల్పంలో ప్రారంభించిన సాంప్రదాయాలు కొనసాగి సాంస్కృతిక సమైక్యత వర్ధిల్లింది. ఒక్క మాటలో చెప్పాలంటే శాతవాహనుల కాలంలో దక్షిణా పథంలో అన్ని రంగాలలో సర్వతో ముఖాభివృద్ధి సాధించబడింది.

## 3.1 శాతవాహన చరిత్ర - ఆధారాలు

**ప్రధానాంశాలు:-**

3.0 లక్ష్యం

3.1 ఉపోద్ఘాతం

3.2 శాసనాలు

3.3 నాణేలు

3.4 వాస్తు నిర్మాణాలు

3.5 స్వదేశీ రచనలు

3.6 విదేశీ రచనలు

3.7 ముగింపు

## 3.0 లక్ష్యం:-

ప్రప్రథమ ఆంధ్ర సామ్రాజ్య నిర్మాతలు శాతవాహనులు. పురాణాలలో ప్రస్తావించబడిన 'ఆంధ్ర భృత్యులు', 'ఆంధ్ర జాతీయులు' శాసనాలలోను, నాణేల పైన పేర్కొనబడిన శాతవాహన శబ్దంతో కలిపి 'ఆంధ్ర శాతవాహనులు'గా చరిత్రకారులు గుర్తించారు. ఆంధ్ర శాతవాహనుల చరిత్రను తెలుసుకునేందుకు ఉపయోగపడే ఆధారాల గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 3.1 ఉపోద్ఘాతం:-

ఆంధ్రదేశాన్ని పాలించిన ప్రప్రథమ రాజులు శాతవాహనులు, 30 మంది ఆంధ్ర రాజులు సమారు 450 సంవత్సరాలు పరిపాలించినట్లు పురాణాలు చెప్తున్నాయి. శాసనాలు, నాణేలలో పేర్కొనబడిన శాతవాహనులు, పురాణాల్లో ప్రస్తావించబడిన ఆంధ్ర రాజులు ఒక్కరే. అందువల్ల వీరిని ఆంధ్ర శాతవాహనులని అంటారు. వీరి చరిత్రను పునర్నిర్మించడానికి లభ్యమగు ఆధారాలలో ప్రధానమైనవి శాసనాలు, నాణాలు, వాస్తు నిర్మాణాలు, స్వదేశీ రచనలు, విదేశీ రచనలు.

## 3.2 శాసనాలు:-

శాతవాహనుల చరిత్ర పునర్నిర్మాణానికి శాసనాధారాలు చాలా అమూల్యమైనవి. శాతవాహనుల నాటి శిలా శాసనాలు మహారాష్ట్రములో ఎక్కువగా, ఆంధ్ర దేశంలో తక్కువగా లభ్యమయ్యాయి. వీరి శాసనాలు బ్రహ్మీ లిపిలో ప్రాకృత భాషలో వ్రాయబడినవి. కన్హేరి, కార్లే, నాసిక్ గుహలలోని శాసనాలు, నాగనిక నానేఘాట్ శాసనం, గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనం, భారవేలుని హతి గుంఫా, గుంటుపల్లి శాసనాలు, ఋగ్రదాముని జునాఘడ్ శాసనం, అమరావతి, చినగంజాం, నాగార్జున కొండ మొదలగు చోట్ల లభ్యమైన శాసనాలు శాతవాహనుల కాలం నాటి చరిత్రకు ఉపయోగపడుతున్నాయి.

## 3.3 నాణేలు:-

శాసనాల తరువాత కొంత వరకు నాణేలు శాతవాహనుల చరిత్ర నిర్మాణానికి ఉపయోగంగా ఉన్నాయి. శాతవాహనుల నాణేలు దక్కన్ పీఠభూమి అంతటా లభించాయి. శాతవాహనుల నాణేల వల్ల ఆ నాణాలు వేయించిన రాజుల పేర్లు, రాజ ముద్రికలు తెలుస్తాయి. ఈ నాణాలు సీసము, రాగి, పోటిన్ (రాగి + సీసం) అనే మిశ్రమ లోహం తోనూ, వెండితోనూ చేయబడినవి. ఈ నాణేల మీద రాజుల పేర్లతో పాటు ఉజ్జయినీ చిహ్నము (.+.), సింహ, గజ, అశ్వ, చైత్య, పర్వత, నౌకా ప్రతిమలలో ఏదో ఒకటి ముద్రింపబడి ఉంటుంది. జోగల్ తంబి వద్ద లభ్యమైన గౌతమీపుత్ర శాతకర్ణి ప్రతి ముద్రిత నాణాల వల్ల అతడు నహపానుని నిర్మూలించిన విషయం స్పష్టమవుతుంది. నౌకా చిహ్నమున్న యజ్ఞశ్రీ నాణేలు సముద్రాధిపత్యాన్ని, నౌకా వ్యాపారాన్ని సూచిస్తున్నాయి. ఆంధ్రలో అనేక ప్రాంతాలలో దొరికిన రోమన్ బంగారు నాణాలు శాతవాహనుల నాటి అంతర్జాతీయ వాణిజ్య వైభవాన్ని చాటుతున్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి కాలం నుంచి శాతవాహనుల వెండి నాణాల పై ప్రాకృతం, దేశీ భాషలు అనే రెండు భాషలో రాజుల పేర్లు కన్పిస్తాయి. వాటిలో దేశ భాష నేటి తెలుగు భాషకు సన్నిహితంగా ఉందని సర్కార్ పండితుని అభిప్రాయం.

## 3.4 వాస్తు నిర్మాణాలు:-

శాతవాహనుల కాలం నాటి వాస్తు నిర్మాణాలలో దుర్గాలు, గుహాలయాలు, స్తూపాలు, తోరణాలు వున్నాయి. ధరణికోట, హిందూపురం మొదలగు చోట్ల శాతవాహనుల నాటి కోటలు బయల్పడినాయి. వర్తకులు, ధనికులైన స్త్రీలు విశేషంగా బౌద్ధాన్ని ఆదరించి పోషించినందువల్ల ఈ కాలంలో స్తూపాలు, చైత్యాలయాలు, విహారాల నిర్మాణం విరివిగా సాగింది. భట్టిప్రోలు, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల, నాగార్జున కొండ, గోలి, చందవరం మొదలగు చోట్ల స్తూప విహారాలు వెలిశాయి. ఇవన్ని నాటి వాణిజ్య కేంద్రాలైన పట్టణాలకు దగ్గరగా, రహదారుల మీద నిర్మించబడ్డాయి. నాటి స్తూపాలలో ప్రపంచ ఖ్యాతి గడించినది అమరావతి స్తూపం. సాంచి స్తూపం యొక్క నాలుగు తోరణ ద్వారాలు ఈ కాలం నాటివే. మహారాష్ట్రలో కార్లే, కన్హేరీ, నాసిక్ మొదలగు చోట్ల

గల గుహాలయాలు ఈ కాలం నాటివే. స్తూపాలు, విహారాలు బౌద్ధ శిల్పాలతో అలంకరించబడింది. ఈనాటి వర్ణ చిత్రాలు **అజంతాలోని 9, 10** సంఖ్య గల గుహలలో కలవు. చిత్తూరు జిల్లా గుడిమల్లంలో గల పరశురామేశ్వరాలయంలోని లింగం ఈ కాలం నాటిదే.

## 3.5 స్వదేశీ రచనలు:-

శాతవాహనుల చరిత్ర పునర్నిర్మాణానికి ఉపయోగపడే దేశీయ వాఙ్మయంలో మొదట పేర్కొనదగినవి పురాణాలు. వాయు, మత్స్య, భవిష్య, విష్ణు పురాణాలలో శాతవాహన రాజుల ప్రసక్తి కలదు. మత్స్య, వాయు పురాణాలలో రాజుల పేర్లతో బాటు, ఒక్కో రాజు ఎంత కాలం పాలించినది చెప్పబడింది. కాని అంతర్గతంగా, పరస్పర వైరుధ్యాలతో ఉన్న పురాణాలలోని విషయాలను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి.

శాతవాహనుల కాలం నాటి వాఙ్మయం ప్రధానంగా ప్రాకృత, సంస్కృత భాషలలో ఉన్నది. కుతూహలుని లీలావతి కావ్యం, గుణాఢ్యుని బృహత్కథ, హాలుడు సంకలనం చేసిన గాథా సప్తశతి, శర్వవర్మ రచించిన కాతంత్ర వ్యాకరణం, వాత్స్యాయనుని కామసూత్రాలు శాతవాహన కాలం నాటి గ్రంథాలలో పేర్కొనదగినవి. శాతవాహన రాజుల గూర్చి ప్రజలలో వ్యాప్తిలో ఉన్న కథలూ, గాథలూ కూడా చరిత్ర రచనకు తోడ్పడుతున్నాయి.

## 3.6 విదేశీ రచనలు:-

శాతవాహనుల కాలంలో ఆంధ్రులు గ్రీక్, రోమ్ వంటి దేశాలతో వాణిజ్యం చేస్తూ ఉండేవారు. విదేశాలకు చెందిన రచయితలు భారతదేశాన్ని గురించి విన్నవాటిని, చూసిన వాటిని గ్రంథస్థం చేసేవారు. అటువంటి రచనలలో మెగస్తనీస్ వ్రాసిన **'ఇండికా'**, ప్లినీ వ్రాసిన నేచురల్ హిస్టరీ, పేరు తెలియని నావికుని 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ అనే గ్రంథం, టాలెమీ 'భూగోళ శాస్త్రం' ప్రధానమైనవి. క్రీ॥శ॥ తొలి శతాబ్దాల నాటి ప్లినీ, టాలెమీ, అజ్ఞాత గ్రీకు నావికుడు తమ రచనలలో పేర్కొన్నారు.

## 3.7 ముగింపు:-

శాతవాహనుల చరిత్ర పునర్నిర్మాణానికి ఉపయోగపడే సాధన సామగ్రి అపారంగానే ఉంది. అయితే ఇది అసమగ్రంగా ఉండడంతో చరిత్రకారుడు విషయ సమన్వయంలో అనేక చిక్కులను ఎదుర్కొంటున్నాడు. నూతనంగా బయల్పడుతున్న కొత్త విషయాలను పరిగణనలోకి తీసుకొంటూ కొత్త వ్యాఖ్యానాలతో చరిత్ర కారులు శాతవాహనుల చరిత్రను సమగ్రంగా రూపుదిద్దే ప్రయత్నం కొనసాగిస్తూ ఉన్నారు.

పాఠం - 3.1

# ఆంధ్రులు - శాతవాహనులు ఒకరేనా?

ప్రధానాంశాలు:-

3.1.0 లక్ష్యం

3.1.1 ఉపోద్ఘాతం

3.1.2 వంశనామం

3.1.3 వర్ణం

3.1.4 శాతవాహనుల జాతి

3.1.4.1 శాతవాహనులు ఆంధ్రులే

3.1.4.2 శాతవాహనులు ఆంధ్రులు కారు

3.1.5 ఆంధ్ర శాతవాహనుల ఆదిమ స్థావరం

3.1.6 బళ్ళారి వాదం

3.1.7 విదర్భ వాదం

3.1.8 మహారాష్ట్ర వాదం

3.1.9 ఆంధ్ర వాదం

3.1.10 శాతవాహనుల కాలాను క్రమణిక

3.1.11 ముగింపు

## 3.1.0 లక్ష్యం:-

శాతవాహనులు ఎవరు, ఎక్కడివారు, వారి వంశ నామం, వర్ణం గురించి తెలియజేయుటే ఈ పాఠం లక్ష్యం.

## 3.1.1 ఉపోద్ఘాతము:-

శాతవాహన సామ్రాజ్య స్థాపనతో దక్షిణ భారతదేశంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. సుమారు 450 సంవత్సరాల కాలం వీరు దక్షిణాపథాన్ని విదేశీ దాడుల నుండి రక్షించి శాంతి భద్రతలను ప్రసాదించారు. శాతవాహన చరిత్ర పునర్నిర్మాణానికి తగినన్ని ఆధారాలు లభిస్తున్నప్పటికీ అవి అసమగ్రం కావడంతో వారి చరిత్రకు సంబంధించి పలు విషయాలు వివాదాస్పదంగానే ఉన్నవి. శాతవాహనుల జాతి, కులము, జన్మ స్థలము, కాలము మున్నగు విషయాలలో చరిత్ర కారులలో ఏకాభిప్రాయం లేదు.

### 3.1.2 వంశనామం:-

శాసనాల్లో, నాణేల పై గల ఆఖ్యల్లో ఈ రాజుల వంశ నామం శాతవాహన, సదవాహన అని కన్పిస్తుంది. రష్యా దేశస్థుడు, భాషావేత్త అయిన ప్రిజులిస్కి పండితుడు ముండా భాషను అధ్యయనం చేసి శాతవాహన పదానికి అర్థం గుర్రం కుమారుడని అభిప్రాయపడినాడు. జిన ప్రభసూరి అనే జైన పండితుడు తన గ్రంథమైన 'ప్రతిష్టానపురకల్ప, లో శత సంఖ్యలో వాహనాలు కలవారు అయి ఈ రాజులు శాతవాహనులుగా ప్రసిద్ధి కెక్కినట్లు వ్రాశాడు. శాలివాహన పదం శాతవాహన రూపానికి అపభ్రంశమని హేమచంద్రుడు పేర్కొన్నాడు. సంస్కృత భాషలో శాలి అను పదానికి వరి అని అర్థం కాబట్టి కొందరు పండితులు వీరు వరి పండించే రైతులని భావించారు. శాత అనే యక్షుని వాహనంగా కలవాడు శాతవాహనుడని కథా పరిత్యాగరం పేర్కొన్నది. అభిదాన చింతామణిలో శాతవాహన పదానికి సుఖప్రదమైన వాహనం కలవాడని అర్థం గలదు. సతం అనే పదానికి పొందినవారని అర్థం కూడా ఉన్నట్లు మౌర్యుల నుంచి వాహనాలను పొంది శాతవాహనులని ప్రసిద్ధికెక్కారని కె. గోపాలాచారి అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇటీవల శాతవాహన శబ్దాన్ని కొంచెం మార్పుతో సప్త వాహనంగా చదివి సూర్య సంబంధమైన అర్థాన్ని రాబట్టారు. వీరి నాణేల పై కన్పించే ఉజ్జయిని చిహ్నం సూర్యుని సంకేతమని వీరి భావం. శాతవాహనుడు వంశకర్తగా చెప్పబడినాడు. అతని తరువాతి రాజులు కూడా శాతవాహన బిరుదాన్ని ధరించారు. శాతవాహన వంశనామంగా, బిరుదంగా ఉపయోగపడింది. పురాణాల్లో కూడా శాతవాహనుల శాసనాల్లోనూ, నాణేల పైనా లభ్యమైన పేర్లే చెప్పబడ్డాయి. అయితే పురాణాలు వీరిని ఆంధ్ర భృత్యులని, ఆంధ్ర జాతీయులని చెప్పాయి. అందువల్ల శాసనాల్లోని శాతవాహనులను, పురాణాల్లోని ఆంధ్రులు ఒకరేనని భావించి ఆంధ్ర శాతవాహనులనే సమైఖ్య నామాన్ని చరిత్ర కారులు రూపొందించారు.

### 3.1.3 వర్ణం:-

శాతవాహముల వర్ణం విషయమై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు కలవు. గౌతమీపుత్ర శాతకర్ణి ఆగమనిలయుడని, ఏక బ్రాహ్మణుడని బిరుదులు ధరించాడు. వాశిష్ట , గౌతమాది గోత్రాల బ్రహ్మణులు శాతవాహనులకు తమ కుమార్తెలనిచ్చి వివాహం చేసారు. బౌద్ధం ప్రబలిన ఆ రోజుల్లో ఉత్తర భారతంలో మౌర్యుల తరువాత శుంగులు, కాణ్వాజులు రాజ్యాలు స్థాపించినట్లే వైదిక మత పునరుద్ధరణకు శాతవాహనులు రాజ్యాన్ని స్థాపించారు. దీనికి సాక్ష్యం నానేఘాట్ శాసనం. శాతకర్ణి అనేక వైదిక క్రతువులు చేసినట్లు పేర్కొనడమే. వీటన్నింటిని బట్టి శాతవాహనులు బ్రాహ్మణులని కొందరు చరిత్రకారులు పేర్కొన్నారు. అయితే మరికొంత మంది చరిత్ర కారులు శాతవాహనులు క్షత్రియులని పేర్కొన్నారు. శాతవాహనులు క్షత్రియోచిత అశ్వమేధ, రాజసూయాది క్రతువులు చేయడం, నాసిక్ శాసనంలో బాలశ్రీని రాజర్షి వధూ అని పేర్కొనడం దీనికి సాక్ష్యాలుగా వీరు పేర్కొన్నారు. అలాగే 'ద్వాత్రింశల్ పుత్తళిక' గ్రంథం శాతవాహనుడు లేదా శాలివాహనుడు బ్రాహ్మణ, నాగ సంయోగం వల్ల జన్మించాడని పేర్కొంటున్నది. శాతవాహనులు స్థానిక నాగ రధిక జాతులతోను, శక క్షాత్రప విదేశీ జాతులలోను వివాహ సంబంధాలు కలిగి ఉన్నట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. కనుక శాతవాహనులు స్థానిక అనాద్య జాతివారు.

### 3.1.4 శాతవాహనుల జాతి:-

శాతవాహనులు ఎవరు, వారు ఏ జాతికి చెందిన వారు అను విషయంలో కూడా పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు గలవు. 30 మంది ఆంధ్రులు లేక ఆంధ్ర భృత్యులు 450 సంవత్సరాలు పాలించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శాసనాలు, నాణేలు సిముక సాతవాహనుడు, కృష్ణుడు, మొదటి శాతకర్ణి, రెండవ శాతకర్ణి, అపేలకుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి మొదలగు రాజులను శాతవాహన కులజులుగా పేర్కొంటున్నాయి. పురాణాలలో ఇచ్చిన పేర్లు, శాసనాలలో పేర్కొన్న శాతవాహన కులంలోని పేర్లు సరిపోతున్నాయి. ఈ రెండు పట్టీలలోని పేర్లు దగ్గరగా, ఒకే విధంగా ఉండటం వల్ల కొందరు పండితులు శాసనాలలోని శాతవాహనులు, పురాణాలలోని ఆంధ్రులు ఒక్కరేనని అభిప్రాయపడినారు. అయితే ఈ వాదాన్ని కొందరు పండితులు అంగీకరించలేదు. శాసనాలలో గాని, నాణేలలో గాని శాతవాహనులు ఆంధ్రులని పేర్కొనబడలేదు. అలాగే

పురాణాలలోకూడా ఆంధ్రులు శాతవాహనులు ఒక్కరేనని చెప్పలేదు. ఇందువల్ల కొందరు శాతవాహన వంశం ఆంధ్ర వంశం కాదనీ వీరు మహారాష్ట్రులని పేర్కొంటున్నారు.

**3.1.4.1 శాతవాహనులు ఆంధ్రులే:-** భండార్కర్, బర్గెస్, స్మిత్, రాప్సన్, చార్నెట్ మొదలగు పండితులు శాతవాహనులు ఆంధ్రులేనని పేర్కొన్నారు.

కొన్ని పురాణాలలో ప్రస్తావించబడిన ఆంధ్ర భృత్యవంశం, శాతవాహన వంశం ఒకటేనని భండార్కర్ పేర్కొన్నాడు. ఒకప్పుడు సేవకులుగా ఉన్న ఆంధ్రులు శ్రీముఖుని నాయకత్వంలో రాజ్యస్థాపన చేసారని, వారి మొదటి రాజధాని గుంటూరు జిల్లాలోని ధాన్యకటకమని పేర్కొన్నాడు.

" క్రీ॥పూ॥ 2 వ శతాబ్దం నుంచి క్రీ॥శ॥ 2 వ శతాబ్దం వరకు అనగా 400 సంవత్సరాలు ఆంధ్రులు లేదా శాతవాహనులు రాజ్యమేలినారని వారి విజయ యాత్రలు ఉత్తర భారతంలో చాలా వరకు, పశ్చిమ తీరానికి వ్యాప్తి చెందినవనీ, వారి మొదటి రాజధాని మచిలీ పట్టణానికి 19 మైళ్ళ దూరంలో వున్న శ్రీకాకుళమని, సుమతి అనే రాజు ఆ పట్టణం నిర్మించెననీ, ఆ తరువాత రాజధానిని ధాన్యకటకానికి, ఆ పైన మరికొన్ని చోట్లకు మార్చడం జరిగింది " అని బర్గెస్ అభిప్రాయపడినాడు.

" సైనిక శక్తిలో మౌర్యుల తరువాత చెప్పదగిన ఆంధ్రులు మెగస్తనీస్ కాలంలో గోదావరీ, కృష్ణా మండల వాసులనీ వారి రాజధాని శ్రీకాకుళమనే నమ్మకమని, అశోకుని కాలంలో సామంతునిగా ఉన్న ఆంధ్ర రాజు అశోకుని చివరి దశలో గాని, క్రీ॥పూ॥ 240 లేక క్రీ॥పూ॥ 230 ప్రాంతంలో శ్రీముఖుని నాయకత్వంలో స్వతంత్రులైనారనీ, అచిర కాలంలోనే వారి అధికారం పడమర నాసిక్ వరకు వ్యాపించినదని, చాలా మంది రాజులు శాతకర్ణి అనే బిరుదు ధరించారని " స్మిత్ పేర్కొన్నాడు. రాప్సన్ అనే పండితుడు కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చాడు.

పుష్యమిత్ర శుంగుడు విదర్భ పై దాడి చేసినపుడు ఆంధ్రులు తూర్పు తీరం నుండి పశ్చిమానికి వ్యాపించారని, వారి తొలి రాజధాని శ్రీకాకుళమని, తరువాత ధాన్యకటకమని, రాజ్యం సువిశాలమయిన తరువాత ప్రతిష్టాన పురం రాజధాని అని బార్నెట్ అభిప్రాయపడినాడు.

ఆంధ్రులు, శాతవాహనులు ఒకరేనని, ఆంధ్రులు వింధ్య పర్వత ప్రాంతపు తెగలలో ఒకరని, ఆ తెగవారు మొదట పశ్చిమ ప్రాంతాన్ని పాలించారని, వారి భాష ప్రాకృతమనీ, వారు పశ్చిమం నుండి తూర్పునకు విస్తరించారని, పశ్చిమాన రాజ్యాన్ని పోగొట్టుకొని తూర్పు తీరంలో స్థిరపడినారని, ఈ ప్రాంతానికి ఆంధ్ర మండలమని పేరు వచ్చిందని శ్రీనివాస అయ్యంగారు అభిప్రాయపడినాడు.

**3.1.4.2 శాతవాహనులు ఆంధ్రులు కారు:-** ఆంధ్రులు, శాతవాహనులు ఒకరు కారని సుక్తాంకర్, జయంస్వాల్, భక్లే, రాయచౌదరి మొదలగు పండితులు అభిప్రాయపడినారు.

సుక్తాంకర్ అభిప్రాయం ప్రకారం (1) శాసనాలలో ఎక్కడా శాతవాహనులు ఆంధ్రులని పేర్కొనలేదు. (2) సమకాలీన హాతి గుంఫా, గిర్నార్, తలగుండ శాసనాలలో శాతవాహనుల ప్రస్తావన ఉంది, గాని ఆంధ్రుల పేరు లేదు. (3) శాతకర్ణి అంటే భయం లేని భారవేలుడు తన సైన్యాన్ని పశ్చిమానికి పంపాడు. శాతకర్ణి ఆంధ్ర రాజైతే భారవేలుని సైన్యం దక్షిణానికి రావలెను. (4) శాతవాహనుల శాసనాలు, నాణేలు పశ్చిమ భారతంలో దొరికాయి. (5) హిరహడగల్లి తామ్ర శాసనాలలో సాతహాని రట్ట, మ్యాకదోని శాసనాలలో శాతవాహనీహార అను పదాలు గలవు. హిరహడగల్లి, మ్యాకదోని బళ్ళారి జిల్లాలో గలవు. (6) పురాణాల్లో వున్న వంశపు అసలు పేరు ఆంధ్రబృత్య అనీ దాని అర్థం ఆంధ్రుల సామంతులని, ఆంధ్రులు, ఆంధ్రుల సామంతులు ఒక్కరే కానక్కరలేదనీ సుక్తాంకర్ అభిప్రాయపడినాడు.

శాతవాహనులు ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో తమ అధికారాన్ని కోల్పోయి స్వచ్ఛమైన ఆంధ్ర ప్రాంతపు పాలకులైనపుడే ఆంధ్రులుగా పిలవబడినారని రాయచౌదరి అభిప్రాయపడినాడు. ఆంధ్రులు శాతవాహనులు ఒకరు కాదని జయస్వాల్ కూడా అభిప్రాయపడినాడు.

అశోకుని శాసనాలలో కన్పించే సాతీయ పుత్రులే శాతవాహనులని, ఆంధ్రులు, శాతవాహనులు ఒకరు కాదని భక్లే పేర్కొన్నాడు. తొలి శాతవాహన రాజులు పశ్చిమ దక్కన్‌లో పాలనసాగించారని, వీరి శాసనాలు వాసిష్ఠీపుత్ర శ్రీ పులోమావి కాలం నుంచే ఆంధ్ర ప్రాంతంలో కనిపిస్తున్నాయని, జాతిపరంగా వీరు ఆంధ్రులేనని, మౌర్యుల కాలంలో ఆంధ్రులు ఉద్యోగ నిర్వహణలో పశ్చిమ దక్కన్‌లో పని చేశారని, అందువల్లే వీరిని పురాణాలలో ఆంధ్ర భృత్యులుగా పేర్కొన్నారని గోపాలాచారి అభిప్రాయపడినాడు.

**సమీక్ష:** శాతవాహనులు ఆంధ్రులేనా లేక పురాణాలు రచించే కాలంలో వారు ఆంధ్ర దేశాన్ని పాలిస్తూ ఉండినారు కాబట్టి వారిని పురాణాలు ఆంధ్రులుగా పేర్కొన్నవా, వీరి రాజరికం ఎక్కడ మొదలైంది? అను ప్రశ్నలకు సమాధానం రాబట్టగలిగితే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుంది.

శాసనాలలో గాని, నాణేల పైన గాని శాతవాహనులు ఆంధ్రులమని పేర్కొనకపోవడం వాస్తవం. అయితే ఆనాటి రాజులు వారి వంశ నామమే ప్రస్తావించటం నాటి సాంప్రదాయం. శాలంకాయనులు, బృహత్పలాయనులు, విష్ణుకుండినులు, కదంబులు, చాళుక్యులు మొదలగు వంశాల వారు కూడా జాతి పేరు ప్రస్తావించలేదు. అలాగే క్షహరాట వంశానికి చెందిన నహపాణుడు, కర్ధమక వంశానికి చెందిన రుద్రదాముడు తమ జాతి పేరు తెలుపలేదు. శాతవాహనులను ఆంధ్రులని పురాణాలు చెప్పడానికి కారణం ఆ కులం వారి జాతి అయి ఉండాలి.

మౌర్యుల కాలంలో ఆంధ్ర రాజులు సామంతులుగా ఉండబట్టే వారిని ఆంధ్ర భృత్యులన్నారని భండార్కర్ పేర్కొనడం సమంజసం. శాతవాహనులు ఆంధ్రుల సామంతులని సుక్తాంకర్ ప్రస్తావించడం సరికాదు. శాతవాహనులు విజృంభించే నాటికి ఆంధ్రులు పాలకులైతే వారి ప్రాభవం గురించి కొంతయినా సమాచారం లభ్యం కావాలి. శాతవాహన రాజులు ఆంధ్ర జాతీయులే. వారికి పాలనా అనుభవం ఇతర రాజుల సేవల్లో అబ్బినది. శాతవాహన వంశ స్థాపకుడు ఆంధ్ర జాతీయుడని, ప్రధమంలో భృత్యునిగా ఉండేవాడని భాగవంత పురాణం స్పష్టం చేస్తుంది. పురాణాలు సంకలన జరిగినపుడు శాతవాహనులు తీరాంధ్రముతో బాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలను కూడా పాలిస్తున్నారు. మొదటి శాతవాహన రాజుల శాసనాలు, నాణేలు పశ్చిమ దక్కన్‌లోనే గాక కొండాపూర్, కోటి లింగాలు మొదలగు చోట్ల ఇటీవల లభించాయి. ఈ అంశాల వల్ల శాతవాహనులు ఆంధ్రులేని స్పష్టమవుతుంది.

శాతవాహన శాసనాలలో వాడిన భాషను ఆధారంగా చేసుకొని శాతవాహనులు ఆంధ్రులు కారని అనేక మంది పండితులు వాదించారు. శాతవాహన శాసనాలలోని భాష ప్రాకృతం. అది మహారాష్ట్రకి దగ్గరగా వుందని వీరి వాదం. శాసనాలలోని భాషయే శాతవాహనుల ఇంటి భాష అని పేర్కొనడం సరికాదు. భట్టిప్రోలు, అమరావతి, ఘంటసాల శాసనాలలో వున్నది ప్రాకృత భాషయే. క్రీ॥పూ॥ 300 నుంచి క్రీ॥శ॥ 300 వరకు భారత దేశాన్ని పాలించిన రాజులందరూ ప్రాకృత భాషలోనే శాసనాలు వేశారు. ప్రాకృతాన్ని ఆదరించే ఆచారం శాతవాహనులకు మౌర్యుల నుంచి లభించిన వారసత్వం. అందువల్ల ప్రాకృత భాష మహారాష్ట్రి అనడం సరికాదు.

పైన పేర్కొనబడిన ఆధారాలను బట్టి శాసనాలు, నాణేల ద్వారా తెలిసిన శాతవాహనులు, పురాణాల్లో పేర్కొనబడిన ఆంధ్రులు, ఆంధ్రభృత్యులు, ఆంధ్ర జాతీయులు ఒకరేనని వీరిని ఆంధ్ర శాతవాహనులుగా పేర్కొనుట సమంజసమేనని చెప్పవచ్చు.

## 3.1.5 ఆంధ్ర శాతవాహనుల ఆదిమ స్థావరం:-

**ఉపోద్ఘాతం:-** శాసనాలు, నాణాలలో ప్రస్తావించబడిన శాతవాహనులు, పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్రులు ఒకరేనా అన్న సమస్య వలెనే ఆంధ్ర శాతవాహనుల ఆదిమ స్థావరము ఏది అన్న విషయమై కూడా అనేక వాదోపవాదాలున్నాయి. ఈ సమస్య పై అంతిమ తీర్పు చెప్పడానికి ముందు దాని పై వెలిబుచ్చిన పండితుల వివిధ అభిప్రాయాలను తెలుసుకొందాము. కొంత మంది పండితులు శాతవాహనులు ఆంధ్రులు కారని నమ్ముతుండటం వల్ల వారి జన్మభూమి కర్ణాటకమని, విదర్భయని, మహారాష్ట్రయని భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

## 3.1.6 బళ్ళారి వాదం:-

శాతవాహనుల ఆదిమ స్థావరం కర్ణాటకమని సుక్తంకర్ సిద్ధాంతీకరించాడు. శాతవాహనులలో ఆఖరి రాజైన మూడో పులోమావి మ్యాకదాని శాసనం, పల్లవ శివ స్కందవర్మ హిరహడగల్లి శాసనం ఈ కర్ణాటక వాదానికి ఆధారాలుగా పేర్కొంటున్నాడు. మ్యాకదొని శాసనంలో 'సాత హానిహార' అను పదం, హిరహడగల్లి శాసనంలో 'సాతహానిరట్ట' అను పదం ప్రస్తావించబడింది. ఈ రెండు శాసనాలు బళ్ళారి జిల్లాలోనే వుండటం వల్ల శాతవాహనుల ఆదిమ స్థావరం బళ్ళారి ప్రాంతమని చివరి దశలోవారు ఆంధ్ర దేశాన్ని జయించి పాలించారని పేర్కొన్నాడు.

సాతహానిరట్ట, సాతహానిహార అను రెండు స్థలాల పేర్ల వల్లనే బళ్ళారి శాతవాహనుల ఆదిమ స్థావరమని నిరూపించగలిగితే, ఆంధ్రలో కూడా సాతహానిహార, మామలహార, గోవర్ధన హార, కుడూర హార అనే స్థలాలున్నాయి. దీనిని బట్టి బళ్ళారిలోని రెండు స్థలాల ప్రత్యేకత అంతగా ఏమి కన్పించదు. అంతేగాకుండా ఈ రెండు శాసనాల కర్తలకు శాతవాహన వంశకర్తగా భావించదగిన సిముకుని మధ్య నాలుగు శతాబ్దాల కాల వ్యవధి స్పష్టంగా కన్పిస్తుంది. సిముకాని బళ్ళారి ప్రాంతంలో సంబంధం కన్పించటం లేదు.

## 3.1.7 విదర్భ వాదం:-

శాతవాహనుల ఆదిమ స్థావరం విదర్భయని మిరాషీ పండితుడు అభిప్రాయపడినాడు. శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి నాసిక్ శాసనం, చేది వంశ రాజైన భారవేలుని హథిసంఫా శాసనం ఆధారంగా విదర్భ వాదాన్ని ప్రస్తావించాడు. కళింగను పాలించే భారవేలుడు 'శాతకర్ణి' అను రాజును లెక్క చేయక తన సైన్యాలను పడమట దిక్కుగా పంపగా అవి కణ్ణ బెణ్ణ నది వరకు వెళ్ళి మసిక నగరాన్ని బెంబేలు చేసినవి' అని హథిగుంఫా శాసనంలో పేర్కొనబడింది. భౌగోళికంగా పరిశీలిస్తే కళింగ నుండి పంపబడిన భారవేలుని సేనలు పశ్చిమ దిక్కుగా పయనించి శాతకర్ణి రాజ్యం పై దండెత్తినందున, శాతకర్ణి రాజ్యం కళింగకు పశ్చిమ దిశలోనే వున్నదని మిరాసి అభిప్రాయం. ఆంధ్ర ప్రాంతం కళింగకు దక్షిణ భాగంలో వుంది. శాతకర్ణి ఆంధ్ర ప్రాంతంలో పాలిస్తూ వుంటే భారవేలుని సేనలు పడమరగా ఎందుకు వెళ్ళాయి. నాసిక్ శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి 'బెణాకటక స్వామి'గా పేర్కొనబడినాడు. హథి గుంఫా శాసనం కణ్ణబెణ్ణ నదిని గురించి చెబుతుంది. కణ్ణబెణ్ణ నది పైన గంగకు ఉపనది అయిన కణ్ణానది. నాసిక్ శాసనంలో చెప్పబడిన బెణాకటకమైన గంగకు రెండు వైపుల వున్న భూభాగమవుతుంది. 'బెణకటక' ప్రాచీన రాజ్య విభాగాల్లో ఒకటై ఉండవచ్చును. దీనిని బట్టి విదర్భ ప్రాంతం ఆంధ్ర శాతవాహనుల తొలి స్థావరమై ఉంటుందని మిరాసి అభిప్రాయం.

విదర్భ శాతవాహనుల తొలి స్థావరంగా పరిగణించడం సరికాదు. ఎందువల్లనంటే హథి గుంఫా శాసనంలో చెప్పబడిన కణ్ణబెణ్ణ పురాణ, సాంప్రదాయ, శాసన, సామిత్యాలలో చెప్పబడిన కృష్ణానదితో గుర్తించటం సమంజసము. ఎక్కడా ప్రస్తావించబడని కణ్ణా అను చిన్న నదితో గుర్తించడం కేవలం కళింగకు పడమర దిక్కును వెదకటం కోసమే చేసిన ప్రయత్నమవుతుంది. కణ్ణబెణ్ణ పై మానసిక నగర మున్నట్లు హథి గుంఫా శాసనం పేర్కొంటుంది. కాని అటువంటి ప్రాచీన నగరపు జాడలు కణ్ణా పై కనిపించవు. అంతేగాకుండా శాతకర్ణి పడమర దిక్కులో పాలిస్తున్నట్లు తగినన్ని శాసన ఆధారాలు లేవు. మిరాసీ భావించినట్లు కళింగకు దగ్గరలో పడమర వైపు బీరారు లేదు. అదీగాక కృష్ణానది ముఖ ద్వారం నుండి తూర్పు కోస్తా తూర్పు దిశకు వంపు కలిగి వుండుటచేత

తీరాంధ్ర దేశానికి కళింగ తూర్పు దేశమవుతుంది. గోదావరికి ఇరువైపుల వున్న జిల్లాలను తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలనే పిలుస్తారు. ఉత్తర దక్షిణ గోదావరి జిల్లాలని పిలువరు. తీరాంధ్ర దేశంలోని జిల్లాల్లో నివసించే వారు నేటికి తూర్పు వారు పడమటి వారు అని పిలుచుకుంటారు. కృష్ణా జిల్లాకు పై జిల్లాల వారు తూర్పు వారు, క్రింది జిల్లాల వారు పడమటి వారు. కళింగ పై దండెత్తిన కృష్ణదేవరాయలు తన దండయాత్రను పూర్వ దిగ్విజయ యాత్రగా పేర్కొన్నాడు. దీనిని బట్టి కళింగకు పడమర వైపు పయనించిన భారవేలుడు ఆంధ్ర ప్రాంతము వైపు వచ్చినట్లు తెలియగలదు. భారవేలుడు ఆంధ్ర ప్రాంతం పై దండెత్తినట్లు గుంటుపల్లిలో లభించిన శాసనం వల్ల ఋజువు కాగలదు. తాను జయించిన ప్రాంతాన్ని గాడిదలచే దున్నించి పల్లెరు కాయలు చల్లించినట్లు భారవేలుడు పేర్కొన్నాడు. పల్లేరు కాయల పండుగ నేటికి గోదావరి జిల్లాల్లో గలదు. ఇది భారవేలుని దండయాత్రకు గుంటుపల్లి శాసనంలో భారవేలునికి 'మహిషకాధిపతి' అనే బిరుదున్నట్లు చెప్పబడింది. నల్గొండ, మెదక్ ప్రాంతాల్లో మహిషకులనే వారు పాలించినట్లు వారు విడుదల చేసిన నాణాల వల్ల తెలియుచున్నది. ఈ మహిషకులే కృష్ణానది పై వున్నట్లు చెప్పబడ్డ మూషిక నగరాన్ని ముఖ్య పట్టణముగా, మహిషిక రాజ్యాన్ని ఏలి వుంటారు. ప్రాకృత సాహిత్యాన్ని బట్టి కృష్ణానదికి కణ్ణబెణ్ణా అనే పేరున్నట్లు తెలియుచున్నది. బెణాకటకము కటక్, కళ్యాణ కటకము, ధాన్య కటకము లాంటి నగరాలుగా గుర్తించడం సమంజసమనిపిస్తుంది. నాసిక్ శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి విదర్భను జయించినట్లు చెప్పబడింది గాని వారసత్వంగా వున్న ప్రాంతంగా చెప్పబడలేదు. దీనిని బట్టి చూస్తే విదర్భను జయించటం వల్ల వచ్చిన భూభాగమే గాని, ఆదిమ స్థావరం వలన వచ్చినది కాదని తెలియుచున్నది. ఆదిమ స్థావరం కాని ప్రాంతం వారి జన్మభూమి కావడానికి వీలులేదు.

### 3.1.8 మహారాష్ట్ర వాదం:-

శాతవాహనుల ఆదిమ స్థావరం మహారాష్ట్రమని శ్రీనివాస అయ్యంగార్, జో గేల్కర్ మొదలగు చరిత్రకారులు పేర్కొన్నారు. ఆంధ్రులు వింధ్య ప్రాంతపు తెగయని, వారి రాజులు మొదట పశ్చిమ దక్కనుని పాలించారని, ప్రాకృత భాష మాట్లాడే వారని, వారి అధికారం పశ్చిమం నుంచి తూర్పుగా గోదావరి - కృష్ణా లోయ ప్రాంతంలో విస్తరించినదని శ్రీనివాస అయ్యంగార్ అభిప్రాయపడినాడు. పశ్చిమ దక్కన్‌లో వారి అధికారం క్షీణించడంతో ఆంధ్ర మండలమనేది వారి తూర్పు ప్రాంతాలకు ప్రాకి వాటికి ఆ పేరు స్థిరపడింది. శ్రీనివాస అయ్యంగార్ వాదాన్నే జోగేల్కర్ పండితుడు బలపరిచినాడు. ఇతని ప్రకారం శాతవాహనులు ఆంధ్రులే కాని తూర్పు తీర ఆంధ్రులు కారని, మహారాష్ట్రలో పూనా జిల్లాలోని ఆంధ్ర నదీ తీర వాసులవడం వల్ల వారు ఆంధ్రులయ్యారని, వారు గొప్ప విప్లవాన్ని లేవదీసి విదేశీయులైన క్షహరాటులను తరిమి వేసి దక్కన్‌లోని వివిధ తెగల్ని ఐక్యం చేసి నవ రాష్ట్రాన్ని స్థాపించారని, అందుచేతనే మహారాష్ట్ర నవ రాష్ట్రంగా వ్యవహరించబడిందని పేర్కొన్నాడు. పురాణాలు సిముకుని ఆంధ్ర జాతీయుడిగా వర్ణించినాయి. కాని ఆంధ్ర దేశీయునిగా కాదని, నాటికి ఆంధ్ర రాజ్యం రాజకీయంగా స్వతంత్ర దేశం కాదని కళింగ రాజ్యంలో అంతర్భాగమని, శాతవాహనులు వాడిన గౌతమీపుత్ర, వాశిష్టీ పుత్ర వంటి మాతృ సంజ్ఞలను బట్టి, ప్రాకృత భాషను బట్టి వారు మహారాష్ట్రులని, శాతవాహన తొలి రాజులు పైదాన్‌తో సంబంధం గలవారని, వారి శాసనాలు పశ్చిమ దక్కన్‌లో మాత్రమే లభించాయని మహారాష్ట్ర వాదాన్ని బలపరిచే వారు చెప్తున్నారు. ఈ అంశాలు ప్రాతిపదికగా శ్రీనివాస అయ్యంగార్ వంటి చరిత్రకారులు ఆంధ్రులు రధికులు, పిటనికులు మొదలగు తెగలలో మహారాష్ట్ర ప్రాంతంలో ఉంటూ ఆ తెగలన్నింటినీ సమైక్యం చేసి రాజకీయ ఆధిపత్యం సంపాదించారని, తదుపరి గౌతమీపుత్ర శాతకర్ణి లేదా వాసిష్టీపుత్ర పులోమావి ఆంధ్ర దేశాన్ని జయించి ఉంటాడని ఊహిస్తున్నారు.

కాని పై వాదం లోప భూయిష్టంగా ఉంది. సిముకుడు ఆంధ్ర జాతీయుడు అని చెప్పినంత మాత్రాన ఆంధ్ర దేశీయుడు కాదని చెప్పలేం. నాటికి ఆంధ్ర స్వతంత్ర రాజ్యం కాదు. కళింగలో కూడా అంతర్భాగం కాదు. బౌద్ధ జాతక కధలు ఆంధ్ర కళింగ జానపదాలను, ఆంధ్రనగరిని పేర్కొనడం మదన కూడదు. అలాగే మెగస్తనీస్ తన ఇండిక గ్రంథంలో ఇరుగు పొరుగున ఉన్న ఆంధ్ర కళింగ రాజ్యాల రెండింటి గురించి వర్ణించాడు. అశోకుని శాసనాలు ఆంధ్రుల ఉనికిని ఆంధ్ర దేశంలోనే గుర్తిస్తున్నాయి. దక్షిణాపధ వాసులని ఐతరేయ బ్రాహ్మణ, చెబుతన్న జాతులన్నింటినీ మహారాష్ట్రులనే ఇరికించడం హేతుబద్ధంగా లేదు. ఇక మాతృ సంజ్ఞలు వాడిన శాతవాహనులు కపటివారే కాని మొదటివారు కాదు. అలాగే వారు వాడిన ప్రాకృత భాష మౌర్యుల నుంచి

రాజకీయాధికారం సంక్రమించినట్లే వారసత్వంగా వచ్చిన భాష. పోతే తొలి శాతవాహన రాజులు పైఠానుతో సంబంధమున్న వారని, వారి శాసనాలు, నాణేలు కూడా పశ్చిమ దక్కన్‌లోనే లభించాయని అందుచేత వారు మహారాష్ట్రీయులేననడం సహేతుకం కాదు. శక - క్షాత్రప విదేశీయుల బెడద గురించి దక్షిణాపథ పతులైనవారు వాయవ్య ప్రాంతం పై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించి ఉండవచ్చు. ఇక కొండాపూర్, కోటిలింగాల్లో ఇటీవల దొరికిన తొలి శాతవాహన రాజు సిముకిని నాణేలను బట్టి అతడు తన రాజ్య పాలన ఆంధ్రలో ప్రారంభించాడని చెప్పడానికి దోహదం చేస్తున్నాయి. ఇక ఆంధ్రీ నది ఉనికిని బట్టి జోగాల్కర్ మహారాష్ట్ర శాతవాహనుల జన్మ స్థలం అనడం సరికాదు. బళ్ళారి ప్రాంతంలో కూడా ఆ పేరు గల నది ఉంది. అలాగని ఆ ప్రాంతమే శాతవాహనుల జన్మ స్థలమని చెప్పలేము. అందుచేత మహారాష్ట్ర వాదంలో బలం లేదు.

### 3.1.9 ఆంధ్రా వాదం:-

శాతవాహనుల ఆదిమ స్థావరం ఆంధ్రదేశమని రాప్సన్, స్మిత్, భండార్కర్, బర్జెస్ మొదలగు చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు.

శాతవాహనుల శాసనాలు, నాణేలు పశ్చిమ దక్కన్‌లోని నానేఘాట్, నాసిక్‌లలో మాత్రమే లభ్యం కావడం, హాతిగుంఫా శాసనంలో శాతకర్ణి రాజ్యం కళింగకు పడమర ఉందనటం, నాసిక్ శాసనంలో శాతకర్ణి సామ్రాజ్యంలో ఆంధ్రలో ఏ ప్రాంతం కూడా చెప్పకపోవడం, ఆంధ్రలో శాతవాహనుల శాసనాలు 24వ పాలకుడైన వాసిష్ఠీ పుత్ర పులోమావి కాలం నుంచి మాత్రమే లభ్యం కావడం ఆధారాలుగా సుక్తంకర్ వంటి చరిత్రకారులు శాతవాహనుల జన్మస్థలం ఆంధ్ర దేశము కాదని పేర్కొనడం ఇప్పుడు లభిస్తున్న ఆధారాలతో పోల్చి చూస్తే సుక్తంకర్ అభ్యంతరాలు నిలవవు.

ఆనాటి ఆంధ్ర భూమి నేటి తెలుగు ప్రాంతము ఒకటే. దక్షిణాపథ తూర్పు భాగంలో గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్నదే ఆంధ్రభూమి. చోళులు, పాండ్యుల వలె ఆంధ్రులు కూడా ఒకే భౌగోళిక ప్రాంతంలో అధికార మేర్పరచుకొన్నారు. ప్రాచీన బౌద్ధ సాహిత్యంలో మహానదికి ఉపనదియైన తెలివాహన నదికి దక్షిణాన ఆంధ్ర భూమి ఉన్నట్లు పేర్కొనబడింది. ఆగ్నేయ దక్కన్‌లో ఆంధ్రుల రాజ్యం బలమయిందని గ్రీకు రాయబారి మెగస్తనీస్ వర్ణించాడు. మౌర్యుల కాలానికే దక్షిణాన రథిక, భోజ, కళింగ, ఆంధ్ర రాజ్యాలున్నాయి. మొదటి రెండు పశ్చిమ దక్కన్‌లో తరువాత రెండు తూర్పు దక్కన్‌లో వున్నాయి. ఆనాడు మధ్య ప్రదేశ్‌లోని కొన్ని భాగాలు, విశాఖ ప్రాంతం, గోదావరి, కృష్ణా జిల్లాలు కలిసిన ప్రాంతం ఆంధ్రభూమి అని భండార్కర్ పేర్కొన్నాడు. శాతవాహనులు తూర్పు దక్షిణా పథమును జయించిన తరువాతనే ఆ ప్రాంతానికి ఆంధ్రభూమి అని పేరు వచ్చినదని అనటంలో అర్థం కనిపించదు. శాతవాహనులు కీర్తి గడించక ముందు కూడా ఆంధ్ర దేశము నేడు ఉన్న ప్రాంతములోనే ఉండేది.

ఇటీవల శాతవాహన రాజ్య స్థాపకుడైన సిముకుని నాణేలు కొండాపూర్, కోటి లింగాలలో లభించటంతో అతడు తన రాజ్యపాలన ఆంధ్ర దేశంలో ప్రారంభించాడనటానికి వీలు కలిగింది. అందుచేత వారి తొలి శాసనాలు, నాణేలు పశ్చిమ దక్కన్‌లో మాత్రమే లభించాయనడం నేడు సరికాదు. అంతేగాక తొలి 22 మంది శాతవాహన రాజులకు గాను రెండు శాసనాలు మాత్రమే పశ్చిమ దక్కన్‌లో లభించాయి. మొదటి శాతవాహన రాజులలో గొప్పవాడైన రెండో శాతకర్ణి రెండు అశ్వమేధయాగాలను, రాజసూయ యాగాలను చేసి 'దక్షిణాపథపతి' అను బిరుదు పొందినాడు. అటువంటి సమయంలో శాతకర్ణి రాజ్యం కళింగానికి పశ్చిమంగా వున్న భూమినే పరిమితం అని హాతిగుంఫా శాసనం ఆధారంగా చెప్పడం సహేతుకం కాదు. అంతేగాక ఖారవేలుని గుంటుపల్లి శాసనాన్ని బట్టి అతని పశ్చిమ జైత్రయాత్ర ఆంధ్రదేశ కృష్ణా నదీ ప్రాంతం పైనే జరిగిందని నిర్ధారణ అవుతుంది. పెరిప్లస్ గ్రంథకర్త దక్షిణా పథంలోని పేటలను, 'తిమిరికో' (తమిళకు) పేటలను వేరు పరచినాడు. శాసనాలలోని దక్షిణా పథం పెరిప్లస్‌లోని 'దచిన బదె' ఒకటిగా ఉన్నాయి. దక్షిణా పథానికి ఆవల దక్షిణాన ఉన్న ప్రాంతమే తమిళకం.

నాసిక్ శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యంలో ఆంధ్ర దేశంలో ఏ ప్రాంతం కూడా లేదని చెప్పడం పొరపాటు. అందులో సిరిధన, నాగార్జున కొండ, మహేంద్ర, అస్సకలు రాజ్య భాగాలుగా ఉన్నాయి. గౌతమీపుత్రుని అశ్వాలు మూడు సముద్రాలలో

నీళ్ళు త్రాగాయన్న వర్ణనను బట్టి కూడా అతని సామ్రాజ్యంలో ఆంధ్రదేశం అంతర్భాగమని చెప్పవచ్చు. అది అతడు వారసత్వంగా పొందినది.

గోదావరి నది పరివాహక ప్రాంతమంతటా శక్తి యుక్తులలో పరాక్రమ ఔదార్యాలలో, శాతావాహనులను మించినవారు లేరని హాలుని గాథలలో ఉన్నది. ఈ విషయం చూస్తే తొలి శాతవాహనులు ఏలిన ప్రాంతాన్ని తరువాతి శాతవాహనులు పాలించినట్లే. గాథా సప్తశతిలో 'దేశి' పదములనబడే తెలుగు పదాలు గలవు. ప్రాకృత గ్రంథమయిన 'లీలావతి పరిణయం' లో హాలుని వివాహ సమాచారముంది. ఈ వివాహం సప్త గోదావరి తీరమున జరిగినదట. సప్త గోదావరి ద్రాక్షారామంలోని తటాకమని పండితుల అభిప్రాయం.

పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్య, ఆంధ్ర జాతీయ అనే వాటికి అర్థం భృత్యులైన ఆంధ్రులు అని, ఆంధ్రుల భృత్యులనడానికి వారు ఆనాటి సామాజిక నియమాలు, విలువల ప్రకారం సంకరమైన పుట్టుక కలవారు. వారు వైదేహిక పురుషునికి, కారవార స్త్రీకి జన్మించిన తక్కువ ఉపకులం వారని మనువు పేర్కొన్నాడు. అందువలన గ్రామాలకు వెలుపల వేట మొదలయిన వృత్తుల జీవనం సాగించేవారు. భారతంలో ఆంధ్రులు, ద్రావిడులు, కన్నయులతో పాటు చెప్పబడ్డారు. ఈ ఆధారాలను బట్టి శాతవాహనులు ఆంధ్రలో నివసించే ఆది ఆంధ్రులనబడే హరిజనులేనని, వీరు ఆటవిక పాలకులని, వీరి ఆదిమ స్థావరం ఆంధ్ర దేశమేనని ఏలూరి కుమారస్వామి గారు అభిప్రాయపడినారు.

ఇటీవల కొండాపురంలో సాద్వాన అనే పేరుగల నాణేలు లభించాయి. ఈ శాతవాహనుడే శాతవాహన వంశ మూలపురుషుడు. కరీంనగర్ జిల్లాలో గోదావరి కుడి గట్టున మరుగుపడిపోయిన సిముకుని నాణేలను సేకరించాడు. ఈ నాణేలకు శాతవాహన చరిత్రలో చాలా ప్రాముఖ్యం వచ్చింది. సేకరించిన 8 నాణేలలో 7 రాగివి, మిగిలిన ఒకటి పోటిన్ అనబడు మిశ్రమ లోహంతో తయారయింది. ఈ నాణేల్లో సిముకుని పేరు చీముకుడని ముద్రించడం జరిగింది. నానేఘాట్‌లోని సిముకుడు పురాణాలలోని చిస్మకుడు, నాణేల మీద చీముకుడు ఒకే వ్యక్తియై ఉండవలె. లిపి లక్షణాలను బట్టి కొండాపురం నాణేల పై గల స్వాద్వహనుడు క్రీ॥పూ॥ 3 వ శతాబ్దికి చెందిన వానిగా పరిగణించడం జరిగింది. జైన సాహిత్యంలో శాతవాహనుడు వంశముల కర్త అని ఉంది. కథాసరి త్సాగర్యంలో కూడా ఒక కథనం ఉంది. వీటన్నింటిని సమన్వయ పరచి చూస్తే కొండాపూర్, కోటి లింగాల నాణేలలో చెప్పబడిన సాద్వహనుడు లేక సిముక శాతవాహనుడే ఆంధ్ర సామ్రాజ్య మూల పురుషుడని, శాతవాహనుల జన్మభూమి ఆంధ్రదేశమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

లభిస్తున్న సాక్ష్యాలన్నింటిని సమన్వయిస్తే శాతవాహనులు ఆంధ్రులేనని, వారి స్వస్థలం ఆంధ్ర దేశమేనని, శ్రీకాకుళం, తరువాత ధాన్యకటకం రాజధానిగా ఆంధ్ర దేశమునుండే తమ రాజ్యాన్ని దక్షిణా పథానికింకా విస్తరింపజేశారని, అనంతరం నాటి రాజకీయ పరిస్థితుల్లో శకక్షాత్రప విదేశీయుల బెడద నుంచి వాయువ్య సరిహద్దుల్ని రక్షించుకోవడం కోసం పశ్చిమ దక్కన్ లోని ప్రతిష్ఠానమును కేంద్రంగా చేసుకొని ఎక్కువ కాలం అధికారం చెలాయించారని, మగధ మీద దృష్టి నిలిపిన దాక్షిణాత్య రాజవంశాల మధ్య పశ్చిమ భారత ప్రాంతాలను ఆక్రమించి అక్కడ తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవలసిన అవసరం కూడా దీనికి కారణమని, చివరి శాతవాహన పాలకుల కాలానికి వారు పశ్చిమ దక్కనులో శక క్షాత్రపులకు అధికారాన్ని కోల్పోయి తూర్పు ప్రాంతమైన ఆంధ్ర దేశానికే పరిమితమయ్యారని భావించవచ్చు.

### 3.1.10 శాతవాహనుల కాలాను క్రమణిక:-

శాతవాహనులకు సంబంధించిన వివాదస్పదమైన అంశాలలో మరొకటి వారి కాల నిర్ణయం. శాతవాహనులు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు పరిపాలించారు అను విషయంలో చరిత్ర కారులలో భిన్నాభిప్రాయాలు కలవు. పశ్చిమ ప్రాంతాల్లో శాతవాహనుల అధికారానికి ఏర్పడిన విఘాతం ప్రాతిపదికగా వారిలో మొదటి రాజైన సిముకుని మొదలు 23 వ వాడైన గౌతమీపుత్రుడు, రాజ్యానికి వచ్చే వరకు గల రాజుల్ని తొలి శాతవాహనులని, తదుపరి రాజులను మలి శాతవాహనులని పేర్కొనవచ్చు.

**క్రీ॥పూ॥ మొదటి శతాబ్దంలో శాతవాహన పరిపాలన ప్రారంభమయింది:-** మత్స్య, వాయు, విష్ణు, భాగవత, బ్రహ్మాండ పురాణాలలో మగధలో గుప్తుల ప్రాబల్యం వచ్చే వరకు దానిని పాలించిన రాజవంశాల పట్టికలు పేర్కొనబడింది. రాజ వంశాలతో పాటు ఒక్కో వంశం పరిపాలించిన కాలం, ఆ వంశంలో రాజుల పేర్లు వరుస క్రమంలో ప్రస్తావించబడింది. మత్స్య, వాయు పురాణాల్లో ఒక్కో రాజు ఎంత కాలం పాలించినది కూడా చెప్పబడింది. కాని అంతర్గతంగానూ, పరస్పర వైరుధ్యాలతో ఉన్న ఈ వివరాలను జాగ్రత్తగా ఉపయోగించాలి. ఇతర సాక్ష్యాధారాలతో సమన్వయ పరచవలసి ఉంది.

30 మంది ఆంధ్ర రాజులు సుమారు 450 సంవత్సరాల కాలం పాలించారనే విషయంలో పురాణాలు ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నాయి. అదే విధంగా సిముకుడు కాణ్వ వంశంలో చివరివాడైన సుశర్మను నిర్మూలించాడని పురాణాలు చెబుతున్నాయి. మౌర్యులు క్రీ॥పూ॥ 322లో ప్రారంభించి 137 సంవత్సరాలు, తరువాత శుంగులు 112 సంవత్సరాలు, కాణ్వులు 45 సంవత్సరాలు పాలించారు. అనగా క్రీ॥పూ॥ 28 నాటికి సుశర్మ చంపబడినాడు. మగధలో ఆంధ్రుల పాలన ప్రారంభమయింది. శాతవాహనుల పాలన క్రీ॥పూ॥ 28లో ప్రారంభమయిందని సర్కార్ పేర్కొన్నాడు. కాణ్వరాజు సుశర్మను, శుంగ వంశ శేషాన్ని నిర్మూలించి సిముకుడు విజృంభించాడన్న పురాణ సమాచారం ఆధారంగా శుంగులు, కాణ్వులు ఏక కాలంలో రాజ్యం చేశారని పేర్కొంటూ క్రీ॥పూ॥ 73లో సిముకుని రాజ్య పాలన ఆరంభమయిందని భండార్కర్ అభిప్రాయపడినాడు.

సర్కార్, భండార్కర్ చెప్పినట్లు క్రీ॥పూ॥ మొదటి శతాబ్దంలో శాతవాహన పాలన ప్రారంభమయిందని అంగీకరిస్తే పురాణాలు పేర్కొన్న 450 సంవత్సరాల పాలన ఇంచు మించు క్రీ॥శ॥ 400 నాటికి గాని ముగియదు. కాని క్రీ॥శ॥ 3 వ శతాబ్దం నుంచి లభిస్తున్న శాసనాల వలన ఆంధ్రాలోని వివిధ ప్రాంతాల్లో ఇక్ష్వాకుల, బృహత్పలాయన, శాలంకాయన మొదలగు రాజ వంశాల పాలన ఉన్నట్లు తెలుస్తుంది. అనగా శాతవాహనుల రాజ్య పాలన క్రీ॥శ॥ 2 వ శతాబ్దికి అంతం కావాలి.

**క్రీ॥శ॥ 3వ శతాబ్దంలో శాతవాహన పాలన ప్రారంభమయింది:-** కొండాపూర్, కోటి లింగాలలో లభించిన నాణేల పై గల ఆఖ్యలను బట్టి అవి క్రీ॥పూ॥ 3 వ శతాబ్దానికి చెందినవిగా నిర్ణయించాలి. నేవాసా వద్ద లభించిన శాతవాహన, కన్హ, శ్రీ శాతకర్ణి నాణేలు క్రీ॥పూ॥ 3 వ శతాబ్దానికి చెందుతాయని సంకాలియా పేర్కొన్నాడు. వీరంతా తొలి శాతవాహన వర్గంలోని వారు, అందువల్ల వారి రాజ్య పాలన క్రీ॥పూ॥ 3 వ శతాబ్దంలో ప్రారంభమయి ఉండాలి.

పురాణాలు చెబుతున్నట్లు 30 మంది ఆంధ్ర రాజులు 450 సంవత్సరాలు పాలించారనే విషయాన్ని చరిత్రకారులందరూ అంగీకరిస్తున్నారు. అయితే సుశర్మను చంపింది సిముకుడు, గాక అతని సంతతి వాడని స్మిత్ పేర్కొన్నాడు. ఆంధ్రులను పౌలోములని మత్స్య పురాణం చెప్పిన దాన్ని బట్టి శాతవాహన రాజులలో శాతకర్ణి తర్వాత పులోమావి పేరుకిచ్చిన ప్రాధాన్యతను బట్టి మొదటి పులోమావి ఏదో ఘన కార్యం సాధించి వుండాలి. అది సుశర్మను చంపి మగధలో ఆంధ్రుల అధికారాన్ని నెలకొల్పడమేనని వెంకట్రావు, రామచంద్రయ్య అభిప్రాయపడినారు. మొదటి పులోమావికి ముందు పాలించిన నలుగురు రాజులు మొత్తము 19 సంవత్సరాలు పాలించారు. వీరి తరువాత సింహాసనం అధిష్టించిన పులోమావికి తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడానికి కనీసం 15 సంవత్సరాలు పట్టిందనుకుంటే అతడు క్రీ॥పూ॥ 43లో సింహాసనమధిష్టించాడు. అతనికి ముందు 14 మంది రాజులు మొత్తం 288 సంవత్సరాలు పాలించారు. అనగా శాతవాహన రాజ వంశ స్థాపకుడైన సిముకుడు క్రీ॥పూ॥ 271లో పరిపాలన ఆరంభించాడని చెప్పవచ్చు.

హాతిగుంఫా, నానేఘాట్ శాసన లిపులకు పోలిక వుంది. ఈ రెండు శాసనాలలో చెప్పబడిన శాతకర్ణి ఒక్కడేనని దీని ప్రకారం ఖారవేల, శాతకర్ణి సమకాలికులని చెప్పవచ్చు. ఖారవేలుడు క్రీ॥పూ॥ 183లో కళింగాధిపతి అయినాడు. అతడు తన రెండో పాలనా సంవత్సరంలో శాతకర్ణి రాజ్యం పై దండెత్తినాడు. ఈ శాతకర్ణి అంతకు 3 సంవత్సరాలకు ముందు సింహాసనం అధిష్టించాడనవచ్చు. ఇతనికి ముందు 6 మంది రాజులు 87 సంవత్సరాలు పాలించారు. దీనిని బట్టి శాతవాహన రాజు సిముకుడు ఆంధ్ర రాజ్యాన్ని క్రీ॥పూ॥ 271లో స్థాపించాడని, బిందుసారుని మరణానంతరం సింహాసనం కోసం వారసత్వ యుద్ధం జరుగుచున్న

సమయం దీనికి అనుకూలించినదని చెప్పాలి. పై రెండు విషయాలను బట్టి శాతవాహన పాలన క్రీ॥పూ॥ 271లో ఆరంభమయిందని నిర్ధారించవచ్చు.

### 3.1.11 ముగింపు:-

పురాణాలు, శాసనాలు, నాణేల నుంచి లభించిన సమాచారాన్ని, లిపి పరిణామ స్వరూపాన్ని ఆధారంగా చేసుకొని విశ్లేషణ చేస్తే శాతవాహనుల పాలన క్రీ॥పూ॥ 271లో ప్రారంభమయిందని నిర్ధారణ చేసి చెప్పవచ్చు. శాతవాహనుల పరిపాలనా కాల పట్టికను నిర్ణయిస్తున్నపుడు రాజుల పేర్లకు సంబంధించి మత్స్య పురాణం సాక్ష్యంగా తీసుకోవడం జరిగింది. శాతవాహన రాజుల కాల పట్టిక ఈ క్రింద పొందుపరచబడింది.

## ఆంధ్ర శాతవాహన రాజుల కాల పట్టిక

| రాజుల సంఖ్య | | రాజుల పేర్లు | పరిపాలనా సంవత్సరాలు | | | ఇవ్వబడిన కాలమానము |
|---|---|---|---|---|---|---|
| వాయు | మత్స్య | | వాయు | మత్స్య | మన నిర్ణయం | |
| 1 | 1 | సిముక | 23 | 23 | 23 | క్రీ॥పూ॥ 271 - 248 |
| 2 | 2 | కృష్ణ | 18 | 28 | 18 | 248 - 230 |
| | 3 | మొదటి శాతకర్ణి | 10 | 10 | 230 - 220 | |
| | 4 | పూర్ణోత్సంగ | 18 | 18 | 220 - 202 | |
| | 5 | స్కంద స్తంభి | 18 | 18 | 202 - 184 | |
| 3 | 6 | రెండో శాతకర్ణి | 56 | 56 | 56 | 184 - 128 |
| | 7 | లంబోదర | 18 | 18 | 128 - 110 | |
| 4 | 8 | అపీలక | 12 | 12 | 12 | 110 - 98 |
| | 9 | మేఘస్వాతి | 18 | 18 | 98 - 80 | |
| | 10 | స్వాతి | 18 | 18 | 80 - 62 | |
| | 11 | స్కంద స్వాతి | 8 | 8 | 52 - 44 | |
| | 12 | మృగేంద్ర | 3 | 3 | 55 - 52 | |
| | 13 | కుంతల స్వాతి | 8 | 8 | 52 - 44 | |
| | 14 | స్వాతి కర్ణ | 1 | 1 | 44 - 43 | |
| 5 | 15 | మొదటి పులుమావి | 24 | 36 | 24 | 43 - 19 |
| 6 | 16 | గౌరకృష్ణ | 25 | 25 | 25 | క్రీ॥పూ॥ 19 - క్రీ॥శ॥ 6 |
| 7 | 17 | హాలుడు | 1 | 5 | 1 | క్రీ॥శ॥ 6 - 7 |
| 8 | 18 | మన్దులక | 5 | 5 | 5 | 7 - 12 |
| 9 | 19 | పురోంద్ర సేన | 21 | 5 | 21 | 12 - 33 |
| 10 | 20 | సుందర స్వాతి కర్ణి | 1 | 1 | 1 | 33 - 34 |
| 11 | 21 | చకోర స్వాతి కర్ణి | 1/2 | 1/2 | 1/2 | 34 - 34 |
| 12 | 22 | శివస్వాతి | 28 | 28 | 28 | 34 - 62 |
| 13 | 23 | గౌతమీపుత్ర శాతకర్ణి | 21 | 21 | 24 | 62 - 86 |
| | 24 | రెండో పులుమావి | | 28 | 28 | 86 - 114 |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | 25 | శివశ్రీ | | 7 | 7 | 114 - 121 |
| | 26 | శివస్కంద | | 7 | 7 | 121 - 128 |
| 14 | 27 | యజ్ఞశ్రీ | 29 | 29 | 29 | 128 - 157 |
| 15 | 28 | విజయ | 6 | 6 | 6 | 157 - 163 |
| 16 | 29 | చంద్రశ్రీ | 3 | 10 | 3 | 163 - 166 |
| 17 | 30 | మూడో పుళమావి | 7 | 7 | 8 | 166 - 174 |

పాఠం - 4

# శాతవాహనుల రాజకీయ చరిత్ర

ముఖ్యాంశాలు:-

4.0 లక్ష్యం
4.1 ఉపోద్ఘాతం
4.2 శ్రీ ముఖుడు
4.3 కృష్ణుడు
4.4 మొదటి శాతకర్ణి
4.5 రెండవ శాతకర్ణి
4.6 మొదటి పులోమావి
4.7 హాలుడు
4.8 గౌతమీపుత్ర శాతకర్ణి
4.9 వాశిష్టీ పుత్ర పులోమావి
4.10 యజ్ఞశ్రీ
4.11 పశ్చిమ క్షాత్రప - శాతవాహన సంబంధాలు
4.12 భూమకుడు - గౌరకృష్ణుడు
4.13 నహపాణుడు - గౌతమీపుత్ర శాతకర్ణి
4.14 చష్టనుడు - రెండవ పులోమావి
4.15 రుద్రదాముడు - వాసిష్ట పుత్ర శాతకర్ణి
4.16 ముగింపు

## 4.0 లక్ష్యం:-

దక్షిణా పథంలో రాజకీయ చరిత్ర శాతవాహనులతో ప్రారంభమవుతుంది. 30 మంది శాతవాహన రాజులు సుమారు 450

సంవత్సరాలు పాలించారు. ఈ 30 మంది రాజులు, ముఖ్యంగా వారిలో సుప్రసిద్ధుడైన గౌతమీపుత్ర శాతకర్ణి గూర్చి, పశ్చిమ క్షాత్రపులతో శాతవాహన సంబంధాల గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 4.1 ఉపోద్ఘాతం:-

మౌర్య సామ్రాజ్య పతనానంతరం దక్షిణా పథంలో 30 మంది శాతవాహన రాజులు సుమారు 450 సంవత్సరాలు పాలించారు. వీరు విదేశీ దాడుల నుండి దక్షిణా పథాన్ని రక్షించి శాంతి భద్రతలను ప్రసాదించారు. వీరిలో గౌతమీపుత్ర శాతకర్ణి సుప్రసిద్ధుడు. శాతవాహనుల రాజకీయ చరిత్రను గురించి తెలుసుకోవడానికి ఆధారాలు అపారంగా ఉన్నాయి. అయితే ఈ ఆధారాలు నిర్వివాదాలైనవి కావు. అసమగ్రమైన, సందేహాస్పదమయిన ఈ ఆధారాలు శాతవాహనుల రాజకీయ చరిత్రను వివాదగ్రస్తంగా చేసినాయి. అక్కడక్కడ లభ్యమైన శాసనాలు, నాణేలు, ధృవపడని పురాణ గాథలు, సంవత్సరం లేని శాసనాలు, అసంపూర్ణంగా వ్రాసిన శాసనాలు మొదలగు విషయాల పై ఆధారపడి నిర్మించినదే శాతవాహనుల రాజకీయ చరిత్ర.

## 4.2 శ్రీముఖుడు (క్రీ॥పూ॥ 271 - 248):-

ఇటీవల కొండాపురం, వరంగల్లు సమీపంలో 'సాద్వహన' అను పేరుగల ప్రాచీన నాణేలు లభించినాయి. ఈ శాతవాహనుడే శాతవాహన వంశ మూల పురుషుడని పలువురి చరిత్రకారుల అభిప్రాయం. ఇతని సంతతివాడైన శ్రీముఖుని స్వతంత్ర ఆంధ్ర రాజ్య స్థాపకునిగా పురాణాలు వర్ణించాయి. ఇతని పేరు సిముకుడు, శిముకుడు, శిశుకు, సింధుక, సిప్రక, సుద్ర, భిమున్ అనే భిన్న రూపాలలో కన్పిస్తుంది. కోటి లింగాల గ్రామంలో ఇతని నాణేలు దొరికినవి. నానాఘాట్ శాసనంలో రాయ శ్రీముఖుని ప్రసక్తి వున్నది. ఇతడు వేయించిన శాసనాలు లభ్యము కాలేదు. మౌర్య సామ్రాజ్యమును స్థాపించిన చంద్రగుప్తుడు ఆర్యావర్తమును మాత్రమే పాలించగలిగాడు. అతని కుమారుడైన బిందుసారుడు ఆర్యావర్తమునే గాక దక్షిణా పథమును కూడా తన ఆధీనం కిందికి తెచ్చుకొన్నాడు. బిందుసారుని మరణానంతరం సింహాసనం కొరకు అతని కుమారుల మధ్య వారసత్వ యుద్ధం జరిగింది. ఇది అదనుగా తీసుకొని శ్రీముఖుడు బిందుసారుని కాలంలో అణచబడిన ఆంధ్ర నాయకులను ఐక్యపరచి ఉద్యమం నడిపి స్వతంత్రించి వుండవచ్చు. వారసత్వ యుద్ధంలో విజయం సాధించి మౌర్య సింహాసనమధిష్టించిన అశోకుడు శ్రీముఖునికి రాజ బిరుదాన్ని ప్రసాదించాడు. అందువల్లనే పురాణాలు శ్రీముఖుని ఆంధ్ర రాజ్య స్థాపకునిగా వర్ణించినాయి. శ్రీముఖుడు వ్యవహార దక్షుడు. ఇతడు కళింగ పై విజయం సాధించిన మౌర్య అశోకునితో యుద్ధానికి దిగలేదు. అశోకునితో స్నేహ సంబంధాలు కొనసాగించాడు. అందువల్లనే అశోకుడు వేయించిన శాసనంలో ఆంధ్రులను 'హిత రాజుల' పట్టికలో చేర్చినాడు. ఆంధ్రులు అశోక చక్రవర్తి సామంతులుగా ఉన్నట్లు అశోకుని 13 వ శిలా శాసనంలో పేర్కొనబడింది. ఆంధ్ర దేశములో బౌద్ధమత ప్రచార నిమిత్తం అశోకుడు మహాదేవ భిక్షువును పంపాడు. ఇతని కృషి వల్ల ఆంధ్రులు బౌద్ధమును ఆదరించి పోషించిరి. శ్రీముఖుడు జైనమత పోషకుడు. ఇతడు అనేక జైన దేవాలయాలనూ, చైత్యాలను కట్టించినట్లు జైన గాధలు తెల్పుతున్నవి. శ్రీముఖుడు జయించిన దక్షిణా పథమందలి రాజులందరు వైదిక మతాభిమానులు. అందువల్ల శ్రీముఖుడు క్రమంగా వైదిక మతాభిమాని అయ్యాడు. చివరి దశలో శ్రీముఖుడు క్రూరుడైనాడని, సింహాసనభ్రష్టుడై చంపబడినాడని జైన గాధలు తెలుపుచున్నవి. దీనిని బట్టి నాటికే మతపరంగా అలజడులు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు. మహారాష్ట్ర ప్రాంతంలో బలవంతుడయిన మహారథి త్రణయికరో కుమార్తె దేవీనాగని కను తన కుమారుడైన శాతకర్ణికిచ్చి పెండ్లి చేయించి బంధుత్వం ఏర్పాటు చేసుకొన్నాడు. ఇతడు పిష్టపురమును రాజధానిగా చేసుకొని 23 సంవత్సరాలు రాజ్యమేలినాడు. చిన్న చిన్న రాజ్యములుగా ఉన్న ఆంధ్రదేశ భూభాగాలను ఏకం చేసి సువిశాల సామ్రాజ్యం నిర్మించి ఆంధ్ర జాతికొక ప్రత్యేక స్థానము ఏర్పరచి గొప్ప కీర్తి నార్జించాడు శ్రీముఖుడు. ఇతడు ఆంధ్ర సామ్రాజ్యమునకు తొలి రాజు, ప్రతిభావంతుడు.

## 4.3 కృష్ణుడు (క్రీ॥పూ॥ 248 - 230):-

శ్రీముఖుని తరువాత అతని సోదరుడు కృష్ణుడు లేక కనహ సింహాసనమధిష్టించాడు. ఇతడు 18 సంవత్సరాలు రాజ్యమేలినాడు. ఇతని కాలంలో మౌర్య అశోకునితో మిత్ర భావం మరింత ధృడపడింది. ఈ విషయాన్ని నాసిక్ శాసనము స్పష్టము చేస్తున్నది. ఒక మహా మాత్రుడు నాసిక్‌లోని శ్రమణులకు ఒక గుహను తొలిపించాడు. శ్రమణులలో చాలా మంది బౌద్ధులు. అశోకుని బౌద్ధమత ప్రచారం కృష్ణుని ఆకర్షించినట్లు తెలుస్తుంది. ఈ గుహ నిర్మాణానికి అశోకుని ధర్మ భావమే కారణం. ఈ గుహ నిర్మాణం శాతవాహనుల రీతిలో జరిగింది. శాతవాహనుల నాసిక్ గుహలలో ఇది మొదటిది. ఈ గుహ ఉనికిని బట్టి శాతవాహన రాజ్యం కృష్ణుని కాలంలో నాసిక్ వరకు విస్తరించినట్లు భావించవచ్చు. అశోకుని మరణానంతరం మౌర్య సామ్రాజ్యంలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితులను అదునుగా తీసుకొని కృష్ణుడు పూర్తిగా స్వతంత్రించాడు.

## 4.4 మొదటి శాతకర్ణి (క్రీ॥పూ॥ 230 - 220):-

కృష్ణుని తరువాత అతని కుమారుడైన మొదటి శాతకర్ణి రాజ్యానికి వచ్చాడు. పురాణాలు ఇతనిని కృష్ణుని కుమారుడని చెప్పినవి. కాని ఇతడు శ్రీముఖుని కుమారుడని నానేఘాట్ శిల్పాలు తెలుపుచున్నవి. ఇతని భార్య నాగానిక వేయించిన నానేఘాట్ శాసనమున్న రాతి మీద శ్రీముఖుడు, మొదటి శాతకర్ణి, నాగానిక, మహారథి త్రనకయిరో, మరో ముగ్గురు రాకుమారుల బొమ్మలు చెక్కబడినాయి. శాతకర్ణికి మహారాష్ట్ర ప్రాంతమందున్న మహారథుల సహకారముండటం వలన కృష్ణుడు న్యాయ సమ్మతముగా వారసుడైన శాతకర్ణికి రాజ్యం అప్పగించగలిగాడు. నాగానిక వేయించిన నానేఘాట్ శాసనంలో శాతకర్ణి వీర, శూశర, అప్రతిహత చక్ర, దక్షిణాపథపతిగా వర్ణించబడినాడు. మహారధికులతో గల సంబంధ బాంధవ్యముల వలన శాతవాహన రాజ్యానికి శత్రువుల దండయాత్రల వలన భయము లేకుండెను. శాతకర్ణి దండెత్తి వెళ్ళి తూర్పు మాళవ ప్రాంతాన్ని జయించాడు. ఉజ్జయిని చిహ్నంగా గల ఇతని నాణేలు ఇతడు మాళవమును జయించాడనుటకు నిదర్శనము. ఇతడు ఎన్నో యాగాలను, క్రతువులను చేసినట్లు నానేఘాట్ శాసనం చెబుతుంది. ఈ సందర్భంలో బ్రాహ్మణులకు వేల సంఖ్యలో ఆవులను, గుర్రాలను, కొన్ని ఏనుగులను దానంగా ఇచ్చినాడు. అంతేగాక గ్రామాలను దానం చేసినాడు. వేల సంఖ్యలో కార్షాపనములను ఇచ్చినాడు. తన యుద్ధ విజయానికి చిహ్నంగా శాతకర్ణి రెండు మార్లు అశ్వమేధ యాగం చేసాడు. యజ్ఞ యాగాదుల నిర్వహణలో అతనికి అతని భార్య నాగానిక సహకరించెను. ఇతని కాలంలో శాతవాహన సామ్రాజ్యం విదిశ వరకు విస్తరించింది.

మొదటి శాతకర్ణి తరువాత పూర్ణోత్సంగుడు (క్రీ॥పూ॥ 220 - 202), స్కంద స్తంభి (క్రీ॥పూ॥ 202 - 184) వరసగా రాజ్యమేలినారు. వీరి కాలంలో శాతవాహన రాజ్య వ్యాప్తి జరగలేదు. చివరి మౌర్య రాజుల బలహీనత కారణంగా శాతవాహన రాజ్య సరిహద్దు ప్రాంతాలకు ఏర్పడిన క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనటంలోనే ఈ ఇద్దరు రాజులు తమ కాలాన్ని గడిపినట్లు తెలుస్తుంది. వీరి కాలంలోనే మగధ రాజ్యం బలహీనమయింది. ఇది అనువుగా తీసుకొని మళ్ళీ గ్రీకులు భారత రాజకీయాలలో తలదూర్చినారు. డెమిత్రియస్, అప్పోలో డోటస్, మిననాండర్ అను గ్రీకు (యవ్వన) రాజులు విజృంభించి దక్షిణ హిందూ కుష్ ప్రాంతం మొదలు పంజాబ్ వరకు, సింధు డెల్టా నుంచి సౌరాష్ట్రం వరకు జయించి ఆక్రమించారు. మగధకు కూడా గ్రీకుల దాడి ప్రమాదమేర్పడింది. ఇదే సమయంలో పుష్య మిత్రుడు మౌర్య రాజులలో చివరివాడైన బృహద్రధాని వధించి మగధను ఆక్రమించి శుంగ వంశ పాలన ప్రారంభించాడు. ఇతడు గ్రీకుల బారి నుండి మగధను కాపాడటమే గాక, మధ్య భారతాన్ని కూడా రక్షించడానికి పూనుకొన్నాడు. విదేశీయులను పారద్రోలే ప్రయత్నంలో ఇతనికి అనుకోకుండా ఖారవేలుని సహాయం లభించినది. ఖారవేలుడు (కళింగ చక్రవర్తి) డెమిత్రియస్‌తో పోరాడి, ఓడించి తరిమివేసాడు. ఇంతలో గ్రీకులలో చెలరేగిన అంతర్యుద్ధం గ్రీకుల దృష్టిని మరల్చడంతో తాత్కాలికంగా గ్రీకుల బెడద తప్పింది. కాని గ్రీకుల దాడుల ఫలితంగా సౌరాష్ట్రం, శాతవాహన పశ్చిమ సరిహద్దు ప్రాంతాలు గ్రీకుల స్వాధీనమయ్యాయి.

## 4.5 రెండో శాతకర్ణి:- (క్రీ॥పూ॥ 184 - 128)

స్కంద స్తంభి తరువాత సింహాసన మెక్కిన రెండో శాతకర్ణి 56 సంవత్సరాలు రాజ్యమేలినాడు. ఇతడు గొప్ప విజేత,

పరాక్రమశాలి. ఇతని నాణేలు ఉత్తర తెలంగాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మాళవలందు లభించినవి. ఇతని కాలంలో కళింగాధిపతియైన ఖారవేలుడు తన సైన్యాన్ని శాతకర్ణి రాజ్యం పైకి పంపాడు. అయితే నేర్పుగా శాతకర్ణి ఖారవేలుని సేనతో ముఖాముఖి తలపడలేదు. పశ్చిమ సరిహద్దుల రక్షణలోనే శాతకర్ణి తన దృష్టిని నిమగ్నం చేశాడు. మధుర నుంచి గ్రీకులను పారద్రోలిన తరువాత ఖారవేలుడు మగధ పై దండెత్తి విజయం సాధించాడు. ఆ తరువాత అనతి కాలానికే ఖారవేలుడు మరణించాడు. పుష్యమిత్ర శుంగుడు కోల్పోయిన విదర్భను రాజకుమారుడు అతని మిత్రుడు తిరిగి జయించి ఆక్రమించాడు. ఈ విజయం ఖారవేలుని మరణానంతరం జరిగింది. విదర్భను శుంగులు జయించటం వల్ల శుంగుల రాజ్యం శాతవాహన రాజ్య సరిహద్దుల వరకు విస్తరించింది. దీనితో శుంగులకు శాతవాహనులకు మధ్య పోరాటం తప్పనిసరి అయింది. భారవేలుని మరణానంతరం అతని వారసులను రెండో శాతకర్ణి జయించి కళింగ రాజ్యాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. రెండో శాతకర్ణి తొలి నాణేలను బట్టి అవంతి, ఆకర రాజ్యాలు అతని ఆధీనంలో గలవని తెలుస్తుంది. శాతకర్ణి తూర్పు మాళవ పై దండెత్తి దానిని ఆక్రమించాడు. ఈ జైత్రయాత్ర అగ్ని మిత్రుని పాలనాకాలంలో జరిగింది. సాంచి ద్వారం పైన ఉన్న శాసనం, శాతకర్ణి నాణేలు అతని తూర్పు మాళ్వ రాజ్య ఆక్రమణను ధృవీకరిస్తున్నది. ఆంధ్ర సేనలు పాటలీపుత్రం పై దాడికి మునుపే శాతకర్ణి మరణించాడు. రెండవ శాతకర్ణి ఆస్థానంలోని ఆనందుడు గొప్ప కళాకారుడు. శిల్ప కళాభిజ్ఞుడు. విదేశీయుల విజృంభణను అణచి శాతవాహన సామ్రాజ్యానికి శత్రువుల భయం లేకుండా చేసిన శాతకర్ణి సుస్థిర పాలనను ఏర్పాటు చేసినాడు. ఇతడు సామ్రాజ్య విస్తరణకు, దాని కీర్తికి కారకుడయ్యాడు.

రెండో శాతకర్ణి తరువాత శాతవాహన సింహాసన మెక్కిన ఎనిమిది మందిరాజుల కాలంలో సామ్రాజ్యం వృద్ధి కావడానికి బదులు తరిగిపోయింది. రెండో శాతకర్ణి తరువాత లంబోదరుడు రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో శాతవాహనులు విదర్భను కోల్పోయారు. శుంగరాజైన భాగభద్రుడు విదర్భను ఆక్రమించినట్లు బేస్‌నగర్ శాసనం వల్ల గ్రహించవచ్చు. లంబోదరుని తరువాత ఆపేలకుడు, మేఘస్వాతి, స్వాతి శాతకర్ణి, స్కంద స్వాతి, మృగేంద్ర స్వాతికర్ణ, కుంతల శాతకర్ణి, స్వాతివర్ణ వరుసగా రాజ్యమేలినారు. కుంతల శాతకర్ణి ప్రసక్తి వాత్స్యాయనుని కామసూత్రాలలో గలదు. ఇతని ఆస్థానమున శర్వవర్మ, గుణాఢ్య పండితులున్నట్లు తెలియుచున్నది. మొదటి పులోమావి విజృంభణ కాలం వరకు ఈ 8 మంది రాజులు రాజ్యాన్ని కాపాడగలిగినారు. ఈ కాలంలోనే గ్రీకులు అంతర్గత ఘర్షణల్లో మునిగి తేలడంలో, వీరు పాలించిన భారతదేశ ప్రాంతాలను శక పల్లవులు ఆక్రమించారు. మొదటి అజెస్ శక - పహ్లవ రాజ్యాన్ని తూర్పున మధుర వరకు విస్తరింపజేశాడు.

## 4.6 మొదటి పులోమావి (క్రీ॥పూ॥ 43 - 19):-

స్వాతికర్ణ తరువాత మొదటి పులోమావి శాతవాహన సింహాసనం అధిష్టించాడు. ఇతడు శాతవాహన రాజుల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసి మగధ సామ్రాజ్య రాజధాని అయిన పాటలీపుత్రం పై ఆంధ్రుల అధికారాన్ని ప్రతిష్టించినాడు. ఇతను రాజ్యానికి వచ్చే నాటికి పశ్చిమ భారతదేశంలో గ్రీకుల ఆధిపత్యం అంతరించి శక క్షాత్రపులు అధికారాన్ని స్థాపించారు. శక రాజ్యంలోని రాష్ట్ర పాలకులను క్షాత్రపు లంటారు. వీరు తమ తమ రాష్ట్రాలలో చాలా వరకు స్వతంత్రులుగానే వ్యవహరించారు. ఈ క్షాత్రప రాజ వంశాలలో తక్షశిల, మధుర, సౌరాష్ట్ర, మాళవలను పాలించినవారు ప్రసిద్ధులు. మగధలో శుంగులలో చివరి రాజైన దేవభూతిని సంహరించి కాణ్వ వంశానికి చెందిన వాసుదేవుడు అధికారాన్ని స్థాపించాడు. అయితే మగధ సామ్రాజ్యంలోని మాళవము, మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాలను శక క్షాత్రపులు ఆక్రమించారు. కాణ్వులలో సుశర్మ మొదటి పులోమావి సమకాలికుడు. సుశర్మ కాలంలో మగధ సామ్రాజ్యం క్షీణదశకు చేరుకున్నది. మగధ రాజ్యాన్ని ఆక్రమించేది ఎవరన్నది నాటి ప్రశ్న. మగధ రాజ్యం విదేశీయుల చేతులలోకి పోనీయరాదని నిర్ణయించుకొన్న మొదటి పులోమావి పాటలీపుత్రం పై దండెత్తి సుశర్మను ఓడించి, వధించి మగధ సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. ఈ దండయాత్రలోనే పులోమావి అవంతి, ఆకర రాజ్యాలను కూడా ఆక్రమించాడు. శాతవాహన రాజ్యం అఖిల భారత సామ్రాజ్యంగా రూపొందినది. శాతవాహనులు మగధను జయించి పది సంవత్సరాలు రాజ్యం చేసినట్లు యుగ పురాణం తెలియజేస్తున్నది. ప్రాచీన పాటలీ పుత్రం, అలహాబాద్ సమీపంలోని భీతా వద్ద లభించిన శాతవాహన నాణేలు ఈ విజయాలను ధృవపరుస్తున్నాయి. పులోమావి దాడుల ఫలితంగా ఆంధ్ర సామ్రాజ్యం విస్తరించినది. కాని పెరిగిన సరిహద్దుల రక్షణా

భారం శక్తికి మించిన పని అయింది. పాటలీ పుత్రం శాతవాహనుల స్వాధీనమగుటతో శకుల దాడికి వారు అడ్డు అయినారు. శక క్షాత్రప రాజ్యాలకు ఆంధ్రరాజ్యం పక్కలో బల్లెమైంది. పశ్చిమ క్షాత్రపులలో రెండు వంశాల వారు గలరు. వారిలో ఒకరు క్షహరాటులు కాగా మరొకరు కర్దమక వంశము వారు.

మొదటి పులోమావి తరువాత గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చే వరకు శాతవాహన చరిత్రలో అంధయుగం. పులోమావి తరువాత రాజ్యమేలిన గౌరి కృష్ణుడు ఆంధ్ర సామ్రాజ్య విచ్ఛిన్నతకు కారకుడయినాడు. ఇతనిని పురాణాలు రిక్తవర్ణుడు, వికృష్ణుడు, అరిష్టకర్ముడు, అనిష్టకర్ముడు అని కించపరిచినాయి. పశ్చిమ క్షాత్రపులలో క్షహరాట వంశానికి చెందిన భూమకుడు అవంతి, ఆకరలను ఆక్రమించగా, క్షహరాటనహపాణుడు మహారాష్ట్రం పై దండెత్తి అపరాంతాన్ని ఆక్రమించాడు. నహపాణుని విజయానికి మధుర మహాక్షాత్రప రాజయిన రాజవులుడు చేసిన సహాయమే కారణం. ఈ విజయం తరువాత రాజవులుడు 'రాజాధి రాజ రక్షక' అను బిరుదు పొందాడు. నహపాణుడు నేటి దక్షిణ రాజస్థాన్, దక్షిణ గుజరాత్, మాళవం, ఉత్తర కంకణం, నాసిక్, పూనాలతో కూడిన విశాల సామ్రాజ్యాన్ని పాలించినట్లు తెలుస్తుంది. క్షహరాటుల గౌరవం ఇనుమడించి క్షాత్రపుల హోదా నుంచి మహా క్షాత్రపుల హోదాకు పెరిగింది.

## 4.7 హాలుడు (క్రీ॥శ॥ 6 - 7):-

గౌర కృష్ణుని తరువాత హాలుడు శాతవాహన సింహాసనమధిష్టించాడు. ఇతడు పాలించినది ఒక్క సంవత్సరమే అయినా ఇతడు సాధించిన కీర్తి అజరామరమైనది. కవుల ప్రపంచంలో ఇతడు నాటికీ నేటికీ ధ్రువతారగా నిల్చినాడు. ఇతడు స్వయంగా కవి. అనేక మంది కవులను పోషించి 'కవి వత్సలుడు'గా కీర్తింపబడినాడు. ఇతడు సమకాలీన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించే 700 గాధలను ప్రాకృత భాషలో 'గాధా సప్తశతి' అను పేరుతో సంకలనం చేశాడు. ఇతని కాలపు రాజకీయ సంఘటనలు తెలియడం లేదు. 'లీలావతి' అను తరువాత కాలపు ప్రాకృత గ్రంథాన్ని బట్టి హాలుని వివాహం సప్త గోదావరి ప్రాంతంలో జరిగిందని తెలుస్తున్నది. ఈ సప్త గోదావరి ప్రాంతం తూర్పు గోదావరి జిల్లాలోని ద్రాక్షరామంగా గుర్తించబడింది.

హాలుని తరువాత మందలకుడు, పులీంద్ర సేనుడు, సుందర శాతకర్ణి, చకోర స్వాతికర్ణ, శివస్వాతి వరసగా రాజ్యమేలినారు. వీరెవ్వరూ సమర్థులు కారు. శకక్షాత్రపులు పశ్చిమ ప్రాంతాలనాక్రమించారు. శాతవాహనుల నౌకాశ్రయాలైన సొపార, కళ్యాణ్‌లను క్షాత్రపులు మూసివేసి తమ ఆధీనంలో బ్రోచ్ నౌకాశ్రయం ద్వారా విదేశాలకు వెళ్ళే సరుకులను పంపుతూ ఉండినారు. ఆర్థికంగా ఇది శాతవాహన రాజ్యానికి పెద్ద దెబ్బ. అయితే ఈ కాలంలోనే విదేశీ తెగలలో కూడా వైషమ్యాలు పెరిగి వారి రాజ్యం కూడా చిన్న రాజ్యాలుగా చీలడం ప్రారంభమయింది. ఇదే సమయంలో కాబూల్ లోయను జయించిన కుషాణులు వాయువ్య భారతాన్ని కూడా జయించారు. కుషాణుల రాజ్యం అభివృద్ధి చెంది వారి నాయకుడు సార్వభౌమ పదవిని అందుకొన్నపుడు శక పహ్లవ రాకుమారులు అతనికి సామంతులయినారు. పహ్లవ రాకుమారులు మునుపటి వలెనే ఆధిపత్యం కోసం ఒకరితో ఒకరు కలహించుకొంటూ ఉండేవారని పెరిప్లస్ గ్రంథకర్త వ్రాసినాడు. ఈ పరిస్థితి శాతవాహన చక్రవర్తిగా గౌతమీపుత్ర శాతకర్ణికి అనుకూలించినది.

## 4.8 గౌతమీపుత్ర శాతకర్ణి (క్రీ॥శ॥ 62 - 86):-

గౌతమీపుత్ర శాతకర్ణి 23 వ శాతవాహన రాజు. ఇతని కాలంలో శాతవాహన సామ్రాజ్య విస్తృతి, ఆ వంశ గౌరవ పునరుద్ధరణ జరిగినాయి.

గౌతమీపుత్ర శాతకర్ణి అధికారానికి వచ్చే నాటికి శక - పహ్లవ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. కుషాణులు వాయువ్య దిశ నుండి వచ్చి శక - పహ్లవులను వేధించసాగారు. శక - పహ్లవుల మీద విజయం సాధించడానికి గౌతమీపుత్ర శాతకర్ణికి ఈ పరిస్థితులు అనుకూలించాయి.

శాతవాహనులు పోగొట్టుకున్న రాజ్య భాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి గౌతమీపుత్ర శాతకర్ణి భారీ ఎత్తున

ప్రయత్నాలు చేసినాడు. ఈ విషయం అతని నాసిక్, కారే శాసనాల నుంచి గ్రహించవచ్చు. సైన్య సమీకరణ పూర్తి అయిన **తరువాత,** తన 18వ పాలనా సంవత్సరంలో గౌతమీపుత్రుడు దండయాత్ర ప్రారంభించాడు. ఇతడు మొదట విదర్భ పై దండెత్తి దాని **ముఖ్య** పట్టణమైన 'కుశవతి'ని ముట్టడించి ఆక్రమించాడు. కుశవతి వైనగంగ పై వున్న నేటి పౌని నగరము. అచట నుండి క్షాత్రపరాజైన నహపాణుని పై దండెత్తి ఘోరముగా పోరాడి నాసిక్ సమీపాన గోవర్ధన వద్ద చిత్తుగా ఓడించి తరిమికొట్టాడు. పరాజయం చెందిన నహపాణుడు పర్వత ప్రాంతమైన మాళ్వకు పారిపోయినాడు. విజయోత్సాహములో మునిగిన గౌతమీపుత్రుడు నాసిక్ సమీపము నందలి బౌద్ధ గుహలను దర్శించి, అచటి బౌద్ధ సంఘమునకు భూమి దానం చేశాడు. విదర్భలోని బెనకాటక బౌద్ధ భిక్షువులకు సర్వ రక్షణలు, సదుపాయాలిచ్చి, 'బెనాకాటక స్వామి' అనే బిరుదాన్ని ధరించినట్లు గౌతమీపుత్రుడు 18 వ రాజ్య కాలంలో వేసిన నాసిక్ శాసనంలో చెప్పబడింది. విజయోత్సాహంలో కర్తవ్యాన్ని మరచిపోకుండా శత్రు శేషాన్ని ఉంచడం తనకు, తన రాజ్యానికి ప్రమాదమని తలచి సహ్యాద్రి పర్వత శ్రేణులలో తలదాచుకున్న నహపాణుని నిర్జించెను. ఆ తరువాత కార్లే వద్ద మరో యుద్ధం చేసి అతని కుటుంబాన్ని తుదముట్టించెను. ఈ సందర్భంలో గౌతమీపుత్రుని కార్లే శాసనం అతని దాన ధర్మాలను వివరిస్తుంది. మామళ్ళహారం ఉత్తరాన వలూరక గుహల్లో నివసించే మహా సాంఘిక బౌద్ధ భిక్షువులకు ఒక గ్రామాన్ని దానం చేశాడు. నేటి మాళ్వయే మామళ్ళహారము.

నహపాణుని, అతని కుటుంబాన్ని సమూలంగా నిర్మూలించి అతనిచే జారీ చేయబడిన నాణేలను గౌతమీపుత్రుడు సంగ్రహించి వాటిపై తన ముద్రను వేయించాడు. ఇది భారతదేశ నాణేల చరిత్రలో చాలా కీలకమైన ప్రయోగము. నాసిక్ జిల్లాలోని జోగల్ తంబి నిధిలో తిరిగి ముద్ర వేయబడిన నహపాణుని 13, 250 నాణేలు ఇందుకు తార్కాణం. వెండి నాణేల వినియోగం ఆనాటి ఆర్థిక సుస్థిరతను, ప్రజల జీవన స్థాయిని తెలియజేయుచున్నది. అమలులో వున్న పరాజితుని నాణేలను రద్దు చేసినచో ప్రజలలో కల్లోలము వచ్చుటయే గాక ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమగునని గౌతమీపుత్రుడు గ్రహించాడు. క్రొత్తగా జయించిన రాజ్యంలో దొంగ నాణేలు వ్యాప్తి లోనికి రాకుండా తన ముద్రను వేసి వాటిని ఆమోదించాడు. ఈ ప్రయోగాన్ని బట్టి గౌతమీపుత్రుడు గొప్ప ఆర్థిక శాస్త్రజ్ఞుడని చెప్పవచ్చు.

గౌతమీపుత్ర శాతకర్ణి విజయాలను, గుణగణాలను, గొప్పతనాన్ని అతని తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనం తెలియజేస్తుంది. గౌతమీపుత్రుని కుమారుడు బాలశ్రీ మనుమడు అయిన వాశిష్టీ పుత్ర పులోమావి 9 వ రాజ్య సంవత్సరంలో ఈ శాసనం విడుదల చేయబడింది.

**నాసిక్ శాసనం ప్రకారం గౌతమీపుత్రుడు జయించి, ఆక్రమించిన రాజ్యాలు:-** అస్సక (నిజామాబాద్, ఔరంగాబాద్ జిల్లాలు), ఆస్సిక (అస్సకకు దక్షిణంగా కృష్ణా, గోదావరీ నదుల మధ్య ప్రాంతం), ములక (పైఠాన్ పరిసర ప్రాంతం), సౌరాష్ట్ర (దక్షిణ కథియవాడ), కకుర (తూర్పు రాజస్థాన్), అపరాంత (ఉత్తర కొంకణ, ఉత్తర మహారాష్ట్ర), అనూప (నర్మాదానది మీద మహిష్మతీ రాజధాని), విదర్భ (బీరార్), ఆకర (విదిశ రాజధాని, తూర్పు మాళవ), అవంతి (పశ్చిమ మాళవ, ఉజ్జయిని రాజధాని).

నాసిక్ శాసనంలో గౌతమీపుత్రుడు వింధ్య పర్వతాల నుండి మలయ పర్వతాల వరకు, తూర్పు కనుమల నుండి పడమర కనుమల వరకు ఉన్న అన్ని పర్వతాలకు అధినాధుడు అని పిలవడం జరిగింది.

**ఆ పర్వతాలు:-** వింధ్య, అచవట, పారియాత్రి (వింధ్య, ఆరావళీ శ్రేణులు), సహ్య (పశ్చిమ కనుమలు), కన్హగిరి, మలయ (నీలగిరులకు పశ్చిమాన), మహేంద్ర, చకోర (శ్రీశైలం శ్రేణులు), సెటగిరి, సిరితన.

దీనినిబట్టి గౌతమీపుత్రుని సామ్రాజ్యం తూర్పున బంగాళా ఖాతం నుంచి పడమర అరేబియా సముద్రం వరకు, ఉత్తరాన రాజస్థాన్ నుంచి దక్షిణాన కృష్ణానది వరకు విస్తరించి ఉండేదని తెలుస్తుంది. ఇతనిని 'త్రిసముద్రతోయ పీతవాహన' అని నాసిక్ శాసనం పేర్కొంటుంది. ఇతని రథ అశ్వాలు మూడు సముద్రాల నీరు త్రాగాయని దీని అర్థం.

గౌతమీపుత్రుడు శక, యవన, పహ్లవులను నాశనం చేసి క్షహరాట వంశాన్ని నిరవశేషంగా నిర్మూలించి 'క్షహరాట **వంశ** నిరవశేషకర్' అను బిరుదు ధరించాడు. తన దిగ్విజయ **యాత్రల** ద్వారా గౌతమీపుత్రుడు శాతవాహన సామ్రాజ్యాన్ని పునరుద్దరించి

**'శాతవాహన వంశ ప్రతిష్టాపకం'** అని కీర్తి గడించాడు. క్షత్రియుల దర్పమణచినాడు. క్షత్రియ రాజ వంశాల పై ఇతడు సాధించిన విజయాలకు సూచకంగా 'క్షత్రియ దర్పమాన మర్ధన' అను బిరుదు గడించాడు.

ధర్మ శాస్త్ర సమ్మతమైన రాజరికం,శాతవాహన రాజ్యంలో కొనసాగింది. నాసిక్ శాసనంలో గౌతమీపుత్రుడు 'కుల పురుష పరంపరాగత విపుల రాజ్యం' పొందాడంటూ బాలశ్రీ వర్ణించింది. అనగా దీనిని బట్టి మాతృస్వామ్యం గాక తండ్రి ద్వారా సింహాసనాన్ని పొందడమే శాతవాహనుల రాజరిక సాంప్రదాయమని చెప్పవచ్చు. వర్ణధర్మాలను పరిరక్షించడం రాజధర్మంగా శాతవాహనులు పరిగణించారు. అందువల్లనే గౌతమీపుత్రుడు వర్ణ సంకరం కాకుండా కాపాడి 'ఏక బ్రాహ్మణ' అని కీర్తి పొందాడు.

విదేశీయులైన యవనులు, క్షహరాటులు, పహ్లావుల చేత హైందవ మతాన్ని స్వీకరింపజేసి హైందవ మత ధర్మాలను ఆచరింపజేసినాడు గౌతమీపుత్రుడు. క్షహరాటులను ఓడించి, క్షహరాట వంశ సర్వంశకర, 'హైందవ వంశ ప్రతిష్టాపకర' అను బిరుదులు ఇతడు స్వీకరించాడు. నాసిక్ శాసనం గౌతమీపుత్రుని 'ఆగమనిలయుడు' అంటూ పౌరాణిక వీరులతో పోలుస్తున్నది. అందువల్ల ఈ కాలంలోనే ఆగమ పౌరాణిక సాహిత్యం బహుళ ప్రచారంలో వున్నట్లు చెప్పవచ్చు. తల్లి బాలశ్రీ ప్రభావం వల్ల పరమత సహనం ప్రదర్శించి బౌద్ధులకు సైతం దాన ధర్మాలు చేశాడు. అందువల్లనే బాలశ్రీ ఇతనిని 'అవిపన్న మాతృ శుశ్రూషక' అని పురాణ పురుషులతో పోల్చింది.

గౌతమీపుత్రుడు బలిష్టమైన శరీరంతో, ఆకర్షించే వదనంతో, వీరునిగా, శూరునిగా నాసిక్ శాసనంలో ప్రశంసింపబడినాడు. ఇతడు అపజయం ఎరుగని వీరుడు. అరివీర భయంకరుడు, శత్రువులను కూడ క్షమించగల ఉదార హృదయుడు. ప్రజలను కన్నబిడ్డల వలె పాలించిన సహృదయుడు, శాతవాహన వంశ ప్రతిష్టను పునరుద్ధరించి తన దేశానికి, వంశానికి, ప్రజలకూ కీర్తి కల్గించిన వీరుడు గౌతమీపుత్ర శాతకర్ణి. ఇతడు గావించిన సామాజిక, ఆర్థిక సంస్కరణలు ప్రాచీన భారతదేశ చరిత్రలో పునాది రాళ్ళుగా భావించవచ్చు.

## 4.9 వాశిష్టీ పుత్ర (రెండో) పులోమావి (క్రీ॥శ॥ 86 - 114):-

గౌతమీపుత్ర శాతకర్ణి తరువాత రెండోపులోమావి రాజ్యానికి వచ్చాడు. ఇతడు వారసత్వంగా సువిశాల సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు. ఇతని పాలనా కాలానికి చెందిన 8 శాసనాలు లభించాయి. వాటిలో 4 నాసిక్‌లో, 2 కార్లేలో, 1 అమరావతిలో, మరొకటి ధరణికోటలో దొరికాయి. ఇతని నాణేలు ఆంధ్ర దేశంలో విస్తారంగా లభించాయి. ఉజ్జయినిని పాలించిన చష్టనుడు రెండో పులోమావి సమకాలికుడని టాలమీ పేర్కొన్నాడు. రెండో పులోమావి 19వ పరిపాలనా సంవత్సరమున గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనంలో ఇతనిని 'దక్షిణాపథేశ్వరు'నిగా వర్ణించబడింది. రాజ్యానికి వచ్చిన 20 సంవత్సరాలు రెండో పులోమావి ఎటువంటి కష్టాలు లేకుండా రాజ్యాన్ని పాలించాడు. కాని చివరి రోజులలో శాతవాహన రాజ్యం పై విదేశీ దండయాత్రలు ఎక్కువైనాయి. కుషాణ చక్రవర్తి కనిష్కుడు సింధునది దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడని 'సుయివిహార' శాసనం చెబుతుంది. కనిష్కుని కుమారుడైన హువిష్కుని శాసనాల వలన అతడు మధురకు అధిపతి అని స్పష్టమవుతుంది. కర్ధమక వంశానికి చెందిన చష్టనుడు పులోమావి పై దండెత్తి ఉజ్జయినిని ఆక్రమించుకొన్నాడు. చష్టనుని నాణేలకు మధుర నాణేలకు ఉన్న పోలికను బట్టి చష్టనుడు కుషాణుల ప్రోత్సాహంతోనే శాతవాహన సామ్రాజ్యం పై దండయాత్రలు ప్రారంభమైనాయని పండితుల భావం. ఇదే కాలంలో శకులు దండెత్తి వెళ్ళి ఆకర దేశాన్ని ఆక్రమించారు. ఫలితంగా పులోమావి రాజ్యం తూర్పు దక్కన్‌కు మాత్రమే పరిమితమయింది. కోల్పోయిన ప్రాంతాలను తిరిగి ఆక్రమించటానికి పులోమావి ప్రయత్నించలేదు. తెలాంధ్ర దేశంలోని ధాన్య కటకాన్ని రాజధానిగా చేసుకొని పులోమావి పాలించాడు. అమరావతి, ధరణికోటలో లభించిన పులోమావి శాసనాలు, ఆంధ్రాలో విస్తారంగా లభించిన అతని నాణేలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ప్రతిష్టాన పురాన్ని రాజ ప్రతినిధికి అప్పగించినాడు. ఇది ఇతని బలహీనతకు నిదర్శనము.

రెండో పులోమావి తరువాత శివశ్రీ రాజైనాడు. ఇతని తరువాత శివస్కంధుడు రాజ్యానికి వచ్చినాడు. వీరిద్దరు పాలించిన 14 సంవత్సరాలలో చష్టనుని అధికారం బాగా పెరిగి గుజరాత్, సౌరాష్ట్రలకు వ్యాపించింది. అయితే ఆంధ్రులతో జరిగిన యుద్ధాలలో

చష్టనుడు తన కుమారుని కోల్పోయినాడు. అందే శాసనంలో చష్టనుని, అతని మనుమడైన రుద్రదాముని పేర్లు ఉండటం వల్ల క్రీ॥శ॥ 130 నాటికే సౌరాష్ట్రంలో శాతవాహనుల పాలన అంతరించినట్లు తెలుస్తున్నది.

## 4.10 యజ్ఞశ్రీ (క్రీ॥శ॥ 128 - 157):-

శివ స్కంధుని తరువాత సింహాసనమధిష్టించిన యజ్ఞశ్రీ **శాతవాహన** వంశంలో చివరి గొప్పరాజు. ఇతడు కర్ధమకులను ఓడించడానికి విఫల ప్రయత్నం చేసాడు. చష్టనుని మనుమడైన రుద్రదాముడు యుక్తిపరుడు, ధైర్యశాలి. ఇతడు శాతవాహనులను విభజించి చిత్తు చేయడానికి శివశ్రీ సోదరుడైన వాసిష్టీ పుత్ర శాతకర్ణికి తన కుమార్తె అయిన రుద్రదమనికను ఇచ్చి వివాహం చేశాడు. రాజుని చేస్తానని రుద్రదాముడు తనఅల్లునికి మాట ఇచ్చినాడు. శాతవాహనుల సేనలో చీలికలను తెచ్చినాడు. తన అల్లుడిని రాజును చేయటానికి యజ్ఞశ్రీ పై రుద్రదాముడు రెండుసార్లు దండెత్తినాడు. దక్షిణా పథ పాలకుడగు శాతకర్ణిని రెండుమార్లు యుద్ధంలో ఓడించి దూరపు బంధువు కావడం వల్ల కీడు చేయకుండా వదలివేసినట్లు గిర్నార్ శాసనంలో రుద్రదాముడు చెప్పుకున్నాడు. రుద్రదాముని దండయాత్రల వల్ల సౌరాష్ట్ర, కకుర, అపరాంత, అనూష, అకర, అవంతి దేశాలను శాతవాహనులు పోగొట్టుకున్నారు. **యజ్ఞశ్రీ** నుండి జయించిన శాతవాహన రాజ్య పశ్చిమ ప్రాంతాలకు వాశిష్టీ పుత్ర శాతకర్ణిని పాలకునిగా నియమించినట్లు నానేఘాట్ శాసనంలో చెప్పిన 'క్షత్రప' అనే వాశిష్టీ పుత్ర శాతకర్ణి బిరుదం సూచిస్తుంది. పశ్చిమ దక్కన్‌ను కోల్పోయి అసిక, అసక, ములక, విదర్భలతోపాటు దక్కన్ తూర్పు భాగమైన ఆంధ్ర దేశాన్ని పాలించాడు. ఇతని 27 వ పాలనా సంవత్సరం నాటి శాసనం మోటుపల్లి సమీపంలోని చిన గంజాంలో లభించింది. నౌకా ముద్ర గల యజ్ఞశ్రీ నాణేలు ఆనాడు జరిగిన విదేశీ నౌకా వ్యాపారాన్ని తెలియజేస్తాయి. బాణ మహాకవి యజ్ఞశ్రీని 'త్రిసముద్రాధీశ్వరుడ'ని స్తుతించాడు.

యజ్ఞశ్రీ తరువాత వరుసగా విజయశ్రీ, చంద్రశ్రీ, మూడో పులోమావి అనే ముగ్గురు రాజులు 17 సంవత్సరాలు పాలించారు. మూడో పులోమావి కాలంలో శాతవాహనీహారాన్ని మహా సేనాధిపతి ఖండనాగుడు పాలిస్తున్నట్లు మ్యాకదోని శాసనం చెబుతుంది. మూడో పులోమావి తరువాత శాతవాహన సామ్రాజ్యం క్షీణించింది. పశ్చిమ జిల్లాలో చుటు కులస్థులు, నాసిక్ ప్రాంతంలో అభీరులు, తూర్పున ఇక్ష్వాకులు విజృంభించారు.

**ముగింపు:-** శాతవాహన రాజులు 30 మంది 450 సంవత్సరాలు పాలించారు. వీరిలో సమర్థులైన వారి కాలంలో సామ్రాజ్యం వైభవాన్ని, అసమర్థుల కాలంలో క్షీణత్వాన్ని అనుభవించినది. వీరు దక్షిణా పథానికి రాజకీయ ఐక్యాన్ని సాధించి శక దండయాత్రల నుంచి రక్షించి శాంతి భద్రతలు చేకూర్చారు.

## 4.11 పశ్చిమ క్షాత్రప - శాతవాహన సంబంధాలు:-

**ఉపోద్ఘాతము:-** మౌర్య సామ్రాజ్యము విచ్ఛిన్నమైన తరువాత **ఉత్తరా** పథాన్ని శుంగ, కాణ్వాన రాజులు, దక్షిణా పథాన్ని శాతవాహనులు పాలిస్తున్న కాలంలో పంజాబ్, పశ్చిమ వాయువ్య సరిహద్దు ప్రాంతాలను విదేశీ జాతుల వారు దండెత్తి వచ్చి ఆక్రమించి రాజ్యాలు స్థాపించినారు. వీరిలో మొదట వచ్చిన వారు ఇండో- బాక్ట్రియన్‌లు. వీరి తరువాత సిథియన్‌లు (శకులు), పార్థియన్‌లు (పహ్లావులు), కుషాణుయులు వచ్చినారు. ఈ విదేశీ జాతుల వారు వాయువ్య భారతంలో రాజ్యాలు స్థాపించి సుమారు నాలుగు శతాబ్దాల కాలం పాలన సాగించి భారతీయ సంస్కృతీ వైవిధ్యానికి దోహదం చేశారు.

భారతదేశం పైకి దండెత్తి వచ్చిన ఇండో - బాక్ట్రియన్‌లు, దక్షిణ దిశలో తమ అధికారాన్ని విస్తరింపచేయలేదు. అయితే ఆ తరువాత వచ్చిన శకులు, తరువాత వచ్చిన శక రాజ్యంలోని రాష్ట్ర పాలకులు (క్షాత్రపులు), పశ్చిమ ఉత్తర భారతంలో అనేక ప్రాంతాలు ఆక్రమించి చిన్న చిన్న రాజ్యాలు స్థాపించారు. తక్షశిలలోను, మధురలోను స్థాపించబడిన రాజ్యాలను ఉత్తర క్షాత్రప

రాజ్యాలని, మాల్వా, మహారాష్ట్ర ప్రాంతాలలో స్థాపించబడిన రాజ్యాలను పశ్చిమ క్షాత్రప రాజ్యాలని అంటారు.

శాతవాహనులు నిరంతరం స్వదేశీ, విదేశీ రాజులతో పోరు సాగించారు. వారిలో ప్రబలులు పశ్చిమ క్షాత్రపులు. శాతవాహనులలో 15 వ రాజైన మొదటి పులోమావి కాలంలో పశ్చిమ క్షాత్రప, శాతవాహన సంఘర్షణ ప్రారంభమైనది. ఈ కాలంలోనే మగధలో అధికారంలోకి వచ్చిన కణ్వ వంశస్తులు బలహీనులు కావడంతో శకులు విజృంభించి వాయవ్య భారతాన్నే గాక రాజస్థాన్, మాల్వా, గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రాంతాలను ఆక్రమించారు. తన రాజ్యానికి శకులు ప్రమాదకారులని గ్రహించిన మొదటి పులోమావి మగధను ఆక్రమించి శాతవాహన అధికారాన్ని ఉత్తర భారతదేశంలో ప్రతిష్టించాడు. ఈ విజయాలను గురించి ప్రాచీన పాటలీపుత్రం, అలహాబాద్ సమీపంలో దొరికిన శాతవాహన నాణేలు సాక్ష్యమిస్తున్నాయి. శాతవాహనులు మగధను జయించి పది సంవత్సరాలు రాజ్యం చేసినట్లు యుగ పురాణం తెలియజేస్తుంది. మగధ పై విజయం సాధించిన తరువాత పులోమావి శకులను ఓడించి మాల్వా, విదర్భ ప్రాంతాలను ఆక్రమించాడు.

## 4.12 భూమకుడు - గౌర కృష్ణుడు:-

మొదటి పులోమావి స్వాధీనం చేసుకొన్న మాల్వా, విదర్భ ప్రాంతాలను తిరిగి సంపాదించడానికి శకులు ప్రయత్నాలు ప్రారంభించారు. మధుర మహా క్షాత్రపుడైన రాజులుని సహకారంతో పశ్చిమ దక్కన్‌లో క్షాత్రప క్షహరాటులు విజృంభించారు. క్షహరాట వంశానికి చెందిన భూమకుడు మాల్వా పై దండెత్తి శాతవాహన రాజైన గౌరకృష్ణుని ఓడించి ఆకరము, అవంతిలను ఆక్రమించాడు. భూమకుని చేతిలో ఓడినందుకు గాను గౌరకృష్ణుని పురాణాలు రిక్తవర్ణుడు, వైకృష్ణుడు, అనిష్టకర్ముడు, అరిష్టకర్ముడు అని కించపరిచాయి. గౌరకృష్ణుని తరువాత గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చే వరకు ఏడుగురు రాజులు పాలించారు. వీరెవ్వరు క్షహరాటులతో పోరు సల్పినట్లు కన్పించదు.

## 4.13 నహపాణుడు - గౌతమీపుత్ర శాతకర్ణి:-

భూమకుని తరువాత నహపాణుడు క్షాత్రప సింహాసన మధిష్ఠించినాడు. ఇతడు క్షహరాట వంశస్తులలో సుప్రసిద్ధుడు. ఇతడు శాతవాహన సామ్రాజ్యం పై దండెత్తికెళ్ళి అపరాంతం వరకు గల భూభాగాన్ని ఆక్రమించాడు. శాతవాహన సామ్రాజ్యంలోని రాజస్థాన్, గుజరాత్, కధియవార్, విదర్భ, కొంకణ్, నాసిక్, కన్‌హేరి ప్రాంతాలు నహపాణుని పాలన క్రిందికి వచ్చాయి. ఈ విజయాలతో నహపాణుడు, మహాక్షాత్రపుడు అనే బిరుదు వహించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. శాతవాహనుల అధికారం ఆంధ్ర ప్రాంతానికే పరిమితమయింది. నహపాణుడు తాను జయించిన ప్రాంతాలలో తన అల్లుడైన ఋషభదత్తుని పాలకునిగా నియమించాడు. ఋషభదత్తుడు నహపాణుని కుమార్తె యగు దక్షమిత్రను వివాహమాడెను. ఋషభదత్తుడు, అతని భార్య దత్తమిత్రులు వేయించిన శాసనాలు, వారి దాన ధర్మాలనే గాక నహపాణునిచే నిర్వహించబడిన ధర్మ కార్యాలను గురించి కూడా చెపుతాయి. నాసిక్ గుహలో ఋషభదత్తునిచే జారీ చేయబడిన శాసనంలో చాతుదివస సంఘ బౌద్ధ భిక్షువుల కొరకు ఒక నిధిని ఏర్పాటు చేసి దాని పై వచ్చే వడ్డీని ఖర్చు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు ప్రస్తావించబడింది. దీనితో పాటు కావుర ఆహారంలో వున్న చిఖల పద్ర అనే గ్రామంలో బౌద్ధ భిక్షువులు కొరకు 8 వేల కొబ్బరి చెట్లను దానంగా ఇచ్చినట్లు పేర్కొనబడింది. వలూరక గుహల్లో వర్షాకాలంలో నివసించే బౌద్ధ భిక్షువుల పోషణ నిమిత్తం కరజిక అనే గ్రామాన్ని ఋషభదత్తుడు దానంగా ఇచ్చినట్లు కార్లే గుహ శాసనంలో గలదు. ఈ శాసనంలోనే హిందువులకు ఇచ్చిన లక్ష గోవులు, సువర్ణ నాణేలు, సురులకు, భూసురులకు ఇచ్చిన 16 గ్రామాలు, ప్రభాస వద్ద 8 మంది బ్రాహ్మణులకు వివాహం, 1000 మంది బ్రాహ్మణులకు ఉచిత భోజనం, బాణా నదిలోకి దిగే మెట్ల నిర్మాణం మొదలగు విషయాలు గలవు. నాసిక్‌లో 10 వ గుహలో వున్న ఋషభదత్తుని మరియొక శాసనంలో మామగారైన నహపాణుని పుణ్యం కోసం పౌర్ణమి నాడు హిందువులకు ఇచ్చిన దానాలు పేర్కొనబడ్డాయి. ఋషభదత్తుడు హిందూ, బౌద్ధ మతాలకు దానధర్మాలు చేయగా, దక్షమిత్ర బౌద్ధ సంఘాలనే దానం చేసింది. ఋషభదత్తుడు భార్య దక్షమిత్ర ప్రోత్సాహం వల్లనే బౌద్ధ సంస్థలకు దాన ధర్మాలు చేసి వుండవచ్చు.

శక క్షాత్రప దండయాత్రల వల్ల శాతవాహనులు పోగొట్టుకున్న కీర్తి ప్రతిష్టలను గౌతమీపుత్ర శాతకర్ణి పునరుద్ధరించాడు. ఇతడు శాతవాహన రాజులలో 23 వ వాడు. ఇతను రాజ్యానికి వచ్చే నాటికి ఉత్తరాన కుషాణుల దాడులతో శక, పహ్లావుల శక్తి క్షీణించనారంభించింది. ఈ పరిస్థితులు శాతకర్ణికి అనుకూలించాయి. ఇతని నాసిక్, కార్లే శాసనాలను అనుసరించి శక, పహ్లావుల పై దాడికి భారీగా సన్నాహాలు చేసాడు. వైజయంతి సేనలు ఈ దాడుల్లో కీలక పాత్ర నిర్వహించాయి. శాతకర్ణి దండెత్తి వెళ్లి క్షాత్రపులు జయించిన శాతవాహన సామ్రాజ్య భాగాలన్నింటిని తిరిగి స్వాధీనం చేసుకొన్నాడు. ఈ విజయాలకు సూచనగా నాసిక్ ప్రాంతంలో గోవర్థన ఆహారం అంతకు పూర్వం ఋషభదత్తుడు దానం చేసిన గ్రామాన్ని తిరిగి అదే కుటుంబం వారికి శాతకర్ణి ధృవపరిచాడు. నహపాణుని పై గౌతమీపుత్ర శాతకర్ణి విజయం సాధించినట్లు జోగల్ తంబిలో లభ్యమైన పునర్ముద్రిత నాణేలు తెలియజేస్తాయి. విజయం సాధించిన శాతకర్ణి క్షాత్రప రాజ్యంలో చెలామణిలో వున్న నాణేలను సేకరించి వాటి చెలామణికై తన ఆమోద ముద్ర వేయించాడు. దీని వలన దేశంలో చెలామణి అవుతున్న క్షాత్రపుల నాణేల మొత్తాన్ని, దానివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను, ఆర్థిక పరిణామాలను అంచనా వేసేందుకు వీలవుతుంది. అంతేగాకుండా శాతకర్ణి రాజ్యాధికారం కూడా జయింపబడిన ప్రజలకు తెలుస్తుంది. ఈ పునర్ముద్రణ విధానం ప్రభుత్వేతర వ్యక్తులు దొంగ నాణేలను చలామణిలోనికి తీసుకురాకుండా నిలుపు చేస్తుంది. ఇది ఒక ఆర్థికపరమైన అపూర్వ సంస్కరణ. గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనం వల్ల గౌతమీపుత్ర శాతకర్ణి సాధించిన విజయాలు, గుణగణాలు తెలియవస్తాయి. శాతవాహన కాలయశః ప్రతిష్టాపన కరుడని, క్షత్రియ దర్పమాన మర్దనుడని, క్షహరాటవంశ నిరవశేషకరుడని, శకయవన పహ్లావ నిషాదనుడని పై శాసనం శాతకర్ణిని కీర్తించింది. అసిన, అసక, ములక, సురుట, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, అకారవంతి ప్రాంతాలు కలిగిన సామ్రాజ్యానికి రాజుగా, వింధ్య, రిక్షావత, పారియాత్ర, సహ్యా, కిష్ణగిరి, మిఛ్ఛ, శ్రీస్తన మలయ, మహేంద్ర, శేతగిరి, చకోర పర్వత ప్రాంతాలకు ప్రభువుగా శాతకర్ణిని ఈ శాసనం పేర్కొంటున్నది.

## 4.14 చష్టనుడు - రెండవ పులోమావి :-

గౌతమీపుత్ర శాతకర్ణి తరువాత రెండవ పులోమావి అధికారానికి వచ్చాడు. ఇతని కాలంలో కార్దమ వంశానికి చెందిన క్షాత్రపులు శాతవాహనులు కోల్పోయిన ప్రాంతాలను తిరిగి జయించడానికి ప్రయత్నించారు. ఈ వంశానికి మూల పురుషుడు యశమతిక. ఇతని కుమారుడైన చష్టనుడు కుషాన్ చక్రవర్తి కనిష్కుని సామంతుడని కొందరి అభిప్రాయం. ఇతడు రెండవ పులోమావిని ఓడించి రాజస్తాన్, ఉజ్జయిని, మాల్వా, విదర్భలను జయించాడు. పులోమావి తన రాజ్యాన్ని రక్షించుకోవడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. అయితే ఈ యుద్ధాలలో చష్టనుని కుమారుడు జీవధాముడు మరణించాడు. చష్టనుడు ఆకర, అవంతిలను ఆక్రమించినట్లు టాలమీ పేర్కొన్నాడు. చష్టనుని నాణేలు సౌరాష్ట్ర, గుజరాత్‌లలో లభించాయి. దీనినిబట్టి చివరి దశలో పులోమావి పరిపాలన దక్కన్ తూర్పు ప్రాంతాలకు మాత్రమే పరిమితమయినట్లు నిర్ధారించవచ్చు. చష్టనుడు తన మనుమడైన రుద్రదామునితో కలిసి పాలించినట్లు కచ్‌లోని శాసనాలు తెల్పుతున్నవి.

## 4.15 రుద్రదాముడు - వాశిష్ట పుత్ర శాతకర్ణి:-

చష్టనుని తరువాత రుద్రదాముడు అధికారానికి వచ్చాడు. ఇతడు కార్ధమక వంశస్థులలో అగ్రగణ్యుడు. అంధౌ, గిర్నార్ శాసనాల నుంచి రుద్రదాముని చరిత్ర గుణగణాలు తెలుస్తున్నాయి. రుద్రదాముని కాలంలో రెండవ పులోమావి తిరిగి కోల్పోయిన ప్రాంతాలను జయించడానికి ప్రయత్నించాడు. కాని రుద్రదాముడు పులోమావిని ఓడించి తరిమివేయడమే గాక పులోమావి తమ్ముడైన వాశిష్టి పుత్ర శాతకర్ణికి తన కుమార్తె రుద్రభట్టారికను ఇచ్చి వివాహం చేసి తన వైపుకు త్రిప్పుకున్నాడు. రుద్రదాముడు తాను శాతవాహనుల నుంచి జయించిన ప్రాంతాలకు తన అల్లుడు వాశిష్టి పుత్ర శాతకర్ణిని పాలకునిగా నియమించాడు. స్వభావహు బల సామర్థ్యముతో మహాక్షాత్రప బిరుదాన్ని స్వయంగా ఆర్జించుకొన్నట్లు రుద్రదాముడు జునాఘడ్ శాసనములో సగర్వముగా చెప్పుకొన్నాడు. రుద్రదాముని సామ్రాజ్యం ఉత్తరాన పంజాబ్ నుండి దక్షిణాన నర్మద వరకు విస్తరించెను. దీనిలో సింధు, సౌవీర, మరు, ఆనర్త, సౌరాష్ట్ర, కుకుర, కచ్ఛ, అకారవంతి, అనూప, అపరాంత మొదలైన ప్రాంతాలు ఉండెను. రుద్రదాముడు ప్రజారంజకంగా పాలించాడు.

సౌరాష్ట్రలో మౌర్యులు నిర్మించిన సుదర్శన తటాకానికి కొత్తగా ప్రజలపై పన్నులు విధించక సొంత డబ్బుతో మరమ్మత్తులు చేయించాడు. రుద్రదాముడు సంగీత సాహిత్యాలలో ప్రవేశమున్నవాడు. శబ్ద, అర్థ, న్యాయ, గాంధర్వ విద్యా ప్రవీణుడు. సంస్కృత భాషను పోషించాడు. రుద్రదామునిలో ప్రాచీన భారత రాజ ధర్మం ప్రతిబింబించిందనడం అతిశయోక్తి కాదు. రుద్రదాముని అనంతరము కార్దమకులు క్రీ॥శ॥ 5వ శతాబ్దం వరకు ఉజ్జయినిని పరిపాలించినారు. గుప్త చక్రవర్తి చంద్ర గుప్త విక్రమాదిత్యుడు జయించిన రుద్రసింహుడనే శకాధీశుడు చివరి కార్థముకడై ఉండవుచ్చు. అనంతరం కార్థమక వంశం అంతరించింది.

## 4.16 ముగింపు :-

శాతవాహనులతో రాజకీయ బంధుత్వ సంబంధాలు కలిగి కయ్యములతోను, వియ్యములతోను పాలించిన కార్థమక క్షాత్రపులు రాజకీయంగా క్షీణించిరి. శాతవాహనులతో వీరికున్న సంబంధము అంతటితో అంతరించినది. విదేశీయులైన కార్థమక క్షాత్రపులు భారతీయ సాంప్రదాయ సరళిని అనుసరించుటయే గాక, జీర్ణించుకొని సాంస్కృతిక వాహినిలో కలిసిపోయిరి. యుద్ధాలు చేయుటలోనే గాక దాన ధర్మాలు, పుణ్యకార్యక్రమాలు చేయుటలో వీరు స్వదేశ రాజులైన శాతవాహనులకు ఏమి తీసిపోలేదు.

డా॥ వి.కె. మోహన్

పాఠం - 5

# శాతవాహనుల సాంస్కృతిక సేవ, పాలనా విధానము

ముఖ్యాంశాలు:-

5.0 లక్ష్యం

5.1 ఉపోద్ఘాతం

5.2 భాషా సారస్వతాలు

5.2.1 ప్రాకృత సాహిత్యం

5.2.2 సంస్కృత సాహిత్యం

5.2.3 దేశ భాషలు

5.2.4 విద్యావిధానం

5.3 కళ

5.3.1 వాస్తుకళ

5.3.2 శిల్పకళ

5.3.3 చిత్రలేఖనం

5.4 శాతవాహనుల పాలనావిధానం

5.5 పరిచయం

5.6 ఆధారాలు

5.7 రాజు

5.8 రాజోద్యోగులు

5.9 స్థానిక పాలన

5.10 ప్రభుత్వ ఆదాయం

5.11 సైనిక వ్యవస్థ

## 5.0 లక్ష్యం:-

దక్షిణ భారతదేశానికి శాతవాహనులు చేసిన సాంస్కృతిక సేవ నిరుపమానమైనది. శాతవాహనులు సాహిత్యంలోను,

కళలలోను మహోన్నత సాంప్రదాయాలను ప్రవేశపెట్టినారు. వాటిని గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 5.1 ఉపోద్ఘాతము:-

శాతవాహనులు దక్కన్‌లో సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, ఆర్థిక, సామాజిక, మతరంగాల అభివృద్ధికి కృషిచేసి, సారస్వత కళా రంగాలలో మహోన్నత సాంప్రదాయాలను ప్రవేశ పెట్టినారు. ప్రాకృత భాషా చరిత్రలో వాస్తవానికి శాతవాహన యుగం స్వర్ణయుగం అనదగింది. ప్రసిద్ధ బౌద్ధాచార్యుడు అయిన నాగార్జునుని రచనలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. ఇతని సుహృల్లేఖ జనాదరణ పొందింది. ఈ కాలంలో అనేక బౌద్ధ నిర్మాణాలు జరిగాయి. ప్రపంచ ఖ్యాతిగాంచిన అమరావతి స్తూపం ఈ కాలం నాటిదే. ఈ కాలంలోనే 'దేశి' అను భాష ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ దేశి భాష తెలుగు భాషకు మాతృకయై ఉండవచ్చు.

## 5.2 భాషా సారస్వతాలు:-

భాషా సారస్వతాలకు శాతవాహనులు అపారమైన సేవ చేసినారు. శాతవాహన యుగం ప్రాకృత భాషా చరిత్రలో స్వర్ణయుగమనదగినది. హాలుని 'గాథాసప్తశతి', గుణాఢ్యుని 'బృహత్కథ' ఈ కాలపు గొప్ప గ్రంథాలు. శాతవాహనులు సంస్కృత భాషను కూడా ఆదరించి పోషించారు. సంస్కృతాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి శర్వవర్మ 'కాతంత్ర వ్యాకరణం' రచించాడు. ఆచార్య నాగార్జునుడు వ్రాసిన గ్రంథాలన్నీ సంస్కృత భాషలోనే ఉన్నాయి. ప్రాకృత, సంస్కృత భాషలే గాక 'దేశి' అను భాష కూడా ప్రచారంలో ఉంది.

ఆర్యావర్తములోని ఋషులు, మత ప్రచారకుల రాకతో వారి విద్యా విధానం కూడా దక్షిణా పథం చేరింది. అశోకుని కాలం నాటికే బ్రాహ్మీలిపి, ప్రాకృత భాష తెలియని విద్యావంతులు లేరు. కర్నూలు జిల్లాలోని ఎర్రగుడిపాడులో, రాజుల మందగిరిలో, రాయచూరు జిల్లాలోని మస్కీలో, బళ్ళారి జిల్లాలోని నిట్టూరులో వున్న అశోకుని శిలా శాసనాలే ఇందుకు నిదర్శనం. శాతవాహనుల శాసనాలన్నీ ప్రాకృత భాషలోనే ఉన్నాయి. శాతవాహనుల కాలం నుండే సంస్కృతం ప్రాకృతం స్థానంలో శాసన భాషగా, శిష్ట భాషగా రూపొందుతున్నట్లు క్షాత్రప రాజైన రుద్రదాముని గిర్నార్ శాసనం సూచిస్తుంది. కాని శాతవాహన యుగంలో పరిపాలనా వ్యవహార భాష, లిఖిత భాష, రాజ భాష ప్రాకృతమే. బౌద్ధ భిక్షువులు సామాన్య ప్రజలకు బౌద్ధ గాథలను ప్రాకృత భాషలో బోధించినట్లు తెలుస్తుంది. అయితే శాతవాహన యుగంలోనే బౌద్ధులు కూడా సంస్కృతంలో గ్రంథ రచన చేశారు. జాతక కథలు, బుద్ధుని జీవిత సన్నివేశాలు, వాడవాడలా, ఇంటింటా చెప్పుకోవటం వల్లనే చిత్రకారులు, శిల్పులు ఆయా గాథలను, సన్నివేశాలను అంత వాస్తవంగా, మనోహరంగా అమరావతి శిల్పాలలో చూపగలిగినారు. కళలలో పరిణతి పొందే స్థితికి కొందరు చేరారనడం, ప్రజల అభ్యున్నతికి మార్గం చూపిన వారు ఉన్నట్లే.

### 5.2.1 ప్రాకృత సాహిత్యం:-

శాతవాహనులు ప్రాకృతాన్ని రాజ భాషగా కొనసాగించినారు. నాటి శాసనాలన్నీ ప్రాకృత భాషలో, బ్రాహ్మీలో ఉన్నాయి. బౌద్ధమత గ్రంథాలు చాలా వరకు ప్రాకృత భాషలోనే వ్రాసుకొన్నారు. ఆంధ్ర బౌద్ధులకు ప్రత్యేకించి వినయ, అభిదమ్మ పీటకాలు, దిఘ మజ్జిమనికాయలు ఉండేవి. 'ధమ్మకధిక' అనే ఉద్యోగి ప్రతి విహారంలోను ఉండేవాడు. కథల ద్వారా ధమ్మాన్ని ప్రచారం చేయడం ఇతని విధి. ఆంధ్రదేశంలో జాతక, అవధాన కథలు ఎక్కువ ప్రచారం పొందినట్లు అమరావతి శిల్పాలు తెలియజేస్తున్నాయి.

శాతవాహన యుగంలో ప్రాకృత భాషలో అత్యుత్తమ గ్రంథాలు వెలువడినాయి. ఆనాడు పురుషులే గాక స్త్రీలు కూడా ప్రాకృత భాషలో చక్కని కవిత్వం చెప్పేవారని హాలుని 'గాథాసప్తశతి' వల్ల తెలుస్తుంది. హాలుడు స్వయంగా కవి. ఇతడు అనేక మంది కవులను పోషించి 'కవివత్సలుడు' అనే బిరుదాన్ని పొందాడు. ప్రాకృత భాషలో వ్రాయబడిన 'గాథా సప్తశతి' వల్ల బొదిస్స, చుల్లువా, అమర రాజ, కుమారెల, మకరంద సేన, శ్రీరాజ, రేవ, మాధవి, ఆంధ్ర లక్ష్మి మొదలగు ప్రాకృత కవుల, కవయిత్రుల పేర్లు తెలుస్తున్నాయి. గాథా సప్తశతి వల్ల నాటి ఆంధ్రులెంతటి శృంగార ప్రియులో తెలుస్తుంది.

అమాయక గ్రామీణ జీవితం, ప్రకృతి తోడి ప్రజలు సాన్నిహిత్యం సప్తశతిలో ప్రతిబింబిస్తున్నాయి.

గుణాఢ్యుడు పైశాచీ ప్రాకృతంలో 'బృహత్కథ' అనే ఉద్గ్రంధాన్ని రచించాడు. ఇది భారతీయ కథా వాఙ్మయంలోనే కాక ప్రపంచ కథా వాఙ్మయంలోనే ఎన్నదగిన గ్రంథం. ఇదే తరవాత కాలంలో సంస్కృతంలో రచించిన సోమదేవసూరి 'కథా సరిత్సాగరాని' కి, క్షేమేంద్రుని 'బృహత్కథా మంజరి'కి, బుద్ధస్వామి 'బృహత్కథా శ్లోక సంగ్రహా'నికి మూలాధారమైంది. నరవాహదత్తుని సాహసిక గాధలకు, ఉపగాధలకు జోడించిన బృహత్కథ అట్టిదే. "సంస్కృత కథలన్నీ దాని నుంచి తీసుకొన్నవే. బృహత్కథ ముందే కథలన్నీ ఎరువు తెచ్చుకున్న పీలికలలో కుట్టిన గుడ్డవలె కనబడుతుంది." అని బృహత్కధను గురించి తికలమంజరి గ్రంథకర్త ధనపాలుడు పేర్కొన్నాడు. నాటక రచయితలకు రామాయణం ఎట్లాంటిదో బృహత్కథ కూడా అట్లాంటిదేనని 'దశరూప' గ్రంథకర్త పేర్కొన్నాడు. వాల్మీకి వ్యాస మహర్షులకిచ్చిన స్థానాన్నే గోవర్థనుడు గుణాఢ్యునికిచ్చాడు. నేడు ఈ గ్రంథము లభ్యము కావడము లేదు. అయితే ఈ గ్రంథం యొక్క సంస్కృత రూపం నుంచి ఇందులోని వస్తువును గ్రహించవచ్చు. కథ సరిత్సాగరం, బృహత్కథా మంజరి, బుద్ధకథా శ్లోక సంగ్రహా అనే మూడు గ్రంథాలలోని తేడాల సహాయంలో కొంత వరకు అసలు బృహత్కథను పునరుద్ధరించవచ్చు అని ఫెలిక్స్‌లకోట్ పండితుడంటాడు.

పేరు చెప్పని ఒక రచయిత 'లీలావతి పరిణయం' అనే గ్రంథాన్ని హాలుని వివాహమే ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించి వ్రాసినాడు. రెండో పులోమావి 19 వ పాలనా సంవత్సరములో వ్రాసిన నాసిక్ శాసనం ప్రాకృత గద్యంలో ఉన్నది. ఆ కాలం నాటికే గద్య రూపంలో వ్రాయడం కూడా అలవాటు పడినారు.

5.2.2 **సంస్కృత సారస్వతం:-** సంస్కృత భాషలో గ్రంథ రచన శాతవాహన యుగంలోనే ప్రారంభమైంది. ఇక శాతవాహన రాజు కోసం శర్వవర్మ ఆరు నెలలలో సంస్కృతం సులభంగా నేర్చుకోవడానికి వీలుగా 'కాతంత్ర వ్యాకరణం' వ్రాశాడు. అంతకు ముందున్న వ్యాకరణ గ్రంథాల కన్నా బాగుండుట వలన 'కాతంత్ర వ్యాకరణమునే' నేటికీ బంగాళంలో, కాశ్మీరులో వాడుతున్నారు. శాతవాహన సమకాలీకులైన క్షాత్రపులు సంస్కృత భాషను పోషించారు. భారతదేశములో నేటి వరకు లభించిన ప్రపథమ పూర్తి సంస్కృత శాసనం క్షాత్రప రుద్రదామునిది. ఈ కాలంలో రచింపబడిన హిందూ పురాణాలలో మత్స్య పురాణం ఒకటి. మత్స్య పురాణం యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో వ్రాయబడినదని పర్జీటర్ పండితుని అభిప్రాయం.

మహాయాన బౌద్ధులు సంస్కృతంలో గ్రంథ రచన చేసారు. మత, సాహిత్య, తత్త్వరంగాలలో ప్రజ్ఞాశాలియైన నాగార్జునుడు మహాయాన సిద్ధాంత ప్రవక్తే. ఇతని సిద్ధాంత గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. ఇతని కాలము, జన్మస్థానము, మత ప్రచారాలను గురించి పండితులలో ఏకాభిప్రాయం లేదు. చైనీయుల వ్రాతలలోనే గాక, మన దేశీయుల వ్రాతలలో కూడా అతనిని వైద్యునిగా, జ్యోతిష్కునిగా, తాంత్రికునిగా, మాధ్యమిక శాస్త్రకర్తగా, శూన్యవాది భాష్యకారునిగా చిత్రించారు. చివరి దశలో నాగార్జునుడు శ్రీ పర్వతంలో శాతవాహన పోషణలో ఉండెనని హుయాన్ త్సాంగ్ వ్రాసినాడు, త్రిసముద్రాధిపతియైన శాతవాహనుడు నాగార్జునుని మిత్రుడని బాణుని 'హర్షచరిత్ర'లోని ఒక భాగంగా తెలుపుతుంది. తన 'సుహృల్లేఖ'లో నాగార్జునుడే ఒక శాతవాహనుని గురించి చెప్పినాడు. ఈ సమాచారమంతా పోగు చేసినా మనకు తేలు విషయమొక్కటే. ఒక శాతవాహన రాజు నాగార్జునుని సమకాలికుడని. నాగార్జునుడే రచించెనని చెప్పబడుతున్న గ్రంథాలలో కనిష్కుడు, వసుమిత్రుడు, అశ్వఘోషుడు పలుకరింపబడినందువల్ల నాగార్జునుడు క్రీ॥శ॥ రెండో శతాబ్ది వాడై ఉండవచ్చు. నాగార్జునుడు శ్రీ పర్వతం పై ఉండెనని తారానాధ్ వ్రాసినాడు. నాగార్జున కొండలో దొరికిన శాసన మొకదానిని బట్టి నాగార్జున కొండకే శ్రీ పర్వతమని పేరున్నదని స్పష్టమవుతున్నది.

నాగార్జునుడు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి 8వ ఏట బౌద్ధ సన్యాసి అయినాడు. ఇతడు విదర్భవాడని హుయాన్ త్సాంగ్ రచనల ఆధారం చేసుకొని కొందరు పండితులు చెప్పినారు. ఇతడు దక్షిణ దేశంలో వేదలి అను గ్రామానికి చెందిన వాడని లంకావతార సూత్రంలో పేర్కొనబడినాడు. వేదలి గ్రామం ఆంధ్ర దేశంలోనిదని కొందరి

అభిప్రాయం. ఇతడు శ్రీ పర్వతాన్ని తన కేంద్రంగా చేసుకొన్నాడు. యజ్ఞశ్రీ నాగార్జునుని కొరకు ఒక మహా చైత్యాన్ని, మహావిహారాన్ని కట్టించాడు. నాగార్జునుడు శ్రీ పర్వతంలో గొప్ప విశ్వ విద్యాలయం స్థాపించి తన శాస్త్ర విజ్ఞానాన్ని బోధించాడు. చైనా, టిబెట్ మొదలగు విదేశాల నుండి అనేకులు నాగార్జున కొండ విశ్వ విద్యాలయానికి వచ్చి విద్యనభ్యసించేవారు. అతడు స్థాపించిన విశ్వ విద్యాలయం 120 సంవత్సరాలు కొనసాగి ప్రపంచ ప్రఖ్యాతి చెందినది.

ఆచార్య నాగార్జునుడు రచించిన గ్రంథాలలో ముఖ్యమైనవి మహాప్రజ్ఞ పారమిక శాస్త్రం, మాధ్యమి కారకలు, దశభూమి విభాషా శాస్త్రం, రసరత్నాకరం, అయోఖసారం, ప్రమాణ విభేతన శాస్త్రం, రత్నావళి, సూన్యసప్తాది, వివాద సమాన శాస్త్రం, సుహృల్లేఖ, ఇవిగాక తర్క, రసాయన, వృక్ష, వైద్య మొదలగు 24 గ్రంథాలు వ్రాశాడని టిబెట్‌కు చెందిన తారానాధుని రచనల వలన తెలుస్తున్నది. నాగార్జునుడు రచించిన గ్రంథాలలో సుహృల్లేఖ గొప్ప లౌకిక గ్రంథం. సుహృల్లేఖను పండితులు నిత్యం చర్చిస్తుండేవారని చైనా యాత్రికుడు ఇత్సింగ్ వ్రాశాడు.

5.2.3 **దేశ భాషలు:-** శాతవాహన యుగంలో ప్రాకృత సంస్కృత భాషలే గాక 'దేశి' అనే మరో భాష ఉన్నట్లు గుణాఢ్యుని బృహత్కథ వల్ల తెలుస్తుంది. సామాన్య ప్రజలు వాడినదే దేశి భాష. ఇది నేటి తెలుగు భాషకు మాతృక అయివుంటుంది. గౌతమీ పుత్రుని కాలం నుండి శాతవాహనుల వెండి నాణేల పై ప్రాకృతం, దేశి అను రెండు భాషల్లో పేర్లు కన్పిస్తున్నాయి. ఈ అంశం వారి మాతృభాష తెలుగుని సూచిస్తుంది. గాథా సప్తశతిలో అత్త, అమ్మి, అందం, అద్దం, పొట్ట, పాడి వంటి అనేక 'దేశి' పదాలున్నాయి. శాతవాహన రాజుల్లోని పులోమావి పేరు దేశిపదమేనని చెప్పవచ్చు. ఇటీవల లభ్యమైన శాతవాహన నాణేల వల్ల దేశి భాష తెలుగుకు సన్నిహితంగా ఉందని సర్కార్, కార్తికేయ శర్మ వంటి పండితుల అభిప్రాయం.

5.2.4 **విద్యా విధానం:-** శాతవాహన యుగంలో మత విషయాలే కాక లౌకిక విషయాలలో కూడా బ్రాహ్మణ ఆశ్రయాలలో బౌద్ధ, జైన విహారాలలో విద్యాబోధన జరిగేది. ధాన్యకటక, శ్రీ పర్వతాలలో విశ్వ విద్యాలయాలుండేవని, ధాన్యకటక విశ్వ విద్యాలయం నమూనా లాగానే లాసా లోని విద్యాలయం నిర్మాణమయిందని టిబెట్‌లో ప్రచారంలో ఉన్న సంప్రదాయం. గురువుల నోటితో చెప్పిన దానిని విద్యార్థులు నోటితోనే వల్లించేవారు. ఆశ్రమాల, విహారాల పోషణార్థం రాజులు, ధనవంతులు భూదానం చేసేవారు. విద్యార్థులు గురు శుశ్రూష చేసి గురువు ఋణం తీర్చుకొనేవారు.

వృత్తి స్వీకారం సాధారణంగా వంశ పారంపర్యంగా జరిగేది. అందువల్ల వృత్తి విద్యలను పరంపరానుగతంగా తండ్రి నుండి కుమారుడు నేర్చుకొనేవాడు. వృత్తి సంఘాలు, నికాయ శ్రేణులు వృత్తి విద్యలలో విద్యార్థులు తగిన ప్రావీణ్యం సంపాదించడానికి అవకాశం కల్పించేవి.

శాతవాహనుల నాటి క్షత్రియోచిత విద్యలను నాటి శాసనాలు పేర్కొంటున్నాయి. ఖారవేలుడు, హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రుద్రదాముడు మొదలగు రాజులు క్షత్రియోచిత విద్యా సంపన్నులు. వివిధ శాస్త్రాల్లో నిష్ణాతులు. గౌతమీపుత్రునికి 'ఏకధనుర్ధర' అను బిరుదు కలదు. రాజులు శబ్ద, అర్థ, రూప్య, గణక, లేఖక, విధి, వ్యవహార, గాంధర్వ, యుద్ధ విద్యలలో ప్రవీణులై ఉండేవారని హాతి గుంఫా శాసనం తెల్పుతున్నది. బౌద్ధులు మత విద్యలతో పాటు తర్క, శబ్ద, జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలలో పరిశ్రమ జరిపేవారు. 'రత్నావళీ రాజపరికథ' అనే గ్రంథంలో నాగార్జునుడు శ్రేయోరాజ్య సిద్ధాంతం ప్రతిపాదించినాడు. శ్రీ పర్వతంలో నాగార్జునుడు ఒక పెద్ద గ్రంథాలయాన్ని సేకరించినాడని ఫాహియాన్ వ్రాసినాడు.

శాతవాహన సామ్రాజ్యం గతించినా ఆనాటి సాహిత్యము మనకు వారసత్వంగా మిగిలినది. గుణాఢ్యుడు, హాలుడు, నాగార్జునుడు రచించిన గ్రంథాలు అమూల్యాలు.

### 5.3 కళ:-

ఆంధ్ర దేశంలో శాతవాహన యుగానికి ముందు వాస్తు సంప్రదాయాలు ఉన్నాయి. ఆంధ్రులకు 30 ప్రాకారా వృత

నగరాలున్నట్లు మెగస్తనీస్ తన 'ఇండిక' గ్రంథంలో పేర్కొన్నాడు. కాని ఈ ప్రాచీన నగర నిర్మాణాన్ని తెలుసుకోవడానికి తగిన సాక్ష్యాలు లేవు. హాలుని గాథా సప్తశతిలో ఆలయాల ప్రసక్తి ఉన్నది. కాని వాటి రూపు రేఖలు మిగులలేదు. మట్టితోను, దారువుతోను, భవన నిర్మాణాలు జరగడం వల్లనే కాబోలు నేడవి నిల్చిలేవు. నేడు కనబడుతున్న నిర్మాణ వాస్తు పశ్చిమ భారతంలోని కార్లే, భాజ, కొంధానా, నాసిక్, అజంతాలలోని బౌద్ధ గుహాలయాలు, ఆంధ్రలో భట్టిప్రోలు, గుడివాడ, అమరావతి, ఘంటసాల, జగ్గయ్యపేట, నాగార్జున కొండ మొదలగు చోట్ల ఇటుకలతో నిర్మించిన స్తూప విహారాలలో చక్కగా వ్యక్తమైంది. శిల్పంలో శాతవాహనుల నాటి స్తూపాలలో అమరావతి స్తూపం జగత్ప్రసిద్ధమైనది. శిల్పంలో శాతవాహనులు సాంచీ, బార్హుతో శిల్ప సంప్రదాయానికి మెరుగులు దిద్ది అమరావతి శిల్ప శైలిని రూపొందించారు. ఆనాటి అజంతాలోని వర్ణ చిత్రాలు అమరావతి శిల్పాలను పోలి వున్నాయి.

అమరావతి, భట్టిప్రోలు, కొండాపురం మొదలగు చోట్ల త్రవ్వకాల నుంచి బయటపడిన వస్తువులను బట్టి శాతవాహన యుగంలో చేతి పనులలో నాజూకుతనం ఎంతగా అభివృద్ధి చెందినదో తెలుస్తుంది. కాల్చిన మట్టిబొమ్మలు, రాతి భరిణెలు, బంగారు, రాగి, దంతము, శంఖుపూసలు, ఆభరణాలతో పాటుగా కొండాపురంలో సీసపు, కంచు నాణేలు అనేకం దొరికాయి. మట్టి బొమ్మలలోని తలలు సర్వ లక్షణాలతో తీర్చబడినాయి. శిరోజాలంకరణలోని వైవిధ్యం అద్భుతమైనది. భట్టిప్రోలు స్తూపంలో దొరికిన స్ఫటిక పేటికలో వజ్రములు, సువర్ణాలు, ఆభరణాలు, పూసలు, త్రిశూలాలు, వెండి నాణాలున్నాయి. అమరావతి స్తూపంలో బంగారు పెట్టె దొరికింది. దొరికిన సామాగ్రిని బట్టి ఆనాటి స్వర్ణకారుల పనితనంలోని ఔన్నత్యం ద్యోతకమవుతుంది. ఈ యుగపు నిర్మాణాలలో కన్పించే కళా కౌశలం కొన్ని వేల సంవత్సరాల కాలంలో అభివృద్ధి చెంది ఉండవలెను.

### 5.3.1 వాస్తు కళ:-

శాతవాహన యుగపు వాస్తుకళకు మతమే ప్రధానమైన ప్రేరకము. నాటి లౌకిక నిర్మాణాల అవశేషాలు లభ్యం కాలేదు. గాథా సప్తశతిలో ఆలయాల ప్రసక్తి ఉంది. కాని వాటి రూపు రేఖలు నేడు మిగుల లేదు. ఇటీవల చిత్తూరు జిల్లా గుడిమల్లంలో జరిగిన త్రవ్వకాలలో బయల్పడిన దేవాలయాల శిధిలాలు శాతవాహన యుగానికి చెందినవని పండితుల అభిప్రాయం. ఇక నాటి వాస్తు రంగంలో ఆంధ్రుల ప్రతిభను తెలుసుకోవడానికి మిగిలింది బౌద్ధ నిర్మాణాలే. బౌద్ధ నిర్మాణాలలో ముఖ్యమైనవి స్తూపాలు, చైత్యాలయాలు, విహారాలు.

ఎ) **స్తూపాలు:** బుద్ధునివి గాని, బౌద్ధ మతాచార్యులవి గాని శారీరక అవశేషాల పై నిర్మితమైన స్మారక చిహ్నాలే స్తూపాలు లేక చైత్యాలు. వీనిలో మూడు రకాలు గలవు. అవి ధాతుగర్భాలు (శరీరక స్తూపాలు), పారి భోజస్తూపాలు (వస్తువులపై నిర్మితమైనవి), ఉద్దేశిక స్తూపాలు (ధాతువులు లేకుండా నిర్మించినవి). భట్టిప్రోలు, అమరావతి, ఘంటసాల, జగ్గయ్యపేట, శాలిహుండం, చందవరం స్తూపాలు ధాతు గర్భ స్తూపాలు. స్తూపంలో నాలుగు భాగాలుంటాయి. అవి వృత్తాకారంలో వుండే వేదిక, దానిపైన అర్థ గోళాకృతిలో వుండే అండము, అండము పైన హర్మికము, హర్మికము పైన ఉండే ఛత్రము. వేదిక చుట్టూ ప్రదక్షిణ మార్గం, ప్రదక్షిణా మార్గానికి బయట ప్రాకారం ఉంటుంది.

ఆంధ్ర దేశములో నిర్మించిన అసంఖ్యాకమైన స్తూపాలలో అమరావతి స్తూపం అత్యద్భుత శిల్ప సమన్వితమైన స్మారక కట్టడము. ఈ కట్టడం నేడు లేదు. శిధిలావస్థలోవున్న అమరావతి స్థూపాన్ని 1797లో కల్నల్ మేకంజీ చూశాడు. ఆ తరువాత స్తూప భాగాలలో కొన్ని లండన్‌కు, కలకత్తాకు, మిగిలినవి మద్రాసులోని ఎగ్మోర్ మ్యూజియంకు తరలించారు. కొన్ని శిల్పాలు మాత్రము నేడు అమరావతి మ్యూజియంలో వున్నవి. ఇచట సూయల్, బర్గెస్, అలెగ్జాండర్, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి అను పండితులు త్రవ్వకాలు జరిపారు. ఈ త్రవ్వకాలలో అనేక శిలా ఫలకాలు, శిల్పాలు, మృణ్మయ పాత్రలు, ఇటుకలు బయల్పడినాయి. శిలా ఫలకాలలోని స్తూప ఆకృతుల ఆధారంగా మహా చైత్యం ఆకృతిని ఊహించి పెర్సీ బ్రౌన్ పండితుడు రేఖా చిత్రాన్ని గీచాడు. దీనిని బట్టి ప్లాస్టర్‌తో నమూనాను తయారు చేసి మద్రాసు, అమరావతి, గుంటూరు మ్యూజియంలలో నెలకొల్పారు.

అమరావతి స్తూపం పునాది వద్ద 162 అడుగులు వ్యాసం, ఎత్తు 100 అడుగులు. స్తూపం చుట్టూ ప్రాకారం ఉండేది. దీని చుట్టుకొలత 600 అడుగులు. ఇటుకలతో కట్టిన ఈ స్తూపం వేదిక వర్తులాకారంలో వుంది. వేదిక నుండి నాలుగు దిక్కులు బయటకు చొచ్చుకొని వచ్చిన నాల్గు చతురస్రాకార వేదికలు ఉండేవి. ఒక్కొక్క వేదిక పొడవు 7.20 మీటర్లు, వెడల్పు 2.10 మీటర్లు. ఒక్కొక్క వేదిక పై ఐదేసి 'ఆయక స్తంభాలు' ఉండేవి. ఇవి బుద్ధుని జీవితంలో అయిదు ప్రధాన ఘట్టాలకు చిహ్నాలు. అవి జననం, మహాభి నిష్క్రమణ, సంబోధి, ధర్మ చక్ర ప్రవర్తన, మహా పరినిర్వాణం. ఇటుకలతో కట్టబడిన ఆయన వేదిక, అండము శిల్ప సంశోభితమైన శిలా ఫలకాలతో అలంకరించబడి ఉండేది. స్తూప ప్రాకారానికి సింహరక్షితాలైన సాధారణ ద్వారాలున్నాయి. దీని నిర్మాణ కార్యక్రమము క్రీ॥పూ॥ 3వ శతాబ్దంలో ప్రారంభమయింది. అశోకునిచే పంపబడిన మహాదేవుడు ఈ స్తూపానికి పునాదులు వేసినాడని ప్రతీతి. వశిష్ఠీ పుత్ర పులోమావి, శివస్కంధ శాతకర్ణి, గౌతమీ పుత్రుడు, యజ్ఞశ్రీ వంటి శాతవాహన రాజులు, ఆచార్య నాగార్జునుడు, ధనికులు, శ్రేష్ఠులు చివరకు చర్మకారులు ఈ స్తూపాన్ని ఆదరించి పోషించారు.

సాంచీ స్తూప తోరణాలు క్రీ॥పూ॥ మొదటి శతాబ్దంలో ఆంధ్ర శాతవాహనులచే నిర్మిచబడింది. మహాచైత్య దక్షిణ తోరణం పై గల ఒక శాసనం బట్టి దీనిని శ్రీ శాతకర్ణి యొక్క స్థపతుల అధిపతి అయిన ఆనందుడు నిర్మించినట్లు తెలుస్తుంది. ప్రతి తోరణం ఎత్తు 34 అడుగులు. ప్రతి తోరణానికి రెండు నిలువు స్తంభాలు, మూడు అడ్డదూలాలు గలవు. ఈ తోరణాలు శిల్పాలతో అలంకరించబడతాయి.

**బి) చైత్య గృహాలు:** నిత్యార్చనకు ఉపయోగించే బుద్ధుని విగ్రహం గానీ, అవశేషాల పెట్టె గాని ఉండే గృహము చైత్య గృహము. ఇది దీర్ఘ చతురస్రాకారముగా ఉండి రెండు వైపుల వర్తులాకారముగా ఉంటుంది. పశ్చిమ దక్కన్‌లో కార్లే, నాసిక్, కన్హేరి, బేడ్స మొదలగు చోట్ల చైత్యాలయాలను కొండలలో తొలిచారు. వీనిలో కార్లే చైత్య గృహం చాలా అందంగా ఉంటుంది. దీనిలో ఉద్దేశిక స్తూపం పూజా వస్తువు. ఆంధ్ర దేశంలో గుంటుపల్లి, సంకరంలో గుహాలయాలు ఉన్నాయి. ఇవి గాక ఇటుకలతో నిర్మించబడిన చైత్యాలయాలు గుంటుపల్లి, నాగార్జున కొండ, రామతీర్థం, శాలహుండం, అమరావతి, భట్టిప్రోలు మొదలగు చోట్ల బయల్పడినవి.

**సి) విహారాలు:** భిక్షువుల నివాస స్థలాలు విహారాలు. ఒకే ఆవరణలో మూడు, నాల్గు విహారాలుండి అధ్యయన, అధ్యాపకులకు అనుకూలమైనవి సంఘారామాలు. పశ్చిమ దక్కన్‌లో అనేక గుహ విహారాలున్నాయి. ఆంధ్ర దేశంలో గుంటుపల్లిలో గుహ విహారాలున్నవి. ఇటుకలతో నిర్మించబడిన విహారాలు అనేక చోట్ల బయల్పడినవి. వీటిలో రామతీర్థం, శాలి - హుండం, నాగార్జున కొండ మొదలగు చోట్ల గలవి సంఘారామాలు. ఆంధ్ర దేశంలో 40 వరకు సంఘారామాలు ఉన్నట్లు హుయాన్ త్సాంగ్ పేర్కొన్నాడు. శ్రీ పర్వతం పై యజ్ఞశ్రీ తొలిపించిన 7 అంతస్తుల విహారంలో 1500 గదులుండేవని, నీటి సదుపాయం కూడా కలదని ఫాహియాన్ వ్రాసినాడు.

శాతవాహన యుగం తరువాత ఏర్పడిన కట్టడాలలో గుహాలయాలలోను వాస్తురీతులలో నూతనత్వం గోచరించదు. అంతటా అనుకరణే.

**5.3.2 శిల్ప కళ:-** శాతవాహన సామ్రాజ్య తూర్పు, పశ్చిమ భాగాలలో శిల్పాలనేకం లభించాయి. ఆంధ్ర శిల్పుల కౌశల్యం సాంచీ స్తూప ద్వార తోరణాలలోను, అమరావతి, నాగార్జున కొండ శిల్పాలలోను పరాకాష్టనందిందని పండితుల అభిప్రాయం. ఆంధ్ర బౌద్ధ క్షేత్రాలన్నింటిలో అమరావతి సుప్రసిద్ధమైనందున, అమరావతీ స్తూపము నుండి లభ్యమైన శిల్పమునందలి పద్ధతులే ఇతర ఆంధ్ర స్తూప శిల్పములందు కూడా ప్రతిఫలించినందున బౌద్ధ యుగ ఆంధ్ర శిల్పమునకు 'అమరావతీ శిల్పరీతి' అనే పేరు వచ్చింది. సాంచీ, బార్హుత్ శిల్పాల వలె కేవలం దేశీయ సంప్రదాయాలకనుగుణంగా తయారై అమరావతీ శిల్పం ఒక ప్రత్యేక నైపుణ్యాన్ని, ప్రశస్తమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తుంది. అందుచే 'అమరావతి రీతి' అనే పేరు సార్థకమయింది. సాంచీ, బార్హుత్ శిల్పం గ్రామీణమైన ప్రకృతి సాన్నిహిత్యాన్ని ప్రదర్శించగా, అమరావతి శిల్పం నాగరిక

జీవిత లక్షణాలను ప్రదర్శిస్తుందని విమర్శకుల అభిప్రాయం. బహుశా అందుకు కారణం ధనికులైన శ్రేష్ఠి గృహపతుల పోషణలో అమరావతి శిల్పం తయారవడం కావచ్చు. అమరావతి శిల్పాలలో రెండు దశలు స్పష్టంగా కన్పిస్తాయి. తొలి దశ శిల్పం కేవలం దేశీయమై సాంచీ, భిల్సా శిల్పాలకు సన్నిహితంగా ఉంటాయి. రెండోదశ శిల్పాలలో గాంధార శిల్ప ఛాయలు కన్పిస్తాయి. అయితే మార్షల్ పండితుడు చెప్పినట్లు తన వ్యక్తిత్వానికీ, దేశీయతకు భంగం రాకుండా గాంధార శిల్ప సంప్రదాయాలను ఆంధ్ర శిల్పి జీర్ణించుకున్నాడు. నాగార్జున కొండ, రామిరెడ్డి పల్లి, గోలి శిల్పాలలో చాలా భాగం రెండో దశకు చెందినవి.

అమరావతి శిల్పాలలో ఎక్కువ భాగం బుద్ధుని జాతక కథలకు, బుద్ధుని జీవిత సంఘటనలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. లభ్యమైన అమరావతి శిల్పాలలో బుద్ధ ప్రతిమలు చెప్పుకోతగ్గవి. స్థాన బుద్ధ ప్రతిమకు కుడి భుజం సన్నగా ఉంది. ఇటువంటి శిల్పాలు శ్రీలంకలోని అనురాధ పురంలోను, థాయ్‌లాండ్ లోని పాంగ్‌మక్‌లలో లభించాయి. శిల్పాలలో అంతస్తులున్న ఇళ్ళ నిర్మాణం చూపబడింది. అజాత శత్రువు బుద్ధుని దర్శించడం, నలగిరి అనే ఏనుగు మోకరిల్లడం, తండ్రిని వేడుకొంటున్న రాహులుడు, మాయాదేవి స్వప్నం, జాతక కథలు శిల్ప రూపంలో చోటు చేసుకున్నాయి. ఇంకా పరుగెత్తిపోతున్న జంతువుల మూర్తులు, త్రిరత్నాలు, పూర్వ ఘట్టాలు మనోహరంగా చెక్కబడ్డాయి. ఆనాటి సాంఘిక జీవితం ఉట్టిపడే శిల్పాలు, నృత్య దృశ్యాలు, నాగ శిల్పాలు, మిధున దృశ్యాలు కూడా చిత్రించబడింది. ఉల్లాసకరం, నాగరికమైన జీవితం అమరావతి శిల్పాలలో ప్రతిఫలిస్తుందని, వివిధ భంగిమలలో మానవాకృతిని మలచడంలోను క్లిష్టములైన మనోగత భావాలను చిత్రించడంలోను సిద్ధ హస్తులైన అమరావతి శిల్పులకు సాటి మరొకరు లేరని దేవీప్రసాద్ ఘోష్ వంటి విమర్శకుల అభిప్రాయం. అమరావతి శిల్పకళ భారతీయ కళకే పరాకాష్టలని ఫెర్గూసన్ పండితులు అభివర్ణించారు. అమరావతి శిల్పాలలో పశుపక్షాదుల చిత్రణ అత్యంత హృద్యంగమంగా ఉన్నదని, మానవుల కదలికలను చూపటంలో శిల్పుల నేర్పరితనము, స్వతంత్రత కనబడుతున్నదని సాంప్రదాయమైన అలంకరణను అత్యంత శోభాయమానంగా చెక్కినారని స్మిత్, హావెల్ పండితులు అభిప్రాయపడినారు. స్మిత్, ఫెర్గూసన్ల అభిప్రాయంలో అమరావతి శిల్పాలలో గాంధార శిల్ప ఛాయలున్నవి. అక్కడక్కడ గాంధార ఛాయలున్నా, కళా నైపుణ్యంలోను, భావ ప్రకటనలోను, సాంకేతిక లక్షణాలలో అమరావతీ శిల్పం పూర్తిగా భారతీయ కళేనని, అమరావతి రాతిలో ఎక్కడ విదేశీ పద్ధతులు లేవని హావెల్ పేర్కొన్నాడు. మానవుల, పశుపక్షాదుల బొమ్మలలో కదలికలను చూపడంలో శిల్పి చూపిన నేర్పు, బొమ్మకు సంబంధించినది ఎంతో చిన్న విషయమైన దానికి చోటు కల్పించడం, జీవితం పై ఆశాభావం ప్రకటించడం అమరావతి శిల్పాల ప్రత్యేక లక్షణాలు. అమరావతి శిల్పాలకు అజంతా చిత్రాలకు పోలికలెక్కువ. అందువల్ల అమరావతి శిల్పాలను క్రీ॥శ॥ 3వ శతాబ్దపువి అన్నాడు. సాంచీ, బార్హుత్ శిల్పాల కంటే గుప్త యుగపు శిల్పాలే అమరావతి శిల్పాలకు దగ్గర అని కొడ్రింగ్టన్ అభిప్రాయము. అయితే సమకాలీన శాసన పాఠాలు చదువబడటంతో శిల్పాల వయస్సు నిర్ణయించడానికి వీలయింది. అజంతా చిత్రాలను, అమరావతి శిల్పాలను పోల్చి, పరిశీలించడం మొదలు పెట్టినట్లయితే భావ ప్రకటనలోను, సాంకేతిక లక్షణాలలోను అజంతాకళ, ఆంధ్రాకళ ఒకటే అని అంగీకరించవలసివున్నది. అజంతా కళ గుప్తకళ అనడంలో న్యాయం లేదు.

సాంచీ తోరణ శిల్పాలు శాతవాహన యుగానివే. ఇచట బుద్ధుని జీవితంలోని ప్రధాన ఘట్టాలు, యక్షిణి శిల్పాలు, జంతు, పక్షి సంబంధమైన శిల్పాలు, వృక్ష సంబంధమైన శిల్పాలు, జాతక కథలు చెక్కబడ్డాయి. ఇచట శిల్పాలు విడివిడిగా సంపూర్ణంగా చెక్కబడి ఉన్నాయి. ఒక్కొక్క శిల్పం ఒక్కొక్క చిత్ర కూటమిలాగ ఉన్నది. బుద్ధుని అస్థికల కోసం జరిగిన యుద్ధ ఘట్టం ఇందుకు నిదర్శనం. వెస్సంతర జాతక కథ సంక్షిప్త రీతిలో శిల్పాలలో చూపబడి ఉన్నది. సాంచిలో ప్రకృతి సంబంధమైన చిత్రాలు ఉన్నాయి. చద్దంత జాతక కథను అనేక సార్లు చెక్కడం జరిగింది. అంతేగాక బుద్ధుని జీవితంలోని ఘట్టాలను తెలిపే శిల్పాలను చెక్కడంలో శిల్పి శ్రద్ధ కనపరచాడు. బుద్ధుడు గాలి, నీటి మీద నడిచే శిల్పాలు అద్భుతంగా ఉన్నాయి. చారిత్రక అంశాలు కూడా సాంచిలో ఎక్కువగా ఉన్నాయి. కోసల రాజు ప్రసేనజిత్తు బుద్ధుని వద్దకు వెళ్ళడ

ప్రసేనజిత్తు శ్రావస్తిలోని మామిడి వృక్షం వద్దకు వెళ్ళడం, బుద్ధుని వద్దకు వెళ్తున్న శుద్ధోదన రాజు మొదలైన దృశ్య శిల్పాలు ఈ కోవకు చెందినవి. దర్బారు జీవితం, మానవుని నిత్య జీవితం, గ్రామీణ జీవితం, ఆటవిక మానవ జీవితాలను సాంచి శిల్పి అతి సహజంగా చెక్కాడని సరస్వతి అభిప్రాయపడినారు.

5.3.3 **చిత్ర లేఖనం:-** శాతవాహన యుగంలో వాస్తు శిల్పకళతో పాటు చిత్ర లేఖనం కూడా ఉచ్చదశలో ఉండేది. అజంతాలో 9, 10 సంఖ్యల గుహలలోని వర్ణ చిత్రాలు శాతవాహన కాలం నాటివి. ఈ గుహలలో కుడ్యాల పై గల చిత్రాలలో బుద్ధ చిత్రాలు ప్రధానమైనవి. 10 వ గుహలోని చద్దాంత జాతక వర్ణచిత్రం ఆ నాటి వర్ణచిత్రాలకు చక్కని ఉదాహరణ. ఈ వర్ణచిత్రం రూపకల్పనలోను, విషయ వివరణలోను సాంచీ స్తూపం దక్షిణ, పశ్చిమ తోరణ ద్వారాల మీద ఉన్న చద్దాంత జాతక శిల్పాలకు చాలా వరకు పోలిక ఉంది. 10 వ గుహ ఎడమ గోడ మీద ఒక వాహిని చిత్రం ఉంది. ఆ నమూనా లోని జనమంతా ఆయుధాలు చేత పట్టుకొని కొందరు అశ్వాల మీద, కొందరు కాలి నడకన వెళ్ళుతున్నట్లున్నారు. అక్కడక్కడ స్త్రీ సమూహం ఉంది. ఇక్కడే ఒక బోధి వృక్షం కూడా ఉంది. మరొకచోట సాంచీ తోరణ ద్వారాలు స్ఫురణకు తెచ్చేటట్లు రెండు సౌధ ద్వారాల చిత్రాలున్నవి. కుడి గోడ మీద ఏనుగులతో నడచి వస్తున్న మానవ సమూహం గోచరిస్తుంది. ఇక్కడి స్త్రీల ఆభరణాల శైలి ప్రాచీనాంధ్రకు చెందినది. ఆనాటి ప్రజలు రామాయణ భాగవతాది పురాణ గాధలను ఇండ్ల గోడల పై చిత్రించుకొనేవారని గాధా సప్తశతి వల్ల తెలుస్తున్నది.

## ముగింపు :-

దక్షిణాపథానికి శాతవాహనులు చేసిన సాంస్కృతిక సేవ నిరుపమానమైనది. వీరు సారస్వత, కళారంగాలలో మహోన్నత సాంప్రదాయాలను ప్రవేశపెట్టినారు. భాషలో, శిల్పంలో వీరు ప్రారంభించిన ఉద్యమాలు, సాంప్రదాయాలు వీరి తరువాత కూడా కొనసాగి సాంస్కృతిక సమైక్యతకు దారితీసింది.

## 5.4 శాతవాహనుల పాలనా విధానం :-

## 5.5 పరిచయం :-

సుస్పష్టమైన దక్షిణాపథ చరిత్ర శాతవాహనుల విజృంభణతోనే ప్రారంభమయింది. అంతేగాక ఆంధ్ర దేశ చరిత్రలో ఆంధ్ర దేశాన్ని పాలించిన తొలి రాజులు శాతవాహనులే. వీరికి శాతవాహనులు, శాలివాహనులు, శాతకర్ణులు, ఆంధ్రులు, ఆంధ్ర భృత్యులని పేర్లు ఉన్నాయి. శాతవాహన రాజులు 30 మంది 450 సంవత్సరాలు పరిపాలించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. శాతవాహనులు దక్షిణాపథానికి రాజకీయ ఐక్యము సాధించి శక దండయాత్రల నుంచి రక్షించి శాంతి భద్రతలు చేకూర్చారు. వీరి సామ్రాజ్యము మధ్య భారతము నుంచి మద్రాస్, మైసూర్‌ల వరకు విస్తరించింది. వీరి పాలనలో దక్షిణాపథం శాంతి భద్రతలతో వర్థిల్లి స్వదేశీ, విదేశీ వ్యాపారాలకూ, సారస్వతానికి, కళలకూ నిలయమైంది. వీరి పాలనా విధానము మౌర్యుల అడుగుజాడలలో నడిచి పల్లవులు మొదలుగా తరవాతి రాజవంశాలకు మార్గదర్శకమయ్యింది.

## 5.6 ఆధారాలు:-

శాతవాహనుల పాలనా విధానాన్ని పునర్నిర్మించటానికి అవసరమైన ఆధారాలలో ప్రధానమైనవి ఖారవేలుని హాతి గుంఫా శాసనం, నాగానిక నానేఘాట్ శాసనం, గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనం, నాణేలు, అమరావతి శిల్పాలు, పురాణాలు, గుణాఢ్యుని 'బృహత్కథ', హాలుని 'గాధా సప్తశతి', మెగస్తనీస్ 'ఇండిక' మొదలగునవి.

## 5.7 రాజు:-

శాతవాహన యుగానికే రాజు దైవాంశ సంభూతుడనే భావమేర్పడినట్లు తెలుస్తుంది. రాజు నిరంకుశుడు. రాజ శాసనం నీతి శాస్త్రం, ధర్మ శాస్త్ర సమ్మతమై ఉండవలసిందే కాని దీనిని ఉల్లంఘించటానికి వీలు లేదు. రాజు వైదిక సంస్కృతిని, వర్ణాశ్రమ ధర్మాలనూ పాటించి పరిరక్షించాలి. అందువల్ల ధర్మశాస్త్ర సమ్మతమైన పన్నులు విధిస్తూ రాజులు ప్రజారంజకముగా పాలించేవారు. రాజరికము వంశ పరంపరగా సంక్రమించేది. రాజరిక బాధ్యతలు నిర్వహించడానికి యువ రాజుగా ఉన్న కాలంలోనే గణక శాస్త్ర, న్యాయ శాస్త్రాలలో శిక్షణ నిచ్చేవారు. రాజునకు సంతతి లేనపుడు అతని సోదరులు సింహాసనమధిష్ఠించుటకు అర్హులు. రాజ కుమారుడు బాలుడైన అతడు యుక్త వయస్కుడగు వరకు రాజు సోదరుడు గాని, రాజకుమారుని తల్లిగాని పరిపాలనా బాధ్యతలు నిర్వహించుచుండిరి. శ్రీముఖుని తరువాత మొదటి శాతకర్ణి పిన్న వయస్కుడగుటచే కృష్ణుడు రాజ్యపాలన బాధ్యత వహించెను. శాతకర్ణి తరువాత పూర్ణోత్సంగుడు బాలుడగుట వలన నాగానిక పాలనా బాధ్యతలు స్వీకరించింది. పాలనా విషయాల్లో గౌతమీపుత్రుడు తన తల్లియగు బాలశ్రీ సలహాలు పొందుచుండెను. రాజకీయ వ్యవహారాలలో స్త్రీలు ప్రధాన పాత్ర వహించేవారని దీనిని బట్టి తెలుస్తుంది.

## 5.8 రాజోద్యోగులు:-

పాలనలో రాజుకు సహకరించటానికి రాజోద్యోగులుండేవారు. నాటి శాసనాలలో విశ్వాసామాత్య, రాజామాత్య, మహామాత్ర, మహాతరక, భాండాగారిక, హేరణిక, ప్రతీహార, లేఖన, పట్టికా పాలక అనే ఉద్యోగుల పేర్లు కన్పిస్తున్నాయి. రాజమాత్యులు రాజుకు సలహా ఇచ్చేవారు. ఆహారాలకు అధిపతులుగా ఉండి నాటి పరిపాలన నిర్వహించేవారు అమాత్యులు. ప్రత్యేక కార్య నిర్వహణకు మహామాతులు నియమింపబడిరి. భాండాగారికుడు వస్తు సంచయమును భద్రపరిచే అధికారి. హిరణ్యాకుడు ద్రవ్య రూపమైన ఆదాయాన్ని భద్రపరిచేవాడు. మహా సేనాపతి సైన్య వ్యవహారాలను చూచేవాడు. రాజ పత్రాలను, రాజ శాసనాలను వ్రాస్తూ రాజుకు ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసేవాడు లేఖకుడు.

## 5.9 స్థానిక పాలన :-

శాతవాహన సామ్రాజ్యం కేంద్రీకృతమైన బలమైన రాజరికం కాదు. అందులో అనేక సామంత రాజ్యాలుండేవి. శాతవాహన రాజులు ఇతర రాజులను జయించి వారిని సామంతులుగా స్వీకరించుచుండిరి. మహారధి, మహాభోజ అను బిరుదులు గల సామంత మాండలికులుండిరి. సిముకుడు మహారాష్ట్ర ప్రాంతాన్ని ఆక్రమించి ప్రముఖుడగు 'త్రణయికరో' తో సంబంధ బాంధవ్యము నెరపివారి సహాయంతో అనేక విజయాలు సాధించి రాజ్యాన్ని విస్తృత పరిచాడు.

సామంతరాజ్యాలు తప్ప మిగిలిన శాతవాహన సామ్రాజ్యం అనేక రాష్ట్రాలుగా విభజింపబడింది. అందులో అసిక, అసక, ములక, సురఠ, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, ఆకర, అవంతి, వైజయంతి ముఖ్యమైనవి. రాష్ట్రాలను పాలించుటకు రాజ ప్రతినిధులు నియమించబడిరి. రాష్ట్రాలను 'ఆహారాలు' అని పిలిచేవారు. శాసనాలలో గోవర్ధనాహారం, సోపారాహారం, మామలాహారం, శాతవాహనాహారం అనే పేర్లు కన్పిస్తాయి. ఆహారాలకు అమాత్యులు పాలనాధికారులు. వీరికి వంశ పారంపర్యపు హక్కులేదు. వీరిని తరచుగా బదిలీ చేసేవారు.

ప్రతి ఆహారంలో ఒక ప్రధాన నగరం, అనేక గ్రామాలు ఉండేవి. పరిపాలనా విభాగాలలో అతి చిన్నది గ్రామం. గ్రామానికి 'గ్రామిణి' పాలనాధికారి. శాతవాహన శాసనాలలో బారుకచ్ఛ, సోపార, కన్హేరి, కళ్యాణి, పైఠాన్, తగర, జున్నార్, కార్లే, ధనకటకం పేర్లు తరచు కన్పిస్తున్నాయి. నాడు ఇవి ప్రధాన పట్టణాలు, వర్తక కేంద్రాలు. పట్టణాలనే నిగమాలంటారు. నిగమ పాలనా వ్యవహారాలను నిగమ సభలు అనే పౌర సభలు చూచేవి. కుల పెద్దలను 'గహపతులు' అనేవారు. వీరు నిగమ సభలలో సభ్యులుగా ఉండేవారు.

భట్టిప్రోలు శాసనాలలో 'నిగమసభ' ప్రస్తావన కన్పిస్తుంది. గ్రామాలు, పట్టణాల పరిపాలన చాలావరకు స్వయంపాలన మీద ఆధారపడి ఉండేది.

## 5.10 ప్రభుత్వ ఆదాయం :-

ప్రభుత్వానికి భూమిశిస్తు ముఖ్యాదాయ మార్గము. రాజ్యంలోని వ్యవసాయ భూమి అంతటికి రాజు సొంతదారు కాదు. 'రాజకం ఖేరు' అన్న మాటను బట్టి రాజు కొంత పొలానికి మాత్రమే యజమాని. భూదానం చేయవలసి వచ్చినపుడు రాజు భూమిని కొని దానం చేసిన సంధర్భాలున్నాయి. రేవుల మీద, బాటల మీద సుంకాలుండేవి. వృత్తి పని వారు వృత్తి పన్నులు చెల్లించే వారు. భాండాగారిక, హేరాణిక అన్న ఉద్యోగులను బట్టి దేశంలో అనేక ప్రాంతాలలో అసంఖ్యాకంగా లభించిన శాతవాహన నాణేలను బట్టి పన్నులు ధన రూపంలో చెల్లించినట్లు గ్రహించవచ్చు.

## 5.11 సైనిక వ్యవస్థ :-

శాతవాహనులు పెద్ద సైన్యాన్ని పోషించినారు. హాతి గుంఫా శాసనంలో చతురంగ బలాల ప్రసక్తి ఉంది. కాని అమరావతి శిల్పంలో గజ, తురగ, పదాతి సేనలు మాత్రమే కన్పిస్తాయి. గజ తురగ బలాలు కాల్బలానికి చేరి ఒక పార్శ్వంలో నడిచేవి. కత్తులు, ఈటెలు, గండ్ర గొడ్డళ్ళు సాధారణ ఆయుధాలు. కాలిబంట్లు గుండ్రని డాలు ధరించేవారు. యుద్ధాలలో క్రూరత్వం ప్రదర్శించడం పరిపాటి. గౌతమీపుత్ర శాతకర్ణి క్షహరాట వంశాన్ని నిరవశేషంగా నిర్మూలించినట్లు చెప్పుకొన్నాడు. 'పితుండ నగరాన్ని గాడిదల చేత దున్నించినాను' అని ఖారవేలుడు సగర్వంగా చెప్పుకొన్నాడు.

శాసనాలలో కటక, స్కందావార పదాలు కన్పిస్తాయి. స్కందా వారం అంటే తాత్కాలిక సైనిక శిబిరం అనీ, కటకం అంటే సైన్యాగారం అని తెలుస్తుంది. ప్రతి రాష్ట్ర రాజధానిలో సైన్యాగారం ఉండేది. రక్షణ దుర్గాలుండేవి. "మగధ రాజ్యము తరువాత ఆంధ్ర రాజ్యం ఎన్నదగినదనియు, ఆ రాజులు 30 దుర్గాలు, లక్ష కాల్బలం, రెండు వేల గుర్రపు దళం, సహస్ర గజ సైన్యం కలిగియుండిరనియు, ప్రజలు ప్రభువును గౌరవించుచుండిరనియు" మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో పేర్కొన్నాడు.

డా॥ వి. కె. మోహన్

పాఠం - 6

# మలి శాతవాహన యుగం

## ఇక్ష్వాకులు, బౌద్ధమత సేవ

**పరిచయం :-**

శాతవాహన సామ్రాజ్యమంతరించిన నాటి నుంచి వేంగీ చాళుక్యుల స్వతంత్ర రాజ్యమవతరించే వరకు (క్రీ॥శ॥ 200-614) గల మధ్య కాలాన్ని మలి శాతవాహన యుగంగా పేర్కొనవచ్చు. శాతవాహన రాజవంశం అంతరించడంతో దక్షిణాపథానికి వారు ప్రసాదించిన రాజకీయైక్యము విచ్ఛిన్నమయిపోయింది. పురాణ వాఙ్మయాన్ని బట్టి శాతవాహనులు తమ సామ్రాజ్య భాగాలలో ఆంధ్ర భృత్యులనే సామంత రాజవంశాలను నెలకొల్పినారు. వీరిలో మహారాష్ట్రంలో ఆభీరులు, వనవాసంలో చుటునాగులు, విజయపురిలో ఇక్ష్వాకులు సుప్రసిద్ధులు. శాతవాహనులు బలహీనులయిన వెంటనే పశ్చిమోత్తర ప్రాంతంలో అభీరులు, తూర్పు ప్రాంతంలో ఇక్ష్వాకులు, నైరుతి ప్రాంతములో చుటువంశీయులు, ఆగ్నేయ ప్రాంతంలో పల్లవులు స్వతంత్ర రాజ్యాలు స్థాపించి పాలించసాగినారు. శాత వంశము పతనం కావడంతో దక్షిణా పథానికి వారు ప్రసాదించిన రాజకీయ ఐక్యము విచ్ఛిన్నమయినప్పటికి, మతంలో, భాషలో, శిల్పంలో వారు ప్రారంభించిన ఉద్యమాలు, సంప్రదాయాలు చిరకాలం కొనసాగి సాంస్కృతిక సమైక్యం వర్ధిల్లడానికి తోడ్పడినాయి. ఇక్ష్వాకుల తరువాత తీరాంధ్రలో పాలించిన రాజ వంశాలలో పేర్కొనదగినవి బృహత్పలాయన, శాలంకాయన, ఆనంతో గోత్ర, విష్ణు కుండిక తొలి పల్లవ వంశాలు. ఈ ఖండిక ఇక్ష్వాకుల, బృహత్పలాయనుల, ఆనంద రాజుల, తొలి పల్లవుల, విష్ణు కుండినుల రాజకీయ చరిత్రతో పాటు ప్రధానంగా ఇక్ష్వాకులు బౌద్ధ మతానికి చేసిన సేవ, నాటి పరిస్థితుల గురించి తెలుసుకొంటారు. మలి శాతవాహన యుగంలో పాలించిన ఈ విభిన్న రాజవంశాల చరిత్ర అసమగ్రంగా కనిపిస్తుంది. అనేక సందేహాలకు సమాధానం ఇంకా లభించవలసి ఉంది అను విషయం ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

## ఇక్ష్వాకులు

**ముఖ్యాంశాలు:-**

6.0 లక్ష్యం

6.1 ఉపోద్ఘాతము

6.2 ఆధారాలు

6.3 ఇక్ష్వాకుల జన్మ స్థలం

6.4 కాలం

6.5 వాశిష్టీ పుత్ర శ్రీ శాంతమూలుడు

6.6 మాఠరా పుత్ర శ్రీ వీర పురుష దత్తుడు

6.7 వాశిష్టీ పుత్ర శ్రీ బహుబలం శాంతమూలుడు

6.8 రుద్ర పురుష దత్తుడు

6.9 బౌద్ధ మతానికి ఇక్ష్వాకులు చేసిన సేవ

6.9.1 ఉపోద్ఘాతం

6.10 ఆధారాలు

6.11 మహాయాన తత్వ అభివృద్ధి

6.12 పూజా పద్ధతిలో మార్పు - శ్రీ పర్వతము

6.13 బౌద్ధానికి ఇక్ష్వాకులు చేసిన సేవ

6.14 వాస్తు శిల్పాలు

## 6.0 లక్ష్యం:-

శాతవాహన సామ్రాజ్య పతనానంతరం ఆంధ్ర దేశంలో మొదట రాజ్యం స్థాపించిన వారు ఇక్ష్వాకులు. ఇక్ష్వాకుల రాజకీయ చరిత్ర, వారు బౌద్ధ మతానికి చేసిన సేవ గురించి తెలియ చేయడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 6.1 ఉపోద్ఘాతము:-

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్య పతనానంతరం ఆంధ్ర దేశంలో అనేక స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించినవి. వాటిలో కాలక్రమాన్ని అనుసరించి విజయపురిని రాజధానిగా పాలించిన ఇక్ష్వాకులు ముందుగా ప్రస్తావించదగిన వారు. శాతవాహన సామ్రాజ్యం చీలిపోయిన తరువాత అధికారం చేపట్టిన స్థానిక రాజవంశాల వర్ణన పురాణాలలో కన్పిస్తుంది. ఈ రాజవంశీయులలో ఆభీరులు, ఆంధ్రభృత్యులు, ఆంధ్రులు, శ్రీ పర్వతీయులు వర్ణించాయి. వీరికి చుటు కులము వారని మరొక పేరుంది. ఆభీరులు ఆంధ్రేతరులే గాక విదేశీయులు. ఆంధ్రులను, శ్రీ పర్వతీయులను అధికారంలో నిలిపి, తీరప్రాంత రక్షణ బాధ్యత అప్పగించిన ఘనత శాతవాహనులదే. నాగార్జున కొండలోయలో దొరికిన శాసనాల వల్ల శ్రీ పర్వతీయులే ఇక్ష్వాకులని స్పష్టమవుతుంది. ఇక్ష్వాకులను శ్రీ పర్వతీయులని పురాణాలు వర్ణించడానికి శ్రీ పర్వతము విజయపురి సమీపంలో ఉండటమే కారణం అయి ఉండవచ్చు. నాగార్జున కొండ శాసనాలలో విజయపురి, శ్రీ పర్వతాల విషయాలున్నాయి.

## 6.2 ఆధారాలు:-

పురాణాలు, ధర్మామృతం అనే కన్నడ కావ్యం నుంచి లభించే సమాచారం, నాగార్జున కొండ, జగ్గయ్య పేట, రామిరెడ్డి పల్లి మొదలయిన చోట్ల దొరికిన శాసనాలు ఇక్ష్వాకుల చరిత్రకు మూలాధారాలు. నాగార్జున కొండ వద్ద 1926 మొదలు 1960 వరకు జరిపిన త్రవ్వకాల వల్ల ఇక్ష్వాకు శాసనాలు దాదాపు 45 బ్రాహ్మీలిపిలో ప్రాకృత - సంస్కృత భాషల్లో గలవి, స్తూపాల వేదికల పై నున్న ఆయక స్తంభాల మీద, విగ్రహాల మీద చెక్కబడినవి దొరికినాయి. ఇంకా అనేక బౌద్ధ, బ్రాహ్మణ నిర్మాణాలు, శిల్పాలు లభించాయి. ఈ త్రవ్వకాల వల్ల నాగార్జున కొండ నాడు సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రమని తేలింది. లభ్యమైన శాసనాల్లో ఇక్ష్వాకు వంశపు పుట్టుపూర్వోత్తరాలు, రాజు ఘనకార్యాలు తెలిపే వివరాలు లేవు. నాటి ప్రజల మతాభిప్రాయాలను తెలిపే విషయాలు చాలా ఉన్నాయి.

## 6.3 ఇక్ష్వాకుల జన్మ స్థలం:-

ఇక్ష్వాకుల జన్మ స్థలాన్ని గురించి, వంశోత్పత్తిని గురించి చరిత్ర కారులలో అభిప్రాయ భేదాలున్నాయి. ఇక్ష్వాకులు కన్నడ దేశము వారని వోగెల్, తమిళులని గోపాలాచారి, స్థానికులని బర్జెస్ - కాడ్వెల్ , ఉత్తర భారత దేశంలోని అయోధ్యను పాలించిన వారని బ్యూలర్, రాప్సన్ పండితులు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఇక్ష్వాకులు ఉత్తర హిందూ దేశంలోని అయోధ్యను పాలించిన ఇక్ష్వాకు సంతతి వారని బ్యూలర్, రాప్సన్ వంటి చరిత్రకారులు అభిప్రాయపడినారు. వాయు పురాణం ప్రకారం ఇక్ష్వాకువు సూర్యవంశకర్త. ఇతడు మనుమ యొక్క 9 మంది కుమారులలో పెద్దవాడు. ఇతడు అయోధ్య రాజధానిగా పాలించాడు. ఇతనికి వంద మంది కుమారులు. వారిలో పెద్దవాడైన వికుక్ష తండ్రి తరువాత అయోధ్యకు పాలకుడయినాడు. మిగిలిన వారిలో 50 మంది ఉత్తర హిందూ స్థానంలో చిన్న చిన్న రాజ్యాలకు అధిపతులు కాగా, మిగిలిన 49 మంది దక్షిణానికి వచ్చి రాజ్యాలు స్థాపించారు. ఇక్ష్వాకులు ఉత్తర భారతంలో అయోధ్యను పాలించిన ప్రాచీన ఇక్ష్వాకు సంతతి వారని సూచించే జైన, బౌద్ధ గాధలు కొన్ని గలవు. గోదావరి నది ఎగువ భాగంలో అశ్మక, ములక రాజ్యాలను స్థాపించినవారు ఇక్ష్వాకు వంశం వారని బౌద్ధ వాఙ్మయం చెబుతున్నది. ఇక్ష్వాకు వంశస్థుడైన యశోధరుడు వేంగి దేశానికి వచ్చి అచట ప్రతీపాలపురం నిర్మించినట్లు ధర్మామృతం అనే జైన కన్నడ కావ్యం చెబుతుంది. కాని ఇక్ష్వాకులు తమ శాసనాల్లో తాము ఉత్తరా పథం నుండి వచ్చినట్లు గాని, తమకు కోసలాధీశులతో సంబంధం ఉన్నట్లు గానీ చెప్పలేదు.

శ్రీ పర్వతీయుల పేర్లలో కన్పించే అడవి సిరి, ఖండ, చలిక ఇంకా మొదలైన పదాలు దాక్షిణాత్య ప్రభావం సూచిస్తున్నందు వల్ల, అనార్య జాతులలోని మేనత్త కుమార్తెను వివాహమాడే ఆచారాన్ని మాధుర పుత్ర వీర పురుష దత్తుడు పాటించినందువల్ల, ఇక్ష్వాకులు దాక్షిణాత్య రాజులని బర్జెస్, కాడ్వెల్ అభిప్రాయపడినారు.

ఇక్ష్వాకులు కన్నడ దేశం నుంచి వలస వచ్చినారని వోగెల్ పండితుడు, తమిళ దేశం నుంచి వచ్చినారని గోపాలాచారి అభిప్రాయపడినారు. ఇక్ష్వాకుల పేర్లలోని పై పదాలు తమిళ, తెలుగు, కన్నడ భాషలకు మౌలికమైన ఆది ద్రావిడానికి చెందినదని భావించనక్కరలేదు.

కాడ్వెల్ సిద్ధాంతాన్ని అనుసరించి కృష్ణానది తీరానికి స్థానికులై ఇక్షు చిహ్నాన్ని ఆరాధించే ప్రాచీన గణం వారై సంస్కృతీకరణ క్రమంలో ఇక్ష్వాకులై యుంటారనడం సమంజసంగా ఉంటుంది. కృష్ణా లోయ చెరకు (ఇక్షు) పంటకు ప్రసిద్ధి. అంతేగాక నాగార్జున కొండ శాసనం శాక్యమునియైన గౌతమ బుద్ధుడు ఇక్ష్వాకు వంశస్థుడని చెబుతున్నది. దీనిని బట్టి శ్రీ పర్వతీయులు స్థానిక గణ జాతులలోని వారై బౌద్ధ మతం ద్వారా సాంఘిక ప్రతిపత్తి సాధించి బుద్ధుని యందున్న ఆదరాభిమానాల వల్ల తాము ఇక్ష్వాక వంశస్థులమని వర్ణించుకొని వుంటారు. శాతవాహనులు బలహీనులయిన కాలంలో ఇక్ష్వాకులు అంతఃపుర విప్లవాలలో జోక్యం కల్పించుకొని రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొన్నారు.

## 6.4 కాలం :-

ఇక్ష్వాకు రాజుల వంశ క్రమం, పాలనా కాలం గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పురాణాలలో చెప్పబడినట్లు ఏడుగురు ఇక్ష్వాకు రాజులు మొత్తం 100 సంవత్సరాలు పాలించారని గ్రహించబడినది. దీనికి అనుగుణంగానే శాసనాల్లో కనిపిస్తున్న రాజులు కనీసం 68 సంవత్సరాలు పాలించారని స్పష్టమవుతున్నది. చేది శకం 30 వ సంవత్సరంలో వేయబడిన అభీరవసు సేనుని నాగార్జున కొండ శాసనంలో అవంతి శక రుద్రదాముడు, సంజయపురి యవన రాకుమారి, వనవాసి విష్ణురుద్ర శివలానంద శాతకర్ణిల సమక్షంలో అష్టభుజ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించబడినట్టున్నది. దీనిని బట్టి ఇక్ష్వాకుల పై అభీరులు విజయం సాధించినట్లు దీనితో ఇక్ష్వాకుల పాలన అంతమయినట్లు తెలుస్తున్నది. నాగార్జున కొండలోని వీర పురుషదత్తుడు, రెండో శాంతమూలుని శాసనాలలో విజయనామ సంవత్సరం కన్పిస్తున్నది. దీనిని బట్టి వీర పురుషుని పాలన ముగిసింది, శాంత మూలుని పాలన

ఆరంభమయింది ఒకే సంవత్సరంలోనని తెలుస్తుంది. దీనిననుసరించి శాసనాల నుంచి తెలుస్తున్న నలుగురు ఇక్ష్వాకు రాజులు క్రీ॥శ॥ 180 మొదలు క్రీ॥శ॥ 248 వరకు పాలించారని ఓరుగంటి రామ చంద్రయ్యు నిర్ధారించాడు. పేరు తెలియని ముగ్గురు తరువాత క్రీ॥శ॥ 278 వరకు పాలించారని రామ చంద్రయ్యు తెలిపాడు. శాతవాహనుల తరువాత క్రీ॥శ॥ 200 ప్రాంతంలో ఇక్ష్వాకులు విజృంభించారని పల్లవుల శాసనాల వల్ల వీరి రాజ్యం క్రీ॥శ॥ 300 లోపుగానే అంతమయినట్లు పెక్కుమంది చరిత్రకారులు అభిప్రాయపడినారు. ఇచట రెండో సిద్ధాంతాన్ని అంగీకరించడం జరిగింది.

శాసనాల ద్వారా లభ్యమైన నలుగురు ఇక్ష్వాకు రాజుల పేర్లు - 1. వాశిష్టీ పుత్ర శ్రీ శాంతమూలుడు (క్రీ॥శ॥ 200 - 218), 2. మాఠరీ పుత్ర శ్రీ వీర పురుష దత్తుడు (క్రీ॥శ॥ 218 - 238), 3. వాశిష్టీ పుత్ర శ్రీ బహుబల (ఏహువల) శాంతమూలుడు (క్రీ॥శ॥ 239 - 252), 4. రుద్ర పురుష దత్తుడు (క్రీ॥శ॥ 252 - 254). ఇక్ష్వాకుల రాజధాని నాగార్జున కొండ సమీపంలోని విజయపురి.

## 6.5 వాశిష్టీ పుత్ర శ్రీ శాంతమూలుడు (క్రీ॥శ॥ 200 - 218):-

ఇక్ష్వాకు వంశ రాజ్య స్థాపకుడు వాశిష్టీ పుత్ర శ్రీ అగ్ని హోత్రాది మహాక్రతువులు చేసినాడు. ఈ సందర్భంగా హిరణ్య కోటి, గోశత సహస్ర, హల శత సహస్ర దానాలు ఇచ్చాడు. ఇతడు మహాసేన విరూపాక్షపతి భక్తుడు, ఆరాధకుడు, యజ్ఞయాగాదులను పునరుద్ధరించి, ఈశ్వరారాధనకు తోడ్పడిన శాంతమూలుడు వైదిక బ్రాహ్మణ మతాభిమాని. ఇక్ష్వాకులు సూర్య వంశ క్షత్రియులని పేర్కొన్న భండార్కర్ వాదానికి శాసన సాక్ష్యం లేదు.

శాసనాల ద్వారా శాంతమూలుని సోదరీమణుల పేర్లు, బంధువుల పేర్లు తెలుస్తున్నాయి. వీరందరూ నాటి రాజకీయాలలో కీలక పాత్ర వహించినవారే. శాంతమూలుని కుమారుడు వీర పురుష దత్తుడు, కుమార్తె మహాతలవరి అడవి శాంతి శ్రీ, మహాతలవర, మహా సేనాపతి, మహా దండనాయక పదవులనలంకరించిన స్కంధ విశాఖనాగుని భార్య అడవి శాంతి శ్రీ. శాంతమూలుని సోదరీ మణులలో ఒకరైన మహాసేనాపత్ని, మహాదానపత్ని అయిన శాంతి శ్రీ పూగియ కుటుంబానికి చెందిన మహాసేనాపతి, మహా తలవర మహాస్కందశ్రీ భార్య, మరో సోదరి పేరు హమ్మరిక, శాంతిశ్రీ కుమార్తెలలో ఒకరు వీరు పురుషదత్తుని భార్య అయింది.

మహాసేనాపతి, మహాతలవర బిరుదల అర్థం ఏమిటో కొందరికి అర్థం కాలేదు. నాగార్జునకొండ శాసనాలలో ఈ బిరుదులు వున్న అధికారుల భార్యలకు కూడా ఆ బిరుదులు గలవు. మహాసేనాపతి అంటే సైన్యానికి ముఖ్య అధికారి అని అర్థం. కానీ ఇక్ష్వాకు శాసనాలలోని బిరుదులు సామంతనాయకులకే ఉన్నట్లు తెలుస్తుంది. మొదట్లో సైన్యాధికారులుగా వున్నవారే రాష్ట్ర పాలకులుగా నియమితులై, వంశ పారంపర్య హక్కు సంపాదించుకొని మహా సేనాపతులైనారు. మహాసేనాపతి, మహాతలవర బిరుదులు రాష్ట్ర పాలకులైన సామంతులవి. శాతవాహన ఇక్ష్వాకు కాలాలలో తలవర అంటే న్యాయాధికారి అని అర్థం వుండేది. మహాతలవర అంటే ముఖ్య న్యాయాధిపతి అర్థమై వుండవచ్చు. మహాదండనాయకులు రాజ సేవకులే గాక వంశపారంపర్యముగా రాష్ట్రాలను పాలించే పాలకులు. నాగార్జునకొండ శాసనాలను పరిశీలిస్తే రాష్ట్ర పాలకులు రాకుమార్తెలనే వివాహమాడినట్లు తెలుస్తుంది.

ఇక్ష్వాకు శాసనాలలో నాలుగు సామంత కుటుంబాల ప్రస్తావన కలదు. వీరందరూ రాష్ట్రపాలకులే. నాగార్జున కొండ శాసనాలలో ప్రస్తావించబడిన నాలుగు సామంత కుటుంబాలు పూగియులు, హిరణ్యకులు, ధనకులు, కులహకులు. పూగి నాడు రాష్ట్రం గుండ్లకమ్మకు ఇరువైపులా, నల్లమల కొండలకు, సముద్రానికీ మధ్య వుంది. హిరణ్యకులు పాలించిన హిరణ్య రాష్ట్రం రేనాడుకు తొలి పేరు. కడప జిల్లా ఉత్తర ప్రాంతం, కర్నూలు జిల్లా దక్షిణ ప్రాంతముతో కూడుకున్నదే హిరణ్య రాష్ట్రం. హిరణ్య నాయకుడైన స్కంధ చలికి రెమ్మణక కూడా ఇక్ష్వాకుల వలే వాశిష్టీ పుత్రుడు కులహకులు సరిహద్దు రాష్ట్ర పాలకులు. ధనకులు పాలించిన ప్రాంతం గుర్తించడం కుదరలేదు. నాగార్జునకొండ శాసనాలలో పై నాలుగు రాష్ట్రాలే కాక, మరికొన్ని రాష్ట్రాలు కూడా ప్రస్తావించబడ్డాయి. వాటిలో బృహత్ఫలాయనులు, వేంగీ, శాలంకాయనులు ముఖ్యులు. ఈ సామంత నాయకుల రాజభక్తి, సైనిక సేవలే శాంతమూలుని బలం.

శాంతమూలుడు గొప్ప రాజనీతిపరుడు. సామంత కుటుంబాలతో వైవాహిక సంబంధాలు ఏర్పరచుకొని రాజకుటుంబానికి అంగబలము చేకూర్చాడు. తన కుమారునికి ఉజ్జయినిని పాలించే క్షాత్రపుడైన మొదటి రుద్రసేనుని కుమార్తెను ఇచ్చి పెండ్లి చేశాడు. ఈ వైవాహిక సంబంధంతో ఇక్ష్వాకుల కీర్తి మరింతగా పెరిగింది.

శాంతమూలుడు అనేక కోట్ల బంగారు నాణాలను, లక్షల కొలది గోవులను, లక్షల కొలది నాగళ్ళు, భూమిని దానం చేశాడు. ఈ దానాలకు సాంఘిక, ఆర్థిక ప్రాధాన్యం చాలా వున్నట్లు కన్పిస్తుంది. అడవులను ఛేదించి, క్రొత్త భూములను సాగులోనికి తెచ్చి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడినారు. బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలను, సాగు భూములను దానమిచ్చి, బ్రాహ్మణ మత విస్తరణకు పాటుపడినాడు. ఇతని ఘన విజయాలు, దాన ధర్మాలు ప్రజలపై చెరగని ముద్ర వేశాయి. ఇతని పరిపాలనా కాలం పద్దెనిమిది సంవత్సరాలు.

## 6.6 మాఠరీ పుత్ర శ్రీ వీర పురుష దత్తుడు (క్రీ॥శ॥ 218 - 238):-

వాశిష్టీ పుత్ర శ్రీ శాంతమూలుని తరువాత అతని కుమారుడైన మాఠరీ పుత్ర శ్రీ వీర పురుష దత్తుడు సింహాసన మధిష్టించినాడు. శ్రీ వీర పురుష దత్తుని పరిపాలనా కాలంలో బౌద్ధమత ప్రభావము ఆంధ్రదేశమంతటా వ్యాపించింది. ఈ కాలాన్ని ఆంధ్ర బౌద్ధమత చరిత్రలో స్వర్ణయుగమనవచ్చు. ఇతని 6, 14, 15, 18, 20 వ పరిపాలనా సంవత్సరాలలో నాగార్జునకొండ లోయలో వేయించిన శాసనాలను బట్టి ఇతని కాలము సుఖ, సంపదలకు, ఘనతకు పేరు గాంచినట్లు తెలుస్తుంది. తన తండ్రి వలె ఇతడు కూడా దక్షిణాపథ చక్రవర్తి అధికారం నెరపినాడు.

వీర పురుష దత్తుని పాలనా కాలంలో కొత్త భూభాగాలు జయించినట్లు కన్పించదు. ఇతని రాజ్యానికి సరసన ఉత్తరాన ఉజ్జయిని మహాక్షాత్రపులు, వాయువ్యాన త్రికూట ఆభీరులు, పశ్చిమాన వనవాస ఆంధ్ర భృతులు గలరు. ఇతని సామ్రాజ్యం కళింగ, కోసల, ఆంధ్ర దేశాల వరకే పరిమితమయినట్లు భావించబడుతుంది. తండ్రి వలె ఇతడు కూడా వైవాహిక సంబంధం ద్వారా తన అధికారాన్ని పటిష్టపరచుకొని సమస్యలను పరిష్కరించినాడు. తన కుమార్తె అయిన కొడ బలిసిరిని వనవాస రాజుకిచ్చి వివాహం జరిపించి ఆ రాజ్యాన్ని తన పలుకుబడి కిందకు తెచ్చుకున్నాడు. తన భార్య ద్వారా ఉజ్జయిని క్షాత్రపుల మైత్రిని కొనసాగించాడు. సామంతుల భక్తి నిలుపుకునే ఉద్దేశంతోనే తన మేనత్తలయిన హమ్మసిరి, శాంతసిరి కుమార్తెలను ముగ్గురిని వివాహమాడినాడు. శాసనాలలో వీర పురుష దత్తుని అయిదుగురి భార్యల పేర్లు కన్పిస్తాయి. వారు పట్టపు రాణి మహాదేవి భట్టిదేవ, మహాదేవి రుద్రధర భట్టారిక, శాంతిశ్రీ, మహాదేవి సష్టిశ్రీ, మహాదేవి బాప శ్రీ.

బౌద్ధమతం ఇక్ష్వాకు రాజవంశ ఆదరణలో ఉచ్ఛస్థితిని అందుకొన్నది. నాగార్జున కొండలో లభ్యమైన శాసనాలలో రాజకీయ విషయాలు గాక, బౌద్ధమత సంబంధమైన విషయాలే పేర్కొనబడింది. విజయపురిలోనూ, శ్రీ పర్వతం మీద నిర్మించిన బౌద్ధ కట్టడాల గురించి సింహళం, మలేషియా, చైనా, తూర్పు ద్వీపాల నుంచి వచ్చి ఇచట నివాసమేర్పరచుకొన్న పెక్కు మంది భిక్షువులు, భిక్షుణుల గురించి ఈ శాసనాలు పేర్కొంటున్నాయి. ఈ శాసనాలలో ఆనాడు ఆంధ్రలో వున్న బౌద్ధమత శాఖలు, రాజ వంశీకులు, సాధారణ ప్రజలు ఒక్కొక్క శాఖ వారిని ఆదరించిన తీరు చెప్పబడింది. నాగార్జున కొండ శాసనాలలో బౌద్ధమత సంస్థలకు, ఇక్ష్వాకు రాజులు దానాలిచ్చినట్లు కన్పించదు. బౌద్ధమత సంస్థలను ఆదరించిన వారందరూ రాజ కుటుంబ స్త్రీలు వారి బంధువులు, ఇక్ష్వాకు రాజులందరూ బ్రాహ్మణ మతస్థులైనా మత సహనము కలవారు. అందువల్లనే వారు బౌద్ధ సంస్థలను రాణులు, వారి బంధువులను ఆదరించడానికి అభ్యంతరము చెప్పలేదు. వీర పురుష దత్తుడు, అతని కుమారుడు బహుబలుడు బౌద్ధమతాభిమానులు కావడానికి అవకాశముందని నాగార్జునకొండ శిల్ప సాక్ష్యము ద్వారా తెలుస్తుంది. మొదట్లో బ్రాహ్మణ మతస్థుడైన వీర పురుష దత్తుడు బౌద్ధ ప్రభావం వల్ల బ్రాహ్మణ మతాన్ని విడిచిపెట్టి, బౌద్ధాన్ని స్వీకరించి, ఆ మత వ్యాప్తికి పాటు పడినట్లు ఈ శిల్ప సాక్షమును బట్టి చెప్పవచ్చు. ఒక శిల్పములో ఒక రాజు తన కుడి కాలితో శివలింగాన్ని అణగద్రొక్కే దృశ్యము కలదు. ఈ దృశ్యాన్ని తిలకించే వారిలో రాజ దర్బారు సభ్యులు కలరు. ఇటువంటి శిల్పమే మరొక చోట కూడా బయల్పడినది. వీర పురుష దత్తుని ఆరవ పాలనా

కాలంలో శ్రీ పర్వతము పైన మహా చైత్యము పునర్నిర్మితమైనట్లు 16 శాసనాలలో ప్రస్తావించబడినందువల్ల వీర పురుష దత్తుడు బౌద్ధాన్ని స్వీకరించినట్లు భావించవచ్చు. ఈ కాలంలోనే మహా విహారాలు, చైత్య గృహాలు, మండపాలు, చతుశ్శాల నిర్మించబడ్డాయి. ఇవి దూర ప్రాంత యాత్రికుల కొరకు నిర్మిచబడ్డాయి. శ్రీ పర్వతం మహాయన మతస్థులకు పుణ్యా క్షేత్రం అయింది. వీర పురుష దత్తుని మేనత్త అయిన మహాసేనాపత్ని, మహాదాన పత్ని శాంతిశ్రీ శ్రీ పర్వత బౌద్ధ కట్టడాలకు కారకురాలు. ఈమె దానశీలత మహాచైత్య ఆయక స్థంభ శాసనాలలో చెప్పబడింది. ఈ నిర్మాణాలు శాంతి శ్రీ తన అల్లుడైన మాఠరీ పుత్ర శ్రీ వీర పురుష దత్తుని ఆయురారోగ్యాల కోసం, విజయం కోసమనీ శాసనాలలో చెప్పబడింది. శాసనాలలో చెప్పబడిన దానాలన్నీ మహాభిక్షు సంఘము, అపర మహావిన శైలీయ శాఖ భిక్షువుల కొరకనీ పేర్కొనబడింది.

శ్రీ పర్వతములోని మహాచైత్య నిర్మాణానికి రాజస్త్రీలలో మహాతలవరి అడవి శాంతి శ్రీ, మహా సేనాపత్ని రుద్ర శాంతి శ్రీ నాగ, మహా సేనాపత్ని వాశిష్టీ పుత్ర స్కంధ చలికిరెమ్మణక, మహాదేవి బాపి శ్రీ, మహాదేవి చటి శ్రీ తోడ్పడినారు. బౌద్ధ సంస్థలకు దానాలిచ్చిన స్త్రీలలో రాజ భాండాగారకుని మేనకోడలు ఉపాశిక బోధి శ్రీ ఖ్యాతి గడించింది. ఈమె వీర పురుష దత్తుని 14 వ పాలనా కాలంలో బౌద్ధ ధర్మ ప్రచారం చేసే భిక్షువుల కొరకు శ్రీ పర్వతములో చుళధర్మ గిరి పై ఒక చైత్య గృహం, ఒక చుతశాల నిర్మించింది. ఈ భిక్షువులు తామ్ర సర్ణి, కాశ్మీరము, గాంధారము, చీనా, కిరాత్, తోసలి, అపరాంత, వంగ, వనవాస, యవన, ద్రమిళ, పాలూరు మొదలగు రాజ్యాలలో మత ప్రచారం చేసేవారు. ఈమె శ్రీ పర్వతం లోని కుహల విహారము దగ్గర ఒక చైత్యాన్ని సింహళ విహారములో బోధి వృక్షానికి వేదికను, మహాధర్మ గిరి పైన ఒక గృహాన్ని , దేవగిరి పై ప్రార్థనా శాలను పూర్వ శైలము పై తటాక మంటప శాలలను, కంటక శైల మహా చైత్య తూర్పు ద్వారము దగ్గర శిలా మండపాన్ని పుష్పగిరి పై శిలా మండపాన్ని, ఇంకొక విహారము దగ్గర ఒక శిలా మండపాన్ని భిక్షు సంఘము కొరకు, ప్రపంచ యాత్రికుల సౌకర్యం కోసం నిర్మించింది.

ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధ మతాభివృద్ధికి సాక్ష్యమిచ్చే శాసనాలలో ఉపాశిక భోధి శ్రీ శాసనం ముఖ్యమైనది. ఈ శాసనములో బుద్ధ దేవుని ప్రార్థించే పద్ధతి విలక్షణమైనది. ఈ శాసనములో ఆంధ్ర, బౌద్ధమత ప్రచారకులు సంచరించిన ప్రాంతాలు పేర్కొనడం జరిగింది. ఈ ప్రచారకులు వర్తక మార్గాల ద్వారా, దూర ప్రాంతాలకు వెళ్ళారు. ఈ శాసనము వల్ల ఆంధ్ర బౌద్ధమత ప్రచారకులు తూర్పున చైనా వరకూ, పడమర కాశ్మీర్ వరకూ వెళ్ళినట్లు రూఢి అవుతుంది. రాజాదరణ లభించడం వల్లనే ఆంధ్ర బౌద్ధులు దేశ విదేశాలలో ప్రచారము చేయగలిగారు. ఈ ప్రచారకులకు వారి దూర ప్రాంత శిష్యుల సౌకర్యార్థమే ఉపాశిక బోధి శ్రీ చైత్యాలను, చైత్య గృహాలను, విహారాలను, మండపాలను, చతుశ్శాలలను కట్టించింది.

బౌద్ధమత వ్యాప్తి కారణముగా శ్రీ పర్వతం బౌద్ధులకు పరమ పవిత్ర క్షేత్రమయింది. ఇక్ష్వాకుల పాలనలో విజయపురి, శ్రీ పర్వత కట్టడాలు సౌందర్యానికి పేరుగాంచింది. ఇచటి బౌద్ధ భిక్షువులు కృష్ణా ముఖద్వారము దాటి, సముద్రాలు దాటి దూర దేశాలకు వెళ్లి బౌద్ధ మతం ప్రచారం చేశారు. భావ వివేకుడు అనే తార్కికుడు విజయపురి విహారములో నివశించినట్లు హుయాన్‌త్సాంగ్ రచనలను బట్టి తెలుస్తుంది. ఆంధ్ర దేశపు మహా సాంఘికులలో ఆనాడు నాలుగు శాఖల వారు వుండేవారు. ఆంధ్ర దేశపు మహా సాంఘికులకు ఆంధకులు అనే పేరు వచ్చింది. శాంతమూలుని కాలములో అణగద్రొక్కబడిన బౌద్ధమతం మాఠరీ పుత్ర శ్రీ వీర పురుష దత్తుని కాలంలో మళ్లీ బలవంతమై బ్రాహ్మణ మతాన్ని అడ్డుకొన్నది.

## 6.7 వాశిష్టీ పుత్ర శ్రీ బహుబల శాంతమూలుడు (క్రీ॥శ॥ 239 - 252):-

వీర పురుష దత్తుని తరువాత అతని కుమారుడైన వాశిష్టీ పుత్ర శ్రీ బహుబల శాంతమూలుడు చక్రవర్తి అయినాడు. వోగెల్ పండితుడు ఈ రాజు పేరును యహువల శాంతమూలుడని చదవగా, వెంకట కృష్ణారావు బహుబల శాంతమూలుడని చదివాడు. రెండవ పాఠమే యుక్తముగా వున్నది. బహుబలుడు మహాదేవి భట్టిదేవి కుమారుడు. ఇతని పరిపాలనా కాలానికి సంబంధించి రెండు శాసనాలు దొరికాయి. వీటిలో రాజకీయ ప్రసక్తి లేదు. వీటిలో బౌద్ధమతానికి చెందిన విషయాలు ఉన్నాయి. బహుశృతీయులని, మహిశాసకులని మరికొన్ని తెగలు బౌద్ధ సంఘంలో వున్నట్లు ఈ శాసనాలు చెబుతున్నాయి. బహుబలుని

కాలంలో మహాదేవి భట్టిదేవ, మహాదేవి కొడలులిసిరి కట్టించిన చైత్యాలు, చైత్య గృహాలు, మండపాలు, శాసనాలలో పేర్కొనబడ్డాయి.

బహుబల శాంతమూలుని కాలంలో నాగార్జునకొండ లోయలో ఒక వైపు బౌద్ధ సంస్థలు, మరొక వైపు బ్రాహ్మణ మతం విరివిగా నిర్మాణాలు సాగించాయి. సేనాని యిలిసిరి కుమార స్వామికి సర్వదేవ ఆలయం నిర్మించాడు. రాకుమారుడు వీర పురుష దత్తుడు పుష్పభద్రస్వామి ఆలయం నిర్మించాడు. ఒక అంతఃపుర స్త్రీ నొడగిరి స్వామికి దాన ధర్మాలు చేసింది. ఇతని కాలము నుండే శాసనాలలో సంస్కృతము వాడడము ప్రారంభము అయింది.

## 6.8 రుద్ర పురుష దత్తుడు (క్రీ॥శ॥ 252 - 254):-

ఇటీవల నాగార్జునకొండ, గురజాల వద్ద దొరికిన శాసనాలను బట్టి బహుబల శాంతమూలుని తరువాత అతని కుమారుడు రుద్ర పురుష దత్తుడు సింహాసనమధిష్టించాడు. ఇతడే మనకు తెలిసినంత వరకు చివరి ఇక్ష్వాకు రాజు. పొరుగు మిత్ర రాజులైన మహాక్షాపులు బలహీనులు కావడంతో ఇక్ష్వాకుల బలము కూడా తగ్గినది. వనవాస రాజు శివస్కంధ వర్మ చనిపోయిన తరువాత **పల్లవులు** విజృంభించి వనవాస రాజ్యాన్ని ఆక్రమించారు. ఇదే కాలంలో ఇక్ష్వాకుల పై దెబ్బ తీయడానికి శాతవాహన వంశస్థులు పల్లవులకు సహాయం చేశారు. ప్రాచీన పల్లవ రాజు సింహవర్మ శాసనం విజయపురి సమీపములో మంచి కల్లు దగ్గర దొరికింది. ఇందులో విజయానికి చిహ్నముగా త్రైర్థికులకు దానం చేసినట్లు సింహవర్మ చెప్పుకున్నాడు. దీనిని బట్టి పల్లవ సింహవర్మ ఇక్ష్వాకు రాజ్యము పై దండెత్తి రుద్ర పురుషదత్తుని ఓడించి, వధించి విజయపురిని తగులబెట్టి ఇక్ష్వాకు రాజ్య దక్షిణ భూములను తన రాజ్యములో కలుపుకున్నాడు. సామ్రాజ్య ఉత్తర భూములు ఇతర సామంతులు ఆక్రమించారు. దీనితో ఇక్ష్వాకువంశం అంతరించింది.

## 6.9 బౌద్ధ మతానికి ఇక్ష్వాకులు చేసిన సేవ:-

### 6.9.1 ఉపోద్ఘాతము:-

ఆంధ్రదేశ మత సాంస్కృతిక పరిణామ చరిత్రలో ఇక్ష్వాకుల వంద సంవత్సరాల పాలనాకాలం ఒక ముఖ్య ఘట్టం. ఇక్ష్వాకువంశ చరిత్ర వైదిక మత ఉద్ధరణతో ప్రారంభమయినది. కాని అచిర కాలంలోనే శ్రీ పర్వతములో మహాయాన బౌద్ధము మూడు పూవులు ఆరు కాయలుగా వికసించింది. ఈ కాలములోనే స్త్రీ జనం అందులోనూ అంతః పుర స్త్రీలు, వ్యాపారులు, చేతి వృత్తుల వారు, సామాన్య ప్రజానీకం బౌద్ధమతాన్ని అత్యధికముగా ఆదరించారు. కృష్ణ ముఖ ద్వారానికి రెండు వైపుల గల ప్రాంతం ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధ మతస్థులకు కేంద్రం అయింది. ఆంధ్ర బౌద్ధ మత చరిత్రలో నూతన శకం ఆరంభమయింది. నాగార్జునకొండ, జగ్గయ్యపేట, రామిరెడ్డి పల్లి మొదలగు చోట్ల మహా స్తూపాలను నిర్మించడము, మరమ్మత్తులు చేపట్టడం, విస్తృత పరచడము జరిగింది. నాగార్జున కొండ మహాయాన కేంద్రం అయింది. అపర మహావిన శైలీయులు, బహుశృతీయులు, మహీశాసకుల వంటి అనేక శాఖల వారు ఇక్కడ నివసించారు. దూర దేశాల నుంచి యాత్రికులను ఆకర్షించింది. ఈ యాత్రికుల కోసం సింహళ విహారం మొదలగు వసతులు ఏర్పడ్డాయి. రాజ భాండాగారికుడైన బోధి శర్మ మేనకోడలు ఉపాశిక బోధి శ్రీ అనేక దాన ధర్మాలు చేసింది. తామ్రపర్ణి, కాశ్మీరం, గాంధారం, చైనా, తోసలి, అపరాంత, వంగ, వనవాస, యవన, ద్రమిళ, పాలురు మొదలైన రాజ్యాల్లో బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేసే వారి కోసం నాగార్జున కొండలో చుళదమ్మ గిరి పై చైత్య గృహాన్ని , చతుశ్శాలను, ఇంకా అనేక నిర్మాణాలను చేసింది. కృష్ణానది ముఖ ద్వారంలో వున్న రేవు కేంద్రాలకు, సింహళం వంటి ఇతర దేశాల కేంద్రాలకు మధ్య ముమ్మరంగా ఉన్న నౌకా వాణిజ్యం ఈ పరిణామాలకు దోహదం చేసింది. నాగార్జునకొండ అత్యున్నత విద్యా కేంద్రంగా ప్రకాశించింది. బౌద్ధ వాఙ్మయంలో తమ ఉన్నతవిద్యను కొనసాగించడానికి వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు ఇక్కడికి వచ్చేవారు. బహుబలుని కాలం నుంచి భక్తి ప్రధానమైన బ్రాహ్మణ మతానికి విజయపురి కేంద్రం అయింది. హారీతి మహాసేన, మహాదేవ, అష్టభుజ మొదలగు దేవతలకు ఆలయాలు వెలిసినాయి. బౌద్ధ, శైవ, వైష్ణవాలకు కూడలి అయినది. శ్రీ పర్వతం

క్రమంగా బుద్ధుని విష్ణుమూర్తి అవతారముగా శ్రీ పర్వతములోనే ప్రజలు ఆరాధించడం ప్రారంభించారని భావించడానికి అవకాశం ఉంది.

## 6.10 ఆధారాలు:-

ఇక్ష్వాకు రాణులు, సామాన్య పౌరులు అనేక మంది సామాన్య స్త్రీలు, ధనిక వర్గం వారు నాగార్జున కొండ వద్ద విహారాలను దానాలు చేసి, స్థూప, చైత్య గృహాలు నిర్మించి, వేయించిన శాసనాలు ఇక్ష్వాకుల నాటి బౌద్ధ మత పరిస్థితిని, ఇక్ష్వాకులు బౌద్ధానికి చేసిన సేవ స్పష్టంగా తెలియచేస్తున్నవి.

## 6.11 మహాయాన తత్వ అభివృద్ధి :-

భక్తి ఉద్యమ ఫలితంగా క్రీ॥శ॥ 3 వ శతాబ్దం నుండి మతాచారాలలో పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ పరిణామాలు శాతవాహన యుగంలోనే ప్రారంభమైనప్పటికీ ఇక్ష్వాకుల కాలంలో స్పష్టముగా కన్పిస్తాయి. ధార్మికమైన క్రమశిక్షణ, నైతిక సత్ప్రవర్తన వల్ల వ్యక్తిత్వ వికాసాన్ని, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించడాన్ని ప్రబోధించిన జైన, బౌద్ధ మతాలు క్రమముగా తమ ఉనికిని కోల్పోతున్నాయి. మొదట్లో ఈ మతాలు విదేశీయులను, దేశీయమైన క్రింది వర్గాల వారిని ఆకర్షించినప్పటికీ, భక్తి ప్రధానముగా రూపొందిన పౌరాణిక హిందూ మతం వర్ణ వివక్షతను తిరస్కరించి, వారిని తిరిగి ఆకర్షించసాగింది. ఇటువంటి పరిస్థితులలో బౌద్ధ మతం కూడా భక్తి ప్రభావం చేత రూపాంతరము చెంది మహాయాన తత్వాన్ని ఆవిష్కరించింది. ఈ తత్వం అభివృద్ధి చెంది బౌద్ధ మతం నూతన తేజస్సుతో, ఇక్ష్వాకుల కాలంలో నాగార్జునకొండ లోయలో విజృంభించింది.

## 6.12 పూజా పద్ధతిలో మార్పు - శ్రీ పర్వతము:-

మహాయానతత్వం వల్ల బౌద్ధ మతంలో అనేక మార్పులు వచ్చాయి. ఈ మార్పులు ఆరాధన విధానములోనూ, బౌద్ధ నిర్మాణ పద్ధతులలోనూ స్పష్టముగా కన్పిస్తుంది. నాగార్జున కొండ శాసనాలలో బుద్ధుని దేవుడిగా పూజిస్తే, నిర్వాణము లభిస్తుందని చెప్పబడింది. బౌద్ధ విహారాలకి దానాలు చేసినా, బుద్ధుని పూజించినా తరతరాలకూ ఫలితం అందుతుందనే నమ్మకం ప్రజానీకంలో పెరిగింది. బౌద్ధుల పూజా పద్ధతులలో మార్పులు వచ్చాయి. వైదిక పూజా పద్ధతులను మహాయాన బౌద్ధం స్వీకరించింది. బుద్ధుడు దేవుడని భావించడం వల్ల బుద్ధుని విగ్రహాలతో ఆలయాలు నిర్మించడం ప్రారంభం అయింది. దీఘుని కాయం, మధ్యమని కాయం అను బౌద్ధమత గ్రంథాలను వేదాల వలె పఠించి, వేద మంత్రాల వలె బౌద్ధ ఆలయాలలో చదవడం ప్రారంభం అయినది. బ్రాహ్మణుల వలె పరివ్రాజకులు జోతిష్య సాముద్రిక శాస్త్రాలలో నిష్ణాతులయ్యారు. వారు మంత్రాలను వేద ప్రవచనము వలె చదువుతున్నట్లు ఒక శాసనం చెబుతుంది. బౌద్ధుల పూజా పద్ధతికి అనుగుణంగానే ఇక్ష్వాకుల కాలంలో నాగార్జునకొండ లోయలో బౌద్ధ నిర్మాణాలు సాగాయి. ఆనాటి బౌద్ధులలో నాలుగు శాఖలు వారు ఉన్నట్లు అచట లభ్యమైన శాసనాల వల్ల తెలుస్తుంది. వీటిలో అపర మహావిన శైల, బృహశృతీయ శాఖల మహాయాన పంథాకు చెందినవి. వీరు మొదట బుద్ధ విగ్రహ పూజను అంగీకరించలేదు. వీరు విహారాలు నిర్మించారేగానీ, చైత్య గృహాలు నిర్మించలేదు. బహుశృతీయులు చైత్యాన్ని నిర్మించారు గానీ, బుద్ధ పూజ చేయలేదు. ఐతే తరువాత రెండు శాఖల వారు చైత్య గృహాలు నిర్మించి, బుద్ధుని విగ్రహాలు ప్రతిష్టించారు, ఆరాధించడం ప్రారంభించారు. ఈ కాలంలోనే సింహళ బౌద్ధ భిక్షువులు బుద్ధుని పూజించడముతో పాటు చిన్న చిన్న స్థూపాలు నిర్మించే ఒక క్రొత్త పద్ధతిని ప్రారంభించారు. వీటినే ముడుపు స్థూపాలు అంటారు. అనగా తమ కోరిక నెరవేరిన తరువాత నిర్మించే కట్టడం, బుద్ధుని ఆరాధించే పద్ధతి వచ్చిన తరువాత చైత్యం (స్థూపం), చైత్య గృహాల నిర్మాణంలో మార్పులు వచ్చాయి. ఈ రెండింటిలో దేనికి ప్రాముఖ్యమివ్వాలనే చర్చ వచ్చి చివరకు అందరూ చైత్య గృహ నిర్మాణానికే ప్రాముఖ్యం ఇచ్చారు. నాగార్జున కొండలో స్థూప విహారాలతో కలసి వున్నవి, స్థూప విహార చైత్య గృహాలు కలవి, స్థూప విహార బుద్ధ చైత్య గృహాలు కలవి, విహారం, చైత్య గృహాలు కలవి, ఒక్కొక్క సముదాయంలో కలవు.

చైత్య గృహాల నిర్మాణముతో అనేక బుద్ధ విగ్రహాలు రూపొందించబడ్డాయి. పలనాడు ప్రాంతంలో లభ్యం అయ్యే రాయితో పెద్ద పెద్ద బుద్ధ విగ్రహాలు మలచబడ్డాయి. శ్రీ పర్వతంలో బంగారముతో చేసిన బుద్ధుని విగ్రహం వుండేదని ఇట్సింగ్ చెప్పాడు.

## 6.13 బౌద్ధానికి ఇక్ష్వాకులు చేసిన సేవ:-

ఇక్ష్వాకు రాజులు వైదిక మతావలంబులైనా పరమత సహనం కలవారు. ఇక్ష్వాకు రాణులు, వారి బంధువులు, సామాన్య స్త్రీలు, ధనిక కుటుంబాలకు చెందిన వారు బౌద్ధ విహారాలకు అపారముగా దానం చేశారు. ఇక్ష్వాకు రాజవంశ ఆదరణలో బౌద్ధ మతం అందుకొన్న ఉచ్ఛస్థితి గురించి నాగార్జున కొండ శాసనాలు తెల్పుతాయి. ఇక్ష్వాకుల రాజధాని విజయపురిలోనూ, శ్రీ పర్వతం మీద నిర్మించిన బౌద్ధ కట్టడాల గురించి సింహళం, మలేషియా, చైనా, తూర్పు ద్వీపాల నుంచి వచ్చి ఇచట నివాసమేర్పరచుకొన్న ఎక్కువ మంది భిక్షువుల, భిక్షుణుల గురించి, ఆనాడు వున్న బౌద్ధ మత శాఖలు వారిని ఆదరించిన తీరు రాజ వంశీకులు, సాధారణ పౌరుల గురించి నాగార్జున కొండ శాసనాలు తెల్పుతాయి. నాగార్జున కొండ శాసన వివరాల ప్రత్యేకత ఏమంటే బౌద్ధ సంస్థలకు ఇక్ష్వాకు రాజులు ఇచ్చిన దానాలేవీ లేకపోవడం, శాసనాలలో రాజులిచ్చిన దానాలు కనపడనందు వల్ల ఇక్ష్వాకు రాజులందరూ బ్రాహ్మణ మతస్థులేనని, మత సహనము కలవారు కాబట్టి బౌద్ధమత సంస్థలను, భిక్షువులను, భిక్షుణులను రాణులు, వారి బంధువులు, ధనిక కుటుంబానికి చెందిన వారు బౌద్ధాన్ని ఆదరించడానికి రాజులు అభ్యంతరం చెప్పలేదని కొందరి సిద్ధాంతం. అయితే ఇక్ష్వాకు రాజాలలో వీర పురుష దత్తుడు బౌద్ధమత ప్రచార ప్రభావితుడై, బ్రాహ్మణ మతాన్ని విడనాడి, బౌద్ధాన్ని స్వీకరించి, ఆ మత వ్యాప్తికి కృషి చేసినట్లు నాగార్జున కొండలో లభ్యమైన శిల్పాల ఆధారంగా కొందరు వాదించారు.

ఇక్ష్వాకు రాజైన మొదటి శాంతమూలుని చెల్లెలు మహాతలవరి అడవి శాంతి శ్రీ తన ధనాన్నంతా వినియోగించి శ్రీ పర్వతములో శిధిలావస్థలో వున్న మహా చైత్యాన్ని పునర్నిర్మించింది. ఈ మహా చైత్యాన్ని ఆచార్య నాగార్జుని కొరకు యజ్ఞ శ్రీ శాతకర్ణి నిర్మించాడు. వీర పురుష దత్తుని భార్యలు మహాదేవి శాంతి సిరి, మహాదేవి బాపి సిరి, మహాదేవి భట్టిదేవి మహా చైత్యానికి ధనం ఇచ్చారు. వీర పురుష దత్తుని చెల్లెలు సిరి అడవి శాంతమూల బౌద్ధ భిక్షువులకు దానం చేసింది. మరో చెల్లెలు శాంతి సిరి పది సంవత్సరాల పాటు మహా చైత్య పోషణకు విరాళాలిచ్చింది. ఆయన కుమార్తె కొడబలి సిరి కూడా అనేక దానాలు చేసింది. రాజ కుటుంబీకులే గాక, రాజ బంధువులు కూడా బౌద్ధ విహారాలకు దానాలు చేశారు. ఒక మహాతలవరి, పూగియ కుటుంబానికి చెందిన ఒక మహాసేనాపతి భార్య, ఇంకొక సేనాపతి, ఇంకొక సేనాపతి భార్య చైత్య నిర్మాణంలో సహాయపడ్డారు.

బౌద్ధ సంస్థలకు దానాలిచ్చిన స్త్రీలలో రాజ భండాగారికుని మేనకోడలు ఉపాశిక బోధసిరి ఖ్యాతి గడించింది. ఈమె బౌద్ధ భిక్షువుల కొరకు శ్రీ పర్వతములో చుళధమ్మ గిరి పై ఒక చైత్య గృహం, ఒక చతుశ్శాల నిర్మించింది. ఈ భిక్షువులు దేశ విదేశాలలో మత ప్రచారం చేసేవారు. ఈమె ఇంకా కుహల విహారము దగ్గర ఒక చైత్యాన్ని, సింహళ విహారములో బోధి వృక్షానికి అరుగునూ, ఇంకా అనేక మండపాలు, గదులు నిర్మించింది. ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధ మతాభివృద్ధికి సాక్ష్యమిచ్చే శాసనాలలో ఉపాశిక బోధి సిరి శాసనం అతి ముఖ్యమైనది. ఈ శాసనంలో బుద్ధుని ప్రార్థించే పద్ధతి విలక్షణమైనది. ఈ శాసనములో బౌద్ధ మత ప్రచారకులు సంచరించిన దేశాలు పేర్కొనడం జరిగింది. దేశ విదేశాలలో ఆంధ్ర బౌద్ధులు ప్రచారం చేయడానికి కారణం వారికి ఇక్ష్వాకు రాజాల నుండి లభించిన ఆదరణయే. బౌద్ధ మత వ్యాప్తి కారణంగా శ్రీ పర్వతం బౌద్ధులకు పవిత్ర క్షేత్రం అయింది. ఫాహియాన్ తన రచనలలో శ్రీ పర్వతం మీద అయిదు అంతస్థుల విహారం వున్నదని, ఇది రాతితో నిర్మింపబడిన అద్భుత విహారమనీ ఇందులో **1500** గదులు కలవని వ్రాశాడు.

ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండ లోయలోనే గాక, ఆంధ్ర దేశమంతటా బౌద్ధం బలంగానే వున్నదని వివిధ ప్రాంతాలలో బయల్పడిన బౌద్ధ శిధిలాలు, శిల్పాల వల్ల స్పష్టం అవుతుంది. ఆనాడు ఘంటసాల, జగ్గయ్య పేట, గుంటుపల్లి, గుడివాడ, అరుగొలను, చినగంజాం, పెదగంజాం, కనుపర్తి, గోలి, గుమ్మడిదుర్రు, బుద్ధాం, ప్రముఖ బౌద్ధ స్థలాలనీ అచట లభ్యమైన సాక్ష్యాల వల్ల తెలుస్తుంది.

ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధ, వైదిక మతాల మధ్య సహజీవనం సాగింది. ఇక్ష్వాకు రాజులు పరమత సహనం కలవారు. ఆనాడు బౌద్ధ మతములోని అనేక శాఖల వారి మధ్య కూడా పరస్పర సహకారం ఉండేది. బౌద్ధులు వైదిక మత పూజా విధానాన్ని స్వీకరించారు. ఆనాటి హిందూ బౌద్ధ సంస్కృతీ కేంద్రం నాగార్జున కొండ బుద్ధుని ధాతువుపై నిర్మించబడిన స్తూపం. దాని సమీపములోనే శాంతమూలుడు యజ్ఞ వేదిక నిర్మించి యజ్ఞం చేయడము మత సహనానికి, సహజీవన సూత్రానికి నిదర్శనము.

## 6.14 వాస్తు శిల్పాలు:-

ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండలో అనేక బౌద్ధ నిర్మాణాలు జరిగాయి. వీటిలో స్థూపాలు, విహారాలు, చైత్య గృహాలు కలవు. 1927 - 1960 మధ్య కాలంలో జరిపిన త్రవ్వకాల వలన బౌద్ధ శిధిల నిర్మాణాలు, అద్భుత శిల్ప కళాఖండాలు బయల్పడ్డాయి.

వీర పురుష దత్తుని ఆరవ రాజ్య పాలనాకాలంలో అతని సోదరి శాంతి సిరి శ్రీ పర్వతం పై పాడుపడి ఉన్న మహాచైత్యాన్ని పునః నిర్మించింది. దీని వ్యాసం 106 అడుగులు. ఇచ్చట గల ఒక ఆయక స్థంభం మీద ఇక్ష్వాకుల నాటి ప్రాకృత శాసనంలో చైత్యంలో బుద్ధ ధాతువు నిక్షిప్తము చేసినట్లు పేర్కొనబడింది. స్థూపం అడుగు భాగాన నైరుతి వైపు గల గూడులో ఒక చిన్న బంగారు భరిణె అందులో దంతం అవశేషం లభించింది. ఉపాసిక బోధి సిరి నాగార్జున కొండలో చుళదమ్మగిరి పై ఒక చైత్యాలయాన్ని, ఒక చతుశ్శాలను నిర్మించింది. ఇది విదేశాలలో బౌద్ధ మతాన్ని ప్రచారం చేసే భిక్షువుల కోసం నిర్మించబడింది. శ్రీ పర్వతంలో బౌద్ధ భిక్షువుల నివాసం కొరకు సింహళ రాజు ఒక విహారాన్ని నిర్మించాడు. వీరు దేశ విదేశాలలో హీనయాన మతాన్ని ప్రచారం చేశారు. ఈ విహారాన్ని సింహళ విహారమని పిలిచేవారు. ఈ విహారానికి బోధి సిరి ధన సహాయం చేయడమే కాక ఆ విహారంలో ఉన్న బోధి వృక్షానికి ఒక వేదికను నిర్మించినట్లు అచ్చట గల శాసనంలో ఉంది.

నాగార్జున కొండ లోయలో త్రవ్వకాలలో సుమారు 30 విగ్రహాలు బయల్పడ్డాయి. వీనిలో అపరశైలీయులవి, బహుశృతీయులవి, థేరవాధులవి గలవు. వీటిలో ఒక విహారాన్ని భట్టిదేవి నిర్మించింది. దీనికి దేవి విహారం అని పేరు. థేరవాద విహారాల ప్రసక్తి ఉపాసిక బోధి సిరి వేయించిన శాసనంలో ఉన్నది. ఈమె చుళదమ్మ గిరి పై ఒక చైత్యాలయాన్ని నిర్మించింది. కొడబలి సిరి ఒక థేరవాద విహారాన్ని నిర్మించింది. ఎహువుల శాంతమూలుని శాసనంలో ప్రస్తావించబడిన కుమార నంది విహారాన్ని కనుగొనడం జరిగింది. దీనిని కుమార నంది అనే శ్రేష్ఠి నిర్మించి అందులో బుద్ధుని శిలా విగ్రహాన్ని ప్రతిష్టించాడు. కొడబలి సిరి కూడా ఆరామాలకు దానాలు చేసి, శాసనాలు వేయించింది. ఇక్ష్వాకులు వైదిక మతస్థులైన బౌద్ధములోని భిన్న శాఖల వారిని ఆదరించి తమ ఔదార్యం చూపారు.

నాగార్జున కొండ లోయ త్రవ్వకాలలో శిధిలాల నుండి అనేక శిల్పాలు, బుద్ధ విగ్రహాలు వెలికి తీశారు. బుద్ధుని జీవిత విశేష గాధలను బోధిసత్వుని జాతక కథలతోను గల శిల్పాలు అనేకం లభించాయి. వీటితో పాటు లౌకిక దృశ్యాలు కూడా బయల్పడ్డాయి. బుద్ధుని జననం, మహాభినిష్క్రమణ, సంబోధి, ధర్మచక్ర పరివర్తన, మహాపరి నిర్వాణం, జాతక కథలు, బుద్ధుని విగ్రహాలు త్రవ్వకాలలో బయల్పడిన వాటిలో గలవు. వీటిలో మహాభినిష్క్రమణ ఘట్ట శిల్పం మహోన్నతమైనది.

పాఠం - 7

# శాలంకాయనులు

**ముఖ్యాంశాలు:-**


7.0 లక్ష్యం

7.1 ఉపోద్ఘాతము

7.2 ఆధారాలు

7.3 వంశవృక్షము

7.4 రాజకీయ చరిత్ర

7.4.1 విజయదేవ వర్మన్

7.4.2 హస్తి వర్మన్

7.4.3 మొదటి నంది వర్మన్

7.4.4 చండ వర్మన్

7.4.5 రెండవ విజయ నంది వర్మన్

7.4.6 విజయ స్కంధ వర్మన్

7.5 మతము


## 7.0 లక్ష్యం:-

ఇక్ష్వాకుల పతనము తరువాత శాలంకాయనులు ఉత్తరాంధ్రలో రాజ్యాన్ని స్థాపించి వేంగీని రాజధానిగా చేసుకొని సుమారు క్రీ॥శ॥ 300 మొదలు 420 వరకూ పాలించారు. వేంగీ శాలంకాయనుల గురించి వివరించటమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## 7.1 ఉపోద్ఘాతము:-

తీరాంధ్రంలో శాలంకాయనులు చిరపరిచితులు. క్రీ॥శ॥ 130 ప్రాంతంలో భూగోళ శాస్త్రజ్ఞుడు టాలమీ పేర్కొన్న కృష్ణానదీ ముఖ ద్వారములోని మైసోలియా ప్రాంతపు 'సలకనాయి' తెగ సంతతే ఈ శాలంకాయనులని హెచ్.సి. రాయచౌదరి పేర్కొన్నాడు. టాలమీ తన రచనలలోనే పేర్కొన్న బెనగురాన్ నాటి వేంగీ పురమై ఉండవలెను. శాలంకాయనులు ఇక్ష్వాకుల వలె క్షాత్ర ధర్మాన్ని నిర్వహించిన బ్రాహ్మణులు. ఆనందులు బృహత్పలాయనుల వలెనే శాలంకాయనులు కూడా గోత్ర నామముతోనే తమ కుటుంబాన్ని తెలియజేసికొన్నారు. నాటి సాంప్రదాయాన్ని అనుసరించి, వర్మన్ అనే అంత్యనామం కలిగి వుండినారు. విశ్వామిత్రుని సంతతి వాడైన శాలంకాయనుడనే ఋషి పేరు మీద వీరి గోత్రం ఏర్పడినది. శాలంకాయనుల తామ్ర శాసనాలను బట్టి వారి రాజలాంఛనం నంది అని తెలుస్తున్నది. ప్రతి శాలంకాయన రాజు శాసనాలలో ఉపయోగించిన బప్ప - భట్టారక - పాదభక్త ప్రయోగాన్ని బట్టి వీరికి

పల్లవులకు ఏదో సంబంధం వుండి ఉండవలెను. ఈ పదజాలం పల్లవుల శాసనాలలోనిది. పల్లవుల రాజ లాంఛనం కూడా నందియే. శాలంకాయనులు పల్లవులతో సంఘర్షించక పోవడం గమనించదగ్గ అంశం. శాలంకాయనులు చిత్ర రథస్వామి పాదానుధ్యాతులు. శాలంకాయనుల ముద్రికలలో వున్న చిత్రాన్ని బట్టి కూడా వీరు సూర్యారాధకులని చెప్పవచ్చు.

శాలంకాయనులు మొదటి శాతవాహనులకు సామంతులుగా ఆంధ్ర రాజ్య సరిహద్దు రక్షకులుగా వున్నారు. ఆ తరువాత ఇక్ష్వాకులకు సామంతులుగా కొనసాగినట్లు కనిపిస్తుంది. క్రీ॥శ॥ 3 వ శతాబ్ది చివరి కాలంలో ఇక్ష్వాకుల పాలన అంతరిస్తున్న సమయంలోనే రాజకీయంగా తీరాంధ్రములో అయోమయ స్థితి నెలకొన్నది. దీనికి బహుశా అభీరులు, వారి మిత్రుల దండయాత్ర కారణం కావచ్చు. ఇదే సమయంలో ఇక్ష్వాకు సామంతులు స్వతంత్రరాజ్యాల స్థాపనకు పూనుకున్నారు. కూడూరాహారంలో బృహత్పలాయనులు, కందర పురంలో ఆనందులు, ప్రకాశం, నెల్లూరు ప్రాంతంలో పల్లవులు విజృంభించి తమ అధికారాన్ని విస్తృతం చేయాలని ప్రయత్నించారు. ఇటువంటి పరిస్థితులలోనే కృష్ణా తీరానికి ఉత్తరముగా వున్న ప్రాంతములో వేంగీ కేంద్రముగా శాంతిని పునరుద్దరించి, దక్షిణముగా శాలంకాయనులు తమ అధికారాన్ని విస్తరించినారు. నేటి ఏలూరుకు ఎనిమిది మైళ్ల దూరంలో వున్న పెద్ద వేగియే నాటి వేంగీపురము.

## 7.2 ఆధారాలు:-

శాలంకాయనుల చరిత్ర అనేక ఊహాగానాలకు, వివాదాలకు తావిచ్చింది. దీనికి కారణం అసమగ్రమైన, అనిశ్చితమైన ఆధారాలు. వీరికి సంబంధించి తొమ్మిది తామ్ర శాసనాలు దొరికాయి. ఇటీవల గుంటుపల్లిలో ఒక శిలా శాసనం కన్పించింది.

**7.2.1 కానుకొల్లు తామ్ర పట్టికలు:-** ఈ రెండు తామ్ర పట్టికలు కానుకొల్లు గ్రామంలో (కృష్ణాజిల్లా) దొరికింది. వీటిలో మొదటి ఎనిమిది రేకులు గలవి మొదటి నందివర్మచే తన 14వ రాజ్య పాలనాకాలంలో జారీ చేయబడింది. ఈ శాసనం ప్రాకృత భాషలో వుంది. ఈ శాసనం రథకార అగ్రహారం శాస్త్ర సమ్మతముగా ఏర్పాటు చేసినట్లు చెబుతుంది. రెండవ శాసనం నాలుగు రేకులు గలవి. ఇవి స్కంధ వర్మచే మొదటి రాజ్యపాలనా కాలంలో జారీ చేయబడింది. దీనిలోని భాష సంస్కృతం. ఈ శాసనం వేంగీ నుండి జారీ చేయబడింది. ఈ శాసనములో మూడు తరాల రాజుల పేర్లు గలవు. కుద్రహారలోని కంపార అనే గ్రామాన్ని పితృభక్తులు సూర్య దేవ ఆరాధకులైన శాలంకాయనులు రథకారులకు దానముగా ఇచ్చినట్లు ఈ శాసనము చెబుతుంది.

**7.2.2 హస్తివర్మ పెనుగొండ తామ్ర శాసనం:-** ఐదు రేకులున్న ఈ శాసనం పెనుగొండ గ్రామంలో (పశ్చిమ గోదావరి జిల్లా) దొరికింది. ఈ శాసనం కొంత ప్రాకృతంలో మరికొంత సంస్కృతంలో ఉంది. ఈ శాసనములో భగవత్ నారాయణ భక్తుడైన హస్తివర్మ శతాధిక సంవత్సర వయస్కుడని చెప్పబడింది. కానీర ఆహారములో గల ములుకిలి అను గ్రామాన్ని వైదిక కర్మకాండ నిర్వహించిన బ్రాహ్మణులకు, తన దీర్ఘ ఆయుష్షు కొరకు అగ్రహారముగా ఇవ్వబడింది.

**7.2.3 చండ వర్మ ధారికాటూర శాసనము:-** నాలుగు రేకులు కలిగిన ఈ శాసనం వేంగీ నుండి జారీ చేయబడింది. ఈ శాసనం కొంత ప్రాకృతంలో మరికొంత సంస్కృతంలో వ్రాయబడింది. అచండ వర్మ తన 35వ రాజ్యపాలనా కాలంలో ఈ శాసనం జారీ చేశాడు. ఈ శాసనంలో అచండ వర్మ బప్ప - భట్టారక - పరమదైవత చిత్ర రథస్వామి పాదానుధ్యాయుడని చెప్పబడింది. భవస్కంధ శర్మార్య భర్త్రి శర్మార్య అనే సోదరులకు అన్ని విధాలైన పన్నుల మినహాయింపుతో ధారికాటూర అనే గ్రామాన్ని అచండవర్మ అగ్రహారముగా ఇచ్చినట్లు ఈ శాసనములో చెప్పబడింది.

**7.2.4 విజయస్కంధ వర్మ కంతేరు శాసనము:-** ఈ తామ్ర శాసనం కంతేరు గ్రామంలో (గుంటూరు జిల్లా) లభ్యమైంది. ఈ శాసనములో ఎనిమిది రేకులు గలవు. ఈ శాసనంలో భాష సంస్కృత లిపి తెలుగు కన్నడ లిపి. ఈ శాసనములో మొదటి భాగం విజయస్కంధ వర్మ జారీ చేశాడు. తన కులగోత్రాల అభివృద్ధి కొరకు అన్ని పన్నుల మినహాయింపుతో కుడూరహార విషయములోని చెన్నాపుర అనే గ్రామాన్ని శివార్య అనే బ్రాహ్మణునకు దానమిచ్చినట్లు వుంది. రెండవ భాగములో నంది

వర్మ కుడూరహార లోని కురువాడ అను గ్రామములో కొంత భూమిని బ్రాహ్మణునకు దానం ఇచ్చినట్లు చెప్పబడింది.

**7.2.5 విజయ దేవ వర్మ శాసనము:-** నాలుగు రేకులు కలిగిన ఈ శాసనం ఎక్కడ దొరికిందో తెలియదు. ఈ శాసనం ప్రాకృతంలో వ్రాయబడింది. దీనిని విజయదేవ వర్మ 13వ రాజ్య పాలనా కాలంలో విడుదల చేశాడు. ఈ శాసనంలో గణశర్మ అనే బ్రాహ్మణ ప్రముఖునకు కొంత భూమితో పాటు ఇల్లు కట్టుకునేందుకు ఒక స్థలం, పరిచారకుల ఇంటి కొరకు మరొక స్థలం దానంగా ఇచ్చినట్లు చెప్పబడింది.

**7.2.6 విజయనంది వర్మ కొల్లేరు శాసనము:-** నాలుగు రేకులు గల ఈ శాసనం ప్రాకృత భాషలో వుంది. ఈ శాసనంలో నంది వర్మ గుణగణాలు వివరించబడి ఉంది. కుడూరహారములోని వెదునూర పల్లిక అనే గ్రామాన్ని 157 మంది బ్రాహ్మణ ప్రముఖులకు దానమిచ్చినట్లు ఈ శాసనంలో చెప్పబడింది.

**7.2.7 నంది వర్మ పెద వేగి శాసనము:-** ఈ శాసనం నంది వర్మచే విష్ణు గృహ స్వామికి దేవహలముగా దానము ఇచ్చిన భూమి గురించి తెలుపుతుంది.

**7.2.8 విజయనంది వర్మ గుంటుపల్లి శిలా శాసనము:-** ఇటీవల గుంటుపల్లి వద్ద పురావస్తు త్రవ్వకాల వల్ల ఈ శిలా శాసనం బయల్పడింది. దీనిని విజయనంది వర్మ చెక్కించాడు. ఇందులో శాలంకాయనుల వంశ క్రమం నాలుగు తరాల వరకు చెప్పబడింది. శాలంకాయనులు బౌద్ధాన్ని పోషించినట్లు బౌద్ధ భిక్షువుల నివాసాన్ని గుంటుపల్లిలో ఏర్పాట్లు చేసినట్లు ఈ శాసనంలో చెప్పబడింది.

ఇటీవల పెద వేగి - గుంటుపల్లి ప్రాంతాలలో జరిపిన పురావస్తు త్రవ్వకాలలో అనేక శైవ మత ప్రతిమలు, నాగదేవత శిల్ప ఫలకం, ఏకాదశ రుద్రమూర్తి శిల్పం, కోట గోడ, దుర్గ కాల భైరవ దేవత విగ్రహాలు బయల్పడినవి.

## 7.3 వంశవృక్షము:-

శాలంకాయనుల వంశానుక్రమ నిర్ణయానికి ఉపకరించే శాసనాలు ప్రాకృతములో మూడు, సంస్కృతములో మూడు వున్నాయి. విజయదేవ వర్మ ఏలూరు శాసనం, నందివర్మ కానుకొల్లు శాసనం, అచండవర్మ శాసనం ప్రాకృత భాషకు చెందినవి. నందివర్మ శాసనం, రెండవ నంది వర్మ భూదాన శాసనం, హస్తివర్మ శాసనం సంస్కృత భాషకు చెందినవి. ఈ శాసనాల ద్వారా శాలంకాయన రాజుల వంశవృక్షాన్ని ఈ క్రింది విధముగా నిర్ణయించవచ్చు.

| | | |
|---|---|---|
| 1. | విజయదేవ వర్మ | క్రీ॥శ॥ 300 - 335 |
| 2. | హస్తివర్మ | క్రీ॥శ॥ 335 - 350 |
| 3. | మొదటి నంది వర్మ | క్రీ॥శ॥ 350 - 370 |
| 4. | చండవర్మ | క్రీ॥శ॥ 370 - 395 |
| 5. | విజయ నంది వర్మ | క్రీ॥శ॥ 395 - 410 |
| 6. | విజయ స్కంధ వర్మ | క్రీ॥శ॥ 410 - 420 |

## 7.4 రాజకీయ చరిత్ర:-

శాలంకాయన గోత్రజులు వేంగీ మండలములో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. వీరి రాజధాని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సమీపములోని వేంగీ. ఇప్పటి వరకు లభ్యమైన శాసనాల ద్వారా తరతరాల శాలంకాయన రాజులు రాజ్యం చేసినట్లు గ్రహిస్తున్నాము.

**7.4.1 విజయదేవ వర్మన్:-** శాలంకాయనుల రాజ్య స్థాపకుడు మహారాజ విజయదేవ వర్మన్ ఉత్తర భారతదేశంలో గుప్త రాజ్యాన్ని మొదటి చంద్రగుప్తుడు, కన్నడ ప్రాంతంలో కదంబ రాజ్యాన్ని మయూర శర్మ స్థాపించిన కాలంలోనే విజయదేవ వర్మ ఆనంద రాజుల అధికారాన్ని అణచి, వేంగీ కేంద్రముగా స్వతంత్ర రాజ్యము స్థాపించాడు. ఇతడు స్వతంత్ర రాజ్య స్థాపనకు ముందు సామంతరాజు. ఇతర రాజులను జయించి సర్వాధికారం సంపాదించిన తరువాత విజయదేవ వర్మన్ అశ్వమేధ యాగము చేశాడు. ఈ వంశంలో అశ్వమేధ యాగం చేసిన వాడు ఇతడొక్కడే. వాకాటక మొదటి ప్రవర సేనునికి ఇతడు సమకాలికుడు. వాకాటకుల నుండి ఉత్తరాంధ్ర గెలుచుకొన్న తరువాతనే ఇతడు అశ్వమేధ యాగం జరిపి వుండవచ్చు. ఇతనికి పల్లవ రాజులు మిత్రులు. ఆనంద రాజులను ఓడించిన పల్లవులు వేంగీ శాలంకాయనులతో సంఘర్షణకు దిగలేదు. పల్లవ శాలంకాయన రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా వుండేది. వేంగీ పుర చిత్ర రథస్వామి భక్తుడైన విజయదేవ వర్మ పరమ మహేశ్వరుడనని చెప్పుకొన్నాడు. ఇతడు జారీ చేసిన శాసనాల వలన బభూరస గోత్రానికి చెందిన గణశర్మ అనే బ్రాహ్మణుడు రాజ్యపాలనలో ముఖ్యమైన ఉద్యోగిగా భావించవచ్చు.

**7.4.2 హస్తి వర్మన్:-** విజయదేవ వర్మన్ తరువాత హస్తివర్మన్ వేంగీ సింహాసనం అధిష్టించాడు. ఇతనికి విజయదేవ వర్మకూ వున్న సంబంధ బాంధవ్యాలు చరిత్ర క్షందడం లేదు. విజయదేవ వర్మ నిర్మించిన సామ్రాజ్యం హస్తివర్మ కాలంలో చెక్కుచెదరలేదు. అనేక 'సమారావాప్త విజయాన' అని పెదవేగి శాసనం హస్తివర్మను వర్ణించింది. దీనిని బట్టి హస్తివర్మ అధికారాన్ని చేపట్టడానికి అనేక యుద్ధాలు చేశాడని భావించవచ్చు. కానీ ఇతడు గెలిచిన రాజులెవరో తెలియదు.

హస్తివర్మ రాజ్య కాలంలో ప్రధాన సంఘటన సముద్రగుప్తుని దక్షిణా పథ దండయాత్ర. హరిసేనునిచే లిఖించబడిన అలహాబాద్ స్తంభ శాసనంలో దక్షిణా పథంలో సముద్రగుప్తుడు ఓడించి తిరిగి వారి రాజ్యాలను ఇచ్చి వేసిన సందర్భములో 12 మంది రాజుల జాబితా వుంది. వారిలో వేంగిని పాలించే హస్తివర్మ ప్రస్తావన కూడా ఉంది. అలహాబాద్ స్తంభ శాసన పాఠం "కౌసలక మహేంద్ర, మహా కాంతారక వ్యాఘ్రరాజ, ఎరండు పల్లక దమన, కాంచేయక విష్ణుగోప, ఆవముక్త నీలరాజు, వైంగేయక హస్తివర్మ పాలకుడు ఉగ్రసేన, దైవరాష్ట్రక కుచేర, కౌశస్థల కౌరాలక మంతరాజ, పిష్టపురక మహేంద్ర గిరికొత్తూరక నేలరాజ పురక ధనుంజయ ప్రభృతి సర్వ దక్షిణా పథ రాజ గ్రహణ మోక్షాను గ్రహ జనిత ప్రతాపోనిశ్ర మహా భాగ్యశ్య". శాసన పాఠం పరిశీలిస్తే తెలియవచ్చే విషయాలు రెండు గలవు. అవి 1. సముద్రగుప్తుడు దక్షిణా పథ రాజులను బందీలుగా చేసి విడిచిపెట్టాడు, 2. పైన పేర్కొన్న రాజులు వారి రాజ్యాలు ఇరుగు పొరుగు రాజ్యాలు కావు. ప్రశస్తి భాషకు అనుకూలంగా పద ఆడంబరం కలసి వచ్చేటట్లు రాజ్యాల పేర్లను హరిసేనుడు కూర్చినాడేగాని భౌగోళిక ఉనికి ప్రకారం వరుస క్రమంలో వాటిని పేర్కొనలేదు.

అలహాబాద్ స్తంభ శాసనంలోని దక్షిణ రాజ్యాలన్ని మధ్యప్రదేశ్, ఆంధ్ర తమిళనాడులో ఉన్నాయి. మధ్య ప్రదేశ్‌లోని కోసల, మహాకాంతర రాజ్యాలను జయించిన సముద్రగుప్తుడు శాలంకాయన చక్రవర్తిని, అతని సామంతులను జయించినట్లయితే దక్షిణ పథాన్నంత జయించినట్లే అనుకొని ఉంటాడు. శాలంకాయనులు ఓడిపోయినట్లయితే వారి మిత్రులు పల్లవులు కూడా ఓడిపోయినట్లే.

ఈ విషయం గ్రహించిన దక్షిణ రాజులందరు ఏకమై వేంగీ రాజు హస్తివర్మ, కాంచి రాజు విష్ణుగోపవర్మన్‌ల నాయకత్వాన్ని సముద్రగుప్తుడు ఎదిరించాడని బి.వి. కృష్ణారావు అభిప్రాయపడ్డాడు. ఈ వాదానికి హస్తివర్మకు, విష్ణుగోపవర్మన్‌కు ఉన్న బిరుదులే కారణం. హస్తివర్మ బిరుదం "అనేక సమరావాప్త విజయాన" అనగా అనేక యుద్ధాలలో హస్తివర్మ విజయుడని అర్థం. విష్ణుగోప వర్మన్ బిరుదం "అనేక సంగ్రామ సాహస వమర్దోప లబ్ద విజయ యశో" అనగా అనేక యుద్ధాలలో విష్ణుగోప వర్మ తన ధైర్య సాహస సామర్థ్యాల వలన విజయ యశస్సు నార్జించినాడు. అయితే ఈ రాజ్య కూటమి సముద్రగుప్తుని ఎక్కడ ఎదుర్కొన్నదో చెప్పడానికి తగిన ఆధారం లేదు. యుద్ధ ఫలితం ఎట్లా ఉన్న వేంగి, కాంచి రాజ్యాలు నష్టపోలేదనే మాట స్పష్టం.

**7.4.3 మొదటి నందివర్మ:-** హస్తివర్మ తర్వాత అతని కుమారుడైన మొదటి నందివర్మ వేంగి సింహాసనం అధిష్టించాడు. ఇతడు ధర్మ ప్రధానమైన కార్యక్రమాలను చేపట్టినాడు. శాంతియుతంగా ఎక్కువ కాలం పరిపాలించిన నంది వర్మను అతని మనుమడు చండవర్మ 'వివిధ ధర్మ ప్రధానం' అని వర్ణించాడు. నందివర్మ మౌద్గల్యస గోత్రానికి చెందిన స్వామిచంద్ర అనే బ్రాహ్మణ కుటుంబికునికి కుడూరహార విషయంలోని కురవాడ గ్రామంలో కొంత భూమిని దానంగా యిచ్చాడు.

**7.4.4 చండవర్మ:-** నందివర్మ తర్వాత అతని కుమారుడైన చండవర్మ వేంగి సింహాసనం అధిష్టించాడు. ఇతని కాలంలో శాలంకాయన రాజ్యం విస్తరించబడింది. పెదవేగి తామ్ర పట్టికలు ఇతని సామంత రాజ్యాల స్థితిని వారి పై అతనికి ఉన్న అధికారాన్ని "ప్రతాపోనత సామంతస్య" అని వర్ణించాయి. అనగా సామంతులు తిరగబడగ వారిని పూర్తిగా ఓడించాడు. పల్లవ రాజైన రెండవ సింహవర్మ కళింగ పాలకుడు వేంగి రాజైన చండవర్మ సమకాలికులని బి.వి. కృష్ణారావు పేర్కొన్నాడు. చండవర్మ కాలంలోనే కళింగ సామంతులు తదితరులు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుటకు ప్రయత్నించిరి. అయితే చండవర్మ వారందరిని తన శక్తి సామర్థ్యాలతో అదుపులోకి తెచ్చాడు.

**7.4.5 రెండవ విజయనంది వర్మ:-** చండవర్మ తర్వాత విజయనంది వర్మ వేంగి పాలకుడైనాడు. ఇతని కాలంలో కళింగలో శత్రువుల బెడద ఎక్కువైనది. సామంతుల బలం ఎక్కువైంది. అవకాశం కొరకు వేచి ఉన్న సామంతులు సింహాసనం పై క్రొత్తగా వచ్చిన విజయనంది వర్మ కాలంలో ప్రతిఘటించి స్వతంత్రించారు. కళింగలో చండవర్మ స్వతంత్రించి బలమైన ప్రత్యర్థిగా మారాడు. ఇతడు వేయించిన కొల్లేరు, పెదవేగి శాసనాలు ఆనాటి విషయాలు తెలుపుతాయి.

**7.4.6 విజయస్కంధ వర్మ:-** విజయనంది వర్మ తర్వాత విజయస్కంధ వర్మ వేంగి సింహాసనం అధిష్టించాడు. అతడే శాలంకాయన వంశపు చివరి రాజు. ఇతని కాలానికి చెందిన కంతేరు తామ్ర పట్టికలు కుద్రహార విషయంలోని చిన్నాపుర గ్రామం దాని ఉపగ్రామాలను, అగ్రహారంగా మార్చి శివార్య అనే బ్రాహ్మణునికి ఇచ్చిన దానాన్ని తెలియజేస్తాయి. అన్ని ప్రభుత్వ పన్నులను మినహాయించి ఇచ్చిన ఈ అగ్రహారం కృష్ణాజిల్లా బందరు తాలూకాలోని చింతపురముగా గుర్తించవచ్చు. దాన గ్రహీత శివార్య స్వగ్రామం లేకుమారి. ఇది కైకలూరు తాలూకాలోని లోకముడి గ్రామంగా గుర్తించడం జరిగింది. విజయస్కంధ వర్మ తరువాత శాలంకాయనులను అంతము చేసి విష్ణు కుండినులు అధికారంలోకి వచ్చారు.

## 7.5 మతము:-

ఒక శతాబ్దికి పైగా వర్ధిల్లిన శాలంకాయనుల ప్రభావంతో రాజధాని వేంగీ శక్తివంతమైన సామ్రాజ్యాలకు కేంద్రంగా రూపొందినది. సుమారు 7 శతాబ్దాలు వేంగి ఈ గౌరవంతో వర్ధిల్లింది. శాలంకాయనులు తమ పాలనలో తూర్పు దేశాలకు భారతీయ సంస్కృతి వ్యాప్తికి పాటుపడ్డారు.

శాలంకాయనులు తాము చిత్రరథస్వామి పాదానుధ్యాతులమని, బప్ప భట్టారక పాద భక్తులమనీ చెప్పుకున్నారు. శాలంకాయనుల కుల దైవం చిత్రరథస్వామిని బప్ప భట్టారక పాద భక్తులు అనగా తండ్రిని దైవంగా భావించే వారని అర్థం. ప్రథమంలో శాలంకాయనులు శివ భక్తులు. శాలంకాయన మొదటి రాజైన విజయదేవ వర్మ తనను పరమ మహేశ్వరునిగా వర్ణించుకున్నాడు. కాని ఇతని సంతతి వారు వైష్ణవ మతాన్ని అభిమానించి పరమ భగవంతులమని వర్ణించుకున్నారు. రెండవ నంది వర్మ పెదవేగి శాసనం త్రిలోక నాధుడైన విష్ణు గృహ స్వామికి చేసిన భూదానం గురించి చెబుతుంది. ఆంధ్ర దేశంలో విష్ణు ఆలయాలు ఉన్నట్లు తెలిపే మొదటి రెండు శాసనాలలో రెండో నందివర్మ పెదవేగి శాసనం ఒకటి. రెండోది పూర్వ గంగరాజైన హస్తివర్మ శాసనం.

శాలంకాయనులు వైదిక మతస్థులైన అన్ని మతాల వారిని సమానంగా ఆదరించారు. శాలంకాయన రాజులు కాంచీపుర బౌద్ధ గురువులను ఆదరించారు. బుద్ధ దత్తుడు అనే సింహళ పండితుని అహ్వానించి అతని సలహా పై బర్మాకు బౌద్ధమత

ప్రచారకులను పంపారు. బర్మాలో బౌద్ధము ప్రవేశించడానికి సాన్ లాన్ క్రోమ్ అనే రాజు కారణమని బర్మా సాంప్రదాయం. మొదటి నందివర్మకు వివిద ధర్మ ప్రధాస్య అనే బిరుదు ఉన్నది. ఇతని కాలంలో బౌద్ధ మతం గొప్పగా ఆదరింపబడి బౌద్ధమత ప్రచారకులు బర్మాదేశానికి వెళ్ళి ఉంటారు. ఈ కాలంలో ఆంధ్రలో బౌద్ధమతం పూర్వపు ఔన్నత్యాన్ని కోల్పోయిన ప్రసిద్ధ బౌద్ధ పండితులు బుద్ధపాలితుడు, భావవివేకుడు, దిజ్ఞాగుడు మొదలగు వారు ఎటువంటి ఆటంకాలు లేకుండా తమ కార్యకలాపాలు కొనసాగించుకోగలిగారు. దిజ్ఞాగుడు తన జీవిత చరమాన్ని వేంగిలోని బౌద్ధ విహారంలోను, భావవివేకుడు ధాన్యాకటక విహారంలోను గడిపినట్లు చైనా యాత్రికుడైన హుయాన్ త్సాంగ్ వ్రాశాడు. భావయ అని పిలవబడే భావ వివేకుని పేరు వల్లనే భావయపట్ల అనే పట్టణం ఏర్పడిందని అదే బాపట్లగా మారిందని కొందరి అభిప్రాయం. బుద్ధపాలిత దిజ్ఞాగుల చరిత్రకు టిబెట్, చైనా గ్రంథాలే ఆధారాలు.

పాఠం - 8

# శాతవాహనానంతర యుగం

## ప్రాచీన (తొలి) పల్లవులు, విష్ణుకుండినులు

**లక్ష్యం:-**

తొలి పల్లవుల పుట్టు పూర్వోత్తరాలు, వారి రాజకీయ చరిత్ర, పరిపాలనా విధానము, విష్ణుకుండినుల జన్మస్థలం, వంశవృక్షం, రాజకీయ చరిత్ర, నాటి సంస్కృతి మొదలగు విషయాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశాలు:-**

1 తొలి పల్లవులు

1.1 పరిచయం

1.2 ఆధారాలు

1.2.1 ప్రాకృత శాసనాలు

1.2.2 సంస్కృత శాసనాలు

1.2.3 ఇతర ఆధారాలు

1.3 పుట్టు పూర్వోత్తరాలు

1.3.1 పల్లవులు విదేశీయులైన పహ్లావుల సంతతి వారు

1.3.2 పల్లవులు వాకాటక వంశ శాఖ వారు

1.3.3 పల్లవులు తమిళదేశీయులు

1.3.4 పల్లవులు ఆంధ్రులు

1.4 పల్లవ వంశవృక్షం

1.5 కాల నిర్ణయం

1.6 తొలి పల్లవుల చరిత్ర

1.6.1 వీర కూర్చవర్మ

1.6.2 మొదటి శివస్కందవర్మ

1.6.3 మొదటి విజయ బుద్ధవర్మ

1.6.4 బుద్ధ యాంకరుడు

1.6.5 రెండో విజయ స్కందవర్మ

1.6.6 రెండో సింహవర్మ

1.6.7 మొదటి యువరాజు విష్ణు గోపవర్మ

1.6.8 ఉగ్రవర్మ
1.6.9 మూడో సింహవర్మ
1.6.10 రెండో విజయ విష్ణు గోపవర్మ
1.6.11 మూడో స్కందవర్మ
1.6.12 నాలుగో సింహవర్మ
1.6.13 నాలుగో విజయస్కందవర్మ
1.6.14 శాంతివర్మ
1.6.15 రెండో కుమార విష్ణువు
1.6.16 మొదటి నందివర్మ
1.6.17 రెండో బుద్ధవర్మ
1.6.18 మూడో కుమార విష్ణువు
1.6.19 ఐదో సింహవర్మ
1.6.20 సింహవిష్ణువు
1.7 పల్లవుల పరిపాలనా విధానం
2 విష్ణు కుండినులు
2.1 పరిచయం
2.2 ఆధారాలు
2.3 పేరు
2.4 జన్మ స్థలము
2.5 కుల దైవం
2.6 కులం
2.7 వంశ వృక్షం
2.8 కాలం
2.9 రాజకీయ చరిత్ర
2.9.1 మొదటి మాధవ వర్మ
2.9.2 దేవవర్మ
2.9.3 రెండో మాధవవర్మ
2.9.4 మొదటి విక్రమేంద్రవర్మ
2.9.5 ఇంద్రభట్టారకవర్మ
2.9.6 రెండో విక్రమేంద్రవర్మ
2.9.7 విక్రమాశ్రయ గోవిందవర్మ

2.9.8 జనాశ్రయ మూడో మాధవవర్మ

2.9.9 మంచన భట్టారకుడు

2.10 సాంస్కృతిక విశేషాలు

2.10.1 పరిపాలనా విధానము

2.10.2 మతము

2.10.3 సారస్వతము

2.10.4 వాణిజ్యము

2.10.5 వాస్తు శిల్ప కళలు

# 1. తొలి పల్లవులు

## 1.1 పరిచయం :-

శాతవాహన సామ్రాజ్యం ప్రాగ్దక్షిణ భూమిలో విజృంభించిన పల్లవులు శాతవాహన వంశీయుల అనంతరము పాలించిన రాజ వంశాల వారిలో సుప్రసిద్ధులు. వీరి రాజధాని కంచి. వీరు ఆంధ్రదేశములో కొన్ని భాగాలనాక్రమించి సుమారు **300 సంవత్సరాలు** పాలించిరి. పల్లవ వంశీయుల పాలన 7 శతాబ్దాల కాలం సాగింది. అందులో ప్రాచీన పల్లవుల పాలన మూడు శతాబ్దాలు. మహా పల్లవుల పాలన నాల్గు శతాబ్దాలు. శాతావాహనులకు అనంతరం బనవాసి, చుటు, నాగులకు సామంతులుగా ప్రత్యక్షమైన పల్లవులు వివాహ సంబంధం ద్వారా నాగ రాజ్యాన్ని పొంది, ఇక్ష్వాకులను తుద ముట్టించి కృష్ణానది వరకు తీరాంధ్రాన్ని ఆక్రమించినారు. కర్మ రాష్ట్రానికై ఆనంద గోత్ర, శాలంకాయన, విష్ణుకుండిన వంశాలతో పల్లవులు తీవ్ర పోరాటాలు జరిపినారు. చివరకు బాదామి చాళుక్య చక్రవర్తి రెండో పులకేశి కర్మరాష్ట్రాన్ని ఆక్రమించి, క్రీ॥శ॥ 630లో పుల్లలూరు యుద్ధంలో గెలిచిన తరువాతనే పల్లవులు తమ దృష్టిని కేవలం తమిళకంపై కేంద్రీకరించి తమిళ రాజులయినారు. అయినప్పటికీ తెలుగుచోడులు, బాణులు, వైదుంబులు, నెల్లూరులోని బోయలు చాలా కాలం వరకు పల్లవులకు సామంతులై వుండినారు.

## 1.2 ఆధారాలు :-

తొలి పల్లవులు లేదా ప్రాచీన పల్లవులకు సంబంధించిన శాసనాలు మొత్తం పదహారు దొరికాయి. వీనిలో నాల్గు ప్రాకృతంలోను, మిగిలినవి సంస్కృతంలోను ఉన్నాయి.

### 1.2.1 ప్రాకృత శాసనాలు:-

1. సింహవర్మ మంచికల్లు శాసనం
2. యువ మహారాజు శివస్కందవర్మ మైదవోలు శాసనం
3. మహారాజాధిరాజు శివస్కందవర్మ హిరహడగళ్ళి శాసనం

4. విజయస్కంధవర్మ కోడలు, యువ మహారాజు బుద్ధవర్మ భార్య, బుద్ధ్యంకరుని తల్లి చారుదేవి బ్రిటీష్ మ్యూజియం శాసనం

**1.2.2 సంస్కృత శాసనాలు:-**

1. విజయస్కందవర్మ ఒంగోడు I శాసనం
2. సింహవర్మ వేసంత శాసనం
3. సింహవర్మ శక్ర పట్టణం శాసనం
4. యువ మహారాజు విష్ణుగోపుని నెడుంగరాయ శాసనం
5. యువ మహారాజు విష్ణుగోపుని ఉరువపల్లి శాసనం
6. మహారాజు సింహవర్మ ఒంగోడు II శాసనం
7. మహారాజు సింహవర్మ పికిర శాసనం
8. మహారాజు సింహవర్మ మంగడూరు శాసనం
9. మహారాజు సింహవర్మ విళవట్టి శాసనం
10. విజయ విష్ణు గోపుని చుర శాసనం
11. నందివర్మ ఉదయేందిరం శాసనం
12. కుమార విష్ణువు చందలూరు శాసనం

**1.2.3 ఇతర ఆధారాలు:-** పైన వివరించిన ప్రాకృత, సంస్కృత శాసనాలకు తోడు దర్శి శాసన భాగం, వాయలూరు స్తంభ శాసనం, పల్లం కోవిల్ శాసనం, వేలూరు పాళెయం శాసనం, పశ్చిమ గంగ మాధవ వర్మ పెనుగొండ శాసనం, విష్ణుకుండిన రెండో విక్రమేంద్ర వర్మ ఇంద్రపాలనగర II శాసనం, జైన గ్రంథంలో 'లోక విభాగ'లు తొలి పల్లవుల చరిత్రకు సహాయకారులు.

పై శాసనాల ఆధారంగా తొలి పల్లవుల చరిత్రను అవిచ్ఛిన్నంగా చెప్పలేం. డూబ్రె, హీరాస్, గోపాలన్, హెచ్. కృష్ణశాస్త్రి బి.వి. కృష్ణారావు, డి.సి. సర్కార్, టి.వి. మహాలింగం, ఎన్. రమేశన్ మొదలైన చరిత్రకారులు వారి వంశక్రమం, కాలం గురించి వివాదాస్పదమైన సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

## 1.3 పుట్టు పూర్వోత్తరాలు :-

విన్సెంట్ స్మిత్ మాటలలో పల్లవుల జన్మ వృత్తాంతము భారతదేశ చరిత్రలోని నిగూఢ రహస్యాలలో ఒకటి. ఈ సమస్య పై చరిత్రకారులెందరున్నారో అన్ని పరస్పర విరుద్ధ సిద్ధాంతాలున్నాయి.

**1.3.1 పల్లవులు విదేశీయులైన పహ్లావుల సంతతి వారు:-** పల్లవులు విదేశాల నుంచి వచ్చి దక్షిణ భారతదేశంలో స్థిరపడిన పార్థియన్ (పహ్లావ) సంతతి అని లూయీస్ రైస్, రావు బహదూర్ వెంకయ్య గార్ల అభిప్రాయం. కథియవాడ్, గుజరాత్‌ల నుంచి గౌతమీపుత్ర శాతకర్ణిచే తరమబడిన పహ్లావులు తూర్పు దిశగా పారిపోయి, ఆంధ్ర దేశంలో కృష్ణా - గోదావరిల మధ్య భూమిలో స్థిరపడి, ఆ తరువాత దక్షిణాదికి వెళ్లి అక్కడ రాజ్యం స్థాపించినారని వెంకయ్య భావము. పల్లవ పదం పహ్లావ నుంచి వచ్చిందని వీరి అభిప్రాయము. డూబ్రె, విన్సెంట్ స్మిత్‌లు ఇంచుమించు ఇదే భావన వ్యక్తం చేశారు. అయితే ఈ ఊహను సమర్థించే శాసనాలు గాని, సాహిత్యం గాని, కథలు గాని లేవు.

రాజశేఖర కవి రచించిన 'భువన కోశం' వాయవ్య సరిహద్దుల్లో పహ్లావులు, దక్షిణ భారతదేశంలో పల్లవులు ఉన్నారని చెప్తున్నది. అంతేగాక హిందూ మతాన్ని అనుసరించిన విదేశీయులు పౌరాణిక మతాన్ని అవలంబించారేగాని,

వైదిక మతాన్ని అనుసరించి యజ్ఞ, యాగాదులు నిర్వహించిన నిదర్శనాలు లేవు. ప్రాచీన పల్లవులలో ఒకడైన శివస్కంద వర్మ అశ్వమేధ యాగాన్ని నిర్వహించినట్లు అతని శాసనాల వల్ల తెలుస్తుంది. అందువల్ల పల్లవులు విదేశీయులైన పహ్లావుల సంతతి వారు కాదని చరిత్రకారుల అభిప్రాయం.

1.3.2 **పల్లవులు వాకాటక వంశ శాఖ:-** పల్లవులు వాకాటక వంశ శాఖ అని కె.పి. జయస్వాల్ అభిప్రాయం. భారశివ నాగులు కుషాణుల విదేశీ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమం నడిపినారు. ఈ ఉద్యమ ఫలితంగా ఉత్తర భారతదేశంలో ఎక్కువ భాగమే గాక, దక్షిణా పథంలో కూడా ఆంధ్రదేశం వరకు కొత్త రాజ్యమేర్పడింది. ఈ రాజ్యం కొంత కాలం తరువాత వైవాహిక సంబంధం వల్ల వాకాటకులకు సంక్రమించింది. వాకాటక వంశంలో ఒక శాఖ వారే పల్లవులని జయస్వాల్ అభిప్రాయం. రెండు వంశాల వారు భరద్వాజ గోత్రులు కావడం, బ్రాహ్మణ మతాభిమానులు కావడం, నాగ వంశంతో సంబంధం చేయడం జయస్వాల్ సిద్ధాంతానికి ఆధారాలు.

నాగ కుటుంబాలు అధికారం సంపాదించిన మాట వాస్తవమే గాని, దేశ వ్యాప్తమైన సామ్రాజ్యం వారు స్థాపించినట్లు ఋజువు లేదు. భారశివ నాగులు ఆంధ్ర దేశం మొత్తం కాదు సరికదా, అందులో కొంత భాగమైన జయించినట్లు కానరాదు. వాకాటకులు, పల్లవులు ఇంచుమించు ఒకే కాలంలోనే రాజ్యాధికారం స్థాపించారు. అందువల్ల పల్లవులు వాకాటక వంశ శాఖ కావటానికి అవకాశం లేదు. అంతేగాక పల్లవుల శాసనాలిచ్చే సమాచారం జయస్వాల్ సిద్ధాంతానికి సహాయకారి కాదు.

1.3.3 **పల్లవులు తమిళ దేశీయులు:-** పల్లవులు తమిళదేశీయులని కొందరు తమిళ పండితుల అభిప్రాయం. తొండై మండలంలోని తొండైయార్ తెగవారే పల్లవులైనారని, వారు శాతవాహన సామ్రాజ్య దక్షిణ ప్రాంతాల నుంచి తొండై మండలంలో ప్రవేశించినారని, తొండై పదానికి సంస్కృత రూపమే పల్లవ అని కృష్ణస్వామి అయ్యర్ అభిప్రాయం. తమిళ భాషలో పల్లవ పదానికి 'దొంగ' అని అర్థం ఉంది. తొండై మండలంలోని కళ్ళారులు దొంగతనానికి ప్రసిద్ధి. అందుచేత పల్లవులు కళ్ళారులు ఒకరేనని కృష్ణస్వామి వాదం. దీనిని బట్టి విదేశం నుండి తమ దేశంలో ప్రవేశించినందువల్లనే పల్లవులను తమిళులు దొంగలు అని పిలిచినారని చెప్పవచ్చు.

పల్లవులు తొండైమండల ప్రాంతీయులేనని, వారు అశోకుని శాసనాల్లో చెప్పిన 'పాలదులు' లేదా పుళిందులేనని సత్యానాధయ్యార్ అభిప్రాయం. పాలద, పల్లవ నామ సాన్నిహిత్యమే ఈ వాదానికి మూలము.

ఈ సిద్ధాంతాలకు చాలా అభ్యంతరాలున్నాయి. తొండై అనేది ఒక తెగ పేరు. తొండైయార్ జాతి వాచకము. పల్లవము అంటే చిగురుటాకు. పల్లవ వంశ నామం గాని, జాతి వాచకం గాని కాదు. పద సాన్నిహిత్యం ఆధారంగా పల్లవుల జన్మస్థలం నిర్ణయించడమే సాధ్యమయితే పల్లవ పదానికి 'పాలద' కంటే 'పహ్లావ' యే సన్నిహితమయింది. ప్రాచీన తమిళ వాఙ్మయంలో పల్లవులను విదేశీయులు గానే పరిగణించినారు. పల్లవులు పుట్టుకతో తమిళులే అయితే వారి శాసనాలలో తమిళ సంస్కృతీ ప్రభావం కన్పించాలి. వారి శాసనాలలో గాని, వారి పేర్లలో గాని తమిళ ప్రభావం ఏ మాత్రం కన్పించదు. శాసనాలలో వారు వాడిన భాషలు ప్రాకృతం సంస్కృతం. పాలనలో వారు అనుసరించినది శాతవాహన సంప్రదాయం. అందువల్ల పల్లవులు తమిళ దేశానికి స్థానికులు కారు.

సింహళదేశీయుడైన రసనాయగం మరో విచిత్రమైన సిద్ధాంతం ప్రతిపాదించినారు. ఈ సిద్ధాంతానికి 'శిలప్పధికారం' అనే తమిళ గ్రంథానికి 14 వ శతాబ్దిలో వచ్చిన వ్యాఖ్యానంలోని కథ ఆధారం. తమిళ దేశాన్ని పాలించే చోళరాజు 'నెడుమూడికిల్లి' కిని, సింహళ దేశంలోని 'మణి పల్లవం' (జాఫ్నా) పాలిస్తున్న నాగరాజ కుమార్తెకు గాంధర్వ వివాహ ఫలితంగా జన్మించిన తొండైమాన్, తొండై మండలానికి ప్రభువై, తన మాతా మహ స్థానమైన 'పల్లవ'మును తన వంశ నామముగా గ్రహించినాడని, అతని సంతతి వారే పల్లవులయినారని ఈ సిద్ధాంత సారము.

తొలి పల్లవ శాసనాలలో తొండై మండలం అవతల ఉన్న దక్షిణ ప్రాంతాల ప్రసక్తి గానీ, చోళనాగ సంబంధాల ప్రసక్తి గాని లేకపోవడం వల్ల ఈ సిద్ధాంతం ఆమోద యోగ్యం కాదని చరిత్రకారుల అభిప్రాయం.

1.3.4 **పల్లవులు ఆంధ్రులు:-** ప్రాచీన తమిళ వాఙ్మయం పల్లవులను తమిళులకు భిన్నమైన జాతిగా చెప్పడాన్ని పరిగణనలోకి తీసుకొని తొలి పల్లవులకు ఆంధ్ర దేశంతో ఉన్న సన్నిహిత సంబంధం ప్రాతిపదికగా మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వెంకటరమణయ్య మొదలగు చరిత్రకారులు పల్లవుల పుట్టుకేదైనా వారు దక్షిణా పథంలో ఆంధ్ర దేశంలో మొదట ఉన్నారని సిద్ధాంతీకరించారు. పురాణాల్లో పల్లవుల ఆంధ్రులతో జోడింపబడటం, తొలి దశలో వారు ఆంధ్ర దేశంలోనే పరిపాలిస్తూ ఉండటం, వంశ శాఖలన్నీ ఆంధ్ర దేశంలోనే బయలు దేరటం ఈ సిద్ధాంతానికి మూలం.

అంతేగాక సింహళ వెతిహ్యామైన 'మహావంశ' (క్రీ॥శ॥ 4 - 5 శతాబ్దాల నాటిది) కృష్ణా ముఖ ద్వారంలోని 'పల్లవ బొగ్గ' నుండి పది వేల మంది బౌద్ధులు మహాదేవ భిక్షుని నాయకత్వంలో సింహళానికి వెళ్ళినారని చెబుతున్నది. పల్లవ బొగ్గ (పల్లవ భోగ్యము) వర్ణన నేటి పలనాడుకు సరిపోతున్నది. ములకల వల్ల ములకల నాడు, అశ్వకుల వల్ల అశ్వక రాష్ట్రం, ఆంధ్రుల వల్ల ఆంధ్రాపథము ఏర్పడినట్లే పల్లవులు స్థిర నివాసం ఏర్పరచుకొన్న ప్రాంతమే పల్లవ భోగ్యమయినట్లు చెప్పవచ్చు. అంతేగాక పల్లవుల తొలి శాసనాలు మంచికల్లు, మైదవోలు శాసనాలు పలనాడులో దొరికాయి. తొలి పల్లవుల శాసనాలు చాలా వరకు గుంటూరు - నెల్లూరు మధ్యస్థ ప్రాంతంలోనే లభించాయి.

అయితే, ఈ పాఠ్య రచయిత డా॥ వి.కె. మోహన్ పలనాడు కృష్ణా నదీ ముఖ ద్వారంలో లేదని, రేపల్లెకు సమీపంలో గల పల్లపట్ల (పల్లవ పట్టు) కృష్ణా నదీ ముఖ ద్వారంలో ఉందని, అందువల్ల మహా వంశలోని పల్లవ బొగ్గ గుంటూరు జిల్లా పల్లపట్లకు సరిపోతుందని అభిప్రాయపడ్డాడు.

కృష్ణానదికి దక్షిణంగా ఉన్న ఆంధ్ర దేశం క్రీ॥శ॥ ఆరవ శతాబ్ది చివరి పాదం వరకు పల్లవ రాజ్యంలో పెద్ద భూభాగంగా ఉంది. ఈ ప్రాంతంలోని ఇతర సమకాలీన రాజ వంశాలలో పల్లవులు స్నేహ సంబంధాలో, మరొకటో కొనసాగించారని తెలుస్తుంది. వారి తొలి పాలనా విధానం కూడా శాతవాహనుల పరిపాలనా పద్ధతిలో సాగినట్లు కన్పిస్తున్నది. ఈ పరిస్థితులన్నింటిని బట్టి పల్లవులు పలనాటి వాసులు లేక పల్లపట్ల ప్రాంతం వారని (పాత పల్లపట్ల తాలూకా), ఇక్ష్వాకులు మొదలైన వారి వలె శాతవాహన సామంతులుగా వారు గుంటూరు, కర్నూలు మండల ప్రాంతాలను పాలిస్తూ దక్షిణంగా తొండై మండలానికి కూడా విస్తరించి స్థానికులైన నాగ వంశస్థులలో వైవాహిక సంబంధం ద్వారా బలవంతులై అనంతర కాలంలో స్వతంత్ర రాజ్యం స్థాపించినట్లు భావించవచ్చు. ఆంధ్ర దేశమే వారి స్వస్థలమని అంగీకరించినా, అంగీకరించకపోయినా ఒకటి మాత్రం నిజం. క్రీ॥శ॥ 7వ శతాబ్ది మొదటి పాదంలో రెండో పులకేశి ఆధ్వర్యంలో బాదామి చాళుక్యులు తీరాంధ్రానికి కూడా తమ దాడులను విస్తరించే వరకు ఆంధ్ర దేశం మీద పల్లవుల రాజకీయ, సాంస్కృతిక ప్రభావం కనిపిస్తున్నదనే విషయం మాత్రం స్పష్టమవుతున్నది.

## 1.4 పల్లవ వంశవృక్షం:-

శాసనాలు అనేకం ఉన్నప్పటికీ తొలి పల్లవుల వంశ వృక్షాన్ని, కాలాన్ని నిర్ణయించడంలో అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వస్తున్నది. ఈ శాసనాలు ఏ శకాన్ని ఉదహరించడం లేదు. ఏ శాసనం నుండి కూడా సంపూర్ణ వంశవృక్షం లభించడం లేదు. డూబ్రె, హీరాస్, గోపాలన్, హెచ్. కృష్ణ శాస్త్రి, బి.వి. కృష్ణారావు, డి.సి. సర్కార్, టి.వి. మహాలింగం, ఎన్. రమేశన్ మొదలైన చరిత్రకారులు తొలి పల్లవుల వంశక్రమం, కాలం గురించి వివాదస్పదమైన సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

క్రీ॥శ॥ 7 వ శతాబ్దం తరువాత పల్లవ శాసనాలలో వంశోత్పత్తి వివరాలు ఉన్నాయి. మూడో విజయనందివర్మ వేయించిన వేలూరు పాళెయం తామ్ర శాసనంలో వంశ చరిత్ర తెలుపబడింది. భరద్వాజ గోత్రీకులైన అశ్వద్ధామకు పల్లవుడనే కుమారుడు

జన్మించాడు. అతని సంతతి వారు నాగరాజుకు పరిపాలనలో సహాయపడి రాజ్యాన్ని, రాజును కల్లోలాల నుంచి కాపాడినారు. పల్లవుని సంతతి వారే పల్లవులు. ఈ వంశంలోనే అశోక వర్మ, కాళభర్త, చూటు - పల్లవ పుట్టినారు. పల్లవుని కుమారుడు వీర కూర్చ వర్మ, నాగరాజు కుమార్తెను వివాహమాడటంతోనే రాజ్యాధికారం చేపట్టినాడు. నాగరాజుల శాసన వివరాలను పరిశీలిస్తే హారితీ పుత్ర విష్ణు స్కంధ నాగుని ఇద్దరు కుమార్తెలలో ఒకరిని వీరకూర్చ వర్మ వివాహమాడినాడని తెలుస్తుంది. బావమరిది ధేనసేనుడు చనిపోగానే, అతనికి సంతానం లేనందువల్ల తన భార్య తరపున వీరకూర్చ వర్మ వనవాస రాజ్యానికి వారసుడనని ప్రకటించుకొని, సైనిక బలంతో రాజధానీ నగరం ఆక్రమించినాడు. వారసత్వ హక్కు వల్ల వనవాస రాజ్యం వీరకూర్చ వర్మకు దక్కలేదు. అతని బలమే ఆ రాజ్యానికి అతనిని అధికారిని చేసింది. వేలూరు పాళెం శాసనంలో 'అఫ్రీత్' అను మాట గమనించదగింది. కొంత కాలం తర్వాత వైజయంతిని కదంబ ప్రత్యర్థి స్కందనాగ శాతకర్ణికి పోగొట్టుకొనిన వీరకూర్చ వర్మ తిరిగి రాజు కాగలిగినాడు. కాని వైజయంతిని రాజధానిగా ఉంచుకొనదలచలేదు. వేగావతి ఒడ్డున గల కాంచీ పురాన్ని రాజధానిగా ఏర్పరచుకొన్నాడు.

కాంచీపురానికి రాజధానిని మార్చడానికి కదంబులతోటి నిరంతర వైరం, ఇక్ష్వాకు రాజ్య ఆక్రమణలే ముఖ్యకారణాలు. వీరకూర్చ వర్మన్ నిజనామము తెలియరాదు. అది పౌరుష నామము 'వీర కూర్చ' అంటే వీరత్వం మూటగా కల్గిన వాడని అర్థము. పల్లవులు కొంకణ తీరం నుండి దక్షిణా పథం చేరినట్లున్నారు. వనవాస రాజ్యం చేపట్టి దక్షిణా పథం రాజకీయాలలో ప్రవేశించారు. పల్లవులు వైదిక బ్రాహ్మణ మతస్థులు. వీరకూర్చ వర్మ మొదటి పేరు చూటు పల్లవుడు. నాగ కుటుంబంలో నుంచి వచ్చిన శాఖయే చూటు పల్లవమని వేలూర్ పాళెం శాసనం సమాచార ఆంతర్యము.

యువ మహారాజు శివస్కంధ వర్మన్ వేయించిన శాసనమే ఇప్పటి వరకు లభ్యమయిన అతి ప్రాచీన పల్లవ శాసనం. ఆ తదుపరి శాసనం కూడా శివస్కంధ వర్మన్ వేయించినదే. కాని నాటికి అతడు ధర్మ మహారాజాధిరాజు. మైదవోలు శాసనంలోని శివస్కంద వర్మ యువరాజు కాబట్టి, ఆ కాలంలో మహారాజు ఉండి ఉండవలె. హిర హడగల్లి శాసనంలో మహారాజు బప్పస్వామి ప్రశంస ఉన్నది. బప్ప అంటే తండ్రి అని అర్థము. పల్నాడు తాలుకా మంచికల్లులో దొరికిన ప్రాకృత శిలా శాసనంలో సింహ వర్మ అనే రాజు పేరున్నది. శివస్కందవర్మ పేర్కొనిన బప్ప స్వామి, మంచి కల్లు శాసనంలోని సింహవర్మ, వేలూరుపాళెం శాసనంలోని వీరకూర్చవర్మ ఒకే వ్యక్తి అని మారేమండ రామారావు భావం. సనపదేయలో దొరికిన శాసనము యువ మహారాజశ్రీ విజయ బుద్ధ వర్మన్ భార్య చారుదేవి వేయించినది. ఆమె కుమారుడు బుద్ధయుంకరుడు. మహారాజ విజయ స్కందవర్మన్ దర్శి, ఒంగోడు శాసనాలలో యువ మహారాజు విష్ణు గోపవర్మ ఉరువపల్లి సంస్కృత శాసనంలోను నాలుగు తరాల రాజుల పేర్లున్నాయి. ఒంగోడు II , పకిర, మాంగదూర్, విళవెట్టి చూరా శాసనాలలో తరువాత తరాల రాజుల పేర్లున్నవి. సముద్ర గుప్తుని అలహాబాద్ స్తంభ శాసనంలో ఆ కాలపు పల్లవ రాజుల పేర్లున్నాయి. మిగిలిన తామ్ర శాసనాల ననుసరించి పల్లవ వంశ వృక్షమీ విధంగా పేర్కొనవచ్చు.

# పల్లవ వంశవృక్షము

వీరకూర్చ వర్మ (క్రీ॥శ॥ 254 - 265)

మొదటి శివస్కందవర్మన్ (265 - 275)

మొదటి విజయ బుద్ధవర్మన్ (275 - 285) — వీరవర్మన్

బుద్ధయుంకుర (285 - 295)

రెండో విజయస్కందవర్మన్ (294 - 230)

రెండో సింహవర్మన్ (330 - 342) — యువ మహారాజు విష్ణు గోప వర్మన్ I (342 - 360)

ఉగ్రవర్మన్ (360 - 363) — మూడో సింహవర్మన్ (363 - 385)

రెండో విజయ విష్ణు గోపవర్మన్ (385 - 400)

↓

మూడో స్కందవర్మన్ (425 - 437)

నాలుగో సింహవర్మన్ (437 - 460)

నాలుగో విజయస్కందవర్మన్ (460 - 495)

శాంతివర్మన్ (496 - 503) — రెండో కుమార విష్ణు (503 - 520) — మొదటి నందివర్మన్ (520 - 535)

రెండో బుద్ధవర్మన్ (535 - 545)

మూడో కుమార విష్ణు (545 - 555)

ఐదో సింహవర్మన్ (560 - 580)

సింహ విష్ణు (580 - 600)

మొదటి మహేంద్రవర్మన్ (600 - 630)

## 1.5 కాల నిర్ణయం:-

తొలి పల్లవుల శాసనాలన్నింటిలోను ఆయా రాజుల పరిపాలనా సంవత్సరాలను మాత్రమే ప్రస్తావించినందువల్ల, పల్లవ రాజుల కాల నిర్ణయానికి జైన వ్రాతపతి 'లోక విభాగం' పై ఆధారపడవలసి వచ్చింది. ఈ గ్రంథం వ్రాయటం సింహ వర్మ 22 వ పరిపాలనా సంవత్సరంలో (క్రీ॥శ॥ 450) పూర్తి అయింది. పశ్చిమ గాంగుల తామ్ర శాసనాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. మరొక సమకాలిక సూచిక అలహాబాద్ స్తంభ శాసనము, సముద్ర గుప్తునికి కాంచీ విష్ణు గోపుడు, పాలక్క ఉగ్రసేనుడు సమకాలికులు. ఈ సూచికల ఆధారంగా కాల నిర్ణయం చేయవలసి ఉన్నది.

## 1.6 తొలి పల్లవుల చరిత్ర :-

పల్లవ వంశ రాజులు భరద్వాజ గోత్రికులని శాసనాలు తెల్పుచున్నవి. 'పల్లవానాం మహారాజ' అనటంలోనే పల్లవ వంశానికి చెందిన గొప్ప రాజు అని తెలుస్తుంది. దీనిని బట్టి పల్లవులు ఒక వంశము వారని రూఢి అవుతున్నది.

**1.6.1 వీరకూర్చవర్మ:-** వేలూరు పాళెం శాసనంలో చూటు పల్లవుని సంతతి వారు నాగరాజుల సైనికాధికారులని, వీరకూర్చుడు నాగరాజ్యాన్ని పొందెనని ప్రస్తావించబడింది. చూటు కులధేనసేనుని మరణం పల్లవ వీరునికి అవకాశం కల్పించింది. వీరకూర్చవర్మ ప్రత్యర్థియైన శివస్కందవర్మ నోడించి వైజయంతీ పురాన్ని, వనవాస రాజ్యాన్ని ఆక్రమించాడు. కదంబ రాజకుమారుడు స్కంద శాతకర్ణి పోరాటం కొనసాగించి విజయం సాధించి ధర్మ మహారాజాధిరాజు పేరుతో సింహాసనమెక్కినాడు. కాని అనతికాలానికే మరణించాడు. తిరిగి చెలరేగిన పోరాటంలో కదంబ రాజకుమారులు ఇక్ష్వాకుల సహాయమర్థించారు. కాని వీరకూర్చుడు కదంబులనే గాక, ఇక్ష్వాకులను కూడా ఓడించి మహారాజైనాడు. ఈ పోరులో పరాజయం చెందిన ఇక్ష్వాకులు అనతి కాలంలో రాజ్యాధికారాన్ని కూడా పోగొట్టుకున్నారు. వీరకూర్చవర్మ పల్లవ రాజ వంశాన్ని స్థాపించాడు. సార్వభౌమ పదవి అందుకొన్న సూచనగా వీరకూర్చ వర్మ అశ్వమేధ యాగం చేసినాడు. దక్షిణాంధ్ర దేశాన్ని పరిపాలించడానికి ఒక రాజ ప్రతినిధిని ధాన్యకటకము రాజధానిగా నియమించాడు. క్రీ॥శ॥ 260 నాటికి దక్షిణాంధ్ర దేశం పల్లవుల వశమైంది. హిరహడగళ్ళి శాసనంలో బప్పస్వామి 'అనేక హిరణ కోటి - గోహల - శత సహస్ర పదాయినో', 'అప్పతి హత శాసనస్స' గా వర్ణించబడినాడు. ఈ వర్ణన ఇక్ష్వాకు వశిష్టీ పుత్ర శాంతమూలుని వర్ణనకు సరిపోవుచున్నది. ఇక్ష్వాకులను జయించిన తరువాత వారి బిరుదులను పల్లవ రాజు గ్రహించెనని తెలియ వస్తుంది. ఇక్ష్వాకుల ఆదర్శాలనే పల్లవులు కూడా పాటించడానికి నిశ్చయించారు. అందువల్లనే శివస్కంద వర్మ కూడా అగ్ని స్టోమ, వాజపేయ, అశ్వమేధ క్రతువులను జరిపించాడు. పల్లవులు బ్రాహ్మణ మతస్థులు అనడానికి ఇదే నిదర్శనము.

**1.6.2 మొదటి శివస్కందవర్మ:-** వీరకూర్చవర్మ తరువాత అతని కుమారుడు శివస్కందవర్మ ధర్మ మహారాజాధిరాజు బిరుదంతో సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతడు బ్రాహ్మణ మతోద్ధరణకు విశేషంగా కృషి చేశాడు. అగ్ని స్టోమ, వాజపేయ, అశ్వమేధాది క్రతువులను జరిపించాడు. శివస్కందవర్మ రాజ్య విస్తరణలో అత్యధిక శ్రద్ధ కనపర్చాడు. ఇతని కాలంలో పల్లవ సామ్రాజ్యం కృష్ణానది నుండి కావేరి నది వరకు వ్యాపించింది.

**1.6.3 మొదటి విజయ బుద్ధవర్మ:-** చారుదేవి వేయించిన శాసనం వల్ల శివస్కందవర్మకు ఇద్దరు కుమారులున్నట్లు వారిలో పెద్దవాడైన విజయ బుద్ధ వర్మ సింహాసనం ఎక్కినట్లు తెలుస్తుంది. ఇతని కాలంలోనే కోడూరులో బృహత్ఫలాయనులు విజృంభించి దక్షిణాంధ్ర కోసం పోరాడినారు. ఈ యుద్ధాలలోనే విజయ బుద్ధవర్మ మరణించాడు.

**1.6.4 బుద్ధ యాంకరుడు:-** విజయ బుద్ధవర్మ మరణానంతరం అతని కుమారుడైన బుద్ధ యాంకరుడు సింహాసనాన్ని అధిష్టించినాడు. ఇతని కాలంలో ఆనంద గోత్రజులు విజృంభించారు. వారితో జరిగిన యుద్ధాలలో బుద్ధ యాంకరుడు, అతని పిన తండ్రి వీరవర్మ మరణించారు.

1.6.5 **రెండో విజయ స్కందవర్మ:-** బుద్ధ యాంకరునికి సంతతి లేనందు వల్ల సింహాసనం ఇతని పిన తండ్రి వీర వర్మ కుమారుడైన రెండో విజయ స్కందవర్మకు దక్కింది. ఇతడు ఆనంద గోత్రీకులను ఓడించి దక్షిణాంధ్రలో పల్లవుల అధికారాన్ని పునః స్థాపితం చేశాడు. ఇతనికి కందవర్మ అనే మరొక పేరున్నది. ఇతని కాలంలోనే పల్లవుల శాసనాలు సంస్కృతంలో వ్రాయించడం మొదలైంది.

విజయ స్కందవర్మ కాలంలోనే కదంబులు మరొకసారి మయూర శర్మ నాయకత్వంలో విజృంభించి స్వతంత్ర వైజయంతి రాజ్యాన్ని స్థాపించారు. ఈ కాలంలోనే ఉత్తరాంధ్రలో శాలంకాయనులు అధికారాన్ని స్థాపించారు. ఆనంద గోత్రీకులను అణచే ప్రయత్నంలో భాగంగా విజయ స్కందవర్మ శాలంకాయనులతో మైత్రి ఒడంబడికలు చేసుకొన్నాడు. కాదంబుల స్వతంత్ర రాజ్యాన్ని గుర్తించాడు. ఈ పరిస్థితులు ఆనంద గోత్రజులను అణచడానికి విజయ స్కందవర్మకు అనుకూలించాయి.

1.6.6 **రెండో సింహవర్మ:-** విజయ స్కందవర్మకు రెండోసింహవర్మ, విష్ణు గోపవర్మ అనే ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్దవాడైన రెండో సింహవర్మ తండ్రి తరువాత రాజ్యానికి వచ్చాడు. రెండో సింహవర్మ 12 సంవత్సరాలు పాలించినట్లు ఉరువ పల్లి శాసనం వల్ల తెలుస్తున్నది.

1.6.7 **మొదటి యువ మహారాజు విష్ణు గోపవర్మ:-** రెండో సింహవర్మ పుత్ర హీనుడైనందువల్ల అతని కాలంలోనే అతని తమ్ముడైన విష్ణు గోపవర్మకు యువరాజ పట్టాభిషేకం జరిగింది. వేలూరుపాలెం శాసనం ప్రస్తావించిన ప్రముఖ పల్లవులలో విష్ణు గోపవర్మ ఒకడు. ఇతని కాలంలోనే సముద్ర గుప్తుడు దక్షిణ దిగ్విజయ యాత్ర చేసినాడు. సముద్ర గుప్తునిచే ఓడింపబడిన రాజుల పట్టికలో 'కాంచేయక విష్ణు గోప', 'పలక్కడ ఉగ్రసేన', 'వేంగి హస్తి వర్మన్'లు గలరు. సముద్రగుప్తుడు ఓడి పారిపోయినాడో లేదా హరిసేనుడు చెప్పినట్లు దక్షిణాధిపతులు ఓడి కప్పము కట్టినాడా అనే విషయం పై వాదోపవాదాలున్నాయి. కంచి రాజు విష్ణు గోపుని ఆధిపత్యంలో కృష్ణా, గోదావరి మధ్య దేశ ప్రభువులందరూ ఏకమై సముద్ర గుప్తుని ఎదుర్కొని పారిపోయేట్లు చేసినారని డూబ్రె అభిప్రాయపడినాడు. కాని అలహాబాద్ శాసనంలోని 'కౌరాళము' రెండో పులకేశి అయ్యవోళె శాసనంలోని 'కౌనాళ'యు ఒకే ప్రదేశాన్ని సూచిస్తున్నాయి. పలక్కడ ముండ రాష్ట్రం లోని (నెల్లూరు జిల్లా) పల్లవ పట్టణం. కృష్ణ దాటకుండా పలక్కడ రాజులలో సముద్ర గుప్తునికి యుద్ధం జరిగి ఉండదు. కాబట్టి సముద్ర గుప్తుడు కృష్ణను దాటి ఉండవలె. అలహాబాద్ శాసన వివరాలు సరియైనవే. కంచి వరకు సముద్ర గుప్తుని దండయాత్ర సాగిందనటానికి ఆధారాలెక్కువ.

1.6.8 **ఉగ్రవర్మ:-** విష్ణు గోపవర్మ అనంతరం రెండో సింహవర్మ కుమారుడైన ఉగ్రవర్మ సింహాసనం అధిష్టించినట్లు అమరావతి శాసనం పేర్కొంటున్నది. ఇతడు కాదంబులతో జరిగిన యుద్ధంలో మరణించాడు.

16.9 **మూడో సింహవర్మ:-** ఉగ్రవర్మ మరణానంతం అతనికీ పుత్ర సంతానం లేనందు వల్ల సోదరుడు మూడో సింహవర్మ సింహాసనం అధిష్టించాడు. ఇతడు వేయించిన శాసనాలు నాలుగు లభిస్తున్నాయి. అవి మాంగాదూరు, పీకర, ఒంగోడు, విళవెట్టి శాసనాలు. మాంగదూరు వెంగో రాష్ట్రంలోనిది. నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలోని భాగాలే నాటి వెంగో రాష్ట్రం. మూడో సింహవర్మ, కందరపుర అత్తివర్మకు, శాలంకాయన చందావర్మలకు సమకాలికుడు. ఇతనికి ఆనంద గోత్రికులతోను, రేనాటి చోళుల తోనూ, చోళావడి చోళులతోనూ వైరం ఏర్పడింది.

1.6.10 **రెండో విజయ విష్ణుగోపవర్మ:-** మూడో సింహవర్మ తరువాత అతని కుమారుడు రెండో విజయ విష్ణుగోపవర్మ సింహాసనం అధిష్టించాడు. ఇతని పాలనా కాలంలో కూడా, ఆనంద గోత్రిక రాజు అయిన అత్తివర్మతో శత్రుత్వం కొనసాగింది. ఇతని కాలంలోనే విష్ణు కుండినులు విజృంభించారు.

1.6.11 **మూడో స్కందవర్మ:-** రెండో విజయ విష్ణు గోపవర్మ తరువాత అతని కుమారుడు స్కందవర్మ సింహాసనం అధిష్టించాడు.

ఇతని పాలనకు సంబంధించిన వివరాలు లభ్యం కావడం లేదు.

1.6.12 **నాలుగో సింహవర్మ:-** మూడో స్కందవర్మ తరువాత అతని కుమారుడు నాలుగో సింహవర్మ సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతని కాలంలో పల్లవుల విజయ పరంపర ప్రారంభమైంది. కదంబ చక్రవర్తి మొదటి కృష్ణవర్మ, యుద్ధంలో పరాజయం చెంది ప్రాణాలు కోల్పోయాడు. కదంబ రాజ్యాన్ని ఆక్రమించిన పల్లవ సైన్యం ఆంధ్ర దేశం వైపు పురోగమించింది. విష్ణు కుండినులు దేవవర్మను ఓడించిన పల్లవ సైన్యం గోదావరి తీరం చేరింది.

1.6.13 **నాలుగో విజయ స్కందవర్మ:-** నాలుగో సింహవర్మ తరువాత అతని కుమారుడు నాలుగో విజయ స్కందవర్మ సింహాసనానికి వచ్చాడు. ఇతడు 35 సం॥ కాలం పరిపాలించాడు. ఇతనికి త్రిలోచన పల్లవుడు, ముక్కంటి, కాడ్వెట్టి అను బిరుదులు ఉన్నాయి. ఇతని కాలంలో పల్లవులు అనేక చోట్ల పరాజయాలు చెందారు. విష్ణుకుండిన రెండో మాధవవర్మ పల్లవులను దక్షిణ ఆంధ్రము నుండి తరిమి వేశాడు. కదంబ రాజు, మృగేశ్వర వర్మ పల్లవులను ఓడించాడు. ఇతని కాలంలోనే చాళుక్య విజయాదిత్యుడు కూడా తిరుగుబాటు చేసాడు. అన్నింటికన్నా ముఖ్యమైన సంఘటన కరికాల చోళుడు ఇతనిని ఓడించి, కాంచీపురాన్ని కొల్లగొట్టి వశపరచుకోవటం. కరికాల చోళునికి, విజయ స్కందవర్మ సామంతుడై అతని ఆదేశాలను అమలు చేశాడు.

1.6.14 **శాంతివర్మ:-** విజయ స్కందవర్మ తరువాత అతని కుమారుడు శాంతివర్మ సింహాసనానికి వచ్చాడు. ఇతనిని గురించిన వివరాలు లభ్యం కావడం లేదు.

1.6.15 **రెండో కుమార విష్ణువు:-** శాంతివర్మ తరువాత అతని సోదరుడైన కుమార విష్ణువు అధికారంలోకి వచ్చాడు. వేలూరు పాలెం, చందలూరు శాసనాల్లో ఇతని ప్రసక్తి కలదు.

1.6.16 **మొదటి నందివర్మ:-** రెండో కుమార విష్ణువు తరువాత అతని సోదరుడు మొదటి నందివర్మ రాజ్యానికి వచ్చాడు. ఇతనిని గురించి వేలూరు పాలెం శాసనం తెలుపుతుంది.

1.6.17 **రెండో బుద్ధవర్మ:-** మొదటి నందివర్మ తరువాత అతని అన్న కుమారుడైన బుద్ధవర్మ అధికారంలోకి వచ్చాడు. ఇతడు చోళులను ఓడించి కాంచీ పురాన్ని తిరిగి ఆక్రమించాడు.

1.6.18 **మూడో కుమార విష్ణువు:-** బుద్ధవర్మ తరువాత అతని కుమారుడు మూడో కుమార విష్ణువు రాజ్యానికి వచ్చాడు. బుద్ధవర్మ, అతని కుమారుడు మూడో కుమార విష్ణువు పాలించిన కాలంలో విష్ణు కుండిన గోవిందవర్మ చిక్కుల్లో పడ్డాడు. దీనిని అదునుగా తీసుకొని పల్లవులు దక్షిణ ఆంధ్రను ఆక్రమించటానికి ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు. మూడో కుమార విష్ణువుతో నాలుగో సింహవర్మ శాఖ అంతమైంది. ఐదో సింహవర్మ శాసనాల్లో మూడో కుమార విష్ణువు సంతతి సమాచారం లేదు.

1.6.19 **ఐదో సింహవర్మ:-** ఐదో సింహవర్మ నాలుగో సింహవర్మ సంతతి వాడై ఉంటాడు. ఇతడు చోళులను సంపూర్ణంగా జయించి పల్లవుల కీర్తి పతాకాన్ని ఎగుర వేశాడు.

1.6.20 **సింహ విష్ణువు:-** ఐదవ సింహవర్మ కుమారుడు సింహ విష్ణువు. ఇతని కీర్తి నలుదిశలా పాకింది అని వేలూరు పాలెం శాసనం తెల్పుతుంది. ఇతని పరిపాలన మొదలుగా పల్లవ వైభవం మూడోసారి ఆరంభమైంది. సింహ విష్ణువు సంతతి వారినే మహా పల్లవులు అని పిలుస్తారు.

సింహ విష్ణువు తరువాత అతని కుమారుడు మొదటి మహేంద్రవర్మ సింహాసనానికి వచ్చాడు. ఇతని కాలంలోనే పల్లవులు తిరిగి, దక్షిణ ఆంధ్రను జయించగలిగారు. ఈ విషయం చేజర్ల కపోతేశ్వర ఆలయ శాసనం ధృవీకరిస్తుంది. విష్ణు

కుండినుల పతనమే పల్లవ విజయానికి కారణం అయినట్లు వున్నది. చాళుక్య కుబ్జ విష్ణు వర్థనుడు దక్షిణ ఆంధ్రను జయించి పల్లవులను, వెడల గొట్టే వరకు (క్రీ॥శ॥ 630) పల్లవులు ఆంధ్ర దేశాన్ని పాలించారు.

## 1.7 పల్లవుల పరిపాలన విధానం:-

పల్లవుల పరిపాలనలో శాతవాహన సాంప్రదాయాన్ని పాటించారు. శివ స్కందవర్మ వేయించిన హిరహడగళ్ళి శాసనం ద్వారా పల్లవ రాజుల నాటి పాలనా విశేషాలు గ్రహించవచ్చు. పల్లవుల రాజ లాంఛనం వృషభం. పల్లవ ధ్వజం ఖట్వాంగము (శివుని ఆయుధము) వీటిని బట్టి చూస్తే పల్లవులు శైవులు అయినట్లు కనబడుతున్నా, వీరి శాసనాల్లో విష్ణు స్తూత్రం ఉంది. పల్లవ రాజులకు పరమ భాగవతులు అనే బిరుదు ఉన్నది. పల్లవ రాజుల్లో కొందరి పేర్లు విష్ణు నామాలతో ముగుస్తున్నాయి. అందువల్ల పల్లవులు వైష్ణవులు అని చెప్పవచ్చు. పల్లవులు బ్రాహ్మణ మతస్థులు. వీరు పరమత సహనం కలవారు.

పల్లవులు తమ సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించారు. రాష్ట్ర పాలకుని పేరు వ్యాపృతుడు శాసనాల్లో కర్మ రాష్ట్రము, ముండ రాష్ట్రము, వేంగో రాష్ట్రము, శాతవాహనిహారము, ఆడేయార్ మొ॥ రాష్ట్రాల పేర్లు కనిపిస్తున్నాయి. రాష్ట్రీయ నగరాల్లో లూంబ్ర ప్రస్తాన, కడక, కటక, దశనపుర, ఫలక్కడ కనిపిస్తున్నాయి. రాష్ట్రాలను విషయాలుగా, భోగాలుగా విభజించారు. కొన్ని గ్రామాల కూటమే భోగము. అతి చిన్న పాలనా విభాగం గ్రామం. గ్రామ భోగ రాష్ట్ర సరిహద్దులు పన్నులు తదితర వివరాలు తెలిపే లిఖిత పత్రాలు వుండేవి. అధికృత, ఆయుక్తక, నైమేగిక, తాజవల్లభ, సంచారాంతక మొ॥ స్థానిక అధికారులు వుండే వారు. రాజ శాసనాలను లిఖించే అధికారి పేరు రహసాధికృత. రాజ్యంలోని సర్వాధికారాలు రాజువే.

పల్లవ రాజ వంశీయులు భాషాభిమానులు. పండితులను, కవులను ఆదరించి పోషించారు. ఈ కాలంలో గొప్ప బౌద్ధ మతాచార్యులైన ఆరవణ, అడిగళ్, ఆర్యదేవుడు, దిజ్ఞాగుడు, ధర్మపాలుడు మొ॥ వారు కంచి కేంద్రంగా తమ కార్యకలాపాలను కొనసాగించారు. దక్షిణ భారత బౌద్ధానికి ఆధ్యాత్మిక విజ్ఞాన కేంద్రంగా కంచి ప్రసిద్ధికెక్కింది.

డా॥ వి.కె. మోహన్

# 2. విష్ణుకుండినులు

## 2.1 పరిచయం :-

ఇక్ష్వాకుల అనంతరం కళింగతో సహా ఆంధ్ర దేశాన్ని అంతటిని పరిపాలించిన రాజ వంశం విష్ణుకుండినులదే. క్రీ॥శ॥ 5 6 శతాబ్దాలలో ఈ వంశం సామ్రాజ్యాన్ని స్థాపించి, సంస్కృతి పరంగా కూడా, ప్రముఖ పాత్ర వహించింది. విష్ణు కుండినుల ఉత్పత్తిని గురించి, కాలం గురించి, పతనం గురించి వాదోప వాదాలు ఉన్నాయి. ఈ వంశ రాజుల శాసన ప్రశస్తి భాగాలలో ఉన్న వివిధ బిరుదాలను, సమాసాలను, ఒక దానితో మరొకటి పోల్చి వ్యాఖ్యానించినట్లు అయితే విష్ణుకుండినుల చరిత్రకు ప్రామాణికమైన ఆధార సాక్ష్యం లభిస్తుంది. వీరి చరిత్ర నాటి సమకాలీన రాజ వంశాల చరిత్రతో సమన్వయించిన గాని యదార్థం తెలియదు.

## 2.2 ఆధారాలు:-

విష్ణు కుండినుల శాసనాలు ప్రస్తుతానికి 10 లభిస్తున్నాయి. అవి:

| | |
|---|---|
| 1. | గోవింద వర్మ తుమ్మల గూడం శాసనం |
| 2, 3, 4, 5. | మాధవ వర్మ ఈపూరు ఖానాపూర్, పోలమూరు తామ్ర శాసనాలు, వేల్పూరు శిలాశాసనం |
| 6. | రెండో మాధవ వర్మ ఈపూరు శాసనం |
| 7. | ఇంద్ర వర్మ రామతీర్థ శాసనం |
| 8, 9, 10. | విక్రమేంద్ర భట్టారకవర్మ తుండి, చిక్కుళ్ళ, తుమ్మల గూడం శాసనాలు |

తుమ్మల గూడం శాసనాలను ఇంద్ర పాల నగర శాసనాలు అని కూడా అంటారు. ఈ తుమ్మల గూడం శాసనం మిగిలిన వాని కంటే సమగ్రంగా ఉండటమే కాక, క్రీ॥శ॥ 566లో ఇచ్చినట్లు స్పష్టంగా ఉన్నందున విష్ణు కుండిన చరిత్రకు చాలా పరిస్థితి ఉన్నది. ఈ వంశానికి సంబంధించిన చారిత్రక గాధలు కొన్ని తెలుగు, సంస్కృత సాహిత్యంలో ఇమిడి ఉన్నాయి. స్థానిక దస్తరాలలో కూడా ఈ గాథలు కొన్ని దొరుకుతున్నాయి.

పైన పేర్కొన్న ఆధారాల్లో విష్ణు కుండిన చరిత్రను సమగ్రంగా పునర్ నిర్మించడానికి అనుకూలమైన సమాచారం లేదు. అందుచే, విష్ణు కుండిన చరిత్రలో అనేక వాదోపవాదాలు ఉన్నాయి. వారి పేరు, జన్మభూమి, కుల దైవం, కులం, వంశవృక్షం మొ॥న అంశాల పై చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు.

## 2.3 పేరు:-

'విష్ణుకుండి' పదం గుంటూరు జిల్లాలోని వినుకొండకు సంస్కృతీకరణము అని, అది వారి ప్రథమ నివాసం అని 'కీల్‌హారన్' పండితుని అభిప్రాయం. కాని వేల్పూరు శాసనాన్ని బట్టి 'విష్ణుకుండి' అనేది గోత్రనామం అని తెలుస్తుంది. ఏమైనప్పటికీ, విష్ణు కుండినులకు, వినుకొండతో సంబంధం లేకపోలేదు అని చాలా మంది చరిత్రకారుల విశ్వాసం.

## 2.4 జన్మ స్థలము :-

విష్ణుకుండినులు త్రికోట మలయాధిపులమని, అమర పూరీసులమని చెప్పుకున్నారు. త్రికూట సహ్యాద్రులలోనిది అని,

అమర పురి అగ్రహోత్ అని అందుచే వీరు మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలస వచ్చినారు అని కొందరి అభిప్రాయం. ఈ వాదానికి నేడు బలము లేదు. త్రికూట మలయాధిప బిరుదాన్ని విష్ణు కుండినులు కందారా రాజుల నుండి గ్రహించారు అని తెలుస్తున్నది. త్రికూట మలయం, కోటప్ప కొండ గాని వేరేమి కాదు. ఇక అమరపురిని అమరావతిగా, కె.వి. లక్ష్మణరావు చేసిన నిర్ణయాన్ని నేటికీ అంగీకరిస్తూ, ఇదే ఇంద్ర పాల నగరం అని భావించే వారు ఉన్నారు. కాని మొదటి విష్ణుకుండినులకు, అమరావతితో సంబంధం ఉన్న నిదర్శనాలు లేవు. అయినా నాటికీ అమరావతి అనే పేరు వాడుకలో లేదు. ధాన్యకటక నామమే ప్రసిద్ధము. అమరావతి పథం 19వ శాతాబ్దం నుండి మాత్రమే వాడుకలోకి వచ్చినట్లు తెలుస్తుంది. కాబట్టి ధాన్యకటకమని శతాబ్దాల తరబడి ప్రసిద్ధమైన పేరుండగా కొత్తగా అమరపురి అని గాని, ఇంద్రపాల నగరమని కాని వాడినారని భావించటం సమంజసం కాదు. అయితే సత్తినపల్లి తాలూకాలో నేటి వేల్పూరును అమరపురిగా గుర్తించడానికి అవకాశం ఉంది. వేల్పూరు చాలా ప్రాచీన గ్రామం అని, బౌద్ధ క్షేత్రం అనడానికీ అక్కడ ఇక్ష్వాకు లిపిలో జరిగిన శాసనాలే నిదర్శనం. వేల్పు (కమర), ఊరు (పురి) అనే మాటకు సంస్కృతమే అమరపురి. ఇది ఇంద్రపాల నగరమై ఉంటుంది. విష్ణుకుండినులలో సుప్రసిద్ధుడైన మాధవవర్మ శిలా శాసనం వేల్పూరులో గలదు. ఈ శాసనంలో అతనికి వేల్పూరు దేశ శాసన అనే బిరుదు కూడా ఉంది. ఈ కారణాల వల్ల వేల్పూరే అమరపురి అనడం సమంజసం.

## 2.5 కుల దైవం:-

విష్ణుకుండినుల కులదైవం అయిన శ్రీ పర్వత స్వామి మల్లికార్జునుడు అని, కీల్‌హారన్ అభిప్రాయపడినాడు. కీల్‌హారన్ నిర్ణయానికి, రెండు కారణాలు ఉన్నాయి. అవి (1) అతడు ప్రచురించిన చిక్కుళ్ళ శాసనము ఇచ్చిన విక్రమేంద్ర భట్టారకుడు, అతని తండ్రి ఇంద్ర వర్మ పరమ మహేశ్వరుడు అని ఉండటం, (2) కీల్‌హారన్ నాటికి (1911) శ్రీ పర్వత నాగార్జున కొండ వెలుగులోకి రాకపోవడం. కీల్‌హారన్ అభిప్రాయాన్ని పెక్కు మంది అంగీకరిస్తున్నారు.

అయితే, విష్ణుకుండినుల శ్రీ పర్వతం శ్రీశైలం అనడానికి ఆధారం లేదు. శ్రీ పర్వత స్వామి పాదాను ధ్యానం వల్ల ప్రజాపాలనా అధికారం పొందామని, తమ రాజ్యం శ్రీ పర్వత ఉభయ ప్రాంతాలలో విస్తరించింది అని విష్ణుకుండినులు చెప్పుకొన్నారు. అందువల్ల శ్రీ పర్వత స్వామి జనాదరణ పొందిన దేవుడు అని విష్ణుకుండినులకు శ్రీ పర్వతంతో చాలా సాన్నిహిత్యం ఉన్నది అని అర్థం అవుతుంది. అయితే శ్రీశైలం క్రీ॥శ॥ 5, 6 శతాబ్దాలకు జనాదరణ పొందిన క్షేత్రమైయింది అనడానికి గాని, విష్ణుకుండినుల అధికారం శ్రీశైలం వరకు విస్తరించింది అనడానికీ గాని స్పష్టమైన ఆధారం ఇంతవరకు లభించలేదు. వినుకొండ వేల్పూరు ప్రాంతాల్లో ప్రబలుడైన వారికి శ్రీ పర్వత నాగార్జున కొండతో సాన్నిహిత్యం ఏర్పడటం సహజం. కాబట్టి విష్ణుకుండినుల శ్రీ పర్వతం శ్రీశైలం కాదు. శ్రీ పర్వత నాగార్జున కొండ, బౌద్ధ క్షేత్రంగా దేశ దేశాంతరాల్లో చిరకాలంగా, ప్రసిద్ధి చెందింది. అందుచేతన నేలటూరి వెంకట రమణయ్య శ్రీ పర్వత స్వామి బుద్ధుడు అని అభిప్రాయపడినారు. విష్ణుకుండినులలో చివరి ఇద్దరు మినహా మిగిలిన వారు వైష్ణవులే గాని శైవులు కాదు, వారి వంశ నామం వైష్ణవం. రాజుల పేర్లు, బిరుదాలు వైష్ణవం. తమ రాజ్యాన్ని వారు, కౌస్తుభంతో పోల్చుకున్నారు. వారి శాసన ముద్రల పై లక్ష్మి, శ్రీవత్స చిహ్నాలు , నాణేల మీద సింహము, శంకము కనిపిస్తాయి. అందుచేత విష్ణుకుండినులను వైష్ణవులు అనటం సమంజసం. అయితే వారిలో గోవిందవర్మ, మొదటి విక్రమేంద్రవర్మ, బౌద్ధ మతాభిమానులైన వైష్ణవులు. నాటికే ఉత్తర భారతదేశంలో గుప్త రాజుల ప్రభావం వల్ల వైష్ణవం పుంజుకొని, బౌద్ధ వైష్ణవ మతాల మధ్య సామరస్యం ఏర్పడింది. బుద్ధుడు విష్ణువు అవతారంగా పూజలు అందుకున్నాడు. శైవులైన వాకాటకులు రాజ్యంలో కూడా ప్రభావతి గుప్త వైష్ణవాన్ని ప్రవేశపెట్టింది. శాలంకాయనుల కాలానికి బౌద్ధ, వైష్ణవ సామరస్యం పురోగమిస్తున్నట్లు గుంటుపల్లి శాసనం తెలియజేస్తుంది. అందుచేత విష్ణుకుండినులు శ్రీ పర్వత స్వామి అయిన బుద్ధ దేవుని విష్ణు మూర్తి అవతారంగా భావించి, ఆరాధించినారు అని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## 2.6 కులము:-

విష్ణుకుండినులు బ్రాహ్మణులు అని కొందరు, క్షత్రియులు అని మరికొందరు అభిప్రాయపడినారు. తాము బ్రహ్మ, క్షత్ర తేజో' యుక్తులమని విష్ణుకుండినులు చెప్పుకున్నారు. కాబట్టి జన్మరీత్యా వీరు బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలలో దేనికి చెందరు.

ఇక్ష్వాకు, శాలంకాయనుల వలె విష్ణు కుండినులు కూడా ఆదిమ ఆంధ్ర జాతులలోని వారే బౌద్ధాన్ని స్వీకరించి క్రమముగా వైష్ణవ మతాభిమానులై, హిందువులై ఉంటారు. వైష్ణవ మతం స్వీకరించడం ద్వారా ఆంధ్రులు పునీతులు అయినారు అని భాగవతం చాటుతున్నది. రాజకీయ ప్రాబల్యం వహించడంతో దానికి అనుగుణమైన సాంఘిక ఉన్నతి సాధించే ఆశయంతో వైదిక క్రతు కాండలు నిర్వహించినట్లు కనిపిస్తుంది. మాధవవర్మ ధరించిన పరమ బ్రహ్మణ్య, పరమేష్టి బిరుదులలో ఈ తాపత్రయం ప్రతిఫలిస్తుంది.

## 2.7 వంశవృక్షము:-

విష్ణుకుండినుల వంశవృక్ష నిర్మాణం జటిల సమస్య. ఈ సమస్యను గురించి ఏ ఇద్దరు చరిత్రకారుల మధ్య అంగీకారం లేదు. వంశవృక్షానికి 8 శాసనాలు ఉపకరిస్తున్నాయి.

లభ్యమైన విష్ణుకుండిన శాసనాల్లో మొట్ట మొదటిది రెండో మాధవ వర్మ, తన 27వ పరిపాలనా సంవత్సరంలో వేయించిన ఈపూరు II తామ్ర శాసనం. ఈ శాసనంలో మూడు తరాల రాజుల పేర్లు ఉన్నాయి వారు

మొదటి మహారాజ మాధవవర్మ

|

శ్రీ దేవవర్మ

|

రెండో మహారాజ మాధవవర్మ

మొదటి మాధవవర్మ 11 అశ్వమేధ యాగాలు చేసినట్లు, వేల కొలది అగ్ని స్టోమ క్రతువులు జరిపినట్లు, సామంతులు మోకరిల్లినట్లు ఈ శాసనంలో వర్ణించబడింది. మొదటి మాధవవర్మ కుమారుడైన దేవవర్మ క్షత్రియ వీరులను ఎదిరించడంలో ప్రతిభాశాలి అని వర్ణించబడింది. దేవవర్మ కుమారుడైన మాధవవర్మకు త్రికూట మలయాధిపతి, భగవత్ శ్రీ పర్వతస్వామి పాదాను ధ్యాత, నయ, వినయ, సత్య సంపన్న అనే విశేషణాలు ఉన్నాయి.

ఇంద్రవర్మ రామతీర్థం తామ్ర శాసనం, రెండో విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ శాసనం కల్పి చూచినట్లు అయితే నాలుగు తరాల రాజులు కనబడతారు. వారు

మహారాజ మాధవవర్మ

|

మొదటి విక్రమేంద్రవర్మ

|

మహారాజ ఇంద్ర భట్టారకవర్మ

|

రెండో మహారాజ విక్రమేంద్రవర్మ

ఈ రెండు శాసనాల్లోనూ మాధవవర్మ ఒకే వ్యక్తిగా కనబడుతున్నాడు. అతడే విష్ణుకుండిన వంశ స్థాపకుడై ఉండవచ్చు. రామతీర్థం శాసనంలో విక్రమేంద్రవర్మకు రాజ బిరుదు మాత్రమే ఉన్నది. అతనిని ఉభయ వంశ 'ఆత్మ జాలంకార భూత' అని తెల్పినారు. చిక్కుళ్ళ శాసనంలో ఇతనిని పాణప్త విష్ణుకుండి వాకాటక వంశ ద్వయాలంకృత జన్మన అని వర్ణించారు. ఈ వర్ణన వాకాటక విష్ణుకుండిన కుటుంబాలకు ఉన్న వైవాహిక సంబంధాన్ని స్పష్టము చేస్తున్నది. మాధవవర్మ వాకాటక రాజపుత్రిణి వివాహం

ఆడగా, కలిగిన సంతానమే విక్రమేంద్ర వర్మ అని ఊహించవచ్చు. 11 అశ్వమేధ యాగాలు చేసి, దక్షిణా పథ చక్రవర్తిత్వాన్ని మాధవవర్మ సంపాదించినాడు అని చెప్పుకోవడంలో వాస్తవం ఉంది. విక్రమేంద్రవర్మ కుమారుడు ఇంద్ర భట్టారకవర్మ ఇతనిని ప్రియ పుత్రునిగా వర్ణించారు. రామతీర్థం శాసనంలో ఇంద్రవర్మను అనేక చతుర్థంత సమరశత, సంఘట్ట విజ్ఞ అని వర్ణించారు. చిక్కుళ్ళ శాసనంలో కూడా ఇటువంటి వర్ణనే ఉంది. చిక్కుళ్ళ శాసనంలో రెండో విక్రమేంద్రవర్మ, ఇంద్ర భట్టారకవర్మ జేష్ఠ పుత్రుడు అని చెప్పినాడు. మాధవవర్మకు దేవవర్మ, మొదటి విక్రమేంద్రవర్మ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి విక్రమేంద్రవర్మ వాకాటక రాకుమారి కుమారుడు. ఇప్పటి వరకు తెలిసిన విష్ణుకుండినుల రాజుల పట్టిక:

మొదటి మాధవ వర్మ

- దేవవర్మ
  - రెండో మాధవవర్మ
- మొదటి విక్రమేంద్రవర్మ
  - భట్టారక ఇంద్రవర్మ
    - రెండో విక్రమేంద్రవర్మ

గోవిందవర్మ కుమారుడు మాధవవర్మ వేయించిన ఈపూరు తామ్ర శాసనం, మూడో మాధవవర్మ పోలమూరు తామ్ర శాసనాలు ఇచ్చే వివరాలను బట్టి నాలుగు తరాల రాజుల పేర్లు తెలుస్తున్నాయి.

విక్రమేంద్రవర్మ
|
విక్రమాశ్రయ గోవిందవర్మ
|
జనాశ్రయ మూడో మాధవవర్మ
|
మంచయణ్ణ భట్టారక

మూడో మాధవవర్మకుమాత్రమే హిరణ్యా గర్భ ప్రశూతి అనే విశేషణం ఉంది. మొదటి ఇద్దరు మాధవవర్మలకు, ఈ విశేషణం లేదు. మొదటి మాధవవర్మ, మూడవ మాధవవర్మలు మాత్రమే అశ్వమేధ యాగాలు చేశారు. మాధవవర్మలు ముగ్గురిలో వాకాటక రాకుమార్తెను పెండ్లాడిన మాధవవర్మ మొదటివాడు. అతడే వంశ స్థాపకుడు. రెండో మాధవవర్మ త్రికూట మలయాధిపతి, మూడో మాధవవర్మ, జనాశ్రయుడు, త్రివర నగర రాకుమార్తెల మనోహరుడు, హిరణ్యా గర్భ ప్రశూతి, పరమ బ్రహ్మణ్యా చివరి రాజు మంచయణ్ణ భట్టారకుడు.

## 2.8 కాలము:-

మూడో మాధవవర్మ, పోలమూరు శాసన సహాయంతో విష్ణు కుండిన రాజ వంశ కాల పట్టిక నిర్ణయించడానికి వీలగుచున్నది. ఈ శాసనంలో పేర్కొనబడిన తిథి, వార, నక్షత్రాలను పంచాంగంలో సరిచూసి, లెక్కించడానికి వీలుంది. మరొక సమకాలిక ఆధారము కూడా దొరికింది. అది తూర్పు చాళుక్య మహారాజు మొదటి జయసింహ వల్లభుని తామ్ర శాసనం. ఈ రెండు శాసనాల్లో నమోదు చేసిన దావాలు, సమకాల సూచిక కావడం వల్ల పోలమూరు శాసన సంవత్సరం నిర్ణయించడానికి వీలుంది. దానిని బట్టి మూడో మాధవవర్మ 48 వ సంవత్సరాన్ని నిర్ణయించవచ్చు. విష్ణుకుండిన శాసన రచనలలోని పుళోంభూరే నేటి పోలమూరు మూడో మాధవవర్మ తన 48వ పరిపాలనా సంవత్సరంలో దానమిచ్చిన గ్రామాన్ని తిరిగి తూర్పు చాళుక్య, మొదటి జయసింహ వల్లభుడు

తన 5 వ పరిపాలనా సంవత్సరంలో పూర్వ అగ్రహారీకుడైన రుద్ర శర్మకు దానం ఇచ్చాడు. రాజకీయ సంక్షోభ కారణంగా, రెండో రుద్ర శర్మ, అగ్రహారిక హక్కును కోల్పోగా ఆ హక్కును అతనికి చాళుక్య రాజు తిరిగి ఇప్పించాడు. మాధవ వర్మ 48 వ పరిపాలనా సంవత్సరం ఫాల్గున మాస పౌర్ణమి, చంద్రగ్రహణ సంవత్సరం తూర్పు చాళుక్య రాజ్య స్థాపన సంవత్సరానికి దగ్గరగా ఉండవలె. అట్లాంటి శక సంవత్సరం 516 (క్రీ॥శ॥ 594). మూడో మాధవవర్మ క్రీ॥శ॥ 546లో సింహాసనం ఎక్కినాడు. మూడో మాధవవర్మ సింహాసనం ఎక్కిన సంవత్సరం ఆధారంగా మిగిలిన రాజులకు, పరిపాలనా కాల సంవత్సరాలను నిర్ణయించవచ్చు.

### కాల పట్టిక

మొదటి మాధవవర్మ (క్రీ॥శ॥ 5120 - 455)

- దేవవర్మ (455 - 458)
- మొదటి విక్రమేంద్రవర్మ (488 - 493)
  - ఇంద్ర భట్టారకవర్మ (500 - 530)
  - రెండో విక్రమేంద్రవర్మ (530 - 540)
  - గోవిందవర్మ (540 - 546)
  - జనాశ్రయ మూడో మాధవవర్మ (546 - 611)
  - మంచయణ్ణ భట్టారక (611 - 620)

## 2.9 విష్ణుకుండిన రాజుల చరిత్ర:-

ఇక్ష్వాకుల సామ్రాజ్యం పతనమైన తరువాత పల్లవుల ఆక్రమణ నుంచి ఆంధ్ర దేశాన్ని విడిపించడానికి, పలు రాజ వంశాలు పెనుగులాడినాయి. దక్షిణ ఆంధ్రము పై తమ అధికారం శాశ్వతం చేసుకొనే ఉద్దేశంతో పల్లవులు నిరంతరం పోరాటం సాగించారు. పల్లవ రాజ్యం, కృష్ణానది తీరము వరకు వ్యాపించినందువల్ల కర్మ రాష్ట్రము యుద్ధ భూమిగా మారింది. బృహత్ పలాయనుడు, ఆనంద గోత్రజులు పల్లవులతో పోరాడినారు. వారి తరువాత పల్లవులతో విష్ణుకుండినులు పోరాటం సాగించారు. కదంబులతో జరిగిన పోరాటాల్లో తీవ్రంగా నష్టపడిన పల్లవులు విష్ణుకుండినుల ఆక్రమణలను అరికట్ట లేకపోయారు.

**2.9.1 మొదటి మాధవవర్మ:-** విష్ణుకుండిన వంశ స్థాపకుడు మొదటి మాధవవర్మ. ఇతడు ప్రతిభాశాలి, న్యాయదక్షుడు, రాజనీతిజ్ఞుడు. ఇతడు నూరు వేల అగ్ని ష్టోమాలు చేసిన వాడు అని, 11 అశ్వమేధ యాగాలు చేసి, ప్రపంచ పాపాలు కడిగి వేసినవాడు అని, రాజసూయ యాగం చేసినాడు అని వర్ణించినారే గాని గెలిచిన యుద్ధాల పేర్లు గాని, ఇతర ఘనకార్యాల వివరణ గానీ లేవు. ఎంతో మంది రాజులను జయించినా గాని, రాజసూయ యాగం చేయటానికి వీలులేదు. కాబట్టి ఈ విజయాల కారణంగా అతడు ఒక మహారాజు అయి వంశ స్థాపకుడైనాడు. ఇతనిచే పరాజితులు అయిన వారిలో పల్లవులు, శాలంకాయనులు, ముఖ్యులై ఉంటారు. దక్షిణా పథ చక్రవర్తి అయిన మాధవ వర్మతో వాకాటకాలు, వైవాహిక సంబంధం ఏర్పరచుకున్నారు. చిక్కుళ్ళ తామ్ర శాసనం ఈ వివాహాన్ని తెల్పి, వివాహ ఫలితంగా పుట్టిన వాడే విక్రమేంద్ర వర్మ అని పేర్కొన్నది. వాకాటక రాకుమార్తె నరేంద్ర సేన రాజు, జ్యేష్ట సోదరి వాకాటక రాజుకు కుమార్తెనిచ్చిన కదంబ రాజు మొదటి కృష్ణవర్మ, విష్ణుకుండినులకు మిత్రుడైనాడు.

పల్లవులను ఓడించి, వారిని ఆంధ్ర దేశం నుంచి తరిమి వేసి, శాలంకాయనులను రూపు మాపి, కళింగ రాజులను లొంగదీసి ఆంధ్ర దేశాన్నంతటిని తన ఆధీనంలోకి తెచ్చుకున్న తరువాతనే మాధవవర్మ రాజసూయ యాగం చేసి ఉంటాడు. రాజసూయ, అశ్వమేధ మొ॥ యాగాలు చేయడంలో రాజాధికారాన్ని ధృడపరచటమే ప్రధాన ఉద్దేశము. ఈ యాగాలు జరపడంతో బ్రాహ్మణ మతాన్ని పునరుద్దరించడానికీ, మాధవ వర్మ దీక్ష పూనినాడు అను విషయం స్పష్టమౌతున్నది. బౌద్ధ మతానికి, కేంద్రంగా మారిన ఆంధ్ర దేశంలో వైదిక మతాన్ని అతి కొద్ది కాలంలో పునరుద్ధరించిన ఘనత మాధవవర్మకు దక్కుతుంది. ఇతని పాలనా కాలంలోనే సరికొత్త వాస్తు, శిల్ప రీతులు వృద్ధి చెందాయి.

2.9.2 **దేవవర్మ:-** మొదటి మాధవవర్మ తరువాత అతని జ్యేష్ఠ పుత్రుడైన దేవవర్మ విష్ణుకుండిన సింహాసనం అధిష్టించాడు. ఇతడు ఎక్కువ కాలం పరిపాలించినట్లు కనబడదు. ఈపూరు తామ్ర శాసనంలో దేవవర్మ క్షత్రియ వీరులను, రాజులను ముట్టడించటంలో అసమాన పరాక్రమశాలి అని వర్ణించబడినాడు. తండ్రి కాలంలోనే అనేక యుద్ధాలలో పాల్గొని కీర్తిని సంపాదించుకున్న వీరుడు దేవవర్మ. సింహాసనం అధిష్టించిన తరువాత దేవవర్మ శత్రు రాజులతో నిరంతరం యుద్ధాలు చేయవలసి వచ్చింది. ఈ యుద్ధాలలోని దేవవర్మ ప్రాణాలు కోల్పోయి ఉంటాడు. దేవవర్మ కుమారుడు రెండో మాధవవర్మ అమరపురం వదలి ఉత్తర ఆంధ్రకు వెళ్లవలసి వచ్చింది. పల్లవులు దక్షిణ ఆంధ్రను ఆక్రమించారు. ధాన్యకటకము, మూడో సింహవర్మ స్వాధీనం అయింది. సింహవర్మ విష్ణుకుండినులను ఓడించి జయ స్థంభం పాటించినట్లు, అమరావతి స్థంభ శాసనం పేర్కొంటుంది.

2.9.3 **రెండో మాధవవర్మ:-** పల్లవులతో జరిగిన యుద్ధాల్లో దిగజారిన విష్ణుకుండినుల పేరు, ప్రతిష్టలను రెండో మాధవవర్మ పునరుద్ధరించాడు. ఇతడు తన రాజధానిని అమరపురం నుంచి వేంగీ సమీపంలోని దెందులూరుకు మార్చాడు. చోళులతో జరిగిన యుద్ధాల్లో పల్లవులు ఓడిపోయారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రెండో మాధవ వర్మ దక్షిణ ఆంధ్రను స్వాధీన పరుచుకున్నాడు. దక్షిణ ఆంధ్రను జయించిన తరువాతనే రెండో మాధవవర్మ త్రికూట మలయాధిపతిగా ప్రకటించుకున్నాడు. ఇతడు పాలించిన 30 సం॥ కాలం విష్ణుకుండిన బలానికే పరీక్షా సమయం. దిగజారిన పేరు, ప్రతిష్టలను తిరిగి శిఖరానికి చేర్చిన ఘనత ఇతనిది.

2.9.4 **మొదటి విక్రమేంద్రవర్మ:-** రెండో మాధవవర్మ మరణం అంతఃపుర కలహాలకు దారి తీసింది. దీని పర్యవసానంగా మొదటి మాధవవర్మకు వాకాటక రాకుమారి వల్ల కలిగిన మొదటి విక్రమేంద్రవర్మకు సింహాసనం ఎక్కే అవకాశం లభించింది. రామతీర్థం తామ్ర శాసనంలో విక్రమేంద్రుని సత్పుత్రునిగా వర్ణించినారు. సింహాసనం ఎక్కే నాటికే వయో వృద్ధుడు కావడం వల్ల, ఇతని పరిపాలన కొద్ది కాలమే సాగింది. ఇతని మరణానంతరం దాయాదుల మధ్య పెనుగులాట జరిగి, వాకాటక హరిసేనుని జోక్యానికి దారి తీసింది. చివరకు, ఇంద్ర భట్టారకవర్మ సింహాసనం ఆక్రమించాడు.

2.9.5 **ఇంద్ర భట్టారకవర్మ:-** దాయాదులందరిని సంహరించి రాజ మార్గాన్ని నిష్ కంటకం చేసుకొని ఇంద్ర భట్టారకవర్మ సింహాసనం అధిష్టించినట్లు చిక్కుళ్ళ శాసనం చెబుతుంది. ఇతడు అనేక యుద్ధాల్లో విజయం సాధించి దీర్ఘ కాలం పరిపాలించాడు. ఇతడు చివరకు, యుద్ధ రంగంలోనే మరణించాడు. మొదటి మాధ... పాలనా కాలంలో వలె ఇతని కాలంలో ఆంధ్ర దేశం ఉన్నత స్థితికి చేరింది. ఇంద్ర భట్టారకవర్మ పరమ మహేశ్వరుడు, శివారాధకుడు, దానశీలి, గోవులను, భూములను దానం చేశాడు. విష్ణుకుండిన సామంతులు, రణదుర్జయ వంశస్థుడైన పృథ్వీ మూలుడు కళింగ రాజు అయిన ఇంద్రవర్మతో చేతులు కలిపి ఇంద్ర భట్టారకుని కళింగ యుద్ధంలో ఓడించి, చంపాడు. ఈ విషయం పృథ్వీ మూలుని గోదావరి శాసనం వల్ల తెలుస్తుంది. ఇంద్ర భట్టారకుని మరణంతో విష్ణుకుండిన రాజ్యం అంతంకాలేదు.

2.9.6 **రెండో విక్రమేంద్రవర్మ:-** రెండో విక్రమేంద్రవర్మ ధైర్యశాలి, పట్టుదల గలవాడు. రాజనీతి చతురుడు. ఇతడు కళింగ రాజ్య కూటమిని ఓడించి, విష్ణుకుండిన వంశ ప్రతిష్టను కాపాడినాడు. ఇతడు శివారాధకుడు, పరమ మహేశ్వరుడు.

2.9.7 **విక్రమాశ్రయ గోవిందవర్మ:-** రెండో విక్రమేంద్రవర్మ తరువాత విక్రమాశ్రయ గోవిందవర్మ సింహాసనానికి వచ్చినాడు. ఈపూరు శాసనం I గోవిందవర్మను శ్రీ పర్వత స్వామి పాదాను భక్తుడిగా, అపరమిత బల పరాక్రమ వంతుడిగా, పరమ ధార్మికుడుగా, అనేక సామంతులచే సేవింపబడిన వాడుగా, అనేక గో, హిరణ్య, భూదానాలు చేసిన వాడిగా వర్ణించింది. పోలమూరు శాసనం ఇతనిని అనేక సమర సంఘటన విజయీన, పర నరపతి మకుటమణి, మయూఖ అవదాత చరణ యుగళస్య, విక్రమాశ్రయునిగా వర్ణించింది. ఈ శాసనాల వల్ల గోవిందవర్మ గొప్ప పరాక్రమశాలి అని, పరమధార్మికుడని తెలుస్తుంది. విష్ణుకుండినులకు వారి సమకాలీనులైన మౌఖారులకు గల వైరాన్ని గురించి మౌఖారుల శాసనము తెలుపుతుంది. మౌఖారులు గంగా, యమునా అంతర్వేది పాలకులు. ఎంతో దూరాన ఉత్తర దేశంలో ఉన్న మౌఖారులకు దక్షిణ దేశంలో ఉన్న విష్ణుకుండినుల వైరం ఏర్పడటానికి నాటి రాజకీయ అల్లకల్లోల పరిస్థితులే కారణం కావచ్చు. మౌఖారి ఈశానవర్మ జాన్పూర్ శాసనము ఆంధ్రదేశ రాజులతో అతనికి జరిగిన యుద్ధాన్ని గురించి తెల్పుతుంది. ఉత్తర దేశంలో సంభవించిన ఓటమి తర్వాత కొంత కాలానికి గోవిందవర్మ మరణించాడు.

2.9.8 **జనాశ్రయ మూడో మాధవవర్మ:-** విష్ణుకుండిన వంశంలో సుదీర్ఘ కాలం పాలించిన వాడు, జనాశ్రయ మూడో మాధవవర్మ. ఇతడు పసిబాలుని గానే సింహాసనాన్ని అధిష్టించి 65 సం॥లు సుదీర్ఘ కాలం పాలించాడు. మూడో మాధవవర్మ న్యాయశాస్త్ర విశారదుడు అని, సూక్ష్మగ్రాహి అని, సత్యశీలుడు అని, ధర్మపరుడు అని, శౌర్యవంతుడని, వినయ సంపన్నుడు అని ఈపూరు శాసనం పేర్కొన్నది. పాలమూరు శాసనం ఇతనిని అవసిత వివిధ దివ్యా పరమ బ్రహ్మణ్య జనాశ్రయుడుగా పేర్కొన్నది.

మూడో మాధవవర్మ సింహాసనం అధిష్టించే నాటికి విష్ణుకుండిన రాజ్య పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. మూడో కుమార విష్ణువు నాయకత్వంలో పల్లవులు కర్మ రాష్ట్రాన్ని ఆక్రమించారు. ఈశాన్యంలో తూర్పు గాంగులు శత్రు భావాన్ని వహించారు. అన్ని వైపుల శత్రు రాజులు విజృంభించారు. ఈ పరిస్థితుల్లో మూడో మాధవవర్మ రాజ్యాధికారం చేపట్టి, పోగొట్టుకున్న ప్రాంతాలనే గాక క్రొత్త ప్రాంతాలను కూడా జయించాడు. త్రివర నగర అధిపతిని ఓడించి అతని కుమార్తె చంద్రావతిని వివాహం చేసుకున్నాడు. ఈమె శ్రీశైల స్థల మహత్యంలోనూ, పండితారాజ్య చరిత్రలోను పేర్కొనబడిన చంద్రావతి అయి ఉండవచ్చునని చరిత్ర కారుల అభిప్రాయం. మూడో మాధవవర్మ కళింగను పాలించే తూర్పు గాంగ వంశీయుడైన రెండో ఇంద్రవర్మను ఓడించి, చంపి అతని కుమారుని సామంతునిగా చేసుకున్నాడు. కళింగ విజయం తరువాత, మూడో మాధవవర్మను ఎదిరించిన రాజు దక్షిణా పథంలో లేడు.

మూడో మాధవవర్మకు న్యాయ పాలకుడిగా, ధర్మ సంరక్షుడిగా మంచి పేరు ఉన్నది. మాధవవర్మ గాత ఒకటి విజయవాడ, మల్లేశ్వర స్వామి ఆలయంలోని 12వ శతాబ్దం నాటి శాసనం వల్ల తెలుస్తుంది. ఈ కథ ప్రకారం విజయవాడను మాధవవర్మ పాలించేటప్పుడు చింతకాయలు అమ్ముకొని జీవించే ఒక స్త్రీ కుమారుని, రాకుమారుడు చంపాడు. ధర్మ సంరక్షణార్థం ఆ రాజు తన కుమారుని వధించాడు. అప్పుడు ఆ రాజు ధర్మ పాలనకు శ్రీ మల్లేశ్వర స్వామి ప్రీతి చెంది, కనక వర్షాన్ని కురిపించాడు. అంతేగాక, రాకుమారున్ని బతికించాడు. ఈ కథలో పేర్కొనబడిన మాధవ వర్మ, మూడో మాధవవర్మ అని కొందరి భావం.

మూడో మాధవవర్మ ఆశ్రయంలోనే జనాశ్రయ చందోమిచితి అను గ్రంథం రచింపబడింది అని కొందరి అభిప్రాయం. జనాశ్రయ బిరుదున్న రాజు మూడో మాధవవర్మ తప్ప దక్షిణ భారతదేశ చరిత్రలో మరొకరు లేకపోవడం ఇందుకు నిదర్శనం.

2.9.9 **మంచన భట్టారకుడు:-** మూడో మాధవవర్మ తరువాత అతని కుమారుడు మంచన భట్టారకుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడే విష్ణుకుండిన పాలకుల్లో చివరి వాడు. ఇతడు సమర్థుడు కాడు. ఇతని కాలంలో కళింగ కాందులు, పిష్టపుర

దుర్జయులు ఎదురు తిరిగారు. మంచన భట్టారకుని ఓడించి, ఆంధ్ర దేశ సార్వభౌమత్వానికి పిష్టపుర పృథ్వీ మహారాజు ప్రయత్నించాడు. ఇతడు మహారాజ రణ దుర్జయుని మనుమడు. విష్ణు కుండిన రాజ్యం పృథ్వీ మహారాజు ఆక్రమించినట్లు తాండివాడ శాసనం తెలియజేస్తుంది. దుర్జయులను చాళుక్యులు జయించారు. చాళుక్యుల శాసనాల్లో దుర్జయుల ప్రసక్తి ఉంది గాని విష్ణుకుండినుల మాటే లేదు. అందువల్ల చాళుక్యుల దండయాత్రకు ముందే విష్ణు కుండిన రాజ్యం అంతమై వుంటుంది.

## 2.10 సాంస్కృతిక విశేషాలు:-

విష్ణుకుండినుల నాటి సాంస్కృతిక విశేషాలు గ్రహించడానికి వారు వేయించిన తామ్ర శిలా శాసనాలు, సమకాలిక రాజ వంశీయుల శాసనాలు, జనాశ్రయచ్ఛందో విచ్ఛిత్తి, వాస్తు శిల్పాలు ఉపకరిస్తున్నాయి. విష్ణుకుండిన రాజులు దక్షిణా పథపతి త్రికూటమలయాధిప, శ్రీ పర్వత పాదానుధ్యాతలుగా శాసనాలలో పేర్కొనబడినారు. వీరు కృష్ణా నది, గోదావరి నదుల మధ్య ప్రాంతాలను పాలించారు. వీరి తొలి రాజధాని అమరపురి. తరువాత వారి రాజధాని ఇంద్రపురికి మార్చబడినది. అమరావతి, దెందులూరు, బెజవాడ క్రమంగా వీరి రాజధానులైనవి.

**2.10.1 పరిపాలనా విధానం:-** విష్ణుకుండినుల పరిపాలనా కాలంలో ఆంధ్రదేశము గొప్పగా అభివృద్ధి చెందినది. రాజులు నిరంకుశులైనను ప్రజాభిప్రాయముననుసరించి రాజ్య పాలన చేశారు. వీరి కాలంలో ప్రజలు సుఖమయ జీవితాన్ని గడిపారు. పరిపాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యం అనేక రాష్ట్రాలుగా, విషయాలుగా విభజింపబడింది. వరికి రాష్ట్ర, కమ్మ రాష్ట్ర, గుద్దవాడి విషయ, నత్రపాటి విషయ మొదలైన విభాగాలు శాసనాల్లో కనిపిస్తున్నాయి. శుక్రనీతిననుసరించి రాజు పరిపాలన సాగించాడు. కీలక ప్రాంతాలకు రాజ కుటుంబీకుల్ని రాజ ప్రతినిధులుగా నియమించడం కనిపిస్తున్నది. మూడో మాధవవర్మ త్రికూటమలయాధిపతి కావడమే దీనికి ప్రబల సాక్ష్యం. రాష్ట్రానికి రాష్ట్రికుడు అధిపతి. విషయానికి విషయాధిపతి అధికారి. ఆంతరంగికుడు రాజాజ్ఞలను అమలుపరిచేవాడు.

న్యాయ పాలనలో రాజే ఉన్నత న్యాయాధికారి. న్యాయ శాస్త్ర పరిజ్ఞానం, విచక్షణా జ్ఞానం రెండూ పుష్కలంగా ఉన్న విష్ణుకుండిన రాజులు వివాదాలను పరిష్కరించడంలో నిందితుని చేతిని సలసల కాగే నీటిలో ముంచటం వంటి అనేక అగ్ని పరీక్షలను నెలకొల్పారు. నిష్పాక్షికంగా ఉన్నతమైన తీర్పు నివ్వడంలో వారు ప్రసిద్ధి కెక్కినారు. వారి సైన్యం చతురంగ బల సమన్వితం. గజ బలాధక్షుడు, పదాతి దళాధిపతి వంటి సైనికాధికారులు శాసనాలలో కన్పిస్తున్నారు. రాజుల తరుపున ఈ అధికారులు దానాలు కూడా చేశారు. భూమి శిస్తు వసూలుకు గాను చక్కని వ్యవస్థీకృత పాలనా యంత్రాంగం ఉండి ఉండవచ్చు. అగ్రహారాలు సర్వ కర పరిహారంగా దానమివ్వబడ్డాయి.

**2.10.2 మతము:-** విష్ణుకుండినుల శాసనములన్నీ సమకాలీన మత పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఈ కాలంలో బౌద్ధంలో వజ్రయాన శాఖ ఆవిర్భవించెను. అందువల్ల బౌద్ధానికున్న కీర్తి ప్రతిష్టలు ప్రజాభిమానము అడుగంటినాయి. విష్ణుకుండిన రాజులలో మొదటి మాధవవర్మ, మొదటి గోవింద వర్మ బౌద్ధ మతానుయాయులు. విక్రమేంద్ర భట్టారకవర్మ బౌద్ధ మతాభిమాని. ఇంద్ర పాలనగర తామ్ర శాసనముల వలన విష్ణుకుండినులు బౌద్ధమతానుయాయులని, అందు గోవిందవర్మ మహారాజు బౌద్ధమునాదరించి, పోషించినట్లు తెలుస్తున్నది. అంతేగాక ఇతడు బౌద్ధ సంఘములకు అగ్రహారాలిచ్చినట్లు తనపట్ట మహిషి మహాదేవి పేర మహాదేవి విహార నిర్మాణం చేసినట్లు తెలుస్తున్నది. మహాదేవి విహారం, గాజుల బండ, జగ్గయ్య పేట, ఫణిగిరి, నేల కొండ పల్లి, కొండా పురం, చైతన్య పురి, తిరుమల గిరి, వర్ధమాను కోట, రామిరెడ్డి పల్లి వంటి బౌద్ధారామ విహారాలు గోవింద వర్మ పోషణలో వుండెను. కృష్ణా నది దక్షిణమున గల అమరావతి, నాగార్జునకొండ, భట్టిప్రోలు, చేజర్ల బౌద్ధారామ విహారాలు విష్ణుకుండినుల ఆదరణ వలన మరి కొంత కాలం నిలువ గలిగినాయి.

విష్ణుకుండినుల కాలంలో జైన మతం క్షీణ దశలో ఉండెను. జైనులలో దిగంబరులు, శ్వేతాంబరులను రెండు శాఖల వారుండిరి. జైన మతం ఆంధ్ర దేశమున క్షీణించుటకు కాపాలిక జైనులు కారకులు. పల్లవ రాజులు వైదిక మతాన్ని ఉద్ధరించి జైన మతానికి నిలువ నీడ లేకుండా చేసిరి.

రెండో మాధవవర్మ అధికారానికి వచ్చినప్పటి నుంచి ఆంధ్రదేశంలో వైదిక బ్రాహ్మణం తనకు తాను గట్టిగా నిలదొక్కుకుంది. చాలా సూక్ష్మ విషయాలను కూడా జాగ్రత్తగా నిర్వహించవలసిన రాజసూయం, పురుష మేధం, సర్వ మేధం, అశ్వ మేధం వంటి వైదిక క్రతువులు చేయబడినాయి. కొంత మంది ప్రభువులు తమను తాము పరమ మహేశ్వరులమని వర్ణించుకొన్నారు. వారి కుల దైవం శ్రీ పర్వత స్వామి. మాధవవర్మ, గోవిందవర్మ వంటి రాజుల పేర్లు వారి వైష్ణవాభిమానాన్ని చాటుతున్నాయి. ఈ విధంగా శైవ, వైష్ణవాలను రాజులు సమానంగా ఆదరించారని చెప్పవచ్చు. మొగల్‌రాజపురం, విజయవాడ, ఉండవల్లి ప్రాంతాలలో తొలచిన ఆలయాలు దీనికి నిదర్శనం.

2.10.3 **సారస్వతము:-** విష్ణుకుండిన రాజులు గొప్ప భాషాభిమానులు. విద్వాంసులైన బ్రాహ్మణులకు భూ దానాలిచ్చారు. వేదాధ్యయనానికి, ప్రచారానికి ఘటికా స్థానాలు వేయించారు. సనాతన ధర్మానికి ప్రాముఖ్యాన్నిచ్చారు. వారు నిర్వహించిన వైదిక క్రతువులు బ్రాహ్మణ మతంలో వారి విశ్వాసానికి ప్రజా బాహుళ్యంలో వైదిక విజ్ఞానం పట్ల ఉన్న అనురక్తికి ప్రతీకలు. విష్ణుకుండినులు సారస్వతాభిమానులే గాక వారిలో కొందరు స్వయంగా విద్వాంసులు కూడా. ఒక శాసనంలో విక్రమేంద్ర వర్మ 'మహాకవి'గా వర్ణించబడినాడు. 'జనాశ్రయ ఛందో విచ్ఛితి' అనే అసంపూర్ణ సంస్కృత అలంకార శాస్త్ర గ్రంథాన్ని 'జనాశ్రయ' బిరుదాంకితుడైన నాలుగో మాధవ వర్మ రచించినట్లు ప్రతీతి. దొరికిన శాసనాలను బట్టి సంస్కృత భాష రాజాదరణ పొందినట్లు గ్రహించవచ్చు. విక్రమేంద్ర భట్టారక వర్మ వేయించిన చిక్కుళ్ళ శాసనమున 'విజయ రాజ్య సంవత్సరంబుల్' అను పదమున్నది. ఇది తెలుగు పదము.

2.10.4 **వాణిజ్యము:-** విష్ణుకుండినుల కాలములో వర్తక వ్యాపారాలు విశేషముగా సాగినవి. వివిధ వృత్తులకు సంబంధించిన ప్రజలుండుట వలన కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెందినవి. ఆంధ్ర నావికులు విదేశ వ్యాపారం చేసి ఆంధ్ర దేశం సిరి సంపదలతో తులతూగునట్లు చేసిరి. విష్ణు కుండినుల నాణేలు నల్ల గొండ, గుంటూరు కోస్తా తీరములందు లభించినవి. ఆంధ్ర దేశమందే గాక మహారాష్ట్ర, కర్ణాటక, కళింగాధి రాజ్యాములందును వీరి నాణేలు లభించాయి. నాణేలపై ఓడ గుర్తులున్నవి. బొజ్జన కొండ ప్రాంతంలో 68 రాగి నాణేలు, ఒక బంగారు నాణేం లభించినవి. వాడపల్లి, అమరావతి, మోటుపల్లి, కోడూరు, ఘంటసాల నాటి ప్రసిద్ధి గాంచిన రేవు పట్టణాలు.

2.10.5 **వాస్తు శిల్ప కళలు:-** విష్ణుకుండిన రాజులు శిల్ప కళకు గొప్ప సేవ చేసినారు. వీరి కాలమున ప్రత్యేక శిల్ప కళ వృద్ధి చెందినది. ఈ వంశంలోని తొలి ముగ్గురు రాజులు బౌద్ధ మతానుయాయులు. అందువల్ల వారు బౌద్ధరామ స్తూపాలను నిర్మించినారు. విష్ణుకుండినులు వైదిక మత వ్యాప్తికి అనేక దేవాలయాలను నిర్మించి, గుహాలయాలను తొలిపించినారు. వీరు తొలిపించిన గుహాలయాలు మొగల్‌రాజపురం, విజయవాడ, ఉండవల్లిలో గలవు.

మొగల్‌రాజపురంలోని ఐదు గుహలలో మూడు గుహలు అతి సామన్యమైనవి. నాల్గవది దుర్గ గుహ. దీనిలో వెనుక గోడ పై అర్థనారీశ్వర మూర్తిని చెక్కినారు. ఐదవది శివ తాండవ గుహ. ఇది మిగిలిన గుహల కంటే పెద్దది, అందమైనది. స్తంభ మంటపానికి వెనుక ఉన్న మూడు గర్భ గుహలు బహుశ త్రిమూర్తులకు అంకితము. ఐదో గుహ ముఖం పై గల నటరాజ విగ్రహం వల్ల ఆ గుహ కాపేరు వచ్చింది. ఈ శిల్పం చాలా వరకు శిధిలమయింది. కపోతం మీది కూడులలో దేవీ సహితులైన త్రిమూర్తులున్నారు.

విజయవాడ దుర్గ కొండకు దిగువన 'అక్కన్నమాదన్న' గుహలు చాలా శిధిలావస్థలో ఉన్నాయి. వీనికి ఎగువనున్న పెద్ద గుహ సైతం త్రిమూర్తులకు అంకితమే. కాని, ఇందులో క్రీ॥శ॥ 2, 3 శతాబ్దాల లిపిలో నున్న శాసనం గుహ

ప్రాచీనతను తెలియజేస్తుంది. బహుశా ఇది బౌద్ధుల లేక జైనుల విహారమై తరువాత 5, 6 శతాబ్దాలలో హిందువులాక్రమించి వుంటారు. ఈ త్రిమూర్తి గుహలు నాటి హిందూ మతంలోని సామరస్యానికి నిదర్శనము.

ఉండవల్లి లోని గుహలు నాలుగు అంతస్తులు కలిగి ఉంది. రెండో అంతస్తులో కుడి వైపు చివరి భాగంలో **అతి** పెద్ద అనంతశాయి విగ్రహం కలదు. విష్ణు కుండినుల నాణేల పై కన్పించే సింహం ప్రతి రూపం ఈ గుహాలయ స్తంభాల పై కన్పిస్తుంది. గుహ ముఖం పై క్రీ॥శ॥ 6 వ శతాబ్ది లిపిలో 'ఉత్పత్తి పిడుగు' అనే లేఖనం ఉంది. 'ఉత్పత్తి పిడుగు' అనేది గుహలు తొలిపించిన శిల్పుల శ్రేణి పేరై ఉండవచ్చు. రెండో అంతస్తులోని స్తంభాల పై విష్ణు మూర్తి అవతార గాథలు, రామాయణ, భాగవత గాథలు, లింగోద్భవ గాథ శిల్పీకరించబడింది.

**డా॥ వి.కె. మోహన్**

పాఠం - 9 **శాతవాహనానంతర యుగ సాంస్కృతిక విశేషాలు**

**ముఖ్యాంశాలు:-**


9.0 లక్ష్యం

9.1 ఉపోద్ఘాతము

9.2 ఆధారాలు

9.3 పాలనా విధానం

9.3.1 కేంద్ర ప్రభుత్వం

9.3.1.1 రాజు

9.3.1.2 మంత్రి మండలి

9.3.1.3 సామంతులు

9.3.2 స్థానిక పాలన

9.3.3 ఉద్యోగ సిబ్బంది

9.3.4 పన్నులు

9.3.5 న్యాయ పాలన

9.3.6 సైనిక వ్యవస్థ

9.4 సాంఘిక పరిస్థితులు

9.5 ఆర్థిక పరిస్థితులు

9.6 మత పరిణామాలు

9.6.1 వైదిక మతం

9.6.2 శైవ మతం

9.6.3 వైష్ణవ మతం

9.6.4 శాక్తేయ మతం

9.6.5 దేవాలయ నిర్మాణం

9.6.6 బౌద్ధ మతం

9.7 సాహిత్యం

9.7.1 విద్య

9.7.2 బౌద్ధ వాఙ్మయం

9.7.3 తెలుగు భాష

9.7.4 లిపి

9.7.5 వృత్తి విద్యలు

9.8 వాస్తు శిల్పాలు

9.8.1 బౌద్ధ నిర్మాణాలు

9.8.2 బ్రాహ్మణ దేవాలయాలు

9.8.3 గుహాలయాలు

## 9.0 లక్ష్యం:-

శాతవాహన చాళుక్య యుగం (క్రీ॥శ॥ 200 - 600) మధ్య నాల్గు శతాబ్దాల కాలంలో దక్షిణాపథంలో సార్వభౌమాధికారం లేక చిన్న చిన్న ప్రాంతీయ రాజ్యాలేర్పడి పరస్పరం యుద్ధాలలో మునిగి దేశము అశాంతి పాలయింది. కాని సాంస్కృతికంగా గణనీయమైన పరిణామాలు అనేకం జరిగాయి. శాతవాహనానంతర యుగ సాంస్కృతిక విశేషాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 9.1 ఉపోద్ఘాతము:-

శాతవాహన సామ్రాజ్య శిధిలాల పై వివిధ ప్రాంతాల్లో శాతవాహన సామంతులు స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకొన్నారు. దీనితో దక్షిణాపథ రాజకీయ సమైక్యత విచ్ఛిన్నమయింది. వాయవ్య ప్రాంతంలో అభీరులు, దక్షిణ భాగంలో చుటుకులస్తులు, తీరాంధ్రంలో కృష్ణా నదికిరువైపులా గల ప్రాంతంలో ఇక్ష్వాకులు, కృష్ణకి దిగువన గుంటూరు - నెల్లూరు ప్రాంతాల్లో పల్లవులు రాజ్యాలు స్థాపించి పాలించినారు. వీరు గాక, వీరికి సమకాలికులు గాను, తరువాత బృహత్పలాయనులు, ఆనంద గోత్రులు, శాలంకాయనులు, కళింగాంధ్ర సింహపురీశులు, తరు, గాంగులు, సిష్టులు, విష్ణు కుండినులు క్రీ॥శ॥ 7వ శతాబ్దంలో వేంగి చాళుక్య రాజ్య స్థాపనా కాలం వరకు ఆంధ్ర దేశంలో రాజ్యమేలారు. ఈ విభిన్న రాజ వంశాలు పరస్పర యుద్ధాలలో మునిగి తేలారు. శాంతి భద్రతలు కరువైనాయి. ఈ పరిస్థితుల్లో వాణిజ్యం, పరిశ్రమలు వెనుకంజ వేశాయి. ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం కీలకమయింది. వ్యవసాయం ప్రధాన పరిశ్రమ కావడంతో రాజుకు, రైతుకు మధ్య భూకామందు లేర్పడి, ఆర్థిక సామాజిక వ్యవస్థలో నూతన పరిణామాలకు కారణమయింది. బౌద్ధం నానాటికీ క్షీణించి, శైవ వైష్ణవ మతాలు రాజాదరణలో వ్యాప్తి చెందాయి. బౌద్ధంలో తాంత్రిక పూజా విధానం విస్తరించింది. ఈ యుగంలో ప్రాకృత భాష స్థానంలో సంస్కృత భాష వ్యాప్తిలోకి రావడం ఒక విశేషం. సంస్కృత భాషా ప్రాబల్యం వల్ల ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య సాంస్కృతిక ఐక్యత ఏర్పడింది. తెలుగు భాష ప్రాథమిక పరిణామ దశలు గడిచి శాసన భాషగా ప్రచారంలోకి రావడం ఈ యుగంలోని మరో విశేషం.

## 9.2 ఆధారాలు:-

విభిన్న రాజ వంశాలు విడుదల చేసిన తామ్ర, శిలా శాసనాలు, నాణేలు, వాస్తు శిల్పాలు, పురాణాలు, ప్రాచీన తమిళ వాఙ్మయం, బౌద్ధ రచనలు ద్వారా శాతవాహనానంతర యుగ విశేషాల గురించి తెలియవస్తున్నది.

## 9.3 పాలనా విధానం:-

శాతవాహన పరిపాలనా విధానాన్నే కొద్ది మార్పులతో ఈ యుగంలోని చిన్న చిన్న రాజ వంశాల పాలకులు అనుసరించారు.

**9.3.1 కేంద్ర ప్రభుత్వం:-** శాతవాహనానంతర యుగంలో ఆంధ్ర దేశ రాజకీయాలకు తీర ప్రాంతమే కేంద్రమైంది. వాణిజ్యం, పరిశ్రమలు క్షీణించడం వల్ల రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలు రాజకీయ ప్రాముఖ్యం కోల్పోయినాయి. పాలనా యంత్రాంగం క్లిష్టమయింది.

**9.3.1.1 రాజు:-** రాజులు నిరంకుశులే గాని ధర్మశాస్త్ర బద్ధంగా పరిపాలించినారు. యువరాజుగా ఉన్నపుడే పరిపాలనలో, యుద్ధ తంత్రంలో అనుభవం సంపాదించే వారు. రాజులు వివిధ శాస్త్రాల్లో పండితులై న్యాయ నిర్వహణాది విషయాల్లో పాండిత్యం సంపాదించినట్లు శాసనాల నుండి తెలుస్తుంది. ధర్మ మహారాజు, పంచమ లోక పాలక వంటి బిరుదుల వల్ల నాటి రాజులు ప్రజారంజకులైనట్లు తెలుస్తున్నది. పర రాజులను జయించి అశ్వమేధ, రాజసూయాల ద్వారా సార్వభౌమత్వం ప్రకటించుకోవడం రాజుల ఆశయం. అందుచేత తరచు పోరాటాలు జరుగుతుండేవి. విష్ణు కుండిన రాజు మాధవ వర్మ, పల్లవ రాజు సింహ వర్మ దిగ్విజయ యాత్రలు చేశారు. కొందుర రాజులు 'ధర్మ విజయ' అనే బిరుదు ధరించారు. ఈ బిరుదాన్ని సరిగా నిర్వచించడం సాధ్యం కాదు.

**9.3.1.2 మంత్రి మండలి:-** రాజుకు సలహా ఇచ్చి సహాయం చేయడానికి మంత్రి మండలి ఉండేది. అత్యవసర పరిస్థితుల్లో మంత్రి మండలి ప్రత్యేకాధికారాలను నిర్వహించేది తన శాసనాల్లో రెండో విక్రమేంద్రుడు ప్రకృతి మండలేన శైశవ ఏద ఆరోపిత రాజ్యభార అని చెప్పుకొన్నందున బాల్యంలోనే ఇతనిని మంత్రి మండలి సింహాసనం ఎక్కించినట్లు భావిస్తున్నారు. యువరాజులు, రాకుమారులు పరిపాలనలో రాజుకు తోడ్పడేవారు. ముఖ్యంగా పల్లవులలో కుమారుని గాని, సోదరుని గాని యువ రాజ్య పట్టాభిషిక్తుని చేసి యువ మహారాజ బిరుదంతో పాలనాభారం వహింప జేయడం సాంప్రదాయంగా ఉండేది.

**9.3.1.3 సామంతులు:-** ఇక్ష్వాకుల కాలంలో సామంతులు మహతలవర, మహదండ నాయక బిరుదులు ధరించి రాజుకు సహాయం చేసేవారు. అమాత్య, సేనాపతి, మహాదండ నాయక, కొష్ఠాగారాధి ఉద్యోగులు రాజుకు పాలనలో సహాయంగా ఉండేవారు.

**9.3.2 స్థానిక పాలన:-** స్థానిక పాలనలో ప్రాంతీయ బేధాలు కన్పిస్తున్నాయి. బృహత్పలాయనులు రాష్ట్రాలను ఆహారాలని పిలిచినారు. ఆహారాధిపతి వ్యాపృతుడు. ఇక్ష్వాకులు తమ రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించి సామంతుల పాలనలో ఉంచినారు. ఇక్ష్వాకు సామంతులలో పూంగియులు, చాళుక్యులు ముఖ్యులు. సామంతులు రాజధానిలో వుంటూ మహాదండ నాయక, మహా సేనాపతి ఉద్యోగాలలో రాజుకు తోడ్పడేవారు. ఒకే వ్యక్తి రెండు, మూడు ఉద్యోగాలు కూడా నిర్వహించేవాడు. శాలంకాయనులు తమ రాజ్యాన్ని విషయాలుగా విభజించి విషయాధిపతులను నియమించారు. వీరి గ్రామాధికారికి ముతుడ అని పేరు. విష్ణు కుండినులు తమ రాజ్యాన్ని రాష్ట్రాలు, విషయాలుగా విభజించారు. నాటి శాసనాలలో పల్కి రాష్ట్ర, కమ్మ రాష్ట్ర, గుద్దాది విషయ పేర్లు కనిపిస్తున్నాయి. కీలక ప్రాంతాలకు రాజ కుటుంబీకుల్ని ప్రతినిధులుగా నియమించారు. మూడో మాధవ వర్మ త్రికూట మల అధిపతి కావడమే దానికి ప్రబల సాక్ష్యం. మహత్తరులు విషయాధిపతులుగా ఉండేవారు. గ్రామాలు తమ పరిధిలో స్వయం ప్రతిపత్తిని అనుభవించాయి.

**9.3.3 ఉద్యోగ సిబ్బంది:-** ఇక్ష్వాకు రాజుల దగ్గర మహాతలవరులు, మహా సేనాధిపతులు ముఖ్య ఉద్యోగులుగా ఉండేవారు. పల్లవుల రాజ్య విస్తరణలో పెద్దదైనందున పాలనా యంత్రాంగం కష్టతరమై ఉద్యోగ సిబ్బంది ఎక్కువగా ఉండేది. రాకుమార, సేనాపతి, రాష్ట్రక, మాండలిక, గ్రామభోజక, వల్లభ, గోవల్లభ, అమాత్య, ఆరక్షాధికృత, గౌల్మిక, తేర్థికనై యోగిక, సంచరష్తక, భటమనుష్య వంటి ఉద్యోగుల పేర్లు పల్లవ శాసనాలలో కన్పిస్తున్నాయి. ఐతే ఈ శాసనాలలో వీరి విధులను గురించిన వివరాలు స్పష్టంగా లేవు. శాలంకాయనులు శాసనాలలో ముతుడలనే పేరులో గ్రామాధి కృతుడు పేర్కొనబడినాడు. విష్ణు కుండిన రాజుల శాసనాల్లో హస్తికోశ, వీరకోశ అనే అధికారుల పేర్లు గలవు. శాసనాలలో వీరు శాసన ఆజ్ఞప్తులుగా, శాసన పాలకులుగా చెప్పబడినారు. భూములను కొలచి ఆయకట్టును నిర్ణయించే వారిని రజ్జుకులు అని పిలిచేవారు. పంట అంచనా వేసి పంటలో రాజ్య భాగాన్ని నిర్ణయించే అధికారిని ఫలదారుడనేవారు పెట్టి ప్రభుత్వానికి చెందవలిసిన ధాణా, ధాన్యాన్ని కొలచే వారు. ప్రభుత్వ పాత్రలను భద్రపరిచే అధికారి అక్షపటలాధి కృతుడు. రాజాజ్ఞలను వ్రాయించే వారు శాసన ఆజ్ఞప్తులు.

**9.3.4 పన్నులు:-** ప్రభుత్వాదాయానికి భూమి శిస్తు ప్రధానమైన ఆదాయం. ఇక్ష్వాకు శాంతమూలుడు వ్యవసాయాన్ని ప్రోత్సహించాడు. ఆనాటి శాసనాలలో అధిక భాగం భూదానాలను గురించినవే. భూమి పన్నుతో పాటు అమ్మకపు పన్నులు, వాణిజ్య సుంకాలు మొదలైనవి ఉండేవి. గనులు, అడవులు రాజులవే. ఉప్పు మీద కూడా పన్ను ఉండేది. మొత్తం మీద ప్రజల పై పన్నుల భారము ఎక్కువే. ప్రజలే ప్రభువులకు, ఉద్యోగులకు, పూలు, పండ్లు, పాలు, కాయగూరలు, పశుగ్రాసము సరఫరా చేసేవారు. అందుచే రాజ సామీప్యాన్ని నీతి శాస్త్రంలో కథలలో ఒకటిగా వర్ణించారు. దాన శాసనాలను రాగి రేకుల పై వ్రాసి దాన గ్రహీతలకు ఇచ్చేవారు. బ్రాహ్మణులకు, ఆలయాలకు సర్వ కర్మ పరిహారంగా దానాలు చేయడం అమలులోకి వచ్చింది.

**9.3.5 న్యాయ పాలన:-** న్యాయ పాలనలో రాజే ఉన్నత న్యాయాధికారి. రాజు స్థానం అత్యున్నత న్యాయ స్థానం. న్యాయ విచారణకు ధర్మాధికారులుండేవారు. నేర నిర్ణయానికి అగ్ని, జల, విష పరీక్షలుండేవి. న్యాయ దీక్షాపరుడైన మాధవ వర్మకు అవసిత వివిధ దివ్య అనుబిరుదుండినది, న్యాయ విచారణలో రాజులు నిష్పక్షపాతంగా వ్యవహరించేవారు. ఇందుకు సాక్ష్యం విజయవాడ మల్లిఖార్జున శాసనంలో వర్ణించబడిన మాధవ వర్మ కథ.

**9.3.6 సైనిక వ్యవస్థ:-** సైన్యం చతురంగ బల సమన్వితం. హస్తికోశ (గజబలాధ్యక్షుడు), వీరకోశ (పదాతిదళాధిపతి) వంటి సైనికాధికారులు శాసనాలలో కనిపిస్తున్నారు. నాటి పాలకులు నిరంతర యుద్ధాలలో మునిగి తేలడం వల్ల సైన్యానికి ప్రాముఖ్యమిచ్చారు. దేశంలో సైనికులు, గూఢచారులు విచ్చలవిడిగా తిరిగేవారు.

## 9.4 సాంఘిక పరిస్థితులు :-

శాతవాహనానంతర యుగంలో వర్ణ ధర్మాలు బలపడ్డాయి. గౌతమీపుత్ర శాతకర్ణి లాగా ఈ యుగపు రాజులు వర్ణ వ్యవస్థను పరిరక్షించటం, వర్ణ సాంకర్యాన్ని నిరోధించటం తమ కర్తవ్యంగా భావించారు. పల్లవ రాజైన త్రిలోచన పల్లవుడు ఉత్తర భారతదేశం నుండి అనేక మంది బ్రాహ్మణ పండితుల కుటుంబాలను రప్పించి, వారిని అగ్రహారాలలో స్థిరపరచి వైదిక మతాన్ని ప్రోత్సహించినట్లు స్థానిక చరిత్రలు పేర్కొంటున్నాయి. వివిధ శాస్త్రాలలో పండితులైన బ్రాహ్మణుల పోషణార్థం అగ్రహారాలు, మాన్యాలు ఇవ్వటం ఈ యుగంలో కొనసాగింది. ఇదే విధంగా వృత్తి పని వారికి, దేవాలయాలకు ఇతర మత సంస్థలకు నాటి రాజులు మాన్యాలు ఇచ్చేవారు. ఈ అగ్రహారాలలో బ్రాహ్మణులు సేద్యంలోను, అధ్యాయన, అధ్యాపనలోను పాల్గొనే వారు. వీరికి వివిధ పనులలో శూద్రులు సహాయపడేవారు. బ్రాహ్మణులు గ్రామం పై వచ్చే ఆదాయంతో పోషింపబడేవారు. అయితే ఉద్యోగులు తాము వసూలు చేసే పన్నులో కొంత భాగం రాజుకు ఇవ్వవలసి ఉండేది.

వైదిక యుగంలో ప్రారంభమయిన ఆటవిక వైదేశిక జాతుల సంస్కృతీకరణ ఈ యుగంలో కూడా కొనసాగింది. పల్లవులు భరద్వాజ గోత్రం ద్వారా అగ్రవర్ణంలోకి ప్రవేశించారు. వీరు క్షత్రియ ధర్మం అనుసరించినందు వలన క్షత్రియులైనారు. పల్లవుల మీద ధ్వజమెత్తిన కదంబ మయూరీశర్మ సంతతి వారు కూడా వర్మ లైనారు. బృహత్పలాయనులు, శాలంకాయనులు, విష్ణు కుండినులు జన్మరీత్యా బ్రాహ్మణులైనప్పటికి క్షత్రియ ధర్మాన్ని స్వీకరించారు.

ఈ యుగంలో చతుర్ వర్ణ విధానమే కాక అనేక వర్తక వృత్తి సంఘాలు ప్రత్యేకమైన కట్టుబాట్లను రూపొందించుకొని అనుసరిస్తూ వుండేవి. పైన పేర్కొన్నట్లు అనేక వర్ణాలు తమ విద్యుక్తధర్మాలకు పరిమితం కాలేదని ఆధారాల వలన తెలుస్తుంది. వర్ణ వ్యవస్థలో అత్యున్నత స్థానం కల బ్రాహ్మణులే వర్ణ ధర్మాన్ని పాటించలేదు. బ్రాహ్మణులలో కూడా అనేక శాఖలు ఏర్పడ్డాయి. ఆనాడు సమాజంలో స్థిరపడుతున్న విదేశీయులు ఆటవిక జాతుల వారని సమాజంలో విలీనం చేసుకోవడానికి రాజులు బ్రాహ్మణుల సహాయం తీసుకున్నారు. శూద్రులు, విదేశీ జాతులు రాజ్య స్థాపన చేస్తూ ఉండగా జన్మ చేత క్షత్రియులైన వారు అనేక ఇతర వృత్తులను చేపట్టడం జరిగింది. ఆనాటి సమాజంలో ఒక ముఖ్య పరిణామము సంకీర్ణ వర్ణాలు ఉత్పన్నం కావడము. వర్ణాంతర వివాహాల వలన ఈ వృత్తి సంఘాలకు సమాజ వ్యవస్థలో ప్రాధాన్యత ఉంది. ఈ సంఘాలు తమ వృత్తి విద్యలను నేర్పే విద్యా సంస్థలుగా పని చేశాయి. ఈ వృత్తి సంఘాలు అనేక కట్టుబాట్లు ఏర్పరచుకున్నాయి. అందువల్ల వృత్తి విద్యలు, వృత్తులు వంశపారంపర్యం అయ్యాయి.

నాటి సమాజంలో స్త్రీకి గౌరవం ఉంది. భర్త నిర్వహించే అన్ని కార్యాలలో ఆమె పాలుపంచుకునేది. స్త్రీని పూజించే చోట దేవతలు నివసిస్తారని మనువు పేర్కొన్నాడు. ఉన్నత కులాలలో స్త్రీలు స్వతంత్రంగా దాన ధర్మాలు చేయడమే గాక రాజ్యపాలనా బాధ్యతలు చేపట్టడము జరిగింది. ఇక్ష్వాకు రాణులు వారి బంధువులు, ధనిక వర్గానికి చెందిన స్త్రీలు దాన ధర్మాలు చేసినట్లు శాసనాలలో చెప్పబడింది.

ఆనాటి సామాజిక పరిస్థితులు ఆర్థిక రంగంలో మార్పులకు దారి తీసింది. అందులో మొదట పేర్కొనవలసినది అంతవరకు వుచ్ఛస్థితిలో కొనసాగిన అంతర్జాతీయ వ్యాపారము క్షీణించడం, అనాగరిక జాతుల దాడుల వలన రోమన్ సామ్రాజ్యం పతనం అయినది. ఫలితంగా రోమ్‌తో వ్యాపారం క్షీణించింది. వ్యాపారం క్షీణించడంతో వ్యవసాయానికి ప్రాధాన్యత పెరగడం ఈ యుగపు రెండో ముఖ్యమైన పరిణామము. ద్రవ్య ఆర్థిక వ్యవస్థకు మారుగా వస్తుమార్పిడి విధానం బలపడింది. దీని వలన నాణేలు జారీ చేసే అవసరం తగ్గినది. ఈ కాలంలో నాగరిక సంస్కృతి క్షీణించి దాని స్థానంలో గ్రామీణ సంస్కృతి వృద్ధి చెందినది. గ్రామీణ నాగరికత వ్యవసాయక జీవనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. అందువలన వ్యవసాయ భూములకు గిరాకీ పెరిగినది. వ్యవసాయ భూములను కాపాడుకొనేందుకు కర్షకులు బ్రాహ్మణుల సహాయం తీసుకున్నారు. దీని వలన గ్రామాలలో కుల వ్యవస్థ బలపడినది. వంసపారంపర్య వృత్తులు కులాలుగా మారాయి. వ్యవసాయ భూములలో పని చేసేందుకు నియమించబడిన వారు తక్కువ కులస్తులుగా ఏర్పడ్డారు.

## 9.5 ఆర్థిక పరిస్థితులు :-

ప్రభుత్వానికి భూమి శిస్తు ప్రధాన ఆదాయ మార్గము. శాతవాహన యుగాంతానికి రోమ్ సామ్రాజ్యంతో వాణిజ్యం క్షీణించి పరిశ్రమలకు నష్టం వాటిల్లి వ్యవసాయం పై ప్రజల దృష్టి మరలడంతో విపరీతమైన ఆర్థిక పరిణామాలు జరిగాయి. నాటి ప్రజలకు వ్యవసాయం ప్రధాన జీవన ఆధారమయినది. రాజులు అడవులను నరికించి క్రొత్త భూములను సాగులోకి తెచ్చారు. ఇందుకు తార్కాణం త్రిలోచన పల్లవునికి గల కాడువెట్టి బిరుదము క్రొత్తగా సాగులోకి వచ్చిన భూముల పై రాజులు కొన్ని సంవత్సరాల పాటు ఎటువంటి పన్నులు విధించే వారు కాదు. రాజులు, సామంతులు చెరువులు, కాలవులు త్రవ్వించి పొలాలకు నీటి వసతి కల్పించారు. ఇక్ష్వాకు రాజైన శ్రీ శాంతమూలుడు హిరణ్యకోటి గోశత సహస్రి. హలశత సహస్ర దానాలు చేసినట్లు శాసన ఆధారము కలదు. కరికాల చోళుడు అడవులు నరికించి క్రొత్తగా గ్రామాలు ఏర్పాటు చేశాడు. ఈ యుగంలో రాజులు బ్రాహ్మణులకు మత **సంస్థలకు** విరివిగా భూదానాలు చేసేవారు. బ్రాహ్మణులు ఆర్థికంగా బలపడి సమాజంలో ఆధిక్యం సాధించారు. ఈ దానాల వలన **రైతులకు,**

రాజులకు మధ్య భూస్వామిక వర్గం బలపడసాగింది. రాజ్యంలోని పంట పొలం మొత్తము రాజుది కాదు. రాజక్షేత్రం పరిమితమై మిగిలిన పంట పొలం వ్యక్తులకి గానీ, గ్రామాలకు గానీ సమిష్టిగా వుండేది. రాజు భూమిని దానం చేయవలసి వచ్చినపుడు భూమిని కొని దానం చేసిన సందర్భాలు కలవు.

ఈ యుగంలో గ్రామాలలో చేతి వృత్తులు సాగుతున్నట్లు శాసనాలు చెపుతున్నాయి. కానీ ఇందలి ఉత్పత్తి ఉద్దేశము గ్రామ అవసరాలను తీర్చడమే కానీ దేశీ, విదేశీ వాణిజ్యంగా కనిపించదు. శాతవాహన, ఇక్ష్వాకు శాసనాలలో కనిపించే నిగమ సభల, గహపతుల ప్రస్తావన ఆ తరువాత శాసనాలలో కనిపించదు. ఈ యుగంలో ద్రవ్య సంబంధమైన ఆర్థిక విధానం కూడా క్షీణించింది. ఇక్ష్వాకుల తరువాత నాణేలు ముద్రించిన వారు విష్ణు కుండినులే. కానీ శాతవాహనుల నాటి పనితనం విష్ణుకుండినుల నాణేలలో కనిపించదు. అంతేగాక 'రు ముద్రించినది రాగి మలామా చేసిన ఇనుప నాణేలు దీని వలన నాటి దేశ ఆర్థిక దుస్థితి స్పష్టమవుతుంది. పరిశ్రమలు వాణిజ్యం క్షీణించడం వలన ప్రాచీన నగరాలు, వానిని కలిపే రహదారులు నష్టపడినాయి. ఈ పరిణామాల వలన చైతన్యవంతమైన శాతవాహన యుగ జీవన విధానం క్షీణించి స్వయం పోషకమై పరిమిత బాహ్య సంబంధాలు కల గ్రామీణ జీవిత విధానం పెరిగినది.

9.5.1 **వైదిక మతం:-** శాతవాహనుల కాలంలో ప్రారంభమైన వైదిక మత ఉద్ధరణ ఉద్యమం ఈ కాలంలో కూడా కొనసాగింది. బృహత్ పలాయనులు, ఆనందరాజులు, పల్లవులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు వైదిక మతాన్ని అభిమానించి ప్రోత్సహించారు. రాజులు అగ్నిసోమ, అశ్వమేధ, రాజ సూయాది వైదిక క్రతువులను చేసినట్లు శాసనాల వలన తెలుస్తుంది. ఆనాడు ఏ రాజైనా తమ సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకోవటానికి ఈ క్రతువులు చేయడం సంప్రదాయమైనది. ఈ వైదిక క్రతుకాండ విష్ణుకుండినుల కాలంలో పరాకాష్టను అందుకుంది. విష్ణుకుండిన రాజు రాజ్యానికి వచ్చినప్పటి నుండి వైదిక మతము గట్టిగా నిలద్రొక్కుకుంది. చాలా సూక్ష్మ విషయాలను కూడా జాగ్రత్తగా నిర్వహించవలసిన రాజసూయం, పురుషమేధం, అశ్వమేధం వంటి వైదిక క్రతువులు చేయబడ్డాయి. పల్లవులు వైదిక క్రతువులు అనేకం చేసి శాసనాలలో తమను 'కలియుగ దోషా వసన్న ధర్మోద్ధరణ నిత్యసన్నద్ధులము' అని చెప్పుకున్నారు.

9.5.2 **శైవ మతం:-** శాతవాహన యుగంలోనే వైదిక మతం పౌరాణిక పరిణామం చెందసాగింది. పౌరాణిక మతానికి శివ లేక విష్ణు ఆరాధన, దానధర్మాలు, తీర్థాటన ముఖ్యలక్షణాలు. ఈ యుగంలో పౌరాణిక మత శాఖలైన శైవ, వైష్ణవాలు ప్రజాదరణ పొందాయి. విజయపురిలో ఇక్ష్వాకులు శివునికి, విష్ణువుకు, శక్తికి ఆలయాలు నిర్మించారు.

ఆంధ్ర దేశంలో వైష్ణవం కంటే శైవం ఎక్కువ ప్రచారము పొందినది. ఇక్ష్వాకులు, శైవులు, బృహత్పలాయనుల ఇష్టదైవం మహేశ్వరుడు. శాలంకాయనుల లాంఛనము వృషభము. విష్ణు కుండినులలో ఇంద్ర భట్టారక విక్రమేంద్ర వర్మలు పరమ మహేశ్వరులు. శివునితో పాటు కుమార స్వామి, గణపతి ఆరాధన కూడా ఎక్కువగా ఉండేదని స్కంధ వర్మ, హస్తి వర్మ వంటి రాజుల పేర్లు సూచిస్తున్నాయి. శివస్కంద, రుద్ర పురుషదత్త వంటి పేర్లు నాడు తరచుగా కనిపిస్తాయి. విజయపురిలో, చేబ్రోలులో మహాసేన ఆలయాలు నిర్మించబడినవి. విష్ణుకుండిన రాజు గణపతి ప్రతిష్ట చేసినట్లు శాసన ఆధారము వుంది. మహేశ్వరులయిన శాలంకాయనులు చిత్రరథస్వామి భక్తులు.

9.5.3 **వైష్ణవ మతం:-** ఈ యుగంలో శైవంతో పాటు వైష్ణవం కూడా ప్రచారమైంది. విజయపురిలోని అష్టభుజస్వామి ఆలయాన్ని అభీరులు ఇక్ష్వాకుల కాలంలో నిర్మించారు. పల్లవులలోని సింహ వర్మ, సింహవిష్ణు, విష్ణు గోప పేర్లు వైష్ణవ మతాన్ని తెలియజేస్తున్నాయి. పల్లవులు విష్ణు ఆలయాలను నిర్మించి, పోషించారు. శాలంకాయనులలో రెండో హస్తివర్మ, రెండో నందివర్మ పరమ భాగవతులు. నందివర్మ విష్ణు భక్తుడు. విష్ణుకుండినులలో ఎక్కువ మంది వైష్ణవులే. నరసింహ, త్రివిక్రమ, రామకృష్ణ మొదలగు విష్ణు అవతారాలు జనాదరణ పొందినట్లు ఉండవల్లి గుహ శిల్పాల ద్వారా తెలుస్తుంది.

ఆ కాలంలో శైవ, వైష్ణవ మతాల మధ్య వైమన్యాలు ఏర్పడలేదు. నాటి పాలకులు భిన్న మతాలను అనుసరించినారు. ఇతర మతాల వారిని వారు పీడించలేదు. శాలంకాయన రాజా హస్తివర్మ ధరించిన వివిధ ధర్మ ప్రధానస్య బిరుదము సామరస్య దృష్టిని తెలియచేస్తుంది.

**9.5.4 శాక్తేయ మతం:-** ఆ యుగంలో శైవ, వైష్ణవాలతో పాటు శక్తి ఆరాధన జరిగింది అనడానికి నాగార్జున కొండలో బయల్పడిన హారీతి దేవాలయము, కొణిదెన, పెదముడియం శిల్ప ఫలకాలు తార్కాణం. దేవాలయాలలో సప్త మాతృకలను నెలకొల్పారు. చేజర్లలోని కపోతేశ్వర ఆలయంలో సప్తమాతృక శిల్పాలు కలవు. కొణిదెలలో లభ్యమైన శిల్పంలో బ్రహ్మ, విష్ణు, శివలింగం, దేవి వున్నాయి. ఈ శిల్పం త్రిమూర్తి ఆరాధనకు భిన్నశాఖల మధ్య సామరస్యానికి నిదర్శనంగా చెప్పవచ్చును.

**9.5.5 దేవాలయ నిర్మాణము:-** మతానికి దేవాలయం కేంద్రం కాసాగింది. ఇక్ష్వాకుల కాలం నుండి శ్రీ పర్వతంలో ఆలయాలు నిర్మించబడినవి. ఈ కాలానివే కొన్ని ఆలయాలు ఇటీవల వీరాపురంలో బయల్పడినాయి. ఇక్ష్వాకులు నాగార్జున కొండలో మహాసేన, పుష్పభద్ర, అష్టభుజ స్వామి, హారీతి మొదలగు దేవతలకు ఆలయాలు నిర్మించారు. పల్లవులు, శాలంకాయనులు, విష్ణు కుండినులు ఆలయాలు నిర్మించినట్లు చెప్పుకున్నారు. తీర్థాటనలు, దాన ధర్మాలు అధికమైనాయి. శ్రీ పర్వతంలోని హారీతి ఆలయంలో సంతానము కొరకు స్త్రీలు గాజులు దానం చేసినట్లు తెలుస్తుంది. వేల్పూరులో యముడికి కూడా ఆలయం వుండేది. మాధవవర్మ గణపతి ప్రతిష్ఠ చేశాడు. విష్ణు కుండినులు, ఉండవల్లి, మొగల్ రాజపురములో గుహాలయాలు తొలిపించారు. భైరవ కొండలోని గుహాలయాలు ఈ యుగం చివర నాటివి.

**9.5.6 బౌద్ధమతం:-** ఆ కాలంలో బ్రాహ్మణ మతోద్ధరణ ఫలితంగా బౌద్ధ మతం క్షీణించింది. అయితే ఇక్ష్వాకుల కాలంలో మహాయాన బౌద్ధం తాత్కాలికంగా విజృంభించి శ్రీ పర్వతం గొప్ప బౌద్ధ క్షేత్రం అయినది. కాని మహాయాన ప్రాబల్యం వలన బుద్ధుని విగ్రహాలు నెలకొల్పి ఆరాధించడంతో అతడు తధాగతుని ప్రతిపత్తి నుంచి దేవాది దేవుడైనాడు. విష్ణు కుండిన శాసనంలో బౌద్ధారామానికి ధూప, దీప, నైవేద్యాల కోసం భూదానం చేసినట్లు వుంది. ఆనాటి ఉత్తర పథంలో విష్ణు మూర్తి అవతారంగా బుద్ధుని ఆరాధించడం ప్రారంభమైనది. ఈ పరిణామ ప్రభావము దక్షిణాపథానికి కూడా విస్తరించి బౌద్ధ మతం తమ ప్రత్యేకతను కోల్పోయింది.

ఇక్ష్వాకుల తరువాత రాజవంశాలలో బౌద్ధాన్ని పోషించినవారు అరుదు. విష్ణుకుండిన గోవిందవర్మ బౌద్ధ స్తూపాలు, విహారాలు నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. పృథ్వీ మూలుడు అతని కుమారుడైన హరివర్మ బౌద్ధ సంస్థలకు భూ దానాలు చేశారు. ఇంతకు మినహా బౌద్ధ సంస్థలు ఆ కాలంలో పొందిన ఆదరణనకు మించిన సాక్ష్యము లేదు. ఈ పరిణామానికి బ్రహ్మణ మతోద్ధారణతో పాటు నాటి ఆర్థిక పరిణామాలు చాలా వరకు కారణము. అప్పటి వరకు బౌద్ధానికి పోషణ పోషించినవారు ప్రధానంగా వర్తకులు, చేతి పనివారు. పైన పేర్కొన్న ఆర్థిక పరిణామాల వలన వర్తకులు నిర్ధనులు కావడంతో క్షీణించింది. దీనికి తోడు బౌద్ధులలో అనేక శాఖలు ఏర్పడి ఐకమత్యం నశించింది. పైన వివరించినట్లు మహయానమతం వర్ధిల్లడంతో బౌద్ధమతం తన వ్యక్తిత్వాన్ని కోల్పోయింది. అంతేగాక బౌద్ధులు ప్రాకృత భాషను విడిచి పెట్టి సంస్కృతంలో గ్రంథరచన సాగించి ప్రజలకు దూరమైనారు. ఈ యుగంలో భావ వివేకుడు వంటి ధార్మనికాచార్యులు లేకపోలేదు. భావవివేకుడు ధాన్యకటక వాసి, దిఙ్నాగుడు వంటి దర్మనికాచార్యులు లేకపోలేదు. భావ వివేకుడు, ధాన్యకాటకవాసిదిఙ్నాగుడు సైతం కొంతకాలం వేంగి సమీపంలో ఉన్నాడని ప్రసిద్ధి.

ప్రజల ఆదరణ తగ్గుతున్న ఈ సమయంలో అమానుష శక్తులను సాధించి ప్రజాదరణ పొందాలనే ఆసక్తితో బౌద్ధులు తాంత్రిక విద్యలను ఆశ్రయించడంతో మహాయానం వజ్రయానానికి దారి తీసింది. వజ్రాయానానికి కూడ జన్మభూమి ఆంధ్రదేశమే. బుద్ధుడే కాల చక్ర తంత్రాన్ని ధాన్యకటకంలో బోధించినాడని గాథలు ప్రచారంలో ఉన్నాయి.

ధాన్యకటకానికి వజ్రాపర్వతం అనే పేరు ఉన్నట్లు సింహళ గ్రంథాల నుండి తెలుస్తుంది. ధాన్యకటక సమీపంలోని కొండ గుహలో వజ్రపాణి అర్చన జరుగుతుందని మంత్రాలు వల్లిస్తారని హుయాన్ త్సాంగ్ వ్రాశాడు. వజ్రయాన సిద్ధాంత కర్త సిద్ధ నాగార్జునుడు ఆంధ్ర దేశము వాడని రామిరెడ్డి పల్లి శాసనం చెబుతుంది. ధాన్యకటకం శంఖరం, రామతీర్థం, శాలి హుండం, వజ్రయాన కేంద్రాలు అయినవి అనడానికి అచ్చట లభించిన వజ్రయాన ప్రతిమలే నిదర్శనం. వజ్రయానం ప్రబలడం వల్ల నైతికముగా నిరసించి బౌద్ధమతం ప్రజాదరణను పూర్తిగా కోల్పోవడంతో బౌద్ధ క్షేత్రాలు నిర్జనమై చివరకు లంజల దిబ్బలుగా మారాయి.

## 9.7 సాహిత్యం:-

వైదిక మత విజృంభణలో సంస్కృత భాషకు, వైదిక విద్యలకు పోషణ లభించింది. ఇక్ష్వాకుల కాలంలోనే శాసనాలలో సంస్కృతాన్ని వాడటం ప్రారంభమైంది. ఇది శాతవాహన యుగంలోనే ప్రారంభయిన దేశవ్యాప్తమైన ఉద్యమ పరిణామం.

**9.7.1 విద్య:-** ఈ కాలపు రాజులు విద్యాభిమానులు, స్వయంగా విద్వాంసులు. వారిలో సర్వశాస్త్రార్థ తత్వజ్ఞులు, మహాకవులు, వ్యాకరణ ఛందోశాస్త్ర పండితులు ఉన్నారు. ఆనాటి రాజులు ఘటికలు స్థాపించి వైదిక విద్యలను పోషించారు. ఈ సమయంలో ఉత్తర దేశంలో కూడ సంస్కృత భాషా వికాసం జరిగింది. సంస్కృత భాష ప్రాబల్యంతో ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య భాషాపరమైన ఐక్యత ఏర్పడింది. వేదాలు, ఉపనిషత్తులు, ఆగమ పురాణాలు, ఇతిహాసాలు, ధర్మ శాస్త్రాలు, తార్క, జోతిష్యాలలో బ్రాహ్మణులు పాండిత్యము సాగించేవారు. కంఠస్తము చేయడమే ఆనాటి విద్యా విధానము. కాని బ్రాహ్మణులు వ్యాఖ్యన పాండిత్యముతో తృప్తి పడినారు. సృజనాత్మకమైన పాండిత్యము పట్ల శ్రద్ధ వహించినట్లు కనిపించదు.

**9.7.2 బౌద్ధ వాఙ్మయం:-** ఆ కాలంలో కూడా బౌద్ధ విహారాలలో సంస్కృత, ప్రాకృతాలలో గొప్ప కృషి జరిగింది. నాగార్జునాచార్యుని గ్రంథాలన్ని సంస్కృతంలోనే ఉన్నాయి. నాగార్జుని శిష్యులలో పేర్కొనదగినవాడు ఆర్యదేవుడు. ఇతడు గొప్ప పండితుడు. ఇతడు చిత్తశుద్ధిప్రకరణం అనే గ్రంథాన్ని వ్రాశాడు. నాగార్జుని తర్వాత ఆంధ్ర బౌద్ధులలో ప్రసిద్ది చెందినవారు దిఙ్నాగుడు, భావవివేకుడు, బుద్ధఘోషుడు. దిఙ్నాగుడు వేంగి సమీపంలోని బౌద్ధ విహారంలోను, భావవివేకుడు ధాన్యకటకములోనున్నట్లు హుయాన్ త్సాంగ్ వ్రాశాడు. ధాన్యకటకం గొప్ప బౌద్ధ విద్యా కేంద్రమైనట్లు పల్లవ నరసింహవర్మ అమరావతి శాసనం తెలుపుతుంది. భారతీయ తర్క శాస్త్రా పితామహునిగా ప్రసిద్ధి గాంచిన దిఙ్నాగుడు, ప్రమాణ సముచ్ఛయం అను గ్రంథాన్ని వ్రాశాడు. వజ్రయాన గ్రంథాలని గ్రంథాలనేకం వ్రాసిన సిద్ధ నాగార్జునుడు శ్రీ పర్వతంలో నివసించాడని తెలుస్తుంది. ఇక్ష్వాకుల కాలంలో శ్రీ పర్వతం గొప్ప బౌద్ధ మత కేంద్రంగా ఉండేది. చైనా, సింహళం, కాశ్మీరం వంటి దేశ, విదేశాల నుండి బౌద్ధ విద్యార్థులు ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసించేవారు.

**9.7.3 తెలుగు భాష:-** ఆ కాలంలోనే తెలుగు భాష రూపుదిద్దుకొంటూ ఉన్నది. ఇక్ష్వాకుల పేర్లలో ఏహువల, అనిక్కి, బాపి, అడవి, రెమ్మణక అనేవి తెలుగు పేర్లు. విష్ణుకుండినుల శాసనాలలో ఆంధ్ర పదాలు కన్పిస్తున్నాయి. చిక్కుళ్ళ శాసనంలో 'విజయరాజ్య సంవత్సరంబుళ్' అనే ప్రయోగము కన్పిస్తుంది. అంతకు ముందు కాలానికి చెందిన అమరావతి శాసనంలో నాగబు అనే పదం కన్పిస్తుంది. కాబట్టి శాతవాహనుల కాలం నాటి దేశి భాష ఈ కాలంలో విస్తరించినట్లు స్పష్టమవుతుంది. విష్ణుకుండినరాజు మాధవ వర్మ జనాశ్రయచ్ఛందో విచ్ఛిత్తి వ్రాసినాడనే అందులో సీసము, ద్విపద, త్రిపద అనే దేశ చంధముల వివరణ ఉన్నట్టు ప్రసిద్ధి. తెలుగు పరిణామాలలో రేనాటి చోళుల కాలం ఒక ముఖ్య ఘట్టం. వారి శాసనాలలో చాలా భాగం తెలుగులో ఉంది. తెలుగు భాషలో వ్రాయబడిన మొదటి శాసనం కడప జిల్లా ఎర్ర గుడిపాడులో గల క్రీ॥శ॥ 6 వ శతాబ్దాపు రేనాటి చోళ ధనుంజయుని కళమళ్ళ శాసనం.

**9.7.4 లిపి:-** ఈ కాలంలో భాషతో పాటు లిపి కూడా పరిణామం చెందింది. ఇక్ష్వాకులు బ్రాహ్మిలిపిని ఉపయోగించారు. వారి

లిపి మనోహర స్వరూపం సంతరించుకున్నది. నాగార్జునకొండ శిల్పాలు ఎంత సుందరంగా ఉన్నాయో ఈ లిపి కూడ అలాగే ఉంది. అందువల్ల ఈ లిపికి ఆకృతిని ఏర్పరచిన వారు నాగార్జునకొండ శిల్పులే. ఈ గుండ్రని అక్షరాలే తెలుగు లిపికి మూలమైంది.

9.7.5 **వృత్తి విద్యలు:-** ఈ కాలంలో వృత్తి విద్యలు వంశపారం పర్యానుగతంగా తండ్రి నుంచి కుమారునికి సంక్రమించేవి. వివిధ వృత్తులు ఈ కాలంలో కులాలుగా రూపొందించడం జరిగింది. వృత్తి విద్యలు నేటికి కొనసాగడానికి ఈ కులాలే కారణం. వృత్తి పని వారికి అక్షర జ్ఞానం వారు చేసే వృత్తికి సంబంధించిన అవసరాలకు తగినట్లు ఉండేవి. భాషా జ్ఞానము కూడా వృత్తుల అవసరానికి తగినట్లు ఉండేవి. వృత్తి విద్యా బోధన ఎక్కువగా మౌఖికంగా, ప్రయోగాత్మకంగా జరిగేది.

## 9.8 వాస్తు శిల్పాలు:-

శాతవాహనానంతర యుగ నిర్మాణాలలో చాలా వైవిధ్యం కన్పిస్తుంది. నాగార్జునకొండ లోయ త్రవ్వకాలలో ఇక్ష్వాకుల రాజధాని విజయపురికి ఉండిన ప్రాకారాలు, అగడ్త, కోట లోపలి పెక్కు భవనాలు బయల్పడినాయి. పర్వత శ్రేణులను కలుపుతూ మూడు వైపులా వున్న రక్షణ శ్రేణులు మరొక వైపు కృష్ణా నదితో విజయపురి బలిష్టమైన దుర్గముగా వుండేది. దుర్గము లోపల బహిరంగ ప్రదర్శన శాల, అవబృధ స్నానవాటిక, అశ్వమేధ యాగ శాల, సైనికుల నివాసాలు మొదలుగున్నవి వెలుగులోకి వచ్చాయి. మిక్కిలి క్లిష్టమైన ప్రదర్శన శాల నిర్మాణంలో రోమన్ నిపుణులు సహాయపడి ఉంటారు. ఈ యుగపు నగరాలలో వేంగి, దెందులూరు, అమరపురి, కందారపురం, పాలకడ ముఖ్యమైనవి.

9.8.1 **బౌద్ధ నిర్మాణాలు:-** శాతవాహనుల స్తూప నిర్మాణ సాంప్రదాయాన్ని ఇక్ష్వాకులు కొనసాగించారు. రాజధాని విజయపురిలో ఇక్ష్వాకు వంశ రాణులు ఇతర స్త్రీలు బౌద్ధ విహారాలు నిర్మించారు. అంతేగాక వీర పురుషదత్తుని సోదరి శాంతిసిరిశ్రీ పర్వతం పై పాడుపడివున్న మహా చైత్యాన్ని పునర్ నిర్మింపచేసింది. రాజ భాండాగారకుని మేనకోడలు ఉపాసికబోధసిరి వివిధ రాజ్యాలలో బౌద్ధాన్ని ప్రచారం చేసింది. భిక్షువుల కోసము చుళదమ్మగిరి పై ఒక చైత్యాలయాన్ని చతుశ్శాలను నిర్మింప చేసింది. ఇంకా ఎహువలుని తల్లి భట్టిదేవి, ఎహువులని సోదరి కొడబలి సిరి ఆరామాలను నిర్మించినట్లు ఆధారాలు వున్నవి. త్రవ్వకాలలో బౌద్ధ మతానికి చెందిన శిల్పాలు అనేకం లభించాయి. ఇక్ష్వాకుల కాలంలో జగ్గయ్య పేట, చిన గంజాం రామిరెడ్డి పల్లి మొదలగు చోట్ల స్తూప విహార మండపాల నిర్మాణం జరిగింది.

9.8.2 **బ్రాహ్మణ దేవాలయాలు:-** ఇక్ష్వాకు రాజుల కాలంలో దేవాలయ నిర్మాణ కార్యక్రమం చురుకుగా సాగింది. నాగార్జునకొండ త్రవ్వకాలలో బయల్పడిన ఆలయ శిథిలాలలో అష్టభుజిస్వామి, పుష్పభద్ర, హారీతి, సర్వదేవం కార్తికేయ, నవగ్రహ ఆలయాలు ముఖ్యమైనవి. ఈ ఆలయ శిథిలాలను బట్టి గర్భగుడి, అంతరాళం మండపం, ప్రాకారం అనే విభాగాలతో గజపృష్టాకారంలో దేవాలయ వాస్తు వుండేదని ఈ ఆలయాలను అగక్త పద్దతి ప్రకారం నిర్మించారని తెలుస్తుంది. అష్టభుజ స్వామి ఆలయాన్ని అభీరులు నిర్మించారు. ఈ ఆలయంలో గర్భ గృహంలో రాతి వేదిక పై కొయ్యతో చేసిన విష్ణు విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు శాసనము వలన తెలుస్తుంది. పుష్పభద్ర స్వామి ఆలయాన్ని వీర పురుష దత్తునిచే ప్రతిష్టించినట్లు శాసనము వలన తెలుస్తుంది. సర్వదేవ ఆలయాన్ని ఎహువలని సేనాని ఎలిశ్రీ నిర్మించినట్లు తెలుస్తుంది. త్రవ్వకాలలో కార్తికేయ, దేవసేన, మరుగుజ్జు గణాలు, సతి శిల్పం లభించాయి. మంచికల్లు, ఏలేశ్వరం, వేల్పూరు, హలంపురి, వేంగి మొదలగు చోట్ల ఈ కాలంలో ఆలయాలు వెలిశాయి. గుంటూరు జిల్లా చేజర్లలో క్రీ॥శ॥ మూడు, నాలుగు శతాబ్దాల కాలంలో గజపృష్టాకారంలో నిర్మించబడిన కపోతేశ్వరాలయం నేటికి నిలిచి వుంది. ఇచట గణపతి విగ్రహాలు, సూర్యదేవుని, కార్తికేయ, భైరవ విగ్రహాలు కలవు.

7.8.3 **గుహాలయాలు:-** ఈ కాలం నాటి గుహాలయాలు మొగల్‌రాజ పురం, విజయవాడ, ఉండవల్లిలలో కలవు. మొగల్‌రాజ పురంలో విష్ణుకుండినుల నాటి ఐదు గుహలు ఉన్నాయి. ఈ గుహలకు స్తంభాలతో కూడిన మండపం దాని వెనుక ఒకటి

గానీ, మూడు గదులు కాని కలిగిన గర్భ గృహం వుంది. మూడు గుహలు అతి సామాన్యమైనవి. నాల్గో గుహ వెనుక గోడ పై అర్ధనారీశ్వరమూర్తి చెక్కబడి వుంది. ఐదవ గుహ ముఖము పై నటరాజ విగ్రహం కలదు.

విజయవాడలో కనకదుర్గ గుడికి వెళ్ళే దారిలో అక్కన్న మాదన్న గుహలు శిథిలావస్థలో వున్నాయి. వీటిలో పెద్ద గుహ త్రిమూర్తులకు అంకితం చేయబడింది. ఈ త్రిమూర్తి గుహలు నాటి హిందూ మతంలోని సామరస్యానికి నిదర్శనం.

ఉండవల్లిలో విష్ణుకుండినుల నాటి గుహలు కలవు. వీటిలో రెండోవ అంతస్థులో కుడి వైపు చివరి భాగంలో అనంతశాయి విగ్రహం వుంది. ఈ గుహ ముఖ భాగం పై క్రీ॥శ॥ 6వ శతాబ్ది లిపిలో ఉత్పత్తి పిడుగు అనే లేఖనం ఉంది. ఇచ్చటి స్తంభాల పై రామాయణ, భాగవత గాథలు శిల్పీకరించారు. కొండలను తొలచి దేవాలయాలని నిర్మించడం ప్రధమంగా విష్ణుకుండిన రాజులు ప్రారంభించారు. ఈ పద్ధతి పల్లవ శైలికి వరవడి పెట్టిందని పండితుల అభిప్రాయము.

అమరావతి శిల్ప రీతి నాగార్జునకొండలో మహోన్నత శిఖరాలను అందుకొని తరువాత శిల్ప చిత్ర లేఖనాలకు నమూనా అయినది. నాగార్జునకొండలోని అష్టభుజ స్వామి ఆలయ ప్రాకారం చిత్ర పరిశోభితమైనట్లు ఒక శాసనం ద్వారా తెలుస్తుంది. అజంతా వర్ణ చిత్రాలు జగ్గయ్య పేట శిల్పాలకు వర్ణ చిత్రికరణమేననీ బర్జెస్ పండితుని అభిప్రాయం. అమరావతి, నాగార్జునకొండ, ఉండవల్లి సాంప్రదాయాలనే కాంచీపురం, మహాబలి పురాలలో పల్లవులు, బాదామి చాళుక్యులు అనుకరించారు.

ఖండిక - 3
పాఠం - 10

# రెండవ పులకేశి

## PULAKESIN II

**ముఖ్యాంశాలు:-**

10.0 లక్ష్యం

10.1 ఉపోద్ఘాతము

10.2 శాసనాధారములు

10.3 పులకేశి జీవితంలోని ముఖ్య ఘట్టాలు

10.4 ఐహోలు శాసనంలోని వివరాలు

10.5 పూరీ విజయం

10.6 శ్రీ హర్షునితో పోరాటం

10.7 ప్రాచ్యదక్కను విజయము

10.8 విష్ణుపుర విజయము

10.9 దక్షిణమున పల్లవులతో పోరు

10.10 విదేశాలతో సంబంధాలు

10.11 రూప గుణగణాలు

## 10.0 లక్ష్యం:-

బాదామి చాళుక్యులలో ప్రముఖుడు ఉత్తరాపద నరేశ్వరుడైన శ్రీ హర్షునికి సమవుజ్జీ అయిన రెండవ పులకేశి శౌర్య, ధైర్య, రూప, గుణ పరాక్రమములను, అతడు జయించిన రాజ్యాలు, చేసిన యుద్ధాలు మొదలైన వాటిని వివరించుటయే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## 10.1 ఉపోద్ఘాతము:-

బాదామి చాళుక్యులలో అగ్రగణ్యుడు, ఆంధ్ర దేశమున వేంగీ చాళుక్య సామ్రాజ్య స్థాపకుడూ అయిన రెండవ పులకేశి ప్రాచీన భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సముపార్జించినాడు. అమలులోనున్న రాజ సంక్రమణ సాంప్రదాయముననుసరించి మొదటి కీర్తి వర్మ మరణానంతరం అతని కుమారుడైన రెండవ పులకేశి బాదామి సింహాసనమునకు పట్టాభిషిక్తుడు కావలసి యుండెను.

అయితే ఆనాడు బాదామిలో నెలకొనియున్న రాజకీయ పరిస్థితులు పులకేశి సింహాసనమధిష్టించుటకు కొంత ఆటంకము కల్గెను. పులకేశి పిన తండ్రియగు మంగళేశుడు తన కుమారునికి పట్టము కట్టుటకు సన్నాహము చేసెను. వారసుడూ, పిన్న వయస్కుడైన పులకేశి సహృదయులు, ధర్మాత్ములైన రాజోద్యోగులు అండదండలు మెండుగ సంపాదించి పిన తండ్రి పై పోరుసల్పి, తుద ముట్టించి తనకు పంక్రమించవలసిన సింహాసనమును క్రీ॥శ॥ 610లో అధిష్టించెను. స్వబాహుబల సామర్థ్యముతో రాజ్యమును సంపాదించి, స్వబాహుబల సామర్ధ్యోపార్జిత రాజ్య సంపన్నః అనే సార్ధక బిరుదమును ధరించెను. ఇతనికి 'సత్యాశ్రయ', 'మహారాజాధిరాజు', 'పరమేశ్వర భట్టారక', వల్లభ 'శ్రీ పృథ్వీ వల్లభ', వల్లభ, 'పరమభాగవత' అనే బిరుదములు కూడా కలవు.

## 10.2 శాసనాధారములు :-

పులకేశి జీవితమును గూర్చి తెలుసుకొనుటకు శాసనములే ముఖ్యాధారములు. 1. ఎక్కెరి రాతి శాసనము, ఇది పులకేశి మొదటి రాజ్య సంవత్సరాన్ని తెలియజేయును, 2. శక సంవత్సరము 534 నాటి హైదరాబాద్ తామ్ర పట్టికలు, 3. పులకేశి 5 వ రాజ్య సంవత్సరానికి తారీఖు చేయబడిన కందులగామ్ తామ్ర పట్టిక (ఈ శాసనము అసలైనది కాదనే అపవాదు కలదు), 4. మార్టూరు శాసనము. ఇది పులకేశి 8 వ రాజ్య సంవత్సరానిది, 5. విష్ణు వర్ధనుని సతారా శాసనము, 6. లోహ్నర్ శాసనము. ఇది 552న సంవత్సరానిది (నాసిక్ జిల్లా, మహారాష్ట్ర) ఇది శక సంవత్సరమేనని భావించెదరు, 7. కొప్పారం తామ్ర పట్టికలు. ఇవి పులకేశి 21 వ రాజ్య సంవత్సరానివి, 8. ఐహోలు శాసనము. ఇది శక సంవత్సరము 556కు తారీఖు చేయబడినది, 9. తుమ్మెయనూరు శాసనము, 10. చిప్లుణ తామ్ర పట్టికలు, 11. నెరూరు తామ్ర పట్టికలు. ఇవికాక మరికొన్ని రాతి శాసనములు పులకేశికి సంబంధించినట్లుగా పలువురు చరిత్రకారులు భావించారు. కళ్యాణి చాళుక్య రాజుల శాసనాల్లో ప్రత్యర్థులైన కాంచీ పల్లవుల శాసనాల్లోను సత్యాశ్రయ పులకేశిని గూర్చిన విషయాలెన్నో లభ్యమయ్యాయి. కొత్త ఆధారములు వెలుగులోకి వచ్చే కొలది చరిత్రలోనే చీకటి కోణాలు అదృశ్యమవుతాయి. సమస్యలు, చిక్కులు చక్కబడతాయి. పులకేశి పట్టాభిషేక కాలాన్ని పలువురు పరిశోధకులు పలు విధాలుగా ప్రకటించారు. అయితే గుంటూరు జిల్లాలోని మార్టూరు గ్రామంలో దొరికిన తామ్రపట్టికల నాధారముగా చేసుకొని డా॥ యన్. రామేశన్, పులకేశి క్రీ॥శ॥ 609లో పట్టాభిషిక్తుడైనాడని నిర్ధారణ చేసిరి. అయితే మంగళేశుని చివరి శాసనము క్రీ॥శ॥ 5 జనవరి 610 నాటిది కావడం వల్ల పులకేశి క్రీ॥శ॥ 610లో మాత్రమే రాజ్యానికి వచ్చినాడు అని తెలియుచున్నది.

## 10.3 పులకేశి జీవితంలో ముఖ్య ఘట్టాలు:-

పిన తండ్రియగు మంగళేశునితో పులకేశి పోరాటము రాజ్యమున కలవరము లేవనెత్తెను. రాజధానిలోని ఉన్నత ఉద్యోగుల నుండి సుదూరంలో పాలించే సామంతుల వరకు ద్వంద్వ విధానమారంభించారు. ఎవరు గెలుపొందెదరో వారికే వీరు వాసోహములగుదురు. యుద్ధ కాలమందు ఉద్యోగుల ఉద్దేశములు నమ్మశక్యముగా ఉండవు. ఆ కాల మందు శత్రువులను, మిత్రులను, ఆశ్రితులను, వేగుల వారిని గుర్తించుట మిక్కిలి కష్టము. స్వబాహు బల సంపన్నుడైన యువ కిశోరము పులకేశి పిన తండ్రిని చంపి, పిత్రార్జితమైన రాజ్యానికి వారసుడయ్యెను. రాజ్యమును జయించుటకు నిత్యము ప్రచ్ఛన్న పరోక్ష యుద్ధమవసరమగును.

## 10.4 ఐహోలు శాసనములోని వివరాలు:-

పులకేశి గావించిన యుద్ధములు, వాటి వలన అతనికి సంక్రమించిన రాజ్యాలు, ధరించిన బిరుదాలు, ఎదుర్కొన్న శత్రువుల వివరాలు, అతని ఆస్థాన కవి, పండితుడైన రవి కీర్తిచే వ్రాయబడిన ఐహోలు ప్రశస్తి యందు చక్కగా వర్ణించబడ్డాయి. కవి చమత్కారములు, పొగడ్తలు, పక్షపాత వ్యాఖ్యానాలు మినహాయించి మిగిలిన వాటిని గ్రహిస్తే పులకేశి నిజ శౌర్య, ధైర్య రూప నిరూపణ చేయగలదు. తొలుదొల్త పులకేశి పై కాలుదువ్వి కయ్యమునకు తలపడిన వారు - అప్పాయిక గోవింద అనెడి వారు. వీరు భీమారధి (నేటి భీమానది) ఉత్తర ప్రాంతము వారు. రాజనీతిలోని సామ, దాన, భేద, దండ అనెడి చతుర్విధోపాయములలో 'భేద'మును ప్రయోగించి, గోవిందునితో సఖ్యము చేసి, పులకేశి వారిని వేరు వేరుగా ఓడించెను. దక్షిణ మహారాష్ట్ర ప్రాంతము నుండి దండెత్తిన

అప్పాయిక గోవింద రాష్ట్ర కూట కుటుంబీకులు కావచ్చును. బాదామి చాళుక్యులకు బనవాసిలోని కదంబులకు సఖ్యత లేకుండెను. అందువల్ల పులకేశి కదంబులను రూపుమాపుటకు నమ్మకస్తులైన అలుపులకు కదంబ సామ్రాజ్యంలో ఎక్కువ భాగమైన కదంబ మండలాన్ని సేంద్రకులకు బనవాసి భాగానికి చెందిన నాగరఖణ్ణను అప్పగించెను. కదంబుల రాజధాని గురించి ఐహోలు ప్రసక్తి చక్కగా వర్ణించినది. దీనిని బట్టి ఈ నగరము వైభవోపేతమైనదే గాక చక్కని రక్షణ కలిగినదని తెలియుచున్నది. ఈ మార్పు వల్ల పులకేశి అలూపులను గాంగులను ముట్టడించెను. అలూపుల పాలనా ప్రదేశమును గూర్చి పలువురు అభిప్రాయమున భిన్నమైనవారు. డా॥ రమేశన్ గారు భావించినట్లు మార్యూరు వంశానికి చెందినవాడు కాదు. పులకేశి అలూపుల అనంతరము గంగులను జయించెను. అయితే ఓడిపోయిన గంగా పాలకుడెవరో యింతవరకు తెలియదు. గంగులు తలాక్కాడ్ పాలకులు. వీరిలో దుర్వినీత అనే గంగరాజు తన కుమార్తెను పులకేశికి యిచ్చి వివాహము చేసెను. దుర్వినీత పల్లవులకు తన సామ్రాజ్యములోని భాగమైన కొంగునాడును కోల్పోయెను. బలవంతుడైన పులకేశితో వియ్యమాడి శత్రువులైన పల్లవులను కయ్యమున గెలువవలెనని భావించెను. అందుకతడు చాళుక్య సైన్యమును ఉపయోగించుకొనెను.

## 10.5 పూరీ - విజయము:-

పశ్చిమ దక్కన్‌లో పలు విజయములార్జించిన పులకేశి ఉత్తర దక్కన్ పై ఉద్భవించెను. అప్పుడు కీర్తి వర్మచే ఓడింపబడిన మౌర్యులు కొంకణ ప్రాంతమును ఏలుచుండిరి. మంగళేశుని మరణానంతరము మౌర్యులు స్వతంత్రులగుటకు ప్రయత్నించిరి. ఇది పులకేశికి అవమానమయ్యెను. వెంటనే పశ్చిమ తీరాన వున్న మౌర్యుల రాజధాని యగు పూరీని ముట్టడించెను. యీ ముట్టడిలో పులకేశి నౌకాదళమును ఉపయోగించెను. దీనితో మౌర్యులకు స్వతంత్రించే అవకాశము అంతరించెను. పులకేశి చేత పరాజయము పొందిన మౌర్య రాజును గుర్తించుట సాధ్యము కాదు. మౌర్యుల ముఖ్య పట్టణమైన పూరీని గురించి సరియైన అవగాహన లేదు. దీనిని ముంబయి సమీపములోని నేటి ఘరపూరీ (ఎలిఫెంటా ద్వీపము) అని మహారాష్ట్ర యందలి కొలబా జిల్లా యందలివి జంజీరా సమీపంలోని రాజపురీ అని కొందరు గుర్తించారు. మౌర్యులకు సంబంధించిన చారిత్రకాధారాలు, గోవా సమీపమున లభ్యమగుటచే వీరు కొంకణ ప్రాంతపు గోవా పాలకులేనని నిర్ధారణ అగుచున్నది. పులకేశి విజయ పరంపరలు పొరుగు రాజ్యాల పాలకులలో నిరాశను రేపినది. అటువంటి వాటిలో లాట, మాళవ, గూర్జర దేశాలు, వీటి పాలకులు తమంతట తామే చాళుక్య సామ్రాజ్యంలో కలసిపోయారు. దీని నిమిత్తమై చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు కలిగియున్నారు. సకల ఉత్తర పథ నరేశ్వరుడూ, పుష్యభూతి వంశస్థుడు అయిన శ్రీ హర్షవర్ధనునితో సఖ్యము కుదరక, పులకేశిని ఆశ్రయించి వుండవచ్చును. లేదా తమంతట తామే చాళుక్య ప్రభువునకు దాసోహమయి వుండవచ్చు.

## 10.6 శ్రీ హర్షునితో పోరాటము:-

పుష్యభూతి వంశస్థుడు 'సకలోత్తర పథ నరేశ్వరుడు' అయిన శ్రీ హర్షుడు, పులకేశి కాలంలో స్థానేశ్వరమును రాజధానిగా పాలించుచుండెను. వీరికి నర్మద సరిహద్దుగా ఉండెను. బాదామి చాళుక్యుల రాజ్యపాలనలో శ్రీ హర్షుని పై పులకేశి విజయము అతి ముఖ్యమైనదిగా భావించవచ్చు. పులకేశి తరువాత రాజులే గాక రాష్ట్ర కూటులు, తరువాతి చాళుక్యులు యీ సంఘటనను వారు వందలాది శాసనాలలో ఉల్లేఖించారు. పులకేశి శ్రీ హర్షుని మధ్య జరిగిన పోరాటాన్ని ఐహోలు ప్రశస్తి చక్కగా వివరించినది. శ్రీ హర్షుడిని యుద్ధమున ఓడించి నర్మదను దాటి రాకుండా తరిమికొట్టి 'పరమేశ్వర' అనే బిరుదాన్ని పులకేశి ధరించెను. ఆనాడు పర్యటనలో నున్న చైనా యాత్రికుడైన హువాన్ చాంగ్ ఈ సంఘటనను తన వ్రాతలలో పేర్కొనెను. 'హర్ష చరిత్ర'లో ఈ సంఘటన వ్రాయకపోవడం, బాణుని స్వామిభక్తి పరాయణతే గాని మరొకటి కాదని భావించవచ్చు. పరులచే పోషించబడే పండితులైన పోషకుల అపజయాలను, అవమానాలను, అవగుణాలను పేర్కొని మనలేరు కదా!' వీరి మధ్య జరిగిన యుద్ధం యెక్కడ జరిగెనన్నది చరిత్రకారులకు వివాదాంశమైనది. డా॥ వి.ఎ. స్మిత్ నర్మద ఒడ్డు పై జరిగి యుండవచ్చునని తలంచగా, డా॥ ఆర్.సి. మజుమ్‌దార్ హర్షుని సామ్రాజ్యం ఎప్పుడైనా నర్మద వరకు వ్యాపించిందనటానికి ఆధారాలు లేవని భావించాడు. అంతేకాకుండా హుయాన్

త్సాంగ్ పరిశీలన ప్రకారము ఆనాడు మాళము, బుందేల్ ఖండ్ స్వయం రాజ్యాలుగా ఉండేవి. లాటులు, మాళవులు, గూర్జరులు హర్షుని ఆధీనములోనున్నట్లు కూడా ఆధారములు కనిపించవు. పై ఆధారాలను బట్టి పులకేశి హర్షునితో నర్మదకు ఉత్తరపుటొడ్డునే తలపడినట్లు తెలియుచున్నది. బహుశ శ్రీ హర్షుడు దక్షిణ ప్రాంతాన్ని ఆక్రమించ ప్రయత్నించగా పులకేశి అతనిని ఓడించి తరిమికొట్టి యుండవచ్చు. హర్షుని గజబలం పులకేశి వలన విరివిగా నష్టపోయెను. అయితే ఈ యుద్ధమెప్పుడు జరిగెను? అను ప్రశ్నకు అనేక సమాధానములు కనిపించుచున్నవి. హర్షుని దక్షిణ దేశ దండయాత్రను ఉటంకించే విషయాన్ని వెలుగులోకి తెచ్చిన ఆచార్య నీలకంఠ శాస్త్రి పండితుడు ప్రపంచానికి ఎంతో మేలు చేశారు. దీని ప్రకారము హర్షుడు కుంతల చోళ మధ్య దేశము కాంచీని జయించెను. దీనికి మరో ముఖ్యమైన ఆధారము గడ్డమనే శాసనము. ఈ శాసనములో చెప్పబడిన శీలాదిత్య హర్షుడని, అతనిచే ఓడింపబడిన మహేంద్ర మొదటి పల్లవ మహేంద్ర వర్మేనని ఆచార్య నీలకంఠ శాస్త్రి గారి అభిప్రాయం. నీలకంఠ శాస్త్రి గారితో ఏకీభవించని డా॥ మజూమ్‌దార్ గడ్డమనె శాసనంలోని శీలాదిత్యుణ్ణి లాట చాళుక్య యువ మహారాజశ్రీయ శీలాదిత్యునిగను, మహేంద్రను పల్లవ రాజైన ద్వితీ య మహేంద్ర వర్మగాను గుర్తించెను. ఐహోలు ప్రశస్తి క్రీ॥శ॥ 634 సరిపడే శక సంవత్సరము 556కు తారీఖు వేయబడుటచే పులకేశి శ్రీ హర్షుల మధ్య యుద్ధం అంతకుముందే జరిగి ఉండవచ్చునని భావించారు. మొత్తం మీద వివిధ అభిప్రాయాలను రెండు ముఖ్యమైన వాదాలుగా విభజింపవచ్చు. మొదటి యుద్ధము క్రీ॥శ॥ 612 - 13లకు ముందు గాని, రెండవ యుద్ధం క్రీ॥శ॥ 630 - 634 సంవత్సరముల మధ్య గాని జరిగియుండవచ్చునేది వీరి అభిప్రాయం.

## 10.7 ప్రాచ్య దక్కను విజయము:-

మహారాష్ట్రమందు సుస్థిరతను ఏర్పరచుకుని పులకేశి ప్రాచ్య దక్కన్ ప్రాంతాన్ని జయింప తలచెను. ఎట్టి శ్రమ లేకనే కోసల (నేటి మధ్య ప్రదేశ్ నందలి) రాయ్‌పూర్, బిలాస్ పూర్ జిల్లాలు, (ఒరిస్సాలోని శంభల్ పూర్ జిల్లా) ను ఆక్రమించెను. పాండు వంశపు రాజైన మహాశివ గుప్త అనబడే బాలార్జున శివగుప్త పులకేశికి లొంగియున్నారని డా॥ సర్కారు అభిప్రాయం. దీనితోపాటు కళింగ (ఒరిస్సా రాష్ట్రంలోని బెర్హం పూర్, గంజాం జిల్లాలోని కొంత భాగము, ఆంధ్ర రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు) రాజ్యాన్ని కూడా కలుపుకొనెను. కళింగను ప్రాచ్య గాంగులు పాలించుచుండెను. గాంగుల శకము సమస్యాపూరితమగుట వలన ఆనాటి పాలకునిని గుర్తించుట కూడా సమస్యయే అగును.

## 10.8 పిష్టపుర విజయము :-

కళింగలోని గాంగులను వశపరుచుకొన్న పిమ్మట రాజకీయ బాంధవ్యము కలిగియున్న పిష్టపుర (పిఠాపురము, తూర్పు గోదావరి జిల్లా) పాలకులను కుడా నిర్జించెను. కోసల కళింగాధిపతుల వలె గాక పిష్టపుర పాలకుడు పులకేశిని ఎదిరించెను. అందువల్ల కొల్లేరు సమీపమున ఘోర యుద్ధము చేయవలసివచ్చెను. యుద్ధంలో నిర్జితులైన వారి రక్తంతో కొల్లేరంతా అరుణమైనట్లు రవికీర్తి వర్ణించాడు. ఐహోలు ప్రశస్తి వలన నిహతుడైన శత్రురాజును గూర్చి ఏమియు తెలియనందున ఆనాడు కృష్ణా, గోదావరి ప్రాంతములో పాలించిన విష్ణుకుండిన రాజులలో ఎవరైన పులకేశిని ఎదిరించి పోరి నిహతుడై ఉండవచ్చునని చరిత్రకారుల భావన. పిష్టపుర ఆక్రమణ పులకేశి మార్టూరు శాసనము వలన నిర్ధారణ అగుచున్నది. పిష్టపురాన్ని ఆక్రమించిన పులకేశికి సన్నిహితుడూ, సమర్థుడూ, విశ్వాసపాత్రుడూ అయిన అలూక మహారాజును క్రొత్తగా ఆర్జించిన ఆంధ్ర ప్రాంతమును అప్పగించినట్లు మార్టూరు శాసనము వల్ల తెలియుచున్నది.

## 10.9 దక్షిణమున పల్లవులతో పోరు :-

ఆంధ్ర ప్రాంతమున విష్ణు కుండినుల రాజ్యాన్ని ఆక్రమించిన పిమ్మట వారి సరిహద్దు రాజులైన కాంచీ పల్లవుల పై దండెత్తెను. పులకేశి విజయ పరంపరలు రాజ్యాక్రమణలు బలవంతులైన పల్లవులకు ఆందోళన కలిగించెను. వారు సరియైన అదను కొరకు కారణములు వెదకుచుండగా, విష్ణు కుండినులు పరాజయంతో వారికి ఒక రాజకీయ కారణమేర్పడెను. సరిహద్దు

సమస్యచే చాళుక్య పల్లవుల మధ్య యుద్ధమయ్యెను. అనేక యుద్ధములలో తన షట్ బలములను ఉపయోగించి పులకేశి పల్లవుల పై విజయుడయ్యెను. భయ భ్రాంతులైన పల్లవులు కాంచీపుర నగర కుడ్యముల వెనుక తలదాచుకొనెనట. స్వబాహుబల సామర్థ్యోపార్జిత రాజ్యము నందు విధేయులు, విశ్వాసపాత్రులు, బంధువులకు తగిన రీతిన సామంత రాజధానిగా తన తమ్ముడైన కుబ్జ విష్ణు వర్ధనునికి అప్పజెప్పెను. కడకు పల్లవులతో వైరము చాళుక్యులకు తీరని నష్టము కలిగించెను. పులకేశి కాలమున కోల్పోయిన రాజ్యమును తిరిగి తెచ్చుకొనుటయే గాక, చాళుక్యులకు తగిన శాస్తి చేయవలెనని పల్లవులు దీక్ష వహించారు. దీని ఫలితంగా పరియాల, మణి మంగళ, సూరమార అనే ప్రాంతములందు జరిగిన యుద్ధములలో పల్లవులు చాళుక్యులను చిత్తుగా ఓడించి, వారి ముఖ్య పట్టణమైన వాతాపిని తగులబెట్టిరి. పులకేశిచే హింసకు గురి కాబడిన మహేంద్ర కుమారుడైన నరశింహ వర్మయే వాతాపిని క్రీ॥శ॥ 642 - 43లో తగులబెట్టి 'వాతాపి కొండ' అనే బిరుదాన్ని ధరించెను. ఈ సంఘటన తరువాత పులకేశిని గూర్చిన ప్రస్తావన చాళుక్య శాసనాలలో కానరానందున అతడు **వాతాపి** ముట్టడిలో మరణించినట్లు భావించవచ్చును.

## 10.10 విదేశాలతో సంబంధాలు:-

పర్షియన్ చరిత్రకారుడైన తబరి క్రీ॥శ॥ 838 - 923 రచనల వలన పర్షియన్ పాలకుడైన రెండవ ఖుస్రూ పెర్‌విజ్ క్రీ॥శ॥ 609 - 628 లో భారతదేశపు రాజైన పర్‌మిన్ మధ్య దౌత్య సంబంధాలుండేవని తెలియుచున్నది. 'పర్‌మిన్' పరమేశ్వర బిరుదాంకితుడైన రెండవ పులకేశి అని చరిత్రకారులు భావించారు. పర్షియన్ రాజుకు అతని కుమారులకు పులకేశి ఎన్నో విలువైన బహుమతులు పంపినట్లు తబరి వ్రాశాడు. దానికి గుర్తింపుగా పర్షియన్ రాజు తన దూతలను చాళుక్య రాజధానికి పంపెను. ఈ సంఘటనను అజంతా గుహ సంఖ్య 1 లో చిత్రీకరించబడినదని పండితుల అభిప్రాయం, దీనిని బట్టి రెండవ పులకేశి విదేశాలతో **దౌత్య** సంబంధాలను కలిగియున్నట్లు తెలియుచున్నది.

## 10.11 రూప గుణగణాలు:-

పులకేశి గుణగణాలను, ధైర్య సాహసాలను ఐహోలు శాసనము చక్కగా వర్ణించినది. పులకేశి చాళుక్య కులమనే సభ స్థలానికి గుణగభస్తిమాలను యిచ్చే భాస్కరుడు స్వామిమహాసేన పాదానుధ్యాతుడు. మానవ్యస గోత్రుడు, హారితీ ప్రియపుత్రుడు, మాతా పితృల పాదానుధాత్యుడు, రిపుజన మృగకుల భయజనన వాహన వరచరణ అమలనయనుడు. అమలనయనుడైన పులకేశి జంతుమూకల వంటి శత్రుమూకలకు చూపులతోనే భయభ్రాంతులను కలుగజేసినాడు. సార్వోగ్రదంష్ట్రప్రతాపవీర్య వేగోద్ధతా నృపతిసింహ సింహవిక్రాంతుడు. స్వబాహుబల సామర్థ్యోపార్జిత రాజ్యసంపన్నుడు. నయవినయ విజ్ఞానదాన, దయాదాక్షిణ్య, మాధుర్య, గాంభీర్య వీర్య, త్యాగ, బ్రాహ్మణ్యతాది గుణములు గలవాడు. కీర్తి తిలకభూతుడు. మంచిని స్మరించి చెడును విస్మరించేవాడు. సంకృతం స్మర్తరిః దుష్కృతం విస్మర్తః ఐహోలు శాసనం పులకేశి రూప గుణ స్వభావాల్ని వర్ణించింది. నిరూపహత్ పంచేంద్రియ శరీరుడు, శరదమల శశిలాంఛన మ[illegible] సంహతి ధవళ చాయోపహసిత యశస్సుడు, పవన చరిత ఉత్తుంగ భంగ తరంగావళి సహస్ర కీర్ణ జలనిధి వలయతి క్రాంతరిపు మండలడు.

## 10.12 ప్రశ్నలు :-

1. చాళుక్యులెవరు?
2. చాళుక్యనామము వివిధ రూపాల్ని వివరించుము?
3. చాళుక్యుల చరిత్ర రచనకు తోడ్పడే వివిధ శాసనాల్ని పేర్కొనుము?
4. రెండవ పులకేశి దిగ్విజయములను పేర్కొనుము?
5. రెండవ పులకేశి రూప గుణగణాల్ని వర్ణించుము.

## 10.13 ఉపయుక్త గ్రంథాలు:-


1. Dr. Venkataramanayya, N. - The Chalukyas of Vengi Madras, 1950
2. Kishna Rao B.V. - History of the Eastern Chalukyas of Vengi, Hyderabad, 1972.
3. Yazdani, G - The early History of the Deccan 2 Volumes (ed) Oxford University Press London 1960.


ఏలూరి కుమారస్వామి

పాఠం - 11

# వేంగీ చాళుక్యులు రాష్ట్రకూట రాజకీయ సంబంధాలు

## CHALUKYAS OF VENGI THEIR POLITICAL RELATIONS WITH RASTRAKUTAS

ముఖ్యాంశాలు:-

11.0 లక్ష్యం

11.1 ఉపోద్ఘాతం

11.2 మొదటి విజయాదిత్యుడు - మొదటి కృష్ణుడు

11.3 నాల్గవ విష్ణువర్ధనుడు - రెండవ గోవిందుడు

11.4 రెండవ విజయాదిత్యుడు

11.5 మొదటి అమోఘ వర్షుడు

11.6 గుణగ విజయాదిత్యుడు - మొదటి అమోఘ వర్షుడు

11.7 మొదటి చాళుక్య భీముడు - రెండవ కృష్ణుడు

11.8 రెండవ అమ్మరాజు, దానార్ణవులు - మూడవ కృష్ణుడు

11.9 ప్రశ్నలు

11.10 ఉపయుక్త గ్రంథాలు

## 11.0 లక్ష్యం:-

వేంగీ చాళుక్యులు రాష్ట్ర కూటుల మధ్య జరిగిన యుద్ధాలు, ఒప్పందాలు, వైవాహిక సంబంధాలను గూర్చి తెలియజేయుట ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## 11.1 ఉపోద్ఘాతము:-

బాదామి చాళుక్యులకు ఆది నుంచి అండగ నిలిచి విధేయులైన సామంతులుగా ఉండే రాష్ట్ర కూటులు క్రీ॥శ॥ 6 వ శతాబ్దంలో చాళుక్యుల్ని ధిక్కరించి స్వతంత్రించారు. దంతి దుర్గ నాయకత్వమున రెండవ కీర్తి వర్మను ఓడించి, సింహాసనాన్ని ఆక్రమించి కర్ణాటక పై రాజ్యాధికారాన్ని పొందారు. అప్పటికి బాదామి చాళుక్యులతో సత్ సంబంధాలు కలిగి వుండి వేంగీ చాళుక్యులకు రాష్ట్ర కూట రాజ్యావతరణ రాజకీయ భయాన్ని కలిగించెను.

బాదామి చాళుక్యులకు బంధువులైన వేంగీ చాళుక్యులకు రాష్ట్ర కూటులు బద్ధ శత్రువులయ్యేను. వేంగీ చాళుక్యులు రాష్ట్రకూటుల మధ్య రాజ్య విస్తరణ కొరకు అధికారం కొరకు కనీసం రెండు శతాబ్దముల పోరు జరిగెను. రాజకీయ సుస్థిరత (Political Stability) కొరకు అధికార సంతులనం (Balance of Power) కొరకు ఎన్నో యుద్ధాలు, సంధులు, ఒప్పందాలు, ఒడంబడికలు, వివాహాలు జరిగెను. రాష్ట్రకూట రాజయిన దంతిదుర్గ పశ్చిమ చాళుక్యుల అధికారాన్ని ధిక్కరించి కంచి, కోశల, కళింగ, శ్రీశైల ప్రాంతాలను జయించినప్పటికి తన సమకాలీన వేంగీ చాళుక్య రాజు అయిన మొదటి విజయాదిత్యుని జోలికి పోలేదు. ఇతని కాలంలో వేంగీ చాళుక్యులు రాష్ట్రకూటుల మధ్య ఎటువంటి సంఘర్షణలు జరగలేదు.

## 11.2 మొదటి విజయాదిత్యుడు - మొదటి కృష్ణుడు:-

రాష్ట్రకూట రాజ్యములో దంతిదుర్గుని మరణానంతరం అతని పిన తండ్రి మొదటి కృష్ణుడు సింహాసనమధిష్టించెను. అప్పటికే పెద్ద వయస్కుడైన మొదటి కృష్ణునికి బాగా ఎదిగిన గోవిందుడనే కుమారుడున్నాడు.

మొదటి కృష్ణుడు వేంగీ చాళుక్యులతో వైరము పెంచుకున్నట్లు తన కుమారుడైన గోవిందుని చాళుక్య భూములపై యుద్ధానికి పంపినట్లు క్రీ॥శ॥ 769లో యివ్వబడిన అల్సా తామ్ర పట్టికల వలన తెలుస్తుంది. గోవిందుని ధాటికి తాళలేని చాళుక్య విజయాదిత్యుడు తన ధనాగారాన్ని, కొంత సైన్యాన్ని భూభాగాన్ని రాష్ట్రకూటులకు వదులుకున్నాడు. రాష్ట్రకూటులు చాళుక్యులపై దండెత్తటానికి కారణాలు కనిపించవు. బహుశా మొదటి కృష్ణుడు సామ్రాజ్యాన్ని విస్తరించుకొనేందుకు తన బలాన్ని ప్రదర్శించుకునేందుకు గోవిందుడిని దండయాత్రలకు పంపియుండవచ్చు.

## 11.3 నాల్గవ విష్ణు వర్ధనుడు - రెండవ గోవిందుడు:-

వేంగీ చాళుక్యుల రాజ్యంలో మొదటి విజయాదిత్యుని మరణానంతరం అతని కుమారుడైన నాల్గవ విష్ణువర్ధనుడు రాజ్యానికి వచ్చాడు. క్రీ॥శ॥ 772 లో రాష్ట్రకూట రాజైన మొదటి కృష్ణుడు మరణించగా అతని పెద్ద కుమారుడు రెండవ గోవిందుడు సింహాసనానికి వచ్చెను. చిన్న కుమారుడైన ధ్రువనిరుపమ ధారావర్షుడు తన అన్న అధికారాన్ని ధిక్కరించి అనేక రాజోద్యోగులు, సామంతుల సహాయంతో కల్లోలాన్ని లేవనెత్తెను. ఒంటరివాడైన రెండవ గోవిందుడు వేంగీ చాళుక్య రాజైన నాల్గవ విష్ణువర్ధనుడ్ని సైనిక సహాయమర్థించెను. రాష్ట్రకూట అంతఃకలహములు సామంతులందరికి సంతోషము కలిగించెను. దుర్మార్గుడైన ధృవుని కన్నా రెండవ గోవిందుడే మేలని తలంచి నాల్గవ విష్ణువర్ధనుడు గోవిందుడి పక్షమున తన సైన్యాన్ని పంపెను. అతనికి మద్దతుగా మాళవ, కంచి, గంగా వడి పాలకులు కూడా పోరాడిరి. తొలి విజయం గోవిందుడికే దక్కినను అంతిమ విజయం ధృవుడ్నే వరించెను. క్రీ॥శ॥ 780 నాటికి ధృవుడు అన్నను తరిమి కొట్టి రాష్ట్రకూట సింహాసనమధిష్టించెను. రాష్ట్రకూట ధృవుడు రెండవ గోవిందుని పక్షమున పోరాడిన వారినందరిని శిక్షించెను. వారిలో వేంగీ చాళుక్య నాల్గవ విష్ణు వర్ధనుడు ముఖ్యుడు. వేములవాడ చాళుక్య నాయకుడైన మొదటి అరికేసరి నాయకత్వమున ధృవుడు వేంగీపై సైన్యాన్ని పంపెను. ఈ యుద్ధ వివరములు పర్భనీ తామ్ర పట్టికలలోను, పంప విరచితమైన 'విక్రమార్జున విజయం' పీఠికలోను వివరించబడింది.

యుద్ధానంతరం జరిగిన ఒడంబడికల వల్ల విష్ణు వర్ధనుని కుమార్తెయగు శ్రీ శీలమహాదేవిని రాష్ట్రకూట ధృవుని కిచ్చి పెండ్లి చేసెను. చులకన చూపని ధృవుడు శీల మహాదేవిని తన పట్టమహిషిగా చేసుకొని గౌరవించెను. ఈ రాజకీయ వియ్యము వలన తొలిసారిగా చాళుక్య రాష్ట్రకూట రాజ వంశాల మధ్య క్రీ॥శ॥ 806 వరకు శాంతి వాతావరణం ఏర్పడింది.

## 11.4 రెండవ విజయాదిత్యుడు:-

నాల్గవ విష్ణు వర్ధనుని మరణానంతరం అతని పెద్ద కుమారుడైన రెండవ విజయాదిత్యుడు వేంగీ సింహాసనమధిష్టించెను. అయితే తమ్ముడైన భీమసాళుకె తన అధికారాన్ని ధిక్కరించి సింహాసనమెక్కదలచి రాష్ట్రకూట రాజైన మూడవ గోవిందుడ్ని

ఆశ్రయించెను. రాష్ట్రకూటుల రంగ ప్రవేశంతో వేంగిలో రాజకీయ రంగం మరింత ఉద్రిక్తమయ్యెను. ఈ అంతఃకలహము వెలుపలికి పొక్కి అన్నదమ్ముల మధ్య మరింత వైరమేర్పడెను. కనీసం 12 సంవత్సరాలు సాగిన ఈ కుటుంబ పోరాటంలో భీమసాళుకె అధికారాన్ని చేపట్టినను విజయాదిత్యుడ్ని పూర్తిగా జయించలేక పోయెను. శత్రు కూటమిని తరిమి కొట్టుటకు విజయాదిత్యుడు 108 యుద్ధాలు చేసి ఆ ప్రదేశంలో 108 నరేంద్రేశ్వర శివాలయాల్ని కట్టించెను. భీమసాళుకె అదృష్టము రాష్ట్రకూట గోవిందుడి అస్తమయంతో 814 తో అంతరించెను.

## 11.5 మొదటి అమోఘవర్షుడు:-

మూడవ గోవిందుడి మరణానంతరము పిన్న వయస్కుడైన మొదటి అమోఘవర్షుడు రాజ్యమునకు వచ్చెను. చిన్న రాజుకు సామంతులు విధేయత చూపలేక తిరుగుబాటు చేసెను. రాష్ట్ర కూటుల వేంగీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదు. అందువల్ల భీమసాళుకె బలము సన్నగిల్లెను. ఇదే మంచి అదునుగా తలంచిన రెండవ విజయాదిత్యుడు హైహేయ సోదరుడైన నృపరుద్రుని సహాయమున రెండు సంవత్సరాలు భీమసాళుకెతో పోరాడి క్రీ॥శ॥ 818 లో దేశమునుండి తరిమి కొట్టెను. పదవీత భష్టుని చేయుటలో రాష్ట్రకూటులు నిర్వహించిన పాత్రను విస్మరింపజాలని విజయాదిత్యుడు రాష్ట్రకూట రాజ్యము పై కక్ష తీర్చ ప్రయత్నించెను. అదే సమయంలో రాష్ట్రకూట రాజ్యము పై శత్రువులు కన్నులేసి ఉండిరి. ఇది యుద్ధమునకు అదను కాదని గ్రహించిన మొదటి అమోఘవర్షుడు విజయాదిత్యునితో మంతనాలు నడిపి స్నేహ సంబంధముల కొరకు ప్రయత్నించి కలత కృత్యుడయ్యెను. స్నేహ సంబంధములను శాశ్వతం చేసుకొనేందుకు అమోఘవర్షుడు తన చిన్నాన్న అయిన ఇంద్రుని కుమార్తె శీలమహాదేవిని, విజయాదిత్యుని కుమారుడైన కలి విష్ణు వర్ధనునికిచ్చి పెండ్లి చేసెను. కలి విష్ణు వర్ధనుడు చాళుక్య వంశ వృక్షములో అయిదవ విష్ణు వర్ధనుడు. ఆతనికి శీల మహాదేవి వలన కలిగిన నలుగురు కుమారులలో పెద్దవాడైన విజయాదిత్యుడు రాజ్యమునకు వచ్చి గుణగ విజయాదిత్యునిగా ప్రసిద్ధి చెందెను.

## 11.6 గుణగ విజయాదిత్యుడు - మొదటి అమోఘవర్షుడు:-

గుణగ విజయాదిత్యుడు తల్లి వలన రాష్ట్రకూట రాజైన మొదటి అమోఘ వర్షునికి స్వయాన మేనల్లుడే. వారికి రక్త సంబంధము వలన బంధుత్వమే గాని వైరము లేదు. అయితే రాజకీయములందు రక్త సంబంధము భక్తమునే కళ్ళచూచును. గనుక వారి మధ్య వైరము అనివార్యమయ్యెను. క్రీ॥శ॥ 866 నాటికి గుణగ విజయాదిత్యుడు అమోఘవర్షుని సామంతునిగా చెప్పబడినాడు. మూడవ ఇంద్రుని బగుమార శాసనంలో చాళుక్యులకు చెందిన 'స్తంబ' అనే ప్రదేశమును అమోఘవర్షుడు ధ్వంసము చేసినట్లు చెప్పబడినది. ఈ ప్రదేశము నేటి ప్రకాశం జిల్లా యందలి కంబముగా గుర్తించవచ్చును. నాల్గవ గోవిందుని కాంబే, సంగిలి శాసనాలలో వింగవల్లి యుద్ధంలో చాళుక్యులను అమోఘవర్షుడు చిత్తుగ ఓడించి అనేక మందిని చంపినట్లు చెప్పబడింది. రాజ్య సరిహద్దులే ఇరు రాజ్యముల మధ్య రణరంగమునకు కారణమయ్యెను. గుణగ విజయాదిత్యుడు ఓడిపోవుటతో పాటు తన స్వాతంత్ర్యమును కూడా కోల్పోయి రాష్ట్ర కూట సామంతుడయ్యెను. సాజన్ తామ్ర పట్టికల వలన గుణగ విజయాదిత్యుడు విధేయుడై వారి ఆజ్ఞలను శిరసావహించెను. రాష్ట్రకూటులు సామంతులైన గాంగులు అవిధేయులై తిరుగుబాటు చేయగా వారిని అణచుటకై అమోఘవర్షుడు గుణగ విజయాదిత్యుని పురమాయించెను. గుణగ విజయాదిత్యుడు సేనతో గంగానది చేరు వేళ నళోంబాది రాజు మొదటి పోషల్చోర ఉరఫ్ మంగి సేనతో దారినడ్డగించెను. చాళుక్య సేవ మంగిని తరిమికొట్టెను. ఈ పోరాటములోనే మహావీరుడు, సైన్యాధిపతియైన పండ రంగని కెడియరాజు ఘోరముగా పోరాడి అసువులు బాసెను. గుణగ విజయాదిత్యుడు గాంగులను తరిమికొట్టి అమోఘవర్షునికి అఖండ విజయమును చేకూర్చెను. గాంగులు చేయునది లేక రాష్ట్రకూటులతో సంధికి సిద్ధమయ్యెను. రాష్ట్రకూటులకు విధేయుడై గాంగ రాజైన నీతి మార్గ రణ విక్రముడు తన రాజ్యమును ఏలుకొనునట్లు నిర్ణయమయ్యెను. ముందుచూపు గల అమోఘవర్షుడు తన కుమార్తెయగు అబ్బలబ్బను నీతి మార్గ రణ విక్రమాని చిన్న కుమారుడైన మొదటి గుణదుత్త రంగబూతుగకు ఇచ్చి పెండ్లి చేసి కయ్యమును వియ్యముగా చేసెను.

## 11.7 మొదటి చాళుక్య భీముడు - రెండవ కృష్ణుడు:-

గుణగ విజయాదిత్యుని మరణానంతరం అతని చిన్న తమ్ముని కుమారుడైన (యువ మహారాజు విజయాదిత్య) మొదటి చాళుక్య భీముడు వేంగి సింహాసనమధిష్టించెను. విజయాదిత్యుని మరణానంతరం వేంగీ రాజ్యంలో పరిస్థితులు అల్లకల్లోలముగా ఉండెను. రాష్ట్రకూటులు ఒక వైపు, చాళుక్యదాయాదులు మరొక వైపు సింహాసనమాక్రమించుటకు ప్రబలమైన ప్రయత్నాలు చేయుచుండిరి. అట్టి తరుణమున 'ద్రోహార్జున' నామధేయుడైన చాళుక్య భీముడు పరిస్థితులను సాహసముతో ఎదుర్కొని సింహాసనమధిష్టించినట్లు ఏడేరు తామ్ర పట్టికల వలన తెలియుచున్నది. చాళుక్య భీముడు పాలించిన 30 సంవత్సరములలో కనీసం 360 యుద్ధాలు చేసినట్లు మల్లప దేవుని పిఠాపురం శాసనం వల్ల తెలియుచున్నది. ఈ శాసనంలోని అతిశయోక్తులు కవి చమత్కారములు తీసివేసినప్పటికీ ఇతడు ఎన్నో యుద్ధాలు చేసి వుంటాడని భావించవచ్చును. ఇతడు చేసిన యుద్ధాలలో కనీసం రెండు రాష్ట్రకూటుల పై జరిగినట్లు తెలియుచున్నది. గుణగ విజయాదిత్యుని మరణానంతరం చెలరేగిన రాజకీయ అలజడులలో భీమునితో పాటు అనేక మంది దాయాదులు సింహాసనం కొరకు ప్రయత్నించిరి. వారిలో యుద్ధమల్లుడు చాలా ముఖ్యుడు. ఇతడు రాష్ట్రకూటుల సహాయమర్థించి సింహాసనం కొరకు ఎంతో ప్రయత్నించెను. అయితే చాళుక్యభీముడు తన చాకచక్యంతో యుద్ధమల్లుని, అతనిని సమర్థించిన రాష్ట్రకూటులను ఓడించి తరిమి వేసెను. ఇది మొదటి రాష్ట్రకూట యుద్ధంగా భావించవచ్చు. ఎన్నో కష్టముల మధ్య ఎట్టకేలకు క్రీ॥శ॥ 892లో చాళుక్యభీముడు వేంగీ సింహాసనమధిష్టించెను.

మొదటి యుద్ధంలో తరిమివేయబడిన రాష్ట్రకూటులు మంకుపట్టు వదలక భీముని పై కక్షబూని దాయాదుల సహాయంతో రెండవ సారి దండెత్తిరి. కర్ణాట లాట ప్రాంతముల నుండి పెద్ద సైన్యములను రావించి మహా సైన్యాధిపతియైన గుండయ సారధ్యమున రాష్ట్రకూట సైన్యములు రెండవ కృష్ణుని ఆజ్ఞతో చాళుక్య సామ్రాజ్యం పై దండెత్తెను. రాష్ట్రకూట సైన్యములు తీరం వెంబడి పయనించి ముఖ్యపట్టణమైన వేంగీ సమీపమునకు చేరెను. నిరవధ్య పురము (నిడదవోలు) పెరవన్గూరు గ్రామముల వద్ద చాళుక్య రాష్ట్రకూట సైన్యముల మధ్య జరిగిన యుద్ధములు చెప్పుకోదగినవి. చాళుక్యభీముని కుమారుడైన ఇనుమిర్తగండ అను 16 సంవత్సరాల యువకిశోరము రాష్ట్రకూట సైన్యములను ఎదుర్కొని, పోరాడి రాష్ట్రకూట సైన్యాధిపతియైన గుండయను వధించెను. అతని ధాటికి రాష్ట్రకూట సైన్యములోనున్న యోధులైన విలుకాండ్రు, మత్తమాతంగములు, యుద్ధాశ్వములు చెల్లాచెదురైనాయి. అయితే ద్రోహ బుద్ధి గల దాయాదులు రాష్ట్రకూట సైన్యములకు సహకరించి చాళుక్యులకు విజయలక్ష్మి వచ్చువేళ ఇరుమర్తిగండను నిర్దాక్షిణ్యముగా చంపివేసిరి. చాళుక్య సామ్రాజ్యమును శత్రువుల నుండి కాపాడి విజయమార్జించి తండ్రిని తీరని దుఃఖములో ముంచి ఇరుమర్తిగండరు వీర స్వర్గమలంకరించెను. చాళుక్య భీముని మరణానంతరం వేంగీలో అంతఃకలహములు ఆరంభమయ్యెను. దాయాదులు ఒకరినొకరు చంపుకొనుటకు ప్రయత్నించిరి. అదే సమయమున రాష్ట్రకూట సింహాసనము అధిష్టించిన రెండవ అమోఘవర్షుడు (క్రీ॥శ॥ 930) రెండవ యుద్ధమల్లునికి వేంగీ సింహాసనము ఎక్కించుటకై తన సైన్యమును సహాయముగా పంపెను. అనుకూలమైన పరిస్థితుల వలన అమోఘవర్షుని సైన్య సహకారముతో రెండవ యుద్ధమల్లుడు వేంగీ సింహాసనము ఆక్రమించెను. రాష్ట్రకూటులు సహాయం చేస్తేనే గాని వారి సైన&యమును వేంగీ నుండి తొలగించలేదు. సింహాసనమెక్కిన రెండవ యుద్ధమల్లునకు స్థానిక సహకారము కరువయ్యెను. రెండవ భీముడు తరిమివేసినట్లు, రెండవ అమ్మరాజు మలియం పూడి శాసనం వల్ల తెలియుచున్నది. పరాజయమును, పరాభవమును తట్టుకోజాలని రెండవ యుద్ధమల్లుడు రాజ్యమును, అధికారమును వదిలి ప్రాణములతో పారిపోయెను. యుద్ధము వలన రాష్ట్రకూటులకు ఓటమితో పాటు పరువు నష్టమయ్యెను. అనవసరముగా వేంగీ రాజకీయములలో తలదూర్చి సైన్య సహకారము అందించిన రాష్ట్రకూట రాజైన నాల్గవ గోవిందునికి తన బంధువుల వలన శత్రుత్వము పెరిగెను. రాష్ట్రకూట రాజ్యములో చెలరేగిన అంతఃకలహములు వేంగీ సామ్రాజ్యమునకు శాంతి భద్రతలు చేకూరినవి. ఈ కాలములో రెండవ భీముడు వేంగీలో తన అధికారమును తగిన రీతిలో స్థాపించుకొనగల్గెను.

## 11.8 రెండవ అమ్మరాజు, దానార్ణవులు - మూడవ కృష్ణుడు:-

నాల్గవ గోవిందుని తరువాత, మూడవ కృష్ణుడు రాష్ట్రకూట రాజ్యమునకు ప్రభువు అయ్యెను. ఇటు వేంగీలో రెండవ

భీముని తరువాత అతని కుమారుడైన రెండవ అమ్మరాజు సింహాసనమధిష్టించెను. పాత కక్షలు పరిసమాప్తము కాకుండానే క్రొత్త యుద్ధాలకు దారి తీసెను. మూడవ కృష్ణుడు వేంగిలో నున్న పరిస్థితులను తన ప్రయోజనాలకు ఉపయోగించ తలచి కలహములు రేపి రెండవ అమ్మరాజు సహోదరుడైన దానార్ణవునితో చెయ్యి కలిపెను. దీని వలన వేంగీ రాజ్యములో రాష్ట్రకూటుల ప్రాబల్యము ఆధిక్యత పెరిగెను. దానార్ణవునికి రాజ్యములో (చాళుక్య) ఎక్కువ ఆదరణ లభించెను. రెండవ యుద్ధమల్లుడైన బాడప సింహాసనము తనదేనని రెండవ అమ్మరాజు పై ఎదురు తిరిగెను. బాడప రాష్ట్రకూట రాజైన మూడవ కృష్ణుని సహాయముతో రెండవ అమ్మరాజును ఓడించి తరిమివేసెనని బాడపుని ఆరుంబాక శాసనం వలన తెలియుచున్నది. అయితే మొదటి శక్తి వర్మ పెన్నేరు శాసనం వలన రెండవ అమ్మరాజు 25 సంవత్సరముల పరిపాలన తరువాత అతని అన్నగారైన దానార్ణవుని కాలములో వేంగీ పాలన కుంచుమించు రాష్ట్రకూటుల యాజమాన్యము వలనే జరిగిందని చెప్పవచ్చు. మూడవ కృష్ణుడు వేంగీ రాజైన దానార్ణవుని సామంతునిగాను, కప్పము కట్టే సామంతరాజుగా తన ఆధీనములో ఉంచుకొనెను. సింహాసనమును అధిష్టించుటకు సహాయపడిన రాష్ట్రకూట కృష్ణునికి దానార్ణవుడు కృతజ్ఞుడై యుండెను. వేంగీ పరిపాలనలో సహకరించుటకు, పర్యవేక్షించుటకు రాష్ట్రకూట ఉద్యోగులైన కాకర్త్యగుండ్యన సామంత ఉడ్డి మొదలగు వారు వేంగీలో ఉండిరి. అటు తరువాత వేంగీ రాజ్యములో వచ్చిన కల్లోలముల వల్ల తెలుగు చోడరాజైన జటాచోడ భీముడు ఆక్రమణ వల్ల వేంగీ చాళుక్య వైభవము, అధికారము కొంత కాలము సన్నగిల్లినది. దానార్ణవుని కుమారుడైన మొదటి శక్తి వర్మ శత్రువుల బారి నుండి పారిపోయి చోళ మండలమున తలదాచుకొనెను. ఇంత కాలము వేంగీ చాళుక్యులతో వైరమేర్పరచుకుని, కక్ష సాధించిన రాష్ట్రకూట రాజ్యము కూడా పశ్చిమ చాళుక్యుల ఆవిర్భావముతో అంతరించినది.

## 11.9 ప్రశ్నలు :-

1. వేంగీ చాళుక్యులు రాష్ట్రకూటుల మధ్య జరిగిన యుద్ధాల గురించి వ్రాయుము.
2. వేంగీ చాళుక్యులు రాష్ట్రకూటుల మధ్య జరిగిన వివాహాలు మరియు ఒడంబడికల గురించి వ్రాయుము.
3. గుణగ విజయాదిత్యుడు అమోఘవర్షుల మధ్య సంబంధాలను తెల్పుము.
4. రెండవ అమ్మరాజు మూడవ కృష్ణుల మధ్య సంబంధాలను తెల్పుము.

## 11.10 ఉపయుక్త గ్రంథాలు:-


1. Yazdani, G : Early History of The Deccan 2 Volumes (ed) Oxford University Press London 1960.
2. Dr. Venkataramayya, N. : The Chalukyas of Vengi, Madras 1950.
3. Krishna Rao, B.V. : History of The Early Dynasties of Andhra, Madras 1927.
   History of the Eastern Chalukyas of Vengi, Hyderabad, 1972
4. Altekar, A.S. : The Rastrakutas and their times

పాఠం - 12

# వేంగి చాళుక్యులు

## (CHALUKYAS OF VENGI)

ముఖ్యాంశాలు:-


12.0 లక్ష్యం

12.1 ఉపోద్ఘాతము

12.2 చాళుక్యులెవరు?

12.3 చాళుక్య నామము వివిధ రూపా

12.4 చాళుక్య పద ఉత్పత్తి

12.5 చాళుక్యులు అయోధ్య పాలకులా?

12.6 చాళుక్యుల వర్ణం

12.7 వంశానుక్రమము

- 12.7.1 కుబ్జ విష్ణు వర్ధనుడు
- 12.7.2 జయ సింహ వల్లభ - 1
- 12.7.3 విష్ణు వర్ధనుడు - 2
- 12.7.4 ఇంద్ర భట్టారకుడు (637)
- 12.7.5 రెండవ విష్ణు వర్ధనుడు
- 12.7.6 వేంగి - యువరాజు (681 - 705)
- 12.7.7 రెండవ జయ సింహుడు
- 12.7.8 కొక్కిలి
- 12.7.9 మూడవ విష్ణువర్ధనుడు
- 12.7.10 మొదటి విజయాదిత్యుడు
- 12.7.11 క్రీ.శ. 1771 లో నాల్గవ విష్ణువర్ధనుడు
- 12.7.12 రెండవ విజయాదిత్యుడు
- 12.7.13 గుణగ విజయాదిత్యుడు

12.7.14 నాలుగవ విజయాదిత్యుడు

12.7.15 మొదటి అమ్మరాజు

12.8 ముగింపు

12.9 మాదిరి ప్రశ్నలు

12.10 ఉపయుక్త గ్రంథాలు

## 12.0 లక్ష్యం:-

ఈ పాఠంలో వేంగీ చాళుక్యుల పుట్టు పూర్వోత్తరాలు వంశనామం, వర్ణ ఆదిమ నివాసం మొదలైన వాటిని పరిచయం చేయుట ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## 12.1 ఉపోద్ఘాతము:-

విష్ణుకుండినులను నిర్జించి వారితోపాటు అనేక సామంతరాజుల్ని ఓడించి బాదామి చాళుక్య వంశస్థుడైన రెండవ పులకేశి క్రీ॥శ॥ 610 లో తీరాంధ్ర దేశాన్ని తన ఆధీనములో తెచ్చుకొనెను. మిక్కిలి విశాలమైన తన సామ్రాజ్యాన్ని తన అనుంగు **సోదరుడైన** కుబ్జ విష్ణువర్ధనుని యువరాజుగా ప్రకటించి కొంత రాజ్యాన్ని అప్పగించెను. కుబ్జ విష్ణువర్ధనుడు క్రీ॥శ॥ 624 వరకు **అధిరాజు**, అన్నగారు అయిన రెండవ పులకేశికి విధేయుడై, బాదామి రాజ్యాధిపత్యానికి తలవంచెను. రెండవ పులకేశి మరణించిన **తరువాత** కుబ్జ విష్ణు వర్ధనుడు స్వతంత్రుడై "మహారాజు"గా ప్రకటించుకొని స్వతంత్రంగా వేంగీ నగరాన్ని రాజధానిగా చేసుకొని **వేంగీ** చాళుక్య రాజ వంశ స్థాపకుడయ్యాడు. వేంగిలో ప్రారంభమైన చాళుక్యుల పాలన "చాళుక్య శాఖ"గా పిలువబడింది. వీరినే 'వేంగీ చాళుక్యులని' కూడా అంటారు. వీరి పాలన క్రీ॥శ॥ 610 నుండి క్రీ॥శ॥ 1200 వరకు సాగింది.

## 12.2 చాళుక్యులెవరు?:-

ఇంతవరకు చాళుక్యులకు సంబంధించిన పెక్కు ఆధారాలు, శాసనాలు, నాణాలు, సాహిత్య గ్రంథాలు, దేవాలయాలు, శిల్పాలు, వాస్తు శిథిలాలు దొరికాయి. అయినప్పటికి చాళుక్యుల జన్మ స్థలము, సామాజిక స్థాయి మొదలైన విషయాలు పూర్తిగా తెలియలేదు. వేంగీ చాళుక్యులు స్థానికులు కారు. వీరు బాదామి చాళుక్య సంతతి వారు. అయినా వీరి వంశకర్త వివరాలు అస్పష్టంగానే ఉన్నాయి.

## 12.3 'చాళుక్య' నామము వివిధ రూపాలు:-

శాసనాల్లోను, సాహిత్యంలోను చాళుక్య నామము వివిధ రూపాల్లో వాడబడింది. బాదామి చాళుక్య శాసనాల్లో 'చల్క్య' చలిక్య, చలుక్య, చాలుక్య, చాళుక్య రూపాల్లో వాడబడింది. వేంగీ చాళుక్య శాసనాల్లో పై రూపాల్తో పాటు 'సలుకె', 'సల్కి', 'సలుక్కి' అనేని కూడా వున్నాయి. పై ఆధారాలను బట్టి శాసనాల్ని వ్రాసేవారు గాని, పాలకులు గాని వారి వంశనామాన్ని ఏ రూపంలో వ్రాసినా పట్టించుకున్నట్లు కనిపించదు. వివిధ రూపాల్ని సమన్వయం చేస్తే సాధారణంగా వీరు 'చాళుక్య' అనే స్థిర రూపం పరిగణించవచ్చు.

## 12.4 'చాళుక్య' పద ఉత్పత్తి :-

'చాళుక్య' అనే పదం 'చుళక' అనే పదం నుండి పుట్టిందట. 'చుళక' అంటే అరచేతిలోని గుంట అని అర్థం. చాళుక్య వంశ కర్త బ్రహ్మ 'చుళక' నుండి పుట్టెనట. దీనిని సమర్థించటానికి ఒక గాథ కూడా చలామణిలోకి వచ్చింది. బిల్హణుని విక్రమాంకదేవ చరిత్రలో ఈ ఉదంతం చెప్పబడింది. చాళుక్య వంశకర్త బ్రహ్మ చుళకము నుండి పుట్టినట్లు కొన్ని శాసనాల్లో చెప్పబడింది. వీటి ప్రకారం, ఒకనాడు బ్రహ్మ సంధ్య వార్చుకొనే సమయంలో లోకంలో నానాటికి పెరిగిపోతున్న పాపాన్ని అరికట్టేందుకు ఒక వీరుణ్ణి సృజించమని ఇంద్రుడు నివేదించగా బ్రహ్మ తీక్షణంగా తన అరచేతి మధ్య భాగంలోకి (చాళుక) చూడగా అక్కడి నుండి ఒక వీరుడు పుట్టెనట. చుళకము నుండి పుట్టినవాడగుటచే అతడు చుళుకుడని అటు తరువాత చళుకి, సలుకి, సలుక్కి, ఆదిగా గల రూపాల్లో పిలువబడి, అతని పేర వంశాన్ని స్థాపించినందున అది చాళుక్య వంశమయ్యిందని భావించి అరచేతి మధ్య భాగం చుళకం నుంచి వీరుడు పుట్టడం, అతనికి "అరచేతిలోని గుంట" అని పేరు పెట్టడం చారిత్రక సత్యం కాదు. 'అరచేయి' అధికారానికి 'ప్రతీక'గా తీసుకుంటే అరచేయి నుంచి పుట్టినవాడు అధికారాన్ని హస్తగతం చేసుకున్నవాడనే అర్థం వస్తుంది. వంశకర్తలు, మూల పురుషులు మానవేతరమైన జన్మ కలిగివుంటే ఆ వంశంవారికి సామాన్యులు విధేయత, గౌరవ మర్యాదలు చూపిస్తారు. ఇటువంటి కథలు, గాథల వల్ల రాజ వంశాల పేర్లు, ప్రతిష్టలు పెరుగుతాయి. రాచరికపు పెత్తనాన్ని సుస్థిరం చేయడానికి ఇటువంటి కథలు, గాథలు ఎంతో తోడ్పడతాయి. ఇటువంటి ప్రయత్నంలోనే బ్రహ్మ 'చుళకం' నుంచి చాళుక్య వంశకర్తను సృష్టించారు.

## 12.5 చాళుక్యులు అయోధ్య పాలకులా?:-

రన్న కవిచే వ్రాయబడ్డ 'గదాయుద్ధ' అనే కన్నడ కావ్యంలో అయోధ్య పాలకుడైన ఒకానొక 'సత్యాశ్రయుడు అనే రాజు 'చాళుక్య' వంశకర్త అని చెప్పబడింది. ఈ ఉదంతమే ఇంకా వివరంగా ఐదవ విక్రమాదిత్యుని కౌతమ్ శాసనంలో పేర్కొనబడింది. దీని ప్రకారం చాళుక్య వంశానికి చెందిన 55 మంది రాజులు అయోధ్యను పాలించిన తరువాత 'దక్షిణాపథానికి' వలస వచ్చి రాజ్యాన్ని స్థాపించారు. అటు తరువాత 18 మంది రాజులు పాలించగా వారి అధికారం నశించి అజ్ఞాతంగా వుండవలసి వచ్చెను. కొన్ని తరాలు గతించిన తర్వాత జయసింహ వల్లభుడు అనే రాజు కృష్ణుని కుమారుడైన రాష్ట్రకూట ఇంద్రుణ్ణి జయించి తిరిగి రాజ్యాన్ని స్థాపించాడు. 'విజయాదిత్య', 'విష్ణువర్ధన' అనే బిరుద నామాల్ని ధరించిన అనేక మంది రాజులు పాలించుటచే చాళుక్య రాజ్యం లక్ష్మీ ప్రవర్ధమానమయ్యెను. అటు తరువాత వేంగీ చాళుక్య శాసనాల్లో ఈ కథనం తారా స్థాయికి చేరి చంద్రుడి నుండి వంశం ప్రారంభమై పాండవుల వరకు వచ్చింది. ఈ విధంగా చంద్ర వంశానికి తమ వంశాన్ని ముడిపెట్టారు. యమ, వాయువు, ఇంద్ర, అశ్వని కుమారుల వలన జన్మించిన పాండవులతో వీరు తమ వంశాన్ని ముడిపెట్టడంలో చారిత్రక సత్యమెంత కలదు?

## 12.6 చాళుక్యుల వర్ణం:-

భారతీయ సమాజము వర్ణ వర్గీకృతము. వర్ణము, జాతి, కులము అనే పదాల అర్థాలను, రాబట్టడం సామాజిక శాస్త్రవేత్తనెంతో కలవరపరిచింది. 'వర్ణము' అనే పదము రంగును తెలియజేస్తుంది. అయితే ఇది ఈనాడు 'కులము' అనే పదానికి పర్యాయంగ వాడబడటం వల్ల వర్ణము, కులము ఒకటేనని భావిస్తారు. భారతీయ సమాజం, బ్రహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలుగా విభజించబడింది. ఒక్కో వర్ణానికి కొన్ని విధుల్ని, విద్యుక్త ధర్మాల్ని నిర్దేశించారు. వర్ణాంతర వివాహాల్లో కొన్ని మధ్య పుట్టిన వారిని పై వర్ణాల్లో కలవనీయక వారిని 'పంచము' లని ప్రత్యేకమైన పేరు పెట్టారు. బ్రాహ్మణులు వేద పఠనం, విద్యా వ్యాసంగం, కర్మకాండలు నిర్వర్తించగా, క్షత్రియులు దేశరక్షణ, రాజ్యపాలన చేయగా, వైశ్యులు వ్యవసాయ, వాణిజ్య వ్యాపారాలు, శూద్రులు సేవికా వృత్తి, పంచములు మిగిలిన నీచమైన శవదహనం, పారిశుద్ధ్య కార్యాలు చేస్తూ ఊరి అవతల అంటరాని వారుగా ఉండాలని స్మృతికారుల నిర్దేశం. అయితే స్మృతికారుల నిర్ణయం వలన ఏర్పడిన సమాజంలో చాళుక్యులు ఏ కోవకు చెందుతారని ప్రశ్నించుకుంటే, వీరు బ్రాహ్మణులని కొందరు, శూద్రులని మరికొందరు వాదించుచున్నారు. చాళుక్యులు మానస గోత్రులు, హారతీ ప్రియ పుత్రులు కౌశికీ వర ప్రసాదముచే రాజ్యమును పొందినవారు, స్వామి మహాసేనుని పాదానుధ్యాతులు. అయోధ్య పాలకులుగా ఉన్నప్పుడు

సాతానికుని కుమారుడైన ఉదయుని వంశంలోని విజయాదిత్యుని బంధువు దక్షిణా పథాన్ని జయింప తలచి త్రిలోచన పల్లవునిచే చంపబడెను. అప్పటికే గర్భవతియైన అతని రాణి ముడివేము అగ్రహారము వాస్తవ్యుడైన విష్ణు భట్ట సోమయాజిచే రక్షింపబడి, పోషింపబడెను. ఆమెకు ఒక కుమారుడు జన్మించగా, కృతజ్ఞతతో ఆమె తన కుమారుని పేరు తన రక్షకుని పేర విష్ణు వర్ధనుడని పేరు పెట్టెను.

ఆ బాలుడు యుక్తవయస్కుడై తన తల్లి వలన, తండ్రి మరణమును గూర్చిన వృత్తాంతాన్ని తెలుసుకొని 'చాణక్యగిరి'కి పోయి 'సంద భగవతి' ని ప్రార్థించి, ఆమె అనుగ్రహము వలన దక్షిణా పథంలోని నర్మదా నుండి సేతువు వరకు గల భూభాగమునకు అధిపతి అయ్యెను. దీనిని బట్టి విష్ణు వర్ధనుని జన్మకు పూర్వమే 'చాళుక్యగిరి' అను ప్రదేశమున్నట్లు తెలియుచున్నది. అయోధ్య రాజుకు పుట్టి, బ్రాహ్మణ అగ్రహారమున పెరిగి 'చాళుక్యగిరి' పై నున్న నంద భగవానుని కొలచి, విష్ణు వర్ధనుడు చాళుక్య రాజ్యమును స్థాపించినట్లు చెప్పబడింది. రెండవ పులకేశి కాలంలో భారతదేశాన్ని దర్శించిన చైనా యాత్రికుడైన హుయాన్ చాంగ్ పులకేశి క్షత్రియుడని తెలిపాడు. పై విషయాలను బట్టి వీరు బ్రాహ్మణులు కారని వివరించవచ్చును. రాజ రాజ నరేంద్రుడు భారతీయాంధ్రీకరణ కొరకు 'తన కుల బ్రహ్మడైన నన్నయను' కోరిక ఉదంతమును ఆధారంగా చేసుకొని కొందరు 'తనకుల' అను అర్థమున రాజరాజ బ్రాహ్మణుడని భావించారు. అయితే వీరు 'కుల బ్రాహ్మణ' వ్యవస్థ గురించి తెలియక అట్లు భావించారు. 'కుల బ్రాహ్మణ' వ్యవస్థ వేంగీ చాళుక్యుల కాలంలో బాగా వర్థిల్లినట్లు అనేక శాసనాధారాల వల్ల తెలుస్తుంది. మేలైన పుత్ర సంతానం కొరకు ఆరోగ్యవంతుడు, స్ఫురద్రూపి, మేధావి అయిన బ్రాహ్మణ యువకుడ్ని రాణి వాసములో నుంచేవారు. ఇతడ్నే 'కుల బ్రాహ్మణుడని' అంటారు. అతని వలన సంతానానికి రాజ్యాధికారానికి వచ్చే ఆచారముండేది. నన్నయ 'కుల బ్రాహ్మణుడే' కాని రాజరాజ నరేంద్రుని కులమునకు చెందినవాడు కాదని తెలియుట శ్రేయస్కరము. అందుచే రాజరాజ నరేంద్రుడు బ్రాహ్మణుడు కాదని విశదమగును. ఇది ఇట్లుండగా కొందరు చరిత్రకారులు చాళుక్యులు తొలుత వ్యవసాయ వృత్తి అనుసరించేవారని తర్వాత క్షత్రియులయ్యారని తలంచారు. 'బిల్హణు'ని 'విక్రమాంకదేవ చరిత'లో చాళుక్య వంశము విష్ణు పాదాల నుండి ప్రవహించే గంగతో తడ్పబడుటచే వీరు శూద్రులని భావించారు. చాళుక్య పాలకులు ధర్మ శాస్త్రాలు నిర్దేశించినట్లుగా 'అశ్వమేధ', 'అగ్నిష్టోమ', 'వాజపేయ', ' పుండరీక', 'బహుసువ' మొదలైన యజ్ఞయాగాల్ని చేయుటచే వీరు క్షత్రియులేనని భావించారు.

## 12.7 వేంగీ చాళుక్యుల వంశానుక్రమము :-

**12.7.1 కుబ్జ విష్ణు వర్ధనుడు:-** బాదామి చాళుక్యులలో ప్రముఖుడైన రెండవ పులకేశి తీరాంధ్ర దేశాన్ని జయించి సువిశాలమైన భూభాగానికి అధిపతి అయ్యాడు. అతని అనుంగు తమ్ముడైన కుబ్జ విష్ణు వర్ధనునికి తీరాంధ్ర ప్రాంతానికి అధిపతిగా నియమించెను. క్రీ॥శ॥ 624 నుండి కుబ్జ విష్ణు వర్ధనుడు వేంగీ (హేలాపురి) నేటి ఏలూరు (పశ్చిమ గోదావరి జిల్లా) ను రాజధానిగా చేసుకొని వేంగీ చాళుక్య స్థాపకుడయ్యెను. ఇతని కాలం నుండి వేంగీ చాళుక్యులు స్వతంత్రంగా బాదామి చాళుక్యులను విడచి పరిపాలన సాగించారు. వేంగీ నగరం శాలంకాయనుల కాలం నుండి ప్రముఖ వర్తక, వాణిజ్య, వ్యాపార కూడలిగా ఉండేది. శాలంకాయనుల తర్వాత విష్ణు కుండినులు కూడ ఈ నగరాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. కుబ్జ విష్ణు వర్ధనుడు వేంగీ చాళుక్య వంశస్థాపకుడై వేంగీని ప్రముఖ నగరంగా తీర్చిదిద్దాడు. వేంగీ చాళుక్య రాజులు జారీ చేసిన వివిధ శాసనాల్లో వివిధ రకాలైన రాజ్య సంవత్సరాలున్నాయి. కుబ్జ విష్ణు వర్ధనుడు 18 సంవత్సరాలు పరిపాలించినట్లు కొన్ని శాసనాలు చెబుతున్నాయి.

**12.7.2 జయసింహ వల్లభ - 1:-** ఇతని తరువాత మొదటి జయసింహ వల్లభుడు వేంగీ సింహాసనమధిష్టించెను. (ఇతని కాలంలో కంతేరు) కర్మ రాష్ట్రము నందలి కంతేరు నగరము, వేంగీ చాళుక్యుల రాజధానిగా ఉండెను. కర్మ రాష్ట్రము ఆనాడు నంబురు, కాజ, వేంగీ చాళుక్యుల ప్రముఖ అగ్రహారాలుగా ఉండేవి. కంతేరు నందు ప్రముఖ సైనిక విద్యా పీఠము అసనపుర మూల ఘటిక ఉన్నట్లు జయసింహ వల్లభుని శాసనం వల్ల తెలియుచున్నది. కంతేరు రాజధానిగా విద్యా, సాంస్కృతిక కేంద్రంగా ఉన్నట్లు శాసనాల వలన తెలియుచున్నది. జయసింహ వల్లభుడు వివిధ శాసనాల వల్ల 30 - 33

సం॥లు పాలించినట్లు తెలుస్తున్నది. మొదటి జయసింహ వల్లభుని కాలంలో వేంగీ చాళుక్యుల సామ్రాజ్యము దక్షిణమున నెల్లూరు జిల్లా యందలి ఉదయగిరి వరకు వ్యాపించెను.

12.7.3 **విష్ణు వర్ధనుడు - 2:-** ఇంద్ర భట్టారకుని తరువాత రాజ్యానికొచ్చిన రెండవ విష్ణు వర్ధనుడు 9 సం॥లు పాలించెను.

12.7.4 **ఇంద్ర భట్టారకుడు (637):-** మొదటి జయసింహునికి సంతానము లేనందున అతని తమ్ముడైన ఇంద్రవర్మ చాళుక్య సింహాసనమధిష్టించెను. అయితే అతను సింహాసనమధిష్టించిన వారం రోజుల్లోనే శత్రువులతో వధింపబడెను. ఇతనికి త్యాగదేను, మకరద్వజ అను బిరుదులు కలవు.

12.7.5 **రెండవ విష్ణు వర్ధనుడు:-** ఇంద్ర భట్టారకుని తరువాత అతని చిన్న కుమారుడైన రెండవ విష్ణు వర్ధనుడు సింహాసనమధిష్టించెను. అతనికి 'సర్వలోకాశ్రయ', 'విషయసిద్ధి', 'మకరద్వజ' మరియు 'ప్రళయాదిత్య' అనే బిరుదులుండెను. పరమ మహేశ్వర అను బిరుదాన్ని ధరించిన మొదటి వేంగీ చాళుక్య పాలకుడు పల్లవాడ శాసనంలో ఇతడు 'సమధిగత పంచ మహాశబ్ద' అనే బిరుదాన్ని ధరించినట్లు చెప్పబడింది. ఇతని కాలంలో చాళుక్యులకు, పల్లవులకు , తూర్పు గాంగులకు మధ్య అనేక యుద్ధములు జరిగెను. ఇతని సమకాలీనుడైన పల్లవ రాజు మొదట పరమేశ్వర వర్మ ఇతడు నరసింహ వర్మ కాలంలో కోల్పోయిన నెల్లూరు ప్రాంతాన్ని తిరిగి రాబట్టుకొనేందుకు ప్రయత్నించారు.

12.7.6 **వేంగి యువరాజు (681 - 705):-** రెండవ విష్ణు వర్ధనుని తర్వాత వేంగి యువరాజు సింహాసనమధిష్టించి 25 సం॥లు పాలించెను. ఇతనికి 'సకలోకాశ్రయ', 'సమస్త భావనాశ్రయ', 'విజయసిద్ధి' అనే బిరుదులు కలవు. ఇతనిచే జారీ చేయబడిన శాసనాల వల్ల ఇతని రాజ్యము ఉత్తరము విశాఖపట్నం నుంచి దక్షిణాన ఒంగోలు వరకు వ్యాపించి ఉండెను. 25 సం॥ల పాలనాకాలంలో ఇతడు సాధించిన ఘనకార్యములేవీ జరిగినట్లు ఆధారాల్లేవు. ఇతడు తన భార్యల వల్ల ముగ్గురు కుమారులను, (కొక్కిలి, రెండవ జయసింహుడు, మూడవ విష్ణు వర్ధనుడు) పృధ్వీ పోరి అను కుమార్తెను కనెను. కర్మరాష్ట్రం మధ్యమ కళింగలో లభ్యమైన ఇతని శాసనము ఇతని సామ్రాజ్య విస్తీర్ణము తెలియజేస్తాయి. ఇతని కాలంలో పల్లవులు నెల్లూరు వరకు తమ ఆధిపత్యాన్ని కలిగినట్టు పల్లవ మొదటి పరమేశ్వర వర్మ యొక్క గురవాయపాలెం (పాదిలి) తామ్ర పట్టికల వల్ల తెలియుచున్నది. మూసినది, కందుకూరు, వందవరం మొదలగు పేర్లు ఈ శాసనంలో చెప్పబడ్డాయి. దీన్ని బట్టి వేంగీ చాళుక్యుల రాజ్యము అధికారము దక్షిణమున గుండ్లకమ్మ నది వరకు మాత్రమే ఉండేదని తెలుస్తుంది. 'పగునవార విషయము' పశ్చిమ గోదావరి జిల్లాలోని నర్సాపురం ప్రాంతం రాజు యొక్క స్వవిషయముగా మిగిలి యువరాజు ఏడావుల పాలెం తామ్ర పట్టికలో పేర్కొనబడింది.

12.7.7 **రెండవ జయసింహుడు:-** వేంగి యువరాజు మరణానంతరం అతని పెద్దకుమారుడైన రెండవ జయసింహుడు చాళుక్య సింహాసనమునకు వచ్చి 13 సం॥లు పాలించెను. ఇతడు 'సర్వలోకాశ్రయ' 'నిరవద్య' అను బిరుదములను ధరించెను. ఇతని సమకాలికుడైన పల్లవ రాజైన రెండవ నరసింహ వర్మ ఇతని కాలానికి చెందిన పెనకపర్రు తామ్ర శాసనం కర్మ రాష్ట్రంలోని పెనకపర్రు అనే గ్రామ దానాన్ని తెలియజేస్తుంది. పశ్చిమ చాళుక్య రాజైన విజయాదిత్యునకు ఇతను సమకాలీనుడు. ఇతడు కూడ ని రవిద్య అనే బిరుదాన్ని ధరించెను. ఇతని సమకాలీనులైన గాంగరాజులు అనంతవర్మ, జయ వర్మ, నంద వర్మ అయితే ఈ కాలంలో గణనీయమైన సంఘటనలు జరిగినట్లు తెలియరాలేదు.

12.7.8 **కొక్కిలి:-** రెండవ జయసింహుడు వారసుడు లేకుండానే మరణించెను. అందువల్ల అతని తర్వాత చాళుక్య సింహాసనం కొరకు వారసత్వ పోరాటం జరిగెను. అందువల్ల అతని మారు తమ్ములలో మొదటివాడు సింహాసనమును చేజిక్కించుకొని ఆరు నెలలు తన ఆధీనమున ఉంచుకొనెను. అయితే ఈ 6 మాసాల కాలంలో అతడు పాలించిన దాఖలాలు కనిపించవు. రెండవ జయసింహుని మరణానంతరం మూడవ విష్ణు వర్ధనుని సహోదరులైన కొక్కిలి తనంతట తానుగా రాజుగా ప్రకటించుకొనెను. వేంగీ చాళుక్య రాజ వంశంలో వారసత్వం కొరకు జరిగిన మొదటి సంఘటన ఇతడికి కొక్కిలి, కొక్కిలి

విక్రమాదిత్య భట్టారక మహారాజు అనే పేర్లు కూడా ఉన్నట్లు చాళుక్య శాసనాల వల్ల తెలుస్తుంది. ఇతడు 'విజయసిద్ధి' అనే బిరుదును ధరించినట్లు అతడి ముద్రిక పై లభ్యమైన 'ఆఖ్య' తెలియజేయుచున్నది. ఇతని స్వల్పకాల పాలనలో ప్రారంభమైన వారసత్వ సమస్య తరువాత రాజుల కాలంలో సర్వసాధారణంగా మారింది. ఇతని పాలన ఆరు మాసాలు మాత్రమే సాగింది. అంతలో మూడవ విష్ణు వర్ధనుడు అతడ్ని రాజ్య భ్రష్టుడ్ని చేసెను. అయితే విశాల హృదయుడైన విష్ణు వర్ధనుడు మధ్యమ కళింగలోని కొంత భాగాన్ని ఎలమంచిలిని ముఖ్య పట్టణముగా చేసుకొని పాలించుకొనుటకు అనుమతి ఇచ్చెను. కళింగ ప్రాంతము గుణగ విజయాదిత్యుని కాలం వరకు వీరి ఆధీనంలోనే ఉండెను. ఆనాడు కళింగ నగరాన్ని నందవర్మ అనే గాంగరాజు పాలించుచుండెను. దక్షిణమున పల్లవ రాజైన రెండవ నరసింహ వర్మ పాలించుచుండెను. అదే సమయంలో పశ్చిమ చాళుక్య రాజైన విజయాదిత్యుడు పశ్చిమాంధ్ర దేశాన్ని తన ఆధీనంలో ఉంచుకొనెను.

**12.7.9 మూడవ విష్ణు వర్ధనుడు:-** వేంగీలో నెలకొన్న వారసత్వ సమస్యలను పరిష్కరించి మూడవ విష్ణు వర్ధనుడు 37 సం॥ పాలించెను. ఇతడు 'సమస్త భువనాశ్రయ', 'త్రిభువనాంకుశ', 'విషయ సిద్ధి' అనే బిరుదుల్ని ధరించెను. సుదీర్ఘమైన రాజ్యపాలన చేయుటయేకాక బలిష్టమైన ముగ్గురు పల్లవ రాజులను రెండవ నరసింహవర్మ, రెండవ పరమేశ్వర వర్మ, నంది వర్మలను యుద్ధమున ఎదుర్కొనెను.

పల్లవ నంది వర్మ సైన్యాధిపతియైన ఉదయ చంద్ర మూడవ విష్ణు వర్ధనుని అశ్వమేధ అశ్వాన్ని అడ్డగించి దానితో వచ్చిన నిషాద నాయకుడ్ని బంధించి, అశ్వమేధ యాత్రను అడ్డగించి చాళుక్య భూములను పల్లవ సామ్రాజ్యంలో కలిపివేసెను. నిరవద్య ప్రాంతాన్ని (నిడదవోలు) తన ఆధీనము చేసుకొని అమూల్యమైన కంఠాభరణములను వెలలేని బంగారములను ఏనుగులను తన ఆధీనం చేసుకొనెను. మూడవ విష్ణు వర్ధనుని కాలంలో బాదామి చాళుక్యుల బలము రాష్ట్ర కూటుల ప్రాబల్యం దంతిదుర్గని నాయకత్వమున పెరిగెను. ఇతడే రాష్ట్ర కూట వంశస్థాపకుడు. అయితే నంది వర్మ బంధించిన నిషాద నాయకుడు 'గుండ్లకమ్మ' ప్రాంతంలో నున్న బోయరాజేనని భావించవచ్చును. గుణగ విజయాదిత్యుని తొలి రాజ్య సంవత్సరములోనే 12 బోయ కొట్టాలు తిరుగుబాటు చేసెనని పండరంగని అద్దంకి శిలా శాసనం తెలియజేయుచున్నది.

**12.7.10 మొదటి విజయాదిత్యుడు:-** మూడవ విష్ణు వర్ధనుని మరణానంతరం అతని కుమారుడైన మొదటి విజయాదిత్యుడు సింహాసనమధిష్టించెను. రాష్ట్ర కూట రాజ్య స్థాపకుడైన దంతిదుర్గుడు బాదామి చాళుక్య రాజైన కీర్తి వర్మను సింహాసనము నుండి దింపి దేశము నుండి తరిమికొట్టెను. ఈ సంఘటన వల్ల వేంగీలోని చాళుక్య పాలనకు ఏ విధమైన అంతరాయము కలుగలేదు. అప్పటి వరకు తన ఉనికిని సుస్థిరం చేసుకొనే ప్రయత్నంలోనే రాష్ట్ర కూట దంతిదుర్గుడు నిమగ్నమై ఉండెను. క్రీ॥శ॥ 756 లో దంతిదుర్గుడు మరణించుట, మొదటి కృష్ణుడు రాజ్యానికి రావడం దక్కను రాజకీయాల్లో సంచలనం కలిగించెను. క్రీ॥శ॥ 757 లో మొదటి కృష్ణుడు చాళుక్య కీర్తి వర్మను పూర్తిగా జయించి యావత్తు బాదామి చాళుక్య రాజ్యాన్ని తన ఆధీనంలోనికి తెచ్చుకొనెను. క్రీ॥శ॥ 769 వరకు కొంకణను, గంగావడిని జయించుటలోనే తలమునకలై ఉండెను. గంగావడిని జయించిన పిమ్మట కృష్ణుడు వేంగీ పై దండెత్తెను. క్రీ॥శ॥ 769 లో కృష్ణుడు పెద్ద కుమారుడైన రాష్ట్రకూట గోవిందుడు వేంగీ పై దండెత్తెను. కృష్ణా, మూసి కూడలి వద్ద ఇరు సైన్యములు తలబడెను. ఈ యుద్ధంలో చాళుక్య సైన్యము ఓడిపోయెను. చాళుక్య విజయాదిత్యుడు చేయునది లేక రాష్ట్రకూటులకు లొంగి కొని షరతులకు ఒప్పుకొనెను. అందులో చాళుక్య ధనాగారాన్ని, అలాగే సైన్యాన్ని, రాజ్యాన్ని కూడా రాష్ట్రకూటులకిచ్చుట.

**12.7.11 క్రీ॥శ॥ 1771లో నాల్గవ విష్ణు వర్ధనుడు:-** మొదటి విజయాదిత్యుని మరణానంతరం అతని కుమారుడైన నాల్గవ విష్ణు వర్ధనుడు రాజ్యానికొచ్చి 35 సం॥ పాలించెను. ఇతని కాలంలో పల్లవ రాజైన నంది వర్మ పల్లవ మల్ల కంచి నుండి పాలించుచుండెను. రాష్ట్రకూట రాజైన మొదటి కృష్ణుని పాలన క్రీ॥శ॥ 772 లో ముగిసెను. అతని తర్వాత పెద్ద కుమారుడైన గోవిందుడు రాజ్యానికొచ్చెను. విష్ణు వర్ధనుని బావ మరిది అగు ధృవ ధార వర్షుడు రాష్ట్రకూట గోవిందుని అధికార భ్రష్టుని చేసెను. ఆ సమయంలో రాష్ట్రకూటులకు వేంగీ నుండి మద్దతు లభించెను. పల్లవుల పై రాష్ట్రకూటులు

చేసిన దండయాత్రలో వేంగి సైన్యము కూడా పాల్గొనెను. విష్ణు వర్ధనునికి రెండవ విష్ణు వర్ధనుడు, భీమ సళుకే అనే ఇద్దరు కుమారులుండిరి. విష్ణు వర్ధనుడు రాజ్యానికొచ్చిన తొలి రోజుల్లోనే రాష్ట్రకూట వారసత్వ రాజకీయాల్లో తలదూర్చ వలసి వచ్చింది. రాష్ట్రకూట వారసత్వంలో రెండవ గోవిందుడు అతని చిన్న తమ్ముడు నిరుపమ ధృవుడు సింహాసనం కొరకు తగవులాడుకొనుచుండిరి. మిక్కిలి విజయావకాశములున్న ధృవుని పక్షం విష్ణు వర్ధనుడు వహించెను. అయితే ధృవుడే విజయం పొందుట చాళుక్యులకు ఆనందం కలిగెను. వారసత్వపు తగువులాటలో రెండవ గోవిందుని పక్షం వహించిన వారిని శిక్షించుటకు రాష్ట్రకూట ధృవుడు వేములవాడ రాజైన అరికేసరి ఆధ్వర్యమున వేంగి పై దండెత్తెను. యుద్ధంలో నాల్గవ విష్ణు వర్ధనుడు చిత్తుగా ఓడింపబడెను. యుద్ధానంతరం జరిగిన ఒప్పందాల్లో ధృవుడు కుమార్తెయగు శీలమహాదేవిని నాలుగవ విష్ణు వర్ధనునికిచ్చి పెండ్లి చేసి రాజ్యమున శాంతిని నెలకొల్పెను.

**12.7.12 రెండవ విజయాదిత్యుడు:-** నాల్గవ విష్ణు వర్ధనుని తర్వాత అతని పెద్ద కుమారుడు చాళుక్య సింహాసనమధిష్టించెను. అయితే, ఇతని వారసత్వానికి అతని చిన్న తమ్ముడైన భీమసళుకే అడ్డుతగిలెను. ఇతని రాజ్య కాలంలో రాష్ట్రకూటుల జోక్యం పెరిగెను. రాష్ట్రకూటులు వేంగి పై ఒక కన్ను వేసి ఉండిరి. వేంగీ సింహాసనాధికారం కొరకు కనీసం 12 సం॥ల వరకు పోరాటం సాగెనని గుణగ విజయాదిత్యుడు 'సాతలూరు' తామ్ర శాసనం వల్ల తెలియుచున్నది. ఈ సింహాసనాధికారం కొరకు జరిగిన పోరులో రాష్ట్రకూటులు గాంగులు తమ వంతు ప్రాతినిధ్యం వహించెను. ఇంత వరకు వేంగీ చాళుక్యులు రాష్ట్రకూటులకు సామంతులై కప్పము కట్టుచుండిరి. అయితే విజయాదిత్యుడు ఎటువైపు మొగ్గుచూపక తటస్థముగానే ఉండెను. ఇది రాష్ట్రకూటులకు నచ్చెను. క్రీ॥శ॥ 803 నాటికి రాష్ట్రకూట గోవిందుడు పల్లవ, పాండ్య, కేరళ, గాంగరాజ కూటమి పై జయమును పొందెను. రాష్ట్రకూట గోవిందుడు ఉత్తరంలోనూ, దక్షిణంలోనూ శత్రువులను ఓడించి విజయపరం పరలతో తిరుగులేని పాలకుడయ్యెను. వేంగిలో కూడ రాష్ట్రకూటులు జోక్యం చేసుకొనిరి. వేంగిలో ఉత్పన్నమైన వారసత్వములో రాష్ట్రకూట గోవిందుడు కీలకమైన పాత్ర వహించెను. అందుకై అతడు చాళుక్య భీమసళుకే తరపున పోరాడుటకు తన సైన్యమును వేంగికి పంపెను. దానితో భీమసళుకే విజయాదిత్యుడ్ని తరిమికొట్టి వేంగిని ఆక్రమించెను. వేంగీ పాలకుడు రాష్ట్రకూట రాజధానిలో ఏ విధమైన పారితోషికం ఆశించక వీధులను శుభ్రం చేయుచున్నాడని రాష్ట్రకూట గోవిందుని 'రాధాపూర్' తామ్ర పట్టికల్లో చెప్పబడింది. అనగా వేంగీ చాళుక్య పాలకుడు రాష్ట్రకూటులకు వెట్టిచాకిరి చేయుచున్నాడని అర్థము. ఇది రాష్ట్ర కూటులకు వేంగీ చాళుక్యుల లొంగుబాటును తెలియజేస్తుంది. దీనికి ప్రతిఫలంగా భీమసళుకే రాష్ట్రకూట రాజధాని అగు 'మాన్యఖేట'లో అనేక భవన నిర్మాణాల్లో శ్రద్ధ వహించెను.

**12.7.13 గుణగ విజయాదిత్యుడు:-** రెండవ విజయాదిత్యుని మరణానంతరం అతని కుమారుడైన గుణగ విజయాదిత్యుడు వేంగీ సింహాసనమధిష్టించెను. మూడవ విజయాదిత్యుడు గుణగ నల్లాన్ లేక గుణగ విజయాదిత్యుడనే పేరుతో సింహాసనమధిష్టించెను. ఇతడు రాష్ట్రకూట రాణియైన శీల మహాదేవికి జన్మించెను. సుదీర్ఘమైన 44 సం॥లు పాలించి రాజ్యమున పలు సంస్కరణలు గావించెను. ఇతడు పట్టాభిషిక్తుడైన తొలి సంవత్సరములోనే దక్షిణ సరిహద్దులో స్థావరములు కలిగిన బోయలు తిరుగుబాటు చేసిరి. ఈ ఉందంతం పండరంగని అద్దంకి శాసనంలో చక్కగా వివరించబడింది. బోయలు తమ 'కొట్టము'లలో నుండి సరిహద్దు రక్షక దళము వలె ఉండిరి. 12 బోయ కొలములు ఏకమై వేంగి పై తిరుగుబాటు ప్రకటించెను. దీనిని ప్రతిఘటించుటకై గుణగ విజయాదిత్యుడు పండరంగని సర్వ సైన్యాధిపతిగా నియమించి, సైన్యమునిచ్చి పంపెను. గుణగ విజయాదిత్యుని ఆజ్ఞ మేరకు పండరంగడు బోయ కొట్టములు అణగద్రొక్కి 'కట్టెపు దుర్గము'లను కాల్చి దక్షిణముగా పయనించి కందుకూరు చేరి దానిని బలమైన సైనిక స్థావరముగా మార్చెనని అద్దంకి శాసనంలో చెప్పబడింది. "కందూకూరు బెజవాడ గావించిమెచ్చి" అటుపిమ్మట అద్దంకికి వెళ్ళి 'అచ్చటున్న ఆదిత్య భటరాను'కి సూర్య నారాయణకు ఒడ్లు, ఆళ్లు పండించే భూమిని దానం చేసినట్లు అద్దంకి శాసనము తెలియజేయుచున్నది. 'అడ్లు (ఆళ్ళు), ఇడ్లు (ఒడ్లు) పట్టు నేల'. ఈ శాసనం నందు స్వచ్ఛమైన అచ్చ తెలుగు పదాలు వాడబడుటచే ఇది

తెలుగు భాషను అధ్యయనం చేసే వారికి ఎంతో ఉపయోగపడుతుంది. అచ్చట నుండి 'స్తంభపురి'కి (కంభం, ప్రకాశం జిల్లా) పోయి దానిని నాశనం చేసెను. ఈ చర్య రాష్ట్రకూట మొదటి అమోఘవర్షుణ్ని ప్రకోపింపజేసెను. దానితో అతడు వేంగి ముట్టడికై సైన్యమును పంపెను. కంభం సమీపంలో వింగపల్లి వద్ద జరిగిన యుద్ధంలో చాళుక్య సేన ఓడిపోయెను. దీనితో గుణగ విజయాదిత్యుడు మరణించి, విజయాదిత్యుడు మరణించే వరకు రాష్ట్రకూటులకు లొంగిపోవలసి వచ్చెను. క్రీ॥శ॥ 880 అతడు రాష్ట్రకూటులకు విధేయుడై ఉండెను.

ఈ కాలంలో రాష్ట్రకూటుల ఆదేశాలను శిరసావహించి గుణగ విజయాదిత్యుడు అమోఘవర్షునికి విధేయుడై ఉండెను. తాల్కాడి గాంగులు నీతి మార్గ రణవిక్రముని కాలంలో రాష్ట్రకూటుల పై తిరుగుబాటు చేసిరి. ఈ తిరుగుబాటులో నీతిమార్గంకు నొలాంబరాజుల అండదండలుండెను. అమోఘవర్షుడు బంకేయ శెల్లకేతన ఆధ్వర్యమున గంగావతికి సైన్యమును పంపెను. గంగావతి పోరు విజయవంతమైనప్పటికి శెల్లకేతన వెనుకకు రావల్సి వచ్చెను. రాష్ట్రకూట రాజధానిలో పరిస్థితులు ఇందుకు కారణమయ్యెను. రాష్ట్రకూట కృష్ణుడు ఉత్తర దేశములోని విప్లవాన్ని సమర్థించుటచే అమోఘవర్షుడు గంగావతి తిరుగుబాటు అణచుటకై గుణగ విజయాదిత్యుని సహాయం కోరెను. విజయాదిత్యుని సైన్యము నోలాంబది రాజైన పొలాలెచోర సైన్యముతో తలబడెనని సీసలి, మచిలీపట్నం తామ్ర పట్టికల్లో చెప్పబడింది. ఈ శాసనాల్లో ఒకానొక చాళుక్య రాజైన వేంగి ఈ యుద్ధంలో మరణించినట్లు తెలియుచున్నది. ఈ యుద్ధంలోనే మహావీరుడైన కడియరాజు మరణించెను. కడియరాజు పండరంగుని తండ్రి. కడియ రాజు మరణం గుణగ విజయాదిత్యుడు గంగావతిని చేరి గాంగుల సైన్యాన్ని గంగకూట పర్వత ప్రాంతానికి తరిమికొట్టెను. అటుపిమ్మట గుణగ విజయాదిత్యుడు రాష్ట్రకూటుల ఆధిపత్యమును ధిక్కరిస్తూ స్వతంత్రింపసాగెను. రెండవ కృష్ణుడు ఛేది రాజైన సంకిలునితో వేంగీ పై దండెత్తినప్పుడు అతనిని ఓడించెను. అటు పిమ్మట గుణగ విజయాదిత్యుడు పండరంగని దాహలకు పంపెను. ఈ సమయమున సంకిల కిరణపుర ఆస్థానమున తలదాచుకొని ఉండెను. పండరంగడు కృష్ణుడిని జయించి కిరణపుర, అచరపుర, దాహలకును కాల్చివేసెను. అటుపిమ్మట రాష్ట్రకూటుల బిరుదమైన 'వల్లభ' బిరుదాన్ని గుణగ విజయాదిత్యుడు ధరించెను. రెండవ కృష్ణుడు గుణగ విజయాదిత్యుని ముఖాముఖి కలసి అతని ప్రసన్నతను పొందెను. రెండవ అమ్మరాజు కలుంచంబర్రు తామ్ర శాసనం వలన తెలుస్తుంది. గుణగ విజయాదిత్యుని 'సాతలూరు' తామ్ర పట్టికల వలన అతడు పల్లవులతోను, పాండ్యలతోను యుద్ధం చేసెనని తెలియుచున్నది.

వేంగీ చాళుక్యులలో గుణగ విజయాదిత్యుడు సుప్రసిద్ధుడు. ఇతని సామ్రాజ్యము ఉత్తరాన మహేంద్రగిరి నుండి దక్షిణాన పులికాట్ సరస్సు వరకు వ్యాపించెను. ఇతనికి పుత్ర సంతానం లేనందున తన చిన్న తమ్ముడైన విక్రమాదిత్యుని తన వారసునిగా నియమించెను. అయితే అతడు భీముడనే ఒక కుమారుడిని వదలి గుణగ విజయాదిత్యుడు కంటే ముందు మరణించెను. ఈ భీముడే ముందట చాళుక్యభీముడనే పేరుతో చాళుక్య సింహాసనమధిష్టించెను. అయితే మొదటి చాళుక్య భీముని దాయాదులు ప్రతిఘటించిరి. వారిలో చిన్నాన్న అయిన మొదటి యుద్ధ మల్లుడు రాష్ట్రకూట రాజైన రెండవ కృష్ణుని సహాయంతో మొదటి భీముణ్ణి బంధించెను. ఇంతలో 'ముది గొండ' చాళుక్య వంశానికి చెందిన మొదటి కుసుమాయుధుడు రాష్ట్రకూట కృష్ణుడ్ని వేంగీ నుండి తరిమికొట్టి మొదటి భీముడ్ని వేంగి సింహాసనమెక్కించెనని పందిపాక తామ్ర పట్టికల వల్ల తెలుస్తుంది. ఈ విషయమే 'కొరివి, శిలా శాసనంలోను, మొదటి అమ్మరాజు పడేరు తామ్ర పట్టికలల్లోను చెప్పబడింది. శత్రువులను తరిమికొట్టి మొదటి చాళుక్య భీముడు వేంగిలో రాజైన వైనము క్లిష్టమైనదని తెలుస్తుంది. రెండవ అరికేసరి వేముల వాడ శాసనము, పంపా విరచితమైన 'విక్రమార్జున - విజయం' వలన వేములవాడ చాళుక్య రాజైన బద్దేగ భీముని పై విజయం సాధించెనని తెలియుచున్నది. అటుపిమ్మట వేంగిలోని చాళుక్య భీముని పాలన దాయాదుల వల్ల గాని, రాష్ట్రకూటుల వల్ల గాని ఆటంకం కలుగలేదు. ముప్పయి సంవత్సరాలు పాలించిన చాళుక్య భీముడు క్రీ॥శ॥ 921 లో మరణించెను.

**12.7.14 నాలుగవ విజయాదిత్యుడు:-** చాళుక్య భీముని మరణానంతరం అతని పుత్రులలో మిగిలిన కుమారుల్లో పెద్దవాడైన కాల్లభి గండ విజయాదిత్యుడు వేంగీ సింహాసనమధిష్టించి 6 నెలలు మాత్రమే పాలించెను. ఈ కాలంలోనే ఇతని పై దండెత్తిన కళింగ రాజును కళింగ దేశంలో విరజ నగరం వద్ద ఎదుర్కొనెను. ఇతడు విరజ యుద్ధంలో గాని ఆటు తర్వాత గాని మరణించి ఉండవచ్చును. అటు తర్వాత చాళుక్య రాజ వంశంలో అధికారం హస్తగతం కోసం అంతులేని పోరాటం జరిగెను. తరువాత 12 సంవత్సరములలోను ఆరుగురు రాజులు చాళుక్య సింహాసనం అధిష్టించిరి. అయితే వీరిలో ఏ ఒక్కరికి సుస్థిరమైన పాలన, శత్రువులను ఎదుర్కొనే శక్తి లేకపోయెను. త్వరితగతిన పాలకులు మారుటచే ప్రజలలో శాంతి భద్రతలు కరువయ్యెను. అలజడులు రేగెను.

**12.7.15 మొదటి అమ్మరాజు:-** నాల్గవ విజయాదిత్యుని కుమారుడైన మొదటి అమ్మరాజు చాళుక్య సింహాసనాన్ని అధిష్టించడానికి తన పిన తండ్రియైన రెండవ విక్రమాదిత్యుడు అడ్డుకొనెను. ఈ పరిస్థితుల్లో అతని సామంతులు కూడా అతన్ని ఒంటరిగా చేసిరి. అయితే నమ్మకస్తులు, సమర్థవంతులూ అయిన కొందరు రాజోద్యోగుల సహాయంతో మొదటి అమ్మరాజు చాళుక్య సింహాసనం అధిష్టించెను. ఏడు సంవత్సరాలు పాలించెను. మొదటి అమ్మరాజు కాలంలోనే రాజ మహేంద్ర పురం (రాజమండ్రి) స్థాపించబడెను.

చాళుక్య సామ్రాజ్యంలో అభద్రత ఎక్కువయ్యెను. తరచుగా పాలకులు మారుట వలన ప్రజలలో విశ్వాసం తగ్గెను. ప్రజాక్షేమము కన్నా సింహాసనాధికారం కొరకు కొట్లాటలు ఎక్కువయ్యెను. రాజ్య పాలన పై, పాలకుల పై ప్రజలు మక్కువ చూపలేదు. ఎప్పుడు ఏమి జరుగునో తెలియని ప్రజలు వ్యవసాయము, వ్యాపారము, చేతి వృత్తులు మొదలైన వాటి యందు ఎక్కువ ధనాన్ని చూపలేకపోయిరి. ప్రజలకు తలసరి ఆదాయం తగ్గి, పన్నులు సరిగా చెల్లించలేక పోయిరి. రాష్ట్రకూటులొకవైపు, కళింగ రాజులొక వైపు చాళుక్య రాజ్యం పై కన్ను వేసి ఉంచిరి. చాళుక్య వైభవము ఆర్థిక దుస్థితి వల్ల రాజకీయ సంక్షోభం వల్ల వెలవెలబోయెను. ఎట్టి రాజ్య వంశమైనను ఎంత వైభవముగా పాలన చేసిననూ కడకు దుస్థితికి పాల్పడుట అనివార్యమగును. దానార్ణవుని కాలంలో చాళుక్య రాజ్యలక్ష్మి వైభవమును కోల్పోయెను. ఇతని 'మంగల్లు తామ్ర పట్టిక' నాటి పరిస్థితులను వివరించినది.

## 12.8 ముగింపు :-

క్రీ॥శ॥ 624లో బాదామి చాళుక్య ప్రభువైన రెండవ పులకేశిచే తన ప్రియ సోదరుడైన కుబ్జ విష్ణు వర్ధనునిచే స్థాపించబడిన వేంగీ చాళుక్య వంశము క్రీ॥శ॥ 1200 వరకు కొనసాగింది. వీరు స్థానికులు కానప్పటికి, తెలుగు భాష తెలియని వారైనప్పటికి, తెలుగు దేశమును తమ సొంత దేశముగా భావించి, సుస్థిరమైన అభివృద్ధికరమైన పాలన చేశారు. వీరి కాలంలో దేవాలయ నిర్మాణం, సాహిత్య పోషణ, సంగీత నాట్య శాస్త్రాల పోషణ బాగా సాగింది. ధార్మిక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో ఎనలేని అభివృద్ధి జరిగింది. తెలుగు వారికి గర్వకారణమైన మహాభారత అనువాదము వీరి కాలంలోనే జరిగింది. తెలుగు లిపి, తెలుగు సంస్కృతి రూపు రేఖలు చాళుక్యుల కాలంలోనే రూపుదిద్దుకున్నాయి.

## 12.9 మాదిరి ప్రశ్నలు:-

1. వేంగి చాళుక్య సంక్షిప్త వంశక్రమాన్ని తెలుపుము.

## 12.10 ఉపయుక్త గ్రంథాలు:-

1. The Chalukyas of Vengi : Dr.N. Venkata Ramanaiah

పాఠం - 13

# వేంగీ చాళుక్యుల సాంఘిక సాంస్కృతిక విశేషాలు

# SOCIAL AND CULTURAL CONDITIONS DURING THE TIME OF CHALUKYAS OF VENGI

ముఖ్యాంశాలు:-

13.0 లక్ష్యం

13.1 ఉపోద్ఘాతము

13.2 ప్రభుత్వం

13.3 పాలనా విభాగాలు

13.4 భూదానాలు

13.5 సాహిత్యము

13.6 సామాజిక మార్పు

13.7 వైదిక బ్రాహ్మణులు

13.8 నియోగి బ్రాహ్మణులు

13.9 కుల బ్రాహ్మణులు

13.10 బోయ బ్రాహ్మణులు

13.11 కమ్మ బ్రాహ్మణులు

13.12 కులములు - వృత్తులు

13.13 శూద్రులు

13.14 చండాలురు

13.15 మాదిరి ప్రశ్నలు

13.16 ఉపయుక్త గ్రంథాలు

## 13.0 లక్ష్యం:-

ఈ పాఠంలో వేంగీ చాళుక్యుల పాలనా కాలంలోని వివిధ సాంఘిక, సాంస్కృతిక, విద్యా, ధార్మిక విషయాలను వివరంగా తెలియజేయుట ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## 13.1 ఉపోద్ఘాతము:-

వేంగీ చాళుక్యుల పాలనా కాలాన్ని తెలుగు దేశమున సామాజిక, ధార్మిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో సాధించిన ప్రగతి వల్ల స్వర్ణ యుగమని భావించవచ్చు. వేంగీ చాళుక్యులు స్థానికులు కారు. అయిన సుదీర్ఘము, సుస్థిరము అయిన క్రీ॥శ॥ 610 నుండి 1200 వరకు పాలించుటచే తమ మాతృ భూమిని మరచి, తెలుగు దేశములో ఎన్నో మౌలికమైన మార్పుల్ని తెచ్చి తెలుగుదనానికి వన్నె తెచ్చుటే గాక తెలుగు నేలను దేవాలయ, అగ్రహార, తటాక వనములతో అలంకరించారు.

## 13.2 ప్రభుత్వము :-

వేంగీ చాళుక్యుల పాలన రాచరికపు వ్యవస్థ పై నిర్మించబడింది. పెద్ద కుమారుడో, తమ్ముడో, తమ్ముడి కుమారులో సింహాసనం ఆక్రమించేవారు. రాచరికపు వారసత్వం పరిస్థితులకు అనుకూలంగా నడిచెను. రాజు, పట్టమహిషి, యువరాజులతో పాటు మంత్రి, పురోహిత, సచివ, సేనాపతి, దండనాయక, దవ్వారిక, ప్రధాన అధ్యక్ష మొదలైన సాంప్రదాయక ప్రముఖ రాజోద్యోగులతోను, చతురంగ బలంతో పాటు, మూల బలమనె అనే ముఖ్య సేనతో పరిపాలన సాగేది. మంత్రుల సలహాలతోను, జోతిష్య, ఖగోళ శాస్త్రజ్ఞుల సూచనల మేరకు యుద్ధాల ప్రకటన, సంధి, సంప్రదింపులు, పుణ్యాకార్యాలు, దాన ధర్మాల్ని నిర్వర్తించేవారు. వేంగీ చాళుక్యుల పాలనలో జారీ చేయబడిన పెక్కు శాసనాలలో తిధి, నక్షత్ర, గ్రహణ మొదలైన వివరాలు చెప్పబడుటచే, పంచాంగ కర్తల విజ్ఞానాన్ని విరివిగా వాడబడినట్లు వీటి యందు రాజులు, ప్రజలు విధిగా విశ్వసించినట్లు తెలియగలదు.

## 13.3 పాలనా విభాగాలు (ADMINISTRATIVE DIVISIONS):-

స్వబాహుబల సామర్థ్యోపార్జితమైన రాజ్యాన్ని చాళుక్యులు పరిపాలనా సౌలభ్యము కొరకు గ్రామము, 'రాష్ట్ర' విషయం మొదలైన భాగాలుగా విభజించి పాలించారు. శాతవాహన కాలంలో 'ఆహార' మనే పాలనా విభాగము వీరి కాలంలో వేరే రూపముతో అమలులో వున్నది. బహుశ చాళుక్యులు పాత పరిపాలనా వ్యవస్థను సంస్కరించి క్రొత్త పరిపాలనా విభాగములైన 'నాడు' రాష్ట్ర విషయాల్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర విషయములు అనే రెండు ఒకే భూభాగానికి ఉపయోగించుటచే, వీటిలో ఏ భాగము పెద్దదో, ఏ భాగము చిన్నదో తెలిసికొనుట సాధ్యం కాదు. 'గుద్రవార' లేక 'గుద్రహార' విషయం కృష్ణాజిల్లా, గుడివాడ, బంటుమిల్లి, నూజివీడు తాలూకా ప్రాంతములు. 'పగునహార' విషయం ప॥గో॥ జిల్లా భీమవరం, నరసాపురం తాలూకాలు. విషయముతో కూడిన పరిపాలనా విభాగాలు. 'పష్కి' విషయ విశాఖ జిల్లా చీపురు పల్లి తాలూకా. 'అత్తిలి' విషయ ప॥గో॥ జిల్లా భీమవరం, అత్తిలి తాలూకా. 'నాడు'తో కూడిన విషయాలు, వెలనాడు విషయ, గుంటూరు జిల్లా తెనాలి, గుంటూరు తాలూకా ప్రాంతాలు. వేంగీనాడు విషయ ప॥గో॥ జిల్లా ఏలూరు తాలూకా, నట(త) వాడి విషయ లేక పెన్నాటవాడి విషయ కృష్ణాజిల్లా మంగలు, నందిగామ తాలూకాలోని ప్రాంతాలు. 'ప్రోలునాడు' విషయ తూ॥గో॥ జిల్లా తూర్పు భాగము. 'కమ్మినాడు' విషయ నేటి ప్రకాశం జిల్లా ఒంగోలు, బాపట్ల, నర్సరావు పేట తాలూకాలు. దీనిని 'కమ్మనాడు' విషయంగాను, కర్మ రాష్ట్రంగాను వ్యవహరించారు. దీని ప్రస్తావన తొలిసారిగా ఇక్ష్వాకు వీర పురుష దత్తుని జగ్గయ్య పేట ప్రాకృత శాసనములో 'కమ్మ కరఠమని' వున్నది. అటు తరువాత పల్లవ చాళుక్య శాసనాల్లో కర్మ రాష్ట్రమని చెప్పబడింది. దీనికే కమ్మనాడనే మరొక పేరుంది. ఇది నేటి ప్రకాశం జిల్లాలోని బాపట్ల, ఒంగోలు, మార్కాపురం తాలూకాల్లోని కొంత భాగమై ఉండవచ్చు. గుండ్లకమ్మ నదిని ఆనుకొని ఉండటం ఈ విషయానికి కమ్మనాటి విషయమని పేరు వచ్చింది. అంతేగాని ఇది కొందరనుకున్నట్లు కమ్మ 'కులస్థుల' జన్మభూమి, తొలి నివాసము కానేకాదు.

**ఈ** కాలమున ప్రసిద్ధి చెందిన విషయాల్లో 'కందేరు' లేక 'కంతేరు' వాటి విషయమొకటి. ఇది నేటి గుంటూరు **జిల్లా కంతేరు'** కేంద్రంగా గలది. చాళుక్య జయ సింహుని కాలంలో ఈ నగరం ఉప రాజధానిగా ఉండేది. ఇది కాల క్రమమున **'ఉత్తర** కందేరు', **'ఈమని** కందేరు', 'గుండ్ల కందేరు' అను భాగాలుగా విభజింపబడెను. మొదటి చాళుక్య భీముని బెజవాడ శాసనంలో ఉత్తర కందేరు' వాటిలోని కూకిపట్టు గ్రామ ప్రస్తావన కలదు. ఈ కూకిపట్టు నేటి సత్తెనపల్లి తాలూకాలోని డోకిపట్టుగా గుర్తించవచ్చు. అనగా సత్తెనపల్లి తాలూకాలోని ఆగ్నేయ భాగం ఉత్తర కందేరు వాటిగా భావించవచ్చు. 'గుండ్ల కందేరు' వాటి విషయ వివాదాంశమైంది. కొందరు దీనిని కంతేరు నుండి అమరావతిలోని గుడుల (దేవాలయాలు) వరకు వున్న భూభాగమని తలంచగా, మరికొందరు యిది కంతేరు నుండి గుండ్లకమ్మ నది వరకు వున్న భూభాగమని తలంచారు. వాటిలో గుండ్లకమ్మ వరకు గల భూమిని **గుండ్ల** కందేరుగా భావించుట సమంజసము. 'ప్రోలునాడు' విషయము కాలక్రమమున విస్తరించింది. ఇది తూ॥గో॥ జిల్లాలోని **తుని,** కాకినాడ, పిఠాపురము తాలూకాలోని కొంత భూ భాగమునకు సమానము.

## 13.4 భూదానాలు (LAND GRANTS) :-

బ్రాహ్మణ ప్రముఖులకు నివాసము నిమిత్తము ప్రత్యేక భూములను దానం చేసే ఆచారము శాస్త్ర సమ్మతమని భావించుట వల్ల పూర్వపు పాలకుల వలెనే వేంగీ చాళుక్య రాజులు పెక్కు అగ్రహారాల్ని నెలకొల్పారు. 'అగ్రహారము' రక్షిత నివాస స్థావరము. అన్ని విధములైన పన్నుల మినహాయింపుతో దానము చేయబడిన బ్రాహ్మణ గ్రామము. పంచములకు, సైనికులకు అగ్రహారంలో ప్రవేశము నిషేధము.

**తూర్పు** చాళుక్యులు తెలుగు దేశమున సాంస్కృతిక స్థాయిని పెంచ తలంచి విద్యా సంస్కార సంపన్నులైన బ్రాహ్మణులకు **ఇతోధికమైన ఆదరణ కల్పించి పెక్కు** మందిని రావించి వారికి నివాస స్థావరము అగ్రహారములను, పోషణార్థము భూములను బ్రహ్మ **దేవాలయములను** దానము చేసిన **దాఖలాలున్నవి.** పషకి విషయములోని కుమూలూరులో 40,000 నివర్తనాల పొలాన్ని వివిధ గోత్రాలకు **చెందిన** 40 మంది చాందోడ బ్రాహ్మణ పండితులకు దానంగా ఇవ్వబడెను. వీరు పోతునూక అగ్రహారీకులు. ఇదే విషయంలో చెరుపుర (చీపుర పల్లి), కొండ నాగురు, ఇరుబులి, మంజుమూరు, పగునూరు బ్రాహ్మణ దేవాలయాలు వాజసనేయ చరణానికి చెందిన చండిశర్మకు దానంగా ఇవ్వబడెను.

ప్రోలునాడు విషయమునందలి పొలమూరు అగ్రహారము చాళుక్యులకు పూర్వము నందే ఉండెను. చాళుక్య ఆక్రమణ కాలమందు ఈ అగ్రహారీకులు తమ భుక్త హక్కును కోల్పోవుటచే మొదటి చాళుక్య జయసింహుడు, పూర్వ అగ్రహారీకులకు పొలమూరును తిరిగి ఇచ్చి వేసెను. జలయూరు (జల్లూరు), బ్రహ్మదేయము అన్ని పన్నుల మినహాయింపుతో పూల తోటలతోను, ఇళ్ళ స్థలాలతోను గృహస్థుడైన కేశవ వర్మకు దానంగా ఇవ్వబడెను. ఉత్తర కందేరు వాటిలోని వెడతలూరు (వెల్లటూరు) వేద వేదాంగ పండితులైన 45 మంది బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇవ్వబడెను. కూకిపట్టు గ్రామరి వైదిక విద్వాంసుడు 'ఉమరకంతబోయ' **అయిన పోతమయ్యకు** అగ్రహారంగా యివ్వబడెను. గుండ్ల కంతేరు వాటిలోని నమ్మూరు (నంబూరు నందు 12 **ఖండి** గల **భూమితో** పాటు, తాడికొండ, అమ్మలపూడి (అమర్ణపూడి, అనువుల పట్టు, గొల్లపుండి (గొల్లపూడి)) గ్రామాలను **దేవభోగంగా** ప్రకటించి అన్ని పన్నుల మినహాయింపుతో కీలకమైయున్న "సమస్త భువనాశ్రయ ఉమామహేశ్వర స్వామి" దేవాలయ పునరుద్ధరణ నిమిత్తము బలి, నైవేద్యాలకు, సత్రాన్ని నడిపేందుకు గోరంట్ల వాస్తవ్యుడైన విష్ణు శర్మకు దానంగా ఇవ్వబడెను.

కంతేరు వాటి విషయంలోని నిడుపట్టు (నిడమర్రు) పద, క్రమ, అనుక్రమలతో ద్వివేది, పురాణ, ఇతిహాస, ఉపనిషత్తులతో **పాటు అనేక** ధర్మ శాస్త్రములందు నిష్ణాతుడైన కాటి శర్మకు దానంగా ఇవ్వబడెను. మండ శర్మ అసన పురమూల ఘటికకు **(పిడుగురాళ్ళ)** ప్రాచార్యుడుగ నుండెను. ఇతడు తైత్తరీయచ బ్రహ్మచారి (యజుర్వేద) ఇదే విషయమునందలి కొంబట్టు **(కొమలి) అగ్రహారము** నాలుగు శాస్త్రములను ఎరిగి తైత్తరీయ **శాఖకు** చెందిన సోమకర్మ అను బ్రాహ్మణ ప్రముఖునకు దానంగా ఇవ్వబడెను. **క్రాంజ (కాజ)** మొదటి అమ్మరాజు కాలంలో అగ్రహారంగా ఇవ్వబడెను. అయితే రెండవ చాళుక్యభీముని సైన్యాధికారి, సలహాదారుడైన

గుండమేరుభట్ట తన ప్రభువును ప్రీతి చేసి క్రాంజకు బ్రహ్మదేయముగ మార్చి బ్రాహ్మణులకు దానము చేసెను. క్రమపీఠ, ఆపస్తంభ సూత్రుడు వేద వేదాంగ పండితుడైన కొమ్మన అనే బ్రాహ్మణ గృహస్తునకు రెండవ చాళుక్య భీముడు కొడతల్లి అగ్రహారమును దానము చేసెను.

కర్మ రాష్ట్ర విషయము నందలి రేమూర గ్రామం కుమార శర్మ అనే బ్రాహ్మణ ప్రముఖునికి అగ్రహారంగా ఇవ్వబడినది. సామవేద విద్యార్థులకు (చాందోగ్యులు) చందలూరు గ్రామం 12 భాగములుగా విభజించి దానంగా ఇవ్వబడినది.

నూతలపట్టు గ్రామాన్ని కుండిదోనదర్శి అనే తైత్తరీయ బ్రాహ్మణునకు అగ్రహారంగా దానం చేయబడినది. పెణకపట్టు బ్రహ్మదేయాన్ని శ్రీ ఎల్లద్రోణ శర్మ అనే తైత్తరీయ బ్రాహ్మణునకు ఇవ్వబడెను. తుమ్మయవేణ అనబడే 12 కుగ్రామాల భూమిని అగ్రహారంగా మార్చి క్రోవి కుటుంబానికి చెందిన మూసియ శర్మ అనే బ్రాహ్మణునకు అగ్రహారంగా ఇవ్వబడింది. వంగిపట్టు బ్రాహ్మణ అగ్రహారముగా అనేక తూర్పు చాళుక్య శాసనాల్లో చెప్పబడింది. ఇదే నేటి వంకాయల పాడు. ఇచ్చట బ్రాహ్మణ ప్రముఖులు అనేక అగ్రహారములను దానముగా పొందిరి.

అత్తిలి విషయంలో అరిమేరు (ఆరేడు) అనే గ్రామంలో సూరిశర్మ అనే అధర్వా వేదికిని ఇంటి స్థలంతో పాటు రెండు నివర్తనాల స్థలాన్ని దానంగా ఇచ్చెను. అడ్డకాలి గచ్చలోని వలహరిగణానికి, చెందిన అర్హనంది అనే జైన ఆచార్యునికి జైనాలయాన్ని నిర్మించే నిమిత్తమూ, సత్రాలయానికి మరమ్మత్తులు చేసేందుకు పెదకలు చుంబట్టు (కెలుచుంబర్రును) దేవబోగంగా దానం ఇవ్వబడెను.

గుద్రహార విషయంలోని ఈ క్రింది గ్రామాలు, రెండు బల్లి (బంటు మిల్లి) ని తైత్తరీయ శాఖకు చెందిన భవ శర్మకు అగ్రహారంగా ఇవ్వబడినది. గుమ్మలూరు గ్రామంలో 8 ఖండాలు గల భూమిని బ్రహ్మదేయంగా మాదవ శర్మకు దానం చేయబడెను. సొంత గ్రామము (సాతలూరు) వంద మంది బ్రాహ్మణ ప్రముఖులకు అగ్రహారంగా ఇవ్వబడినది. తాండపట్టు గ్రామాన్ని తైత్తరీయ శాఖకు చెందిన వినయాది శర్మకు అగ్రహారంగా ఇవ్వబడింది. తాలుపట్టు అగ్రహారం రెండవ అమ్మరాజు కాలంలో ఒక కుల బ్రాహ్మణునికి అగ్రహారంగా ఇవ్వబడింది.

వెలనాటి విషయమునందలి ఈ క్రింది గ్రామాలు అగ్రహారాలుగా ఇవ్వబడినట్లు తెలియుచున్నది. శకారంబు (శాకమూరు), కారంచేడు వాస్తవ్యుడైన దేవ శర్మ భట్టారక అనే బ్రాహ్మణునికి అగ్రహరంగా ఇవ్వబడింది. రెండో అమ్మరాజు కొలువులో 'ముఖ్య సువర్ణ భాండాగారిక' ఉద్యోగములను నిర్వర్తించిన కోరిమియ శర్మకు యలవర్రు గ్రామం అగ్రహారంగా ఇవ్వబడినది. పెదదేగల పట్టును దేవః భోగంగా మార్చి (పెదగాదెలిపర్రు) జైన దేవాలయము కొరకు రెండవ అమ్మరాజు దానం చేసెను.

గుద్రహార విషయము నందలి పెణకపట్టు అగ్రహారం మొదటి చాళుక్య జయసింహుని కాలంలో ఏర్పరచబడినది. ఆకులమన్నడు అగ్రహారం విద్దమయ్య అనే బ్రాహ్మణ ప్రముఖునకు దానంగా ఇవ్వబడినది.

పగుపనార (హార) విషయమునందలి ఈ క్రింది గ్రామాలు దానం చేయబడినవి. పెరుమంజిలి (పెనువంచిలి) గ్రామము నందు 12 ఖండిగల వరి విత్తనాలను నాటుటకు సరిపడే భూమిని అగ్ని శర్మ అనే బ్రాహ్మణునకు దానం చేయబడినది. దినకాడు గ్రామంలోని 12 ఖండిగల వరి విత్తనాలను నాటేందుకు సరిపడే భూమిని మాధవ శర్మ అనే చతుర్వేదికి బ్రహ్మదేయంగా ఇవ్వబడినది. కొండమపట్టు గ్రామాన్ని అగ్రహారంగా మార్చి వేద వేదాంగ పండితులగు 105 మంది బ్రాహ్మణులకు ఇవ్వబడెను. దిగుంబట్టు (దిగమర్రు) విద్దమయ్య అనే మంత్రికి అగ్రహారంగా ఇవ్వబడినది. తాండేఱు (తుందుర్రు) గ్రామాన్ని అమాత్యుడు గాని, సామంతుని గాను, "విప్రనారాయణ" బిరుదమును కల్గిన కుప్పనయ్యకు అగ్రహారముగా ఇవ్వబడినది. ఉండి రాజదిద్య అనే బ్రాహ్మణ సైనికాధికారికి అగ్రహారంగా ఇవ్వబడినది.

## 13.5 సాహిత్యము (Literature) :-

ఆంధ్రదేశమును మౌర్యుల తరువాత పాలించిన తొలి స్థానిక రాజవంశము ఆంధ్ర శాతవాహనులదే. వీరు ప్రాకృత భాషను రాజ భాషగా ఎన్నుకొనిరి. పైశాచి భాషలో వ్రాయబడిన గుణాఢ్యుని 'బృహత్కథ' మహారాష్ట్ర ప్రాకృతమున లిఖించబడిన హాలుని గాధా సప్తపతి, సంస్కృతమున రచించబడిన శర్వవర్మ కాతంత్ర్య వ్యాకరణము చెప్పదగినవి ఆంధ్ర తెలుగు తెనుగు నామాలతో పిలువబడే స్థానికుల భాష శాసనములందు కనిపించకపోవడం విశేషము.

అయితే కొందరు పండితులు గాధాసప్తశతిలో తెలుగు మాటలున్నట్లు గుర్తించిరి. కాని అవి ఎక్కడో పోలికల వలన గుర్తించబడినవే గాని వాటి రచయితల చేత ఉద్దేశ్య పూర్వకంగా ఉపయోగించబడినవి కావని తెలుస్తున్నది. శాసనాల్లో తెలుగుందని గుర్తించినారు. కానీ శాసనాల్లో వ్యక్తుల పేర్లు, దాన భూముల సరిహద్దులు, ఎల్లలు తెలుగు భాషలో వ్రాయటం నిజమే. అది తప్పని సరి. స్థానిక ఎల్లలను, పేర్లను సంస్కృతీకరణం చెయ్యటం వలన మూల శాసనాలకు ముప్పు వస్తుందని గ్రహించిన దాన గ్రహీతలు వాటిని స్థానిక భాషలోనే వ్రాయమని కోరటం జరిగివుండవచ్చు.

వేంగీని రాజధానిగా పాలించిన శాలంకాయనులు తూర్పు చాళుక్యుల శాసనాల్లో తెలుగు చోటు చేసుకుంది. తెలుగును భాషగా, స్థానికుల భావాన్ని వ్రాతలో పెట్టిన ఘనత పాక్షికంగా శాలంకాయనులకు, పూర్తిగా తూర్పు చాళుక్య రాజులకు దక్కుతుంది. తెలుగు భాషగా, గుణగ విజయాదిత్యుని పాలన నుండి క్రీ॥శ॥ 849 - 50 పర్వ ప్రక్రియలో కనిపించుటచే ఇంతకు పూర్వము నుండియే తెలుగు పద్యముండెనని చెప్పుటకు అవకాశమున్నది. పండరంగుని అద్దంకి శిలా శాసనములో తరువోజ ఉన్నది. చాళుక్య భీముని ధర్మవరపు శాసనములో సీస పద్యమున్నది. క్రీ॥శ॥ 950 నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో మధ్యక్కరలున్నవి. వీటి తరువాత నన్నయచే ఆంధ్రమున అనువదింపబడిన "శ్రీ మదాంధ్ర మహాభారతమే" కనిపించు మహా గ్రంథము.

## 13.6 సామాజిక మార్పు (SOCIAL CHANGE):-

తూర్పు చాళుక్యుల కాలమందు ఆంధ్ర దేశమున ఎన్నో సామాజిక మార్పులు జరిగినవి. వర్ణ వ్యవస్థ పై పునాది పై నిర్మించబడిన సామాజిక సౌధంలో కొన్ని కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములతో పాటు చండాల అనబడే అంటరాని వారి సమాజం కూడా ధర్మ శాస్త్రముల స్మృతుల పరిధికి వెలుపల జీవనము చేయుచుండెను. అయితే పాలనా యంత్రాంగము నందు విద్యా ధర్మ కార్య పరిరక్షణ నిర్వహణల యందు, శాస్త్రకోవిదులు, నియమ నిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణులే ఆధిపత్యము వహించిరి.

చాళుక్యుల పాలనా కాలమందు, బ్రాహ్మణ వర్ణస్థులలో ఎన్నో భేదములు ఉత్పన్నమయ్యెను. ఈ కాలపు శాసనముల వలన, వీరిలో వైదిక నియోగి భేదములతో పాటు, కుల బ్రాహ్మణ, బోయ బ్రాహ్మణులు, కమ్మ బ్రాహ్మణులు అనువారు కూడా వున్నట్లు తెలియుచున్నది. ప్రాంతీయ భేదమును అనుసరించి కొన్ని తెగలుగా విభజింపబడిరి. గోత్ర ప్రవరలతో కూడిన బ్రాహ్మణ సమాజము ఆంధ్ర దేశమున వేద, పురాణ, ఇతిహాస, శాస్త్ర అధ్యయనములందు కడు నైపుణ్యత కల్గిన సాంప్రదాయ సాంస్కృతిక పురోగతులకు ఎంతో దోహదము చేసినది.

## 13.7 వైదిక బ్రాహ్మణులు (VAIDIKA BRAHMINS):-

వైదిక బ్రాహ్మణులు వేదాధ్యయనము, తత్ సంబంధమైన కర్మ కాండల యందు కడు నేర్పరులు. దేవాలయ పూజలు, యజ్ఞ యాజన నిర్వహణల యందు జీవనము రాజోద్యోగులైన నియోగులకన్నా సామాజిక స్థాయి యందు దిగువ స్థాయి వారినే గ్రహించాలి. అగ్రహారములను, దేవాదాయ భూములను, బ్రహ్మదేయములనెడి భూదానములను అనుభవించుచు షట్ కర్మ నిరతులై (యజ్ఞ, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహణ) యుండి ధార్మిక జీవనమును గడిపిరి. వీరి ధర్మ పరాయణత్వము

వలన ఆధ్యాత్మిక చింతన వలన చాళుక్య సామ్రాజ్యము నందు సాంస్కృతిక పురోభివృద్ధి చెందినది. చాళుక్య రాజ్యకాలమందు జారీ చేయబడిన దాన శాసనములన్నియు వీరి ధర్మ కార్య నిర్వహణ నిమిత్తము ఉద్దేశింపబడినవి. అగ్రహారములు ప్రత్యేక బ్రాహ్మణ స్థావరములు. వీటికి అనేక రక్షణలు, రాయితీలు, మినహాయింపులు కలిగించబడినవి. సైన్యము, చండాలులు, రాజు సయితము అనుమతి లేనిదే వీటి యందు ప్రవేశము లేదు.

## 13.8 నియోగి బ్రాహ్మణులు (NIYOGI BRAHMINS) :-

బ్రాహ్మణ సమాజంలోని మరియొక శాఖ నియోగి. ఈ శాఖ పూర్వపు బ్రాహ్మణ సమాజమందు వున్నట్లు ఆధారాలు లేవు. ఆంధ్ర దేశము నందు కనీసము క్రీ॥శ॥ 610 నుండి నియోగులు ఉన్నట్లు తెలుస్తున్నది. వీరినే లౌకిక బ్రాహ్మణులు అని కూడా అంటారు. పట్ట వర్ధకులు బ్రాహ్మణులు కారని కొందరు భావిస్తున్నారు. వీరు జన్మతః బ్రాహ్మణులై ఉండి పశ్చిమ ఆంధ్ర ప్రాంతము నుండి కుబ్జ విష్ణు వర్ధనునితో ఆంధ్ర దేశమునకు తరలివచ్చి, ఆయుధ వృత్తులందు స్థిరపడిరి. వీరి అనన్య సేవల వలన వేంగీ చాళుక్య సామ్రాజ్యము విస్తరించి అభివృద్ధి చెందినది.

పట్టవర్ధిన కులమునకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులలో మహాకాలుడు కుబ్జ విష్ణు వర్ధనుని సేనానిగ నుండెను. కేడియ రాజు అతని కుమారుడైన పండరంగ గుణగ విజయాదిత్యుని ముఖ్య సేనానులుగా ఉండి ఎన్నో యుద్ధములు చేసి, చాళుక్య రాజ్యలక్ష్మియని విజయ లక్ష్మిగా చేసిరి.

అద్దంకి పాలకునిగా పండరంగడు చాళుక్య ప్రభువులకు ఎనలేని సేవ చేసెను. వంశపారం పర్యంగా సైన్యాధిపత్యం పండరంగ నిర్వర్తించుటతో పాటు వేంగీ ప్రధానమంత్రిగా కూడా చేసెను. కందుకూరుని రాజధానిగా చేసుకొన్న పండరంగడు బోయ తిరుగుబాటును అణచి రాష్ట్రకూటుల యుద్ధములలో విజయాదిత్యునికి ఎన్నో విజయములను చేకూర్చెను. కందుకూరును బెజవాడ అంతటి మహానగరముగా తీర్చిదిద్ది సైనిక స్థావరముగా స్థిరపరిచెను. అద్దంకిలో సూర్య దేవాలయమును నిర్మించి అనేకులకు భూదానములు చేసినట్లు అతని అద్దంకి శాసనముల వలన తెలుస్తున్నది.

## 13.9 కుల బ్రాహ్మణులు (KULA BRAHMINS):-

వేంగీ చాళుక్యుల కాల మందు ఆవిర్భవించిన సామాజిక వ్యవస్థలలో కుల వ్యవస్థ పేర్కొనదగినది. కుల బ్రాహ్మణ అను పదమునకు పండితుల మధ్య ఏకాభిప్రాయము లేదు. కొందరు దీనిని 'కుల గురువు' గాను, మరికొందరు 'పురోహితుని' గాను భావించిరి. వాచస్ పత్యము నందలి కులవిప్రః పురోహితః అను అర్థమును తీసుకొని శ్రీ బుర్రా శేషగిరి రావు కుల బ్రాహ్మణ శబ్దమునకు పురోహిత అను అర్థమునిచ్చిరి. అయితే శ్రీ బి.వి. కృష్ణారావు గారు బలవంతులు, మేధా సంపన్నులు అయిన బ్రాహ్మణ యువకులకు వేంగీ చాళుక్య రాజులు వారి రాజ కుమార్తెలను వివాహము చేసి వారికి పుట్టిన ఆడపిల్లలను రాణి వాసమునకు, మగ వారిని క్షత్రియ వర్ణములోనికి తీసుకొన్నారని భావించిరి. అంతేగాక అనులోమ వివాహ పద్ధతి అనుసరించి క్షత్రియ స్త్రీలకు కుల బ్రాహ్మణ యువకుల వలన జన్మించిన వారిని క్షత్రియులుగా భావించిరి. ఆనాడు దక్కన్‌లో నెలకొనియున్న రాజకీయ పరిస్థితులే అటువంటి సామాజిక సర్దుబాట్లకు దోహదం చేసినది. మేలఖేడ్ పాలకులైన రాష్ట్రకూటులతో నిరంతరము వైరము కలిగిన వేంగి చాళుక్యులు అన్ని వేళలా తమ రాజకుమార్తెలను శత్రువులకు యిచ్చి వివాహము చేయుటకు సిద్ధముగా లేకుండిరి. అంతేగాకుండా, వారి సామంతులతో వియ్యమందు కొనుటకు వారి అంతస్థు అడ్డువచ్చెను. బ్రాహ్మణ ప్రముఖులకు వేంగీ చాళుక్యులు వారి రాజకుమార్తెలను యిచ్చి వివాహము చేయుటయే ఉత్తమమని తలంచిరి. అట్టి బ్రాహ్మణ యువకులను కుల బ్రాహ్మణులుగా పిలిచిరి.

వాచస్ పత్యము నందు కుల విప్ర శబ్దమునకు ఉదాహరణలేమియూ కానరావు. వేంగీ చాళుక్యుల శాసనములందు కుల బ్రాహ్మణ శబ్దము పురోహిత శబ్దమునకు తుల్యమని ఎక్కడను చెప్పలేదు. నన్నయ పురోహిత శబ్దమును కుల బ్రాహ్మణ శబ్దమునకు

పర్యాయముగా వాడలేదు. "శ్రీ మదాంధ్ర మహా భారతము" నందలి "తన కుల బ్రాహ్మణ" అని దానిని "తన కుల" అనే అర్థముతో నన్నయ రాజరాజ నరేంద్రుని కులము వాడని శ్రీ చిలుకూరి వీరభద్రరావు గారు వ్యాఖ్యానించారు. నన్నయ కుల బ్రాహ్మణుడే గాని రాజ రాజ నరేంద్రుడు కులమునకు మాత్రం చెందినవాడు కాదు. కుల బ్రాహ్మణులు కన్నా ఎక్కువగా గౌరవ మర్యాదలు పొందుటచే వారి నుండి వేరుగా గుర్తింపు కొరకు కుల బ్రాహ్మణులుగా పిలవబడిరి.

## 13.10 బోయ బ్రాహ్మణులు (BOYA BRAHMINS):-

ఈ కాలము నందలి మరియొక బ్రాహ్మణ తెగ బోయ బ్రాహ్మణ. కొండనాగూరు, చందలూరు శాసనాలలో "బోళ్" అను శబ్దము, బోయ బ్రాహ్మణ తెగకు కారణమైంది. ఈ శాసనాలలో దాన గ్రహీతలైన బ్రాహ్మణులను బోయలని వ్యవహరించిరి. "బోళ్" అను శబ్దము బోయ అనుదానికి బహువచన రూపము. బోయ శబ్దము భోజక శబ్దముగా భావించి కొందరు చరిత్రకారులు "అనుభవించు" వారని అర్థము రాబట్టిరి. ఏ దానమైన అనుభవించుట కొరకే ఇవ్వబడును. అందువలన ప్రతి గాన గ్రహీతను భోజకుడనియు పిలవవలసి యున్నది. అయితే వీరిలో బోయలని ప్రత్యేకముగా పిలువటంలో మరియొక అర్థము కలదు. బోయలు ఆటవికులు. వీరు విలు విద్య నందు ఆరితేరిన వారే కాక అడవి దారులందు నిర్భయముగా సంచరించగల నేర్పరులు. దేవాలయ పశుగణమును పోషించుచూ వంశ పారంపర్యంగా భూదానములు అనుభవించిరి. వీరు కాలక్రమమున సాంస్కృతిక ప్రభావము వలన రాచ కొలువు నందు చేరుటయే గాక బ్రాహ్మణత్వమును పొంది అగ్రహారికులైరి. అయితే అట్టి బ్రాహ్మణులను మిగిలిన బ్రాహ్మణులుగా గుర్తించక వారిని బోయి బ్రాహ్మణులని పిలిచిరి.

## 13.11 కమ్మ బ్రాహ్మణులు (KAMMA BRAHMINS):-

కమ్మ బ్రాహ్మణులనబడే మరియొక బ్రాహ్మణ సమాజం వున్నట్లు రెండవ అమ్మరాజు గొల్లల మామిడాడ తామ్ర శాసనము వలన తెలియుచున్నది. (శారద) గోవిందుని కుమారుడు దేవార్యుని మనుమడైన కమ్మ కులజుడని ఈ శాసనం వలన తెలుస్తుంది.

దేవార్యుడు తర్క, వ్యాకరణములందు పండితుడని గొప్ప శివ భక్తుడని చెప్పబడింది. అయితే 'కమ్మకులజ' శబ్దమునకు గురించిన వివరణలో చరిత్రకారుల మధ్య సఖ్యత కుదరలేదు. శ్రీ కె.వి. లక్ష్మణరావు గారు కమ్మ బ్రాహ్మణులు కమ్మనాటి బ్రాహ్మణులుగా భావించిరి. (శారద) శ్రీ మల్లపల్లి సోమశేఖర శర్మ గారు కమ్మనాటి బ్రాహ్మణులను షట్ సహస్ర వాసులు లేక ఆరు వేల నియోగి బ్రాహ్మణులలో కలసిన వారని వక్కాణించిరి. వెలనాటిలోని బ్రాహ్మణులను వెలనాటి బ్రాహ్మణులని, కాపులని, వెలమలని పిలిచే ఆచారము వున్నది. కమ్మనాటి యందలి శూద్రులను కమ్మలని, కాపులని, రెడ్లని పేర్కొనిరి. అయితే శూద్రులలో అనేక కులముల వారిని కమ్మవారని పిలిచారో తెల్పుట కష్టము, వీలుకాదు. రెండవ అమ్మరాజు యొక్క ప్రచురించబడని మరియొక తామ్ర శాసనము నందు భరద్వాజ గోత్రమునకు చెందిన "అసనిమూరు" వాస్తవ్యుడైన దేవార్య అనే "కమ్మకులజ" బ్రాహ్మణుని గురించి వివరమున్నది. (అసనిమూరు వాస్తవ్యోదేవార్యో దేవ సన్నిభాః భరద్వాజన్వయింఅ కుల వ్యవస్థ :) Dr. Y. కుమార స్వామి, ఇటయనల్లో భుని సైన్యాధి పతిగ, కమ్మ కులజుడైన వెన్నెయిబట్టను గూర్చి వివరమున్నది.

కమ్మవారు బ్రాహ్మణులుగా మారుటకు సహించని కొందరు చరిత్రకారులు 'కమ్మకులజ, యందలి 'జ' శాసనము వ్రాయునప్పుడు దొర్లిన దోషమని వాదింపసాగిరి. తమ వాదములకు అనువుగాని పదములను తారీఖులను, పేర్లను వ్రాయునప్పుడు దొర్లిన దోషములని భావించు చరిత్రకారులున్నారు. దోషములు దొరలుట సహజమే అయితే అన్ని శాసన పాఠములందును 'జ' కారము పొరపాటుగా చేరియుండదు కదా! కమ్మకులజ యందలి 'జ' పొరపాటు వలన గాక ఉద్దేశ్యపూర్వకముగానే ఉంచబడినదనుటకు ఎంతైనా అవకాశం వున్నది. బోయ కులము నుండి బ్రాహ్మణులుగా మారిన వారిని మిగిలిన వారి నుండి గుర్తించుట ప్రత్యేకముగా బోయి బ్రాహ్మణు/లని వ్రాయగా కమ్మ కులము నుండి వచ్చిన వారిని కమ్మకులజ బ్రాహ్మణులని వ్రాయుట తప్పెట్లగును? ఆనాటి బ్రాహ్మణ సమాజం వీరితో వివాహాది సామాజిక వ్యవహారములందు కలియకుండా వుండుటకే ప్రత్యేకముగా పేర్కొనిరి.

కమ్మకులస్థులు శాస్త్రములందు పాండిత్యమును సంపాదించి ధైర్య సాహసములను ప్రదర్శించి బ్రాహ్మణులగుటయే గాక అనేక ప్రముఖ రాజోద్యోగములను సమర్ధవంతముగా నిర్వర్తించిరని తెలియుచున్నది.

## 13.12 కులములు - వృత్తులు (CASTES AND CRAFTS):-

భారతీయ సమాజము వర్ణ వ్యవస్థ పై నిర్మితమైన మహాసౌధము. దాని బలము వర్ణ వ్యవస్థ పైనే ఆధారపడి వున్నది. పై వర్ణములనబడే బ్రాహ్మణ శాస్త్ర జ్ఞాన సంపత్తి కర్మ కాండల నిర్వహణా సామర్థ్యము చేతను, క్షత్రియ ధైర్య సాహస పాలనా సామర్థ్యము చేతను, వైశ్య వర్తక, వాణిజ్య యాజమాన్యములందు గుత్తాధిపత్యము కల్గి ఆర్థిక సుస్థిరత కల్గియుండుట చేతనూ, సమాజమున మిగిలిన వారి కన్న ఆధిక్యతను పొందగల్గిరి. అయితే వర్ణ వ్యవస్థ వృత్తుల వలన జన్మించినదగుటచే వృత్తుల మార్పులలో ఆనాటి సమాజము నందు అంత పట్టింపు ఉన్నట్లు కానరాదు.

సాంకేతిక నిపుణత శాస్త్రీయ పరిజ్ఞానము, ఆర్థిక సంపత్తి లేనివారు జన్మకు, జన్మకు ప్రాధాన్యతను ప్రకటించుకొని వారి వర్ణమును పేర్కొనసాగినారు. బ్రాహ్మణులందరూ షట్ కర్మనిరతులు (యజ్ఞ, యాజన, అధ్యయన, అధ్యాపక, దాన, ప్రతి గ్రహణ) కారు అయినను బ్రాహ్మణులుగా చెలామణి అయినారు. ఎందరో బ్రాహ్మణ ప్రముఖులు క్షత్రియ వృత్తులను అవలంబించిరి. క్షత్రియ వృత్తులను అనుసరించి బ్రాహ్మణులుగానే పేర్కొనబడి అన్ని విధములైన రాయితీలను అనుభవించిరి వీరు నియోగ బ్రాహ్మణులనబడే పాలక వర్ణమునకు చెందిరి. నియోగ శబ్దము అర్థం నియమించబడిన వారని భావించిరి. అయితే నియోగ పద్ధతి వలన వంశాభివృద్ధిని గాంచిన వారని తలంచుటలో సత్యమున్నది. ప్రాచీన భారతీయ సాంప్రదాయము నందు 'నియోగ' పద్ధతి వలన సంతానమును, వంశాభివృద్ధిని గాంచిన ఉదంతములెన్నియో గలవు. నియోగము ఈనాడు సాంఘికముగా గౌరవమును పొందలేక పోవచ్చును. అయితే ఆనాడు నియోగము ధర్మ సమ్మతమే.

సంతానము లేని భార్యలు గాని, వితంతువులు గాని పురుషుల వలన సంఘ సమ్మతము వలన సంతానమును పొందే విధానమును 'నియోగము' అని అందురు. భర్త జీవించి యుండి అతని వల్ల సంతానము కలుగు అవకాశం లేనప్పుడు అంటు వ్యాధుల వలన గాని, నయము గాని రోగముల వలన గాని బాధపడుచున్నపుడు, తన మరిది వలన వదిన సంతానము పొందు అవకాశము, ఆచారములుండేవి. మరిది లేనపుడు కుటుంబ సభ్యులలో పెద్దవారు తీసుకున్న నిర్ణయమును అనుసరించి ఆరోగ్యము కలిగి, సంస్కారమున్న సపిండ, సగోత్ర, సత్ప్రవర్తనకు నిలిచిన పురుషుని వలన సంతానము పొందవలసి వుండేది.

తన భార్యకు తమ్ముని వలన గాని, నియమితుడైన పురుషుని వలన పుట్టిన సంతానము (భర్తకే) వారసుడగును. సంతానము పొందగోరు స్త్రీ క్షేత్రమని ఆమె భర్త క్షేత్రిన్ లేదా క్షేత్రిక అని పిలిచెదరు. వారసత్వాన్ని నిలిపేందుకు ఈ పద్ధతి నెలకొల్పబడినట్లు తెలియుచున్నది. అయితే నియోగ పద్ధతికి కూడా కొన్ని నియమావళి ఉన్నట్లు ధర్మ శాస్త్రముల వలన తెలుస్తున్నది.

తన భర్త వలన పుత్ర సంతానము పొంది యుండకూడదు. కుల పెద్దలే సంతానము కొరకు ఉద్దేశింపబడిన పురుషుని ఎంపిక చేయవలెను. నియమించబడిన పురుషుడు, మరిది గాని లేకున్నచో సపిండ, సగోత్ర, సత్ప్రవర్తన కలిగినవాడై వుండాలి. సంతానముగోరు స్త్రీ గాని, అందుకు నియమించబడిన పురుషుడు గాని కామదృష్టిని వదిలి విధి నిర్వాహకులుగానే వుండాలి. నియోగి తన దేహమునకు తైలమును వ్రాసికొని ఏ విధమైన సంభాషణ చేయకుండగ, చుంబనములు, శృంగార చేష్టలు లేకుండగ సంభోగము చేయవలెను. ఇట్టి లైంగిక సంబంధము ఒక కుమారుడు జన్మించు వరకే సాగించవలెను. గొడ్డుతనము, ముసలితనము, వ్యాధి పీడిత, విముఖత్వము కలిగిన, గర్భవతి అయిన స్త్రీలు నియోగమునకు పనికిరారని కొందరు భావించిరి (బౌద్ధయాన ధర్మ సూత్రము). ఆ తరువాత వారి సంబంధము మామ కోడళ్ళు మధ్య నుండు గౌరవ సంబంధమే. నియోగించబడిన పురుషుని కన్నా స్త్రీ వయస్సు చిన్నదై వుండాలి.

కుల గురువు గాని, పెద్దలచే గాని నియమింపబడక, తన వదినతో లైంగిక సంబంధము కలిగిన మరిదిని రాజు దండించవలెనని శాస్త్రములు ఘోషించుచున్నవి. అట్టి వారికి 100 పణాములు జరిమానా విధించవలెను. అట్టి సంబంధము వలన జన్మించిన

కుమారుడుని అక్రమ సంతానముగా తలచి ఆస్థికి వారసునిగా నిరాకరించిరి. నియోగ పద్ధతిని గురించిన ఉదంతములు భారతంలో వున్నవి. (ఆదిపర్వం 95, 103, 105)

క్షత్రియ స్త్రీలకు సంతానము కలిగించుటకు కుల బ్రాహ్మణులను నియమించినట్లే సంతానము లేని బ్రాహ్మణ స్త్రీలకు, వితంతువులకు నాటి శాస్త్రములను నియమములనుసరించి నియోగ పద్ధతిని అమలు జరిపి వారసులను పొందుచుండిరి. 'నియోగము' వలన జన్మించిన బ్రాహ్మణులు మిగిలిన బ్రాహ్మణుల కన్న భిన్నముగా గుర్తించుటకు నియోగులని పిలవబడిరి. వీరు తమ సమాజము నందు నియోగులుగానే స్థిరపడిరి. వైదిక నియోగుల మధ్య వివాహాది సాంఘిక కార్యకలాపములు లేవు.

బ్రాహ్మణుల తరువాత సామాజిక స్థాయిని అనుభవించిన వారు క్షత్రియులు. వీరు యజ్ఞ యాగాలను బ్రాహ్మణుల సహాయంతో నిర్వర్తించుటకు అర్హులు. క్షత్రియ దక్షిణా పథము నందు వీరు స్థానికులు. వర్ణ వ్యవస్థకు అతీతులు, పాలకుడు నాయకుడే గాని క్షత్రియుడు కాదు. అందుచేతనే దక్షిణ పథమున పాలించిన పాలకులెందరో ప్రజలను నమ్మించుటకు తమకు సంబంధము లేని సూర్య, చంద్ర వంశములకు సంబంధాన్ని ముడి పెట్టుకున్నారు. కొందరు అర్థరహితమూ, అనూహ్యము అయిన మూల పురుషులను సృష్టించుకొన్నారు. వైదిక కర్మ కాండలను జరిపి బ్రాహ్మణ పండితుల అండ దండలను పొంది రాజులైనారు. క్షత్రియత పాలన వలన ఏర్పడినదే గాని జన్మ వలన వచ్చినది కాదు. ఏ వర్ణము వారైనను పాలకులైతే వారు క్షత్రియ ధర్మాన్ని నిర్వర్తించుట వలన క్షత్రియులైనారు.

వైశ్యులు ఏ సమాజమునందైనను ఎంతో కీలకమైన పాత్ర వహించెదరు. ఆర్థిక పరమైన సర్వ వర్తక వాణిజ్యములందు వీరు నిష్ణాతులు. రాజ్యమందలి సామాజిక సఖ్యత ఆర్థిక సుస్థిరత పైనే ఆధారపడి వున్నది. వైశ్యులు దేశ విదేశము నందలి వస్తువులను సేకరించి వాణిజ్యమునకు దోహదము చేయుచుండిరి. సముద్రయానము ప్రోత్సహించుటయే గాక సముద్ర వ్యాపారం కూడా నడిపిరి. దూర ప్రాచ్య దేశాలైన బర్మా, బోర్నియో, సెలిబస్‌లతో వ్యాపారం చేసిరి. రెండు కొయ్యల ఓడలను ఉపయోగించి తూర్పు తీరమున గల ఘంటశాల, మోటుపల్లి, ఓడరేవుల నుండి విదేశ వర్తకం నడిపిరి. 'పట్టణ శెట్టి', అను బిరుదును ధరించిరి. ఓడ రేవులు గల నగరములను పట్టణములని పిలిచెడి వారు. అట్టి పట్టణములకు వైశ్యులు శ్రేష్టులుగా నుండి వ్యాపారము చేసిరి.

వైశ్యులు కుబేరుని సంతతివారమని చెప్పుకొందురు. కొందరు మణ్కానుని వారమని భావింతురు. (ఎం. సోమశేఖర శర్మ), వీరు పెనుగొండ అయోధ్య అహిచ్ఛత్ర ప్రభువులమని పేర్కొన్నారు. వీరిలో నేటి పశ్చిమ జిల్లా యందలి పెనుగొండ పూర్వాధీశులైన వారే ఆంధ్ర దేశమున ప్రముఖులైనారు నాగరేశ్వరుని ఆరాధకులైన వీరు బ్రాహ్మణ, **క్షత్రియుల వలె** గోత్రములను కల్గియున్నారు. శ్రీనాథుడు హరివంశము నందు వైశ్యులకు 1000 గోత్రములు వున్నవని చెప్పెను. అయితే వీటిలో 102 మాత్రమే కల్తీలేనివని చెప్పెదరు.

వైశ్యుల గురువైన భాస్కరాచార్య విరచితమైన వాసవి పురాణమునందు వాసవి కన్యక అగ్ని ప్రవేశ ఉదంతం వున్నది. అప్పటి వైశ్యులలో 102 గోత్రముల వారు కన్యక మార్గాన్ని అనుసరించగా మిగిలిన వారు ప్రాణ భయంతో వివిధ ప్రాంతాలకు పారిపోయిరి. నాటి నుండి 102 గోత్రాలకు కుల దేవత కన్యక. ఉద్యోతన సూరిచే రచించబడిన 'కువలయమాల' అను గ్రంథంలో దక్షిణ పథము నందలి వర్తక వాణిజ్య వివరములున్నవి. సరుకులను చేరవేయుటకు ఎడ్లబండ్లను ఎక్కువగా ఉపయోగించిరి. దారి దోపిడి వస్తువులను కాపాడు కొనుటకు సార్ధ వాహకులు కూటమి గల ప్రమాణము చేసిరి. రక్షణ నిమిత్తం కొంత సైన్యమును కల్గి వుండిరి.

## 13.13 శూద్రులు (SUDRAS):-

భారతీయ సహజ విభజనలో శూద్రులు సామాజిక స్థాయిలో నాల్గవ వారిగ పరిగణించబడిరి. ధర్మ శాస్త్రములందు వీరిని గురించిన విషయములు మిక్కిలి విడ్డూరముగానున్నవి. ఏ విధమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానము లేని వీరిని మిగిలిన మూడు వర్ణముల వారి వలె యజ్ఞోప వీతమును ధరింపనీయకుండిరి. అయితే స్వర్ణకారులైన కంసాలి, వడ్రంగులు, నేత పనివారైన సాలె,

అస్పృశ్యులైన అగ్నికుల క్షత్రియులు కొండ దొరలు యజ్ఞోపవీతములు ధరించుచుండిరి. శూద్రుల మసాజము వర్ణ, జాతి, కులముల వరేణపై నిర్మించబడినది. వీరిలో పలు వృత్తులవారు కూడా కలరు. శూద్రులలో 18 జాతుల వారు కలరని, సంస్కృత సాహిత్యము వలన తెలుస్తున్నది. ఈ జాతులు వృత్తులు అనుసరించే విధంబు భౌగోళిక విభాగముల పై నిర్ణయించబడినవి. విశ్వ బ్రాహ్మణులని పిలవబడే రథకారులు వేదమును చదువుటకు ప్రయత్నించుటయే గాక బ్రాహ్మణుల వలె అగ్రహారముల కొరకు విప్లవము లేవనెత్తిరి. వీటినే రథకార అగ్రహారములని పిలిచెడివారు.

శూద్రుల ముఖ్య వృత్తి వ్యవసాయము నందు కూలీనాలీ చేసుకొనుటయే. ధృఢకాయులు సైన్యమున చేరి జీవనము సాగించెడి వారు. కొందరు కుల వృత్తులలో స్థిరపడిరి. వీరిని పంచ పురాణము వారని పిలిచెడివారు. స్వర్ణకారులు, కమ్మరులు, రాతిని మలిచేవారు, వడ్రంగులు, కుమ్మరులు, శూద్రులలో ముఖ్యమైన చేతి పనివారు. వీరి సేవలు సమాజానికి ఎంతో అవసరము. స్వర్ణకారులు రాజోద్యోగులై ఆభరణాలు చేయుటతో పాటు తామ్ర శాసనాల్ని చెక్కడంలో ఉద్యోగులై వుండిరి. రాజప్రసాదములు, కోటలు, దేవాలయములు, శిల్పములు, దేవతామూర్తులు వీరి వల్లనే నిర్మించబడేవి.

శూద్రులలో ఆగమ శాస్త్ర రీతులను ఎరిగిన శిల్పులు, వాస్తు శిల్ప, మూర్తి శాస్త్రము లందు మిక్కిలి చొరవ కలిగి తగిన నిర్మాణములు చేసెడివారు. శూద్రులు ఆగమ సాహిత్యమును చదవరాదనెడి కఠోర నియమము ఇక్కడ చెల్లకున్నది. స్వర్ణ కారుల పేర్లు ఆచార్య, ఓఝా, బజ్జి అను పదములను కలిగి యుండుటచేత వీరు విద్యా బోధనను సాగించు ఆచార్యులని తెలియుచున్నది.

దారు నిర్మిత భవంతులు వడ్రంగుల పని తనమునకు తార్కాణములైతే వారు సృష్టించిన కళా ఖండాలు కాల గర్భమున కలియుటచే వారి పనితనము అభినందించుట వీలుకాదు. సముద్ర యానమునకు ఉపయోగించిన ఓడలు, బండ్లు, రథములు, హలములు, వడ్రంగుల వల్లనే జరిగినవి. శాసనములందు చెప్పబడకుండుట చేతనే సాహిత్యమునందు సహితము తగినంత ఆధారములు దొరకనందున వీరిని గురించి విస్తరించుట వీలుకాదు.

## 13.14 చండాలురు (CHANDALAS) :-

చాతుర్వర్ణములతో నిర్మితమైన భారతీయ సమాజము రాను రాను వర్ణ నియమములను ఉల్లంఘించి సంకరమైంది. వర్ణాంతర వివాహములు నిషేధించబడినను వాటిని జరగకుండా చేయలేకపోయింది. భయంకరమైన శిక్షలు అపరాధ సుంకములు సంఘ బహిష్కరణలు చేసినప్పటికీ పెక్కు వర్ణాంతర వివాహములతో పాటు అక్రమ సంబంధాలు సాగుచూనే ఉండేవి. వర్ణ నియమాలను ఉల్లంఘించిన వారి సంతతి ఊరు నుండి వెలివేయబడి అస్పృశ్యులైరి. చాతుర్వర్ణముల వారు బ్రహ్మ ముఖము, భుజము, ఉదరము, పాదముల నుండి పుట్టగా 'చండాల' అనబడే పంచములు వీరందరి అక్రమ సంబంధము వలన మాత్రమే పుట్టిరి. వీరు అస్పృశ్యులు, వీరు చాలా శక్తివంతులు. దర్శనము చేతనే చాతుర్వర్ణములు వారిని అపవిత్రులు, ధర్మ భ్రష్టులు గాను చేయగలవారు. అయితే వీరి సేవల వల్లనే వీరిని అస్పృశ్యులుగా పరిగణించేవారు. వారి పరిసరాలు శుభ్రతకు నోచుకోనేది కాదు. మురికి పరిసరాలను బాగుచేయుటతో పాటు మృత కళేభరాలను తరలించే కార్యక్రమము స్మశానముల పని చండాలురే చేయవలసి యుండెను. హిందూ సమాజము నుండి బహిష్కరించబడిన అస్పృశ్యుల సేవలు లేకుండా సమాజం నడవడం కష్టమయ్యెను. ఆంధ్ర దేశమునందలి అస్పృశ్యులలో పేర్కొనదగినవారు మాల, మాదిగలు. వీరు అంటరానితనమునకు కఠోరముగా గురి అయినారు. సమాజమునకు దూరంగా ప్రత్యేక నివాసములు ఏర్పరుచుకున్నారు. మాలపల్లి, మాదిగపల్లి అనునవి వీరి స్థావరములు. మాలవారి గమనము నిషేధము. వూరిలో పారిశుద్ధ్య కార్యక్రమాలకు వచ్చు వేళ ఉమ్మి వేసుకొనేందుకు భుజమునకు ముంత త్రాటితో కట్టుకుని తన అడుగుల ముద్రలు చెరిపి వేయుటకు నడుమునకు తాటియాకును వేలాడ తీసుకొని "మాలవాడు వస్తున్నాడు" అని బిగ్గరగా అరుచుకొనుచు రావలసి ఉండేది. పొరపాటున అతని నీడగాని ఇతరులకు తాకినచో అతనికి శిక్షతోపాటు అపరాధ రుసుము వసూలు చేసెడివారు. తమ వస్త్రములు తామే నేయుచుండిరి. అందువలన మాల మగ్గములనెడి పేరుతో పాటు మాలనేత అనెడి పదములు వాడుకలో కలవు. కూలి నాలి పనులతో పాటు నేత వృత్తితో వీరు జీవనం చేసేవారు. మృత పశు కళేబరములను

ఊరి నుండి తరలించుటతో పాటు తోలుతో పాదరక్షలు వివిధ రకాల వస్తువులను మాదిగ వారు తయారు చేసెడివారు. వెట్టి, తలారి మొదలైన వంశ పారంపర్యంగా గ్రామోద్యోగములు వీరు నిర్వర్తించెడివారు. గ్రామ దేవతారాధన యందు అంటువ్యాధులు వ్యాపించినప్పుడు జాతరలు జరిపి జంతు బలులు చేసి 'పోలి' చల్లి గ్రామ రక్షణ చేయుటలో మాల, మాదిగలకు ప్రముఖ పాత్ర ఉన్నది.

హిందూ దేవతలకు దూరముగ ఉంచబడిన వీరు గ్రామ దేవతలకే పూజలు చేయసాగిరి. పాండవుల తల్లి అయిన కుంతి మాలల గృహంలో ఆశ్రయం పొందుటచే ఆమెను మాలలు కుల దేవతగా కొలిచెదరు. గొంతిమ్మ పండుగ మాలలకు చాలా ముఖ్యం. నద్దేశ్వరుని పూజ కూడ గొంతిమ్మ పండుగతో సంబంధం ఉన్నది.

వేద పఠనము, శ్రవణము చండాలులకు నిషేధించబడినది. వీరు వేదమును చదివినచో నాలుకను ఖండించుట, విన్నచో సీసము కరిగించి చెవిలో పోయుట శిక్షలు అమలులో వుండెను. వెట్టి చాకిరికి నియమించబడిన చండాలులు, పై వర్ణముల వారిని సేవించుచు మృత వస్త్రములను కానుకలుగా తీసుకొని సంతసించుచుండిరి.

వేంగీ చాళుక్యుల కాలం నాటి సమాజము వర్ణ వ్యవస్థకు అద్దము పట్టినది. వర్ణమెంత ఉన్నతమైతే గౌరవం, రాయితీలు అంత ఎక్కువగా ఉండగా, దిగువ వర్ణాల వారికి గౌరవం, రాయితీలు తక్కువగా ఉండేవి. చండాలుల జీవితం మిక్కిలి దుర్భరముగా నుండి చిన్న చిన్న నేరములకు అతి పెద్ద శిక్షలు అనుభవించవలసి వచ్చేది. జన్మకు ప్రాధాన్యతను యిచ్చి నైపుణ్యమునకు, ప్రతిభకు గుర్తింపు కరువయ్యెను

## 13.15 మాదిరి ప్రశ్నలు:-

1. వేంగీ చాళుక్యుల పాలనా వ్యవస్థను వివరింపుము.
2. వేంగీ చాళుక్యుల కాలం నాటి సామాజిక పరిస్థితులను వివరింపుము.
3. వేంగీ చాళుక్యులు చేసిన సాహిత్య సేవను వివరింపుము.
4. వేంగీ చాళుక్యుల కాలం నాటి ధార్మిక సాంస్కృతిక పరిస్థితులను వివరింపుము.

## 13.16 ఉపయుక్త గ్రంథాలు:-


1. Dr. Venkataramanayya, N. : The Chalukyas of Vengi, Madras 1950
2. Krishna Rao, B.V. : History of the Early Dynasties of Andhradesa, Madras 1972

   History of the Eastern Chalukyas of Vengi , Hyderabad, 1972.
3. Yazdani, G. : The Early History of the Deccan 2 Volumes (ed) Oxford University Press London, 1960.


ఏలూరి కుమార స్వామి

పాఠం - 14

# చాళుక్య - చోళ యుగం

# వేంగీలో చాళుక్య - చోళ రాజ ప్రతినిధులు

**ముఖ్యాంశాలు:-**

- **14.0 లక్ష్యం**
- **14.1 ఉపోద్ఘాతము**
- **14.2 ఆధారాలు**
- **14.3 వేంగీలో చాళుక్య - చోళ రాజ ప్రతినిధులు**
  - **14.3.1 రాజరాజ ముమ్మడి చోళుడు**
  - **14.3.2 వీర చోళుడు**
  - **14.3.3 రాజరాజ చోళగంగు**
  - **14.3.4 వీర చోళుడు**
  - **14.3.5 విక్రమ చోళుడు**
    - **14.3.5.1 కళింగ దండయాత్ర**
  - **14.3.6 పరాంతక చోళుడు**

## 14.0 లక్ష్యం:-

క్రీ॥శ॥ 1076 మొదలు కాకతీయులు ఆంధ్ర దేశాధిపత్యం వహించే వరకు గల మధ్య కాలాన్ని ఆంధ్రుల చరిత్రలో చాళుక్య - చోళ యుగము అంటారు. ఈ యుగంలో వేంగీలో రాజ ప్రతినిధులుగా వ్యవహరించిన చాళుక్య చోళ రాజకుమారుల రాజకీయ చరిత్ర గురించి, వెలనాటి చోళుల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 14.1 ఉపోద్ఘాతము:-

వేంగీ చాళుక్యులు చాళుక్య - చోళులుగా చోళ సామ్రాజ్య వారసులయ్యేంత వరకు దాదాపు అయిదు శతాబ్దాలు (క్రీ॥శ॥ 624 - 1074) తీరాంధ్ర దేశాన్ని పాలించారు. వీరిలో కుబ్జ విష్ణు వర్థనుడు రాజ్య స్థాపకుడు కాగా, ఏడో విజయాదిత్యుడు చివరి పాలకుడు. క్రీ॥శ॥ 1071 లో తంజావూరులో అధి రాజేంద్రుడు మరణించడముతో విజయాలయ చోళ వంశం అంతరించింది. చోళ సింహాసనం ఖాళీ కావడంతో వేంగీ చాళుక్య రాజు రాజరాజ నరేంద్రునికి చోళ యువరాణి అమ్మంగ దేవికీ జన్మించిన రాజేంద్రుడు (వేంగీ చాళుక్య రాజు) చోళ దేశం వెళ్ళి, అచట శాంతి నెలకొల్పి, కులోత్తుంగ చోళ అనే బిరుదముతో చోళ సింహాసనం అధిష్ఠించాడు. వేంగీలో పాలిస్తున్న రాజేంద్రుడు తంజావూరు వెళ్లడముతో అతని పినతండ్రి ఏడో విజయాదిత్యుడు వేంగీ చాళుక్య

సింహాసనమధిష్టించి క్రీ॥శ॥ 1076 వరకూ రాజ్యమేలాడు. ఇతని మరణానంతరం కులోత్తుంగ చోళుడు వేంగీ రాజ్య పాలనా భారాన్ని కూడా స్వయముగా స్వీకరించాడు. ఉభయ చాళుక్య చోళ కులోద్ధారకుడైన ఇతని సంతతి వారు చాళుక్య చోళులని ప్రసిద్ధులైనారు. ఈ వంశీయుల సార్వభౌమత్వం చెల్లినందున ఆంధ్రుల చరిత్రలో ఈ కాలాన్ని చాళుక్య చోళ యుగం అంటారు.

వేంగీ చాళుక్యుల కాలంలో రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో పరిపాలన నిర్వహించిన సామంత రాజ కుటుంబాలు ఈ చాళుక్య చోళ యుగంలో బలపడినాయి. వేంగీ చాళుక్య రాజ్యానికి కళ్యాణీ చాళుక్యుల బెడద ఎక్కువ కావడంతో పరిస్థితిని గమనించిన కులోత్తుంగుడు తన కుమారులనే రాజ ప్రతినిధులుగా వేంగీ రాజ్యానికి పంపాడు. అంతే గాక, కులోత్తుంగుడు వేంగికి స్వతంత్ర ప్రతిపత్తిని ఇచ్చాడు. ఇంకా విశ్వాసపాత్రులైన సామంత రాజులకు రాజ లాంఛనాలు ఇచ్చి వారిని మండలేశ్వరులుగా చేశాడు. ఇటువంటి వారిలో నెల్లూరు, పొత్తపి, కొణిదెన, తెలుగు చోళులు, వెలనాటి చోళులు, గిరి పశ్చిమ దుర్జయులు, నతవాటి చాగి వంశీయులు, కోనహైహేయులు ముఖ్యులు. కళ్యాణీ చాళుక్యుల బలం తగ్గడముతో హనుమకొండ కాకతీయులు, కందూరి చోళులు, ముదిగొండ చాళుక్యులు, వైదుంబులు మొదలగు వారు విజృంభించారు. ఈ యుగములో ఆంధ్ర దేశమంతా మాండలికుల ఆధీనంలోకి వచ్చింది. వీరు పేరుకు మాత్రమే సామంతులు. తమ తమ ప్రాంతాల పాలనలో వీరు స్వతంత్రులు. మాండలిక రాజుల ప్రాబల్యాన్ని పురస్కరించుకొని చాళుక్య చోళ యుగాన్ని మాండలిక యుగం అని కూడా అంటారు.

## 14.2 ఆధారాలు:-

చాళుక్య చోళ రాజ ప్రతినిధులు కళ్యాణీ చాళుక్యులు, హోయసాలులు వేయించిన శాసనాలు, కులోత్తుంగుని ఆస్థాన కవి జయంగొండార్ వ్రాసిన కళింగట్టు పరణి అను కావ్యం చాళుక్య చోళ ప్రతినిధుల గురించి తెలుసుకోవచ్చు.

## 14.3 వేంగీ చాళుక్య చోళ రాజ ప్రతినిధులు:-

వేంగీ రాజ్యాన్ని కులోత్తుంగుడు చోళ రాజ్యంలో విలీనము చేసిన తరువాత వేంగీ ప్రాంత పాలనకు తన కుమారులను రాజ ప్రతినిధులుగా పంపాడు. కులోత్తుంగుడు వేంగీ మండలానికి రాజ ప్రతినిధులుగా పంపిన రాజరాజ ముమ్మడి చోళుడు, వీర చోళుడు, రాజరాజ చోళ గంగు, విక్రమ చోళుడు, చోళ యువరాణి మధురాంతకి ద్వారా జన్మించిన అతని కుమారులే. మధ్యలో కొంత కాలం పాలించిన పరాంతక దేవుడు కూడా కులోత్తుంగుని కుమారుడే. వీరంతా నాటి వేంగీ రాజ్య రాజధాని జననాధ పురము (ద్రాక్షారామం) లో పట్టాభిషేకం జరుపుకొని సర్వలోకాశ్రయ విష్ణు వర్ధన మొదలగు తూర్పు చాళుక్య బిరుదాలతో పరిపాలన సాగించారు.

**14.3.1 రాజరాజ ముమ్మడి చోళుడు (క్రీ॥శ॥ 1076 - 1078):-** కులోత్తుంగుడు క్రీ॥శ॥ 1076 లో తన రెండవ కుమారుడైన రాజరాజ ముమ్మడి చోళుని వేంగీ రాజ ప్రతినిధిగా నియమించాడు. ఇతడే వేంగీలో తొలి చాళుక్య చోళ ప్రతినిధి. ఇతడు జననాధ పురంలో పట్టాభిషేకం జరుపుకొని విష్ణు వర్ధన సర్వలోకాశ్రయ అను బిరుదాలతో చాళుక్య చోళప్రతినిధిగా వేంగీ మండలములో పరిపాలన సాగించాడు. ఇతని సమస్త సేనాపతి దుర్జయ వంశానికి చెందిన వెలనాటి గొంకయ. రాజ ప్రతినిధిగా ముమ్మడి చోళుడు కళింగ, పశ్చిమ చాళుక్య రాజులతో యుద్ధాలు చేయవలసి వచ్చింది. కళింగలో దేవేంద్రవర్మ మరణించగా, అతని కుమారుడు అనంతవర్మ చోళగంగ దేవుడు బాలుడైనందున దాయాదులు పశ్చిమ చాళుక్యుల సహాయముతో సింహాసనం ఆక్రమించడానికి ప్రయత్నించారు. ఇటువంటి పరిస్థితులలో ముమ్మడి చోళుడు కళింగ పై దండెత్తి శత్రువులను ఓడించి అనంత వర్మను సింహాసనం పై నిలిపాడు. ఈ యుద్ధంలో తనకు సహాయం చేసిన ముమ్మడి భీముని తన రాజ్యంలోని పన్నెండు గ్రామాలకు అధిపతిగా చేశాడు.

**14.3.2 వీర చోళుడు (క్రీ॥శ॥ 1078 - 1084):-** ముమ్మడి చోళుని అనంతరం వీర చోళుడు జననాధ పురములో పట్టాభిషేకము జరుపుకొని వేంగిని పాలించాడు. ఇతని కాలంలో పశ్చిమ చాళుక్యులు వేంగీ పై దండెత్తి ద్రాక్షారామం వరకు నడిచినట్లు శాసనాల వల్ల తెలుస్తుంది. వీర చోళుడు కళింగ సేనాపతి, బణపతి, వెలనాటి గొంకయ అన్న కుమారుడైన వేదురుని

సహాయంతో పశ్చిమ చాళుక్య దాడిని మళ్లించాడు. పాండ్య రాజు త్రిభువన మల్లుని జయించడంలో వీర చోళునకు వేదురుడు సహాయం చేసినట్లు శాసన ఆధారం కలదు. నాడు పాండ్యులు పశ్చిమ చాళుక్య సామంతులుగా నొలంబవడిని పాలించేవారు. వేదురుని సేనలకు ప్రతిఫలంగా అతనిని అర్ధ సింహాసనస్తుని చేయడమే గాక, గౌతమి వశిష్టల నడమి రాజ్యము పై పాలకునిగా చేశాడు.

**14.3.3 రాజరాజ చోళ గంగు (క్రీ॥శ॥ 1084 - 1089):-** వీర చోళుని తరువాత రాజరాజ చోళ గంగు వేంగికి రాజ ప్రతినిధి అయినాడు. ఇతని అధికారం మన్నెరు మొదలు మహేంద్రి వరకు విస్తరించినట్లు ఒక శాసనం వల్ల తెలుస్తుంది. ఇతని కాలములో చక్రకూటాధిపతియైన సోమేశ్వర దేవుడు స్వతంత్రించి, తన తండ్రికి కులోత్తుంగ రాజేంద్ర చోళుని వల్ల జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయడానికి ప్రయత్నించాడు. ఇతనికి పశ్చిమ చాళుక్యుల ప్రోత్సాహం, పశ్చిమ చాళుక్య సామంతుడైన పరమార జగదేవుని సహాయం లభించాయి. సోమేశ్వరుని అణిచే ప్రయత్నములోనే రాజరాజ చోళ గంగు మరణించాడని బి.వి. కృష్ణారావు అభిప్రాయపడినారు.

**14.3.4 వీర చోళుడు (క్రీ॥శ॥ 1089 - 1094):-** రాజరాజ చోళ గంగు తరువాత వీర చోళుడు రెండవ సారి వేంగీ రాజప్రతినిధిగా వచ్చాడు. ఉత్తర దేశాన్ని జయించడానికే కులోత్తుంగుడు ఇతడిని పంపాడు. కానీ కులోత్తుంగుని ఆశయం నెరవేరలేదు. చక్రకూట అధిపతియైన సోమేశ్వర దేవుడు వేంగీ పై దండెత్తి వీర చోళుని వధించి రాజధానిని దగ్ధం చేశాడు.

వీర చోళుడు రెండవ మారు వేంగీ రాజ ప్రతినిధిగా వున్న కాలంలో తమిళ వైష్ణవ బ్రాహ్మణులు అనేక మంది తీరాంధ్రానికి వచ్చి స్థిరపడినారు. మాలవెల్లి, పొన్నతొౖద్ర, ఆల్మి అను మూడు గ్రామాలను కలిపి వీరచోళ చతుర్వేది మంగళం అనే అగ్రహారం ఏర్పాటు చేసి ఐదు వందల అరవై మూడు మంది బ్రాహ్మణులకు ఇచ్చినట్లు వీర చోళుని పిఠాపురం శాసనం చెబుతుంది. ఈ బ్రాహ్మణులందరూ ద్రావిడ దేశం వారే. వీరిలో చతుర్వేద పండితులు షడంగ మీమాంస వేదాంత వ్యాకరణ పండితులు కలరు. వీర చోళుడు నెల్లూరు లోని వైష్ణవ ఆలయానికి కాలేరు గ్రామాన్ని దేవ భోగముగా దానము చేశారు.

**14.3.5 విక్రమ చోళుడు (క్రీ॥శ॥ 1094 - 1118):-** కళింగ దండయాత్ర సందర్భములో విక్రమ చోళుడు వేంగీ రాజప్రతినిధి అని కొందరు పండితుల అభిప్రాయం. కాని అందుకు తగిన సాక్ష్యం దొరకలేదు. విక్రమ చోళుని శాసనాలు వేంగీలో లభించలేదు. 1093 - 1107 మధ్య కాలంలో వీర పెర్మాడి దేవుడు వేంగీని పాలించినట్లు శాసనాలు చెపుతున్నాయి.

**14.3.5.1 కళింగ దండయాత్ర:-** చక్రకూట సోమేశ్వరుడు వేంగీ పై దండెత్తి వీర చోళుని వధించడముతో వేంగీ రాజ్యం అల్లకల్లోలమైనది. ఇది అదునుగా తీసికొని కొలని భీముడు స్వతంత్రించాడు. కళింగలో కూడా చాళుక్య చోళ అధికారానికి ప్రమాదమేర్పడినది. అందువల్ల కులోత్తుంగ రాజేంద్ర చోళుడు కళింగ దండయాత్రకు నిర్ణయించినాడు. ఈ దండయాత్ర గురించి చరిత్రకారులలో అభిప్రాయ బేధాలున్నాయి. కులోత్తుంగుడు కళింగ పై రెండుమార్లు దండెత్తినాడని, మొదటి దండయాత్రలో కొలని భీముని చంపి దక్షిణ కళింగను ఆక్రమించాడని, రెండో దండయాత్రలో కళింగ రాజు అనంత వర్మను ఓడించాడని కొందరి భావం. కులోత్తుంగుని ఆస్థాన కవి అయిన జయంగొండార్ కళింగట్టు పరణి అను కావ్యంలో ఈ కళింగ దండయాత్ర గురించి వివరించాడు. అందులో కులోత్తుంగుడు కళింగ పై రెండు దండయాత్రలు జరిపినట్లు పేర్కొనబడలేదు. అందులో కులోత్తుంగుని శత్రువు అనంత వర్మ అని వుంది. శాసనాలు కూడా ఒకే దండయాత్రను గురించిన వివరాలు ఇస్తున్నాయి. దక్షిణ కళింగను పాలిస్తూ పశ్చిమ చాళుక్యుల సహాయంతో వేంగి పై తరచూ దాడులు జరుపుతున్న దేవేంద్ర వర్మ మీద ఈ దండయాత్ర జరిగిందని యల్లంపల్లి సోమశేఖర శర్మ పేర్కొన్నాడు. ఈ దండయాత్రను నిర్వహించింది కరుణాకర తొండమాన్ అనే పల్లవ రాజు. ఇతడు దేవేంద్ర వర్మ మొదలగు రాజులను పారద్రోలి కళింగను దగ్ధము చేసి, ఓఢ్ర దేశం సరిహద్దులలో జయ స్థంభం నాటినట్లు ద్రాక్షారామ సాసనంలో కలదు. ఈ

కళింగ దండయాత్రలో పాల్గొని కులోత్తుంగ చోళునకు విజయము చేకూర్చడములో సహాయపడినవారు రాకుమారుడు విక్రమచోడుడు, చోళ సామంతుడు పరాంతక పాండ్యుడు, హైహయ దుర్జయ కోట వంశీయులు. ఈ దండయాత్ర 1096 లో జరిగి వుండవచ్చు.

**14.3.6 పరాంతక చోళుడు (క్రీ॥శ॥ 1094 - 1119):-** వేంగీని పాలించిన చివరి చాళుక్య - చోళ కుమార రాజ ప్రతినిధి పరాంతక చోళుడు. ఇతని కాలంలో వేంగీ పరిస్థితులు విషమించినవి. ఇతని కాలంలో పశ్చిమ చాళుక్య దండ యాత్రలు ఎక్కువయ్యాయి. అంతేగాక చోళ సింహాసనానికి విక్రమ చోళ పరాంతకుల మధ్య ఘర్షణ ప్రారంభమయింది. హోయ సాలులు విక్రమ చోళుని బలపరిచారు. ఈ కాలంలోనే హోయసాలులు వేంగీ పై దండెత్తినట్లు శాసనాలు చెబుతాయి. అందువల్ల పరాంతకుడు అనేక యుద్ధాలు చేయవలసి వచ్చినట్లు తెలుస్తుంది.

ఇటువంటి పరిస్థితులలో ఆంధ్రదేశం పై తన అధికారం క్షీణిస్తున్నదని గమనించి కులోత్తుంగ చోళుడు ఆంధ్ర దేశంలోని విశ్వాస పాత్రులైన మాండలికులను బలపరిచాడు. అటువంటి వారిలో వెలనాటి దుర్జయులు ముఖ్యులు.

పైన పేర్కొనట్లు కులోత్తుంగుని తరువాత విక్రమచోళుడు హోయసాలుల సహాయంతో చోళ సింహాసనం అధిష్టించాడు. ఇదే సమయంలో పశ్చిమ చాళుక్యులు వేంగీని ఆక్రమించారు. చాళుక్య - చోళ సామంతులు పశ్చిమ చాళుక్యుల అధికారాన్ని అంగీకరించారు. అయితే ఇది తాత్కాలికమే. తిరిగి వేంగీలో తన అధికారాన్ని కొనసాగించాడు. కాని ఇతని కాలంలో చాళుక్య - చోళులు అధికారం దక్షిణాంధ్రంలో మాత్రమే కొనసాగింది. మూడో కులోత్తుంగుని కాలంలో వేంగి సామంతులు అందరూ స్వతంత్రులయ్యారు. దక్షిణాన పాండ్యుల విభృంభణలో చాళుక్య - చోళుల బలం క్షీణించటం వల్ల తెలుగు చోళులు నెల్లూరులో స్వతంత్రులయ్యారు. అయితే వీరు పాండ్యుల విజృంభణతో కాకతీయుల సామంతులయ్యారు.

పాఠం - 14.1

# వెలనాటి చోళ రాజులు

ముఖ్యాంశాలు:-

14.1.0 లక్ష్యం

14.1.1 ఉపోద్ఘాతము

14.1.2 ఆధారాలు

14.1.3 తొలి చోళుల చరిత్ర

14.1.4 గొంక రాజు

14.1.5 మొదటి కులోత్తుంగ రాజేంద్రచోళుడు

14.1.5.1 కళింగ దండయాత్ర

14.1.5.2 పశ్చిమ చాళుక్యులు

14.1.6 రెండో గొంకరాజు

14.1.6.1 పశ్చిమ చాళుక్యులు

14.1.6.2 కొణిదెన చోళులు

14.1.6.3 వెల్లూరు చోళులు

14.1.6.4 సరో వాధులు

14.1.6.5 కోన హైహేయులు

14.1.6.6 పలనాటి హైహేయులు

14.1.6.7 కాకతీయులు, తూర్పు చాళుక్యులు

14.1.7 రెండో రాజేంద్ర చోళుడు

14.1.7.1 కొలని, కోన పాలకులనణచుట

14.1.7.2 కాలచుర్యులు

14.1.7.3 పలనాటి యుద్ధం

14.1.8 మూడో గొంక రాజు

14.1.8.1 కాకతీయులు

14.1.9 పృథ్వీశ్వరుడు

14.1.9.1 కాకతీయులు

14.1.10 వెలనాటి వంశ అస్తమయం

## 14.1.0 లక్ష్యం:-

చాళుక్య - చోళ యుగంలో తీరాంధ్రలో పాలించిన ప్రముఖులు వెలనాటి చోళ రాజులు. వెలనాటి చోళ రాజుల రాజకీయ చరిత్ర గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 14.1.1 ఉపోద్ఘాతము:-

క్రీ॥శ॥ 1076 నుంచి ఆంధ్రదేశాన్ని పరిపాలించడానికి రాజ ప్రతినిధులుగా నియమించబడిన కులోత్తుంగ చోళుని కుమారులు పాలించిన కాలంలో ముఖ్యంగా కళింగ దండ యాత్ర తరువాత, పూర్వకాలం నుంచి వేంగీ చాళుక్య రాజులను భక్తి, విశ్వాసాలతో సేవించిన కుల క్రమాగత సేవక కుటుంబాల్లోని సమర్థులైన వారిని, అందులోనూ సేనానులను కూడగట్టుకొని రావటానికి, వారంతా వేంగీ రాజ ప్రతినిధులకు బాసటగా ఉండటానికి కులోత్తుంగుడు వారికి రాజ లాంఛనాల్చి మండలాధిపతుల్ని చేశాడు. అటువంటి మాండలిక ప్రభువులలో సనదుప్రోలు రాజధానిగా పరిపాలించిన వెలనాటి చోళులు ప్రముఖులు.

## 14.1.2 ఆధారాలు :-

వెలనాటి చోళ రాజుల శాసనాలు చందోలు, పిఠాపురం, ద్రాక్షారామం, ధాన్యకటకం, చేబ్రోలు, బాపట్ల, త్రిపురాంతకం మొదలైనచోట్ల లభ్యమయినాయి. పృధ్వీశ్వరుని పిఠాపురం శాసనంలో వెలనాటి చోళ వంశాన్ని గురించిన వివరాలు చాలా లభిస్తున్నాయి. చాళుక్య చోళ రాజ ప్రతినిధుల శాసనాలు వీరి శాసనవ్యవస్థ అంశాలను సమర్థిస్తున్నాయి. ఇంకా సమకాలీన మాండలిక రాజుల శాసనాలు వెలనాటి చోళ రాజుల రాజకీయ చరిత్రకు ఉపకరిస్తున్నాయి. పల్నాటి వీర చరిత్ర, కేయూర బాహు చరిత్ర, పండితారాధ్య చరిత్రము కూడా వెలనాటి రాజుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

## 14.1.3 తొలి చోళుల చరిత్ర:-

వెలనాటి రాజులు చతుర్ధాన్వయులు. తమ పూర్వీకులు మధ్య దేశంలోని కీర్తిపురాన్ని పాలించేవారని వీరు చెప్పుకున్నారు. వీరి పూర్వుడైన మల్లవర్మ దక్షిణాదికి వచ్చి త్రిలోచన పల్లవ రాజు వల్ల ఆరు వేల నాడును పొందాడట. కాని వీరిలోని మల్ల, ఎరియ, కొరియ, గండ, పండ వంటి పేర్లను బట్టి వీరు దాక్షిణాత్యులేనని పెక్కు మంది పండితుల అభిప్రాయం. రాయలసీమ ప్రాంతంలో చోళులు మొదట నివసించేవారు. ఆ తరువాత వీరు ఇతర ప్రాంతాలకు విస్తరించారు. రాయల సీమ ప్రాంతంలోని చోళులలో వెలనాటి చోళులకు చాలా కాలంగా సంబంధాలు తెగిపోవడం వల్ల కరికాల చోళుని కాకతీయ వంశంలోని మరో వీరుడైన దుర్జయుని తమ వంశ కర్తగా చెప్పుకున్నారని వీరి అభిప్రాయం.

వెలనాడు ఆరువేల నాడులోని అంతర్భాగమనీ, వెలనాడు ఆరువేల ఒకటేనని పండితులు భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచారు. నేటి గుంటూరు జిల్లాలోని రేపల్లె, తెనాలి, బాపట్ల గుంటూరు తాలూకాల ప్రాంతమే ఆరువేలనాడు. దీనికి చందవోలు, చందోలు, సనదప్రోలు, ధనదపురము రాజధాని. ఇది నిజంగా ధనదపురమే (కుబేరుని నగరం) అని మంచన 'కేయూర బాహు చరిత్ర'లో వర్ణించాడు.

వెలనాటి వంశంలోని తొలి రాజులు తమ పేర్ల చివర వర్మ అనీ, రాజు అనీ ధరించారు. కులోత్తుంగ రాజేంద్ర చోళుడే ఈ వంశంలోని చోళ నామం గల వారిలో మొదటివాడు. అయితే వీరి తెలుగు చోళులకూ ఎటువంటి సంబంధం కన్పించదు. పిఠాపురం శాసనంలో వెలనాటి పూర్వీకులలో దుర్జయుడను రాజు ఒకడున్నాడు. వెలనాటి రెండో రాజేంద్ర చోళునకు 'దుర్జయకుల ప్రాకార' అనే బిరుదు ఉంది. వెలనాటి వారికి గిరి పశ్చిమ ప్రాంతం పాలించిన దుర్జయులకూ వైవాహిక సంబంధాలున్నాయి. అందుచేత

వెలనాటి రాజులు కూడా దుర్జయ వంశానికి చెందినవారే. వీరు తమ సార్వభౌములైన చాళుక్య - చోళుల పట్ల ఉన్న గౌరవం కొలది, ముఖ్యంగా కులోత్తుంగుడు రాజేంద్రుని పుత్ర భావంతో ఆదరించిన నాటి నుండి చోళ శబ్దాన్ని ధరించి వెలనాటి చోళులని వ్యవహరింపబడినారు.

వెలనాటి చోళులు వేంగీ చాళుక్యుల కొలువులో మంత్రి, సేనాపతి పదవులు నిర్వహించి పేరు గడించారు. అటువంటి వారిలో ఎరియ ప్రముఖుడు. ఇతని కుమారుడైన మల్లయ రెండో చాళుక్య భీముని సేవించినట్లు తెలుస్తుంది. మల్లయ కుమారుడైన ఎరియ రాజు గుద్రవార విషయాన్ని విష్ణు వర్ధనుని నుండి పొందాడని తెలుస్తుంది. రెండో తాలరాజుకు విష్ణు వర్ధన బిరుదు ఉంది. తాలరాజు తరువాత శక్తి వర్మ విష్ణు వర్ధన బిరుదు ధరించాడు. విమలాదిత్యుని యుద్ధాల్లో కుడియ వర్మ పాల్గొని గుద్రవార ద్వయాన్ని పొందినాడు. కుడియ వర్మ పౌత్రుడైన నన్నిరాజు రాజ రాజ నరేంద్రుని సేనాపతి.

పై విధంగా క్రీ॥శ॥ 11 వ శతాబ్దం మధ్య కాలానికి వెలనాటి చోళులు చందవోలు రాజధానిగా షట్స్ హస్ర, గుద్రవార విషయ పాలకులయినారు. రాజరాజ నరేంద్రుని తరువాత వేంగిలోని అల్లకల్లోలాలలో వెలనాటి రాజులు కులోత్తుంగ రాజేంద్రునికి సహాయంగా నిలిచి అతని అభిమానం పొందారు. వేంగిలో నియమింపబడిన చాళుక్య - చోళ రాజ ప్రతినిధులకు సహాయంగా ఉంటూ పరిపాలనా భారం వహించారు. నన్నిరాజు పౌత్రుడైన వేదురుడు వేంగీ పై జరిగిన పశ్చిమ చాళుక్య - పాండ్య దండయాత్రల్లో వీర చోళునకు సాయం చేసి 'రెండేరుల నడిమి విషయం' (గౌతమి - వశిష్టల అంతర్వేది) నకు అధిపతి అయినాడు. వెలనాటి చోళుల ఆధిపత్యం గోదావరీ ముఖ ద్వారంలో నెలకొన్నది.

## 14.1.4 గొంక రాజు (క్రీ॥శ॥ 1076 - 1108):-

వెలనాటి చోళ రాజులలో ప్రసిద్ధుడు మొదటి గొంకరాజు. వేంగీ రాజ ప్రతినిధిగా వీర చోళుడు ఉన్న కాలం నుండి ఇతడు అతని సర్వసేనాధిపతి, చక్రకూట సోమేశ్వరుని ప్రతిఘటించడానికి ఇతడు వేంగీ సామంతులందరినీ కూడ గట్టడంలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. ఇతడు మహా మండలేశ్వర, చాళుక్య రాజ్య మూలస్తంభ, త్రిశలోత్తర షట్స్ హస్రావనీ నాధ బిరుదులు ధరించాడు. కులోత్తుంగ చక్రవర్తి ప్రసాదించిన సామంతాధికారి గుండ్ల కమ్మ, త్రిపురాంతకం మధ్య నున్న ప్రాంతాలను పాలించాడు.

## 14.1.5 మొదటి కులోత్తుంగ రాజేంద్ర చోళుడు (క్రీ॥శ॥ 1108 - 1132):-

మొదటి గొంకరాజు అనంతరం అతని కొడుకు మొదటి కులోత్తుంగ రాజేంద్రచోళుడు పాలనా బాధ్యత స్వీకరించాడు. గొంక రాజు కులోత్తుంగ చోళుని పట్ల తనకున్న భక్తి గౌరవాల సూచకంగా తన కుమారునికి చోళ రాజని పేరు పెట్టినాడు. కులోత్తుంగుడు చోళరాజును పుత్రభావంతో ఆదరించి అతనికి వెలనాడును రాజ లాంఛనాలతో దత్తత చేసికున్నందున కులోత్తుంగ రాజేంద్రచోళుడని ప్రసిద్ధుడయినాడు. ఇతని కాలంలో తీరాంధ్రలోఅనేక రాజకీయ పరిణామాలు జరిగాయి. అందులో మొదటిది కళింగ దండయాత్ర.

**14.1.5.1 కళింగ దండయాత్ర:-** వెలనాటి రాజేంద్ర చోళుడు కొండ పడమటి మన్మండ రాజు, కొనపోత రాజు, కోన గొక రాజులను కలుపుకొని విక్రమ చోళ కరుణాకర తొండమాన్‌లతో కలసి కళింగ యుద్ధంలో పోరాడినాడు. ఈ కళింగ దండయాత్రలో చోళ - చాళుక్య సార్వభౌమాధికారానికి ఘన విజయం లభించింది.

**14.1.5.2 పశ్చిమ చాళుక్యులు:-** పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుడు వేంగీ నుండి చాళుక్య - చోళులను పారదోలే ఆశయంతో దండ నాయక అనంత పోలయ నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని వేంగీ పైకి పంపాడు. యుద్ధంలో వెలనాటి రాజేంద్ర చోళుడు పరాజయం చెందాడు. అతని కొడుకు గొంకయ బందీగా చిక్కినాడు. వెలనాటి రాజులు పశ్చిమ చాళుక్యుల సార్వభౌమత్వం అంగీకరించవలసి వచ్చింది. పశ్చిమ చాళుక్య సైన్యాలు బెజవాడ, కొండపల్లి మొదలైన దుర్గాలనాక్రమించి జననాధ పురం పై దండెత్తినాడు. రాజ ప్రతినిధి పరాంతక చోళుడు యుద్ధంలో మరణించి వుంటాడు.

వేంగీ రాజ్యం సమస్తం చాళుక్యుల స్వాధీనమయింది. వేంగిని ఆక్రమించే సందర్భంలోనే అనంత పాలయ కాంచీపురం వరకు దాడి చేసి దానిని కొల్లగొట్టినాడు. క్రీ॥శ॥ 1115 నుండి 1126 వరకు ఆంధ్ర దేశమంతా ఆరో విక్రమాదిత్యుని సార్వభౌమత్వం శిరసావహించింది.

కులోత్తుంగుని తరువాత చాళుక్య - చోళ సింహాసన మధిష్టించిన విక్రమ చోళుడు వేంగీ నుండి పశ్చిమ చాళుక్యులను పారదోలడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వేంగీలోని సామంతులు మాత్రం విక్రమ చోళుని పట్లనే అభిమానం చూపించారు. విక్రమాదిత్యుని తరువాత భూలోకమల్ల సోమేశ్వరుడు కళ్యాణి సింహాసనమధిష్టించాడు.

సోమేశ్వరుడు తన స్థానాన్ని పదిలపరచుకోవడానికి పూర్వమే వేంగీలోని మాండలికులు కళింగాధిపతి అనంతవర్మ చోళ గంగదేవుని సహాయంతో పశ్చిమ చాళుక్యులను ఓడించి కృష్ణానది మొదలు జననాధ పురం వరకు గల భూభాగాన్ని ఆక్రమించినాడు. తూర్పు చాళుక్య యుద్ధమల్లుని సంతతివాడైన మల్ల భూపతి సర్వలోకాశ్రయ, విష్ణు వర్ధన్ బిరుదాలతో కొంత కాలం పాలించాడు. కాని కృష్ణానదికి దక్షిణంగా వున్న వెలనాటి దుర్జయులు, హైహేయులు, కొండపడమటి వారు మాత్రం సోమేశ్వరుని సార్వభౌమత్వం అంగీకరించారు.

క్రీ॥శ॥ 1132 ప్రాంతంలో చాళుక్య - చోళ రాజు విక్రమ చోళుడు వేంగీలోని మాండలికుల కోరిక పై యువరాజైన రెండో కులోత్తుంగుని నాయకత్వంలో ఒక సైన్యాన్ని వేంగీ పైకి పంపాడు. ఈ సైన్యంలో వెలనాడు, గిరి పశ్చిమ , కోన కంద్రవాటి రాజులందరు చేరినారు. మన్నేరు వద్ద జరిగిన యుద్ధంలో పశ్చిమ చాళుక్య సైన్యాలు పరాజయం చెందాయి. దీంతో కృష్ణానదికి దక్షిణాన పశ్చిమ చాళుక్యాధిపత్యం అస్తమించింది. మన్నేరు యుద్ధానంతరం అనతి కాలానికే వెలనాటి రాజేంద్ర చోళుడు మరణించాడు.

## 14.1.6 రెండో గొంక రాజు (క్రీ॥శ॥ 1132 - 1161):-

వెలనాటి చోళ రాజులలో రెండో గొంక రాజు అగ్రగణ్యుడు. ఇతడు తండ్రి కాలంలోనే అనేక యుద్ధాలలో పాల్గొని విజయాలు సాధించినాడు. ఇతని ప్రధాని నండూరు గోవింద మంత్రి యంత్రాంగంలోను, యుద్ధ నిర్వహణలోను ఆరితేరినాడు.

**14.1.6.1 పశ్చిమ చాళుక్యులు:-** రెండో గొంక రాజు ప్రథమ ఆశయం వేంగీ నుండి పశ్చిమ చాళుక్యులను పూర్తిగా పారదోలడం. అందుచేత మన్నేరు యుద్ధం తరువాత ఇతడు రెండో కులోత్తుంగుని నాయకత్వంలో వేంగీ పైకి దండెత్తినాడు. నాడు దండనాయక లక్షణరాజు గోవింద దండనాయకుని సహాయంతో వేంగిని పాలిస్తున్నాడు. ఇరు పక్షాలకు మధ్య గోదావరి తీరంలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో పశ్చిమ చాళుక్య సైన్యాలు ఓడి పారిపోయినారు. గోదావరి యుద్ధంలో వేంగీ రాజ్యంలో పశ్చిమ చాళుక్యాధికారం అంతమయింది.

విక్రమ చోళుని తరువాత చాళుక్య చోళ రాజైన రెండో కులోత్తుంగుడు గొంక రాజు సామర్థ్యం గురించి అతనిని సామంతుల లక్షణాలలో మహేంద్రగిరి శ్రీశైలం మధ్య ప్రాంతానికి అధిపతిగా చేసినాడు. నాటి నుండి చాళుక్య చోళ రాజులు ఆంధ్ర రాజకీయాలలో జోక్యం కలుగజేసుకోలేదు. గొంక రాజు మాత్రం చాళుక్య చోళ రాజులందు విశ్వాసంతోనే ఆంధ్రదేశాన్ని పాలించాడు.

అయితే గొంక రాజుకు చాళుక్య - చోళ రాజులు సర్వాధికారం దత్తం చేయడం తీరాంధ్రలోని ఇతర మాండలిక రాజులు సహించలేక పోయారు. వారిలో కొందరు వెలనాటి ఆధిపత్యాన్ని ధిక్కరించి స్వతంత్రించడానికి ప్రయత్నించారు. ఫలితంగా గొంక రాజు తన పాలనా కాలమంతా యుద్ధాలతో గడపవలసి వచ్చింది.

**14.1.6.2 కొణిదెన చోళులు:-** మొదటి గొంక రాజు సరసన ఉన్న కొణిదెన తెలుగు చోళుల పై దృష్టి సారించాడు. త్రిభువన మల్ల చోళ మహారాజు గొంక రాజు సమకాలికుడు. ఇతడు కమ్మనాడు, గుండ్ల కమ్మ ప్రాంతం, కర్నూలు జిల్లా తూర్పు ప్రాంతం పాలిస్తున్నాడు. మల్లచోడ, గొంక రాజు ఇద్దరూ కలసి కొణిదెనలోని బల్లీశ్వర దేవునకు దానం చేసినారు. దీనిని బట్టి మల్లచోడుడు గొంక రాజు ఆధిపత్యాన్ని గుర్తించాడని చెప్పవచ్చు. కాని మల్లచోడుని కుమారులు నన్నిచోడ, కన్నరదేవులు గొంక రాజును ధిక్కరించి స్వతంత్రించారు. అందువల్ల గొంక రాజు దండెత్తి వెళ్లి వారిని ఓడించి సామంతులుగా చేసుకొన్నాడు. ఈ యుద్ధంలో అయ్య వంశస్థుడైన జిల్ల బోయని దండయాధుడు, అతని అన్న వారసులు గొంక రాజుకు సహాయం చేశారు.

**14.1.6.3 వెల్లూరు చోళులు (క్రీ॥శ॥ 1132 - 1161):-** కొణిదెన చోళులను ఓడించిన తరువాత వెలనాటి సైన్యము నెల్లూరు తెలుగు చోళుల పాలనలో వున్న పాకనాడు పై దండెత్తినాయి. ఈమని కంద్రవాటి కంట భూపతి, కోట భీమరాజు, రాచూరి దారపరాజు ఈ సైన్యాలను నడిపారు. నెల్లూరును ఆనాడు నల్లసిద్ధి రాజు పాలిస్తున్నాడు. తెలుగు చోళులు పరాజయం చెందారు. పాకనాడులో వెలనాటి చోళుల అధికారం నెలకొన్నది.

**14.1.6.4 పరో వాధులు:-** సరోనాధుల రాజధాని సరసిపురం. ఇది నేటి ఏలూరుగా గుర్తించారు. కొల్లేరు లోని కొలని వీడు వీరికి బలిష్టమైన స్థావరం. వీరి రాజ్యం నేటి ఏలూరు, తణుకు, అత్తిలి, భీమవరం తాలూకాలకు విస్తరించింది. కాటమ నాయకుడు గొంక రాజు సమకాలికుడు. కాటమ స్థానిక చాళుక్య రాజ్యాలను జయించి తన రాజ్యం విస్తరింపజేసుకున్నాడు. కాని గొంక రాజు ఆధిపత్యాన్ని ఇతడు అంగీకరించాడు.

**14.1.6.5 కోన హైహేయులు:-** కోన, పలనాడు, పంచదార్ల ప్రాంతాల్లో హైహేయ వంశస్థులు మాండలికులుగా ఉండేవారు. వీరిలో కోన, పలనాటి హైహేయులు ఆంధ్ర చరిత్రలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. కోన మండలం కోన హైహేయుల ప్రాంతం. కోన హైహేయ పాలకులలో రాజేంద్ర చోళుని తరువాత అతని సోదరులు రెండో ముమ్మడో చోళుడు, సత్యరాజు అధిపతులయినారు. నాటి నుండి కోన హైహేయులలో ద్వంద్వ రాజ విధానం అమలు జరిగింది. వీరి తరువాత లోకరాజు, భీమరాజు ఉమ్మడిగా పాలించారు. వీరిలో లోకరాజు పొరుగున ఉన్న చాళుక్య రాజులను జయించి వెలనాటి పై దండెత్తి బాపట్ల వరకు నడిచాడు. కాని గొంక రాజు సేనాని ప్రోలయ నాయకుడు లోక రాజును వధించడమే గాక కోన మండలం పై హైహేయులను సామంతులను చేసినాడు.

**14.1.6.6 పలనాటి హైహేయులు (క్రీ॥శ॥ 1132 - 1161):-** పలనాటి హైహేయులు గురజాల రాజధానిగా పాలిస్తున్నారు. అనుగు రాజు గొంక రాజునకు సమకాలికుడు. పశ్చిమ చాళుక్యులు పరాజయం చెంది వేంగి నుండి మళ్ళిన తరువాత అనుగు రాజు గొంక రాజుతో పొత్తు కుదుర్చుకున్నాడు. గొంక రాజు కుమార్తె మైలమను అనుగు రాజు వివాహమాడి వెలనాటి సామంతుడయినాడు. అయితే అనుగు రాజును విశ్వసించక గొంక రాజు తన ప్రతినిధిగా దొడ్డనాయని గురజాలలో నిలిపాడు. అనుగు రాజు, మైలమల కుమారుడు నలగాముడు క్రీ॥శ॥ 1147 ప్రాంతంలో గురజాల పాలకుడయినాడు.

**14.1.6.7 కాకతీయులు, తూర్పు చాళుక్యులు:-** గొంక రాజు సామంతాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాకతీయుల తూర్పు చాళుక్య వంశ శాఖ వారు ప్రయత్నించారు. హనుమకొండను పాలించే కాకతీయ రెండో ప్రోలరాజు చాళుక్యులకు సహాయంగా వెలనాటి పై దండెత్తినాడు. వెలనాటి యువరాజు వీర రాజేంద్రుడు కోట చోళరాజు సహాయంతో ప్రోలుని వంచి కాకతీయ సైన్యాలను తరిమివేసెను.

తూర్పు చాళుక్య వంశ శాఖీయులు పిఠాపురం కేంద్రంగా చేసుకొని స్వతంత్రించడానికి ప్రయత్నించారు. వీరికి పొరుగున ఉన్న హైహేయాదుల ప్రోత్సాహం లభించింది. పిఠాపురం చాళుక్యులలో మూడో విజయాదిత్యుడు మార్జవాడినేలుతున్న పులకేశి కుమార్తెను వివాహమాడి అతని సహాయంతో స్వతంత్రించినాడు. ఇతనికి కాకతీయుల

సహాయం కూడా లభించి వుండవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో గొంక రాజు మరణించాడు

## 14.1.7 రెండో రాజేంద్ర చోళుడు (క్రీ॥శ॥ 1161 - 1181):-

రెండో గొంక రాజు మరణానంతరం రెండో రాజేంద్ర చోళుడు వెలనాటి అధిపతి అయినాడు. ఇతని పాలనా కాలంలో వెలనాటి చోళ రాజ్యం అత్యున్నత స్థితిని చేరింది. చాళుక్య - చోళ రాజు రెండో రాజాధి రాజు దుర్బలుడు కావడంతో రెండో రాజేంద్ర చోళుడు సార్వభౌములకు కప్పం చెల్లించడం మాని వెలనాటి రాజ్యానికి స్వతంత్ర ప్రతిపత్తిని చేకూర్చినాడు. రాజేంద్రుని మంత్రి నండూరి కొమ్మన్న శ్రీ కూర్మం, ఎలమంచిలి, కాట్య, దొన, త్రిపురాంతకం మొదలగు చోట్ల విష్ణు ప్రతిష్ఠ లొనర్చినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. అందుచేత రాజేంద్రుని రాజ్యంలో ఆంధ్రదేశంలో అధిక భాగం చేరిందని తెలుస్తుంది.

**14.1.7.1 కొలని, కోన పాలకులనణచుట (క్రీ॥శ॥ 1132 - 1161):-** రాజ్యానికి రాగానే రాజేంద్రుడు వెలనాటి పై తిరుగుబాటు చేసిన మాండలికుల పై దృష్టి సారించాడు. కొలని మాండలికులు, కోన హైహేయులు స్వతంత్రించారు. కొలని వీడు కేంద్రంగా చేసుకొని భీముడు విజృంభించాడు. ఇతనికి కొలని కాటమ నాయకునికి ఉన్న సంబంధం తెలియదు. రాజేంద్రుడు అమృతలూరి దేవన సాయంతో రెండు రాజ్యాల పైకి దండెత్తినాడు. పిఠాపురం చాళుక్యులు ఓడి సామంతులయినారు. భీముని అణచి వేయడం జరిగింది. ఈ సమయంలోనే కోన హైహేయులు వెలనాడు పై దండెత్తగా దేవన ప్రెగ్గడ వారిని త్రిపురాంతకం దగ్గర ఓడించాడు. హైహేయ నాయకులు అనేక మంది యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం తరువాత కోన మండలం పై దండెత్తి ఆ రాజ్యాన్ని దగ్ధం చేశాడు. కోనమల్లి దేవుడు వెలనాటి సామంతుడయినాడు. కోన దండయాత్ర సందర్భంలోనే ప్రోలుని సేనాని పిఠాపురాది చాళుక్యులను లొంగదీసుకున్నాడు. దీనితో దక్షిణ కళింగలో వెలనాటి అధికారం గౌరవించబడింది.

**14.1.7.2 కాలచుర్యులు:-** పశ్చిమ చాళుక్య వంశాన్ని అంతం చేసి కలచురి బిజ్జలుడు అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాడు. ఇతడు నెల్లూరు చోళులకు మిత్రుడు. అందువల్ల పాకనాడులో వెలనాటి అధికారాన్ని అంతం చేయడానికి బిజ్జలుడు తన కుమారుడైన సోమేశ్వరుని పాకనాటి పైకి పంపాడు. వెలనాటి నాటి ప్రతినిధిగా పాకనాడులో నండూరి కొమ్మన పాలిస్తున్నాడు. ఉభయులకు మధ్య కొచ్చెర్ల కోట దగ్గర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో కొమ్మన కలచురి సేనలను ఓడించి పారదోలాడు. తిరోగమిస్తున్న కర్ణాట సేవలను వెంబడించి వెలనాటి మూర్జవాడిలో ప్రవేశించి దగ్ధం చేసినాయి. శ్రీశైల ప్రాంతం వెలనాటి రాజ్యంలో విలీనమయింది.

**14.1.7.3 పలనాటి యుద్ధం:-** రెండో రాజేంద్రుని కాలంలో వెలనాటి రాజులు ఉచ్ఛస్థితికి రావడమే గాక, పతనం కూడా అతని కాలంలో ప్రారంభమయింది. అందుకు ఒక ప్రధాన కారణం పలనాటి యుద్ధం. ఈ యుద్ధం వెలనాటి సామంతులు మరియు బంధువులైన పలనాటి హైహేయ కుటుంబంలో జరిగిన కలహం. దీనికి ఆధారం శ్రీనాథ కవి వ్రాసిన 'పల్నాటి వీర చరిత్ర' అనే ద్విపద కావ్యం. దీనికి ఇతరత్రా ఆధారం లేదు. గురజాల రాజధానిగా పాలిస్తున్న హైహేయ అనుగు రాజుకు మైలమదేవి ద్వారా నలగాముడు, ఇతర భార్యల ద్వారా మలిదేవాదులు జన్మించారు. దొడ్డనాయుడు, అతని కుమారుడు బ్రహ్మనాయుడు వెలనాటి ప్రభుత్వ ప్రతినిధులుగా గురజాల వెళ్ళి స్థానిక ప్రజల పై అత్యాచారాలు జరపసాగారు. అంతేగాక అనుగురాజు పట్ల కూడా అవిధేయులయ్యారు. వెలనాటి ప్రతినిధులను ప్రతిఘటించడానికి నాగమ్మ స్థానిక ప్రజల నాయకురాలై అనుగు రాజుకు, తరువాత నలగామ రాజుకు మంత్రిణి అయింది. ఇది సహించని బ్రహ్మనాయుడు మలిదేవాదులను రెచ్చగొట్టి పలనాటి రాజ్యాన్ని గురజాల, మాచర్ల కేంద్రాలుగా పాలించసాగాడు. మాచర్లలో గురజాల, చందోలు రాజ్యాలకు విరుద్ధ చర్యలు మితిమీరినాయి. వెలనాటి శత్రువులైన కాలచుర్యుల సహాయం పొందాడు. హైహేయ వంశాన్ని రూపుమాపి తన వంశాన్ని నెలకొల్పే ఆశయంతో బ్రహ్మనాయుడు వీర వైష్ణవం ద్వారా పంచములలో చైతన్యం కలిగించి వారిని తన వైపుకు మళ్ళించుకొన్నాడు. ఇది గ్రహించిన నాగమ్మ గురజాల, మాచర్లల సమైక్యానికి ప్రయత్నించింది.

నాగమ్మ, బ్రహ్మనాయుడుల మధ్య క్రమంగా శత్రుత్వం బలపడి కారెంపూడి దగ్గర యుద్ధం జరిగింది. మలిదేవుడికి కాలచుర్యుల సహాయం లభించగా, నలగామునికి కాకతీయులు, హోయసాలులు, కోటరాజుల సహాయం లభించింది. యుద్ధంలో నలగాముడు విజయం సాధించాడు. కాని ఈ యుద్ధం వల్ల వెలనాటి రాజ్య బలహీనత స్పష్టమయింది. వెలనాటి సామంతులకు అపారమైన ధన, సైనిక నష్టం వాటిల్లింది. పొరుగు విరోధుల ధాటిని తట్టుకోలేని స్థితి ఏర్పడింది. ఈ యుద్ధం చివరిలోనే కాల చుర్యుల సైన్యాలు వెలనాడు పై దండెత్తినాయి. ఇదే సమయంలో వేంగి ప్రాంతంలోని చాళుక్యుల సహాయం కొరకు కాకతీయ రాజు రుద్రుడు సైన్యాలను పంపాడు. ఇటువంటి పరిస్థితులలోనే రెండో రాజేంద్ర చోళుడు మరణించాడు.

రెండో రాజేంద్ర చోళుడు, అతని బావమరిది కొండ పడమటి బుద్ధరాజు శైవమతాచార్యుడైన మల్లికార్జున పండితుని హింసించినందుకు మల్లికార్జునుడు ఆగ్రహించి చందోలు నాశనమగునట్లు శపించినట్లు పాల్కురికి సోమనాధుని 'పండితారాధ్య చరిత్రలో' గలదు. కాకతీయ దాడుల రూపంలో ఈ శాపం ఫలించి చందోలు ధ్వంసమైంది.

### 14.1.8 మూడో గొంక రాజు:-

రెండో రాజేంద్ర చోళుడు మరణించిన తరువాత అతని కుమారుడైన మూడో గొంక రాజు సింహాసనం అధిష్టించాడు. ఇతని స్వల్ప పాలనాకాలంలో వెలనాడు రాజ్యం మరింత క్షీణించింది.

**14.1.8.1 కాకతీయులు:-** పల్నాటి యుద్ధం తరువాత అనతి కాలానికే కాకతీరుద్రుడు కోట రాజ వంశం పాలిస్తున్న ధరణి కోట పై దండెత్తినాడు. వీరు వెలనాటి చోళులకు సామంతులై వారి రాజ్యానికి అండగా ఉండేవారు. కాకతీయుల కోట యుద్ధంలో కోట రాజు దొడ్డ భీముడు మరణించాడు. ఇతని కుమారుడు కేత రాజు కాకతీయులకు సామంతుడై ధరణి కోటకు రాజైనాడు.

ఆ తరువాత కాకతీయ సైన్యాలు కొండ పడమటి రాజ్యాన్ని ఆక్రమించాయి. కొండ పడమటి వారు కూడా వెలనాటి చోళుల సామంతులై మంత్రి సేనాపతి ఉద్యోగాలు నిర్వహిస్తుండే వారు. వీరిలో మండ రాజు కుమార్తె అక్కమ వెలనాటి రెండో రాజేంద్ర చోళుని భార్య. వీరి కుమారుడే గొంక రాజు. అక్కమ సోదరుడు బుద్ధ రాజు వెలనాటి ఆస్థాన వ్యవహారాలు నిర్వహించేవాడు. బుద్ధరాజుతో కొండ పడమటి వంశం అంతరించింది.

ఈ విజయాలలో కాకతీయ రాజ్యం త్రిపురాంతక, శ్రీశైలాల వరకు విస్తరిచింది. తెలుగు చోళులు విజృంభించి కమ్మనాడులోనికి చొచ్చుకు రాసాగినారు. ఇటువంటి పరిస్థితుల్లో మూడో గొంక రాజు మరణించాడు.

### 14.1.9 పృధ్వీశ్వరుడు (క్రీ॥శ॥ 1186 - 1207):-

మూడో గొంక రాజు తరువాత అతని కుమారుడు పృధ్వీశ్వరుడు వెలనాటి సింహాసనమధిష్టించాడు. ఇతడు వెలనాటి రాజులలో చివరివాడు. ఇతని ప్రధాని కొరవి వెన్నయామాదిత్యుడు. నండూరి కేతన పృధ్వీశ్వరుని మంత్రి. వీరి సహాయముతో పృధ్వీశ్వరుడు వెలనాటి రాజ్య ప్రతిష్టను పునరుద్ధరించటానికి విఫల ప్రయత్నం చేశాడు. పృధ్వీశ్వరుడు మొదట వేంగీ ప్రాంతాన్ని ఆక్రమించి, పిఠాపురం రాజధానిగా పాలించసాగాడు. తరువాత ఇతడు గంగరాజు రెండవ రాజ రాజును ఓడించి దక్షిణ కళింగను ఆక్రమించాడు. వెన్నయామాత్యుని బిరుదాన్ని బట్టి పృధ్వీశ్వరుడు వెలనాడును తిరిగి ఆక్రమించాడు. కొన మాండలికులు నతవాడి, కోట, అయ్య వంశాల వారు తిరిగి ఇతనికి సామంతులైనారు. రుద్రుని మరణానంతరం కాకతీయ రాజ్యంలో ఏర్పడిన అరాచకం పృధ్వీశ్వరునకు అనుకూలించిందని చెప్పవచ్చు.

**14.1.9.1 కాకతీయులు:-** కాకతీయ గణపతి దేవుడు 1201 లో వెలనాటి రాజ్యము పై దండయాత్ర ప్రారంభించాడు. కాకతీయ సేనాని ముత్యా చౌండరాయుడు దండెత్తి వచ్చి, దివిసీమను ఆక్రమించి, చందోలు పై పురోగమించాడు. పృథ్వీశ్వరుడు కళింగకు పారిపోయాడు. పృథ్వీశ్వరుడు తిరిగి 1206 ప్రాంతములో వెలనాడును ఆక్రమించడమే గాక నెల్లూరు తెలుగు చోళ రాజ్యము పై దండెత్తినాడు. ఈ దండయాత్ర బహుశా పదవిని కోల్పోయిన చాళుక్య చోళరాజు రెండవ రాజాధిరాజు సహాయము కొరకై వుంటుంది. కానీ నెల్లూరు తెలుగు చోళులు, కాకతీయులు కలిసి పృథ్వీశ్వరుని ఓడించి వధించారు.

## 14.1.10 వెలనాటి వంశ అస్తమయం:-

పృథ్వీశ్వరుని మరణముతో వెలనాటి వంశం అంతరించలేదు. పృథ్వీశ్వరుని తరువాత కులోత్తుంగ రాజేంద్ర చోళుడు వెలనాటి ప్రతిష్టను పునరుద్ధరించటానికి ప్రయత్నించాడు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. 1257లో దక్షిణ దిగ్విజయ యాత్రను సాగించిన కాకతి గణపతి దేవుడు నెల్లూరు తెలుగు చోళ రాజు మనుమసిద్ధికి ప్రత్యర్థులైన అక్కన బయ్యనలతో కలిసి, మూడవ కులోత్తుంగ రాజేంద్ర చోళుని సంహరించినట్లు తెలుస్తుంది. ..యున పల్లి శాసనములో ఈ విషయం ప్రస్తావించబడియుంది. ముమ్మడి రాజేంద్ర చోళుని మరణముతో వెలనాటి చోళ వంశం అంతరించింది. పాకనాడు, పొత్తపి నాడులను పాలించే తెలుగు చోళులు, వెలనాడును పాలించే కోట వంశీయులు కాకతీయులకు సామంతులయ్యారు.

పాఠం - 15

# చాళుక్య చోళ యుగ విశేషాలు

ముఖ్యాంశాలు:-

15.0 లక్ష్యం

15.1 ఉపోద్ఘాతము

15.2 ఆధారాలు

15.3 పరిపాలన

15.3.1 ఉద్యోగ వ్యవస్థ

15.3.2 పాలనా విభాగాలు

15.3.3 యుద్ధ పద్ధతి

15.4 ఆర్థిక పరిస్థితులు

15.5 సాంఘిక పరిస్థితులు

15.6 మత పరిణామాలు

15.6.1 శైవ మతం

15.6.2 వైష్ణవ మతం

15.6.3 స్మార్త మతం

15.6.4 బౌద్ధ, జైన మతాలు

15.7 సారస్వతము

15.8 కళలు

## 15.0 లక్ష్యం:-

క్రీ॥శ॥ 1076 మొదలు కాకతీయులు ఆంధ్రదేశము పై ఆధిపత్యం వహించే వరకూ అనగా క్రీ॥శ॥ 13 వ శతాబ్దం ఆరంభము వరకు వున్న మధ్య కాలాన్ని చాళుక్య యుగము అంటారు. చాళుక్య చోళ యుగము నాటి విశేషాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 15.1 ఉపోద్ఘాతము:-

క్రీ॥శ॥ 1076 మొదలు క్రీ॥శ॥ 13 వ శతాబ్దం ఆరంభం వరకు గల మధ్యకాలాన్ని చాళుక్య యుగం అని వ్యవహరిస్తారు. ఈ కాలంలో చాళుక్య చక్రవర్తి కులోత్తుంగుడు తన కుమారులను రాజ ప్రతినిధులుగా వేంగికి పంపాడు. అలాగే విశ్వాసపాత్రులైన సామంత రాజవంశాలకు రాజ లాంఛనాలిచ్చి వారిని మండలేశ్వరులుగా చేశాడు. అటువంటి వారిలో ముఖ్యులు వెలనాటి చోళులు, కొండ పడమటి దుర్జయులు, నతనాటి చాగి వంశీయులు, కోన హైహయులు, నెల్లూరు, పొత్తపి, కొణిదెన మొదలగువారు. ఈ యుగంలో ఆంధ్ర దేశమంతా మాండలికుల ఆధీనంలోకి వచ్చింది. వీరు పేరుకు మాత్రమే సామంతులు. తమ తమ పాలనా ప్రాంతాలలో స్వతంత్రులు. మాండలిక రాజులు ప్రాబల్యం వహించడము వల్ల చాళుక్య చోళ యుగాన్ని మాండలిక యుగం అని కూడా అంటారు.

## 15.2 ఆధారాలు:-

చాళుక్య చోళ యుగ విశేషాల గురించి తెలుసుకోవడానికి నాటి శాసనాలు, నాణేలు, నిర్మాణాలు ఉపయోగపడుతున్నాయి. పల్నాటి వీర చరిత్ర, కేయూర బాహు చరిత్ర, పండితారాధ్య చరిత్ర మొదలగు గ్రంథాల ద్వారా నాటి విశేషాలు గ్రహించవచ్చు.

## 15.3 పరిపాలన :-

చాళుక్య చోళ యుగ ఆరంభములో ఆంధ్రదేశమంతా సామంత రాజుల ఆధీనంలో వుంది. తెలంగాణా ప్రాంతములలో **కాకతీయుల** పశ్చిమ చాళుక్య సామంతులైనారు. సామంత రాజులలో చందవోలు వెలనాటి చోళులు, నెల్లూరు తెలుగు చోళులు సుప్రసిద్ధులు. కొంత కాలం పాటు తీరాంధ్రంలోని రాజులందరూ వెలనాటి చోళుల ఆధిపత్యాన్ని అంగీకరించినారు. ఆంధ్రదేశం చిన్న చిన్న నాడులుగా విభజింపబడింది. నాడులకు సంఖ్య జత పరచి చెప్పడం ఈ యుగ యొక్క ప్రత్యేకత. ఉదాహరణగా **పాకనాడు** 21000, ఎవలనాడు 6000 లోని గ్రామాల సంఖ్యను సూచిస్తుందని కొందరు అభిప్రాయపడగా, ఆదాయాన్ని సూచిస్తుందని మరికొందరి అభిప్రాయం. ప్రతి మండలానికి ఒక సామంత సమయం వచ్చినపుడు స్వతంత్రించేవారు. ఈ సామంత **రాజులు తమ** తమ రాజ్యాలలో సర్వాధికారులు.

**15.3.1 ఉద్యోగ వ్యవస్థ:-** సామంత రాజుల ఆస్థానాలు సార్వభౌమ ఆస్థానానికి నమూనాలు. రాచరికం, సప్తాంగ సమన్వితం, మహామాత్య, అమాత్య, మంత్రి, ప్రధాని, గ్రడ, సంధి, విగ్రహి, సమస్త సేనాపతి, భాండారు, కోష్టాగార మొదలగు ఉద్యోగుల పేర్లు శాసనాలలో కన్పిస్తున్నాయి. సాధారణంగా మహామాత్య పదవులలో సమర్థులైన బ్రాహ్మణులు వుండేవారు. రాజ్యానికి విశిష్ట సేవ చేసిన వారికి లాంఛనాలిచ్చి గౌరవించేవారు. ఆస్థాన ఉద్యోగం ఆర్థిక భద్రతకే గాక, సాంఘిక ఔన్నత్యానికి కూడా సైనిక వృత్తి సాధనమయింది.

**15.3.2 పాలనా విభాగాలు:-** రాజ్యంలోని ముఖ్య భాగం స్థలం శాసనాలలో యనమదల స్థలం రాకుదురు స్థలం మొదలగు పేర్లు కనిపిస్తున్నాయి. గ్రామణి, తలారి, గ్రామ ఉద్యోగుల రెడ్డి కులస్తులు గ్రామణి పదవి నిర్వహిస్తున్నాయి. రెడ్డి నిర్వహించిన పదవిని రెడ్డికం అన్నారు. కొన్ని గ్రామాలకు రెడ్డికం ఏర్పాటు చేసే పద్ధతి కూడా కలదు. కొన్ని సందర్భాలలో గ్రామస్తుల సమావేశాలు జరిగేవి. మహాజనాల ప్రసక్తి శాసనాలలో కలదు. దాన ధర్మాధి కార్యక్రమాలు మహాజనాల సమక్షంలో చేసేవారు.

**15.3.3 యుద్ధ పద్ధతి:-** ఈ యుగములో తరచూ యుద్ధాలు జరిగినందుకు ప్రతి చిన్న రాజ్యం సైన్యాన్ని పోషించింది. సైనిక **సహాయం** చేయడం, ప్రభువుల యుద్ధాలలో పాల్గొనడం సామంతుల విధి. కోట హైహోయ, కొండ పడమటి రాజ్యాల **సైన్యాల** వెలనాటి యుద్ధాలు చేశారు. సైనికులకు, సేనాధిపతులకు గ్రామాలను అరణముగా ఇచ్చేవారు. దుర్గాలు చాలా

వరకూ స్థల దుర్గాలు. యుద్ధాలలో అశ్వపదాతి దళాలకే ఎక్కువ ప్రాధాన్యం వుంది. నాటి ప్రధాన ఆయుధాలు కుంత, ఖడ్గ, ధనుర్బాణాలు. యుద్ధ ప్రారంభములో భైరవుని ఆరాధించేవారు. యుద్ధ సమయంలో రణభేరి, ఢక్కి, ఢంగుర మొదలగు వాద్యాలు మోగించేవారు. విజయం సాధించిన వారు శత్రు శిబిరాలను దోచుకోవడం, పల్లెలు, పట్టణాలు దోచుకోవడం సర్వ సాధారణం.

## 15.4 ఆర్థిక పరిస్థితులు :-

నాటి ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. దేవాలయములకిచ్చిన దానాలను బట్టి గొర్రెలు పెంపకం ఎక్కువగా కన్పిస్తుంది. వరి, చెరకు, జొన్న, ప్రత్తి పంటలు ఎక్కువ. మామిడి, కొబ్బరి, ఆకు, పోక తోటలు పెంచేవారు. నేల సారవంతమైనందున పంటలు పుష్కలంగా పండేవి. చందవోలు నగరం ఐశ్వర్యంలో తుల తూగినట్లు మంచన కవి తన గ్రంథంలో వర్ణించాడు. పెదగంజాం, కడవకుదురు, వాయందుర్రు, కురవాడ మొదలైనచోట్ల ఉప్పుకొటార్లు ఉండేవి. ఉప్పు మీద పన్ను ఉండేది.

పెక్కుండ్రు, కోయట్లు అనే పేర సంఘంగా ఏర్పడి వాణిజ్యం జరిపినారు. నాడు పెనుగొండ వర్తక సంఘం బలమైన వర్తక సంఘం. దేశ రాజకీయ అనైక్యము, తరచుగా జరిగిన యుద్ధాలు పరిశ్రమల, వాణిజ్య అభివృద్ధికి అంతరాయంలయినాయని చెప్పవచ్చు. రాచనగరు సరుకులు సరఫరా చేసే సెట్లు ప్రత్యేకించి ఉండేవారు.

ప్రతి సామంత రాజ్యం నాణేలు ముద్రించింది. వెలనాటి చోళుల శాసనాలలో జయమాడ, బిరుదమాడు, చామురమాడ, కులోత్తుంగ, గద్యాణం, చిన్నము, రూకల పేర్లు కన్పిస్తున్నాయి. మాడకు పది రూకలయినట్లు బాపట్ల ఆలయ శాసనం సూచిస్తుంది.

## 15.5 సాంఘిక పరిస్థితులు :-

చాళుక్య చోళ యుగంలో వచ్చిన సామాజిక పరిణామాలు గమనించదగ్గవి. చాళుక్య యుగంలో వలె చాతుర్వర్ణ వ్యవస్థే సమాజానికి పునాది. కుల భేదాలున్నా అవి అగ్ర వర్ణాల వరకే పరిమితమయినాయి. బ్రాహ్మణులు మంత్రి, సేనానులుగా రాజకీయాల్లో ముఖ్య పాత్ర నిర్వహించేవారు. ఇతర వర్ణాల వారు ముఖ్యంగా, శూద్రులు, బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలలో సమాన ప్రతిపత్తిని పొందడానికి ప్రయత్నించి సఫలీకృతులయినారు. వెలనాటి చోళ రాజులు, కొండ పడమటి, కోట, పరిచ్ఛేది మొదలైన వంశాల వారందరూ శూద్రులే. వీరు క్షత్రియ ధర్మాలను నిర్వర్తిస్తూ ప్రభువులుగా రూపొందాక, వారికి సమాజంలో ఉన్నతస్థానం, క్షత్రియులలో సమాన ప్రతిపత్తి లభించాయి. దీనితో క్షత్రియ పాలకులు వీరితో సంబంధ బాంధవ్యాలను పెంపొందించుకున్నారు. విశ్వకర్మ కులం వారు శూద్రులే. వీరు బ్రాహ్మణులతో సమానస్థాయికి రావడానికి ప్రయత్నించారు. శూద్రులెప్పుడూ ఒక వర్గంగా లేరు. చేసే వృత్తులను బట్టి వారిలో శాఖలు ఏర్పడటం సామాజిక పరిణామం, బ్రాహ్మణ, క్షత్రియ ఆధిక్యత తగ్గి వెలమ, రెడ్డి వంటి వ్యవసాయదారుల కులాలు ఆవిర్భవించి సామాజికంగా, ఆర్థికంగా నిలద్రొక్కుకొని గ్రామ జీవితంలో ప్రాధాన్యత వహించటం, ఆంధ్రదేశ చరిత్రను మలుపు త్రిప్పటం గమనించదగ్గ విషయం. వెలమ, రెడ్డి కులాల మధ్య అధికార ప్రాబల్యానికై ప్రారంభమయిన పోటీ ఫలితమే పలనాటి యుద్ధం. వర్తక వ్యాపారాలు చేసే వైశ్యేతర కులాల వారు వారి పేర్ల చివర సెట్టి, కోమటి అనే పదాలు చేర్చి వ్యవహరింపబడేవారు. చతుర్వర్ణాలే గాక అష్టాదశ వర్ణాలు సమాజంలో తమ ఉనికిని ఏర్పరచుకొన్నాయి. ప్రజలలో దైవభక్తి, పాప చింతన ఎక్కువ. ప్రజలు భిన్న రూపాల్లో దేవాలయాలకు దానాలు చేశారు. వాటిలో భూములు, గొర్రెలు, మేకలు, ఏనుగులు, నాణేలు, మామిడి తోటలు గలవు.

చాళుక్య - చోళ మొదటి కులోత్తుంగ చక్రవర్తి సంతతి వారంతా ద్రావిడ దేశంలోనే ఉండిపోవడం వల్ల వారు తమిళులైపోయారు. ద్రావిడ సంస్కృతినే అభిమానించారు. కులోత్తుంగుని కుమారులు వేంగికి రాజ ప్రతినిధులుగా రావడంతో వారి ఆశ్రితులైన ద్రావిడులు ముఖ్యంగా బ్రాహ్మణులు ఆంధ్ర దేశానికి వలస వచ్చారు. రాకపోకలు పెరగడంలో ద్రావిడ దేశ మత సంస్కృతీ ప్రభావం నాటి ఆంధ్రదేశం మీద ఎక్కువగా ప్రసరించింది.

## 15.6 మత పరిణామాలు:-

క్రీ॥శ॥ 12 వ శతాబ్దంలో దక్షిణాపథంలో అనూహ్యమయిన మతపరిణామాలు చోటు చేసుకున్నాయి.

**15.6.1 శైవ మతం:-** చాళుక్య - చోళ యుగం మొదట్లో వైదిక మతం వర్ధిల్లింది. అయితే క్రమేణా శైవ మతం బలపడింది. కర్మ ప్రధానమైన వైదిక మతం వెనుకంజ వేసింది. పాలకవర్గం దైవాన్ని అభిమానించటంతో ఆంధ్రదేశంలో శైవానికి ప్రజాదరణ ఎక్కువయింది. శివుడే పరమ దైవమని, శివ భక్తులే మహనీయులని, ఇతర దేవతలు అప్రధానమని ఆంధ్ర శైవులు నమ్మారు. రామానుజుని ప్రచారంలో కలిగిన నూతనోత్తేజంతో వైష్ణవం శైవంతో పోటీ పడింది. శైవ వైష్ణవాలు రెంటిలోను దీక్షా ధారణ ఉంది. శివ దీక్షలో రుద్రాక్ష, విభూతి, గుర్వుపాదోదకం ప్రధానాంశాలు. శైవ శాఖల మధ్య దీక్షా విధానంలో వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తుంది. నన్నెచోడుడు పాశుపత దీక్ష పేర్కొన్నాడు. అంతకు ముందు శివ మండల దీక్ష ప్రసక్తి ఒక శాసనంలో కన్పిస్తుంది. వీర-శైవ దీక్ష దీనికి భిన్నమై ఉండవచ్చు. వైష్ణవ దీక్షలో చక్రాంఠితాలు, పుండ్రధారణ, ఉచ్ఛిష్ట భోజనం, ఏకాదశీ వ్రతం ప్రధానాంశాలు. శైవ వైష్ణవ మతాలు రెండింటిలోను ఈ యుగంలో తీవ్రమైన ఉద్యమాలు బయలుదేరినాయి. శంకరునిచే పరాజితులైన కాపాలకులు పూర్తిగా అంతరించలేదు. శివుని మహాప్రతిగా నన్నెచోడుడు వర్ణించాడు. కాపాలిక వ్రతమే మహా వ్రతం. శ్రీశైలం, ఆలంపురం, బెజవాడ, పిఠాపురం మొదలగునవి శక్తి పూజా కేంద్రాలుగా ఉండేవి.

ఈ యుగంలోనే కర్ణాటకంలో బసవేశ్వరుడు వీర శైవోద్యమం ప్రారంభించాడు. వాస్తవానికి వీర శైవం బసవేశ్వరుని కంటే ప్రాచీనం. జైన, బౌద్ధ మతాలలోని నైతిక వర్తన, సాంఘిక సమత్యం, పౌరాణిక మతంలోని భక్తిని బసవేశ్వరుడు వీర శైవంలో సమన్వయం చేశాడు. వీరశైవాన్ని ఆగమాంతము అన్నారు. వైదిక క్రతుకాండ పై వేదాంతం వలె పౌరాణిక సత్కర్మ కాండ పై ఆగమంలో తిరుగుబాటని చెప్పవచ్చు. విషాదకర పరిస్థితుల్లో బసవేశ్వరుడు మరణించడాన్ని బట్టి అతని ఉద్యమం సాధించిన విజయం అనుమానాస్పదం.

కులాచారులను నిరసించి, నిర్మూలించ సమకట్టి బసవేశ్వరుని వీరశైవ మతం ఆంధ్రలో పాదం మోపే సమయానికి ఇక్కడ మరో రూపంలో వీరశైవం ఆరంభమయింది. పండితత్రయముగా ప్రసిద్ధులైన శ్రీపతి, శివలెంక మంచన, మల్లికార్జున పండితారాధ్యులు ఆంధ్రదేశంలో శైవమత పునరుద్ధరణకు పూనుకున్నారు. శ్రీపతి విజయవాడకు చెందిన వాడు. అనంత పాలయ దండనాధుని కొలువులో నిప్పును ఉత్తరీయంలో ముడిచి శివుని ఆధిక్యాన్ని చాటాడు.

బసవేశ్వరుని సమకాలికుడైన మల్లికార్జున పండితారాధ్యుడు ద్రాక్షారామ నివాసి. ఇతడు భక్తి ప్రధానమైన శైవాన్ని చేపట్టాడు. బసవేశ్వరుని వలె ఇతడు కులాచారుల పై ధ్వజం ఎత్తలేదు. శివభక్తి, కుల బేధాలు రెండూ ఇతని విధానంలో సమన్వయమయ్యాయి. కాని పరమత ద్వేషం బోధింపబడింది. పర్యవసానంగా వీరశైవం జైన, బౌద్ధ మతాలలో ఘర్షణ పడింది. ఇతని సిద్ధాంతాలే ఆరాధ్య విధానంగా రూపొంది ఆంధ్ర కర్ణాట దేశాల్లో అగ్రవర్గాలలో వ్యాప్తి చెందాయి.

**15.6.2 వైష్ణవ మతం:-** తమిళ దేశంలో రామానుజుడు ప్రారంభించిన వైష్ణవ మతం ఆంధ్రదేశంలో వ్యాపించి శైవంతో పోటీ పడింది. శంకరుని అద్వైతాన్ని ఖండిస్తూ రామానుజుడు జీవితం వాస్తవమని, కుల బేధాల విషయంలో పెద్ద పట్టింపు లేదని ప్రచారం చేశాడు. ఈ యుగంలో అనేక ద్రావిడ వైష్ణవ కుటుంబాలు ఆంధ్రదేశంలోని పలు ప్రాంతాలలో స్థిరపడ్డాయి. కొమ్మన మంత్రి 32 క్షేత్రాల్లో విష్ణు ప్రతిష్టలు చేసినట్లు కేయూరబాహు చరిత్ర చెబుతుంది. ఉత్సవాలు, ఊరేగింపులు, భజనలల వంటి సమిష్టి కార్యక్రమాలలో వైష్ణవం ప్రజాదరణకు నోచుకుంది. పల్నాటి బ్రహ్మనాయుడు వర్ణాంతర వివాహాలను, చాపకూడును, పంచములను ఆలయ ప్రవేశాన్ని ప్రోత్సహించడం ద్వారా వర్ణ వ్యత్యాసాలు నిరసించిన వీర వైష్ణవ మతాన్ని ప్రచారం చేసినాడు. ఇతని ప్రచారం వల్లనే ఆంధ్ర దేశములోని పంచముల్లో దాసర్ల సంఖ్య హెచ్చింది. ఇంతటి విప్లవాత్మక సంస్కరణలు నాటికి అపూర్వమైన విషయాలు కాని బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులే వాటిని హర్షించలేకపోయినారు.

పల్నాటి యుద్ధ కారణాల్లో చాపకూడును ఒక చాటు పద్యం పేర్కొంటున్నది. వాస్తవానికి పల్నాటి యుద్ధం సంప్రదాయ ప్రయత్నానికి, సంస్కరణ ప్రయత్నానికి మధ్య సంఘర్షణ. అందులో సంప్రదాయమే గెలిచింది.

**15.6.3 స్మార్త మతం:-** వీరశైవ, వీరవైష్ణవ పరాజయంతో శాఖా విభేదాలకు అతీతమై సంప్రదాయ సిద్ధమైన స్మార్త మతానికి ప్రోత్సాహం లభించింది. స్మార్త ఉద్యమానికి ఒక విధంగా తిక్కన మహాకవి నాయకుడని చెప్పవచ్చు. స్మార్త మతానికి జీవమైన అద్వైత ధర్మ ప్రచారమే ఆశయంగా మహాభారత ఆంధ్రీకరణకు తిక్కన పూనుకొన్నాడు. క్రమంగా తీవ్రవాద మత శాఖలు క్షీణించి ప్రజల్లో స్మార్త సమన్వయ భావాలు పాతుకొనసాగినాయి.

**15.6.4 బౌద్ధ, జైన మతాలు:-** జైన మతం అక్కడక్కడా కన్పించినా బౌద్ధ మతం అడుగట్టింది. రెండో చోళరాజు ఆస్థానంలో బుద్ధపారుడను బౌద్ధమతాచార్యుడుండేవాడు. ఇతనితోనే మల్లిఖార్జున పండితుడు వాదించాడు. కొండ పడమటి కోట వంశస్థుల కాలంలో గోకవరం బౌద్ధ కేంద్రమైనట్లు ఆధారాలున్నాయి. ఎర్రబాలెం లోని బౌద్ధ విహారానికి వెలనాటి చోళులు దానాలు చేశారు. రెండో చోళరాజు ఆస్థానంలో బౌద్ధులలో మల్లిఖార్జున పండితుడు వాదనలు చేసిన సమయంలో జైనులు కూడా వున్నారని పేర్కొన్నాడు. అట్లే ఆ సభలో పాంచరాత్తులు, చార్వాకులు, ఆధ్యాత్మికులు, అష్టమూర్తవాదులు, కావాటులు కూడా పాల్గొన్నారు. వీరంతా వివిధ మతాల వారని తెలుస్తున్నది. చందోలు ప్రాంతంలో బహుశా నేలి యుద్ధంలో బౌద్ధులున్నట్లు పండికారాధ్యను జీవిత చరిత్ర వల్ల తెలుస్తుంది. అమరావతిలోని ఒక శాసనాన్ని బట్టి నాటికి ధాన్యకటక మహాచైత్యం నష్టం కాలేదు కాని బుద్ధుడు విష్ణుమూర్తి అవతారంగా మాత్రమే పూజలందుకొన్నట్లు అమరావతి, కరీంనగర్ శాసనాలు చెబుతున్నాయి. ఈ విధంగా నామ మాత్రంగా వున్న బుద్ధారాధన పండితారాధ్యుని తీవ్రమైన శైవ ప్రచార ఫలితంగా అంతర్హితమయింది.

## 15.7 సారస్వతము:-

చాళుక్య యుగంలో ప్రారంభమైన ఆంధ్ర సారస్వత మహోద్యమం ఈ కాలంలో పురోగమించసాగింది. ఈ యుగ తెలుగు శాసనాలు చాలా భాగం పద్యాలలో ఉన్నాయి. ప్రతి పద్యం శాసనం ఒక చిన్న ఖండ కావ్యం. చేబ్రోలు శాసన పద్యాన్ని బట్టి నాటి సాహిత్య పరిశ్రమ స్వభావాన్ని గురించి, నాడు తెలుగులో మార్గ, దేశి కవితారతులున్నవని తెలుస్తుంది. నన్నెచోడుడు కూడా మూడు ఉత్తమ మార్గ సత్కవీశ్వరులను దేశి సత్కమలను స్తుతించాడు. వెలనాటి చోళ రాజులలో కొందరు స్వయంగా కవులు, కవి పండితులను పోషించారు. మొదటి గొంక రాజు, మొదటి చోళరాజు భార్య గుండమ, రెండో గొంక రాజు, అతని మామ కవులను ఆదరించారు. రెండో చోళ రాజు ఆస్థానంలోని మల్లిఖార్జున పండితారాధ్యుడు గొప్పకవి. రాజులే గాక సేనాపతులు, సామంతులు కవులను ఆదరించారు. సేనాపతి భీమనాధుడు స్వయంగా కవి. కవులను ఆదరించాడు. గోవింద ప్రధాని గొప్పకవి. కోశాధికారి కంఠ సాహిత్యాభిమాని, మంత్రి సూర్య పదాలు, చోళ రాజు భార్య కుటుంబ పండితులను పోషించారు. రెండో చోళ రాజు నాటి ద్రోణ ఆగమాలలో గొప్ప పండితుడు. చందవోలు అనేక మంది కవులకు నిలయమని మంచ వ్రాసాడు. పిఠాపురంలోని పృథ్వీశ్వరుని శాసన రచయిత అయ్యపిళ్ళార్య గొప్ప కవి.

చాళుక్య చోళ యుగ కవులలో నన్నెచోడుడు గొప్ప కవి. ఇతని కుమార సంభవంలో కన్నడ భాషా సాహిత్య సంప్రదాయాల ప్రభావం ఎక్కువ. ఇతని కాలాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నవి. ఈ యుగ కవులలో చెప్పుకోదగిన కవి మల్లిఖార్జున పండితారాధ్యుడు. ఇతడు సాహిత్యాన్ని శైవ మత ప్రచార సాధనంగా చేసినాడు. భవ, శివా అనే భిన్నమ కూటాలలో నాల్గు వందలకు పైగా కంద పద్యాలున్న అతని శివతత్వసారాన్ని శతంగా పండితులు గుర్తించారు. అందుచే తెలుగు శతక ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత మల్లిఖార్జునిదే. రెండో చోళరాజు ఆస్థానంలో జరిగిన మత వాగ్వివాదంలో పండితుడు అనేక గ్రంథాల నుండి తాత్విక చింతనల నుండి ఉదాహరణలు చెప్పాడు. 'శివతత్వసారం'లో గల 489 శ్లోకాలలో అనేక శివభక్తుల కథలు గలవు. మల్లిఖార్జుమడు సంస్కృతులలో శ్రీముఖదర్శన అను గ్రంథాన్ని, కన్నడ భాషలో గల సహస్ర నామ కావ్యం మొదలగు సుమారు 25

గ్రంథాలు వ్రాశాడు. ఈ యుగంలో ప్రసిద్ధి చెందిన మరి యొక శివకవి పాల్కురికి సోమనాధుడు. ఇతడు తెలుగు, కన్నడం, మరాఠి, తమిళం, సంస్కృతం మొదలగు భాషల్లో గ్రంథాలు వ్రాశాడు. అతని రచనలు సమకాలీన కవులకు కవిత్వ రచనా మార్గాన్ని చూపించాయి. ఇతని రచనల్లో ప్రముఖమైనవి తెలుగు భాషలో వ్రాయబడిన బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర. ఈ రెండు ద్విపద చంధస్సులో కావ్యాలుగా రచించాడు. బసవ పురాణంలో బసవేశ్వరుని జీవిత చరిత్రతో పాటు శివభక్తులు, వీర శైవ ధర్మ సిద్ధాంతం, నీతి మార్గాలు, మల్లిఖార్జున పండితారాధ్యుని చరిత్ర గలవు. ఈ యుగానికి చెందిన మరో కవి మంచన కవి. ఇతడు కేయూర బాహు చరిత్ర వ్రాసి వెలనాటి చోళుల మంత్రి అయిన నండూరు గుండ మంత్రికి అంకితం ఇచ్చాడు. ఈ గ్రంథం వెలనాటి చోళుల కాలం నాటి ఆంధ్రదేశ పరిస్థితి తెలుసుకోవడానికి వీలు కలుగుచున్నది.

ఈ యుగ కవులందరిలోనే గాక తెలుగు కవులందరిలో అగ్రగణ్యుడు తిక్కన సోమయాజి. ఇతడు మహామంత్రి, మహాకవి మాత్రమే గాక ఒక సాంస్కృతిక మహోద్యమం. ఇతడు మత రంగంలోనే గాక సాహిత్య రంగంలో కూడా విశిష్టమైన పాత్రను నిర్వహించినాడు. ఇతని తొలి గ్రంథం నిర్వచనోత్తర రామాయణం నెల్లూరు చోళరాజు మనుమసిద్ధికి అంకితం చేశాడు. తిక్కన సర్వతోముఖ ప్రజ్ఞకు నిదర్శనం మహాభారతాంధ్రీకరణం. విరాట పర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు గల 15 పర్వాల ఉద్గ్రంథాన్ని ఒక్కడే రచించాడు. తిక్కన తన భారత రచనకు అర్థ గౌరవం, భావౌన్నత్యం, నాటకీయత, సజీవ పాత్ర పోషణ, సంభాషణా చతురిమలతో వన్నె దిద్దాడు.

## 15.8 కళలు :-

భక్తి ప్రధానమైన మత శాఖలు ప్రచారమైనందున ఈ యుగంలో దేవాలయ నిర్మాణం చురుకుగా సాగింది. ఈ యుగంలో తీరాంధ్రం పై చోళుల ప్రభావం ప్రసరించడంలో దేవాలయ నిర్మాణ క్రమం చురుకుగా సాగడమే ద్రావిడ వాస్తురీతి ప్రభావం ప్రసరించింది. అంతేగాక కొంత కాలం తీరాంధ్రంపై పశ్చిమ చాళుక్యుల ఆధిపత్యం నెలవడం వల్ల వారి శైలి కూడా ఈ ప్రాంతం పై ప్రసరించింది. వెలనాటి చోళుల శాసనాలను పరిశీలిస్తే అనేక శైవ, వైష్ణవ ఆలయాలు నిర్మితమయినట్లు స్పష్టమవుతుంది. అయితే ఈ ఆలయాలన్నీ వారి రాజుల వలె అల్ప ప్రమాణం గలవి. ఈ యుగంలో విప్పర్ల, దేగరమూడి, ఈర్లపాడు, నూతక్కి, కొణిదెన, అమరావతి, చందోలు, భట్టిప్రోలు, కొల్లూరు, మదల, చిలుమూరు, కారెంపూడి పెరవలి, ఎడవల్లి, గుంటూరు, గుడిపూడి, పిన్నలి, కాజ, గోవింద పురం, ద్రోణాదుల, ఏమిడి ఊపాడు, ప్రత్తిపాడు, ఎర్రబాలెం, మోపర్రు, పెదకొండూరు, మోదాకేరు, అప్పికట్ల, పాపులసాడు మొదలగు చోట్ల శైవ, వైష్ణవ ఆలయాలు నిర్మితమయ్యాయి. ఇవి పరిమాణంలో చిన్నవైనా నేటికి నిలిచి ఉన్నాయి. నాటి పాలకులు, మంత్రులు, సేనాపతులు, రాణులు, ధనవంతులు, వర్తక శ్రేణులు దేవాలయ నిర్మాణానికి ఇతోధికంగా కృషి చేశారు. శైణులలో బెజవాడ తేలికవారు. పెనుగొండ వర్తకులు పేర్కొనదగినవారు. నాటి శాసనాలలో కామోజు, గంగోజు, గోపోజు, అనమోజు. కాసెనమోజు మంటి కాసి వారి ప్రస్తావన గలదు. దేవాలయ నిర్మాణంలో నిర్వహణలో మహాజనుల పాత్ర గుర్తించదగ్గది. ఈ కాలపు ఆలయాల ప్రధాన అంశాలలో గర్భగుడి, అంతకాళం, ముఖ మండపం, ప్రాకారంతో కూడిన గోపురం. పశ్చిమ చాళుక్య ప్రభావం వల్ల చందోలు, వలివేరు, బాపట్ల, మాచర్ల, కొమ్మూరు మొదలగు చోట్ల దర్శనమిస్తాయి. వాటిలో ప్రస్తావించదగ పార్వతీ, వీరభద్రుడు, మహిసాసుర మర్ధిని, దత్తాత్రేయ, కేసవ, నరసింహ, అనంత శాయి, విష్ణు, లక్ష్మీ, దక్షిణామూర్తి, నటరాజ, భైరవ, ఉమాసహిత మూర్తి, యోగ దక్షిణా మూర్తి, గణేశ, ఇంద్ర, బ్రహ్మ, బాలకృష్ణ, రామాయణ అంశాలు మొదలగునవి.

ఈ యుగపు ఆలయాలు, రాజస్థానాలు సంగీత నృత్య కళలకు కేంద్రాలైనాయి. దేవాలయ ఉత్సవాలలో అనేక సంగీత కచేరీలు జరిగేవి. ప్రతి దేవాలయానికి నాట్య కత్తెలుండేవారు. కొమ్మూరు ఆలయ శాసనంలో 300 సానుల ప్రసక్తి గలదు. మతాచార్యుల వెంట నాడు అనేక మంది భక్తులు గీత, వాయుద్యాలతో పాట పాడుకుంటూ వెళ్ళే వారని నాట్య రచనలలో గలదు శాసనాలలో మేడమాంబ, సానినూకమ్మ, బాణాంచిక, పొక్కమ, కామిదేవి మొదలగు నర్తకిల పేర్లు గలవు.

ఖండిక - 5

పాఠం - 16

# కాకతీయ యుగం (క్రీ॥శ॥ 1000- 1323)

ఆంధ్రదేశ చరిత్రలోకాకతీయ యుగం ఒక మహోజ్జ్వల అధ్యాయం. కాకతీయుల పాలనాకాలం రమారమి మూడు శతాబ్దాలు. ప్రథమార్థ భాగంలో (క్రీ॥శ॥ 1000 - 1160) వీరు సామంతులు. ద్వితీయార్థ భాగంలో (క్రీ॥శ॥ 1160 - 1323) స్వతంత్ర పాలకులు. ప్రప్రథమంగా ఆంధ్రులందరూ ఏకమయింది శాతవాహన యుగంలో, కాని వీరి కాలంలో ఆంధ్రులకు ప్రత్యేక ప్రతిపత్తి లేదు. మహారాష్ట్రులు, కన్నడిగులు కూడా ఇందులో చేరియున్నారు. అదియును గాక శాతవాహనులు తాము ఆంధ్రులమని ప్రత్యేకంగా ప్రకటించుకోలేదు. పురాణాలు వీరిని ఆంధ్ర వంశీయులని పేర్కొనుట వలన వీరు ఆంధ్రులని తెలియుచున్నది. అట్లుగాక ఆంధ్ర ప్రజలు, ఆంధ్రదేశము, ఆంధ్రదేశాధీశ్వరుడు. ఆంధ్రనగరి అను ప్రయోగాలు విస్తృత ప్రచారము పొందినది ఈ యుగంలోనే. కాకతీయ ప్రభువులు ఆంధ్రదేశాధీశ్వరులుగా ప్రసిద్ధి చెందగా ఓరుగల్లు ఆంధ్రనగరిగా వ్యవహృతమయింది. కాకతీయులకు పూర్వం ఆంధ్రదేశం దక్షిణమున ఉన్న చోళులకు, పశ్చిమాన ఉన్న రాష్ట్రకూటులకు, చాళుక్యులకు కదనరంగమయింది. శాంతి భద్రతలు కొరవడినాయి. అట్టి పరిస్థితులలో రంగ ప్రవేశం చేసిన కాకతీయులు మాండలికులను అదుపులోనుంచి, ఆంధ్రదేశంలో రాజకీయ ఐక్యతను సాధించి శాంతి సుస్థిరతలు నెలకొల్పి వ్యవసాయాన్ని, వాణిజ్యాన్ని, వాస్తుశిల్ప కళలను పోషించి మత సంస్థలను ఆదరించి, ఆంధ్ర సంస్కృతిని కాపాడి, ఉత్తరాపథం నుండి వచ్చి దక్షిణ హిందూ దేశ రాజ్యాలను కబళించుటకు యత్నించిన తురుష్క సేనా వాహినులను తమ శక్త్యానుసారం వీరోచితంగా ఎదుర్కొని భావితరాల వారైన రెడ్డి విజయనగర ప్రభువులకు మార్గదర్శకులుగా నిలిచినారు.

## కాకతీయుల చరిత్రకు ఆధారాలు:-

కాకతీయ ప్రభువులు జీవిత విశేషాలను తెలుసుకొనుటకు సమకాలీన చారిత్రకాంశాలను అవగాహన చేసుకొనుటకు సమకాలీన చారిత్రకాంశాలను అవగాహన చేసుకొనుటకు వివిధ ఆధారాలు లభ్యమయినాయి. అవి: శాసనాలు, నాణేలు, కట్టడాలు, వ్రాత పూర్వక ఆధారాలు.

శాసనాలు శిలా శాసనాలు, తామ్ర శాసనాలు అని రెండు విధాలు. ఈ శాసనాలు కాకతీయ ప్రభువులవే కాక సమాంత మాండలికులవి, యాదవ హోయసాల కళింగగాంగులవి ఉన్నాయి. శిలా శాసనాలు అత్యధిక సంఖ్యలో లభించాయి. రుద్రదేవుని హనుమకొండ శాసనం సముద్రగుప్త అలహాబాదు శిలా స్తంభ శాసనం వంటిది. ఇది కాకతిరుద్రుని జైత్రయాత్రలను సమకాలిక ప్రభువుల సామంత మాండలికుల రాజ్య పరిస్థితులను తెలుసుకొనుటకు అత్యంత ఉపయుక్తము. గణపతి దేవుని సోదరి మైలమ వ్రాయించిన బయ్యారం చెరువు శాసనం తొలి కాకతీయుల చారిత్రక విశేషాలను తెలియజేస్తుంది. గణపతి దేవుని కాలం నుండి గణపేశ్వరం, మట్టెవాడ, మోటుపల్లి, యనమదల, ఏకామనాధ శాసనాలు ఇతని విజయాలను, ఆర్థిక పరిస్థితులను గూర్చి తెలుసుకొనుటకు ఉపయోగపడతాయి. రుద్రమదేవి కాలం నాటి బీదరు శాసనం వలన ఆమె తన రాజ్యారంభ కాలంలోనే ఆ దుర్గమునాక్రమించినట్లు తెలియుచున్నది. చందుపట్ల శాసనం వలన రుద్రమదేవి తన సేనాని మల్లికార్జున నాయకునితో పాటు యుద్ధంలో హతురాలయినట్లు విదితమవుతుంది. ఈమె మల్కాపుర శాసనం గోళగి మఠాలను గూర్చి దేవాలయ నిర్వహణను గూర్చి వివరిస్తుంది. తీరాల శాసనం వలన దాయగజ కేసరి యనుమకుటము గల నాణేలు ప్రతాపరుద్రునకు చెందినవని తెలుస్తుంది. ఇతని సలకలవీడు పాతర్ల పాడు కందుకూరు శాసనాలు నాటి వివిధ పన్నులు కొలతలు తూనికలు మున్నగు వివరాలు అందిస్తాయి. యాదవ సింఘనుని కాలం నాటి పాట్న, భవాల్ పుర శాసనాలు శేవుణ (యాదవ)- కాకతీయ సంబంధాలను తెలియజేస్తాయి.

కాకతీయుల కాలం నాటి తామ్ర శాసనాలు స్వల్ప సంఖ్యలో లభించినను అవి అమూల్యమైన చారిత్రక సమాచారాన్ని అందిస్తున్నాయి. తూర్పు చాళుక్య ప్రభువు దానార్ణవుని మాగల్లు తామ్ర శాసనంలో అత్యంత విలువైన చారిత్రక సమాచారం ఉన్నది.

దీని ద్వార కాకతీయుల పుట్టు పూర్వోత్తరాలు తెలుస్తున్నాయి. భూ సంబంధమైన వివాద పరిష్కారాన్ని గురించిన వివరాలు గణపతి దేవుని కరీంనగర్ తామ్ర శాసనంలో ఉన్నాయి. ఇతరత్రా తెలియని సమాచారం రుద్రమదేవి కాలం నాటి ఆలపాడు తామ్ర శాసనం ద్వారా లభిస్తుంది. రుద్రమదేవికి మూడవ కుమారుడై ఉన్నట్లు ఈ శాసనం వల్ల తెలుస్తుంది. రుద్రమ యాదవ వంశజుడైన ఎల్లన దేవుని ఈమె పరిణయమాడినట్లు దీని ద్వారా తెలుస్తుంది. తామ్ర శాసనాలలో ప్రతాపరుద్రుని కాలం నాటి కండవల్లి శాసనానికి ప్రత్యేక స్థానమున్నది. దాయగజకేసరియను బిరుదు ప్రతాపరుద్రునికి వున్నట్లు ఇది సూచిస్తుంది. కనుక దాయగజకేసరి యను శీర్షిక గల కాకతీయ నాణేలు ప్రతాపరుద్రుని వేయని దీనివలన విదితమగుచున్నది. యాదవ రామచంద్రుని పైఠాన్ తామ్ర శాసనం వలన జైతుగి (జైత్రపాలుడు) తో జరిగిన పోరాటంలో కాకతిరుద్రుడు హతుడైనట్లు గణపతి దేవుడు ఓరుగల్లు సింహాసనము పై ప్రతిష్ఠింపబడినట్లు తెలియుచున్నది. ఈ శాసనాలు ఇండియన్ యాంటిక్వరీ, ఎపిగ్రాఫియా ఇండికా, ఎపిగ్రాఫియా ఆంధ్రికా, దక్షిణ హిందూ దేశ శాసనాలు, నెల్లూరు జిల్లా శాసనాలు, తెలంగాణా శాసనాలు, తెలంగాణా ప్రాంతానికి చెంది జిల్లాల వారీగా వెలువడిన శాసన సంపుటములలోను ప్రచురితమైనాయి.

కాకతీయ ప్రభువులకు సంబంధించిన వివిధ ఆకృతులలోను, పరిమాణములలోను వున్న బంగారు, వెండి లోహములతో తయారు చేయబడిన నాణెములు లభించినాయి. వీటి వలన నాటి ఆర్థిక స్థితి గతులు తెలియుచున్నవి.

కాకతీయ యుగంలో అనేక దుర్గాలు, దేవాలయాలు, తటాకాలు నిర్మితమైనాయి. ఓరుగల్లు, భువన గిరి, కందూరు, వర్ధమాన పురం, నల్లగొండ, పానుగల్లు, పాలవాస మున్నగు దుర్గాలు నాటి ప్రభుత్వ సైనిక సంపదను, శక్తి సామర్థ్యాలను తెలియజేస్తున్నాయి. హనుమకొండలోని వేయి స్థంబాల గుడి, ఘనపూర్‌లోని రామప్ప దేవాలయము, పిల్లల మర్రి, నాగుల పాడు, జలాల్ పురం, పానుగల్లు, మందడం మున్నగు చోట్ల నిర్మించబడిన అనేక దేవాలయాలు మఠాల వలన నాటి ఆలయవాస్తు, నిర్మాణ కౌశలం, శిల్ప, కళా సంపద, మత, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు అవగతమవుతాయి. రామప్ప, లక్నవరం, పాకాల, బయ్యారం వంటి తటాకాలు వ్యవసాయాభివృద్ధికి కాకతీయ ప్రభువులు చేసిన ఏర్పాట్లను సూచిస్తున్నాయి.

## సారస్వత ఆధారాలు :-

ప్రతాపరుద్రుని ఆస్థాన కవియైన విద్యానాథుడు సంస్కృతంలో ప్రతాపరుద్రాయశోభూషణం (ప్రతాపరుద్రీయం) అను అలంకార శాస్త్ర గ్రంథమును వ్రాసినాడు. సమకాలీన రచన అయినందున దీని లోని చారిత్రకాంశములను విశ్వసించవచ్చును. కాకతీయుల లాంఛనము, రుద్రమదేవికి గణపతి దేవుడు, ప్రతాపరుద్రులతో గల బాంధవ్యం, పట్టాభిషేకానంతరం ఆమె పురుషనామంతో వ్యవహరింపబడుట మున్నగు వివరాలు ఇందులో వర్ణితమయినాయి. ఇవి ఇతర ఆధారాలతో సరిపోల్చి చూసినప్పుడు వాస్తవాలని తెలియుచున్నది. తెలుగులో వ్రాయబడిన క్రీడాభిరామ రచయిత వినుకొండ వల్ల భామాత్యుడు. దీనిని శ్రీనాథుడు వ్రాశాడని మరియొక అభిప్రాయమున్నది. వీరిరువురూ క్రీ॥శ॥ 14 - 15 శతాబ్దపు వారే. ఇందలి ప్రధాన పాత్రధారులైన గోవింద మంచవ శర్మ టిట్టిభశెట్టిల సంభాషణల ద్వారా ఓరుగల్లు దుర్గము అందులోని వాడలు, దేవాలయాలు, వివిధ వర్గాల ప్రజలు, వారి జీవన విధానం, మత విశ్వాసాలు, సాంఘిక ఆర్థిక పరిస్థితులు, నగర జీవిత విశేషాలు తెలుస్తున్నాయి. పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్ర, బసవ పురాణాలు సమకాలీన మత పరిస్థితులను వివరిస్తాయి. కోలని గణపతి దేవునిచే రచింపబడిన శివ యోగ సారం ఇందులూరి వంశీయులను గూర్చి తెల్పుతుంది. రుద్రమదేవి మూడవ కుమార్తెను ఇందులూరి అన్నయ వివాహమాడుటను గురించి, అతడు రుద్రమదేవికి, ప్రతాపరుద్రునికి చేసిన సేవల గురించి ఇది వివరిస్తుంది. కాకతిరుద్రుడు సంస్కృతంలో వ్రాసిన నీతిసారము, బద్దెన రచించిన నీతిసార ముక్తావళి, వివిధ పన్నులు, వర్తక వ్యాపారాలు, రాజులు, మంత్రులు, దుర్గాలు, రాజ్యరక్షణ మున్నగు అంశాలను వివరిస్తాయి. గజసాహిణి జాయపనృత్యరత్నావళి అను నాట్య శాస్త్రమును వ్రాశాడు. ఇది సమకాలిక రచన. ఇందులో వివిధ నాట్య భంగిమలు వర్ణింపబడినాయి. నాటి నాట్య కళను గూర్చి తెలుసుకొనుటకు ఇది ఉపకరిస్తుంది. ఏకామ్రనాథుని ప్రతాప చరిత్ర, కాసెసర్వప్ప వ్రాసిన సిద్దేశ్వర చరిత్ర కాకతీయ ప్రభువుల నిర్ణయానికి నాటి సాంఘిక సాంస్కృతిక పరిస్థితులను, నగర జీవిత విశేషాలను రాజుల దైవిక కార్యకలాపాలను చక్కగా వివరిస్తాయి. శ్రీనాథుని పల్నాటి

వీరచరిత్ర ద్వారా కాకతిరుద్రుని ప్రథమార్థ కాలము నాటి ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితులను వివిధ మత శాఖల వారి కార్యకలాపాలను, విశ్వాసాలను, సామాజిక జీవన విశేషాలను మనము గ్రహించవచ్చును. వెలుగోటి వారి వంశావళి వెలమనాయకుల వంశ చరిత్ర. వీరు గణపతి దేవుని కొలువులో చేరి రుద్రమదేవిని ప్రతాపరుద్రుని సేవించి వారి యుద్ధాలలో ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు దీని వలన తెలుస్తుంది.

రుద్రమదేవి కాలంలో మోటుపల్లి రేవును సందర్శించిన ఇటలీ దేశీయుడగు మార్కోపోలో రచనల వలన ఆనాటి వర్తక వ్యాపారాలను గురించి కాకతి రాజ్య ఆర్థిక పరిస్థితిని గూర్చి తెలుసుకొనవచ్చును. ఇసామీ ఫెరిస్తా ఇబన్ బటూటా, జియా ఉద్దీన్ బరానీ, అమీర్ ఖుస్రూ, షెమ్స్, సిరాజ్ హాఫీస్ వంటి ముస్లిం చరిత్రకారుల రచనల వలన ప్రతాపరుద్రుని కాలంలో జరిగిన ముస్లిం దండయాత్ర విశేషాలు తెలుస్తాయి.

## కాకతీయ పుట్టు పూర్వోత్తరాలు:-

కాకతీయుల వంశ నామం కాకతి, కాకెత, కాకత్య, కాకర్త్య, కాకత్తియ, కాకతియ రూపాల్లో కన్పిస్తుంది. కాకతి అనే పదం నుండి కాకతీయ వంశ నామం వచ్చినట్లు తెలుస్తుంది. కాకతీయుల పుట్టు పూర్వోత్తరాలను గూర్చి రెండు అభిప్రాయాలున్నాయి. అవి కాకతీయానువారి కుల దేవతను బట్టి ఆ పేరు కలిగినదని కొందరి వాదన, కాకతీయునుది వారి తొలి నివాస స్థానమని మరి కొందరు అభిప్రాయపడినారు.

మనదేశంలో ఊరికొక గ్రామదేవత ఉంటుంది. కాని ఆ దేవతల ప్రశస్తి వివరంగా తెలియదు. అదేవిధంగా కాకతీయ వంశానికి మాత్రమే పరిమితమైన ఒక దేవత అయి ఉండవచ్చును లేదా వారు తమ స్వస్థలము నుండి హనుమకొండకు వచ్చి స్థిరపడిపోయినప్పుడు ప్రతిష్ఠించుకున్న కుల దేవతయే కాకతిగా వ్యవహరింపబడి యుండును. హనుమకొండకు సమీపముననున్న గుట్టమీద పద్మాక్షి పేరుతో పూజింపబడు దేవతయే. వీరు మొదటి నుండి ఆరాధించు స్త్రీ దేవతయై ఉండవచ్చును. కాకతి అనేది దుర్గాశక్తి అని, ఈ శక్తిని ఆరాధించే వారే కాకతీయులైనారని ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత 15 వ శతాబ్దంలో పేర్కొన్నాడు. క్రీ॥శ॥ 1508 నాటి చిత్తపఖానుని శాసనం గుండ తురుష్కులు నాశనం చేసిన ఈ దేవతా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది. కాకతీయులు మొదట్లో జైనులు, అందువలన వారు జైన దేవత కూష్మాండి (కాకతి)ని ఆరాధించేవారు. పిమ్మట వారు శైవ మతాభిమానులుగా మారినప్పుడు ఆ దేవతనే కాకితమ్మ అనే దుర్గాశక్తిగా ఆరాధించి ఉండవచ్చు. ఓరుగల్లు కోటలో కాకతీయను పేరుతో ఒక గ్రామదేవత ఉన్నట్లు కాకితమ్మకు పైదోడు ఎకవీర అని క్రీడాభిరామం పేర్కొంటున్నది. దీనిని బట్టి కాకతి గూడా ఒక గ్రామదేవతే అయివుండవచ్చును. అయితే గ్రామ దేవతలందరూ దుర్గాదేవి వివిధ రూపాలే.

'కాకతి' అనేది ఒక ప్రదేశాన్ని సూచిస్తున్నదని మరొక వాదన. ఖాజీపేట శాసనం మొదటి బేతరాజును కాకతి పునాదినాధునిగా వర్ణిస్తుంది. మొదటి ప్రోలరాజు కాకతి వల్లభునిగా వ్యవహరింపబడినాడు. కనుక ప్రదేశమును బట్టి కాకతీయ వంశమున కాపేరు గలిగినట్లు తెలియుచున్నది. కాకతీయుల మూల పురుషుడైన వెన్నడు, కాకతి యను ప్రదేశము నుండి పరిపాలించుట వలన కాకతీయులైనారని బయ్యారం చెరువు శాసనం చెబుతుంది. కాకతిపురం నుండి పాలించుట వలన వీరు కాకతీయులుగా వ్యవహరింపబడినారని ఈ శాసనములను బట్టి తెలియుచున్నది. అయితే కాకతీపురము ఏది? అనేది ఇప్పుడు తేలవలసిన సమస్య. కందారపురం కాకతీయుల తొలి నివాస స్థానమని సిద్ధేశ్వర చరిత్ర మున్నగు గ్రంథాల వలన తెలుస్తుంది. ఇది నేటి కర్నాటక రాష్ట్రంలో నాందేడు జిల్లాలోని కందారపురం కావచ్చును. ఇది రాష్ట్ర కూట సామంతులు కొందరు ఉండే నగరం. కానీ దీనికి 'కాకతి' అనే పేరు లేదు. అదే రాష్ట్రంలో బెల్గాంకు ఆనతి దూరంలో కాకతి అనే గ్రామం ఉన్నది. ఈ గ్రామమే కాకతీయుల జన్మస్థలి అయి ఉండవచ్చు. అచట నుండి వారు రాష్ట్రకూటుల ఉద్యోగులుగా తమ రాజకీయ జీవితం ప్రారంభించి వారి దండయాత్రల సందర్భముగా సేనానులుగా ఆంధ్రదేశంలో ప్రవేశించినారు.

క్రీడారామమును బట్టి ఓరుగల్లులో కాకతియను దేవతకు గుడి ఉన్నట్లు తెలియుచున్నది. కనుక ఓరుగల్లు నగరమే కాకతిపురము అయి ఉండవచ్చు. కాకతి పునాదినాధులే కాకతీయులుగా వ్యవహరింపబడినారు.

ఖాజీ పేట దర్గా శాసనంలో (క్రీ॥శ॥ 1098) కాకతీయులు 'సామంత విష్టి' వంశజులు గాను, మాగల్లు శాసనంలో 'సామంత బద్దె' వంశీయులు గాను పేర్కొనబడినారు. వీరికి విట్టి నారాయణ బిరుదమున్నది. ఈ బిరుదమును బట్టి విట్టి పదము వృష్ణిగా భావించిన వృష్ణి వంశమున నారాయణుని వంటి వాడను అర్థము వచ్చునట్లు ఈ బిరుదము ధరించి ఉండవచ్చని తెలియుచున్నది. కావున కాకతీయుల వృష్ణి వంశ క్షత్రియులని ఒక అభిప్రాయం ఉన్నది. మూర్కాపురం, మోటుపల్లి శాసనాలు కాకతీయులను క్షత్రియులుగా పేర్కొంటున్నాయి. కాని అత్యధిక శాసనాలలోను వాఙ్మయంలోను వీరు చతుర్థ కులజులుగా పేర్కొనబడినారు. ప్రతాపరుద్రుని ఆస్థాన కవి విద్యానాధుడు కాకతీయుల కులం సూర్య వంశ, చంద్ర వంశ క్షత్రియ వంశాల కంటే మిన్నయైనదని వర్ణించుటను బట్టి వీరు క్షత్రియులు కాదని స్పష్టమగుచున్నది. ఆయుధోప జీవులుగా తమ రాజకీయ జీవితం ప్రారంభించిన చతుర్థ కులజులు కొందరు సైనికులుగా, సేనాపతులుగా, పాలకులుగా క్షాత్ర ధర్మాలను పాటించి నిర్వర్తించినందున వారు తమను తాము క్షత్రియులుగా అభివర్ణించుకున్నారు. శూద్రులైన వెలనాటికొండ, పడమటి కోట, పరిచ్ఛేద వంశీయులంతా ఇలాంటి వారే. బయ్యారం చెరువు శాసనం, అమరావతిలోని కోట వంశీయుల శాసనం, గణపతిదేవుని ప్రసిద్ధ సేనాని మల్యాల గుండయబోత్పూర్ వడ్డమాను శాసనాలు కాకతీయులు శూద్రులని తెలియజేస్తాయి. చతుర్థ కులజులతో వీరికి గల సంబంధ బాంధవ్యాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. చాళుక్యులతోను విప్రకులజులైన ఇందులూరి కుటుంబంతోను ఏర్పడిన వీరి సంబంధాలు రాజకీయపరమైనవి.

## తొలి కాకతీయులు:-

కాకతీయులు కూడా వేంగీ చాళుక్యుల వలె కర్నాటక ప్రాంతం నుండి ఆంధ్రదేశానికి వచ్చి స్థిరపడిన వారే. రాష్ట్ర కూటుల సేనానులుగా వీరు ఆంధ్రదేశంలో ప్రవేశించి తదుపరి వారు సామంతులుగా ఇచట స్థిరపడి సార్వభౌములు బలహీనులు కాగా స్వతంత్ర రాజ్య స్థాపన చేశారు. వీరి ప్రస్తావన ప్రప్రథమంగా తూర్పు చాళుక్య ప్రభువు దానార్ణవుని మాగల్లు తామ్ర శాసనం (క్రీ॥శ॥ 956) లో కన్పిస్తుంది. రాజ్య సంపాదనలో తనకు సహాయంగా వచ్చిన రాష్ట్రకూట మూడవ కృష్ణుని సేనాని కాకర్త్య గుండ్యనను సంతోషపెట్టుటకు దానార్ణవుడు అతని కోరిక పై మాగల్లు గ్రామాన్ని ఒక బ్రాహ్మణునికి అగ్రహారంగా దానం చేసినాడు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఇవ్వబడిందే ఈ శాసనం. ఇందులో గుండ్యన మూడు తరాల పూర్వీకుల ప్రస్తావన ఉన్నది. వీరు హనుమకొండ ఏలిన కాకతీయుల పూర్వీకులేననే విషయాన్ని బయ్యారం చెరువు శాసనం (క్రీ॥శ॥ 1250) ధృవీకరించుచున్నది. ఈ శాసన దాత గణపతి దేవుని సోదరి మైలాంబ. వెన్నరాజు కాకతీయుల మూల పురుషుడనియు, ఇతడు కాకతిపురం రాజధానిగా పాలించినాడనియు ఈ శాసనం చెబుతుంది.

రాష్ట్రకూటుల (క్రీ॥శ॥ 755 - 973) దంతి దుర్గుని నాయకత్వమున బాదామి చాళుక్యులను (క్రీ॥శ॥ 540 - 755) తొలగద్రోసి వారి రాజ్యమునాక్రమించినారు. బాదామి చాళుక్య బంధువులైన వేంగీ చాళుక్యుల పై తమ ఆధిపత్యమును నెలకొల్పుటకు రాష్ట్ర కూటులు పలుమార్లు ప్రయత్నించారు. తత్ఫలితంగా ఈ రెండు రాజ్యముల మధ్య బద్ధవైరమేర్పడింది. రాష్ట్ర కూటుల అనుయాయులుగా కాకతీయులు ఆ దండ యాత్రలలో పాల్గొన్నారు.

మాగల్లు శాసనంలో పేర్కొనబడిన గుండియ, ఎరియ, బేతియ, కాకర్త్య గుండ్యనలలో మొదటి ఇద్దరికి 'రాష్ట్రకూట' బిరుదము ఉన్నది. రాష్ట్రకూట అంటే ప్రాంతీయాధికారి, గ్రామాధికారి, గ్రామోద్యోగి' అనే అర్థాలున్నాయి. కాకతీయులు రాష్ట్ర కూట వంశ శాఖ అని డా॥ పి.వి. పరబ్రహ్మ శాస్త్రి గారి అభిప్రాయం. ఈ శాసనంలో పేర్కొనబడిన గుండియ రాష్ట్రకూటుడు కాకతీయులలో మొదటి చారిత్రక వ్యక్తి. ఇతడు వెన్న భూపతి ప్రపౌత్రుడు. రాష్ట్రకూట రెండవ కృష్ణుడు వేంగి రాజ్యం మీద జరిపిన దాడులలో గుండియ ప్రధాన పాత్ర నిర్వహించినాడు. బెజవాడను పట్టుకోవడంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించినాడు.

తరువాత జరిగిన పెరువంగూరు యుద్ధంలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. అందుకు కృతజ్ఞతతో కృష్ణుడు గుండియ కుమారుడు ఎరియ రాష్ట్ర కూటుని కుర్రవాడికి అధిపతిగా నియమించినాడు. ఇది ఓరుగల్లుకు సమీపంలో ఉన్నది. ఎరియ ఓరుగల్లు (కాకతిపురం) రాజధానిగా పాలించినాడు. కుర్రవాడి రాష్ట్రకూట రాజ్యానికి తూర్పు సరిహద్దు ప్రాంతం. ఈ విధంగా రాష్ట్రకూట సేనాపతులుగా సరిహద్దు రక్షణా ఉద్యోగులుగా కాకతీయులు ఆంధ్రదేశంలో ప్రవేశించినారు. ఎరియ కుమారుడు బేతియ. ఇతని కుమారుడే రాజ్య సంపాదనలో దానార్ణవునికి సాయపడిన కాకత్య గుండ్యన. అందుకు ప్రతిఫలంగా నతవాడి పాలకుడైనాడు. తరువాత కొద్ది కాలానికి ఆంధ్ర, కర్నాట ప్రాంత రాజకీయాలలో పెను మార్పులు సంభవించినాయి. కర్ణాటకంలో తమను ఆదరించిన రాష్ట్రకూటులు మూడవ కృష్ణుని మరణానంతరం అధికారాన్ని కోల్పోయారు. అచట రెండో తైలపుడు చాళుక్య పాలనను పునః ప్రతిష్ఠించినాడు. వేంగిలో దానార్ణవుడు పదవితో పాటు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నాడు. జటాచోడ భీముడు వేంగీ సింహాసనమాక్రమించినాడు. ఈ కల్లోలిత పరిస్థితులను అవకాశంగా తీసుకొని గుండ్యన ముదిగొండ చాళుక్యులు ఆక్రమించిన తమ పూర్వ రాజ్యము కుర్రవాడిని తిరిగి సంపాదించినాడు. కాని ఆ విజయము తాత్కాలికమయినది. బొట్టు బేతడు అను ముదిగొండ చాళుక్య ప్రభువు పశ్చిమ చాళుక్య సేనాని విరియాల ఎర్ర భూపతి సహాయంతో గుండ్యనను వధించి కొరవ మండలంలో తన పాలనను నెలకొల్పినాడు. గుండ్యన కుమారుడు బేతన రాజ్యము కోల్పోయి నిస్సహాయుడైనాడు.

## సామంత కాకతీయులు

### మొదటి బేతరాజు (క్రీ॥శ॥ 995 - 1052):-

మొదటి బేతరాజును గరుడ బేతరాజని కూడా అంటారు. ఇతడు గుండ్యన కుమారుడు. పిన్నవయస్కుడు. రాష్ట్రకూట ప్రభువుల పతనానంతరం అధికారం కోల్పోయిన బేతరాజుకు అతని మేనత్త విరియాల కామసాని అండగా నిలిచింది. ఈమె కళ్యాణి చాళుక్య సేనాని విరియాల ఎర్రని భార్య. ఈమె సహాయంతో హనుమకొండ విషయాధిపతియైన బేతన పశ్చిమ చాళుక్యుల సామంతుడైనాడు. ఈ విషయంలో గూడూరు శాసనం, సిద్ధేశ్వర చరిత్ర ప్రస్తావిస్తున్నాయి. కష్ట కాలంలో ఇతనికి సహాయపడిన ప్రముఖులలో విరియాల సూరీడు మరొకడు. హనుమకొండకు వచ్చిన కాకతీయ వంశీయులలో ఇతడే మొదటివాడని బయ్యారం చెరువు శాసనం ద్వారా తెలుస్తుంది. చరిత్రలో మొదటి బేతరాజుగా ప్రసిద్ధుడైనవాడు ఇతడే.

బేతరాజు 'ఏబది' ఏండ్లకు పైగా పశ్చిమ చాళుక్య సామంతునిగా హనుమకొండ విషయమేలినాడు. ఈ విషయము ఇప్పటి వరంగల్లు జిల్లాలో కొంత భాగంతో పాటు కరీంనగర్ జిల్లాలో శనిగరం వరకు వ్యాపించి యున్నది. క్రీ॥శ॥ 1051 నాటి ఇతని ఒకే ఒక శాసనం శనిగరంలో లభించింది. దీనిని బట్టి వేములవాడ చాళుక్యుల రాజ్యంలోని ఆ ప్రదేశం ఇతని ఆధీనమయినట్లు విదితమగుచున్నది. ఇతడు క్రీ॥శ॥ 1051 వరకు జీవించి ఉన్నట్లు కూడా ఈ శాసనం స్పష్టపరుస్తుంది.

బేతరాజు తన సార్వభౌములకు చేదోడు వాదోడుగా వుంటూ తన స్థానాన్ని పదిలపర్చుకున్నాడు. ఇతనికి రేచర్ల వంశీయులు సేనాధిపతులుగా ఉండేవారు. వారిలో రేచర్ల బ్రహ్మసేనాని ముఖ్యుడు. ఇతడు పశ్చిమ చాళుక్య చక్రవర్తి త్రైలోక్యమల్ల సోమేశ్వరుని (క్రీ॥శ॥ 1043 - 1068) ఆజ్ఞానువర్తియై కాకతీయ సైన్యములకు నాయకత్వం వహించి చోళరాజధాని యగు కాంచీనగరం పై దాడి చేసినాడు. బేతరాజు "చోళచమూవార్ధి ప్రమథన" అని శాసనాలలో ప్రశంసింపబడినాడు. దీనిని బట్టి అతడు కూడా ఈ దండయాత్రలో పాల్గొని విజయం సాధించినట్లు తెలియుచున్నది. బేతరాజు హనుమకొండ విషయాన్ని క్రీ॥శ॥ 1052 వరకు సమర్థవంతంగా పాలించినట్లు శనిగరం శాసనం సూచిస్తుంది. ఇతని మంత్రి నారణయ్య శనిగరంలోని యుద్ధమల్ల జైనాలయానికి మరమ్మత్తులు చేయించి కానుకలు సమర్పించినారు.

### మొదటి ప్రోలరాజు (క్రీ॥శ॥ 1052 - 1076):-

ప్రోలరాజు బేతరాజు కుమారుడు. ఇతనిని గురించి తెలుపు శాసనాలు రెండు. అవి క్రీ॥శ॥ 1053 నాటి అతని శనిగరం

శాసనం, అతని మనుమడైన దుర్గరాజు ఖాజీపేట దర్గా శాసనం. ఇతడు చాళుక్య త్రైలోక్యమల్ల సోమేశ్వరుని కుమారుడు. యువరాజు ఆరవ విక్రమాదిత్యుని దండయాత్రలో పాల్గొని కంకణము చక్రకూటములను జయించి సమధిగత పంచమహాశబ్ద బిరుదాన్ని పొందినాడు. పొరుగున ఉన్న వేములవాడ కాడ్పర్తి గుణసాగరం మున్నగు ప్రాంతాలను జయించి ఇతడు తన హనుమకొండ విషయంలో చేర్చుకున్నాడు. స్థానిక నాయకులైన అన్నయ్య గొన్నయ్యులను ఓడించి హనుమకొండ ప్రాంతాన్ని సురక్షితం చేశాడు. భద్రంగు (బద్దెగ) ని పారద్రోలి సబ్బి మండలంలో అధిక భాగాన్ని ఆక్రమించినాడు. ఇతడు వేములవాడ చాళుక్యులలో చివరి వాడు కావచ్చును.

ప్రోలరాజు క్రొత్తగా తాను జయించిన ప్రదేశాలతో కూడిన హనుమకొండ విషయాన్ని శాశ్వత సామంతరాజ్యంగా త్రైలోక్యమల్ల సోమేశ్వర చక్రవర్తి నుండి పట్టా పొందినాడు. దీనితో తండ్రి పొందిన అస్థిరమైన రాజ్యాధికారానికి శాశ్వతత్వము చేకూరింది అంతేకాక దానికొక నిర్దిష్ట రూపకల్పన చేసి కాకతి రాజ్య స్థాపకుడైనాడు. శాశ్వత సామంత హోదాతో పాటు ప్రోలరాజు చాళుక్య రాజ్య చిహ్నమైన వరాహముద్రను ఉపయోగించుకొని నాణెములను ముద్రించుకొనుటకు సార్వభౌముని అనుమతి పొందాడు. కాకతీయులు రాష్ట్రకూట సామంతులుగా గరుడ లాంఛనము వాడినారు. చాళుక్యుల రాజలాంఛనం వరాహం. చాళుక్య సామంతులుగా మారిన తరువాత కాకతీయులు వరాహలాంఛనమును కూడా ఉపయోగింపసాగినారు.

ప్రోలరాజునకు 'అరిగజ కేసరి' అనే బిరుదు ఉంది. 'ఏనుగుల వంటి శత్రువులకు అతడు సింహము వంటి వాడని' దాని అర్థము. ఆ బిరుదు నామంతోనే అతడు కేసరి తటాకములను త్రవ్వించినాడు. వాటిలో కేశ సముద్రమనే గ్రామం దగ్గర ఉన్న పెద్ద చెరువు ఒకటి. ఆ చెరువును బట్టే ఆ ఊరికి ఆ పేరు కలిగింది.

పశ్చిమ చాళుక్య రాజ్యంలో సింహాసనాధిపత్యానికై ఆరవ విక్రమాదిత్యునికి అతని అన్న రెండవ సోమేశ్వరునికి మధ్య వారసత్వ పోరు ఆరంభం కాగా ప్రోలరాజు అతని కుమారుడు బేతరాజు విక్రమాదిత్యుని పక్షమున చేరినారు.

## రెండవ బేతరాజు (క్రీ॥శ॥ 1076 - 1108):-

రెండవ బేతరాజు మొదటి ప్రోలరాజు కొడుకు. ఇతడు తన తండ్రి మరణానంతరం క్రీ॥శ॥ 1076 లో హనుమకొండ రాజ్యాధిపతి అయినాడు. పశ్చిమ చాళుక్య రాజ్యంలో కొనసాగుతున్న వారసత్వ యుద్ధంలో బేతరాజు సమర్థించిన విక్రమాదిత్యుడు విజయుడైనాడు. విజయ సాధనలో తనకు తోడ్పడిన బేతరాజును గౌరవిస్తూ తనకు వర్తించు 'విక్రమచక్రి', 'త్రిభువనమల్ల' అను రెండు బిరుదులను అతనికి ప్రధానం చేసినాడు. దీని వలన చాళుక్య సామ్రాజ్యంలో హనుమకొండ రాజ్యానికొక విశిష్ట స్థానమేర్పడినది. అంతేగాక హనుమకొండనానుకొనియున్న కొన్ని యితర భూభాగములను కూడా అతడు బేతని రాజ్యంలో చేర్చినాడు. అట్టి వాటిలో సబ్బి మండలమొకటి.

బేతరాజు మంత్రి వైజదండనాథుని వ్యూహంతోను, విక్రమాదిత్యుని ప్రోత్సాహంతోను తన పై కత్తి గట్టిన పరమార జగద్దేవుని పొలవాసమీద రాజును ఓడించి సబ్బిసాయిర మండలం పై తన పట్టు బిగించినాడు. దీనితో కొరవి మండలం హనుమకొండ విషయం సబ్బిసహస్రాలతో కూడియున్న కాకతీయ రాజ్యం క్రమంగా విస్తరించసాగింది.

త్రిభువనమల్ల బేతరాజు శివభక్తి తత్పరుడు. కాలాముఖ శైవా చార్యుడైన రామేశ్వర పండితుడు ఇతని దీక్షాగురువు. అతనికి హనుమకొండలోని శివపురాన్ని, అచట తన పేరిట నిర్మింపబడిన బేతేశ్వరాలయాన్ని గురు దక్షిణగా సమర్పించుకున్నాడు. ఇతడు హనుమకొండ తన తండ్రి పేర ప్రోలేశ్వరాలయము నిర్మించి దానములిచ్చినాడు. నర్సంపేట సమీపముననున్న బాణాజి పేటలోని జైన దేవాలయానికి కూడా దానములిచ్చినట్లు అచ్చుటి శాసనం సూచిస్తుంది.

## దుర్గరాజు (క్రీ॥శ॥ 1108 - 1116):-

దుర్గరాజు రెండవ బేతరాజు పెద్ద కుమారుడు. ఇతడు క్రీ॥శ॥ 1108 లో సింహాసనము అధిష్ఠించినాడు. ఇతనికి 'త్రిభువనమల్ల',

'చలమర్తిగండ' అను బిరుదములున్నాయి. ఇతడు తండ్రి విధానానికి విరుద్ధంగా పరమార జగద్దేవునితోను పోలవాసమేడ రాజుతోను స్నేహ సంబంధములు ఏర్పరచుకొని వారి ప్రోత్సాహంతో స్వతంత్రంగా వ్యవహరిస్తూ చాళుక్యుల సార్వభౌమత్వమును ధిక్కరించినాడు. ఇతని కుతంత్రములనెరిగిన తమ్ముడు ప్రోలరాజు చాళుక్య చక్రవర్తి (ఆరవ విక్రమాదిత్యుడు) సహాయంతో క్రీ॥శ॥ 1116 లో దుర్గరాజును సింహాసనాభ్రష్టునిగా చేసి తాను రాజ్య పీఠమునలంకరించినాడు. దుర్గరాజు తండ్రి వలె రామేశ్వర పండితునకు దానములిచ్చి గౌరవించినట్లు ఖాజీపేట శాసనం తెలుపుచున్నది.

## రెండవ ప్రోలరాజు (క్రీ॥శ॥ 1116 - 1157):-

రెండవ ప్రోలరాజు రెండవ బేతరాజు రెండవ కుమారుడు. ఇతడు తన అగ్రజుని తొలగించి క్రీ॥శ॥ 1116 లో సింహాసనము అధిష్టించినాడు. ఇతడు గొప్ప పరాక్రమశాలి. రాజనీతి చతురుడు, సామంత కాకతీయులలో ప్రసిద్ధుడు, కాకతీయ రాజ్య స్థాపకుడు. ప్రోలరాజు సాధించిన విజయాలను రుద్రదేవుని హనుమకొండ శాసనం వర్ణిస్తుంది.

తెలంగాణా ప్రాంతంలో కాకతీయులతోపాటు అనేక ఇతర సామంత రాజ్యాలు ఉండేవి. వాటిలో ఒకటి నేటి ఖమ్మం జిల్లా ప్రాంతంలోని ముది గొండ చాళుక్య రాజ్యం. ఈ రాజ్య పూర్వీకులు బాదామి చాళుక్య ప్రభువు రెండవ పులకేశికి సంబంధించిన వారే. వీరు తొలి తరములోని కాకతీయులచే తాత్కాలికముగా తరిమి వేయబడినను పశ్చిమ చాళుక్యుల రాకతో తిరిగి కోరవి సీమను సాధించి కాకతీయుల వలె వారికి సామంతులైనారు. జగిత్యాల సమీపంలోని పోలవాస కేంద్రంగా మరొక సామంత వంశము ఉండేది. వీరి రాజ్యం జగిత్యాల మంతెనములగు పరకాల, నర్సంపేట తాలూకాలలో వ్యాపించి ఉన్నది. వీరికి పొరుగున వున్న కాకతీయులతో బద్ధ వైరం ఏర్పడింది. చాళుక్య చక్రవర్తుల యెడల కూడ వీరు అవిధేయులై ఉన్నారు. మేడ రాజు పోలవాస పాలకుడు. మూడవది కందూరు చోళ రాజ్యం. మహబూబ్ నగరం జిల్లాలో జడ్చర్ల సమీపమున వున్న కందూరు అను గ్రామం మధ్య యుగంలో ఒక విషయానికి లేక మండలానికి కేంద్రంగా ఉండేది. అందువలన దానికి కందూరునాడని పేరు కలిగింది. చోళులలో ఒక శాఖ వారు కందూరు పాలకులు. నేటి మహబూబ్ నగరం నాగర్ కర్నూలు, అచ్చం పేట, దేవర కొండ, కల్వకుర్తి, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట తాలూకాలు దీనిలో చేరి ఉండేవి. ఈ కాలంలో ఆరవ విక్రమాదిత్యుని రెండవ కుమారుడు తైలపుడు కందూరునాడు కొలను పాలకులకు రాజ ప్రతినిధిగా ఉండేవాడు. భీమ చోడుడు అతని అధికారిగా వ్యవహరించేవాడు.

తన అగ్రజుడు దుర్గరాజు పై అభిమానంతో హనుమకొండ పై దండెత్తి వచ్చిన పరమార జగద్దేవుని ఓడించి తరిమివేసినాడు. ఇది ప్రోలుడు సాధించిన మొదటి విజయం. కందూరు మండలంలో రాజ ప్రతినిధిగా వున్న తైలపుని నాయకత్వంలో తెలంగాణా ప్రాంతంలోని సామంతులు సార్వభౌమాధికారమును ధిక్కరించినారు. వారినణచుటకు చాళుక్య చక్రవర్తి ప్రతాప చక్రవర్తి బిరుదాంకితుడైన రెండవ జగదేకమల్లుడు సైన్యాన్ని పంపినాడు. ప్రోలుడు ఆ సైన్యానికి నాయకత్వం వహించి కందూరు నాడు పై దాడి వెడలి తైలపుని ఓడించి బందీగా పట్టుకొని కళ్యాణి పంపినాడు. తైలపునికి సహాయపడిన భీమ చోడుని తరుముకుంటూ ప్రోలుడు కృష్ణానదిని దాటి శ్రీశైలం వరకు వెళ్ళి అచ్చట విజయ స్తంభమును నాటి ఆలయానికి దానములిచ్చినాడు. పిమ్మట పోలవాస పై దండయాత్ర జరిపి మంత్ర కూటము (మంథెన) వద్ద గుండరాజును ఓడించి, పట్టుకొని తలగొరిగించి అతని రొమ్ము మీద చాళుక్య రాజ్య చిహ్న వరాహముద్రను చిత్రించి ఊరేగించి వధించినాడు. గుండరాజు అగ్రజుడు మేడరాజు. రామగుండ ప్రాంతమును పాలించు వారి బంధువు మేడరాజు ప్రోలుని ధాటికి ఆగలేక పారిపోయినారు. ప్రోలుడు గోవింద దండనాయకుడను వానిని ఓడించి పారద్రోలి పానుగల్లులో చోడోదయణ్ణి నిలిపినాడు.

ఈ విధంగా ప్రోలరాజు తెలంగాణ ప్రాంతములోని తిరుగుబాటులను చక్రవర్తి అనుయాయిగా అణచివేసి తన శౌర్య ప్రతాపాలను, స్వామి భక్తిని ప్రకటించుకొనినాడు. దీనితో ఇతడు రాజాభిమానమును పొందగలుగుటయే గాక తన పరాక్రమాన్ని, ఆధిక్యతను తోటి సామంతులకు తెలియజేసినాడు. ఇదియే ప్రోలుని రాజనీతిజ్ఞతకు మచ్చుతునక. ఇతడీవిధంగా భవిష్యత్తులో నెలకొల్పబోవు స్వతంత్ర రాజ్యస్థాపనకు అవసరమైన గట్టి పునాదులను నిర్మించినాడు.

తుదకు ప్రోలుని జీవితం విషాదాంతమైనది. తీరాంధ్ర దేశంలో వెలనాటి చోళులు విజృంభించి రాజ్య విస్తరణకు పూనుకున్నారు. వారి నెదుర్కొనుటకు పిఠాపురం చాళుక్యులు ప్రోలుని సహాయమర్థించినారు. వారికి సహాయపడుటకు తమ అధికారాన్ని అచటకు విస్తరింపజేయుటకు వెళ్లిన ప్రోలరాజు వెలనాటి యువరాజు రాజేంద్ర చోళునితోను, వెలనాటి సామంతులైన కోట హైహయాది మాండలికుల తోను పోరాడుతూ మరణించినట్లు తెలియుచున్నది. రాజేంద్ర చోళుడు, కోటరాజులు ధరించిన 'కాకతిప్రోల నిర్దహన' అనే బిరుదును బట్టి ఈ విషయము ధృవీకరింపబడుతుంది. ప్రోలుడు క్రీ॥శ॥ 1157లో మరణించి ఉండవచ్చును.

ప్రోలరాజు భార్య ముప్పమాంబ నతవాడి దుర్గ రాజు సోదరి. ఈ దంపతులకు రుద్రుడు, మహాదేవుడు, హరిహరుడు, గణపతి, దుర్గరాజు అను కుమారులు జన్మించినారు. అతని అమాత్యుడు బేతన. ఇతడు వైజదండనాథుని పుత్రుడు. బేతన రాజనీతి చతురుడు. ప్రోలుని రాజ్య విస్తరణకు అతని మేధాశక్తి తోడ్పడింది. బేతన భార్య మైలమ హనుమకొండ పద్మాక్షి గుట్ట పై కడలాలయ జైన బసదిని నిర్మించినది. దీనికి ప్రోలుడు కొంత భూమిని దానము చేసినాడు.

ప్రోలుడు మొదట జైనమతాభిమాని. తరువాత శైవ మతాభిమానిగా మారినాడు. ఇతడు ఓరుగల్లు కోటలోని స్వయం భూదేవాలయాన్ని నిర్మించినాడని ప్రతీతి. ఈ స్వయం భూదేవుడు కాకతీయులకు ఆరాధ్య దైవము.

## స్వతంత్ర ప్రభువులు

## రుద్ర దేవుడు (క్రీ॥శ॥ 1158 - 1195):-

స్వతంత్ర కాకతీయ ప్రభువులలో రుద్రదేవుడు ప్రథముడు. ఇతడు ముప్పమ దేవి రెండవ ప్రోలరాజు పెద్ద కుమారుడు. పట్టాభిషిక్తుడగు నాటికి యుక్త వయస్కుడు. తండ్రివలె మహాపరాక్రమ శాలి. తండ్రి కాలము నాటి యుద్ధాల్లో ఇతడు పాల్గొన్నట్లు తెలుస్తుంది. రుద్రదేవుని గూర్చి సవివరంగా తెలిపేది అతని హనుమకొండలో వేయు స్తంభాల గుడి శాసనం.

రెండవ ప్రోలుని మరణ కాలానికి తెలంగాణా ప్రాంతంలో కాకతీయుల అధికారానికి స్థిరత్వము చేకూరలేదు. రాజ్యం శత్రు పరివేష్టితమై ఉంది. హనుమకొండకు ఒక వైపు కందూరు భీమచోడుడు మరొక వైపు పొలవాస మేడరాజు అవకాశం కోసం వేచియున్నారు. పశ్చిమ చాళుక్య రాజ్యంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కళ్యాణి చాళుక్య చక్రవర్తియైన రెండవ జగదకమల్లుని తొలగించి క్రీ॥శ॥ 1150 - 51 లో తైలపుడను అతని సోదరుడు సింహాసనమాక్రమించినాడు. ఇతడ్ని మూడవ తైలపుడంటారు. జగదేకమల్లుడు పూర్వపు చాళుక్య రాజ్యంలో కొంత భాగాన్ని నిలుపుకొనగలిగాడు. ఈ విధంగా కళ్యాణి చాళుక్య రాజ్యం రెండు భాగాలుగా విభజితమయింది. తదుపరి ఆరవ విక్రమాదిత్యుని దౌహిత్రుడైన కాలచురి బిజ్జలుడు తైలపుని తరిమివేసి కళ్యాణి సింహాసనము నాక్రమించినాడు.

బిజ్జలుడు చాళుక్య రాజ్యమునంతటికిని తానే వారసుడని ప్రకటించుకొని పొలవాసాధిపతి మేడరాజు సహాయంతో రుద్రదేవుని లోబరచుకొనుటకు ప్రయత్నించినాడు. కుమారమైళిగి వచ్చినాయి. నగునూరు నుండి వచ్చిన దొమ్మరాజు వీరితో చేరినాడు. ఈ పరిణామములను గమనించిన రుద్రదేవుడు సైన్యసమేతంగా హనుమకొండ నుండి బయలుదేరి ఆకునూరు వద్ద కొంత సైన్యమును నిలిపి శేష సైన్యంతో నగునూరు దొమ్మరాజును ఎదుర్కొన్నాడు. దొమ్మరాజుకు సాయంగా మేడరాజు తన కుమారుడు జగద్దేవుని పంపినాడు. ఆకునూరు వద్దనున్న కాకతీయ సైన్యం మైళగి సేనలను నిలువరించింది. అంతట రుద్రుడు దొమ్మరాజు సైన్యాన్ని పూర్తిగా నిర్జించి పొలవాస వైపు పురోగమించినాడు. సంధి ప్రతిపాదనలు రుచించని మేడరాజు కాకతి సైన్యముల ధాటికి నిలువ లేక పారిపోయి గోదావరి కావలనున్న మహారణ్యంలో తలదాచుకున్నాడు. ఈ విధంగా నగునూరు పొలవాస రాజ్యాలతో కూడిన సబ్బినాడు కాకతీయ రాజ్యాంతర్భాగమయింది. ఈ విజయానికి ప్రధాన కారకుడైన గంగాధర మంత్రి సబ్బిమండలాధిపతిగా నియమింపబడినాడు.

తనకు సాయంగా వచ్చిన మేడరాజు, దొమ్మరాజులు పరాజితులగుటచే దిక్కుతోచని మైళిగి నిరాశతో తిరోగమించినాడు. వెనుదిరిగిన చాళుక్య సేనలను రుద్రుడు వారి రాజధాని కళ్యాణి వరకు వెన్నంటి తరిమినాడు. ఈ విజయము అనేక విధాల ప్రయోజనకరమైనది. దీని వలన పశ్చిమ వైపున ఉన్న తెలుగు ప్రాంతమంతయు కాకతీయ రాజ్యంలో చేర్చబడింది. ఆంధ్ర ప్రాంతంలో కన్నడ రాజుల ఏలుబడి తొలగింపబడింది. మొదటి తెలుగు స్వతంత్ర రాజ్య స్థాపన జరిగింది.

పైన పేర్కొనబడిన యుద్ధాలలో రుద్రుడు విజయము సాధించినప్పటికిని శత్రు నిర్మూలనా కార్యక్రమం పూర్తి కాలేదు. నేటి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలలో వ్యాపించియున్న కందూరు తెలుగు చోళరాజ్య పాలకుడు భీమచోడుడు. చాళుక్య రాజ్యంలో బిజ్జలుని దురాక్రమణ జరుగగానే భీమచోడుడు **స్వాతంత్ర్యము** ప్రకటించి కాకతీయుల అధికారమును ధిక్కరించినాడు. అంతట రుద్రుడు కందూరునాడు పై దాడి వెడలి మార్గము నందలి పంట పొలాలను గ్రామాలను దగ్ధమొనర్చుచూ పురోగమించినాడు. భయకంపితుడైన భీమచోడుడు తన రాజధాని వర్ధమాన పురమును వీడి బంధుసమేతముగా పారిపోయినాడు. ఈ దండయాత్రలో చెరకు, మిరియాల వంశ సేనానులు ప్రముఖ పాత్ర నిర్వహించినారు.

పానుగల్లు ప్రభువు ఉదయచోడుడు. ఇతడు భీమచోడుని దగ్గరి బంధువు. ఇతడు కూడా స్వతంత్రుడుగా వ్యవహరిస్తూ కాకతీయుల ఆధిపత్యాన్ని నిరసించాడు. కావున రుద్రదేవుడు పానుగల్లు పై దాడికి వెడలినాడు. పరాజయము తప్పదని గ్రహించిన ఉదయచోడుడు తన కుమార్తె పద్మావతిని రుద్రదేవునికిచ్చి వివాహము చేసి సంధి కుదుర్చుకున్నాడు. అక్కడ తన విజయ చిహ్నంగా రుద్రుడు తన పేరిట రుద్ర సముద్రమను తటాకమును త్రవ్వించినాడు. నూతనంగా నిర్మింపబడిన తన రాజధాని ఓరుగల్లులో పానుగంటి వాడయను ఒక వీధిని నిర్మించి పానుగల్లు నుండి రప్పించిన వారికి నివాస వసతి కల్పించినాడు. ఉదయచోడుని కందూరువాడలో తన సామంతునిగా నియమించినాడు.

ఈ విజయాలతో రుద్రదేవుని రాజ్యం ఉత్తరాన గోదావరి వరకు దక్షిణాన శ్రీశైలం వరకు పడమర బీదరు వరకు విస్తరించింది. తాను సాధించిన విజయపరంపరకు, స్వాతంత్ర్యానికి సూచకంగా రుద్రదేవుడు క్రీ॥శ॥ 1163 జనవరి 19, శనివారమునాడు హనుమకొండలో తన పేరిట నిర్మింపబడిన రుద్రేశ్వరాలయం స్తంభం మీద తాను, తన తండ్రి ప్రోలరాజు సాధించిన విజయాలను వివరిస్తూ ఒక శాసనమును వేయించినాడు. ఈ ఆలయాన్ని వేయి స్తంభాల గుడి అని కూడా అంటారు. ఇది త్రికూటాలయం. ఇందులో శివునితో పాటు వాసుదేవుడు సూర్యుడు ప్రతిష్టింపబడినారు. ఈ ఆలయ పూజా, నైవేద్యములకు గాను రుద్రదేవుడు మద్ది చెరువుల గ్రామాన్ని దానమిచ్చినాడు.

తూర్పు చాళుక్య ప్రభువు రాజరాజనరేంద్రుని కుమారుడు రాజేంద్రుడు. ఇతడు కులోత్తుంగ చోడుడను పేరుతో చోళ సింహాసనమునధిష్టించి వేంగీ రాజ్యము నేలుటకు తన కుమారులను రాజ ప్రతినిధులుగా నియమించినాడు. ఇతని మరణానంతరం కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుడు తీరాంధ్రమును ఆక్రమించినాడు. కాని విక్రమాదిత్యుని కుమారుడు భూలోకమల్ల సోమేశ్వరుని అసమర్ధతను అవకాశంగా తీసుకొని చాళుక్య - చోళ ప్రభువులు సామంత మాండలికుల సాయంతో క్రీ॥శ॥ 1135 నాటికి కళ్యాణి చాళుక్యుల అధికారాన్ని తుదముట్టించారు. ఈ పరిణామాల ఫలితంగా తీరాంధ్రములోని మాండలికులు కొందరు స్వతంత్రులుగా వ్యవహరించసాగారు. వీరిలో వెలనాటి చోళులు ప్రముఖులు. వీరి రాజధాని ధనదపురం (చందోలు). రుద్రదేవుని సమకాలికుడైన వెలనాటి రాజు రెండవ కుల్తోతుంగ రాజేంద్రచోళుడు గొప్ప యోధుడు. సింహాసనమునధిష్టించిన కొద్ది కాలంలోనే కోనహైహయరాజులను ఓడించి అచట తన ఆధిపత్యమును నెలకొల్పినాడు. ఈ సందర్భంగానే అచటి రాజులు రుద్రుని సాయమర్థించినారు. రాజేంద్రుని అధికారం క్రమంగా కళింగానికి కూడా వ్యాపించింది. క్రీ॥శ॥ 1180 నాటికి ఇతని రాజ్యాధికారం తూర్పు తీరం వెంట దక్షిణమున దర్శి నుండి ఉత్తరాన సింహాచలం వరకు వ్యాపించింది. ధరణి కోటనేలు కోట వంశీయులు నాదెండ్లను పాలించు కొండ పడమటి రాజులు వెలనాటి చోళుల బంధువులు. పల్నాటి సీమలో హైహయరాజులు, గోదావరి ప్రాంతంలో కొలనిమాండలికులు కోనహైహయ రాజులు స్వతంత్రులుగా తమ తమ రాజ్యములను పరిపాలిస్తున్నారు. నెల్లూరు మండలంలోని తెలుగు చోళులు చోళ చక్రవర్తి సామంతులుగా రాజ్యమేలుచున్నారు.

వెలనాటి చోళుల రాజ్య విస్తరణ విధానం తీరాంధ్రంలో కాకతీయుల జోక్యానికి దారి తీసింది. రుద్రదేవుడు ఆంధ్రదేశ తీర ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పుటకు, తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకొనుటకు నిశ్చయించినాడు. ఇందుకు పలనాటి రాజకీయ పరిస్థితులు కూడా అనుకూలించాయి. పలనాడులో నలగామరాజుకు అతని సవతి తల్లి కుమారుడు మలిదేవరాజుకు మధ్య రాజ్యాధికారము కొరకు వారసత్వ పోరు మొదలయినది. ఈ యుద్ధమును పురస్కరించుకొని మాండలిక రాజులు ఇరుపక్షములు చేరినారు. ఆ సందర్భంగానే నలగాముడు రుద్రుని సాయమర్థించినట్లు పలనాటి వీర చరిత్ర తెలుపుతుంది. అట్టి అవకాశం కొరకే వేచియున్న రుద్రుడు వెంటనే స్పందించి నలగామునికి తోడ్పడుటకు ఒక సైన్యాన్ని, తీరాంధ్రమును జయించుటకు మరొక సైన్యాన్ని పంపినాడు. ఈ సైన్యాలకు మల్యాలవారు, విప్పర్ల వారు, చెరకువారు, నతనాటి వారు, కొమరవెల్ల వారు నాయకత్వం వహించారు. వీరు కృష్ణానదికి ఇరువైపులనున్న భూమిని ఆక్రమించినారు. ఈ యుద్ధాలలో కోటరాజు దొడ్డ భీముడు కాకతీయ సైన్యంతో పోరాడుతూ మరణించినాడు. ధరణి కోట కొండ పడమటి రాజ్యాలను ఆ సైన్యం ఆక్రమించింది. వెలనాటి రాజ్యంలో కీలకమైన ప్రాంతాలు కాకతీయ రాజ్యంలో చేర్చబడినాయి. క్రీ॥శ॥ 1185 నాటి త్రిపురాంతక శాసనమును బట్టి కాకతీయ సైన్యాలు గిరి పశ్చిమ దుర్జయులను ఓడించినట్లు తెలియుచున్నది. రుద్రదేవుడు దొడ్డ భీముని కొడుకైన రెండవ కేతరాజును తన సామంతునిగా చేసుకొని ధరణి కోట ఏలికగా నియమించినాడు. ఈ సామోపాయ విధానం వలన కోట రాజులు కాకతీయులకు సామంతులు, మిత్రులు తదుపరి బంధువులు కూడా అయినారు. క్రీ॥శ॥ 1176 - 82 సంవత్సరాల మధ్య జరిగిన పల్నాటి యుద్ధంలో నలగాముడు విజయం సాధించినాడు. పలనాటి ప్రాంతంలో కూడా ఈ కాకతీయుల ఆధిపత్యం నెలకొల్పబడింది.

క్రీ॥శ॥ 1181 లో రాజేంద్రుడు మరణించుటతో వెలనాటి చోళుల ప్రాబల్యం క్షీణోన్ముఖమయింది. రాజేంద్రుని మనుమడైన పృథ్వీశ్వరుడు గుంటూరు - కృష్ణా మండలాలలో తన ఆధిపత్యమును కోల్పోయి గోదావరి మండలమునకు జరిగి పిఠాపురము ఆక్రమించినాడు. అచటి రాజు మల్లిదేవుడు కాకతిరుద్రుని సాయంతో పృథ్వీశ్వరుని ఎదుర్కొనుటకు చేసిన ప్రయత్నాలు ఫలించినట్లు కన్పించదు. క్రీ॥శ॥ 1158, క్రీ॥శ॥ 1163 సంవత్సరాలలోని కాకతీయ సేనల ద్రాక్షారామ శాసనాన్ని బట్టి కాకతీయ సైన్యం మల్ల దేవునికి సాయం వచ్చినట్లు ధృవపడుతుంది. కాని పృథ్వీశ్వరుడు సమస్త గోదావరి మండలమును ఏలినట్లు శాసనాధారము లభించుట వలన కాకతీయ సైన్యాలు తీరాంధ్రమును పూర్తిగా జయించలేదని విదితమవుతుంది.

రుద్రదేవుని కాలంలో కాకతీయ - శేవుణ (యాదవ) సంఘర్షణ ఆరంభమయింది. ఇతని జైత్ర యాత్రలలో కాకతీయ రాజ్యాధికారం ఉత్తరాన గోదావరిని తాకింది. ఈ నదికి ఉత్తరాన దేవగిరి యాదవులు (శేవుణులు) రాజ్యం విస్తరించి ఉన్నది. కనుక కాకతీయ రాజ్య వ్యాప్తి శేవుణులు ఈర్ష్యా కారణమయింది. వారి ప్రభువు జైతుగి లేక జైత్రపాలుడు (క్రీ॥శ॥ 1191 - 1210) కాకతీయ రాజ్యంపై దండెత్తి వచ్చి క్రీ॥శ॥ 1195 లో జరిగిన యుద్ధంలో రుద్రుని హతమార్చి అతని దత్తపుత్రుడు తమ్ముడు మహాదేవుని కుమారుడు అయిన గణపతి దేవుని బందీగా పట్టుకెళ్ళినాడు. ఈ సంఘటనను యాదవరామ చంద్రునిపై రాన్ తామ్ర శాసనం సూచిస్తుంది.

రుద్రదేవుడు గొప్ప యోధుడే కాక రాజనీతిజ్ఞుడు, విద్వాంసుడు, వాస్తు ప్రియుడు కూడా. రాజ్యారంభం నుండి విజయ పరంపరను కొనసాగిస్తూ సార్వభౌములైన పశ్చిమ చాళుక్యుల అధికార క్షీణతను అంతఃకలహాలను అవకాశంగా తీసుకొని బల పరాక్రమాలను, రాజనీతిని ప్రదర్శించి సామంతులను ఆర్జించి స్వతంత్ర కాకతీయ రాజ్యస్థాపన చేశాడు. విస్తరిస్తున్న అధికారమునకు అనువుగానుండునట్లు ఏకశిలా నగరమును (ఓరుగల్లు) శత్రు దుర్భేద్యముగా నిర్మించి రాజధానిని హనుమకొండ నుండి అచటకు మార్చినాడు. ఆ నగరంలోని వాడలను తీర్చిదిద్దినట్లు చక్కగా నిర్మించి ఆయావాడలకు తాను జయించిన నగరాల పేర్లు జ్ఞాపకంగా పెట్టించినాడు. రుద్రుడు గొప్ప వాస్తు ప్రియుడు. ఇతని వాస్తు కళా ప్రీతికి మత నిరతికి నేటికీ నిలిచియున్న హనుమకొండలోని వేయి స్తంభాల గుడియే సాక్ష్యం. ఇది త్రికూటాలయం. దీనిలో శివ, విష్ణు, సూర్య దేవులు ప్రతిష్ఠింపబడినారు. ఈ దేవాలయం తళతళ మెరిసే ఉక్కు వంటి నల్లరాయితో నిర్మించబడింది. రుద్రుడు విద్వాంసుడు. విద్యా ప్రియుడు. విద్యా భూషణ బిరుదాంకితుడు. ఇతడు రాజనీతి విషయకమైన 'నీతిసారము' అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించినట్లు బద్దెన నీతి శాస్త్ర యుక్తావళి ద్వారా తెలుస్తుంది.

రుద్రునికి విజయ సాధనలో తోడ్పడి అతని అభ్యున్నతికి కారకులైన విశ్వాసపాత్రులైన మంత్రి సేనానులు అనేకులు. పెక్కు ప్రజాహిత కార్యములను చేపట్టిన వాడు, హనుమకొండలో ప్రసన్న కేశవాలయమును నిర్మించిన వాడు, వ్యూహ రచనా చతురుడు అయిన వెల్లంకి గంగాధరుడు తంత్రపాలుడయిన (యుద్ధమంత్రి) మల్లా నాయకుడు వీరిలో ప్రముఖులు. ఇందు వారి వంశీయులైన పెదమల్లన, చినమల్లన అనువారు రుద్రుని ఇష్టభృత్యులు. చెరుకు, మల్యాల, రేచర్ల పిల్లల మర్రి వంశీయులు రుద్రుని సుప్రసిద్ధ సేనానులు.

## మహాదేవ రాజు (క్రీ॥శ॥ 1195/6 - 1198/9):-

రుద్ర దేవుని మరణానంతరం అతని తమ్ముడు మహాదేవుడు క్రీ॥శ॥ 1195/6 లో సింహాసనమధిష్టించినాడు. ఇతని శాసనాలు రెండు మాత్రమే లభించినాయి. వాటిలో ఒకటి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి తాలూకా సందెళ్ల గ్రామంలోనిది, రెండవది ఓరుగల్లు దుర్గములోనిది. కాని వీటిలో చారిత్రక ప్రాధాన్యం గల సమాచారం లేదు. ప్రతాపరుద్రుని ఖండవల్లి తామ్ర శాసనం, కోట గణపాంబ ఎనమదల శాసనం, సోమదేవరాజీయం, సిద్దేశ్వర చరిత్ర, ప్రతాప చరిత్రల ద్వారా ఇతని జీవితుడైన మహాదేవుని నియమించినాడని ఖండవల్లి శాసనం పేర్కొంటున్నది. మహాదేవుడు యువరాజు సంరక్షకుడిగా మాత్రమే వ్యవహరించినాడని సిద్దేశ్వర చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఇతని పాలనా కాలం రమారమి మూడు సంవత్సరాలు.

మహాదేవుని పాలనా కాలం నాటి ప్రధాన రాజకీయ సంఘటన దేవగిరి దండయాత్ర. తన అగ్రజుని మరణానికి ప్రతీకారం తీర్చుకొనుటకు గణపతిని బంధ విముక్తిని చేయుటకు ఇతడు యాదవ రాజ్యం పై దండెత్తి వెళ్లినాడు. త్రోవలోనున్న కళ్యాణి కటకమును స్వాధీనపర్చుకొని 'కటక చూరకార' అను బిరుదు ధరించినాడు. శేవుణుల (యాదవుల) రాజధాని దేవగిరిని ముట్టడించి గజమును అధిరోహించి యుద్ధము చేయుచూ జైతుగి చేతిలో హతుడైనాడు. శాసనాలు, ప్రతాప చరిత్ర, సోమదేవరాజీయము ఈ అంశాన్ని ధృవీకరిస్తున్నాయి.

మహాదేవుని భార్య బయ్యమాంబ. ఈ దంపతులకు ముగ్గురు సంతానం. కుమారుడు గణపతి దేవుడు. కుమార్తెలు మేలాంబ, కుందమాంబలు, వీరిరువురు నతవాడి బుద్ధరాజు కుమారుడు రుద్రుని పరిణయమాడినట్లు తెలియుచున్నది. కుందమాంబ భర్త రుద్రుడను వాడు బుద్ధరాజు మరియొక కుమారుడనే అభిప్రాయం కూడా ఉంది. శంభుని గుడి శాసనంలో మహా దేవుడు శివభక్తి పరాయణునిగా చెప్పబడినాడు. శైవ సిద్ధాంత ప్రవీణుడైన ధృవేశ్వర మునీంద్రుడు ఇతని దీక్షా గురువు.

## గణపతి దేవుడు (క్రీ॥శ॥ 1298/9 - 1262):-

ఆంధ్రదేశ చరిత్రలో గణపతి దేవుని పాలనా కాలం ఒక మహోజ్వల ఘట్టం. ఆంధ్ర దేశం, ఆంధ్ర దేశాధీశ్వరుడు, ఆంధ్ర నగరి అనే పద ప్రయోగాలు విస్తృత ప్రచారం పొందినదీయన కాలంలోనే. ఆంతరంగిక, బాహ్య దాడుల నుండి తన రాజ్యమును కాపాడుటయే గాక అనేక సుదీర్ఘ దండయాత్రలు నిర్వహించి యావదాంధ్రమును సమైక్యపరచి విశాల సామ్రాజ్యమును నిర్మించినాడు. వైవాహిక సంబంధాల ద్వారా క్రొత్తగా జయించిన ప్రాంతాలను సమర్థవంతముగా అదుపులోనుంచగలిగినాడు. విదేశీ వర్తకులకు సుంకాల రాయితీలు కల్పించి రాజ్య ఆర్థికాభ్యుదయానికి దోహదం చేశాడు.

గణపతి దేవుని తల్లిదండ్రులు బయ్యమాంబ మహాదేవులు. నిస్సంతువైన రుద్రుడు తమ్ముని కుమారుడైన గణపతి దత్తపుత్రునిగా స్వీకరించాడు. యాదవులతో జరిగిన పోరులో రుద్రుడు హతుడు కాగా గణపతి బందీగా చిక్కినాడు. అందుకు ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నంలో మహాదేవుడు కూడా ప్రాణాలు కోల్పోయినాడు. అంతట దేవుణ ప్రభువు జైతుగి (జైత్రపాలుడు) చెఱసాల నుండి గణపతిని విడుదల చేయగా అతడు ఓరుగల్లు సింహాసనమధిష్టించాడు. గణపతి దేవుని విడుదలకు శేవుణుల ఔదార్యమే కారణమని వారి శాసనాల కథనం. అది వాస్తవంగా కన్పించదు. నాటి రాజకీయ పరిస్థితులే అందుకు కారణం. కాకతీయులు, శేవుణులు, హోయసాలులు ముువ్వురూ పశ్చిమ చాళుక్యుల సామంతులే. సార్వభౌములు బలహీన పడగానే వారు

ముప్పురు స్వాతంత్ర్యం ప్రకటించుకొని విస్తరణకు పూనుకున్నారు. శేవుణ రాజ్యానికి దక్షిణం నుండి హోయసాల రెండవ బిల్లాలుని వలన ప్రమాదం కలిగింది. అతడు కృష్ణా, తుంగభద్ర అంతర్వేదిని ఆక్రమించి ఉత్తర దిశగా వ్యాపించు ప్రయత్నంలో ఉన్నాడు. ఆంధ్రదేశంలోని అరాచక పరిస్థితి హోయసాలులకు అనుకూలించి శేవుణులకు ప్రమాదం కలిగించేలా వుంది. ఇట్టి పరిస్థితులలో ఆంధ్ర దేశంలో తమకు స్నేహపూర్వకంగా వుండే ప్రభుత్వం ప్రయోజనకరం. అందువలన యాదవ (శేవుణ) ప్రభువు జైత్రపాలుడు రాజకీయ చర్యగా యువకుడైన గణపతిని బంధ విముక్తుణ్ణి చేసి సగౌరవంగా అతని రాజ్యం అతని పరం చేసినాడు. దీని వలన ఉభయరాజ్యాలకు మేలు కలిగింది. ఒకరి పై ఒకరు కత్తిదూయక తమతమ బలాలను ఇతరత్రా వినియోగించుకునే అవకాశం వారికి లభించింది.

మహాదేవుని మరణం, గణపతిని నిర్బంధం వలన కాకతీయ రాజ్యంలో కల్లోలిత పరిస్థితులు నెలకొన్నాయి. నాగతి వంటి సామంతుల తిరుగుబాట్లు ఒక వైపు, కులోత్తుంగ చోళుని వంటి పొరుగు రాజుల దాడులు మరో వైపు కాకతీయ రాజ్య ఉనికికే ముప్పుగా పరిణమించాయి. చోళ చక్రవర్తి మూడవ కులోత్తుంగుడు తాను తెలుగు వారిని జయించి ఓరుగల్లును పట్టుకున్నట్లు తన శాసనాలలో ప్రకటించుకున్నాడు. అపార సంపద, సైనిక శక్తి కల చోళ ప్రభువు ఓరుగల్లులో కాలూని నాడేమో గాని రేచర్ల రుద్రుని వంటి శూరుల శౌర్య ప్రతాపాల ముందు నిలువలేక వెనుదిరిగాడు.

అట్టి విపత్కర పరిస్థితుల్లో గణపతి దేవుడు క్రీ॥శ॥ 1199 లో ఓరుగల్లు సింహాసనమధిష్టించి క్రీ॥శ॥ 1262 వరకు సుదీర్ఘ పాలన సాగించినాడు. అదృష్టవశమున అతనికి శూరుడు, విశ్వాసపాత్రుడు, 'కాకతి రాజ్యస్థాపనాచార్యా' బిరుదాంకితుడు అయిన రేచర్ల రుద్ర సేనాని వంటి వారు అండగా నిలబడుట వలన గణపతి దేవుని పాలన బాలారిష్టదోషాలను అధిగమించి ప్రగతి పథం వైపు సాగింది. పొరుగు రాజుల దండయాత్రల నుండి రక్షింపబడాలంటే ఆంధ్రదేశం సమైక్యం చేయబడి పటిష్టంగా ఉండాలని గణపతి దేవుడు భావించాడు. ఆ ఆశయ సాధనకే అతడు పలు దండయాత్రలు విజయవంతంగా నిర్వహించినాడు.

గుంటూరు, కృష్ణా మండలాలలో తన ప్రాబల్యాన్ని కోల్పోయిన వెలనాటి పృథ్వీశ్వరుడు గోదావరి మండలంలోని పిఠాపురం కేంద్రంగా తన అధికారాన్ని స్థాపించినాడని ఇంతకు ముందే తెలుసుకున్నాము. అతని 'అధికారాన్ని' పిఠాపురం నుండి శ్రీకూర్మం దాకా విస్తరించింది. కాని ఇంకనూ కృష్ణానది ముఖ ద్వారమైన దివిసీమలో అయ్య వంశపు పినచోడి రాజు అతని సామంతునిగా కొనసాగుచున్నాడు. తీరాంధ్రాన్ని పూర్తిగా జయించు లక్ష్యంతో గణపతి దేవుడు క్రీ॥శ॥ 1201 - 12 లో మల్యాల చౌండ సేనాని నాయకత్వంలో దండు పంపినాడు. ఈ దండయాత్రలో కోట, నతవాటి, మల్యాల కుటుంబాల వారు కూడా పాల్గొన్నారు. కాకతీయ సేనాని పిన చోడుని ఓడించి దివిసీమను ఆక్రమించి పృథ్వీశ్వరుడు అచట నిక్షిప్తము చేసిన అమూల్య సంపదను ఏకశిలా నగర కోశాగారానికి తరలించినాడు. పరాజితుడైన పిన చోడుడు తన కుమార్తెయగు పేరమాంబను గణపతి దేవునికిచ్చి వివాహము జరిపించి సంధి చేసుకున్నాడు.

వారి సోదరుడగు జాయపను చేరదీసి గణపతి దేవుడు తన సైన్యంలో గజసాహిణిగా నియమించినాడు. గణపతి దేవుడు దివి సాధనలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన చౌండసేనానికి 'దివిచూఱకార', 'ద్వీపీలుంటాక' అను బిరుదులు ప్రధానం చేసి సత్కరించాడు. అంతలో పృథ్వీశ్వరుడు సైన్యమును సమకూర్చుకొని కాకతీయ సేనతో యుద్ధానికి తలపడినాడు. ఈ యుద్ధంలో గణపతి దేవునికి సాయంగా నెల్లూరు మండలమునేలు తెలుగు చోడరాజగు తిక్కభూపాలుడు మరికొందరు పాల్గొన్నారు. క్రీ॥శ॥ 1206 - 18 మధ్య జరిగిన యుద్ధంలో పృథ్వీశ్వరుడు వధింపబడినాడు. దీనితో వెలనాడంతయు కాకతీయుల ఆధీనమయింది. ఈ విజయ ప్రశంస క్రీ॥శ॥ 1209 నాటి మేలాంబిక త్రిపురాంతక శాసనంలో కన్పిస్తుంది. తిక్కభూపాలుడు పృథ్వీశ్వరుని శిరస్సుతో కందుక క్రీడ ఆడినట్లు కవి తిక్కన తన నిర్వచనోత్తర రామాయణంలో వర్ణించినాడు. గణపతి దేవుడు కూడా 'పృథ్వీశ్వర శిరః కందుక క్రీడా వినోదుడు' గా వర్ణింపబడినాడు. గణపతి దేవుడు జాయపను వెలనాటి ప్రాంతానికి మహా మండలేశ్వరునిగా నియమించినాడు. కాకతీయుల సామంతుడైన కోట చేత రాజునకు గణపతి దేవుడు తన కుమార్తె గణపాంబనిచ్చి వివాహము జరిపించెను. గణపతి దేవుని వివాహ సంబంధాలు తీరాంధ్ర దేశంలో కాకతీయుల రాజకీయాధికారాన్ని పటిష్టం చేశాయి.

వెలనాటి ఆక్రమణ తరువాత గణపతి దేవుడు తన దృష్టిని నెల్లూరు వైపు మరల్చినాడు. తీరాంధ్ర యుద్ధాల్లో తనకు తోడ్పడిన తిక్కరాజుకు ప్రత్యుపకారం చేయుటకు పూనుకొన్నాడు. పాకనాడు ప్రాంతపు తెలుగు చోడులకు నెల్లూరు రాజధాని. అప్పుడప్పుడు కాంచీ నగరం కూడా వీరి రాజధానిగా ఉండేది. నెల్లూరు చోళులు చోళ చక్రవర్తుల సామంతులు. చోళ చక్రవర్తుల ప్రాబల్యం బలహీనపడగానే వీరు స్వతంత్రులైనారు. మనుమసిద్ధి రాజు, నల్ల సిద్ధి రాజు సోదరులు. నల్లసిద్ధిరాజు చోళుల సహాయంతో రాజ్యాధికారం పొందినాడు. పిమ్మట అతని తమ్ముడు తమ్ముసిద్ధి అతనిని పారద్రోలి అధికారమును హస్తగతము చేసుకున్నాడు. అంతట మనుమసిద్ధి రాజు కుమారుడు తిక్క భూపాలుడు గణపతి దేవునికి వెలనాటి పృథ్వీశ్వరునితో జరిగిన యుద్ధంలో తన వంతు సాయము చేసి ప్రత్యుపకారముగా తన రాజ్యమిప్పించమని వేడుకున్నాడు. అందుకు సమ్మతించిన గణపతి దేవుడు సైన్య సమేతుడై వచ్చి తమ్ముసిద్ధిని ఓడించి నెల్లూరు సింహాసనం మీద తిక్క భూపాలుని ప్రతిష్ఠించాడు. ఈ సందర్భంగా తమ్ముసిద్ధికి సాయంగా వచ్చిన చోళ, కర్ణాట, యాదవ లాట సైన్యాలను కూడా కాకతీయ సైన్యాలు ఓడించి తరిమివేశాయి. అందుకు ప్రతిఫలంగా తిక్కరాజు తన రాజ్యంలోని పశ్చిమ భాగమైన కడప మండలాన్ని కాకతీయుల ఆధీనం చేశాడు. గణపతి దేవుడు ఆ ప్రాంతంలో తన సామంతునిగా కాయస్థసేనాని గంగయ దేవుని నియమించినాడు.

పృథ్వీశ్వరుడు యుద్ధంలో హతుడైన తర్వాత అతని సామంతులైన కొలని, కోన చాళుక్యరాజులు స్వతంత్రులై కాకతీయాధికారాన్ని ధిక్కరించినారు. అందువలన గణపతి దేవుడు నెల్లూరు దండయాత్ర ముగిసిన పిమ్మట వేంగీ మండలాన్ని పూర్తిగా వశపర్చుకొనుటకు కళింగమును జయించుటకు పూనుకొన్నాడు. జాయపసేనాని, రేచర్లరుద్రుని అనుచరుడైన రాజనాయకుడు ఈ దండయాత్రకు నాయకత్వము వహించినారు. ఇందులూరి సోమయ మంత్రి కూడ ఈ దండయాత్రలో పాల్గొన్నాడు. కొలని, కోన మండలాలను కాకతీయ సైన్యం ఆక్రమించింది. సోమయ మంత్రి కోన మండలాధిపతిగా నియమింపబడినాడు. ఈ సందర్భముగా గణపతి దేవుడు చాళుక్య ఇందుశేఖరునితో సంధి చేసుకుని అతని కుమారుడు వీరభద్రునికి తన కుమార్తె రుద్రమదేవినిచ్చి వివాహం చేసినాడు. నిడదవోలు చాళుక్య రాజ్యం కాకతీయ సామంత రాజ్యమయింది. గణపతి దేవుడు కళింగను కూడా జయించినట్లు శాసనాలు చెపుతున్నాయి. కాకతీయ సైన్యాలు బస్తర్, చక్రకూటాల వరకు పురోగమించినాయి. కాని తూర్పు గాంగ రాజులైన అనంగ భీముడు అతని కుమారుడు నరసింహుడు విజృంభించి తాము కోల్పోయిన రాజ్య భాగాలను తిరిగి గెల్చుకున్నారు. ప్రోలునాడు (నేటి తూర్పు గోదావరి జిల్లా) మాత్రం కాకతీయ రాజ్యంలో చేరినట్లు తెలుస్తుంది.

నెల్లూరు చోళ ప్రభువు తిక్కభూపాలుడు క్రీ॥శ॥ 1248 లో మృతి చెందినాడు. అతని కుమారుడు రెండవ మనుమసిద్ధి సింహాసనమునకు వచ్చినాడు. కాని అతని దాయాదులు రాజ్యాధికారానికై పోటీ పడ్డారు. విజయగండ గోపాలుడు కంచి రాజధానిగా చెంగల్పట్టు ప్రాంతము నాక్రమించినాడు. ఇతనికి చోళ చక్రవర్తి ముమ్మడి రాజేంద్రుడు హోయసాల సోమేశ్వరుడు బాసటగా నిలిచినారు. మనుమసిద్ధి దాయాదులు తిక్కన బయ్యనలు అతనిని నెల్లూరు నుండి తరిమివేసిరి. వైదుం బాన్వయుడైన రక్కసగంగడు కడప మండలము నాక్రమించి కాయస్థ గంగయ సాహిణిని పారద్రోలినాడు. దక్షిణాన కాకతీయుల ప్రాబల్యం అంతరించింది. దిక్కుతోచని స్థితిలో మనుమసిద్ధి తన ఆస్థానకవి తిక్కనను గణపతి దేవుని సాయమభ్యర్థిస్తూ ఓరుగల్లుకు పంపినాడు.

సామంత భోజుని నాయకత్వంలో బయలుదేరిన కాకతీయ సైన్యం నెల్లూరు పై దాడిచేసి తిక్కన బయ్యనలను సంహరించి మనుమసిద్ధిని సింహాసనాధీశునిగా చేసింది. పరియూరు సమీపమున జరిగిన మరొక యుద్ధంలో విజయగండ గోపాలునికి సహాయంగా వచ్చిన ద్రావిడ, కర్ణాట సైన్యాలను సామంత భోజుడు చిత్తుగా ఓడించి కంచిని ఆక్రమించినాడు. ఈ విజయాలను నాయని పల్లి శాసనం వివరిస్తుంది. తదుపరి కాకతీయ సైన్యం కడప మండలం పై (మార్జవాడి) దాడి వెడలి రక్కసగంగని నిర్జించి కాయస్థ గంగయ సాహిణి అధికారాన్ని పునరుద్ధరించింది. వల్లూరు కేంద్రంగా కాకతీయ సామంతునిగా గంగయ సాహిణి త్రిపురాంతకం నుండి కోలారు వరకు గల రాజ్యానికి అధిపతి అయినాడు.

గణపతి దేవుడు తన పాలనాంతమున పాండ్యుల దండయాత్రల నెదుర్కొనవలసి వచ్చెను. నెల్లూరు రాజ్య వ్యవహారాలలో కాకతీయుల జోక్యం పాండ్య - కాకతీయ సంఘర్షణకు దారి తీసింది. ద్రావిడ దేశంలో చాళుక్య - చోళుల ప్రాబల్యం అంతరించగా

పాండ్యులు వారి రాజ్యాన్ని ఆక్రమించినారు. క్రీ॥శ॥ 1257 నాటికి దక్షిణ దేశమంతటా తన సార్వభౌమాధికారం నెలకొల్పి అంతకు పూర్వం చోళులకు సామంతులుగా వున్న నెల్లూరు చోళులను తమ సామంతులుగా చేసుకొనుటకు జటావర్మ సుందర పాండ్యుడు ప్రయత్నించినాడు. సామంత భోజుని తరిమివేసి కంచిని ఆక్రమించుకొన్న విజయగండ గోపాలుడు పాండ్యుల సామంతునిగా ప్రకటించుకొన్నాడు. కాని మనుమసిద్ధి అందులకంగీకరించక పాండ్యుల నెదిరించుటకు కాకతీయుల, యాదవుల, బాణుల సహాయం అర్థించాడు. కాకతీయుల నెదుర్కొనుటకు కొప్పెరుంజింగడు అను సేనాని నాయకత్వంలో ఒక పాండ్య సైన్యం బయలుదేరగా ఆ సైన్యమును గణపతి దేవుడు ఓడించి ఆ సేనానిని తమ సామంతునిగా చేసుకున్నాడు. మరొక పాండ్య సైన్యం పాండ్య రాజు జటావర్మ సుందర పాండ్యుని నాయకత్వంలో నెల్లూరు వైపు పురోగమించింది. కాకతీయ మనుమసిద్ధి సైన్యాలకు పాండ్య సైన్యానికి నెల్లూరుకు తూర్పున నున్న ముత్తుకూరు వద్ద జరిగిన ఘోర యుద్ధంలో మనుమసిద్ధి మరణించగా పరాజయం పాలైన కాకతీయ సైన్యం వెనుదిరిగింది. జటావర్మ సుందర పాండ్యుడు కంచిలోను నెల్లూరులోను వీరాభిషేకం జరిపించుకున్నాడు. నెల్లూరు రాజ్యం పాండ్య రాజ్యాంతర్భాగమయింది. గణపతిదేవుని కాలంలో జరిగిన చివరి యుద్ధమిదియే. అవసానదశలో అతనికెదురైన ఘోర పరాజయము కూడా ఇదే.

క్రీ॥శ॥ 1199 నుండి 1262 వరకు 63 సంవత్సరాల పాటు నిర్వక్ర పరాక్రమంతో రాజ్యమేలిన గణపతి దేవుడు పరిపాలనా బాధ్యతలు తన రెండవ కుమార్తె రుద్రమదేవికి అప్పగించి విశ్రాంతి జీవనం గడిపినాడు. క్రీ॥శ॥ 1269 వరకు ఆయన జీవించి ఉన్నట్లు శాసనాలు సూచిస్తున్నాయి.

కాకతీయులలో గణపతి దేవుడు అగ్రగణ్యుడు, మహావీరుడు, సామ్రాజ్య నిర్మాత. ఇతని విజయ పరంపరతో యావన్మంది ఆంధ్రులు సమైక్యమైనారు. శాతవాహనుల తరువాత ఆంధ్ర ప్రాంతములన్ని ఏకపాలన క్రిందికి వచ్చినదీయన కాలంలోనే. సామ, దాన, భేద, దండోపాయములను అత్యంత నైపుణ్యంతో ప్రయోగించగల రాజనీతిజ్ఞుడు. ఇతని వైవాహిక సంబంధాలు మన దేశములోని గుప్తుల, ఇంగ్లాండు దేశ ట్యూడర్ల, స్పెయిన్ దేశ హాప్స్‌బర్గ్‌ల వైవాహిక సంబంధాలను తలపిస్తాయి. పరాజితుడైన పినచోడి రాజ కుమార్తెలను తాను వివాహమాడుట సామంతుడగు కోట చేతరాజునకు తన కుమార్తె గణపాంబను, నిడదవోలు రాకుమారుడు వీరభద్రునకు మరొక కుమార్తె రుద్రాంబను ఇచ్చి వివాహము జరిపించుట ఇందుకు తార్కాణాలు. ఇతడు రాజ్య నిర్మాణంతో పాటు రుద్రుడు ప్రారంభించిన ఓరుగల్లు దుర్గ నిర్మాణము పూర్తి చేసి శత్రు దుర్భేద్య మొనర్చినాడు. ఓరుగల్లును ఆంధ్ర నగరిగా తీర్చిదిద్దినాడు. రాజ్య నిర్మాణంతో పాటు సమర్థవంతమైన పాలనా విధానమును రూపొందించి, వ్యవసాయాన్ని, వర్తక వాణిజ్యాలను ప్రోత్సహించి, సదుపాయాలను కల్పించి రాజ్య ఆర్థికాభ్యుదయానికి దోహదం చేశాడు. ఆంధ్ర సాహితీ సంస్కృతులను ఆదరించినాడు. గణపతి దేవుడు పరమమహేశ్వరుడు. గోళకీ మఠాధిపతియైన విశ్వేశ్వర శివ దేవుడు ఇతని దీక్షా గురువు.

గణపతి దేవునికి పుత్ర సంతతి లేదు. ఈయనకు సోమలదేవియను భార్య ద్వారా గణపాంబ, రుద్రాంబ అను ఇరువురు పుత్రికలు జన్మించారు. గణపతి దేవుని సేనానులలో 'కాకతి రాజ్య స్థాపనాచార్య' బిరుదు వహించిన రేచర్ల రుద్రుడు, విరియాల రుద్ర సేనాని, మల్యాల చౌండ సేనాపతి, గజసాహిణి జాయప, కాయస్థ గంగయ సాహిణి, ఇందులూరి సోమయ ముఖ్యులు.

## రుద్రమ దేవి (క్రీ॥శ॥ 1262 - 1289):-

రుద్రమ దేవి గణపతి దేవి సోమిదేవుల రెండవ కుమార్తె. పురుష సంతతి లేని గణపతి దేవుడు రుద్రాంబకు సైనిక వ్యవహారాలలోను, రాజ్య పాలనలోను తగు శిక్షణ ఇప్పించి తన వారసురాలిగా ప్రకటించినాడు. రాజ్య పాలనలోను, రాజ్య రక్షణలోను ప్రధాన భూమికను నిర్వహించిన ప్రథమాంధ్ర మహిళ రుద్రమ దేవి. స్త్రీలు రాజ్యాధికారిణులగుట అరుదైన ఆ కాలంలో ఈమె తన తండ్రి తీసుకున్న సాహసోపేత నిర్ణయం సరియైనదేనని నిరూపించింది. ఈ కాలంలోనే ఢిల్లీ సుల్తాన్ ఇల్ టుట్‌మిష్ ఇంకొక అడుగు ముందుకు వేసి కుమారులను త్రోసిరాజని సమర్థవంతురాలైన కుమార్తె రజియాబేగంకు (క్రీ॥శ॥ 1236 - 40) రాజ్యపాలనా బాధ్యతలు అప్పగించినాడు. కాని నాటి పురుషాహంకారము ఆమె పాలనను ఎక్కువ కాలం కొనసాగనీయలేదు. రుద్రమ దేవి

మాత్రం మూడు దశాబ్దాల పాటు విజయవంతంగా రాజ్యమేలింది. ఈమెను గూర్చి ఆంధ్రదేశ సుప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, నేలటూరు వెంకట రమణయ్య గారు ఆమెను ఈ విధంగా ప్రశంసిస్తూ వ్రాశారు. "ఆంధ్రదేశ పరిపాలకులలో రుద్రమ దేవి నిస్సందేహంగా మహా ఘనత వహించిన వ్యక్తి. ఆమె స్త్రీ అయినప్పటికి స్త్రీలకుండే ఇబ్బందుల్ని తనకు సంక్రమించిన మహోన్నత స్థానమునకు సంబంధించిన విధులను నిర్వర్తించడంలో ఏ మాత్రము అడ్డు రానీయలేదు. రాజధర్మ విధులను ఆమె నిర్వహించిన తీరు తండ్రి ఆమెకు ప్రసాదించిన పురుష నామము రుద్ర దేవుడు అన్ని విధాల సార్థకమైనది. దేశపాలనలో ఆమె చైతన్యవంతమైన పాత్ర నిర్వహించినది. అవసర సందర్భాలలో ఖడ్గధారిణియై రణ రంగమున వీర విహారము చేయుటకామె వెనుదీయలేదు. ఆమె ధైర్య సాహసాలు, పరాక్రమము కల యోధురాలే కాక గొప్ప వ్యూహ తంత్రజ్ఞురాలు. ఆమె రాజరికం చేసిన కాలంలో తరచు యుద్ధముల అలజడి కలిగినా ఆమె ప్రజలు సంతుష్టులయి సుఖించారు."

రుద్రాంబ పాలన సమస్యలతో, కష్టాలతో, యుద్ధాలతో ఆరంభమయి తుదకు ఆమె జీవితం యుద్ధంతోనే కడతేరిపోయింది. గణపతి దేవుడామెకు క్రీ॥శ॥ 1259 లో రుద్రదేవ మహారాజు పేరుతో యువరాజుగా పట్టాభిషేకం జరిపించినాడు. ముట్టుకూరు వద్ద పాండ్యులతో జరిగిన యుద్ధంలో (క్రీ॥శ॥ 1263) కాకతీయ సైన్యానికి ఘోర పరాజయం ఎదురైనప్పటి నుండి పూర్తి అధికారాలు ఆమెకు అప్పగించినాడు. శాసన సాక్ష్యాన్ని బట్టి గణపతి దేవుడు క్రీ॥శ॥ 1269 వరకు జీవించినట్లు తెలియుచున్నది. అందువలన క్రీ॥శ॥ 1259 లో పరిపాలనాధికారాలు చేపట్టిన రుద్రాంబ క్రీ॥శ॥ 1269 లో తండ్రి మరణించిన తరువాతనే పట్టాభిషేకం జరిపించుకున్నది.

ఓరుగల్లు పాలకురాలుగా రుద్రమ అనేక సమస్యలనెదుర్కొనవలసి వచ్చెను. అవి: ముట్టుకూరు యుద్ధానంతరం కాకతీయ సైన్యం పేరు, ప్రతిష్టలు దెబ్బతిన్నాయి. రుద్రమ సవతి కుమారులైన హరిహర మురారి దేవులు ఆమె పై తిరుగుబాటు చేసినట్లు ప్రతాపచరిత్ర పేర్కొంటున్నది. స్త్రీ పరిపాలనాధికారాన్ని సహించలేని సామంతులు కొందరు ఆమె పై తిరుగుబాటు చేసినారు. దీనినవకాశముగా తీసుకొని యాదవ (శేవుణ) మహాదేవరాజు వంటి పొరుగు రాజులు కొందరు కాకతీయ రాజ్యం మీద దాడులు సాగించినారు. అందువలన రుద్రమ దేవి పాలనాకాలమంతా యుద్ధాలతోనే గడిచి పోయింది.

విశ్వాస పాత్రులైన రేచర్ల ప్రసాదిత్యుడు కాయస్థ జన్నిగ దేవుడు అతని సోదరులు గోనగన్నా రెడ్డి వంటి సేనానుల సాయంతో రుద్రమ అంతః శత్రువులను అణచి వేసింది. దాయాదులైన హరిహర మురారి దేవుల ప్రస్తావన ప్రతాపచరిత్రలో తప్ప మరే ఇతర సాక్ష్యాధారములో లేదు. కాని రుద్రాంబ తొలి పాలనా కాలంలో అలజడులు చెలరేగినట్లు తెలుస్తుంది. రేచర్ల ప్రసాదిత్యుని కాకతి రాజ్యస్థాపనా చార్య 'రాయ పితా మహాంక' అంబయ దేవాదుల రాయ స్థాపనా చార్య అనే బిరుదులు తిరుగుబాటులను అణచుటలోను రుద్రమ అధికారాన్ని సువ్యవస్థితం చేయుటలోను కాకతీయ సేనానులు నిర్వహించిన పాత్ర విదితమగుచున్నది.

తీరాంధ్రంలో కాకతీయుల ప్రాబల్యం క్షీణించింది. కొలని సోమయ మంత్రిని నియమించుట నిరవద్యపుర వీరభద్రునితో రుద్రమ వివాహము జరిపించుట మున్నగు చర్యలు గణపతి దేవుడు తీసుకొన్నను కాకతీయుల ఆధిపత్యము అచట స్థిరపడలేదు. రుద్రమ అధికారము చేపట్టినది మొదలు అచట సామంతులనేకులు స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆమె ఆంతరంగిక శత్రువులను అణచుటలో నిమగ్నమై యుండుటను అవకాశంగా తీసుకొని తూర్పు గంగరాజు నరసింహ దేవుడు వేంగీ ప్రాంతమునాక్రమించినట్లు క్రీ॥శ॥ 1262 నాటి అతని ద్రాక్షారామ శాసనం సూచిస్తుంది. మరల క్రీ॥శ॥ 1274 లో నరసింగ దేవుని తనయుడు భాను దేవుడు వడ్డాది మత్స్య రాజగు అర్జున దేవుడు కలిసి వేంగీ పై దండెత్తి వచ్చినారు. వారి దురాక్రమణ నరికట్టుటకు పోతి నాయకుడు ప్రోలి నాయకుడు అను సోదరుల నాయకత్వమున రుద్రమ దేవి సైన్యమును పంపగా వారు గోదావరి తీరాన గంగ మత్స్య సేనలను ఓడించి తరిమివేసి తిరిగి వేంగీలో కాకతీయాధికారాన్ని నెలకొల్పినారు. అందువలననే ప్రోలి పోతినాయక సోదరులు తమ శాసనాలలో 'గజపతి మత్త మాతంగ సింహ', 'ఒడ్డె రాయ మానమర్దన' అని వర్ణించుకున్నారు.

గణపతి దేవుని కాలంలో కాకతీయ - యాదవ సంబంధాలు స్నేహ పూర్వకంగా ఉండేవి. కాని ముతుకూరు యుద్ధం తరువాత గణపతి దేవుడు రాజకీయాల నుండి పూర్తిగా వైదొలగుటచే ఈ సంబంధాలలో మార్పు వచ్చింది. అదియును గాక స్త్రీ

పరిపాలకురాలగుట వలన వారిలో ఆశలు చిగిర్చాయి. అందువలన శేవుణ (యాదవ) మహాదేవుడు కాకతీయ రాజ్యం పై దండెత్తి వచ్చి ఓరుగల్లును ముట్టడించినాడు. ఈ దండయాత్రా ఫలితాలను గురించి పరస్పర విరుద్ధాభిప్రాయాలు వ్యక్తమైనాయి. మహాదేవుడు కాకతీయ సైన్యమును ఓడించి యుద్ధ గజాలను పంచ మహా శబ్దాలను సంగ్రహించి స్త్రీ యను కారణాన రుద్రమ దేవిని వధింపక విడిచిపెట్టెనని యాదవ శాసనాలు ఘోషిస్తున్నాయి. రుద్రమ దేవి యాదవ సైన్యమును ఓడించి తరిమి వేసినట్లు ప్రతాపచరిత్ర చెబుతున్నది. ఓరుగల్లు పై యాదవ మహాదేవుడు భారీ ఎత్తున దాడి జరిపినాడు. కానీ కోట స్వాధీనము కాలేదు. పైగా కోటలోనికి చొరబడిన అనేక మంది యాదవ సైనికులు రెండు వైపుల ముట్టడికి గురియై బందీలైనారు. మహాదేవుడంతట ముట్టడి ఆపి వెనుదిరిగాడు. రుద్రమదేవి అశ్వమునధిరోహించి పారిపోవు యాదవ సైన్యమును తరుముచు బీదరు కోటను స్వాధీనపర్చుకున్నది. ఓరుగల్లు కోటలో బందీలైన దేవగిరి సైన్యమును విడిపించుకొనుటకు మార్గాంతము లేని మహాదేవుడు రుద్రాంబతో సంధి కుదుర్చుకొని యుద్ధ నష్ట పరిహారము చెల్లించినాడు. తెలంగాణమున అనేక చోట్లను, కృష్ణాజిల్లా కైకలూరు తాలూకాలోని రాచపట్నంలోను వరాహ లాంఛన ముద్రగల యాదవ రాజుల బంగారు నాణేలు లభించినాయి. వీటిని బట్టి ప్రతాపచరిత్ర కథనం వాస్తమని నిరూపితమగుచున్నది. దీనికి మరియొక నిదర్శనము కూడా కలదు. బీదరు కోటలో భైరవుడను రుద్రమ దేవి సామంతు మహా మండలేశ్వరుని శాసనం కూడా దీనిని ధృవపరుచుచున్నది. ఈ ఘన విజయమును పురస్కరించుకొని ఆమె తన తండ్రికి గల 'రాయగజకేసరి' బిరుదును స్వీకరించింది. ఈ సంఘటన తరువాత పలువురు యాదవ రాకుమారులు కాకతీయ సామంత పదవుల్లో చేరినారు.

దక్షిణ దేశ పరిస్థితి మిక్కిలి నిరాశాజనకంగా తయారయింది. ముత్తుకూరు యుద్ధం తరువాత కంచి, నెల్లూరు, కడప మండలాలలో పాండ్యుల ప్రాబల్యం విస్తరించింది. నెల్లూరు రాజ్యమునకు పాండ్య సామంతులు పాలకులైనారు. కడప మండలాన్ని పాండ్యుల సహకారంతో వైదుంబాన్వయులు ఏలుచున్నారు. గణపతి దేవుడచట నిలిపిన కాయస్థ గంగయ సాహిణి మేనల్లుడగు జన్నిగ దేవుని అధికారము నామమాత్రమైనది. నందలూరు, తిరుపతి క్షేత్రాలలోని పాండ్య శాసనాలను బట్టి వల్లూరు కాయస్థరాజ్యం కూడ పాండ్యుల వశమయినట్లు తెలియుచున్నది. ఈ విధంగా రుద్రమ దేవి రాజ్యమునకు వచ్చు నాటికి ఈ దక్షిణ భాగములు దాదాపు చేజారిపోవునట్లే కన్పించినవి. కానీ రుద్రమ దేవి అతి త్వరలోనే అచట తన సామంతులను నిలబెట్టగలిగింది. నెల్లూరులో కాకతీయ సేనాని మహామండలేశ్వరుడు అయిన నాగదేవ మహారాజు పాండ్య సామంతుడగు రాజేంద్ర చోళుని దక్షిణమునకు తరిమి అధికారము చేపట్టినాడు. కాని అక్కడ కాకతీయుల అధికారం ఎక్కువ కాలం కొనసాగలేదు. పాండ్య సామంతులైన తెలుగు చోళులు తిరిగి నెల్లూరును వశపర్చుకొన్నారు.

కడప మండలంలో జన్నిగ (జనార్ధన) దేవుడు క్రీ॥శ॥ 1268 నాటికి పాండ్యులను వారి అనుయాయులగు కలుకడ వైదుంబరాజులను (భుజబల వీరనారాయణుడు) తొలగించి తన ఆధిపత్యమును పునః ప్రతిష్ఠించినాడు. జన్నిగ దేవుడు అతని తరువాత అతని తమ్ముడు మురారి దేవుడు (క్రీ॥శ॥ 1270 - 72) కాకతీయ సామంతులుగానే పాలించినారు. పిమ్మట ఇతని తమ్ముడగు అంబదేవుడు క్రీ॥శ॥ 1272 లో సింహాసనమునకు వచ్చినాడు. కాయస్థ సామంతులందరిలోను ఇతడు కడు పరాక్రమశాలి. ఇతడు కూడ ఆదిలో కాకతీయ విధేయ సామంతుడే. కాని రుద్రమ ఎదుర్కొనిన క్లిష్టపరిస్థితులను గమనించి ఆమె అధికారమును ధిక్కరించి స్వతంత్ర కాయస్థ రాజ్య స్థాపనకు పూనుకున్నాడు. యాదవ, పాండ్యరాజుల సహాయముతో అతడు స్వతంత్రించినట్లు కన్పిస్తుంది. క్రీ॥శ॥ 1290 లో త్రిపురాంతకమున ఇతడు నిల్పిన సుదీర్ఘమైన శిలా శాసనం ఇతని విజయ పరంపరను గొప్పగా ప్రశంసించింది. అందాతడు రుద్రమదేవిని స్మరింపకుండుటయు తానోడించిన పలువురు శత్రువులు కాకతీయ సామంతుల వర్గములోని వారగుటను బట్టియు అతడు రుద్రమదేవి పై బాహాటంగానే విప్లవము లేవదీసెనని స్పష్టమగుచున్నది. అంబయ గురిందాల (గురిజాల) ప్రభువైన రాయసహస్ర మల్ల శ్రీపతి గణపతిని వైదుంబులను వారి మిత్రుడైన గుత్తి పురాధీశుని ఓడించినాడు. ఏరువ మనుమల్లి దేవుని వధించి ఏరువనాడును ఆక్రమించినాడు. పెండెకల్లు అతని వశమయింది. కాకతీయ సామంతుడైన కొప్పెరు జింగని వధించి 'కొడవరాయ విధ్వంసక' అను బిరుదు ధరించి దక్షిణాంధ్రలో కాకతీయుల పాలన అంతం చేశాడు. కాకతీయ నాయంకరుల నోడించి త్రిపురాంతకం వరకు కాయస్థ రాజ్యం విస్తరింపజేసినట్లు పైన పేర్కొనబడిన అతని శాసనం ద్వారా తెలుస్తుంది.

ఈ విజయాలతో కాయస్థ రాజ్యం గండికోట, ములికినాడు, రేనాడు, సలికినాడు, ఏరువ, పొత్తపినాడుల ప్రాంతాలకు విస్తరించింది. ఈ రాజ్యానికి కేంద్రం వల్లూరు. అంబయ దేవుడు నెల్లూరులో మనుమగండ గోపాలుని సింహాసనం ఎక్కించి అతనిని తన సామంతునిగా చేసుకున్నాడు. కర్నూలు మండలంలో తన ప్రాబల్యం నెలకొల్పుటకై చెరకు బొల్లయ రెడ్డితో బాంధవ్యం చేసి అతని కుమారునికి తన కుమార్తెనిచ్చి వివాహం జరిపించినాడు. దక్షిణ ఆంధ్ర దేశంలో తమ అధికార పునరుద్ధరణకు ప్రయత్నించిన పాండ్యులను ఓడించి తరిమివేసినాడు. దీనితో పాండ్యుల అధికారం ఆంధ్ర దేశంలో అంతరించింది.

అంబయ దేవుని కాకతిరాజ్య వ్యతిరేక కార్యకలాపాలు, సార్వభౌమాధికార ధిక్కరణ, స్వతంత్రాధికార స్థాపనలను రుద్రాంబ సహింప లేకపోయింది. విశ్వాసపాత్రులైన సామంతుల సేనానుల సాయంతో ఆమె అంబయ దేవుని తిరుగుబాటునణచి క్రీ॥శ॥ 1295 వరకు జీవించిందనే అభిప్రాయం ఇది వరలో ఉండేది. కాని కాకతీయ చరిత్ర మీద విశేష పరిశ్రమ చేసిన పి.వి. పరబ్రహ్మ శాస్త్రి గారు నల్గొండ జిల్లాలోని చందుపట్ల గ్రామంలో ఇటీవల లభ్యమయిన శాసనాధారంగా రుద్రమ అంబయ దేవునితో పోరాడుతూ సేనాని మల్లికార్జున నాయకునితో సహా క్రీ॥శ॥ 1289 లో నవంబరు 12 - 13 తేదీలలో మృతి చెందియుండునని నిర్ధారించినారు.

అంబయ దేవుని తిరుగుబాటు నణచుటలో కాకతీయ సామంతుల సేనానులు విఫలురైనారు. తుదకు రుద్రమ దేవియే స్వయంగా సైన్యానికి నాయకత్వం వహించి మల్లికార్జున నాయకుడను సేనాని వెంటరాగా వల్లూరు రాజ్యం పై దండయాత్ర సాగించి అంబయ దేవుని ఎదుర్కొని పోరాడి చందుపట్ల సమీపంలో జరిగిన యుద్ధంలో సేనానితో సహా వీర మరణం పొంది వుంటుంది. అంబయ వారిని వధించినట్లు చెప్పుకున్నాడు. చందుపట్ల శాసనం రుద్రమ మల్లికార్జున నాయకుల పుణ్యలోక ప్రాప్తి కొరకు చేసిన ధర్మాన్ని నమోదు చేస్తుంది. అందువలన వారు అంబయ దేవునితో జరిగిన యుద్ధంలోనే మరణించి వుంటారని భావించుటలో పొరపాటు లేదు.

ప్రసిద్ధ కాకతీయ ప్రభువులలో రుద్రాంబ ఒకరు. పాలనా కాలమంతా నిరంతర యుద్ధాల్లో నిమగ్నురాలయినప్పటికి అత్యంత సమర్ధవంతంగా ఆమె పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించింది. విపత్కర పరిస్థితుల్లో మొక్కవోని ధైర్య, సాహసాలు ప్రదర్శించిన వీరనారి ఆమె. అవసరమైనపుడు ప్రాణాలొడ్డి పోరాడటానికి కూడా ఆమె వెనుదీయలేదు. రాజ్య రక్షణ చర్యల్లో భాగంగా ఓరుగల్లు కోటకు మరమ్మత్తులు చేయించి రాతి కోటకు లోనైపున మెట్లు కట్టించింది. మట్టికోట, అగడ్త, బురుజుల వంటి అదనపు నిర్మాణాలతో ఓరుగల్లు కోటను శత్రు దుర్భేద్యంగా రూపొందించింది. ఈమె కాలంలో దేశం సుభిక్షంగా వుంది. సుప్రసిద్ధ వెనిస్ యాత్రికుడైన మార్కొపోలో ఈమె పాలనాకాలం చివర్లో మోటుపల్లి రేవును సందర్శించి దేశంలో పరిపాలన కట్టుదిట్టంగా ఉందని పరిశ్రమలు, వాణిజ్యం ప్రగతి పథంలో ఉన్నాయని వర్ణించినాడు.

గణపతి దేవుని వలె రుద్రమ దేవికి కూడా పురుష సంతతి లేదు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు. వారు ముమ్మడమ్మ, రుద్రమ, రుయ్యమలు. పెద్దదియగు ముమ్మడమ్మకు కాకతి వంశ రాకుమారుడగు మహాదేవునితో వివాహము జరిగింది. వారి కుమారుడే ప్రతాపరుద్రుడు. గణపతి దేవుడు జీవించి ఉన్నపుడే రుద్రాంబ ప్రతాపరుద్రుని దత్తత తీసుకొని అతనిని యువరాజుగా చేసింది. ఇతనిని కుమార రుద్రుడని, వీర రుద్రుడని కూడా అంటారు. రెండవ కుమార్తె రుద్రమ వివాహం యాదవ రాకుమారుడు యల్లన దేవునితో జరిగింది. మూడవ కుమార్తె రుయ్యమ భర్త ఇందులూరి అన్నయ మంత్రి.

రుద్రమ దేవి సామంతులలో విరియాల, చెరుకు వంశాల వారు ప్రముఖులు. యాదవ వంశీయులు కూడా కొందరున్నారు. సేనానులలో రుద్రయ పెద్ది, ఇందులూరి అన్నయ రుద్రయలు, రేచర్ల ప్రసాదిత్యుడు ముఖ్యులు. వెలమ నాయకులు మొదటి సారిగా రుద్రమ దేవి కాలంలో ఉన్నత స్థానములలో ప్రవేశించినారు.

## ప్రతాపరుద్రుడు (క్రీ॥శ॥ 1289 - 1323):-

ప్రతాపరుద్రుడు రుద్రమదేవి దత్త పుత్రుడు. ఆమె పెద్ద కుమార్తె ముమ్మడమ్మ కుమారుడు. మాతామహి రుద్రాంబ అంబయ దేవునితో జరిగిన యుద్ధంలో మరణించగా ప్రతాపరుద్రుడు క్రీ॥శ॥ 1289 లో ఓరుగల్లు ప్రభువుగా పట్టాభిషిక్తుడైనాడు.

ఇతడు రుద్రమ దేవి కాలంలోనే కాకతి రుద్ర కుమార, కుమార రుద్రదేవ అను పేర్లతో రాజ్య వ్యవహారాలు నిర్వహించుటతో పాటు అనేక యుద్ధాలలో పాల్గొని అపారమైన అనుభవాన్ని గడించాడు. పట్టాభిషేకానంతరం కూడా కుమార రుద్రదేవ అనే పేరు శాసనాలలో కన్పిస్తుంది. కాకతీయ సామ్రాజ్యం అత్యున్నతీ దశను చేరుకోవడం అంతర్ధానం కావడం మూడు దశాబ్దాల ప్రతాపరుద్రుని కాలంలోనే జరిగింది. ఇతని పాలనా కాలమంతా ఆంతరంగిక తిరుగుబాట్లను అణచడంలోను, విదేశీ దండయాత్రలను అణచడంలోను గడిచిపోయింది. తుదకు ఈ సంఘర్షణల ఫలితంగానే కాకతీయ సామ్రాజ్యం అస్తమించింది.

తన మాతామహి మరణానికి కారణమైన రాజ్య ప్రతిష్టను దిగజార్చిన అంబదేవుని తిరుగుబాటును అణచడం అందులకతనిని ప్రోత్సహించిన పాండ్య, శేవుణుల పై తగు చర్యలు తీసుకొని కాకతీయుల వంశ ప్రతిష్టను సామ్రాజ్య ఔన్నత్యాన్ని పునరుద్దరించడం ప్రతాపరుద్రుని ప్రథమ కర్తవ్యమయింది. అందులకతడు సైనికావసరాలు తీర్చే నాయంకర విధానాన్ని పునర్వ్యవస్థీకరించినాడు. రాజ్యాన్ని 77 నాయంకరాలుగా విభజించి వాటిని సమర్థవంతులు విశ్వాస పాత్రులు అయిన సేనానుల ఆధీనంలో ఉంచినాడు. దీని వలన సుశిక్షితమైన సైన్యం రూపొందింపబడింది. కాని ఈ విధానం వలన కొన్ని ఇబ్బందులు కూడా ఎదురైనాయి. అంతవరకు కాకతీయులకు అండగా వుంటూ వచ్చిన పూర్వ సామంత వంశాల వారికి నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. అదియును గాక నాయంకరులలో అధిక సంఖ్యాకులు వెలమలగుటచే రాజ్యంలో వారి ప్రాబల్యం పెరిగి వర్ణ వైషమ్యాలకు దారితీసింది. వెలమల అధికార విస్తరణ వలన ప్రతాపరుద్రుని పట్ల రెడ్లకు ఆగ్రహం కలిగి తుదకు రాజ్య బలహీనతకు, పతనానికి దారితీసిందని స్థానిక చరిత్రల వలన తెలుస్తుంది.

తగు సన్నాహాలు పూర్తికాగానే ప్రతాపరుద్రుడు అంబయ అతని మిత్రుల పై త్రిముఖ దండయాత్రలు నిర్వహించినాడు. అంబయ అతని మిత్రులు పరస్పరం సహకరించుకునే వీలు లేకుండా చేయడమే ఈ త్రిముఖ దండయాత్రలోని ఆంతర్యం. ఒక సైన్యం సోమ మంత్రి కుమారుడైన గన్నయ సేనాని నాయకత్వంలో అంబయ దేవుని అతనికి సహాయంగా వచ్చిన శేవుణులను క్రీ॥శ॥ 1291 లో ఓడించి త్రిపురాంతక ప్రాంతాన్ని ఆక్రమించినాడు. అంబయ త్రిపురాంతకం నుండి పారిపోయినాడు. అటు తరువాత అతని సంగతి తెలియదు. అడిదంమలు నాయకత్వంలోని రెండవ సైన్యం నెల్లూరు పై దాడి జరిపి అంబయ దేవుని సామంతునిగా వ్యవహరిస్తున్న మనుమగండ గోపాలుని వధించి రాజగండ గోపాలుడనే రంగనాథుని నెల్లూరు సింహాసనమున నిలిచినవాడు. మూడవ దండ యాత్రను పశ్చిమ రంగంలో నిర్వహించినవాడు వర్ధమాన పురాధీశుడైన గోనవితలుడు. ఇతడు యాదవ రాజ్య దక్షిణ సరిహద్దులపై దాడి చేసి ఆదోని తుంబళం దుర్గాలను పట్టుకొని కృష్ణా - తుంగభద్ర అంతర్వేదిని కాకతీయ సామ్రాజ్యంలో చేర్చి భావికాలంలో కీలక దుర్గంగా ప్రసిద్ధికెక్కిన రాయచూరు దుర్గాన్ని పటిష్టంగా నిర్మించినాడు. ఇతని రాయచూర్ శాసనం ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది.

తురుష్క దండయాత్రల ఫలితంగా కాకతీయ సామ్రాజ్యంలో అలజడులు చెలరేగినాయి. నెల్లూరు రంగనాథుడు కాకతీయాధికారాన్ని ధిక్కరించి పాండ్యుల పక్షం చేరినాడు. మనుమగండు గోపాలుడను తెలుగు చోడుని నాయకత్వంలో రెండవ నెల్లూరు దండయాత్ర నిర్వహింపబడింది. రంగనాథుడు అతని పాండ్య మిత్రులు పూర్తిగా నిర్జింపబడినారు. తుదకు మహాప్రధాని ముప్పిడినాయకుడు నెల్లూరు రాజ్యాన్ని కాకతీయ సామ్రాజ్యంలో కలిపి వేసినాడు. గండికోటలో వైదుంబమల్లి దేవుడు స్వాతంత్ర్యం ప్రకటించినాడు. కాకతీయ సైన్యం మల్లి దేవుని ఓడించి గండికోటను ఆక్రమించింది. జుట్టయ లెంకగొంకారెడ్డి ఆ ప్రాంతానికి రాజ్య ప్రతినిధిగా నియమింపబడినాడు. పాండ్య రాజ్యంలో వారసత్వ యుద్ధం ప్రారంభం కాగా ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కపూర్ పాండ్య రాజ్యంలోని నగరాలను ఆలయాలను దోచుకొనిపోయాడు. పాండ్య రాజ్యంలోని అరాచక పరిస్థితులను అవకాశంగా తీసుకొని హోయసాల మూడవ వీర బల్లాలుడు కాంచీపురమును ఆక్రమించినాడు. కేరళ ప్రభువు కులశేఖరుడు వీర పాండ్యునకు సహాయంగా పాండ్య రాజ్యంలో ప్రవేశించినాడు. పూర్వపు పరాజయాలకు ప్రతీకారముగా ప్రతాపరుద్రుడు కూడా పాండ్య రాజ్యం మీద దండెత్తి వచ్చినాడు. కాకతీయ సేనాని దేవరినాయకుడు హోయసాలుల నుండి కాంచీ పురమును ఆక్రమించుకొని మాన వీరుడను వానిని ప్రతాపరుద్రుని ప్రతినిధిగా అచట నిలిపి అతని సాయంగా వచ్చిన కేరళ కులశేఖరుని ఓడించి సుందర పాండ్యుని రాజ్యాధిపతిని చేశాడు. ఈ దండయాత్ర ఫలితంగా కాకతీయుల అధికారం కాంచీపురం వరకు విస్తరించింది.

తుంగభద్రా తీరంలోని కంపిలి రాజ్య ప్రభువు కంపిల దేవుడు రాజ్య విస్తరణకు పూనుకొని హోయసాల మూడవ వీరబల్లాలునితో తలపడుటకు ప్రతాపరుద్రుని సహాయం పొందుటలో విఫలుడై కినుక వహించి కాకతీయ సామ్రాజ్య పశ్చిమ సరిహద్దు ప్రాంతాల పై దాడిచేసి 'మూరు రాయరగండు', 'వీర రుద్రనగండ' అనే బిరుదులు ధరించి ప్రతాపరుద్రుని ఆగ్రహామునకు గురైనాడు. బెండపూడి అన్నయామాత్యుడు, రేచర్ల సింగమ నాయకుడు కాకతీయ సేనలకు సారధ్యం వహించి కంపిలిరాయని అణచివేసినారు. ఓరుగల్లుపై గాంగులు దాడి జరపగా ప్రతాపరుద్రుడు దానిని విజయవంతంగా ఎదుర్కొన్నాడు.

## ప్రతాపరుద్రుడు - తురుష్క దండయాత్రలు:-

ఉత్తర హిందూ స్థానంలో ఢిల్లీ కేంద్రంగా తురుష్క ముస్లిం రాజ్యం క్రీ॥శ॥ 1206 లో నెలకొల్పబడింది. ఢిల్లీ నేలిన తొలి వంశం బానిస వంశం. వీరి కాలమంతా ఉత్తర దేశ రాజ్య వ్యవహారాలతోనే గడిచిపోయింది. రెండవది ఖిల్జీ వంశం. ఈ వంశంలో ప్రసిద్ధుడు అల్లాఉద్దీన్. దక్షిణ హిందూదేశం పై జరిగిన మొట్టమొదటి తురుష్క ముస్లిం దండయాత్ర ఇతని నాయకత్వంలో క్రీ॥శ॥ 1294 లో జరిగింది. ఈ సంఘటన సుల్తాన్ జలాలుద్దీన్ ఖిల్జీ కాలంలో జరిగింది. ఈ సందర్భంగానే అల్లాఉద్దీన్ దక్షిణ దేశంలో అపార సంపదను గూర్చి రాజుల అనైక్యతను గూర్చి తెలుసుకున్నాడు. తాను సుల్తానైన పిమ్మట ఉత్తరా పథంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పి పెరిగిన తన సైనికావసరాలకు తగిన నిధులను సమకూర్చుకొనుటకు దక్షిణ దేశ సంపదను తరలించుకు పోవాలని సంకల్పించి సేనాని మాలిక్ కపూర్‌ను దండుతో పంపినాడు. కనుక అల్లాఉద్దీన్ దక్షిణ దేశ దండయాత్రలలోని ప్రధానోద్దేశము ధన సంపాదనే గాని రాజ్య సంపాదన కాదు. పరాజితులైన దక్షిణ దేశ రాజుల నుండి కప్పము వసూలు చేయుటయే అతని ఆశయం. ఇట్టి విపత్కర పరిస్థితుల్లో సైతం దాక్షిణాత్య ప్రభువుల్లో పరస్పర సహకార భావం కొరవడటం శోచనీయం.

ఓరుగల్లు పై జరిగిన తురుష్క దండయాత్రను గూర్చి విభిన్న కథనాలున్నాయి. ప్రతాప చరిత్ర నుండి స్థానిక చరిత్రలు విలస కలువచేరు తామ్ర శాసనాల ప్రకారం తురుష్కులు ఓరుగల్లు పై ఎనిమిది లేక తొమ్మిది సార్లు దండయాత్రలు జరిపినారు. కాని ముస్లిం చరిత్రకారుల రచనలు ఈ దాడులు ఐదు మాత్రమేనని తెల్పుతున్నాయి. మొదటి దండయాత్ర క్రీ॥శ॥ 1303లో జరిగింది. అల్లాఉద్దీన్ మాలిక్ ఫక్రుద్దీన్ జూనా నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని బెంగాలు మీదుగా ఓరుగల్లు పైకి పంపినాడు. ఈ సైన్యాన్ని రేచర్ల వెన్నసేనాని పోలుగంటి మైలి అను కాకతీయ సేనానులు కరీంనగర్ జిల్లాలోని ఉప్పరపల్లి వద్ద ఓడించి, తరిమి వేశారు. ఈ పరాజయంతో అల్లాఉద్దీన్‌కు ఓరుగల్లు పై కసి పెరిగింది. ఉత్తర హిందూ స్థానంలో పరిస్థితులను చక్కబరుచుకొని క్రీ॥శ॥ 1309లో మాలిక్ కపూర్ సేనాని నాయకత్వంలో రెండవ దండయాత్రను పంపినాడు. ఈ దండయాత్ర వివరాలను అమీర్‌ఖుస్రూ జియాఉద్దీన్ బర్నీలు అందించారు. కపూర్ దేవగిరి చేరి అచట నుండి బసీర్ ఘర్, సిర్బూర్, కూనర్బాల్‌ల గుండా హనుమకొండకు చేరి అచటి నుండి ఓరుగల్లు ముట్టడి జరిపినాడు. నెలరోజుల పాటు ముట్టడి కొనసాగింది. పరిసర గ్రామాలు దహించి వేయబడినాయి. పౌరజనం నానా కష్టాలకు గురియైనారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తానుకు ఏటేటా కప్పం చెల్లించడానికి అంగీకరించినాడు. కాని అల్లా ఉద్దీన్ మరణానంతరం ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులనాసరాగా తీసుకొని ప్రతాపరుద్రుని కప్పము చెల్లింపు నిలిపివేయుట వలన ముబారక్ షా ఖిల్జీ నియమించిన ఖుస్రూఖాన్ ఓరుగల్లు పై దాడి జరిపి ప్రతాపరుద్రుని నుండి పెద్ద మొత్తంలో ధనము వసూలు చేసినట్లు అమీర్‌ఖుస్రూ ఇసామీలు వ్రాశారు.

నాలుగు, ఐదు దండయాత్రలు తుగ్లక్ వంశ స్థాపకుడైన ఘియాజుద్దీన్ తుగ్లక్ (క్రీ॥శ॥ 1320 - 25) కాలంలో జరిగాయి. ఈ దండయాత్రల ప్రధానాశయం రాజ్య సంపాదన, ధన సంపాదన కాదు. నాల్గవ దండయాత్రను నిర్వహించినవాడు ఉల్గాఖాన్ బిరుదాంకితుడైన యువరాజు జూనాఖాన్ (తరువాతి మహమ్మద్ బిన్ తుగ్లక్) ఇతడు దేవగిరి, కోటగిరుల మీదుగా ఓరుగల్లు చేరి ముట్టడి (క్రీ॥శ॥ 1322) ప్రారంభించినాడు. ముట్టడి ఆరుమాసాల పాటు కొనసాగింది. ఈ లోపున ఘియాజుద్దీన్ తుగ్లక్ మరణించినాడనే పుకార్లు వ్యాపించి సైన్యంలో కలతలు, అవిధేయత పెరిగాయి. మార్గాంతరం లేని యువరాజు ముట్టడి విరమించి తిరోగమించినాడు. తిరోగమిస్తున్న ఢిల్లీ సైన్యం పైబడి కాకతీయ సైన్యం అపార నష్టం కలిగించింది.

జూనాఖాన్ దేవగిరి చేరినాడు. ఢిల్లీ నుండి అచటకు వచ్చిన సైన్యమును తోడ్కొని బయలుదేరి బీదర్ బోధన్ నగరాలను ఆక్రమించి మరల (క్రీ॥శ॥ 1323) ఓరుగల్లు ముట్టడి ప్రారంభించినాడు. పదేపదే మహమ్మదీయ దండయాత్రలకు గురియైన కాకతీయ రాజ్య సైనిక పాటవం సన్నగిల్లింది. ఆర్థిక పరిస్థితి నీరసించింది. ప్రజల్లోను సైన్యంలోను నైతిక బలం దెబ్బతిన్నది. పలు పరాజయములు ఎదురైనను సైన్య నిర్వహణలోను, ఆయుధ సంపత్తిలోను కాలానుగుణ్యమైన మార్పులు రాలేదు. వర్ణవ్యత్యాసాల వల్ల సైన్యంలో ఐకమత్యం కొరవడింది. రెడ్డి, వెలమ వివాదాల వలన రెడ్లు ప్రతాపరుద్రునికి దూరమయ్యారు. ఇందుకు బొబ్బారెడ్డి అనే సేనాని క్లిష్ట సమయంలో కాకతీయ సైన్యం నుండి వైదొలగుటయే నిదర్శనం. పరిస్థితులీవిధంగా ప్రతికూలించినా ప్రతాపరుద్రుడు శక్తి కొలది వీరోచితంగా పోరాడి పరాజితుడై బందీగా చిక్కినాడు. షమ్స్, ఇ. సిరాజ్ అఫీఫ్ రచనల వల్ల ప్రతాపరుద్రుడు ఢిల్లీకి తీసుకొని పోబడుతూ నర్మదానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. ఆంధ్రదేశం 23 వ రాష్ట్రంగా ఢిల్లీ సామ్రాజ్యంలో చేర్చబడింది. ఆంధ్ర నగరి ఓరుగల్లు సుల్తాన్ పూర్‌గా మారింది. తుగ్లక్ వంశ ప్రతినిధులు ఆంధ్రదేశ పాలకులైనారు.

కాకతీయ ప్రభువులలో ప్రతాపరుద్రుడు చివరివాడు. ఇతని కాలంలో కాకతీయ సామ్రాజ్యం అత్యున్నత దశకు చేరుకున్నది. దేశ రక్షణతో పాటు రాజ్య ఆర్థికాభ్యుదయానికి కృషి చేసినాడు. కడప, కర్నూలు, పల్నాడు ప్రాంతాల్లో అడవులను నరికించి పంట పొలాలుగా మార్చినాడు. చెరువులు, బావులు త్రవ్వించి పొలాలకు నీటి పారుదల వసతులు కల్పించినాడు. నిర్జన ప్రదేశాలలో గ్రామాలు, నగరాలు వెలిశాయి. రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ప్రతాపరుద్రుడు భాషాభిమాని. అతడు సంస్కృతాంధ్ర కవులను పోషించినాడు. అతని ఆస్థాన కవియైన విద్యానాథులను సంస్కృతంలో ప్రతాపరుద్ర యశోభూషణం అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని వ్రాసాడు. అగస్త్య విశ్వనాథులను వారు ఇతర సంస్కృత కవులు, ప్రతాపరుద్రుని మంత్రులు, సేనాపతులు కూడా భాషా పోషకులే. మారన తన మార్కండేయ పురాణాన్ని గోనగన్నా రెడ్డికి అంకిత మిచ్చినాడు. మారయ సాహిణి భాస్కర రామాయణ రచనను ప్రోత్సహించినాడు.

ప్రతాపరుద్రుని పట్ట మహిషి విశాలాక్షియని ప్రతాప చరిత్ర ద్వారా తెలుస్తుంది. కరీం నగర్ జిల్లాలో యెల్లేడు గ్రామము నందలి శాసనం ఇతని మరొక రాణి లక్ష్మీదేవిని పేర్కొంటున్నది. ప్రతాపరుద్రునికి వీరభద్రుడను పుత్రుడున్నట్లు ప్రతాప చరిత్ర తెలుపుతుంది. కాని దీనిని ధృవీకరించు మరే యితర ఆధారాలు లేవు.

**ఉపయుక్త గ్రంథాలు:-**


1. Desai, D. : The Mahamandalesvaras under the Chalukyas of Kalyani, Bombay 1951.
2. Kanaka Durga, P. : Ganapatideva and His Times (Un - Published Thesis - NU).
3. Parabrahma Sastry, P.V. : The Kakatiyas, Hyderabad 1978.
4. Pratibha Maga : Rudramadevi (Un - Published Thesis - AU).
5. Rama Rao, M. : The Kakatiyas - JAHRS Vols.
6. Ritti, S.H. : The Seunas of Devagiri, Dharwar 1972.
7. Satyanarayana, K : A Study of the History and Culture of the Andhras, Vol II Delhi 1983.
8. Venkata Ramanaiah, N. : a) The Eastern Chalukyas of Vengi, Madras 1950.
   b) Early Muslim Expansion in South India, Madras 1942.
9. Verma, O.P. : The Yadavas and their Times , Nagapur 1970.
10. Yasoda Devi : The History of Andhra Country (A.D. 1000 - 1500) New Delhi 1993.

11. Yazdani, G. : The Early History of the Deccan, Oxford London, 1960.

12. హనుమంతరావు, బి.యస్.యల్ : ఆంధ్రుల చరిత్ర, గుంటూరు 1983

13. హనుమంతరావు, ముప్పాళ్ళ : సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి - 2 వ భాగం, తుని 1997.

14. రామారావు, యమ్. : కాకతీయ సంచిక, హైదరాబాద్ 1991.

15. సుబ్బారావు, ఆర్ (సం) : కళింగ దేశ చరిత్ర, రాజమండ్రి.

16. సుబ్రహ్మణ్యం, ఆర్ మొ॥ (సం) : తెలుగు సంస్కృతి, మొదటి సంపుటము హైదరాబాద్, 1983.

రచయిత : డా॥ ఒ. సాంబయ్య

పాఠం - 17 **కాకతీయ యుగ సాంస్కృతిక విశేషాలు**

ముఖ్యాంశాలు:-

17.0 లక్ష్యం

17.1 ఉపోద్ఘాతం

17.2 పరిపాలనా విధానం

17.2.1 కేంద్ర ప్రభుత్వం

17.2.1.1 రాజు

17.2.1.2 మంత్రి పరిషత్తు

17.2.1.3 ఉద్యోగ వర్గం

17.2.1.4 సామంతులు

17.2.1.5 నాయంకరులు

17.2.2 స్థానిక పాలన

17.2.3 న్యాయ పాలన

17.2.4 పన్నులు

17.2.5 సుంకాలు

17.2.6 సైనిక వ్యవస్థ

17.3 సాంఘిక పరిస్థితులు

17.3.1 సంఘం

17.3.2 కుల సంఘాలు

17.3.3 దురాచారాలు

17.3.4 అలంకారము

17.4 ఆర్థిక పరిస్థితులు

17.4.1 క్రొత్త గ్రామాల నిర్మాణం

17.4.2 వ్యవసాయం - నీటి పారుదల సౌకర్యాలు

17.4.3 పరిశ్రమలు

17.4.4 వర్తక - వాణిజ్యాలు

17.4.5 విదేశీ వాణిజ్యం

17.4.6 శ్రేణులు

17.4.7 వాణేలు

17.5 మత పరిస్థితులు

17.5.1 జైన మతం

17.5.2 బౌద్ధ మతం

17.5.3 శైవం

17.5.3.1 కాలాముఖి శాఖ

17.5.3.2 పాశుపత శైవం - గోళకి మఠం

17.5.3.3 ఆరాధ్య శైవం

17.5.4 వైష్ణవ మతం

17.5.5 గ్రామ దేవతల, వీరుల ఆరాధన

17.5.6 దేవాలయ నిర్మాణం

17.6 సాహిత్యం

17.6.1 సంస్కృతం

17.6.2 తెలుగు

17.7 కళలు

17.7.1 వాస్తు నిర్మాణాలు

17.7.2 శిల్పం

17.7.3 చిత్ర లేఖనం

17.7.4 నాట్య సంగీతాలు


## 17.0 లక్ష్యం:-

శాతవాహనుల తరువాత ఆంధ్ర దేశాన్ని సమైక్యం చేసి తెలుగు భాష మాట్లాడే ప్రజలందరినీ ఒకే పరిపాలన కిందకి తెచ్చి

ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి శాతవాహనులు ఇతోధికంగా కృషి చేసినారు. కాకతీయ యుగ సాంస్కృతిక విశేషాల గురించి వివరించడమే ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## 17.1 ఉపోద్ఘాతము:-

ఆంధ్ర దేశ చరిత్రలో కాకతీయుల పాలనా కాలం ఒక మహోజ్జ్వల ఘట్టం. శాతవాహనుల తరువాత వేరు వేరు కాలాలలో, వేరు వేరు రాజవంశాల పాలనలో విభిన్నాకృతితో రూపు రేఖలు లేని పరిస్థితులలో క్రమముగా ఆంధ్ర దేశాన్ని, జాతిని ఏకఛత్రాధిపత్యం క్రిందకి తేవడమే గాక, కవి పండితులను పోషించి, లలిత కళలను ప్రోత్సహించి ఆంధ్ర సంస్కృతికి సమగ్రమైన రూపము దిద్దిన వారు కాకతీయులు. తెలుగు భాష మాట్లాడే ప్రజలందరినీ ఒకే పరిపాలన కిందకి తెచ్చి వీరు మహోపకారం చేశారు. వీరు ఆంధ్రుల చరిత్రలోనే కాక భారత చరిత్రలో కూడా గొప్ప పాత్రను నిర్వహించారు. దక్షిణపథంలో ముస్లిం దండయాత్రలను ఎదురొడ్డి నిలిచి ఆంధ్రదేశ స్వాతంత్ర్య పరి రక్షణలోను, ఆంధ్ర సంస్కృతి కాకతీయ వంశంలోనే జరిగింది. హిందూ రాజ వంశాలలో స్త్రీని సింహాసనం ఎక్కించిన ఘనత కాకతీయులకు దక్కింది. అయితే స్త్రీలు రాజ్యపాలన నిర్వహించడం గతంలో లేదు. కనుక రుద్రమ దేవి పురుష నామం ధరించి, పురుష వేషంలో రాజ్య వ్యవహారాలను చక్కబెట్టవలసి వచ్చింది. తొలిసారిగా దత్తత ద్వారా కిరీటం పొందే పద్ధతి కూడా కాకతీయ వంశంలోనే జరిగింది. ప్రతాపరుద్రునకు ఈ విధంగానే అధికారం లభించింది. అంతేగాక రాజ్యపాలన చేస్తున్న రాజు చివరి రోజుల్లో యువరాజుతో కలసి పరిపాలన చేయడం కాకతీయ వంశంలో జరిగింది. గణపతి దేవుని చివరి కాలంలో రుద్రమ దేవి, రుద్రమ దేవి చివరి కాలంలో ప్రతాపరుద్రుడు యువరాజులుగా పరిపాలనలో పాల్గొన్నారు.

## 17.2 పరిపాలనా విధానం:-

### 17.2.1 కేంద్ర ప్రభుత్వం:- కాకతి రుద్రదేవుడు, బద్దెన, మడికి సింగన మొదలగు వారి రాజనీతి గ్రంథాలు నాటి శాసనాలు కాకతీయుల పాలనా వ్యవస్థను గురించి వివరిస్తున్నాయి.

**17.2.1.1 రాజు:-** ప్రభుత్వ యంత్రాంగానికి రాజు సర్వాధికారి. రాజ్య చక్రానికి రాజు ఇరుసు వంటి వాడు. సిద్ధాంతరీత్యా అధికారమంతా రాజుదే. అయితే ఆచరణలో అతని అధికారానికి కొన్ని పరిమితులు వుండేవి. వర్ణ ధర్మము, కుల ధర్మము, ఆచారం, సంప్రదాయం, శాస్త్ర నియమాలు ఎవరైనా పాటించవలసిందే. నాటి శాసనాలలో చాతుర్వర్ణ సముద్ధరణ అనే బిరుదు తరచుగా కనపడుతుంది. ధర్మశాస్త్రాలు ముఖ్యంగా రాజనీతి శాస్త్రం, కళలు సాహిత్యాలలో మంచి ప్రవేశం వున్నవారు మాత్రమే రాజు కావాలని రాజనీతి సూత్రకారుల అభిప్రాయం. రాజు ప్రజలను కన్నబిడ్డలుగా భావించి వారి ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని శాస్త్రకారులు తెలిపారు. గణపతి దేవుడు రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. కాబట్టి వారికి శాస్త్రకారులు నిర్ణయించిన అర్హతలు వున్నాయని గ్రహించవచ్చు. నిర్ణీత సమయంలో రాజు ప్రజలకు దర్శనం ఇవ్వవలెననీ అందువలన ప్రజలు తమ కష్టాలను తెలుపుకోవడానికి అవకాశం వుంటుందని నీతి సారం చెబుతుంది.

కాకతీయ రాజు సార్వభౌమత్వ సూచకమైన బిరుదులేవి ధరించకపోవడం కొంత ఆసక్తికరమైన విషయం. సమధిగత పంచమహాశబ్ద, మహామండలేశ్వర మొదలైన సామంత రాజ బిరుదాలను వారు కొనసాగించారు. వారి సార్వభౌమత్వాన్ని అంగీకరించిన అనేక సామంత రాజుల మనసు నొచ్చుకోకుండా వారి శ్రేయస్సును కాంక్షించే మిత్రులైనట్లు తెలియచేయడానికి వారు ఈ విధంగా చేసి వుండవచ్చు. వారు సామంతరాజు బిరుదులను మాత్రమే ధరించడం వల్ల యాదవులకు నామమాత్ర సామంతులై తమ రాజ్యాన్ని సర్వ స్వతంత్రంగా పరిపాలించుకొన్నట్లు ఆల్టేకర్ పండితుని అభిప్రాయం.

కాకతీయుల రాజ్యం శీఘ్రగతిని విస్తరించినందువలన రాజుల ఆడంబరం, దర్బారు వైభవం పెరిగాయి. పెరుగుతున్న అధికార హోదాలకు అనుగుణంగా బిరుదులు ధరించడం జరిగింది. అంగరక్షకులు, రాజ ప్రతినిధి, కార్యకర్త, రాయసం మొదలగు వారు రాజు యొక్క ఆంతరంగిక అనుచరులు.

**17.2.1.2 మంత్రి పరిషత్తు:-** రాజ్య చక్రంలోని సప్తాంగాలలో మంత్రి ఒక ముఖ్య అంగము. మంత్రి లేని రాజును తొండం లేని ఏనుగు అని చెప్పారు. ఎంత దగ్గర వాడైనా, స్నేహశీలి అయిన, విజ్ఞత లేని వానిని మంత్రిగా నియమించరాదని నీతిశాస్త్ర ముక్తావళి చెవుతుంది. ఏ మంత్రికి సర్వాధికారాలు ఇవ్వరాదు. అలా యిస్తే మంత్రే రాజవడానికి అవకాశమేర్పడుతుంది. మంత్రులను నియమించేటప్పుడు కాకతీయులు ఈ విషయాలను ఖచ్చితంగా పాటించారని వారి మంత్రుల సామర్థ్యాన్ని బట్టి గ్రహించవచ్చును. రాజనీతి సూత్రాలన్నింటిని కాకతీయులు పాటించినట్లు కనిపించదు.

కాకతీయుల రాజుల మంత్రులలో బ్రాహ్మణులే కాక అన్ని కులాలకు చెందినవారు కలరు. వ్యక్తుల అర్హతను గుర్తించి మంత్రి పదవులు ఇచ్చినట్లు కనిపిస్తుంది. మంత్రి పదవిని ఇచ్చిన వ్యక్తికి పల్లకి, శ్వేత చత్రం, ప్రత్యేక దుస్తులు, జాగీరు, ఆభరణాలు, సుగంధ దినుసులు ఇవ్వడం ఆచారం. కాకతీయుల కాలంలో ఎంత మంది మంత్రులతో రాజ్య వ్యవహారాలను చర్చించడం రాజు దినచర్యలో ముఖ్య భాగం. మంత్రులకు సలహాలిచ్చే అధికారమే కానీ విషయ నిర్ణయాధికారం లేదు. ఆ అధికారం రాజుదే.

**17.2.1.3 ఉద్యోగ వర్గం:-** కాకతీయుల శాసనాలలో మహా ప్రధాని, ప్రెగ్గడ, అమాత్య, మంత్రి మొదలగు 72 తరగతుల (నియోగాలు) సైనిక పౌరశాఖల ఉద్యోగుల పేర్లు కన్పిస్తాయి. గణపతి దేవునికి మల్యాల హేమాద్రి రెడ్డి ప్రధాని. ప్రతాపరుద్రునికి ముప్పిడి నాయకుడు మహా ప్రధాని. అన్ని శాఖలను కలిపి బహత్తర నియోగాధిపతి. ఇతని విధులను తెలిపే సాక్ష్యాధారం లభించలేదు. వీరి ఉద్యోగులలో పేర్కొనదగినవారు తంత్రపాలుడు, శాసనాధికారి, పడాలుడు, శ్రీకరణ, తత్పరులు, శ్రీభండారులు, శాసనాధికారి, సుంకాధికారి, అడపం, ఆతవట్టం, కొట్టరువు, అంగరక్షకుడు, నగరిశ్రీవాకిలి, నగరి అధికారి, తలారి, సావాసి మొదలగువారు.

**17.2.1.4 సామంతులు:-** రాజుకు పరిపాలనలో సహాయం చేసే మరొక వర్గం సామంతులు. వీరిలో రేచర్ల, కాయస్థమాల్యాల, చోన మొదలైన వంశాల వారు సుప్రసిద్ధులు. వాస్తవానికి కాకతీయ రాజ్య వైభవానికి ఎక్కువ భాగం కృషి చేసింది సామంత ప్రభు వంశాలే. అనేక యుద్ధాలలో వారు తమ శూరత్వంలో కాకతీయ రాజులకు విజయాలు సమకూర్చి పెట్టడమే కాక దేవాలయాలు నిర్మించి, చెరువులు త్రవ్వించి, కవి పండితులను ఆదరించి కాకతీయ యుగ శోభకు దోహదం చేశారు. ఈ సామంత కుటుంబాలతో కాకతీయ రాజులు సైతం సత్సంబంధాలు నెలకొల్పుకున్నారు. ఒక్క కాయస్త అంబ దేవుడు తప్ప ఇతర సామంతరాజులు కాకతీయులను విధేయతతో కొలిచారని చెప్పవచ్చు.

**17.2.1.5 నాయంకరులు:-** రాజుకు పరిపాలనలో సహాయం చేసిన మరొక వర్గం వారు నాయంకరులు. కాకతీయుల సైనిక పరిపాలనను నాయంకర విధానం అని అంటారు. ఈ విధానాన్ని రుద్రమ దేవి ప్రవేశ పెట్టింది. ఆమె వారసుడైన ప్రతాపరుద్రుని కాలంలో ఈ విధానం సమర్థవంతంగా పని చేసింది. నాయంకర విధానం ఒక విధమైన జాగీర్‌దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనా అధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. ఈ నాయంకరులు తమ మండలంలో వచ్చే ఆదాయంతో నిర్ణీతమైన సైన్యాన్ని పోషించి యుద్ధ సమయాలలో రాజుకు తోడ్పడే వారు. ప్రతాపరుద్రుని కాలంలో నాలుగో వంతు భూమి వీరి ఆధీనంలో వుండేది. ఆనాడు 75 మంది నాయంకరులు వున్నట్లు తెలుస్తుంది. మక్తల నాయంకరం, కొండూరు నాయంకరం, విన్నూరు నాయంకరం మొదలైన నాయంకరాలు నాడు వుండేవి. ఈ నాయంకర విధానంలోని ప్రధాన లోపం కేంద్రాధికారం బలహీనమైనప్పుడు నాయంకరులు తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకోవడం. ఈ విధానం విజయనగర రాజుల కాలంలో కూడా కొనసాగింది.

**17.2.2 స్థానిక పాలన:-** పరిపాలన సౌలభ్యం కొరకు కాకతీయ సామ్రాజ్యం స్థలం, సీమ, వాడి, పాడిచ, భూమి, కంపన అనే ప్రాంతీయ విభాగాలుగా విభజింపబడింది. అది గ్రామాల మొదలు 60 గ్రామాల వరకు గల సముదాయాన్ని స్థలంగా వ్యవహరించేవారు. ఈ స్థలానికి స్థలకరణం తదితర ఉద్యోగులు, వారి కార్యాలయాలు వుండేవి. అనేక స్థలాల సముదాయమే

నాడు. నాడు అధికారులను రాజు నియమించేవాడు. నాటి శాసనాలలో అనుమకొండ నాడు, గొండల నాడు, కమ్మనాడు, కందురునాడు, కర్నాడ్రు, కుసలనాడు, మారటనాడు, ములికినాడు, పాకనాడు, పల్లినాడు, పొత్తపినాడు, వుంగినాడు, రేనాడు, వెలనాడు, వేంగినాడు, సబ్బినాడు మొదలగు పేర్లు కన్పిస్తున్నాయి. శాసనాలలో వాడి, భూమి అనే విభాగాలు కూడా కన్పిస్తున్నవి. అందుకు ఉదాహరణలు మూర్చనాడి, మెట్టనాడి, నరనాడి, నతవాడి, ఆరేభూమి, మగతల భూమి మొదలుగునవి. ప్రాంతీయ పాలనను నాయంకరులు చూసారు.

పరిపాలనలో చివరిది గ్రామం. గ్రామాలలో నాడు రెండు రకాలు కలవు. అవి పన్నులు కట్టవలసిన బాధ్యత లేని గ్రామాలు, పన్నులు కట్టవలసిన గ్రామాలు. అన్ని గ్రామాలలోను గ్రామాధికారుల సముదాయానికి ఆయగార్లు అని పేరు. ఆయం అనగా పొలము యొక్క విస్తీర్ణత. గ్రామసేవ చేసినందుకు పన్ను లేకుండా భూమిని పొందిన వారిని ఆయగార్లు అంటారు. ఆయగార్ల సంఖ్య 12. వారు వరణం, రెడ్డి, తలారి, పురోహితుడు, కమ్మరి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, చాకలి, మంగలి, వెట్టి, చర్మకారుడు. మొదటి ముగ్గురు ప్రభుత్వ సేవకులు. కరణం వి లు గ్రామ విస్తీర్ణం సాగుభూమి, తోటభూమి, పోరంబోకు, గడ్డి భూములు వాటి విస్తీరణం, వ్యక్తుల ఆస్తులు లెక్కలు మొదలగునవి కరణం ఇచ్చే లెక్కల ప్రకారం రెడ్డి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి అందచేసేవాడు. తలారి గ్రామ రక్షక భటుడు. ఆయగార్లకు పన్నులు లేని భూములేకాక పంటలో కూడా వాటా వుండేది. ఆయగార్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి వంటివాడు.

17.2.3 **న్యాయ పాలన:-** కాకతీయ న్యాయ నిర్ణయంలో, నిర్వహణలో సాంప్రదాయకమైన విధానాలను అనుసరించారు. సాధారణంగా సామాన్యమైన వివాదాలన్నీ గ్రామ సభలలో పరిష్కరించారు. సాధారణంగా సామాన్యమైన వివాదాలన్ని గ్రామ సభలలో పరిష్కరింపబడేవి. గ్రామంలో దొంగతనాలు జరగకుండా చూసే బాధ్యత తలారిది. రాజ్యంలో ఉన్నత న్యాయస్థానం రాజాస్థానం. రాజాస్థానాలలో ప్రాడ్వివాకులు అనే ప్రత్యేక న్యాయాధికారులు వుండేవారు. వీరు న్యాయ శాస్త్రంలో, ధర్మ శాస్త్రాలలో చక్కని పాండిత్యం వున్నవారు. గ్రామాలలో తగాదాలు పరిష్కరించడానికై రాజ ఆజ్ఞ పై ఒకరిద్దరు అధికారులు స్థానిక సభల ద్వారా మహా జనుల సహకారంతో న్యాయ నిర్ణయం చేసేవారు. ప్రత్యేక నేరాలను విచారించటానికి నిపుణులతో కూడిన ధర్మాసనాలు ఏర్పాటు చేయబడేవి. ఈ ధర్మాసనాలను ప్రాచీన స్మృతి గ్రంథాలలో చెప్పబడిన సూత్రాలననుసరించి ఏర్పాటు చేసేవారు. ఈ ధర్మాసనాలు చేసిన తీర్పులను జయపత్రాలు అనే పేరుతో రాజ ముద్రిక వేసి ఇచ్చేవారు. ఆ ముద్రలను వేయడానికి ప్రత్యేక ఉద్యోగులు ఉండేవారు. నాడు శిక్షలు కఠినంగా వుండేవి. మరణశిక్ష కూడా వుండేది.

17.2.4 **పన్నులు:-** ప్రభుత్వానికి భూమి శిస్తు ప్రధాన ఆదాయ మార్గము. వర్తకం, పరిశ్రమలు, వృత్తుల పై విధించే పన్నులు రెండో ఆదాయమార్గము. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చిక బయళ్ళ పై వసూలు చేసే పన్ను, అప్పనము, ఉపకృతి మొదలైనవి సాంప్రదాయంగా వస్తున్న పన్నులు. రాజును దర్శించేటప్పుడు ఇచ్చే కానుక దర్శనము. మేలుకు ప్రతిఫలంగా ఇచ్చేది ఉపకృతి. అకారణంగా ఇచ్చేది అప్పనము. సాగుచేసిన భూమిని వెలిచేను, నీరు, నేల, తోటభూమి అనే మూడు తరగతులుగా విభజించేవారు. ప్రతి పొలాన్ని గడ లేక దండతో కొలిచేవారు. ఒక్కొక్క ప్రాంతములో ఒక్కొక్క గడను వాడేవారు. కేసరి పాటిగడ అనునది ఎక్కువగా వాడుకలో వున్న గడ. ఈ గడ మొదట గుంటూరు జిల్లా కేసరిపాడులో వాడబడింది. అందువల్ల దానికి ఆ పేరు వచ్చింది. వెలిచేనును పుట్టితో కొలిచేవారు. ప్రతి గ్రామంలో రాజుకు వుండే సొంత పొలానికి రాచదొడ్డి ఒకసారి పండే భూమి కూడా వుండేది. పంట పండినప్పుడే ఈ భూమి పై పన్ను వుండేది. బ్రాహ్మణులకు, దేవాలయాలకు దానమిచ్చిన భూముల పై కొద్దిపాటి పన్ను వుండేది. ఈ తరగతి భూములు కొన్నింటికి పన్ను మినహాయింపు పూర్తిగా ఉండేది. పన్ను రేటు పుట్టికి ఒక చిన్నం చొప్పున వుండేదని శాసనాల వలన తెలుస్తుంది. నీరు పొలం పై పన్నును కోరు అని, వెలి పొలం పై పన్నును పుట్టిహండి అని పిలిచేవారు. భూమి శిస్తును ధన రూపంలో గానీ, ధాన్య రూపంలోగాని వసూలు చేసేవారు. పన్నులు వసూలు చేయడానికి కొలకాండ్రు అనే అధికారులు వుండేవారు.

భూమి శిస్తును అరి అనేవారు. పన్ను కట్టవలసిన రైతులను అరిగాపులు అనేవారు. ప్రజలు ప్రతి సంవత్సరము కార్తీక మాసం, వైశాఖ మాసాలలో పన్నులు చెల్లించేవారు.

17.2.5 **సుంకాలు:-** వర్తక సరుకుల మీద, ఎగుమతుల, దిగుమతుల పైన తయారైన వస్తువుల మీద వేసే పన్నులకు సుంకమనీ పేరు. సుంకాలు వసూలు చేసే అధికారం సాధారణంగా వర్తక శ్రేణులకు ఇవ్వబడేది. నిర్ణీతమైన సొమ్మును రాజుకు చెల్లించి వర్తక శ్రేణులు సుంకాలు వసూలు చేసే అధికారం పొందేవి. వర్తకుల నుండి సుంకాలు వసూలు చేయడానికి వర్తక శ్రేణులకు సుంకరులు వుండేవారు. సంతలలో వర్తక సామాగ్రి పై విధించే సుంకానికి పెమ్మ సుంకం లేక మగమ అని పేరు. సుంకాల వసూలులో శ్రేణికి పూర్తి అధికారాలు వుండేవి. ఈ కాలంలో రక్షణ వ్యవహారాలలో ఈ శ్రేణులు పాల్గొనేవి. రాజు సేనలో శ్రేణి బలం కూడా వుండేది.

కాకతీయ శాసనాలలో అమ్మబడి సుంకం, అమ్ముకడ సుంకం, పెరికెఎడ్ల సుంకం , గనువుల ముద్ర సుంకం మొదలగు పేర్లు కనిపిస్తున్నవి. అమ్మిన వస్తువుల పై వేసే సుంకం అమ్మబడిన సుంకం, వస్తువుల గోతాలను మోసే ఎడ్లబండి పై వసూలు చేసే సుంకం పెరికెఎడ్ల సుంకం. గానుగ పెట్టుకొనేందుకు చెల్లించేది గానుగల ముద్ర సుంకం. గానుగ ఆడించినందుకు చెల్లించేది గానుగపు అరి సుంకం. బండ్లు, గుర్రాలు వున్నవారు కూడా సుంకాలు చెల్లించేవారు. ఉప్పు పరిశ్రమ ప్రభుత్వపు గుత్తగా వుండేది. చినగంజాం, పెదగంజాం, కడుకుదురు, కనుపర్తి దేవరం పల్లి మొదలగునవి నాటి ఉప్పు పరిశ్రమ కేంద్రాలు. ఉప్పు సుంకం వేసే కరణాలు ఈ పరిశ్రమదారుల పై అధికారం చెలాయించేవారు. ఉప్పు కొలతకు కొలకాండ్రు, సురక నిర్ణయానికి తీర్పరులు వుండేవారు. గడ్డి మీద వేసే పన్నును పుల్లరి అనేవారు. అడ్డ సుంకం అనేది మరొక సుంకం. ఇది గొర్రెల మంద పై వేసే పన్ను, తలారి పన్ను, ఒంటు పన్ను మొదలైనవి గ్రామస్థులు ఆయా అధికారుల పోషణ నిమిత్తం ఇచ్చే పన్నులు.

పై వివరణ వలన కాకతీయుల కాలంలో పన్నుల భారం అధికమనే చెప్పాల్సి వస్తుంది. అయినప్పటికీ విదేశాలలో సైతం నాటి ఆంధ్రదేశం వాణిజ్యం చేసినట్లు ఆంధ్ర తీరంలో చాలా రేవు పట్టణాలు వున్నట్లు శాసనాల వలన, సాహిత్యం వలన తెలుస్తుంది. అలాంటి రేవు పట్టణాలలో ఒకటి మార్కోపోలో అడుగు పెట్టిన మోటుపల్లి. ఇక్కడ కాకతి గణపతి దేవుడు వేయించిన అభయ శాసనం వుంది. ఇందులో ప్రభుత్వం విదేశీ వర్తకులకు కలిగించే సదుపాయాలను, రాయతీలను పేర్కొంటుంది.

17.2.6 **సైనిక వ్యవస్థ:-** కాకతీయుల సైనిక వ్యవస్థను గురించి తెలుసుకోవడానికి రాజనీతి గ్రంథాలు కొంత వరకు ఉపయోగపడుతున్నాయి. బద్దెన రచించిన నీతి శాస్త్ర ముక్తావళి, మడికి సింగన రచించిన సకల నీతి సమ్మతం ఇచ్చే సమాచారం ఆయా గ్రంథకర్తలు రాజోద్యోగులైనందున వాస్తవమని భావించవచ్చును. కాకతీయులు పెద్ద సైన్యాన్ని పోషించినారు. ప్రతాపరుద్రునికి 100 ఏనుగులు, 20 వేల గుర్రాలు, 9 లక్షల కాల్బలం ఉన్నట్లు చెప్పబడింది. కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అనే రెండు విభాగాలు వుండేవి. సర్వ సైన్యాధిపతి చక్రవర్తి. సైన్యాన్ని నడపడానికి దండ నాయకులు, మహాదండనాయకులు, సైన్యాధిపతులు, సైన్యాధ్యక్షులుండేవారు. కాకతీయ రాజులు సైన్యానికి స్వయముగా నాయకత్వం వహించేవారు. కాకతీయ రాజులలో రుద్రదేవుడు, మహాదేవుడు యుద్ధభూమిలోనే చనిపోయారు.

దేశీయ, విదేశీయ శత్రువుల బారి నుండి రాజ్యాన్ని రక్షించడం కోసం కాకతీయులు తమ శక్తిలో అధిక భాగము వెచ్చించే వారు. దేశ రక్షణలో కోటలు కీలక పాత్ర వహించేవి. రాజ్య రక్షణ కోట సముదాయం పై ఆధారపడి వుంటుందని నీతి సారము చెపుతుంది. నీతిసారం చెప్పినట్లే కాకతీయ రాజ్యాల్లో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు వున్నట్లు శాసనాల వలన తెలుస్తుంది. కాకతీయులు నిర్మించిన ఓరుగల్లు, గోల్కొండ, భువనగిరి, రాయచూరు, రాచకొండ, దేవరకొండ, నల్లకొండ, పానుగల్లు కోటలు బలిష్టమైన దుర్గాలుగా పేరు పొందాయి.

కాకతీయులు సైనిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాజ్య పాలనా వ్యవస్థను తీర్చిదిద్దారు. తమ రాజ్యంలో కొంత భాగాన్ని నాయంకరులుగా విభజించి సైనిక అధికారులకు పంచిపెట్టారు. రాజు చతురంగ బలాలను పోషించడానికి ఖజానాను నింపడానికి తగిన ఆదాయం వచ్చే పెద్ద భూభాగాన్ని తన ఆధీనంలో వుంచుకొని చిన్న గ్రామాలను మాత్రమే నాయకులకు ఇవ్వాలని నీతి సారం చెపుతుంది. నాయకులు తమ ఆధీనంలోని నాయంకరుల పై వచ్చే ఆదాయంలో కొంత భాగం సొంత ఖర్చులకు వాడుకొని మిగిలిన భాగంలో కొంత రాజుకు కప్పంగా, మిగిలిన దానిని రాజు సేవ కొరకు, సైన్యాన్ని పోషించడానికి ఉపయోగించాలి. దీనినే నాయంకర విధానం అంటారు. నాయకులు పోషించే సైన్యం కన్నా పెద్ద సైన్యాన్ని రాజు సొంతంగా పోషించాలని బద్దెన నీతి శాస్త్రంలో చెప్పాడు. ఈ సూత్రాలను కాకతీయ రాజులు పాటించారు.

కాకతీయ సైన్యంలో కాల్బలం, అశ్వక దళం, గజ దళం వుండేవి. అన్ని కులాల వారికి సైన్యంలో ప్రవేశం వుండేది. సైనిక వృత్తిని అవలంభించే వారికి యుద్ధ విద్యలలో మంచి శిక్షణ ఇచ్చేవారు. గుర్రాలకు, ఏనుగులకు శిక్షణ ఇవ్వడానికి అశ్వ సాహిణులు, గజ సాహిణులు వుండేవారు. రాజు రక్షణకు అంగరక్షకులు వుండేవారు. వారు రాజును తమ దైవంగా భావిస్తూ ఎల్లవేళలా కాపాడుతూ రాజుతో పాటు మరణించడానికి కూడా వెనుదియ్యరు. రాజుతో పాటు నాయకులకు కూడా అటువంటి అంగరక్షకులు ఉండేవారు. విశిష్ట సేవలకు గుర్తుగా సైనికోద్యోగులకు బిరుదులు, భూములు పారితోషికంగా ఇచ్చేవారు. రాజ్య సేవలు వీరునిగా గుర్తింపు పొందిన వానికి గండపెండేరం బహుకరించేవారు. 'కోటగేల్పట' వెలనాటిదుషక, ద్వీపలుంటాక, కంచికవాట, చూరకార, చెలమర్తిగండ, మారురాయిండ అనేవి అటువంటి బిరుదాలు.

కాకతీయుల నాటి ప్రధాన ఆయుధాలు కత్తి, బల్లెం, ధనుర్బాణాలు కూడా ఎక్కువగా వాడేవారు. పలనాటి యుద్ధంలో కుంతలాలు, గండ్రగొడ్డళ్ళు, గదలు, ముసలాలు, ముద్గరాలు, మెనలకిటార్లు, చక్రతోమరాలు, చురికలు, బాణములు మొదలైన ఆయుధాలు ఉపయోగించినట్లు పలనాటి చరిత్ర వలన తెలుస్తుంది. నాటి సైనిక దుస్తులలో అంగీ, చల్లాడం, నడుమపట్టి వుండేవి.

కాకతీయ పరిపాలనా విధానంలో సామంత రాజ్య విధానం ప్రధాన అంశమైంది. అందువల్ల ప్రజలపై పన్నుల భారం అధికమైంది. విశాలమైన సామ్రాజ్యమేర్పడిన వాస్తవంగా రాజకీయ సమైక్యత లేదు. దేశం అసంఖ్యాకమైన ప్రాంతీయ, స్థానిక, పరిపాలకుల పాలై కేంద్రీకృతమైన పరిపాలనా సౌకర్యం లోపించింది. చక్రవర్తులు ప్రాంతీయ పరిపాలకుల పై ఆధారపడి వారిని విశ్వాసపాత్రులుగా వుంచుకొనేందుకు అనేక విధాల ప్రయత్నాలు చేయవలసి వచ్చింది. నిరపేక్ష అధికారంతో పరిపాలించినట్టు కనిపించినా, వాస్తవంగా చక్రవర్తి సామంతరాజుల మద్దతు పై ఆధారపడి వుండటం వలన సంపూర్ణమైన పరిపాలనా అధికారాలు, అవకాశాలు చాలా తక్కువని చెప్పవచ్చు.

## 17.3 సాంఘిక పరిస్థితులు:-

**17.3.1 సంఘం:-** కాకతీయుల కాలం నాటి సంఘంలో బ్రాహ్మణం, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ప్రధానంగా వుండేవి. కాని నాటికి ప్రతి కులంలోనూ అనేక అవాంతర కులాలు ఏర్పడినవి. బ్రాహ్మణులలో వృత్తిని బట్టి 'వైదికులు', 'నియోగులు', అనే భేదం, ప్రాంతాలను బట్టి వెలనాటి వారు, వేగి నాటి వారు, కమ్మనాటి వారు, పకమాటి వారు, ఆరువేల నాటి వారు, తెలంగాణ్యులని భేదాలు ఏర్పడినవి. బ్రాహ్మణులలో వలెనే రెడ్లలో పాక నాటు రెడ్లనీ, కాపులలో కొండ కాపులనీ, తూర్పు కాపులనీ, మున్నూరు కాపులనీ, వేనాటి కాపులని భేదాలు ఏర్పడినవి. ఆనాడు ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి రాకపోకల సౌకర్యం తక్కువగా వుండటం వల్ల జన సామాన్యంలో ప్రాంతీయ భేదాలు ఎక్కువగా ఏర్పడి తరతరాలుగా అట్లే నిలిచిపోయాయి. ఇదే విధంగా ఇతర వృత్తులలో కూడా అవాంతర భేదాలు ఏర్పడి, కాలక్రమంలో అవి ప్రత్యేక కులాలుగా రూపొందాయి. కమ్మరి పని చేసే వాళ్ళలో ఇనుము పని చేసేవారు, బంగారం పని చేసే వారు, ఇత్తడి పని చేసే

వారు విడిపోయి ప్రత్యేక కులాలుగా ఏర్పడ్డారు. ఈ విధంగా ప్రాంతాన్ని బట్టి నాలుగు వర్ణాల వారిలోను అనేక అవాంతర భేదాలున్నప్పటికి మధ్య యుగ శాసనాలు అష్టాదశ వర్ణాలని విశేషంగా పేర్కొంటాయి. ఏకామ్రనాథుని ప్రతాపచరిత్ర, వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామం కాకతీయుల కాలంలో వున్న వివిధ వృత్తుల వారిని పేర్కొంటాయి. కోమట్లు, ఈదురవారు, గొల్లవారు, అక్కలవారు, సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బొయవారు, రుంజాలుచ, పిచ్చుకుంట్లు మొదలైన కులాల పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి.

హిందూ మతాన్ని సంస్కరించే వుద్దేశంతో ప్రవేశ పెట్టబడిన శైవ, వైష్ణవాలు ఉపకారం కంటే కీడే ఎక్కువ చేసింది. ఈ మతాలు హిందూ సంఘంలో అసహనాన్ని, మతోన్మాదాన్ని ప్రవేశపెట్టాయి. కుల నిర్మూలన కోసం ఆవిర్భవించిన ఈ మతాల వల్ల సంఘంలో క్రొత్త కులాలు ఏర్పడడం ఆశ్చర్యకరం. శైవులలో లింగాయతులు, బలిజలు, జంగాలు, తంబళ్ళు మొదలైన కులాలు, వైష్ణవంలో నంబులు, సాతానులు, దాసర్లు మొదలగు కులాలు ఏర్పడినవి. ఈ కాలంలో వివిధ కులాల మధ్య వివాహాలు జరిగినవి. రుద్రమ దేవి బ్రాహ్మణ మంత్రి అయిన ఇందలూరి అన్నయ్య, రుద్రమ కుమార్తె అయిన రుయ్యమను వివాహం చేసుకున్నాడు. బ్రహ్మనాయుడు అన్ని కులాల స్త్రీలను వివాహమాడినట్లు పలనాటి చరిత్రలో చెప్పబడింది. అంతేగాక అన్ని కులాల వారు వైష్ణవ సాంప్రదాయాన్ని అనుసరించి ఒకే పంక్తిలో చాపకూళ్ళు తినేవారు. అయితే రాజకీయపరమైన వర్ణాంతర వివాహాలు గానీ, చాపకూళ్ళు గానీ వర్ణ వ్యవస్థలో, దానిలో అంతర్భాగమైన కుల వ్యవస్థలో ఎటువంటి మార్పులను తీసుకురాలేదు. కుల నిర్మూలన కోసం జరిగిన ప్రయత్నాలు విఫలమై కుల వైషమ్యాలు తిరిగి కాకతీయ రాజ్య విధ్వంసానికి దారి తీశాయి. ఈ కాలంలో వెలమల సంఘ సంస్కరణకు, రెడ్ల సాంప్రదాయానికి కట్టుబడినట్లు కనిపిస్తుంది. ఆనాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన ఈ రెండు కులాల మధ్య అధికారానికై పోటీ ప్రారంభమైంది. కాకతీయుల పతానానంతరం కూడా వీరు పరస్పర యుద్ధాలలో మునిగి ముస్లిం రాజ్య విస్తరణకు అవకాశం కల్పించారు. ఈ కాలంలో అష్టాదశ వర్ణాలలో అగ్ర వర్ణమైన బ్రాహ్మణులు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయ అధికారం శూద్రులపరమైంది.

17.3.2 **కుల సంఘాలు:-** కాకతీయ సామాజిక జీవితానికి ఒక ప్రధాన ముఖ్య లక్షణం 'సమయములు'. సమయములు అనగా కుల సంఘాలు. బ్రాహ్మణ సమయానికి మహాజనులని, వైశ్య సంఘానికి వైశ్యనకరం అని పేర్లు వుండేవి. నానిమున్నూరు, ప్రతి స్థలసమయ అనే పేర్లు శాసనాలలో కనిపించడం వలన కుల సంఘాలు వివిధ స్థాయిలలో వున్నట్లు భావించవచ్చు. ప్రతి సమయానికి సమయాచారము. కుల కట్టుబాట్లు వుండేవి. సమయానికి పన్నులు వసూలు చేసే అధికారం కుల కట్టుబాటును రక్షించే అధికారం వుండేది. రాజులు కూడా సమయాచారాలను మన్నించేవారు.

17.3.3 **దురాచారాలు:-** ఈ కాలంలో అన్ని వర్ణాలలోను దురాచారాలు ప్రబలినవి. బాల్య వివాహం, వరకట్నం, కన్యాశుల్కం, నిర్బంధ వైధవ్యం మొదలైన దురాచారాలు కనిపిస్తున్నవి. జూదం, మద్యపానం, కోడిపందాలు, పొట్టేళ్ళ పందాలు వంటి దుర్వ్యసనాలకు నాటి ప్రజలు బానిసలైనారు. వేశ్యలకు సంఘంలో గౌరవ ప్రదమైన స్థానముండేది. వేశ్యాలోలత్వం సర్వసాధారణం. వేశ్యలు నృత్య, సంగీత, సాహిత్య, చిత్ర లేఖనాలలో నిష్ణాతులై వుండేవారు. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె మాచలదేవికి గొప్ప పేరు వున్నట్లు తెలుస్తుంది.

ఈ కాలంలో దేవాలయాలలో ఉత్సవాలు జరిగేవి. ఈ సందర్భంలో హరికథలు, నాటకాలు, కోలాటం, నాట్య ప్రదర్శనలు జరిగేవి. వీటి ద్వారా ప్రజలకు ధర్మ ప్రబోధం, విజ్ఞానాలతో పాటు వినోదం కూడా అందించబడేవి. పాచికలాట, కోడి పందాలు, పొట్టేళ్ళ పందాలు, జూదం, తోలు బొమ్మలాట, రంగుల రాట్నం మొదలగునవి నాటి ప్రజల వినోదాలని సమకాలీన రచనల వలన తెలుస్తుంది. శ్రీశైల యాత్ర ఇచ్చట జరిగే ఉత్సవాల గురించి పండితారాధ్య చరిత్రలో వివరించబడి వుంది. రామాయణ, భారత గాథలను వర్ణ చిత్రాలుగా చీరల పై ముద్రించి ప్రదర్శించేవారు. పలనాటి వీరులకు జాతర
13 చేయడం ఆచారమైంది. మైలారభటులు, నిప్పు గుండాలలో దూకడం, బల్లేలు కత్తులు వేసిన పాత్రలలో వేలాడే ఉట్లమీద

పరుగెత్తడం వంటి సాహసకృత్యాలు చేసి మైలార దేవుని పూజించేవారని క్రీడాభిరామం చెప్తుతుంది. మైలార దేవుడు యుద్ధ దేవునిగా, శివుని అవతారంగా వీరులు ఆరాధించడము ప్రారంభమైంది.

17.3.5 **అలంకారము:-** కాకతీయుల శిల్పాల ద్వారా, సమకాలీన గ్రంథాల ద్వారా ఆనాటి ప్రజల వస్త్రాలంకరణ, ఆభరణాల గురించి గ్రహించవచ్చు. సంపన్న స్త్రీల మెడలో పుడకల పట్టెడ, చదరపు రేకుల పట్టెడ, బంగారు, వెండి నాణేలను, ముత్యాలు, పగడాలు, పచ్చలతో చేసిన హారాలను ధరించేవారు. లక్ష్మీ విగ్రహంలో రత్నాలు పొదిగి చేసిన అందమైన గుండ్రని కంఠాభరణాలు లభించాయి. స్త్రీలు ముక్కు ముంగరలు, ముంజేతికి మురుగులు, మోచేతి పైన దండ కడియాలు, కాలికి అందెలు ధరించేవారు. స్త్రీలు వడ్డానం, పురుషులు వెండి మొలత్రాడు ధరించేవారు. నిలువుటద్దాలు ఆనాడు వుండేవి. గోళ్ళకు గోరింటాకు పెట్టుకునేవారు. పెదవులకు రంగు పూసుకునేవారు.

## 17.4 ఆర్థిక పరిస్థితులు :-

17.4.1 **క్రొత్త గ్రామాల నిర్మాణం:-** కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో తులతూగుతున్నట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో వంటి విదేశీ యాత్రికుల రచనల వల్ల తెలుస్తుంది. కాకతీయులు చాలా కాలం వరకు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించినందున దాని అభివృద్ధికి వారు చాలా కృషి చేశారు. వారు అనేక క్రొత్త గ్రామాలను ఏర్పరచి, తటాకాలను త్రవ్వించారు. కాకతీయ సామంతులు కూడా తమ ప్రభువుల విధానమే అనుసరించారు. మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సం పేట, అచ్చం పేట, ఖమ్మం, కొత్త గూడెం మొదలగు అటవీ ప్రాంతాలలోని గ్రామాలు చాలా వరకు కాకతీయుల నాటివేనని శాసనాల వలన తెలుస్తుంది. కొన్ని గ్రామాలకు కాకతీయ రాజుల పేర్లుకూడా వున్నవి. ఘనపూర్ గణపతి దేవుని పేరుతో, రుద్ర వరం రుద్రదేవుని పేరుతో, మహాదేవ పురం మహాదేవుని పేరుతో, బయ్యారం బయ్యల దేవి పేరుతో, ముప్పవరం ముప్పమాంబ పేరుతో, కుందవరం కుందమాంబ పేరుతో వెలిశాయి. అడవులను నరికించి భూమిని పంట పొలాలుగా మార్పు చేసి క్రొత్త గ్రామాలకు నిర్మాణాన్ని కాకతీయులు, వారి సామంతులు చేపట్టినారు.

17.4.2 **వ్యవసాయం - నీటిపారుదల సౌకర్యాలు:-** ఆనాటి వృత్తులలో ప్రధానమైనది వ్యవసాయం. ఇది చాలా వరకు వర్షాల పైనే ఆధారపడినది. కాకతీయ ప్రభువులు, వారి సామంతులు ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించారు. భూమి పై సర్వాధిపత్యం రాజుకు వుండేది. ఆ తరువాత భూమిని సొంతం చేసుకున్న వారికి యాజమాన్యం హక్కు ఉండేది. రాజుకు చెందిన భూమిని రాచ పొలం అని అంటారు. పోడు భూములను సాగుబడి చేసే వారికి కొన్ని సదుపాయాలు కల్పించబడేవి. ఆనాటి సాగుబడి భూములను నది యాత్రకలని, దేవ యాత్రకలని పిలిచేవారు. అడవులు పచ్చిక భూములను బీడులని అంటారు.

కాకతీయులు, వారి సామంతులు అనేక చెరువులు, నరస్సులు, కాలువలను, బావులు, పుణ్యం సంపాదించుకోవడానికి ఆనాటి వ్యక్తులు త్రవ్వించేవారు. కీర్తిని చిరస్థాయిగా నిలిపే సప్త సంతానాలలో చెరువు, బావి నిర్మాణం ఒకటి. ఈ కారణం వలన వ్యవసాయానికి నీటి వనరులు ఏర్పడ్డాయి. మొదటి ప్రోలరాజు కేసరి సముద్రమనే తటాకం తన బిరుదు పేర నిర్మించినాడు. ఈ తటాకం నేటికీ ఉంది. రెండవ బేతరాజు సెట్టికెరెయ. కేసరి సముద్రం అనే రెండు చెరువులను త్రవ్వించి వరుణ దేవుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాడనీ శాసనాల వలన తెలుస్తుంది. రెండవ ప్రోలరాజు, రుద్రదేవుడు తటాకాలను నిర్మించారు. రుద్రుని మంత్రి గంగాధరుడు హనుమకొండలో ఒక పెద్ద చెరువు నిర్మించాడు. గణపతి దేవుడు అనేక తటాక నిర్మాణాలు చేసాడని ప్రతాప చరిత్ర తెలుపుతుంది. గణపతి దేవుని కాలంలో వరంగల్‌కు సమీపంలో పాకాల సరస్సును జగడాలు ముమ్మడి నాయకుడు నిర్మించాడు. ఇది సుమారు 17 వేల ఎకరాలను సాగుబడిలోనికి తెస్తున్నది. రామప్ప చెరువును గణపతి దేవుని సేనేనా కేచర్ల రుద్రుడు నిర్మించాడు. (క్రీ॥శ॥ 1213) ఈ సరస్సు

సుమారు 4.350 ఎకరాలకు నీటి సరఫరా చేస్తున్నది. ఈ కాలానికి చెందినదే సుమారు 350 ఎకరాలకు నీరు అందించే గణపురం చెరువు. కాకతీయుల నాటి మరో పెద్ద చెరువు లక్నవరం తటాకం. రెండవది బయ్యారం చెరువును గణపతి దేవుని సోదరి మైలాంబ నిర్మించింది. గణపతి దేవుని మరొక సోదరి కుందమాంబ కుంద సముద్రం అనే పేరుతో ఒక చెరువు నిర్మించింది.

మల్యాల, రేచర్ల కుటుంబాల నాయకులు నిర్మించిన చెరువులు తెలంగాణాలలో నేటికీ ఉపయోగపడుతున్నాయి. మల్యాల కుటుంబము నిర్మించిన వాటిలో ముఖ్యమైన చాపుండ సముద్రం, బాచ సముద్రం, గణప సముద్రం, ఉప్పు సముద్రం, బుద్ధుని కుంట, కుప్పాంబ కాలువ, పోరెడ్డి కాలువ ముఖ్యమైనవి. రేచర్ల కుటుంబం వారు త్రవ్వించిన వానిలో సబ్బి సముద్రం, నామ సముద్రం, విశ్వనాధ సముద్రం, గౌర సముద్రం, ఎర్ర సముద్రం, లకుమ సముద్రం, నేరెడ్ల చెరువు, ఎర్రమరాజు కుంట ముఖ్యమైనవి. కామస్థ రాజ్యంలో అంభ సముద్రం, రాయసహస్రి మల్ల కాల్వ, గండ పెండేరు కాలువ, గణప సముద్రం త్రవ్వబడినాయి. నదుల సమీపంలో వుండే చెరువులకు కాలవల ద్వారా నది నీరును సరఫరా చేయించారు. నాటి కాల్వలలో మూసేటి కాలువ, ఇమ్మడి కాలువ, కృష్ణవేణి కాలువ, అంతర్గంగ కాలువ పేర్కొనదగినవి. చెరువుల, కాలవుల నిర్మాణంలో ఉపయోగింపబడిన శ్రామికులకు దినసరి వేతనాలు ఇవ్వబడును.

ఆ కాలంలో తెలంగాణా ప్రాంతంలో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ జిల్లాలలో చెరువులేని గ్రామం లేదు. నీటి పారుదల సౌకర్యానికై నీటిని సరియైన స్థలాలలో నిల్వ చేసి, వాగులకు కొన్ని స్థలాలలో ఆనకట్టలు కట్టి వ్యవసాయాభివృద్ధికై కాకతీయులు గొప్ప కృషి చేశారు. దీని వల్ల రాజ్యం యొక్క ఆర్థిక పరిస్థితి చాలా మెరుగుపడింది.

ఆనాడు రైతులు వరి, గోధుమలు, రాగులు, జొన్నలు, పెసలు, కందులు, చెరకు, ఉల్లి, అల్లం, పసుపు, నూనె దినుసులు తదితర పంటలను పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సమకాలిక రచనల వలన తెలుస్తుంది. కొబ్బరి, చెరకు, మామిడి, అరటి తోటలు విస్తారంగా వుండేవి. బెల్లం, నూనె గానుగలు అనేక గ్రామాలలో వుండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది. ఓరుగల్లులోని పూటకూటి ఇంట్లో కేవలం ఒక్క రూపాయకు మంచి భోజనం లభించేదని క్రీడాభిరామం చెపుతుంది.

17.4.3 **పరిశ్రమలు:-** ప్రాచీన కాలం నుండి ఆంధ్ర దేశం అనేక పరిశ్రమలకు ముఖ్యముగా సన్నని వస్త్రాలకు, కలంకారి చీరలకు పేరు గాంచింది. 20 కి పైగా రకరకాల వస్త్రాలను గురించి పాల్కురికి సోమనాధుడు పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్నకంబళులు, సన్నని వస్త్రాల పరిశ్రమలు వుండేవి. పంచలోహాలతో పలు రకాల వస్తువులు తయారు చేసేవారు. దేవాలయ శాసనాలలో లోహపు దివియలు, కంచు కరరాపికలు, గంటలు, పిడి గంటలు మొదలగు వాటి ప్రస్తావన కనిపిస్తుంది. బ్రహ్మనాయుడు త్రిపురాంతకంలో పంచలోహ స్తంభాన్ని ప్రతిష్ఠించినట్లు పలనాటి చరిత్ర చెపుతుంది. గుత్తికొండ, పలనాటి సీమ, నిర్మల్ ఇనుప పరిశ్రమలకు పేరొందినవి. యుద్ధాలలో ఉపయోగించే ఆయుధ సామాగ్రి స్థానికంగానే తయారయ్యేది. నిర్మల్‌లో తయారయిన కత్తులకు డమాస్కస్‌లో కూడా మంచి పేరు ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రపు గనులు వున్నాయని మార్కోపోలో వ్రాశాడు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలు గ్రామాలలోనే తయారయ్యేవి.

17.4.4 **వర్తక - వాణిజ్యాలు:-** శాతవాహనుల తరువాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీయ వాణిజ్య సాంప్రదాయాలను కాకతీయులు పునరుద్ధరించారు. దీనికి కారణం నాటి రాజకీయ సమైక్యత, ఆర్థిక పురోభివృద్ధి కాకతీయులు ఉదారమైన, పటిష్టమైన వాణిజ్య విధానాన్ని అనుసరించారు. వర్తక సుంకాలను ఇష్టం వచ్చినట్లు పెంచరాదని, విదేశీ వర్తకాల పట్ల ఉదారంగా ఉండాలని నీతి సారం చెపుతుంది. మోసం చేస్తున్న వర్తకులను ప్రభుత్వం కఠినంగా శిక్షించేది. ఆనాడు దేశీయ వాణిజ్యానికి ఓరుగల్లు ప్రధాన కేంద్రం. అక్కడ వారం, వారం మడిసంత జరిగేది. ఓరుగల్లు తరువాత మందెన, హనగల్లు, ఆలంపురం, మాచర్ల, వేల్పూరు, యనమదల, తంగడి, త్రిపురాంతకం, లేబాక, కొచ్చర్ల కోట, నందలూరు, నెల్లూరు, పెదగంజాం, ఘంటసాల, వినుకొండ నాడు ప్రధాన కేంద్రాలుగా వుండేవని శాసనాల వలన తెలుస్తుంది. ఈ

కేంద్రాలను రేవు పట్టణాలైన మోటుపల్లి, మచిలీపట్నాలతో కలుపుతూ రహదారులు ఉండేవి. ఎడ్లబండి మీద, దున్నల మీద, గాడిదల మీద సరుకు రవాణా జరుగుతుండేది.

17.4.5 **విదేశీ వాణిజ్యం:-** కాకతీయుల కాలంలో విదేశీ వాణిజ్యానికి మోటుపల్లి ప్రధానకేంద్రం. కాకతి గణపతి దేవుడు మోటుపల్లిలో విదేశీ వర్తకులకు అభయమిస్తు ఒక శాసనం వేయించాడు. దీనిని బట్టి ఆనాటి ఎగుమతులను, దిగుమతులను, ఊహించవచ్చును. మోటుపల్లి వ్యాపారం జరిగే వస్తువులలో బంగారం, ఏనుగులు, గుర్రాలు, రత్నాలు, మిరియాలు, ప్రత్తి, పోకలు, కర్పూర తైలం, దంతం, రాగి, తుత్తునాగం, పాదరసం మొదలగునవి కలవు. రుద్రమదేవి కాలంలో ఆంధ్రదేశాన్ని దర్శించిన మార్కోపోలో మోటుపల్లి నుండి ఎగుమతి అయ్యే వజ్రాలను, వస్త్రాలను గురించి చాలా కొనియాడారు. ఇచటి నుండి ఎగుమతి అయ్యే వస్త్రాలు సాలెపురుగు దారం కంటే మిక్కిలి సన్ననైన నూలుతో నేయబడినవి అని నాగరిక దేశాలలో రాజులు, రాణులు ఈ వస్త్రాలంటే మోజుపడేవారని వ్రాశాడు.

17.4.6 **శ్రేణులు:-** ఆనాడు వర్తకుని బెహారీ అని, అతను చేసే పనిని వ్యవహారం అని పిలిచేవారు. వర్తక సంఘాలలో అన్ని వర్గాల ప్రజలకు స్థానముండేది. వర్తకులు వర్తకము స్వదేశీ, పరదేశి, ఉభయదేశి, నానాదేశి, పెక్కుండ్రు అనే శ్రేణులుగా ఏర్పడేవారు. ఈ శ్రేణులు ఆయా ప్రాంతాలలో వాణిజ్యం జరుపుకోవడానికి రాజు నుండి అనుమతి పత్రాలను పొందవలెను. ప్రతి శ్రేణికి రాజధాని నగరంతో సంబంధముండేది. యనమదల స్థలానికి చెందిన నానాదేశ, పెక్కుండ్రు, పాకనాడు, వేంగినాడు, హనుమకొండ స్థలాలలో వ్యాపారానికి అనుమతి పొందినట్లు యనమదల శాసనం వలన తెలుస్తుంది.

17.4.7 **నాణేలు:-** కాకతీయుల రాజుల శాసనాల వలన ఆనాటి నాణేల గురించి తెలుస్తుంది. నాటి నాణేలన్నింటిలో నిష్కము పెద్దది. దీనిని గద్యానం, మాడ అని కూడా వ్యవహరించేవారు. ఇది బంగారు నాణెం. మాడకు 10 రూకలు అని బాపట్ల శాసనం తెలుపుతుంది. రూక వెండి నాణెమై వుంటుంది. అడ్డుగ, పాదిక, వీస అనే నాణేలు కూడా వున్నట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. చిన్నం అనే నాణెం యొక్క ప్రస్తావన శాసనాలలో కనిపిస్తుంది. దీని విలువ స్పష్టంగా తెలియదు. కొన్ని శాసనాలలో ఇది పావుమాడకు సమానమని సూచించబడింది. డబు, కాసు, కాని, అణా నాణేల పేర్లు చెలామణిలో వున్నాయి.

## 17.5 మత పరిస్థితులు :-

కాకతీయుల కాలం నాటికి ఆంధ్రదేశంలో బౌద్ధమతం నామమాత్ర విశిష్టమైనది. కానీ జైనం మాత్రం ప్రబలంగానే వుండేది. ఈ కాలంలో కర్ణాటకలోనే గాక ఆంధ్రలో జైన మతాన్ని వీర శైవులు ధ్వంసం చేశారు. శైవులు జైన మతంలోని వర్ణ రాహిత్యాన్ని తమ ముఖ్య సిద్ధాంతంగా గ్రహించారు. శాస్త్ర, చర్చల ద్వారా జైనులు లోబడునపుడు వారిపై హింసను వీర శైవులు ప్రయోగించేవారు. రాజులను వశపరుచుకొని, వారికి దీక్ష ఇచ్చి, వారి గురువులై పాలనా అధికారాన్ని ఆధీనంలో వుంచుకొని ఇతర మతాల నిర్మూలనలో వీర వైష్ణవము కూడా విజృంభించినది. ఈ కాలంలో జైన, శైవ, వైష్ణవ మతాలన్ని పరస్పరం ప్రాబల్యం కోసం సంఘర్షించుకొనసాగాయి.

17.5.1 **జైన మతం:-** ఈ కాలంలో శైవంతో పాటు జైన, వైష్ణవ మతాలు ప్రచారంలో వున్నాయి. బౌద్ధం నాటికే క్షీణించిన జైనం మాత్రం తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోగలిగింది. ఈ కాలంలో జైనులను హింసకు గురి చేశారని, వారి ఆలయాలను ధ్వంసం చేశారని కొందరి అభిప్రాయం. బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర వంటి గ్రంథాల ఆధారంగా వీరు వాదించారు. కన్నడ దేశంలోను, ద్రావిడ దేశంలోను వీర శైవులు జైనులను నానా హింసల పాలు చేయడం వాస్తవమే కాని ఆంధ్ర దేశంలో అక్కడక్కడ కొన్ని సంఘటనలు మినహా హింస ఎక్కువగా జరగలేదు. కొలను పాక పెదతుంబలమ్, ఉజ్జిలి, కొనకొండ్ల, సిద్ధవటవ, గంగపేను, బిక్కవోలు, వినుకొండ, గుడివాడ, అచంట మొదలగు చోట్ల జైనానికి కొద్దిగా నష్టం వాటిల్లినది.

కాకతీయుల కాలంలో జైన విగ్రహాల ప్రతిష్ట జరిగినట్లు శాసన సాక్ష్యం వుంది. పాశుపత శైవానికి కేంద్రమైన ఓరుగల్లులోనే జైనులున్నారు. తొలి కాకతీయులకు జైన మతంతో సంబంధమున్నట్లు సిద్దేశ్వర చరిత్ర చెబుతుంది. బేతరాజు మంత్రి నారణయ్య శనిగరం (కరీంనగర్ జిల్లా)లోని ముద్దమల్ల శాసనం వేయించాడు. రెండో ప్రోలరాజు మంత్రియైన బేతనామాత్యుడు జైన మతాభిమాని. బేతనా భార్య మైలమ కడలాలమబసది నిర్మించింది. కడలాలయాన్ని కన్నడ భాషలో అంబిక లేక పద్మావతి దేవత అంటారని కృష్ణశాస్త్రి అభిప్రాయపడ్డాడు. పార్శ్వనాథుని దేవత పద్మావతి కనుక హనుమకొండ పై ఉన్న దేవి విగ్రహం పద్మావతి అనడంలో సందేహం లేదు. 16 వ తీర్థంకరుడైన శాంతినాథుని ఉపాసిక చిహ్నం గరుడపక్షి. జైన మతం పై గల అభిమానంతో కాకతీయులు దానిని తమ లాంఛనంగా స్వీకరించి వుండవచ్చు. అందుచేత తొలి కాకతీయులు జైన మతం స్వీకరించారని చెప్పవచ్చును.

తరువాత కాకతీయులు కూడా జైన మతాన్ని పోషించినట్లు శాసనాధారాలు కలవు. కాకతి రుద్రుని మంత్రియైన గంగాధరుడు పద్మాక్షి కొండ పై వున్న కడలాలయమసదని బాగుచేయించాడు. సుప్రసిద్ధ జైన కవి అప్పయార్యుడు 'జినేంద్ర కళ్యాణాభ్యుదయం' అను గ్రంథాన్ని ప్రతాపరుద్రుని కాలంలో పూర్తి చేసినట్లు చెప్పుకున్నాడు. దీనిని బట్టి కాకతీయుల చివరి పాలనా కాలం వరకు జైన మతం ప్రచారంలో వుందని చెప్పవచ్చును. నాటి ప్రజలు అన్ని మతాలను ఆదరించినట్లు తెలుస్తుంది. రుద్రుని నాటి బెక్కల్లు శాసనాన్ని బట్టి జైనుడైన మల్లి రెడ్డి భగవంతుడు ఒక్కడే అని నమ్మి 21 శివాలయాలు నిర్మించాడు. ఆంధ్రదేశం లో జైన మతం క్షీణించడానికి ప్రధాన కారణం క్రమక్రమంగా జైనానికి రాజుల పోషణ, ప్రజల ఆదరణ లభించకపోవడమే కాక వీర శైవ మతం విజృంభించడమే.

17.5.2 **బౌద్ధ మతం:-** ఆంధ్ర దేశంలో బౌద్ధం 11 వ శతాబ్దాని కల్లా పతనావస్థలో వుంది. బుద్ధునికి పంచారామాలలో (అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, సామర్లకోట, భీమవరం) దీప ప్రతిష్ట చేసినట్లు 12 వ శతాబ్దపు శాసనాలు పేర్కొంటున్నాయి. కాకతీయ మంత్రి గంగాధరుడు విష్ణు భక్తుడైనప్పటికి వట్టశాల వద్ద బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాడని క్రీ॥శ॥ 1117 నాటి కరీంనగర్ శాసనం చెపుతుంది. శ్రీ మహా విష్ణువు బుద్ధుని అవతారమెత్తాడని ఈ శాసనం తెలుపుతుంది. దీనిని బట్టి బౌద్ధమతం హిందూ మతంలో కలసి పోయిందని భావించవచ్చును. సోమనాథుని పండితారాధ్య చరిత్రలో పండితారాధ్య, మల్లిఖార్జునికి ఒక బౌద్ధ భిక్షువుకు మధ్య చందవోలులో వెలనాటి రాజైన రెండవ రాజేంద్ర చోళుని కాలంలో తీవ్రమైన వాగ్వివాదం జరిగిందని, ఫలితంగా పండితారాధ్యుని శిష్యులు బౌద్ధ ఆచార్యులను వధించినట్లు ప్రస్తావన వుంది. దీనిని బట్టి నాటికే బౌద్ధం తన ప్రాముఖ్యాన్ని కోల్పోయిందని స్పష్టమవుతుంది.

17.5.3 **శైవం:-** కాకతీయుల కాలంలో శైవ మతానికి రాజాదరణ, ప్రజాదరణ ఎక్కువగా లభించింది. వేదాలలోని రుద్రశివుడు తరువాత కాలంలో పశుపతిగా, శివునిగా ఆరాధింపబడినాడు. శైవులకు శివుడే ప్రత్యక్ష దైవం. శివుడు తన శిష్యులకు పాశుపత మతమును బోధించాడని శైవుల విశ్వాసం. ఈ శిష్యులు 112 మంది కలి యుగంలో ప్రజలకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించారు.

**17.5.3.1 కాలాముఖి శాఖ:-** కాకతీయుల కాలంలో కాలముఖి, పాశుపత, ఆరాధ్య శైవ శాఖలు వుండేవి. తొలి కాకతీయ రాజులు కాలాముఖిశాఖను పోషించారు. రెండవ బేతరాజు రామేశ్వర పండితుని శిష్యుడు. ఈ పండితుడు శ్రీశైల మఠాధిపతి, కాలాముఖి శాఖకు చెందినవాడు. ఈ పండితునికి బేతరాజు వైనజపల్లి అనే గ్రామాన్ని బహుకరించి శివపురం అని పేరు పెట్టారు. రెండవ ప్రోలరాజు రామేశ్వరుని శిష్యులు. మొదటి ప్రోలరాజు, రెండవ బేతరాజు, రెండవ ప్రోలరాజు, రుద్రమదేవుడు, పరమమహేశ్వరులని శాసనాలు తెలుపుతున్నాయి. మహాదేవుని రాజ గురువు ధ్రువేశ్వర పండితుడు. ఆనాడు కాలాముఖి శైవ శాఖకు ఆంధ్ర దేశంలో శ్రీశైలం, అలంపురం ప్రధాన కేంద్రాలు. అలంపురంలోని బ్రహ్మేశ్వర ఆలయంలో స్థానాధిపతులు గొప్ప పండితులని పేరు పొందారు. 12 వ శతాబ్దం చివరి నాటికి కాలముఖి శైవ శాఖ ఆంధ్ర దేశంలోని దేవాలయాలు, మఠాలు రాజ స్థానాలలోకి వ్యాపించింది.

**17.5.3.2 పాశుపత శైవం - గోళకి మఠం:-** కాకతీయుల కాలపు శైవ మత చరిత్రలో గణపతి దేవుని పరిపాలనాకాలం ఒక మైలురాయి వంటిది. గోళకి మఠ శైవమతాచార్యులు ఈ కాలంలో ఆంధ్ర దేశంలో ప్రవేశించి అతి త్వరలో ప్రజల ఆదరణ పొందగలిగారు. కాలముఖి శైవ మత శాఖకు ప్రజల ఆదరణ తగ్గడం ఆరంభించింది. ఈ రెండు శాఖల వారికి సిద్ధాంతాలలో తేడా లేదు గానీ, పూజా విధానంలో, ఆచార వ్యవహారాలలో వ్యత్యాసం కలదు.

పాశుపత శైవ గురువుల పేర్లన్ని శివ, శంభు, పండిత విశేషణాలతో అంతమవుతాయి. గణపతి దేవునికి శివ దీక్ష ఇప్పించిన రాజ గురువు విశ్వేశ్వర శివుడు. ఇతడు గోళకి మఠానికి చెందిన పాశుపత శైవాచార్యుడు. గోళకి మఠ శైవ ఆచార్యులను గురించి కాకతి రుద్రాంబ మల్కాపురం శాసనం తెలుపుతుంది. భాగీరథ, నర్మద నదుల మధ్య వున్న దాహల మండలంలో దూర్వాసుని సంతతి వారైన శైవాచార్యులు వున్నారు. ఈ గురువులో సద్భావ శంభు అనే అతడు కాలచూరి యువరాజు దేవుడు దానం ఇచ్చిన 3 లక్షల గ్రామాలను స్వీకరించినాడు. తను స్థాపించిన గోళకి మఠాచార్యుల జీవనోపాధి కోసం సద్భావ శంభు ఈ గ్రామాలను బహుమతిగా ఇచ్చాడు. సద్భావుని తరువాత గురువులలో సోమ శంభు, వామ శంభు ముఖ్యులు. ఆ తరువాత గురువులలో ఒకడైన ధర్మశివుని కుమారుడు విశ్వేశ్వర శంభు గొప్ప వేద పండితుడు. ఇతడే కాకతి గణపతి దేవునికి దీక్ష ఇచ్చిన గురువు. ఛేది, మాళవ, చోళ, కాకతీయ రాజులకు పాశుపత శైవాచార్యులైన గోళకి మఠ గురువులు రాజ గురువులై వుండేవారు. తండ్రి కోరిక మేరకు కాకతి రుద్రాంబ విశ్వేశ్వర విపునకు క్రీ॥శ॥ 1261 లో మందారమ్ గ్రామాన్ని కృష్ణ లంకతో కలిపి దానం చేసినట్లు మల్కాపురం శాసనం పేర్కొంటుంది. దానాన్ని స్వీకరించిన విశ్వేశ్వర శివుడు మందారమ్ (మందడం) గ్రామంలో ఒక శివాలయం, శుద్ధ శైవ మఠం కట్టించాడు. దీనికి అనుబంధంగా ఒక సత్రం నిర్మించాడు. ఈ గ్రామానికి విశ్వేశ్వర గోళకి అని పేరు పెట్టినాడు. శాసనంలో విశ్వేశ్వర శివుడు చేసిన దానాలు, ఇతర మంచి కార్యాలు వివరించబడి వుంది. ఈ గ్రామ మఠంలో ప్రసూతి ఆరోగ్య శాలను నెలకొల్పాడు. కాళేశ్వరంలో ఉప మఠం నిర్మించి దాని మనుగడకు పొన్న గ్రామాన్ని దానం చేశాడు. ఏలేశ్వరంలో ఒక మఠాన్ని నిర్మించాడు. ఆ మఠానికి అనుబంధంగా కట్టించిన సత్ర నిర్వహణకు కాంద్రకోట గ్రామాన్ని ఇచ్చినాడు. ఈ కాంద్రకోట గ్రామం గణపతి దేవునిచే విశ్వేశ్వరునికి దానం చేయబడినది. ఎన్నో గ్రామాలలో విశ్వేశ్వరశంభు లింగాలను స్థాపించినాడు. (మంత్ర కోటం, చంద్రవల్లి, కొమ్మ గ్రామం, ఉత్తర సోమశిల) ఈ ఆలయాలన్నింటి పోషకార్థం గ్రామాలను ఇచ్చినాడు. ఆంధ్రదేశమంతటా గోళకి మఠ శాఖలు ఏర్పాటు చేయబడినవి. వాటిలో ముఖ్యమైనవి భట్టిప్రోలు, త్రిపురాంతకం, శ్రీశైలం, పుష్పగిరి, అలంపురం, ద్రాక్షారామం వీటన్నింటికి స్థానాధిపతులు గోళకి మఠ శైవాచార్యులే. విశ్వేశ్వర శివుడు బ్రహ్మచర్యము అవలంబించి వైదిక ఆచారాలను పాటించాడు. ప్రతాపరుద్రుని పరిపాలన చివరి వరకు గోళకి మఠ పాశుపత శైవ మతం ఉచ్ఛస్థితిలో ఉంది. ఓరుగల్లు పై ముస్లిం దాడులు ఆరంభమయిన తరువాత శైవ మత ప్రచారానికి అవరోధాలు ఎక్కువై ఆ మత సంస్థల అభివృద్ధి ఆగిపోయింది. ఓరుగల్లు ముస్లింల స్వాధీనమయిన తరువాత ఆంధ్ర దేశ శాసనాలలో గోళకి పేర్లు, ఆ మఠ శైవాచార్యుల పేర్లు కనిపించవు.

**17.5.3.3 ఆరాధ్య శైవం:-** ఆంధ్రదేశపు శైవ మత శాఖలలో ఒకటి ఆరాధ్య శైవం. ఈ మతం ప్రాచీన కాలం నుండి ప్రచారంలో వుంది. మత గురువులు 12 మంది, రేవన, మరుల, ఏ కోరామ అను ముగ్గురు శైవాచార్యులను సిద్ధ త్రయం అని, ఉద్భటారాధ్య, విశ్వరాజ్య అను ముగ్గురు ఆచార్యులకు ఆరాధ్య త్రయమని పేరు. శ్రీ కంఠాచార్య, హరదత్తాచార్య, భాస్కరా చార్య అనే ముగ్గురు ఆచార్యులకు ఆచార్య త్రయమనీ పేరు. శ్రీపతి పండిత, మల్లిఖార్జున పండిత, మంచన పండిత అనే ముగ్గురు ఆచార్యులకు పండిత త్రయమని పేరు. ఈ 12 మంది గృహస్థులే. వీరు వైదిక సాంప్రదాయాలను, ఆచారాలను పాటించారు. ఈ ఆచార్యుల బోధనలను అనుసరించి బ్రాహ్మణులకు ఆరాధ్యులు లేక లింగదారులు అని పేరు. పండిత త్రయంలో ఒకడైన మల్లిఖార్జున పండితుడు చందవోలు రాజు అయిన వెలనాటి రెండో రాజేంద్రచోళుని సమకాలికుడు. మల్లిఖార్జున పండితుని జీవిత గాథను పాల్కురికి సోమనాధుడు పండితారాధ్య చరిత్ర అనే ద్విపద

కావ్యంగా రచించినాడు. కన్నడ దేశంలో విజృంభించిన వీర శైవ మతానికి ఆంధ్ర దేశంలో ప్రోత్సాహం లభించ లేదు. ఆంధ్ర దేశంలో వీర శైవుల సంఖ్య చాలా తక్కువ. వీర శైవులనే లింగాయుతులు అంటారు.

కాకతీయుల కాలం నాటి శైవ మతాలు మత కేంద్రాలే కాకుండా గొప్ప విద్యా కేంద్రాలుగా ప్రజలకు ఉపయోగపడినాయి. ఈ మతాలకు అనుబంధంగా విద్యా మండపాలు ఏర్పాటు చేయబడ్డాయి. వాటిలో వేదాలు, వ్యాకరణం, తర్కం, సాహిత్యం, శైవాగమము, వైద్యం తదితర విద్యలు బోధించెడి వారు. అధ్యాపకులకు భృత్యముగా భూమిని ఇచ్చేవారు. ఆనాడు శ్రీశైలం ఒక గొప్ప విద్యా మండపంగా ప్రసిద్ధి చెందినది.

**17.5.4 వైష్ణవ మతం:-** కాకతీయుల కాలంలో ప్రజల ఆదరణను పొందిన మరో మతం వైష్ణవ మతం. కాకతీయులు శైవ మతాన్ని పోషించినప్పటికి వైష్ణవ మతానికి వ్యతిరేకులు కారు. వారి ముద్రల పైన వరాహలాంఛనం, త్రికూటాలయంలో విష్ణువును ప్రతిష్టించటం బట్టి కాకతీయులు వైష్ణవాన్ని కూడా ఆదరించారని తెలుస్తుంది. హనుమకొండలో కాకతి రుద్రుడు నిర్మించిన వేయి స్తంభాల గుడిలో శివ, వాసుదేవ, సూర్య విగ్రహాలను ప్రతిష్టించాడు. అతని మంత్రియైన గంగాధరుడు విష్ణు భక్తుడైన స్మార్తుడు. ఇతడు హనుమ కొండలో ఒక ఆలయం నిర్మించి ప్రసన్న కేశవుని ప్రతిష్టించాడు. గణపతి దేవుని చెల్లెలు మైలాంబ ఇను గుర్తిలో గోపాలకృష్ణునికి ఒక ఆలయాన్ని నిర్మించింది. ప్రతాపరుద్రుని సేనాని దేవరి నాయకుడు రాజాజ్ఞతో కావేరి నది తీరాన గల రంగనాధ స్వామికి పలకలవీడు అను గ్రామాన్ని దానం చేసాడు. ప్రతాపరుద్రుని భార్య లక్ష్మీదేవి ఎలిగేడు గ్రామంలో గల దాయనాధ దేవునికి దానం చేసింది. ఆనాటి విష్ణు ఆలయాలు చిలుకూరు, మక్తల, మప్పమూరు, అన్నారెడ్డి గూడెం, బూరుగడ్డ, కలువకొలను, వెల్లటూరు మొదలగు చోట్ల కలవు. మాచర్లలో బ్రహ్మనాయుడు చెన్నకేశవాలయం నిర్మించాడు. ఈ కాలంలో సింహాచలం, సర్ప వరం, శ్రీకాకుళం, బాపట్ల, మాచర్ల, పొన్నూరు, అహోబిలం, నెల్లూరు, ధర్మపురి, శ్రీకూర్మం, తిరుపతి మొదలగునవి వైష్ణవ మత కేంద్రాలుగా పేరు పొందాయి. శ్రీరామానుజాచార్యులు అనుచరులు ఆంధ్ర దేశంలో ప్రవేశించి వైష్ణవ మతాన్ని ప్రచారం చేశారు. వెలవు నాయకులు తెలంగాణా ప్రాంతంలో వైష్ణవాన్ని పోషించారు.

కాకతీయులు వారి సామంతులు, ఉద్యోగులు, ప్రజలు మత సామరస్యం వహించి అన్ని మతాలను ఆదరించారు. స్మార్త మత విధానం ప్రజలలో వ్యాప్తి చెందినది. దీని ఫలితంగా బహుదేవతారాధన ప్రబలింది. ప్రజలలో అనేక మూఢ విశ్వాసాలు, జంతు బలులు, ఆత్మ బలిదానాలు ఎక్కువైనాయి. శైవులు, వైష్ణవుల మధ్య సమన్వయాన్ని సాధించడానికి హరిహరనాధతత్త్వం ప్రచారంలోనికి వచ్చింది. కవి బ్రహ్మ తిక్కన తన భారతాన్ని హరిహరనాధునికి అంకితం చేశాడు.

**17.5.5 గ్రామ దేవతల, వీరుల ఆరాధన:-** చరిత్ర పూర్వ యుగం నుండి సాంప్రదాయంగా వస్తున్న గ్రామ దేవతల, గ్రామ శక్తుల ఆరాధన ఆంధ్ర దేశంలో వున్నది. ఈ కాలంలో ఏకవీర, కాకతమ్మ, మాహురమ్మ, పోలేరమ్మ, పోతురాజు మొదలగు గ్రామ దేవతలను పూజించారు. పౌరాణిక హిందూ మతం గ్రామ దేవతారాధనను నిరసించలేదు. వారిని కూడా హిందూ దేవతలలో చేర్చుకున్నది. అదే విధంగా ఈ కాలంలో కుల దేవతలు, వీరులు పూజింపబడినారు. ఓరుగల్లులో గ్రామ దేవతల పూజ, పలనాటి వీరుల పూజ జరుగుతున్నట్లు క్రీడాభిరామం చెపుతుంది. వీరులకు వీరగల్లులు, వీరగుళ్ళ నిర్మించబడ్డాయి.

**17.5.6 దేవాలయ నిర్మాణం:-** కాకతీయుల కాలంలో ప్రభువులలో, ప్రజలలో భక్తి భావం బాగా పెరిగినందున అనేక దేవాలయాలు వెలిశాయి. ఇవి మత వ్యాప్తికి, సాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలయ్యాయి. దేవాలయ నిర్మాణం సప్త సంతానాలలో ఒకటైనందున రాజులు, వారి సామంతులు, ఉద్యోగులు ఆలయాలు నిర్మించి, అంగ, రంగ భోగాలకాగను, ధన, వస్తువాహనాదులను దానంగా ఇచ్చారు. ఓరుగల్లులో స్వయం భూ దేవుని ఆలయం, హనుమ కొండలో రుద్రేశ్వర, పద్మాక్షి, ప్రసన్న కేశవాలయాలు నిర్మించబడినాయి. ఈ కాలపు ఆలయాలలో పాలం పేట, పిల్లల మర్రి, గణపూర్, నగుమార్, నాగుల పాడు ఆలయాలు చాలా ప్రసిద్ధమైనవి.

## 17.6 సాహిత్యం:-

కాకతీయ యుగంలో సాహితీ రంగంలో కూడా నూతన ఉత్తేజం కనిపించింది. రాజులు, సామంతులు, తదితరులు సారస్వత కార్యకలాపాలను ప్రోత్సహించారు.

**17.6.1 సంస్కృతం:-** కాకతీయుల రాజ భాష సంస్కృతం. వారి శాసనాలలో చాలా భాగం సంస్కృతంలోనే వున్నాయి. కాకతీయ సామంతుల శాసనాలు కూడా చాలా వరకు సంస్కృతంలోనే ఉన్నాయి. హనుమకొండ, పాకాల, పాలం పేట, వర్ధమాన పురం మొదలగు చోట్ల గల శాసనాలు చిన్న చిన్న సంస్కృత ఖండ కావ్యాలు. వీటి రచయితలు సంస్కృతంలో సిద్ధ హస్తులు. కాకతీయ శాసనాలను పరిశీలిస్తే ఆనాడు సంస్కృతం విద్యా భాషగా, బోధనా భాషగా వుండేదని తెలుస్తుంది. దాన గ్రహీతల విద్యార్హతలను పరిశీలించినపుడు నాటి విద్యార్థులు వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలలో మంచి ప్రవేశం వున్న వారని తెలుస్తుంది.

కాకతీయ రాజులు, వారి సామంతులు పోషించిన కవి పండితులు, శాస్త్రకారులు రచించిన సంస్కృత గ్రంథాలు నేటికి తలమానికంగా ఉన్నాయి. కాకతి రుద్రదేవుని హనుమ కొండ శాసనాన్ని రచించిన అచినేంద్రుడు, గణపవరం శాసన లేఖకుడైన నంది పాకాల శాసన కర్త కవి చక్రవర్తి బూదపుర శాసన లేఖకుడు మమూర, కుంద వరం శాసన రచయిత బాల భారతి పేర్కొనదగిన ప్రశస్థి కవులు.

ఆనాటి సంస్కృత కవులలో మొదట పేర్కొనదగినవాడు విద్యానాథుడు. ఇతడు ప్రతాపరుద్రుని ఆస్థాన కవి. ప్రతాపరుద్ర యశో భూషణం అనే గ్రంథాన్ని రచించాడు. ఇతని అసలు పేరు అగస్త్యుడు. ఇతడు 75 గ్రంథాలు రచించాడు. కాని నేడు మనకు మూడు మాత్రమే లభిస్తున్నవి. అవి 'బాల భారతం నలకీర్తి కౌముది కృష్ణ చరితం) గంగాదేవి (విజయనగర కంపరాయల భార్య) అగస్త్యుని తన గురువుగా పేర్కొన్నది. ప్రతాపరుద్రుని ఆస్థాన కవి శాకల్య, మల్లుభట్టు, ఉదాత్త రాఘవ కావ్యం, నిరోష్ఠ్య రామాయణం అను గ్రంథాలను రచించాడు. ప్రతాపరుద్రుని ఆస్థానంలో మరో కవియైన జౌన అప్పయార్యుడు, జినేంద్ర కళ్యాణాభ్యుదయం అనే గ్రంథాన్ని రచించాడు. విద్దనాచార్యుడు ప్రమేయచర్చాయ్నుతం అనే ఒక శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. రుద్రాంబ సేనాధిపతియైన కొలని రుద్రుడు శ్లోక వార్తికం అనే వ్యాకరణానికి తన పేరుతో రాజ రుద్రీయం అనే వ్యాఖ్యానం రచించినాడు.

కాకతి గణపతి దేవుని బావ మరిది గజసాహిణి అయిన జాయపసేనాని గీత రత్నావళి, వాద్య రత్నావళి, నృత్య రత్నావళి అనే మూడు శాస్త్ర గ్రంథాలు రచించాడు. రావిపాటి త్రిపురాంతక కవి ప్రేమాభిరామమ్ అనే వీధి నాటకం వ్రాశాడు. ఈ గ్రంథం నాటి సాంఘిక జీవితాన్ని కన్నులకు కట్టినట్లు తెలుపుతుంది. ఈ గాధనే వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామం అనే పేరుతో తెలుగులో వ్రాశాడు.

**17.6.2 తెలుగు:-** కాకతీయ యుగంలో తెలుగు భాష చాలా అభివృద్ధి చెందింది. చేబ్రోలు శాసనం రచించిన భీమయపండ మార్గదేశి రీతులలో చెప్పగలిగిన దిట్ట. ఈశ్వరభట్ట చటోపాధ్యాయుడు తెలుగు గద్యను వ్రాయటంలో నేర్పరి. కాకతీయుల నాటి ఉత్తమ సాహిత్యం గల తెలుగు శాసనాలు బేతరాజు గూడూరు శాసనం, గంగాధరుని కరీంనగర్ శాసనం, కాటని ఉప్పరిపల్లె శాసనం, ఓపిలి సిద్ది కొణిదెన శాసనం, జగతాపి గంగదేవుని శాసనం, తాళ్ళ ప్రొద్దుటూరు శాసనం మొదలగునవి.

శైవ, వైష్ణవ మత ఉద్యమాలు తెలుగు భాషా వికాసానికి గొప్పగా సేవ చేశాయి. కాకతీయుల నాటి కావ్యాలలో తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణం తొలి గ్రంథం. దీనిని నెల్లూరు తెలుగు చోడరాజు మనుమసిద్ధికి అంకితం చేయబడింది. తిక్కన వ్రాసిన ఆంధ్ర మహాభారతం ఉత్తమ సాహిత్య గ్రంథం. తిక్కనకు కవి బ్రహ్మ, ఉభయ కవి మిత్ర అనే బిరుదులున్నాయి. సాధారణంగా ఆంధ్ర మహాభారతం వ్యాస భారతానికి అనువాదమనీ నమ్మిన తిక్కన స్వతంత్ర శైలిని అనుసరించి సులభమైన పదాలతో దేశీయ భాషలో రచన సాగించాడు.

ప్రజలను దృష్టిలో వుంచుకొని రచనలు చేసిన ఘనత ఈ యుగానికి చెందుతుంది. ఈనాటి కవులు మత, సాంఘిక పరిణామాలకు కారకులై ఒక పెద్ద ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ యుగ సారస్వతంలో వైదిక, శైవ, వైష్ణవ శాఖలు వుండేవి. తిక్కన వైదిక మతాభిమాని అయిన కవులలో అగ్రగణ్యుడు. అతని తరువాత అతని శిష్యులైన కేతన, మారన కవులు ముఖ్యులు. కేతన దశ కుమార చరిత్రను రచించి తిక్కనకు అంకితం చేసి అభినవదండి అనే బిరుదు పొందాడు. కేతన ఇతర రచనలు ఆంధ్ర భాషా భూషణం, విజ్ఞానేశ్వరీయం, ఆంధ్రభాషా భూషణం తెలుగులో రచింపబడిన తొలి వ్యాకరణం. తిక్కన మరో శిష్యుడైన మారన మార్కండేయ పురాణం రచించాడు. ఇది తెలుగులో తొలి పురాణ అనువాదం. మార్కండేయ పురాణం కాకతీయ సైన్యాధ్యక్షుడు మరియు ఓరుగల్లు నగర తలారి అయిన నన్నయ నాయనికి అంకితం చేయబడింది. ఈ నన్నయ నాయడే మాలిక్ మక్బూల్‌గా తరువాత ఢిల్లీలో ప్రసిద్ధి చెందాడు. తిక్కన తరువాతి వాడు అయిన మంచెన కేయూర బాహు చరిత్రను రచించి వెలనాటి చోడ మంత్రి గుండనామాత్యునికి అంకితం చేశాడు.

కాకతీయ యుగంలో రాజనీతిని చదివి ఆకళింపు చేసుకోవడంలో ప్రజలు శ్రద్ధ వహించిరి. అందుకే సంస్కృత, తెలుగు బాషలలో రాజనీతి గ్రంథాలు వెలువడినాయి. బద్దెన నీతి శాస్త్ర ముక్తావళిని, సుమతీ శతకాన్ని రచించాడు. ఈ యుగంలోనే పండితులను, పామరులను రంజింపచేసే శతకాలు ప్రారంభమయ్యాయి. అప్పన్న మంత్రి చారుచర్య అనే వైద్య గ్రంథాన్ని యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకాన్ని రచించాడు. ఇదే తెలుగులో తొలి శతకం. గణపతి దేవుని కాలంలో ప్రధాన మంత్రిగా వున్న శివ దేవయ్య పురుషార్థ సారం అనే గ్రంథాన్ని రచించాడు. మల్లికార్జున భట్టు కుమార దేవుడు, భాస్కరుడు, హుళక్కి భాస్కరుడు, అయ్యలార్యుడు అనే ఐదుగురు కవులు కలిసి భాస్కర రామాయణం వ్రాశారు. ఈ కాలంలోనే గోనబుద్దా రెడ్డి రంగనాథ రామాయణం రచించాడు. ఇది తెలుగు ద్విపద కావ్యాలలో కెల్లా గొప్పది. విరాట పర్వం మొదలుకొని 15 పర్వాలను తిక్కన రచించాడు. అరణ్యా పర్వం శేషం ఎర్రా ప్రగడ పూర్తి చేశాడు. అంతకు ముందే నన్నయ్య ఆంధ్ర మహాభారతంలో కొంత భాగం వ్రాశాడు. కవిత్రయం అనబడే ఈ ముగ్గురు కవులు వ్రాసిన ఆంధ్రమహాభారతం తెలుగు సాహిత్యంలో అత్యుత్తమ గ్రంథం. ఈ యుగంలో రచింపబడిన ఇతర సుప్రసిద్ధ గ్రంథాలు మడికి సింగన 'సకల నీతి సమ్మతం', నన్నెచోడుని కుమార సంభవం, పాల్కురికి సోమనాధుని బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, మల్లిఖార్జున పండితారాధ్యుని శివతత్త్వ సారం, పాల్కురికి సోమనాధుని వృషాధిప శతకం, రావిపాటి త్రిపురాంతక కవి అంబికా తారావళి మొదలగునవి. తెలుగు సాహిత్యంలో దేశి కవితకు సోమనాధుడు గౌరవం చేకూర్చినాడు. ఇతని రచనలు నాటి సామాజిక మత విషయాలను విపులంగా పేర్కొంటున్నాయి.

## 17.7 కళలు :-

కాకతీయ రాజులు వారి సామంతులు దుర్గ నిర్మాణాలతో పాటు తమ మతాభిమానమునకు నిదర్శనముగా సుందరమైన ఆలయాల నిర్మాణంలో కూడా శ్రద్ధ కనపరిచారు. ఈ నిర్మాణాలు ఎక్కువగా తెలంగాణాలో కనిపిస్తాయి.

17.7.1 **వాస్తు నిర్మాణాలు:-** దేశ రక్షణలో దుర్గాల ప్రాముఖ్యం పెరగడంతో కాకతీయులు అనేక దుర్గాలను నిర్మించారు. ఓరుగల్లు, గోల్కొండ, రాచకొండ, దేవరకొండ, మొదలగు చోట్ల నిర్మించబడిన దుర్గాలు వారి నిర్మాణ కౌశలానికి నిదర్శనాలు. ఓరుగల్లు కోటను నిర్మించడం గణపతి దేవుడు ప్రారంభించగా దానిని అతని కుమార్తె రుద్రాంబ పూర్తి చేసింది. ఈ కోట చుట్టూ రాతాకోట, కంచుకోట, పుట్టకోట, కంపకోట మొదలగు ఏడు కోటలు వుండేవట.

కాకతీయ ప్రభువులు వారి సామంతులు, సేనాధిపతులు, హనుమకొండ, ఓరుగల్లు, పానగల్లు, పాలం పేట, పిల్లల మర్రి, కొండపర్తి, నాగుల పాడు, కత్తిరాల, మాచర్ల, గురజాల మొదలుగుచోట్ల ఆలయాలు నిర్మించారు. కాకతీయులు వాస్తు కళలో చాళుక్య శైలిని అనుసరించి వాటికి మెరుగులు దిద్ది విజయనగర రాజులకు అందించారు. వీరు శైవ

మతస్థులు కావడంవలన ఆనాడు ఎక్కువగా శివాలయాలు నిర్మించబడ్డాయి. స్థానికంగా లభించే నల్లరాయి, ఎర్రరాయి ఆలయ నిర్మాణానికి ఉపయోగించారు. ఎత్తైన అధిష్ఠానాలు, శిల్పాలంకృత స్తంభాలు కాకతీయ వాస్తువులోని విశిష్ట లక్షణాలు. వీరి ఆలయాలు ప్రధానంగా త్రికూట నిర్మాణాలు. ఓరుగల్లు కోటలో స్వయంభూ దేవాలయం, విష్ణు ఆలయం, సూర్యాలయం ముఖ్యమైనవి. స్వయం భూ ఆలయ శిధిలాలకు నాలుగు వైపులా గంభీరమైన శిలా తోరణాలు కలవు. హనుమకొండలో క్రీ॥శ॥ 1163 లో కాకతీయ రుద్రుడు నిర్మించిన రుద్రేశ్వరాలయం (వేయి స్తంభాల గుడి) త్రికూట ఆలయానికి ఎదురుగా నిర్మించిన మండపం నేడు శిధిలావస్థలో వుంది. కాకతీయ నిర్మాణాలకు మకుటాయమైనది పాలం పేటలోని రామప్ప గుడి. దీనిని కాకతి గణపతి దేవుని సామంతుడైన రేచర్ల రుద్రుడు క్రీ॥శ॥ 1234లో నిర్మించాడు. ఈ ఆలయం నక్షత్రాకారంలో వున్న ఎత్తైన అధిష్ఠానం మీద నిర్మించబడింది. ఈ ఆలయ ప్రధాన అంగాలు గర్భగృహం, అంతరాళం, నాట్య మండపం ఆలయ 'విమానం 4 అంతస్తులలో వుంది. ఆలయానికి మూడు వైపుల ప్రవేశ ద్వారాలు ముఖ మండపాలు వున్నాయి. ఘన పురం గ్రామంలో దేవాలయ సముదాయం ఇంచుమించుగా రామప్ప దేవాలయంతో పాటే నిర్మించబడింది. ఇది రామప్ప దేవాలయాన్ని పోలి వుంటుంది. ప్రధాన ఆలయం చుట్టూ చిన్న చిన్న మందిరాలు వున్నాయి. వరంగల్ జిల్లాలో బాకారం, కటాక్షపురం, కాండవర్తి, నిడికొండ, ఇనుగుర్తి, వెనపోలు, ఖమ్మం జిల్లాలో గార్లకూసామంచి, కరీంనగర్ జిల్లాలో గొడుసాల, నగమూరు, బెజకబ్బ, మంథెని, నల్గొండ జిల్లాలో నాగుల పాడు, పిల్లల మర్రి మొదలగు చోట్ల కాకతీయుల నాటి దేవాలయాలు వున్నవి. నాగుల పాడు గ్రామంలోని త్రికూట ఆలయాన్ని రేచర్ల కాట్రెడ్డి క్రీ॥శ॥ 1234 లో నిర్మించాడు. ఈ త్రికూట ఆలయంలో మూడు గర్భాలయాలు, శివాలయాలే.

కాకతీయ దేవాలయాలన్నీ ఇసుక పునాదుల పై నిర్మించబడ్డాయి. దేవాలయ నిర్మాణానికి అనువైన స్థలంలో గట్టినేల వచ్చే వరకు గొయ్యితీసి ఆ గోతిలో ఇసుక నింపి నేల మీదకు కొద్దిగా కనపడే పునాదుల వరుసలో పెద్ద బండరాళ్ళను వరుసగా పేర్చి ఇనుప పట్టాలు బిగించి దేవాలయ నిర్మాణం చేసేవారు. వెలుపలి లోపలి రాళ్ళ వరుస మధ్య మట్టి ఇటుక ముక్కలు ఉపయోగించి ఆలయ గోడలు నిర్మించారు. ఈ విధంగా కాక చాళుక్యులు, విజయ నగర రాజులు దేవాలయ పునాదులలో మొరగు రాళ్ళ ముక్కలు వేసి నింపారు. అందువలనే చాళుక్య విజయ నగర ఆలయాలు కాకతీయ ఆలయాలలాగ శిధిలం కాలేదు. కాకతీయ దేవాలయ నిర్మాణం విధానంలో లోపమున్నదని కాకతీయ దేవాలయాల పై పరిశోధనలు చేసిన పరిశోధకుల అభిప్రాయం.

17.7.2 శిల్పం:- కాకతీయుల శిల్పాలు సర్వాలంకార శోభితంగా, వివిధ భంగిమలలో వుంటాయి. ప్రతి శిల్పంలోను చైతన్యం, సొగసు, భావ ప్రకటనలో లాలిత్యం వుంది. భక్తి భావాన్ని, నృత్య భంగిమలను, విలాస భంగిమలను సహజ సౌందర్యంతో శిల్పాల రూపంలో కాకతీయులు మలిచారు. కాకతీయ శిల్పాలు గర్భ గృహ ద్వారాల మీద, వితానంలో స్తంభాల మీద, ఆలయాల వెలుపలి గోడల మీద కలవు.

పాలంపేట రామప్ప దేవాలయ అధిష్ఠానానికి నాలుగు వైపుల 10 అడుగులు వెడల్పు కలిగిన ప్రదక్షిణా పథ మార్గం వుంది. ఈ మార్గాన నిలబడి పరిశీలిస్తే గుడిని అలంకరిస్తున్న శిల్పాలు కన్పిస్తాయి. ఈ శిల్పాలలో దేవతలు, యుద్ధ వీరులు, నాట్య కత్తెలు, గాయకులు, వాద్యగాండ్రు, గారడివారు, దంపతులు మొదలగునవి కలవు. మండప స్తంభాల పై భాగంలో 12 ప్రతిమలు వివిధ భంగిమలలో నాట్యం చేస్తున్న అద్భుత శిల్పాలు కలవు. జాయప సేనాని తన నాట్య శాస్త్రమున నిర్వహించిన నాట్య భంగిమలను ఈ శిల్పంలో చూపారని కొందరి అభిప్రాయం. ఆ శిల్పాలలోని నాట్య భంగిమలు వ్రేళ్ళ విన్యాసము కళాభిమానుల దృష్టి ఆకర్షింపక మానవు. యౌవనోద్వేగములో ఆశా ప్రకారం కదులుచున్న నాట్యకత్తె మనోభావాలను శిల్పి ఈ శిల్పాలలో చూపాడు. దేహపు వంపులలో ప్రతి భంగిమలోను అందమే గాక సాధారణంగా కనపడని సంతోషాతిశయం కూడా ప్రస్ఫుటమయ్యేటట్లు శిల్పి చెక్కినాడు. రామప్ప గుడిలోని నాగిని శిల్పం శిల్ప కళా వేత్తల ప్రశంసల నందుకుంది. కట్లలు త్రెంచుకున్న' యౌవనోద్వేగమును నాగిని శిల్పంలో చిత్రించాడు. తన [illegible]

చూచుకొని మురిసిపోతూ సంతోషాతిశయంలో ఒళ్ళు విరుచుకునే భంగిమలోని నిటారుగా వున్న కాళ్ళు, ఎత్తిన చేతులు, కడుపు, నడుము ఉద్వేగ స్వరూపాన్ని స్పష్టీకరించింది. ఈమె చేతిలో ఒక పాము, మెడ చుట్టూ మరొక పాము, మరొక పాము పాకుతున్నట్లు చూపబడింది. పేడం పేట గుడిలోని యక్షిణి శిల్పం కూడా అందంగా మలచబడింది. పానగల్లు, పంచీశ్వరాలయంలోని శివుని, గణేశుని శిల్పాలు ఆకర్షణీయాలు. వేయి స్తంభాల గుడి మండప పని తనంలో నవ విగ్రహాలు చెక్కబడ్డాయి. ఈ ఆలయ ద్వార బంధాల పై, స్తంభాల పై పూల తీగలు, వివిధ పుష్పాలు ఎంతో రమణీయంగా మలచబడ్డాయి. ఈ ఆలయ స్తంభాలు చెక్కడాలలో, వితానంలో ద్వార బంధాల పైన ప్రదర్శితమైన శిల్పకళ నాటి శిల్పుల ప్రావీణ్యానికి గీటురాయి. ఈ ఆలయ ముందు భాగంలో నల్లరాతితో చెక్కబడిన నంది విగ్రహం, జీవకళ ఉట్టిపడుతున్నట్లుంది. రామప్ప గుడి దేవాలయ గోడల పై వరుసగా ఏనుగులు, సింహాలు, పద్మాలు, మిధునాలు, అప్సరసలు అద్భుతంగా మలచబడ్డాయి. రామప్పగుడి రంగమండప స్తంభాల మీద పార్వతీ కళ్యాణం, దశావతారాలు గోపికా వస్త్రాపహరణం, కృష్ణావతారం మొదలగు ఘట్టాలు నైపుణ్యంగా చెక్కబడ్డాయి.

**17.7.3 చిత్రలేఖనం:-** కాకతీయుల నాటి వర్ణ చిత్రాలు లభ్యం కాలేదు. కానీ వర్ణ చిత్రాల గురించి ప్రస్తావన ఆనాటి సారస్వతంలో కనిపిస్తాయి. ఆనాడు ఓరుగల్లులో సుమారు 1500 చిత్రకారుల గృహాలున్నట్లు ప్రతాప చరిత్ర చెపుతుంది. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె మాచలదేవి చిత్రశాలను నిర్మించి, అనేక చిత్రాలను ప్రదర్శించినట్లుగా క్రీడాభిరామం తెలియచేస్తుంది. రామకృష్ణ చిత్ర పటాలను గృహాలలో అలంకరించుకొన్నట్లు వీర చరిత్ర చెపుతుంది. నాటి వినోదాలలో తోలుబొమ్మలాట పేర్కొనదగినది. వీటి నిర్మాణంలో చిత్రలేఖన ప్రావీణ్యత ఎంతో అవసరంగా వుండేది.

**17.7.4 నాట్య సంగీతాలు:-** కాకతీయుల కాలంలో సాహిత్యంతో పాటు లలిత కళలు కూడా అభివృద్ధి చెందినవి. కాకతీయుల నాట్య సంగీతాలను పోషించారు. సాధారణంగా కళావంతులు ఈ విద్యలను అభ్యసించి వివాహాది, శుభకార్యాలలో, దేవాలయ ఉత్సవాలలో తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించి సమాజంలో గౌరవ స్థానం కలిగి ఉండేవారు. ఆనాటి శిల్పాలలో పలురకాల నాట్య భంగిమలు, అనేక వాద్యాలు కన్పిస్తాయి. నాటి శాసనాలలో వాద్యగాండ్రు, నట్టువగాండ్రు, నాట్యకత్తెల ప్రసక్తి కనిపిస్తుంది. మాల్కాపురం శాసనంలో పది మంది ఆటకత్తెలు, పదహారు మంది పాట కత్తెలు, ఎనిమిది మంది మార్దంగికులు, ఆరుగురు కరడా, శంఖం మొదలైన వాద్యాలు వాయించేవారు. ఇద్దరు ముఖరి వాయించేవారు. విశ్వేశ్వర ఆలయంలో వున్నట్లు ప్రస్తావించబడింది. దశకుమార చరిత్ర, నిర్వచనోత్తర రామాయణం, గోనబుద్ధా రెడ్డి రంగనాధ రామాయణం, జాయపసేనాని నృత్య రత్నావళి మొదలగు గ్రంథాలు నాట్యగీతా వినోదాలను, తంత్రి వాద్య విశేషాలను వివరిస్తున్నవి. జాయప నృత్యంలో మెలకువలను, శైవ ధర్మ సూత్రాలను సమన్వయం చేస్తూ నృత్య రత్నావళి వివరించెనని కొందరి పండితుల భావం.

డా॥ వి.కె. మోహన్

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
| --- | --- | --- |
| M.A. History | Ist Year | Paper - II : History of Andhras upto 1336 A.D. |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)